విష్ణు పురాణము

ఏల్చూరి మురళీధరరావు

విజ్ఞప్తి

విశ్వమానవకల్యాణాన్ని ప్రతిపాదిస్తున్న మన భారతీయసంస్కృతికి మూలకందాలైన వేద పురాణేతిహాసాలలో అతిముఖ్యమైన కృతులను, ప్రకరణగ్రంథాలను, శ్రీ రామకృష్ణ వివేకానంద బోధనలను సాధకుల కోసం మేము సుబోధమైన శైలిలో సాధికారంగా ప్రకటిస్తున్న విషయం పాఠకులకు సువిదితమే. ఆ పరంపరలో ఒక భాగంగా ఇప్పుడు, వేదవ్యాసమహర్షి సంస్కృతంలో రచించిన విష్ణుపురాణానికి తెలుగు అనువాదాన్ని వెలువరిస్తున్నాము. గ్రంథకర్త దీనిని సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో ఇప్పటివరకు ప్రచురితమైన ప్రామాణిక వ్యాఖ్యలను పరిశీలించి సరళమైన వచనంలో వ్రాశారు. ఈ ప్రణాళికానుసారం త్వరలో శ్రీమద్భాగవతాన్ని కూడా మూడు సంపుటాలలో ప్రకటిస్తున్నాము.

శ్రీ రామకృష్ణమఠ ప్రచురణలను ఎంతో ఆసక్తితో ఆదరిస్తున్న పాఠకలోకం దీనిని కూడా అనుశీలింపగలదని ఆకాంక్షిస్తున్నాము.

ప్రకాశకులు.

అవతరణిక

భారతీయ ధర్మక్షేత్రంలో శ్రీవిష్ణుపురాణం ఒక ప్రాంశుస్వర్ణశైలశిఖరం. సంస్కృతంలో వేదవ్యాసమహర్షి రచించిన ఆ మహాగ్రంథాన్ని నాచేత సర్వసుబోధ్యంగా తెలుఁగులోనికి అనువదింపజేసి అందంగా ముద్రించాలనే సంకల్పం క్రాంతిప్రెస్ శ్రీధర్‌గారికి కలిగింది. వెంటనే విపణిస్థాలైన కొన్ని పూర్వానువాదాలను సంపాదించి, కార్యారంభానికి నన్ను ప్రోత్సహించారు. నేనా అల్పజ్ఞుడను; గ్రంథమా సర్వశాస్త్రార్థసంగ్రహమని పేరుగాంచిన విజ్ఞానకోశం. జ్యోతిర్మయమైన శబ్దశ్వేతారణ్యంలో 'మానుషీ హృన్మథితాకూతి నరపి పాడిన' వాచాతీర్థంకరుడు గ్రంథకర్త. నాకు సంస్కృతాంధ్రాలలో అభినివేశం లేకపోయినా, సాహసించి, అభ్యాదానయత్నంగా పాఠకులకు సమర్పించాలని నిశ్చయించుకొన్నాను. వ్యాహృతిధ్యానం చేసి గురుదేవులకు అంజలించాను.

శ్రీవనితావిభూషణుడు సేవకసేవధి లోకదృశ్య మి
థ్యావహ సౌఖ్యభోగబహుధాకృత కల్పక పౌష్పవార్లిలి
ఖావిమతాళి కాత్మపదసారసకోశనివేశ మిచ్చు వి
శ్వావసుఁ డోముగావుత శుభార్థసమున్నతి లోకసంహతిన్.

శ్రుతిసీమంతనిరూఢయోగకళలుఁ జూడాకృతగ్లౌకళా
న్వితు లాత్మీయతపఃకృతార్థులు దయావిద్యోత భక్తౌఘ వాం
ఛితసంధాత లభంగమంగళకరుల్ చిత్తాసకృద్భావు లం
చితు లానందమయుల్ శివాకృతుల నర్చింతున్ ఫలావాప్తికై.

త్య క్షాత్మ భృ ద్వి ట్సో త్రా
త్మ్య క్షాత్మ భృ ద్వి జ్ఞ హ్మృ త్క! ద్యౌ త్రా స్థా న్యై
ద్య క్షాత్మ శ్రీ స్ఫూ ర్జ న్నై
త్రో క్షేత్మ న్ద్రా భ్య ర్చ్య కృ త్య! ద్యు మ్న స్తు త్యా!

అని శ్రీకారం చుట్టాను. గ్రంథరచన నిరంతరాయితంగా కొనసాగింది.

విష్ణుపురాణానికి ఆంధ్రదేశంలో అవిరళ ప్రచారం ఉన్నది. ఇందులో అతిగహనమైన భగవత్తత్త్వం వైష్ణవశక్తికార్య నిర్వపణముఖంగా అతి గంభీరమైన కథాసంవిధానంతో కరతలామలకంగా విశదీకరింపబడింది. ఆనాటి శాథికవతంసుల కుశలపరిశోధనల సారనవనీతం ఈ గ్రంథంలో ఆతిరుచ్యంగా అవతరించింది. తమకాలంనాటి మహాపురుషుల జీవితాలను మానవాళికి ఆదర్శంగా నిలిపి ఆధ్యాత్మిక శాంతి సాధనను బోధించే తహతహపాటు ఇందులోని ప్రత్యక్షరంలోనూ కనిపిస్తుంది. ఏ కథ చెప్పినా, ఏ పూర్వసన్ని వేశాన్ని నెమరువేసుకొన్నా, ఏ వ్యక్తిని స్మరించినా, అంతటా హారంలోని దారంలా ప్రకాశించే విష్ణుభక్తితాదాత్మ్యం ఉన్నది. అందుచేతనే దీనిని తెలుగులో పెక్కుమంది కవులు, పండితులు వివిధరూపాలలో అనువదించారు. నేను ప్రధానంగా వెన్నెలకంటి సూరకవి పద్యానువాదాన్ని, విల్సన్ పండితుని ఆంగ్లానువాదాన్ని, శ్రీధరవ్యాఖ్యను అనుసంధిస్తూ స్వచ్ఛందంగా తెలుగు చేశాను.

సహవ్రతులు శ్రీ సాతవల్లి చంద్రశేఖర్, శ్రీ సువ సుబ్రమణియన్ ఉల్లాసదోహదాన్ని కల్పించారు. ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ బాపు రమ్యమైన ముఖచిత్రాన్ని అందించారు. బి.యన్.కె. ప్రెస్ అధినేత శ్రీ బి. వేణుగోపాల రెడ్డిగారు ఉదారంగా ముఖపత్రాన్ని ముద్రించి ఇచ్చారు. ఈ యత్నంలో శ్రీ కొమాండూరి గోపాల్, కె.జి. కృష్ణమూర్తి గారలు తోడ్పడ్డారు. ఈ విధమైన వ్యాసంగానికి అనుకూలమైన ఆదర్శవాతావరణాన్ని ఉపకల్పించిన శ్రీ వేంకటేశ్వర కళాశాల కులపతి డా॥ వెలగలేటి కృష్ణమూర్తి గారికి అభివందనలు. వీరందరికీ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాన్ని అందంగా, దోషరహితంగా ముద్రించిన క్రాంతి ప్రెస్ వారికి నా ధన్యవాదాలు.

మద్రాసులోని శ్రీ రామకృష్ణమఠం భారతీయ ధర్మానుమోదకంగా వేదాంత ప్రచారానికి నవనదీక్షకవచాన్ని ధరించి, బహుముఖంగా కృషి

చేస్తున్నది. దేశంలో కరువు కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలు ఎక్కడ సంభ వించినా శ్రీ రామకృష్ణమఠం ముందడుగువేసి మానవ సమాజ క్షేమధామంగా విలసిల్లుతున్నది. ఆ సంస్థ అధ్యక్షులు శ్రీ తపస్యానందస్వామి మహా విద్వాంసులు; బహు గ్రంథకర్త; వాగ్మిశేఖరులు; సాధువతంసులు. ఏతత్సన్నిధానవర్తులు శ్రీ జ్ఞానదానందస్వామి వరేణ్యులు ఈ గ్రంథరచనకు నన్ను అపరిమేయంగా ప్రోత్సహించారు. అమ్లానమైన వారి ఆశీర్వాక్యమే ఈనాడు మీ కరకమలాలను అలంకరించిన శ్రీ విష్ణుపురాణంగా పర్యవసిం చింది. శ్రీ రామకృష్ణమఠం ఆదర్శ కార్యనిర్వాహకులు శ్రీ రాఘవేశానంద స్వామీజీ గ్రంథప్రకాశానికి అనుమోదించారు. వారందరికీ నా ధన్యవాదాలు.

ఈ విధంగా ఇది చిరకాల తపస్యానందఫలం. పాఠకులకు జ్ఞానదా నందంగా పరిణమిస్తే ఈ రచన ధన్యధన్యమని భావిస్తాను.

ఏల్చూరి మురళీధరరావు
ఆంధ్రోపన్యాసకుడు,
శ్రీవేంకటేశ్వర కళాశాల,
న్యూఢిల్లీ—110 021.

విషయసూచిక

ప్రథమ భాగం

మైత్రేయుని ప్రశ్నలు 2
పరాశరుని పూర్వవృత్తాంతం 3
వాసుదేవ స్వరూపం 6
సృష్టిక్రమం 7
నారాయణశబ్ద నిర్వచనం 10
కాలవిభాగ వర్ణనం 11
వరాహావతారం 13
దేవాసుర మనుష్య సృష్టికథనం 14
మహర్షుల జన్మోదంతం 16
రుద్రుని సంభవం 17
లక్ష్మీదేవి జన్మవృత్తాంతం 18
ఇంద్రునికి దుర్వాసుని శాపం 20
నారాయణ శరణాగతి 22
క్షీరసాగర మథనం 24
భృగువంశం 27
ధ్రువుని చరిత్ర 29
తపస్సుకు విఘ్నాలు 31
ధ్రువుని పూర్వవృత్తాంతం 33
ధ్రువవంశం 35
వేనుని చరిత్ర 36
పృథుచక్రవర్తి కథ 41
ప్రచేతసుల తపోదీక్ష 47
మారిష జన్మవృత్తాంతం 51
మారిష పూర్వజన్మవృత్తాంతం 56
దక్షుని వంశాభివృద్ధి 58

దక్షుని వంశం: పాఠభేదాలు	....	....	64
ప్రహ్లాద చరిత్ర	....	....	73
పుండరీకాక్షుని సాక్షాత్కారం	....	....	80
అధిపతుల నియమనం	....	....	89

ద్వితీయ భాగం

ప్రియవ్రతుని వంశానుచరితం	....	....	92
సృష్టిస్వరూప నిరూపణం	....	....	96
జంబూద్వీపం	....	....	96
భారతవర్ష స్వరూపం	....	....	100
పుణ్యనదీనదాలు	....	....	102
ప్రజావిలాసం	....	....	103
ప్లక్షద్వీపం	....	....	105
శాల్మలద్వీపం	....	....	107
కుశద్వీపం	....	....	108
క్రౌంచద్వీపం	....	....	108
శాకద్వీపం	....	....	109
పుష్కరద్వీపం	....	....	110
లోకాలోక పర్వతం	....	....	112
బ్రహ్మాండకటాహం	....	....	113
అధోలోక వర్ణనం	....	....	113
నరకలోక వర్ణనం	....	....	117
విష్ణుధ్యాన ఫలం	....	....	121
ఊర్ధ్వలోకాల స్వరూపకథనం	....	....	123
సూర్యుని స్యందనం	....	....	125
సూర్యుని రథం: ఒక వివరణ	....	....	128
దివారాత్రాల పర్యాప్తి	....	...	132
సప్తాశ్వ రథయానం	....	....	135
విష్ణుపదం	....	....	138
ఆకాశగంగ	....	....	140

శింశుమార చక్రం	....	....	141
సూర్యరథ పరివారం	....	....	144
మైత్రేయుని సందేహం	....	....	147
చంద్రుని స్యందనం	....	....	150
గ్రహమూర్తుల రథాలు	....	....	151
జడభరతోపాఖ్యానం	....	....	154
సౌవీరునికి పరమార్థోపదేశం	....	....	166
ఋభు నిదాఘ చరిత్రం	....	....	175

తృతీయ భాగం

మన్వంతరాల కథనం	....	....	185
స్వాయంభువ మన్వంతరం	....	....	186
స్వారోచిష మన్వంతరం	....	...	186
ఔత్తమీ మన్వంతరం	....	....	187
తామస మన్వంతరం	....	....	187
రైవత మన్వంతరం	....	....	188
చాక్షుష మన్వంతరం	....	...	189
వైవస్వత మన్వంతరం	....	....	190
నారాయణుని తేజోంశలు	....	....	190
సావర్ణిమనువు జన్మవృత్తాంతం	....	....	192
సావర్ణి మన్వంతరం	....	....	194
దక్షసావర్ణి మన్వంతరం	....	....	195
బ్రహ్మసావర్ణి మన్వంతరం	....	....	195
ధర్మసావర్ణి మన్వంతరం	....	....	196
రుద్రసావర్ణి మన్వంతరం	....	....	196
రౌచ్యసావర్ణి మన్వంతరం	....	....	197
భౌత్యసావర్ణి మన్వంతరం	....	....	197
యుగవ్యవస్థ	....	....	197
వేదవ్యాస నిరూపణం	....	....	199
వ్యాసుని వేదవిభాగక్రమం	....	....	201

పురాణాల అనుక్రమణిక 207

అష్టాదశ విద్యలు 208

యాతనా నివృత్త్యుపాయం 209

యమగీత: వైష్ణవ లక్షణాలు 210

విష్ణ్వారాధన విధానం 214

వర్ణధర్మాల నిరూపణం 215

ఆపద్ధర్మాలు 219

ఆశ్రమధర్మాలు 220

ఆశ్రమస్థులకు నియతవిధులు 226

కన్యకా లక్షణాలు 228

గృహస్థ ధర్మాలు 230

కర్మానుష్ఠాన విధులు 248

ప్రేతకర్మ క్రియావిధులు 250

ఉత్తరక్రియా నిరూపణం 255

పితృదేవతార్చనం 256

పితృగీతలు 257

నిమంత్రణ బ్రాహ్మణస్వరూపం 258

శ్రాద్ధోపయుక్త వస్తువులు 263

నగ్న లక్షణాలు 266

శ్రీ మహావిష్ణుస్తవం 266

శతధన్వుని వృత్తాంతం 273

చతుర్థ భాగం

సూర్య - చంద్రవంశాల చరిత్ర 278

రేవతీబలరాముల వివాహం 285

శ్రీ బలరామావతారం 287

రైవతకకుద్మి వంశాభివృద్ధి 289

పురంజయుని తేజోవిలాసం 290

పురంజయుని వృత్తాంతం 291

సౌభరి చరిత్రం 296

పురుకుత్సుని చరిత్ర	....	....	305
సతీసహగమనం ధర్మవిరుద్ధం	....	....	308
సగరుని చరిత్ర	....	....	308
సగరపుత్రుల వృత్తాంతం	....	....	310
కపిలాశ్రమం	....	....	312
గంగామాహాత్మ్యం	....	....	313
సౌదాసుని చరిత్ర	....	....	314
శ్రీరామ చరిత్రం	....	....	320
నిమిచక్రవర్తికి దేవతల వరదానం	....	....	323
జనకరాజ వంశం	....	....	326
చంద్ర వంశం	....	....	328
తారా శశాంకుల కథ	....	....	329
పురూరవుని వృత్తాంతం	....	....	335
పురూరవుని వంశానుక్రమం	....	....	341
మహాభారతంలో పరశురాముని గాథ	....	....	345
శాంతిపర్వ కథానకం	....	....	350
భాగవత గాథ	....	....	353
విశ్వామిత్రుని సంతానం	....	....	356
చాతుర్వర్ణ్యం	....	....	356
ధన్వంతరి జననం	....	....	357
రజికి ఇంద్రపద ప్రాప్తి	....	....	359
క్షత్రవృద్ధుని వంశం	....	....	362
యయాతి చరిత్ర	....	....	362
ఆశా స్వరూపం	....	....	364
వైరాగ్య పథం	....	....	365
యదువంశ చరిత్రం	....	....	365
కార్తవీర్యుని కథ	....	....	367
జ్యామఘుని చరిత్ర	....	....	368
సత్వతుని వంశం	....	....	372
సత్రాజిత్తుకు సూర్యవరప్రసాదం	....	....	373

స్యమంతక మణి	....	....	375
శ్రీకృష్ణునికి అపనిందాప్రాప్తి	....	....	376
జాంబవతీ పరిణయం	....	....	378
అక్రూరుని కథ	....	....	379
శతధన్వ సంహారం	....	....	382
బలదేవుని ఆగ్రహం	....	....	383
ద్వారకలో ఈతిబాధలు	....	....	384
యదువీరుల సమావేశం	....	....	385
శ్వఫల్గుని చరిత్ర	....	....	385
అక్రూర ప్రవేశం	....	....	387
అనమిత్రాదుల వంశానుక్రమం	....	....	391
వసుదేవాన్వయం	....	....	393
శిశుపాలుని పుట్టుక	....	....	394
శిశుపాలునికి కైవల్యప్రాప్తి	....	....	395
బలభద్రోదయం	....	....	398
శ్రీకృష్ణుని జననం	....	....	399
తుర్వసు వంశం	....	....	400
ద్రుహ్యు వంశం	....	....	401
అనువు వంశం	....	....	401
అంగరాజ వంశం	....	....	402
పురు వంశం	....	....	403
మగధరాజ వంశం	....	....	406
కురు వంశం	....	....	408
భవిష్యరాజవంశాలు	....	....	412
ఇక్ష్వాకు వంశం	....	....	413
మాగధాన్వయం	....	....	413
ప్రద్యోతరాజ వంశం	....	..	414
శిశునాగ వంశం	....	....	414
నందరాజ వంశం	....	....	415
మౌర్య వంశం	....	....	415

శుంగ వంశం	....	....	415
కాణ్వ వంశం	....	....	416
ఆంధ్ర వంశం	....	....	416
అన్యరాజవంశాలు	....	....	417
కల్క్యవతారం	....	....	420
కలియుగం	....	....	421
పృథ్వీగీతలు	....	....	423

పంచమ భాగం

వసుదేవుని ప్రార్థన	....	....	426
భూదేవి వేదనావివేదనం	....	....	427
బ్రహ్మకృత శ్రీమహావిష్ణుస్తవం	....	....	429
శ్రీమహావిష్ణువు అభయదానం	....	....	432
యోగనిద్ర	....	....	433
శ్రీకృష్ణావతారం	....	....	434
దేవకీ స్తవం	....	....	435
పూతనాసంహారం	....	....	442
శ్రీ నారాయణ కవచస్తోత్రం	....	...	443
శకటాసుర వధ	....	....	445
నందశిశువులకు నామకరణం	....	....	446
యమళార్జున భంజనం	....	....	448
బృందావనం	....	....	449
బాల్యలీలలు	....	....	451
వర్ష ఋతువు	....	....	452
కాళియ సర్పమర్దనం	....	....	453
శ్రీహరి స్తోత్రం	....	....	459
ధేనుకాసుర సంహారం	....	....	460
ప్రలంబాసుర వధ	....	....	461
ఇంద్రోత్సవం	....	....	464
ఇంద్రోత్సవ భంగం	....	....	467

ఇంద్రుని ఆగ్రహం	....	....	469
ఇంద్రాగమనం	....	....	471
గోపకుల సందేహం	....	....	473
రాసలీలలు	....	....	474
అరిష్టాసుర వధ	....	....	478
కంసుని ఆగ్రహం	....	....	479
కేశినిషూదనం	....	....	481
అక్రూరాగమనం	....	....	483
శ్రీ వాసుదేవ పరబ్రహ్మ స్తోత్రం	....	....	490
రజకుని వధ	....	....	493
మాలకరికి వరదానం	....	....	493
కుబ్జకు సౌందర్యదానం	....	....	494
ధనుర్యాగభంగం	....	....	495
చాణూర ముష్టిక సంహారం	....	....	499
కంస వధ	....	....	501
విద్యాభ్యాసం	....	....	504
జరాసంధుని పరాజయం	....	....	505
కాలయవన సంహారం	....	....	507
ముచుకుందునికి మోక్షప్రాప్తి	....	....	509
శ్రీ మహావిష్ణు పాంచభౌతిక స్తోత్రం	....	....	510
ద్వారకలో శాంతిస్థాపన	....	....	512
యమునాకర్షణం	....	....	513
రుక్మిణీ కల్యాణం	....	....	514
శంబరాసుర వధ	....	....	515
శ్రీకృష్ణుని భార్యలు	....	....	518
అనిరుద్ధుని వివాహం	....	....	518
ద్యూత కలహాలు	....	....	519
రుక్మి సంహారం	....	....	519
దేవేంద్రుని ప్రార్థన	....	....	520
నరకాసుర సంహారం	....	....	522

అదితి దర్శనం	....	....	523
అదితి సూక్తం	....	....	524
పారిజాతాపహరణం	....	....	526
శ్రీకృష్ణుని సంతానం	....	....	531
ఉషాపరిణయం	....	....	532
బాణునికి యుద్ధకాంక్ష	....	....	533
వారాణసీ దహనం	....	....	537
కౌరవ గర్వభంగం	....	....	541
హస్తినకు ప్రయాణం	....	....	541
ద్వివిద సంహారం	....	....	544
ద్వాపర యుగాంతం	....	....	546
దేవతల వేడికోలు	....	....	548
యదువంశ వినాశం	....	....	549
బలదేవ నిర్యాణం	....	....	551
ద్వారకకు సందేశం	....	....	551
శ్రీకృష్ణ నిర్యాణం	....	....	552
కలి ప్రవేశం	....	....	554
అర్జున పరాజయం	....	....	556
అష్టావక్ర చరిత్రం	....	....	562

షష్ఠ భాగం

కాలస్వరూపం	....	....	565
కలి స్వరూపం	....	....	566
కలియుగ మాహాత్మ్యం	....	....	572
జగత్సృష్టి ప్రళయం	....	....	576
నైమిత్తిక ప్రళయం	....	....	582
ప్రాకృతిక ప్రళయం	....	....	587
ఆత్యంతిక ప్రళయం	....	....	590
దేహధారికి కలిగే కష్టాలు	....	....	591
మృతజీవికి నరకయాతనలు	....	....	595

వామదేవ శబ్దార్థం	....	....	599
కేశిధ్వజ ఖాండిక్యజనక సంవాదం	....	....	601
యోగవిద్యోపదేశం	....	....	607
యోగ శబ్దార్థ నిరూపణం	....	....	610
భావనాత్రయ వివరణం	....	....	612
స్వస్తివాచనం	....	....	618
పుణ్యఫలశ్రుతి	....	....	620

విష్ణుపురాణము

ప్రథమభాగం

శ్రీ మహావిష్ణువు వరప్రసాదంచేత వెలసి విలసిల్లుతున్న పవిత్రసీమ నైమిశారణ్యం. పూర్వం చతుర్ముఖబ్రహ్మ ముఖపద్మం నుంచి వెలువడిన మంత్రసంహితలను మధుకైటభులు అపహరించిన నాటి నుండి చెల్లాచెదరై అగతికంగా మిగిలిన నాలుగు వేదాలను మళ్లీ విషయానుగుణంగా విభాగించి, వేదవ్యాసుడని కీర్తిపొందిన సాత్యవతేయ కృష్ణద్వైపాయనుని కన్నతండ్రి పరాశరమహర్షి ఉపదేశించిన శ్రీ విష్ణుపురాణానికి కథాసంస్థాన పుణ్యక్షేత్రం.

ఉత్తర భారతదేశంలో గౌరముఖుని ఆశ్రమానికి సమీపంలో వెలసిన ఆ నైమిశ తపోభూమిలో పరాశరమౌని మైత్రేయునికి వేదశాస్త్రా లన్నింటినీ సాంగోపాంగంగా బోధించి సదసద్వివేకాన్ని ప్రసాదించాడు. ఆయన కరుణాతిరేకం వల్ల మైత్రేయుడు జ్ఞానసంపన్నుడై ఉత్తమశ్లోకు డయ్యాడు.

అధ్యయనాంతవేళ చేరువౌతుండగా మైత్రేయుడు తన చదువులలోని సారాన్ని నెమరువేసుకొని తన కింకా మిగిలి ఉన్న సందేహాలన్నింటినీ జ్ఞాపకం చేసికొన్నాడు. ఒకనాటి ప్రభాతవేళ కాల్యకరణీయాలు నిర్వర్తించి, సుఖాసీనుడై ఉన్న ఆచార్యునికి నమస్కరించి, ఆయన మనస్సును ప్రసన్నం చేసికొని ఈ విధంగా వేడుకొన్నాడు:

మైత్రేయుని ప్రశ్నలు

"మీరు దయతో అనుగ్రహించిన విద్యలను క్రమం తప్పకుండా శ్రద్ధతో అధ్యయనం చేసి సారాన్ని గ్రహించాను. ఈ అనంత జ్ఞానవిషయమైన పరమాత్మ సాకారుడై అనేక నామ రూపాలలో గోచరీభూతు డవుతున్నాడు. వీరిలో ఏ వేల్పు మూలమై సర్వలోకాలూ ప్రవర్తిల్లుతున్నాయి? ఏ వేల్పు దేవేంద్రాదులకు కూడా నాయకస్థానీయుడై వెలుగొందుతున్నాడు? ఏ వేల్పును ఇలవేల్పుగా ఉపాసించి భక్తులు అభీష్టసిద్ధిని పొందగలుగుతున్నారు? ఎవరి మాహాత్మ్యాన్ని వీనులవిందుగా ఆకర్ణించితే ఇహపర సుఖానుభవం అవలీలగా కలుగుతుంది? సచరాచర భూతప్రపంచం సృష్టిస్థితిలయాలకు కారణం ఎవ్వరు? అనేక గ్రంథాలలో అనేక విధాలుగా కనిపిస్తున్న ఈ సందేహాలకు సమాధానాన్ని ఏ విధంగా సమన్వయించుకోవాలి?

అంతే కాదు. పృథివ్యాది పంచభూతాలకు ప్రమాణం ఏమిటి? సప్తసాగరాలు, కులపర్వతాలు ఎంతెంత విస్తృతిని కలిగి ఉన్నాయి? గ్రహతారకల సంచార క్రమమూ, దేవతల పుట్టుక, మన్వంతరాలు, యుగాలు, కల్పాలు మొదలుగాగల కాలవిభాగం – ఏ ప్రకారంగా సంభవించాయి? ఆ యా యుగధర్మాలు ఏమిటి? ఆ యుగాలకు ప్రతినిధులుగా విలసిల్లిన మహర్షులూ, ప్రభువులూ ఎవరు? వేదశాఖలలో ఏయే విభాగం ఎంత ప్రమాణం కలిగి ఉన్నది? వర్ణాశ్రమ ధర్మాలు, బ్రహ్మచర్యాది ఆశ్రమధర్మాలూ ఏమిటి?

నా మనస్సులో ఉత్పాదిల్లిన ఈ సంశయాలను దయతో నివృత్తి చేయగలరని మరీ మరీ ప్రార్థిస్తున్నాను."

మైత్రేయుని ఈ ప్రశ్నలను పరాశర మహర్షి సావధానంగా విన్నాడు. ఇన్నాళ్ల శైష్యోపాధ్యాయిక తర్వాత తన శిష్యుని మన

స్సులో తలయెత్తిన సందేహం గురుశిక్షణలేని సామాన్యులకు తప్పక కలుగుతుందని ఆయనకు తెలుసు. అంతేకాక మైత్రేయుడు గ్రంథ గత సాక్ష్యాల కోసం తన చెంతకు రాలేదని, తన స్వానుభవంలో గోచరించిన ధర్మసూక్ష్మాలను విశదీకరించమని కోరుతున్నాడనీ ఆయన గ్రహించాడు. ప్రసన్నచిత్తంతో తన మనస్సును వక్తవ్యాంశానికి అభిముఖంగా స్వాయత్తీకరించుకొని, లోకాలోకాలకూ అధిదైవతమైన పరంధాముడు శ్రీమహావిష్ణువు పాదపద్మాలను భక్తితో స్మరించి ఆయన అన్నాడు:

పరాశరుని పూర్వవృత్తాంతం

''మైత్రేయా! నీవు కోరిన ప్రశ్నలకు పూర్వాపర విరోధం లేకుండా సమాధానం చెబుతాను, విను. నేను శిశువునై ఉండగా ఒకప్పుడు ముల్లోకాలకూ ఆరాధ్యుడైన పులస్త్యబ్రహ్మ సాక్షాత్కరించి, సంతోషంతో పలుకరించి, 'బ్రహ్మవిద్యను కథారూపంలో నిరూపించే పద్దెనిమిది పురాణాలకు కర్తవు కాగలవు'—అని ఆశీర్వదించాడు. ఆనాటినుంచి నాకు అపూర్వమైన కథాకథన కౌశలం, సర్గము ప్రతిసర్గము వంశము మన్వంతరము వంశానుచరితము అనే అయిదు లక్షణాలతో కూడిన పురాణాన్ని ఆశువుగా ప్రసంగ ధోరణిలో చెప్పగలిగే నేర్పూ అలవడ్డాయి. నీ వడిగిన సంశయాలకు నివృత్తిగా నేను చెప్పబోతున్న ఇతివృత్తాన్ని సాకల్యంగా విను.''

అని అంటున్న ఆచార్యుని మాటలకు అడ్డువస్తూ మైత్రేయుడు ''మునీంద్రా! బ్రహ్మసుతుడైన పులస్త్యుడు ఎందువలన మీకు వరాన్ని ప్రసాదించాడు? ముమ్మొదటగా ఆ ఉదంతాన్ని నాకు తెలియజెప్పండి'' అని కుతూహలంతో అర్థించాడు.

''నాయనా! త్రిలోకాలకూ గురువైన వసిష్ఠమహర్షి మా తాతగారు. అరుంధతి ఆయన ధర్మపత్ని. ఆ పుణ్యదంపతులకు కాల

క్రమేణ నూరుగురు పుత్రులు జన్మించారు. మా తండ్రి శక్తి వారిలో అగ్రజుడు. నేను ఆయనకు అదృశ్యంతి యందు జన్మించాను. ఆ రోజులలో విశ్వామిత్రమహర్షి బ్రహ్మర్షి పదవిని ఆశించి మా తాతగారితో వైరాన్ని పూని అవకాశం లభించినప్పుడల్లా ఆయనకు అపకారం చేయాలని ప్రయత్నిస్తూ ఉండేవాడు.

ఒకప్పుడు ఇక్ష్వాకువంశీయుడైన కల్మాషపాదుడు వేటకు వెళ్తూ వసిష్ఠమహర్షి ఆశ్రమసమీపానికి వచ్చాడు. మార్గమధ్యంలో నడిచి వెళుతున్న మా తండ్రిగారు తన రథానికి దారి తొలగలేదని ఆగ్రహించి రాజు అధికార దర్పంతో ఆయనను అదలించాడు. 'ప్రాభవగర్వంతో నిర్దోషినైన నన్ను విగర్హించి ధర్మవ్యతిక్రమం చేశావు. రాక్షసుడివై నరమాంసభక్షకుడివౌతావు' అని నా జనకుడు కల్మాషపాదుని శపించాడు. ఆ అదను కనిపెట్టి శాపోపహతుడైన రాజుద్వారా రాక్షసశక్తిని ప్రయోగించి విశ్వామిత్రుడు వసిష్ఠసుతులందరినీ చంపించివేశాడు.

అప్పటికి నేను మా తల్లి గర్భంలో ఉన్నాను. ఆమె కడుపున ఉండగానే వేదశాస్త్రాలనూ, పూర్వకల్పాలలోని పురాణాలనూ కూలంకషంగా గ్రహించాను.

జన్మించినది మొదలుగా నేను నిరతం తపోదీక్షలో నిమగ్నుడినై ఉండగా ఒకనాడు మా అమ్మ నా దగ్గరకు వచ్చి రాక్షసులు మా తండ్రిగారిని నిష్కారణంగా హతమార్చిన సంగతి చెప్పి ప్రతీకారాన్ని ఉపదేశించింది.

ఇన్నాళ్లుగా ఎవరికీ చెప్పుకోలేని దుర్భరవేదనను అనుభవిస్తున్న ఆమె దీనస్థితిని చూసి నాకు తీవ్రకోపం కలిగింది. కులక్రమాగతమైన శాంతాన్ని కోల్పడి, శత్రుసంహారకారణాలైన అథర్వణ మంత్రాలను ప్రయోగిస్తూ రాక్షసలోక సత్త్రయాగాన్ని

కావించాను. ఆ మహాయజ్ఞంలో అనేక శత సహస్ర సంఖ్యలలో దానవులు భస్మీపటల మయ్యారు.

వారిలో చావగా మిగిలిన దైత్యులు కొంతమంది వసిష్ఠ మహర్షి పాదాలను ఆశ్రయించి, వంశనాశనం కాకుండా సంరక్షించ మని దీనవదనులై ప్రార్థించారు. పరమ దయాస్వభావు డైన ఆయన రాక్షసుల మొర ఆలకించి, పుత్రశోకాన్ని దిగమ్రింగి కర్తవ్యోప దేశం కావిస్తూ నాతో ఇలా అన్నాడు:

"నాయనా! ఎందుచేత నీ కింత ఆగ్రహం కలిగింది? నీవు చేస్తున్నది క్షత్రియోచితమైన కృత్యం, మునీశ్వర ధర్మం కాదు. జీవహింసకు పాల్పడినవారు ఎంత మహాత్ములైనా వారికి సద్గతు లుండవు. కోపం కలిగిన చోటనే పాపమూ కలుగుతుంది. పాపా త్ములకు కోపవ్యాపారాలే గోచరిస్తాయి. చిరకాలం తపస్సు చేసి ఉపార్జించిన పుణ్యఫలం కూడా క్రోధంవల్ల నశించి అపకీర్తి వాటిల్లు తుంది. నీ తండ్రి మరణానికి ప్రతీకారం చేయబూనావే కాని అతడు తన కర్మఫలాన్ని ఆ విధంగా అనుభవించాడని నీకు తెలియదా?"

ఈ విధంగా సమచిత్తంతో పలికిన వసిష్ఠమహర్షి వచనాలను ఆదరించి నేను రాక్షససత్రాన్ని ఉపసంహరించాను. అప్పుడు అబ్జ యోనిసుతుడు పులస్త్యబ్రహ్మ దేవ మహాముని గణసమేతంగా సాక్షాత్కరించి, నన్ను ప్రేమానురాగాలతో వీక్షించి "నా వంశజు లైన దైతేయుల పైని ఆగ్రహం విడిచి లోకాభినందనీయ నిర్మల శాంతి వహించావు. నీ మనోరథాన్ని చెప్పు" అని పలికాడు. "పూర్వకల్పాలలోని పురాణేతిహాసాల స్వరూపాన్ని గ్రహించిన నాటి నుంచీ నా మనస్సు అతి మనోహర పురాణేతిహాస రచన కోసం ఉవ్విళ్లూరుతున్నది. శబ్దబ్రహ్మవేద్యు డయిన లోకేశ్వరుని మహిమను గుర్తింపగల భవ్యజ్ఞానమూ, అనుపమానమైన

వాఙ్మాధుర్యమూ, లోకోత్తర ప్రతిభాపాండిత్యాలూ అనుగ్రహించండి'' అని నేను కోరాను. తదాదిగా నాకు సర్వ విద్యారహస్యాలూ కరతలామలకాలైనాయి.

మైత్రేయా! నీవు కోరిన సర్వార్థాలూ పురాణ రూపంలో విశదీకరిస్తాను. ఈ మహారహస్యాన్ని తొలుత బ్రహ్మదేవుడు దక్ష ప్రజాపతికి, ఆయన నర్మదాతీరంలో చక్రవర్తి పదవికై తపోదీక్షితుడై ఉన్న పురుకుత్సునికి, అతను సారస్వతునికి, ఆయన దయతో నాకూ బోధించిన క్రమం ఇది.

నాయనా! స్వస్వరూపానుసంధానం చేసుకొని ఇంతకాలం నాలో నిబిడమై నెలవొందిన విష్ణుభక్తిని మళ్లీ ఈ శుభవేళ సముద్దీపింపజేశావు. నిర్వికారుడు, లోకేశ్వరుడు, పరాత్పరుడు, పరమ కారుణికస్వభావుడు, దుష్టశిక్షణ శిష్టరక్షణ కళాప్రవీణుడు, ఆర్త త్రాణపరాయణుడు, పరమానంద స్వరూపుడు, జగద్వంద్యుడు, భక్తాధీనమానసుడు శ్రీ మహావిష్ణువు దివ్యచరిత్రాన్ని నోరార వర్ణించే మహాభాగ్యం సంప్రాపించి నా జన్మ ధన్యమైంది.''

అని భగవద్ధ్యానపూర్వకంగా భగవంతుడైన వాసుదేవునికి అభివాదనం చేసి, వసిష్ఠ పులస్త్యబ్రహ్మలను సంస్మరించి, భక్తి నిమీలితలోచనుడై భూతభవిష్యద్వర్తమానాలు తనకు జ్ఞానగోచరం కాగా ప్రసన్నహృదయుడై పరాశరమహర్షి శ్రీ మహావిష్ణు పురాణాన్ని ప్రారంభించాడు.

వాసుదేవ స్వరూపం

''మైత్రేయా!

శ్రీ మహావిష్ణువు నిఖిలాండభూతజాతం పుట్టుకకూ, స్థితివిలయాలకూ కారణశరీరుడు. ఆయన జగత్తులోను, జగత్తు ఆయనలోనూ ఏకకాలంలో వసించడంచేత ఆయన వాసుదేవుడయ్యాడు.

ఈ దృశ్య దర్శన సర్వస్వమూ ఆయన రూపమే. తనలో నిక్షిప్తమై ఉన్న సచరాచరజగత్తు విలయం చెందినప్పుడు ఆయన కాల స్వరూపుడై నిలిచి ఉంటాడు. విమలమూ అచ్యుతమూ సర్వ వ్యాపకం, అనాదిమధ్యాంతం, సమస్తం అయిన కాలం ఆయన వ్యక్తరూపం. అది నిత్యమై నిరంతరాయితమై రాత్రింబవళ్లుగా విభాసిల్లుతున్నది.

అనాదినిధనుడు, విశ్వమయుడు అయిన వాసుదేవునికీ కాల పురుషునికీ అభేదం. వారికి పూర్వాపరాలు లేవు. రేయింబవళ్లు, భూమ్యాకాశాలు, చీకటివెలుగులు, శీతోష్ణాలు—వీటిలో ఏదీ తాను కాక, అన్నింటా తానే నిలిచి వాసుదేవుడై ప్రకాశిస్తున్నాడు. ఈ విశ్వాన్ని సృజించే తరుణం ఆసన్నమైనప్పుడు ఆయన నుండి శబ్ద బ్రహ్మం ఉదయించింది.

సృష్టిక్రమం.

పృథ్వి (నేల), అప్పు (నీరు), తేజస్సు (వెలుగు), వాయువు (గాలి), ఆకాశం, ఇంద్రియాలకు అగోచరమైన చైతన్యశక్తి అనే ఆరు ధాతువుల సంయోగం వలన బ్రహ్మాండం ఏర్పడుతున్నది. ఈ ఆరింటిలోనూ మొదటిదైన పృథివి అన్నింటికన్నా స్థూలమైనది. ఆకాశం చైతన్యశక్తి చందాన సర్వవ్యాపకమైనది. శబ్దం ఆకా శానికి వ్యక్తమైన గుణం. ఇది అనాది కనుక బ్రహ్మమని వ్యవహా రింపబడుతున్నది. శబ్దం అనాహతం, ఆహతం అని రెండు విధాలు. అనాహతమైన మూలనాదం ఆహత మైనపుడు శబ్ద పరమాణువు లుగా సంయోగాన్ని చెందుతుంది. గాలి లేనప్పుడు నిశ్చలంగా ఉన్న సమయంలో చెరువునీరు కదలిక లేక ఉండి, గాలి వీచినప్పుడు అలలు పుట్టినట్లుగానే నిశ్చలమైన అనాహతంలో ఈశ్వరకర్మ అనే నిమిత్తకారణంవలన సూక్ష్మమైన తరంగాలు పుట్టి శబ్దం ఆహతంగా

మారుతుంది. అప్పుడు ఆకాశ పరమాణువులు సంయోగం చెంది శబ్దపరమాణువు లేర్పడుతాయి. ఆకాశతత్త్వంలో శబ్దస్వరూపం జనించినట్లే వాయుతత్త్వంలో స్పర్శమూ, అగ్నితత్త్వంలో రేఖా మండలమూ, జలతత్త్వంలో రసమూ, పృథ్వీతత్త్వంలో గంధమూ జన్మించి ఇంద్రియగ్రాహ్యామైన పదార్థాలు ఏర్పడుతున్నాయి. ఇది సృష్టితత్త్వం.

శబ్దతత్త్వం వలన ఆకాశతత్త్వం కలిగింది. ఆకాశానికి గుణమై రూపొందిన శబ్దానికి స్పర్శం తన్మాత్రగుణం అయింది. ఆ స్పర్శగుణంవలన వాయుతత్త్వమూ, వాయువుకు తన్మాత్రగుణమైన తేజోరూపం వలన వహ్నితత్త్వమూ పుట్టాయి. వహ్నికి రసం తన్మాత్రగుణమూ, రసగుణం వలన ఉదకతత్త్వమూ ఏర్పడ్డాయి. ఉదకానికి గంధం తన్మాత్రగుణం కాగా, గంధం వలన భూమి తత్త్వం జనించింద. ఆ భూమికి శబ్ద స్పర్శ రూప రస గంధాలు ఐదూ తన్మాత్రగుణాలైనాయి.

ఇలా పొడకట్టిన పృథివ్యప్తేజోవాయ్వాకాశా లనే పంచ భూతాలు, శబ్ద స్పర్శ రూప రస గంధాలైన పంచగుణాలు, చర్మము కన్ను ముక్కు చెవి నాలుక అను బుద్ధీంద్రియాలు, వాక్కు పాదం పాణి పాయువు ఉపస్థలనే కర్మేంద్రియాలు సాధనాలుగా మనోబుద్ధ్యహంకారాలు రాజస తామస సాత్త్విక గుణాలవల్ల ఉద్రేకింపబడి ప్రజాసృష్టి విస్తరిల్లుతోంది.

ఈ సచరాచర ప్రపంచం ఒక దేహం అయితే ఆ దేహాన్ని ధరించినవాడు సర్వాంతర్యామి అయిన శ్రీ వాసుదేవుడే. ఆ పరం ధాముడు కేశవస్వామి రజోగుణం వలన సాకారుడైనప్పుడు ఆయనే పాలకడలి తరగలపై శేషతల్పంపైన శయనించి తన ఇచ్ఛామాత్రం చేత ఈ విశ్వాన్ని సృజిస్తున్నాడు.

కల్పాదిమ సమయంలో సముద్రగర్భం నుంచి జలబుద్బుద ప్రాయమై—నీటి బుడగ ప్రమాణంలో ఒక అండం జన్మించింది. క్రమ క్రమంగా చీకటి ఆ ప్రదేశాన్ని క్రమ్మివేసింది. అంధకారానికి బహిరావరణంలో జలమూ, అగ్ని, వాయువు, ఆకాశం నెల కొన్నాయి. భూతజాతం ఆవరించిన శూన్యప్రదేశంలోని అండం చూడడానికి కొబ్బరికాయవలె కనుపింపసాగింది. ఆ అండాకృతి నుండి విష్ణువు రాజసం సృష్టికర్త అయిన బ్రహ్మదేవునిగా అవతరిం చింది. అతనిని నిమిత్తహేతువుగా నిలిపి జనార్దనుడు జగత్తు లన్నిం టినీ నిర్మింపజేశాడు.

బ్రహ్మదేవుడు సృజించిన బ్రహ్మాండ భాండ మధ్యంలో విష్ణువు తామసగుణం రుద్రుడై అవతరించి ప్రళయాలను కల్పించి సృష్టినాశం చేస్తున్నది.

శ్రీ మహావిష్ణువే తన సంకల్పవిశేషం చేత బ్రహ్మపరివేషం పూని సృష్టికర్త అయ్యాడు. ఈ సృష్టి స్థితి లయాలు మూడింటికీ కార్యమూ కారణమూ ఆ జనార్దనుడే. పురుషాఖ్యమైన జగత్తు సర్వస్వమూ ఆయన స్వరూపమే.

ఈ విధంగా అనేక బ్రహ్మప్రళయాలు సంభవించాయి. ఎన్నో సృష్టిస్థితిలయాలు గడిచిపోయాయి.

భూతేశుడు, భూత భవిష్యద్వర్తమాన విధాయకుడూ అయిన వాసుదేవునికి పరమానందస్వరూప ధారణంచేత వరేణ్యుడని పేరు.

ఆ మహానుభావుని మహిమలను వర్ణించడం మానవమాత్రుల మైన మనకు సాధ్యం కాదు.''

అని అంటున్న పరాశరమహాసింద్రుని మైత్రేయు డిలా అడిగాడు:

''ఆచార్యదేవా! శ్రీ మహావిష్ణువు నిర్గుణుడని వేదవాఙ్మయం ఎల్లెడలా ముక్తకంఠంతో నొక్కి వక్కాణిస్తున్నది. నిరాకారుడైన

వాసుదేవునికి సర్గస్థితినాశాలు ఎలా కలుగుతున్నాయి? ఒకే తత్త్వం ఏకకాలంలో సాకారమూ, నిరాకారమూ ఎలా కాగలుగుతున్నది? సవిస్తరంగా నాకు తెలియజేయండి.''

పరాశరుడు తల పంకించాడు. నైమిశారణ్య తపోభూమిలోని చెట్టూ చేమా కూడా తన పలుకులను చెవులు రిక్కించి వింటున్నట్లుగా సర్వమూ ప్రశాంతంగా ఉన్నది. నాతిశీతలమైన ప్రభాత వాయువులు ఉల్లాసదోహదమైన మృదుస్పర్శతో శరీరాయాసాన్ని అపనయింపజేస్తున్నాయి. ఆయన రసనాంచలంపైన వాగ్దేవి లాస్య నర్తనం చేయసాగింది.

''మైత్రేయా! ఈ జగత్తులకు పుట్టుకను, ఉనికిని, లయాన్ని అనువర్తింపజేసి, ఆయా ధర్మాలు పరిణామక్రమంలో సహజంగానే ఏర్పడుతున్నాయని భాసింపజేయడం కమలనాభునికి నైజప్రవృత్తి. అగ్నికి ఉష్ణమూ, మంచుకు శైత్యమూ ఎటువంటివో జగన్నాథుని యందలి జగత్తు కూడా అటువంటిదే.

నారాయణశబ్ద నిర్వచనం

పాద్మ మహాకల్పం అతీతం కాగానే వాసుదేవవ్యూహంలోని సృజనశక్తి మేలుకొని, సర్వశూన్యమై ఉన్న సృష్టిని పర్యాలోకించింది. ఆ సమయంలో జలధిశాయి ఐన జనార్దనుడు తన సృజన శీలితకు బ్రహ్మపదవిని ప్రసాదించాడు.

మైత్రేయా! నారములు అంటే నీరు అని అర్థం. అయన మంటే సంచారం. సృష్ట్యాదివేళలలో నారములు అయనంగా కల వాడు కనుక వాసుదేవునికి నారాయణుడని వ్యవహారం ఏర్పడింది.

నారము అంటే జ్ఞానము అని కూడా అర్థం ఉన్నది. ఆయన నారాయణుడు - అంటే జ్ఞానమార్గంచేత అభిగమ్యుడని తెలుసుకోవాలి.

ఆదిమూర్తి అయిన శ్రీమన్నారాయణుడు ప్రజాపతి రూపం ధరించి నూరు సంవత్సరాల ప్రమాణం కలిగినంతదాకా సృష్టి కార్యాన్ని నిర్వర్తింపజేస్తాడు.

జగద్విధాత రూపంలో నూరు సంవత్సరాలంటే అనేకానేక మహాయుగాలు గడిచిపోతాయి.

ఆకాశమూ, కాలం, దిక్కు, ఆత్మ, మనస్సు-అనే అయిదూ నిత్యాలు. వీటిలో మొదటి నాలుగూ విభుద్రవ్యాలు, నాలుగూ ప్రభుస్వరూపాలు.

కాలం నిత్యమైన ప్రవాహం వంటిది. అనాది మధ్య నిధన మైన కాలం అఖండమై ఉన్నప్పటికీ - జరిగినది, జరుగుతున్నది, రాబోతున్నది అనే వ్యవహారాలకు ఉపాధి భేదమే కారణం తప్ప ఈ మార్పులు శాశ్వతికమైన కాలానికి అన్వయించే సహజధర్మాలు కావు. కాలస్వరూపుడైన పరమాత్మ తత్త్వాన్ని అవగతం చేసుకొన డానికి ప్రాతిపదికంగా, నిమేషాది మహాకల్ప పర్యంతమైన కాల స్వరూపాన్ని గ్రహించాలి'' అంటూ పరాశరమౌని మైత్రేయునికి ఈ విధంగా విశదీకరించాడు:

కాలవిభాగ వర్ణనం

''ఒక లఘువును ఉచ్చరించే కాలానికి నిమేషమని పేరు. పద్దెనిమిది నిమేషాలు ఒక కాష్ఠ. కళకు ముప్పై కాష్ఠలు. అన్నే కళలు కలిసి ఒక క్షణం. పన్నెండు క్షణాలు ఒక ముహూర్తం. ముప్పై ముహూర్తాలు అహోరాత్రం. ఈ అహోరాత్ర పంచకం ఒక పక్షం. దానికి రెట్టింపు కాలం మాసం. రెండు మాసాలు ఋతువు. మూడు ఋతువులు ఒక అయనం. అవి ఉత్తరాయణం, దక్షిణాయనం అని రెండు విధాలు. ఆ రెండూ కలిసి దేవతలకు ఒక అహోరాత్రం.

ఈ గణనమంతా సౌరమానం ప్రకారం జరుగుతున్నది.

యుగాలు నాలుగు. వాటిలో మొదటిదైన కృతయుగానికి పదిహేడు లక్షల ఇరవై యెనిమిదివేల సంవత్సరాలు ప్రమాణం. త్రేతా యుగం పన్నెండు లక్షల తొంభై ఆరు వేల యేండ్లు నడుస్తుంది. ద్వాపరయుగానికి ఎనిమిది లక్షల ఇరవై నాలుగు వేల సంవత్సరాలు. నాలుగు లక్షల ముప్పై రెండు వేల సంవత్సరాలు కలిసి కలి యుగం.

నాలుగు యుగాలు ఒక దివ్యయుగం. అందుకు నలభై మూడు లక్షల ఇరవై వేల సంవత్సరాల కాలం అతీతం కావాలి.

ఇలువంటి యుగాలు వేయి గడిచాక, అంటే నాలుగు వందల ముప్పై రెండు కోట్ల వర్షాలు బ్రహ్మదేవునికి నాలుగు జాముల పొద్దు. అంతే ప్రమాణం ఆయనకు రాత్రి. ఆయనకే పితామహుడని పేరు.

మన్వంతరాలు పధ్నాలుగు. ఒక్కొక్క మనువు డెబ్బై ఒక్క మహాయుగాలు రాజ్యపాలన చేస్తాడు. అతను జీవించినంత కాలం చిరంజీవులైన దేవతలూ, ఇంద్రుడూ, మహామునులూ ఉప జీవిస్తారు.

ఒక మనువు తనువు చాలించి మరొక మనువు వచ్చే అనువులో రాత్రివేళ మహాప్రళయం సంభవిస్తుంది. ఒక్కొక్క ప్రళయమూ ఆదియుగప్రమాణకాలం ఉంటుంది.

పితామహునికి పగలు సృష్టి, రాత్రి ప్రళయవేళ. దీనికే నైమిత్తిక కల్పమని వ్యవహారం.

ఇటువంటి ముప్పై దినాలు పద్మగర్భునికి ఒక నెల. పన్నెండు నెలలు ఒక సమ. నూరు సమలు బ్రహ్మ ఆయువు.

బ్రహ్మాయువుకు మహాకల్ప మని పేరు. ఇది పూర్వాపర భేదంతో ద్విగుణం. పూర్వమహాకల్పానికి పద్మకల్పమని, ద్వితీయాపర మహాకల్పానికి వరాహకల్పం అని నామాలు.

కల్పాదిమ కాలంలో శ్రీమన్నారాయణమూర్తితో తుల్యమైన దివ్యరూపాన్ని సంతరించుకొని పరమేష్ఠి సత్త్వగుణోపేతుడై భూతసృష్టిని కావిస్తాడు.

ఇదీ కాల స్వరూపం.''

అని వర్ణించిన గురుదేవుని—''మౌనిప్రవరా! నారాయణత్వం వహించి సత్త్వగుణోపేతుడై విరించి ఏ విధంగా లోకాలను సృజించాడు?'' అని అడిగాడు, మైత్రేయుడు.

వరాహావతారం

''పూర్వం ఒకప్పుడు కల్పావసాన సమయం గడిచాక వేకువ జామున నిద్రాగతుడైన బ్రహ్మదేవుడు మేలుకొని నారాయణ ధ్యానంతో మనస్సును పరిశుద్ధం గావించుకొని, అన్నివైపులా పరమ శూన్యమైన లోకాన్ని ఆలోకించి, భూమి కోసం పర్యాలోకించాడు. ప్రళయపయోధిజలంలో మునిగి ఉన్న వసుంధరను పైకి తీయాలని ఆయన సంకల్పం. తొలుత శ్రీహరి మత్స్య కూర్మ రూపాలను ధరించినట్లే తాను కూడా నారాయణత్వంచేత మహావరాహాకృతిని పూనాడు.

ఆ విధంగా ఆదివరాహప్రభువు ఉగ్రఘుర్ఘుర ధ్వానాలతో దిక్కులను పిక్కటిల్లజేసి, మహాశక్తిగరిమతో నీట జొచ్చి, ఆటంకాలను విచ్చి, భూమిని కోరల నడుమ గుచ్చి పైకెత్తాడు.

నీరధిలో మునిగిన నావను దరిజేర్చినట్లు, తామర తూడు కొలను నీటిపై తేలినట్లు భూమండలం పైకి రాగానే నీళ్లన్నీ తద్రంధ్రాలగుండా పాతాళానికి ప్రయాణించాయి.

అప్పుడు పద్మాక్షుడు తన సర్వశక్తినీ సమీకరించి, భూమిని జలరాశిపై నిలువరించి నాలుగు దెసలా పర్వతాలను నిలబెట్టి ఆధారసంస్థానంగా ఆదికూర్మాన్నీ, ఆదిశేషుడినీ నిలిపి విశ్వాత్ముడైనాడు.

దేవాసుర మనుష్య సృష్టి కథనం

ఆదికాలంలో నారాయణుడు ప్రజాపతిత్వ బ్రహ్మరూపుడై నిండారిన రాజస గుణంతో సృష్టికార్యానికి ఉపక్రమించాడు. ఆయన ధ్యానసమాధిలో ఉండగా అప్రయత్నంగానే తమోమయం, తమోమోహం, మహామోహం, తమిస్రం, అంధతమిస్రం అనే అయిదు విధాలైన అంధకార భేదాలు జన్మించాయి. అనంతరం ఆయన ధ్యానమార్గంలో పశుమృగాదులైన తిర్యక్కులను సృజించాడు. ఆయన చింతన సత్త్వోదయం వలన ఊర్ధ్వదిశకు మళ్లింది. ఆ సాత్త్వికశక్తిమూలాన అమరులు ఉదయించారు. రాజసగుణం చేత ఉద్రిక్తమై, తమోరంజితమైన ఆయన తలపు అధోగమనంలో ప్రసరించి మనుష్యులు జన్మించారు.

నానావిధాలైన చరాచర జీవజాలం తమ తమ ప్రారబ్ధ కర్మానుసారం ఉద్భవించి, ధర్మాధర్మాలు, జ్ఞానాజ్ఞానాలను కలిగి ఇంద్రియలోభానికి గురియై రూపము, ప్రవర్తన, స్వభావం మొదలైన గుణాలను పొందుతున్నారు.

సత్త్వాకృతిని ధరించిన బ్రహ్మ ముఖం నుంచి విప్రులు జన్మించారు. రాజసోపేతుడైనప్పుడు ఆయన భుజాల నుండి క్షత్రియులు జన్మించారు. రాజస తామస ప్రకృతిని కలిగిన ఆయన తొడలనుంచి వైశ్యులు పుట్టారు. తామసోద్రేకం పొందిన ప్రజాపతి పాదాలనుంచి శూద్రులు ఉదయించారు.

వీరందరూ విహిత కర్మలను ఆచరించి, యజ్ఞకర్మలను నిర్వహించి ప్రజావృద్ధిని పొంది దేవతలకు ఆనందాన్ని కలిగిస్తున్నారు.

పాపకృత్యాలపైని మనస్సును ప్రసరింపనీయక దుష్టకర్మలను తలపెట్టకుండా మనుష్యులు నిత్యమూ ధర్మమార్గంలో చరించాలి. నిందలు వచ్చే త్రోవలను ముందే పరిశీలించి, ఎవరినీ నొప్పించ

కుండా అందరికీ తలలో నాలుకలాగా మెలగాలి. అటువంటి మానవులు దేవతలకన్నా పూజనీయులు.

మానవులు తాము ఆర్జించిన దానఫలం వలన దేవతలకు కూడా సాధ్యంకాని మోక్షపథాన్ని పొందుతారు.

బ్రహ్మ అన్నివిధాలైన మనుష్యులనూ సృజించాడు. కొందరు పరిశుద్ధమైన అంతఃకరణలతో లౌకిక భోగాలను త్యజించి విష్ణుభక్తి పరాయణులై ఉత్తమలోకాలను అధిరోహిస్తారు. కామ క్రోధ మోహ లోభ మద మాత్సర్యాలకు తలవంచి, దైవచింతనను విస్మరించి సంసార తాపత్రయంలో చిక్కుకొని, స్వార్థచిత్తులై పాతకాలకు ఒడిగట్టి కొందరు అధమగతి పాలవుతారు.

లోకంలో కొంతమంది పుణ్యశీలురు. కొందరు మహాపాపులు. ఒకడు రాజు, మరొకడు పేద. ఒకడు నిరక్షరాస్యుడు, మరొకడు మహా పండితుడు. రక్తిమార్గంలో ప్రవేశించినవాడికి ఎంత భోగించినా తనివితీరనంత తరుగులేని సంపద లున్నాయి. ముక్తిపథాన్ని కోరినవానికి ఇన్ని సుఖభోగాలనూ తృణప్రాయంగా నిరాకరించడానికి కొండంత ఆత్మబలం ఉన్నది.

ఒక్కొక్కటి సాధించడానికి ఒక్కొక్క సాధనం ఉండేటట్లు చేశాడు బ్రహ్మ. కోరిక అన్నది ఉండాలే కాని సాధ్యంకానిది ఏదీ లేదు.

మానవుల జీవనోపాయానికి ఆ జగత్పతి అనేక సాధనాలను కల్పించాడు. వడ్లు, గోధుమలు, యవలు, చిరువడ్లు, నువ్వులు, కొర్రలు, ఊదర్లు, ఆళ్లు, లంకలు, మినుములు, పెసలు, చిట్టిసెనగలు, అనుములు, ఉలవలు, కందులు, సెనగలు, జనుములు అనే పదిహేడు రకాల ధాన్యాలలో ఆళ్లు, ఉలవలు, సెనగలు తప్ప తక్కిన పద్నాలుగు ధాన్యాలూ యజ్ఞకర్మకు యోగ్యాలని పురాణవేత్త

లంటారు. ఈ ధాన్యాలచేత యజ్ఞకర్మలు విహితమౌతాయి. యజ్ఞాల వలన సస్యసమృద్ధి కలుగుతుంది.

ఈ ప్రకారం తాను నిర్మిస్తున్న భూతప్రపంచం ఆత్మజ్ఞానం లేక ఐహిక భోగలాలసం అవుతున్న తరుణంలో ఆర్తిని చెంది కమలాసనుడు తనతో సమానులైన ప్రజాపతులను, మహామునులను సృజించి లోకాలకు మేలుచేయాలని సంకల్పించాడు.

మహర్షుల జన్మోదంతం

మైత్రేయా! అబ్జసూతి ఈ రీతిగా జగత్తులో ఉత్తమ మానవులను ఉపకల్పించాలని సంకల్పించి తన మానససృష్టిచేత భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసుడు, మరీచి, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు అని పేరుగల తొమ్మిదిమంది ప్రజాపతులను, ఆ వెంటనే ఖ్యాతి, భూతి, సంభూతి, క్షమ, ప్రీతి, సన్నతి, ఊర్జ, అనసూయ, అరుంధతి అను తొమ్మిదిమంది కన్యలను ఆవిర్భవింపజేసి వారిని నవబ్రహ్మలకు క్రమంగా వివాహం చేశాడు.

పిమ్మట చతుర్ముఖుడు సూర్యునితో సమానమైన తేజస్సు కలవారు, దయామయులు, లోకోత్తర సౌందర్యవంతులు, వీతరాగులు, అసూయారహితులు, శాంతచిత్తులు ఐన సనకాదిమానులను సృజించాడు. వీరందరూ బ్రహ్మమానసపుత్రులై పరిఢవిల్లారు.

కాని బ్రహ్మ ఆశించిన విధంగా జరుగలేదు. తన అభినవ సృష్టి మూలాన భూమండలం అంతా ఉత్తమ బ్రహ్మవంశ విస్తారం కాకపోగా ఆయన పుత్రులందరూ జితేంద్రియులై, సంసార సుఖభోగాలను త్యజించి, బ్రహ్మవిద్యాపారంగతులై తపశ్చర్యలకోసం ఉచితస్థానాలకు వెళ్లిపోయారు. తన పూనిక విఫలమైందని తోయజగర్భునికి తీవ్రకోపం వచ్చింది.

రుద్రుని సంభవం

ఆగ్రహోదగ్రుడై క్రోధరసావేశుడైన బ్రహ్మదేవుని లలాటతలం నుంచి ఆ క్షణంలో మధ్యందిన మార్తాండమండలదుర్నిరీక్ష్య తేజంతో నిటాలేక్షణుడు, అర్ధనారీసమేతుడు ఐన రుద్రుడు ఆవిర్భవించాడు. తోడ్తోనే రుద్రాకృతి గల మహాత్ముడు, మహాత్మకుడు, మతిమంతుడు, భీషణుడు, భయంకరుడు, ఋతధ్వజుడు, ఊర్ధ్వకేశుడు, పింగళాక్షుడు, రుచి, శుచి, కాలాగ్ని నాములైన మరి పదిమంది జన్మించారు. వీరే ఏకాదశ రుద్రులు.

అనంతరం పద్మోద్భవుడు సర్వాత్మనా తనతో సమానుడైన స్వాయంభువ మనువును సృజించాడు. ఆ ఆదిమ మనువు తపోధనురాలైన శతరూపను చేపట్టి ధర్మవర్తనుడై మన్వంతర పర్యంతం రాజ్యభోగాలను అనుభవించాడు. ఆ పుణ్యదంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ప్రసూతి, ఆకూతి సంజ్ఞలతో ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు. వారిలో ప్రసూతిని దక్షుడు వరించి పరిణేతు డయ్యాడు. ఆకూతిని రుచికుడు స్వీకరించాడు. ఆ వధూవరులకు యజ్ఞుడు, ఆతనికి దక్షిణయందు పన్నెండుమంది యాములు ఉదయించారు. స్వాయంభువ మనువు కాలంలో వీరు దేవగణాలై స్వర్గపదాన్ని ఆవాసం చేసికొన్నారు.

సకలవిద్యాదక్షుడైన దక్షునికి ప్రసూతి వలన దాక్షాయణులు నలభైమంది జన్మించారు. వీరిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి అనే పదముగ్గురిని ధర్ముడు పెండ్లిచేసుకొన్నాడు. ఇక తక్కిన కుమార్తెలలో ఖ్యాతిని భృగుడు, సతిని భవుడు, సంభూతిని మరీచి, స్మృతిని అంగిరసుడు, ప్రీతిని పులస్త్యుడు, క్షమను పులహుడు, సన్నతిని క్రతువు,

అనసూయను అత్రి, ఊర్జను వసిష్ఠుడు, స్వాహాను వహ్ని, స్వధను పితృదేవుడు వరించారు.

ఇంత చేసినా శతానందునికి తనివితీర లేదు. తనతో సమాన శక్తిమంతుడైన సుతుని పొందలేదని ఆయన చింతిస్తూ ఉండగా, సంకల్పమాత్రం చేతనే ఆయన తొడనుండి ఒక కుమారుడు అద్భుతావహంగా ఉద్భవించాడు.

ఆ శిశువు పుట్టిన మరుక్షణంలోనే తనకు నామకరణం చేయమని నలువ యెదుట ఎలుగెత్తి ఏడ్చాడు. ఆ రోదనధ్వని వలన అతనికి నీరజాసనుడు రుద్రుడని పేరుపెట్టాడు. అతను ఇంకా ఏడు సార్లు దారుణంగా రోదింపగా బ్రహ్మ అతనిని లాలించి, ఏడుసార్లూ వరుసగా భవుడు, శర్వుడు, మహేశ్వరుడు, పశుపతి, భీముడు, ఉగ్రుడు, మహాదేవుడు అని నామధేయాలు కల్పించి ఎనిమిది పేర్లతో అలరారుతున్న అతనికి సూర్యుడు, చంద్రుడు, పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశం, యజమానులను శరీరాలుగా పొందించి రుద్రుని అష్టమూర్తిగా రూపొందించాడు. సూర్యునికి సువర్చల, చంద్రునికి రోహిణి, పృథ్వికి సుకేశి, జలరాశికి ఉష, అగ్నికి స్వాహా, వాయువుకు శివ, ఆకాశునికి దిక్కు, యజమానునికి దీక్ష భార్యలయ్యారు.

హిమవంతునికి మేనక గర్భంలో పొడమిన ఆదిశక్తి గారి రుద్రునికి సతియై చెలువొందింది.

దక్ష పుత్రిక ఖ్యాతిని ధర్మపత్నిగా చేసికొని భృగుడు ధాతృ విధాతృలను, లక్ష్మిని సంతానంగా పొంది శ్రీ మహాలక్ష్మిని శ్రీహరి కిచ్చి కళ్యాణం కావించాడు.''

లక్ష్మీదేవి జన్మవృత్తాంతం

ఈ విధంగా పరాశరమహర్షి వచింపగా మైత్రేయుడు ఆశ్చర్య చకితుడైపోయాడు.

"ఆచార్యసత్తమా! శ్రీ మహాలక్ష్మి కలశరత్నాకరంలో జన్మించినదని ముజ్జగాలూ వేయినోళ్లతో చెప్పుకొంటారు కదా, మీరు భృగునందన అని చెబితే నా చెవులను నేనే నమ్మలేకుండా ఉన్నాను. నాకు దీని సమన్వయాన్ని బోధించి కృతార్థుని చేయండి" అని ప్రార్థించాడు.

పరాశరమహర్షి మహాపౌరాణికుడు. పూర్వోత్తర సంబంధం లేని గాథలను ఎక్కడెక్కడినుంచో సమీకరించి, వాటిని ఏక సూత్రానికి గుదిగ్రుచ్చి అమితోత్కంఠను కల్పిస్తూ కథ చెప్పగల మహాకథకుడు. తాను ఉపదేశిస్తున్న శ్రీ విష్ణుపురాణం పట్ల మైత్రేయుడు శ్రద్ధధానుడై ఏకాగ్రచిత్తంతో వింటున్నదీ లేనిదీ అనుశీలించడానికి వీలుగా ఆయన నడుమ నడుమ కొన్ని ఆశ్చర్యకరమైన సన్నివేశాలను ప్రవేశపెడుతూ వచ్చాడు. మైత్రేయుని చేతనే ప్రశ్నను ఉత్పాదింపజేసి దానికి సమాధానంగా కథ నడుపుకొని పోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. శిష్యుని మాటలకు మనస్సులోనే నవ్వుకొని, తల పంకించి ఆయన వక్తవ్యాంశాన్ని కొనసాగించాడు.

"నాయనా! సర్వభూతమయుడైన వాసుదేవుని మాయాశక్తి లక్ష్మీరూపంలో ఆయనకు అర్ధాంగియై వెలుగొందుతున్నది. లోకంలో సంపత్కరమైన వస్తువులు అన్నీ ఆమెను ఉపబోధించే శ్రీచిహ్నాలే. దేవమనుష్యాది లోకాలలో చూపట్టే నానా చరాచరాకృతులలో సౌందర్యరాశులైన స్త్రీల రూపాలన్నీ ఆ రమాదేవి రూపాలే. పురుషాకృతులన్నీ హరిమయాలే.

పూర్వం దేవదానవులు క్షీరవారాశిని మథింపగా ఉదయించిన లక్ష్మిని మురళీధరుడు చేపట్టిన విషయం జగద్విదితం. వేదచోదితమైన ఆ కమనీయ గాథను మరీచి నాకు చెప్పిన ప్రకారంగా

సమన్వయించి నీ యందలి ప్రేమతో చెబుతున్నాను. కూలంకషంగా విను.

ఇంద్రునికి దుర్వాసుని శాపం

మైత్రేయా! దుర్వాసమహర్షి వృత్తాంతం నీకు అభిజ్ఞాతమే కదా. అత్రిమునికి అనసూయ యందు శంకరాంశతో ఆయన జన్మించాడు. ఆయన ఉగ్రకోపుడు. అభిమానధనుడు. గర్వంతో తనను లెక్కచేయకపోతే హరిహర బ్రహ్మాదులైనా లెక్కచేయడు. భూమండలం సర్వత్ర విహరించి, దర్శనీయస్థలాలను దర్శించిన తర్వాత ఆయనకు ఇంద్రలోకాన్ని చూడాలని కోరిక కలిగింది.

అభిలాష కలిగిన వెంటనే ఆయన దేవనగరానికి వెళ్లాడు. ఆ ఉపకంఠంలో ఒక విద్యాధరకాంత నందన వనంలోని పారిజాత సుమదామాన్ని ధరించి నేత్రాభిరామంగా ఆయనకు గోచరించింది. మనోహర చంద్రరేఖను అలంకరించుకొన్న శరత్కాలపు రాత్రివలె- వాడని పారిజాత ప్రసూనమాలికను ధరించి ద్విగుణీకృత శోభాయమాన ఐన ఆ విద్యాధరిని పలుకరించాడు దుర్వాసమహర్షి. ఆమె ధరించిన మాలికను ఇమ్మని కోరాడు. ఋషీంద్రుని అభీప్సితాన్ని తిరస్కరించే ధైర్యం చాలక ఆమె ఆ దండను దుర్వాసుని కిచ్చి, నమస్కరించి నిజావాసాని కేగింది.

ఆ సమయంలో దేవేంద్రుడు ఐరావతాన్ని అధిరోహించి గంధర్వ కిన్నర సిద్ధ సాధ్య విద్యాధరేశ్వరులతో కలిసి సాయంకాల వాహ్యాళికి విహరిస్తూ అటువైపు వచ్చాడు. దుర్వాసుడు అతనిని ప్రతీక్షించి, నీలగళ జటాకోటీరంలో నిబిడమైన చంద్రరేఖలాగా తన జడలలోపలి పారిజాతపు దండను కానుకగా అందించాడు.

దుర్వాసమహర్షి ప్రేమరంజితంగా అందించిన కానుకను గౌరవాదరాలతో స్వీకరింపక, గీర్వాణనాయకుడి నన్న దుర్వార

గర్వంతో దేవేంద్రుడు ఐరావతంమీద కూర్చొనే, చేతిలోని అంకుశాన్ని క్రిందికి జాపి ఆ మాలికను అందుకొన్నాడు.

తన కన్నుల యెదుటనే జరుగుతున్న ఆ అవమానకర దృశ్యాన్ని చూస్తూ భరింపరాని క్రోధావేశంతో కంపించిపోతున్న దుర్వాసమహామునీంద్రుని కన్నులలో ఘోరదారుణదావాగ్ని జ్వాలలు వెల్లివిరిశాయి. అంతలోనే పులిమీద పుట్రలాగా మరొక అవాంఛనీయ ఘటన జరిగింది.

దేవేంద్రుడు అధిరోహించిన భద్రగజం చెక్కిళ్లనుంచి స్రవిస్తున్న మదధారలను ఆస్వాదిస్తూ మత్తెక్కి ఉన్న తుమ్మెదలు పారిజాత సుమసౌరభానికి పరవశించి పెద్దపెట్టున రొదచేస్తూ దానిమీదికి ఉరికాయి. ఆ ఝుంకారరవానికి ఉలికిపడి ఐరావతం తన చుట్టూ మూగిన తుమ్మెదలను చూచి తత్తరపాటుతో గీపెట్టుతూ తొండాన్ని సాచి పారిజాతపు దండను అందుకొని నేలకు విసిరికొట్టి కాళ్లతో తొక్కి ఛిన్నాభిన్నమై నలిగిపోయిన పువ్వురేకులను చెల్లాచెదరుగా నలువైపులకూ విసిరేసింది.

దుర్వాసుని కోపం మిన్నుముట్టింది. నొసలు చిట్లించి బొమలు వంచి ప్రకంపమానదేహుడై ఆయన ఉగ్రంగా అన్నాడు:

"ఓరీ! మదించిన ఐశ్వర్య గర్వంతో కన్నూ మిన్నూ కానరాకుండా ప్రవర్తించావు. త్రిలోకరాజ్యలక్ష్మీ మహనీయసంపదలను మించిన పువ్వులదండను తెచ్చి ప్రేమతో నీ కందిస్తే గౌరవంతో గ్రహింపక ఇంత చేశావు. నీ ఐశ్వర్యం అంతా జలధిపాలవుతుంది. రాజ్యభోగం నశించి రాళ్లతో ఊరేగు."

మహర్షి శాపానికి విభ్రాంతుడై దేవేంద్రుడు ఆయన పాదాలపై పడి క్షమార్పణలు చెప్పుకొన్నాడు. శాపమోక్షాన్ని అనుగ్రహింపమని ప్రార్థించాడు.

దుర్వాసుని కోపం చల్లారలేదు. అగ్నికి ఆజ్యం పోసినట్లు మరింతగా మండిపడ్డాడు. ఆనాడు మునిపత్ని అహల్యను మాయా పరివేషంలో వంచించి తప్పుచేసిన నిన్ను మన్నించడానికి నేను గౌతముణ్ణి కాను. నీ పాపానికి నిష్కృతి లేదు. నన్ను రెచ్చ గొట్టితే నీకు లోకంలో నిలువ నీడలేకుండా చేస్తాను, అని హుంక రించాడు.

మౌని శాపప్రభావం వలన నిర్జరేశ్వరుని అనంతభోగాలన్నీ ఇంద్రజాలం జరిగినట్లుగా అదృశ్యమైపోయాయి. చింతామణి, కల్ప వృక్షం, కామధేనువు, ఐరావతం, ఉచ్చైశ్రవం ఏమైనదీ కాన రాలేదు.

భూమిపైని కూడా ఈ వృత్తాంతం కర్ణాకర్ణిగా వ్యాపించింది. దేవతలంటే పూజ్యభావం నశించి ప్రజలు ఉత్తమలోకగతుల కోసం దానధర్మాలు చేయడం మానివేశారు. ధర్మానికి గతిలేక లోకంలో అనావృష్టి వ్యాపించింది. సస్యాలు పట్టిపోయాయి. కావలసిన వస్తు సంభారం లభింపక యజ్ఞయాగాలు నిలిచిపోయాయి. యజ్ఞాహుతులు లేక దేవతలు నిరాహారులై తేజోరహితు లైనారు.

శాపోపహతులైన అమరుల నిస్సహాయతను చూసి దానవ నాయకు డైన విప్రచిత్తి దేవలోకం పైకి దండెత్తి ఇంద్రుని అనా యాసంగా జయించాడు.

నారాయణ శరణాగతి

ఈ విధంగా దీను డైన దేవేశ్వరుడు సత్యలోకానికి వెళ్ళి పద్మాసనునితో తనకు కలిగిన విపత్తును గురించి వినివేదించాడు. బ్రహ్మ అతనిని ఊరడించి, “అత్రినందను డైన ఆ దుడుకునోటి ఋషికి కోపమే కాని శాంతం లేదు. ఏమైతేనేమి, ఆయన కోపాగ్ని దివిజ లోక సంపదలందు మాత్రమే ప్రసరించింది. పులి నాకి విడిచినట్లు

నువ్వు ప్రాణాలతో బ్రతికి బయటపడ్డావు. అంతే చాలు. ఆ దుర్వాసుని క్రోధమంటే నాకైతే నేను కూడా గుండె కూడబెట్టి గుప్పిట్లో పెట్టుకొని జడుస్తానుకదా!'' అన్నాడు. ''ఆపదలను మాన్చి సుఖస్థానాలలో పూన్చి సంతాపాలను తొలగించి సంపదలతో వెలిగించి దుఃఖ సముద్రంలో నావయై నిలిచి ప్రోవడానికి శ్రీమన్నారాయణు డున్నాడు. ఆ పరంధాముని శరణాగతి తప్ప కర్తవ్యం వేరేమీ లేదు'' అన్నాడు.

పితామహుని పలుకులను పురస్కరించుకొని పాకశాసనుడు పాలకడలిలో ఉన్న శ్వేతద్వీపానికి వెళ్లాడు. అందులోనే వాసుదేవుని ఆవాసమందిరమైన వైకుంఠనగరం ఉన్నది.

ఆ వైకుంఠంలో వేదవేదాంతాలను స్వాధీనం చేసుకొని ఆత్మజ్ఞానాన్ని సాధించిన సనకసనందనాది మహామునివరేణ్యులు శ్రీహరి సన్నిధానవర్తులై నిత్యమూ ఆయనను సేవించుకొంటున్నారు. మహనీయ శేషతల్పంపైన కోటానుకోటి మన్మథులను తలదన్నే సౌందర్య రత్నాకరుడైన శ్రీమన్నారాయణుడు పచ్చని పట్టువస్త్రాలు ధరించి, శ్రీవత్స లాంఛనాన్ని, కౌస్తుభమణిని, వైజయంతీమాలికను, అనంత భోగచిహ్నాలైన అమూల్యాలంకారాలనూ ధరించి దేదీప్యమానంగా విరాజిల్లుతున్నాడు. లోకాలకు అభయాన్ని ప్రసాదిస్తున్న ఆయన కరపద్మాలలో పాంచజన్య శంఖం, సుదర్శన చక్రం, శార్ఙ్గకోదండం, కౌమోదకీ గద ఉన్నాయి. ఏ దేవదేవుని పాద కమలాలను కన్నుల పంటగా సందర్శించి తరించాలని పరమహంసలు కూడా ఉవ్విళ్లూరుతుంటారో, ఏ పరాత్పరుని కరుణాకటాక్ష లేశం చేత జన్మ జన్మల సంసరణబంధాలు పటాపంచలౌతాయో, ఆ మహానుభావుడు కేశవ మాధవ గోవింద ముకుంద పరమానంద జనార్దనుడు శ్రీ మహావిష్ణువు నయనాభిరామ తేజోవిలాసంతో మంద హాస సుందరవదనారవిందుడై అమరేంద్రుని పలుకరించాడు —

దేవేంద్రుడు తనకు వాటిల్లిన ఆపదలను ఆయనకు నివేదించి శరణు కోరాడు.

"నీవు వెంటనే వెళ్ళి దానవులతో మాటాడి వారిని ఒప్పించి ఇక్కడకు తీసికొనిరా. మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి సర్పాన్ని కవ్వపుతాడుగా చేసికొని ఈ పాలసంద్రాన్నే మథించండి. ఓషధీలతలు, దివ్యైశ్వర్య సంపదలు, అమృతం ఉద్భవిస్తాయి. నీకు స్వర్గపరిపాలనం పునః ప్రాప్తిస్తుంది. కర్తవ్యోన్ముఖుడివై కార్య సాధన చేయి" అన్నాడు నారాయణమూర్తి.

క్షీరసాగర మథనం

దేవేంద్రుడు వెంటనే దనుజనాయకులను కలిసి అమృత సంపాదన విషయం ప్రస్తావించి క్షీరసాగరమథనానికి వారిని అంగీక రింపజేశాడు. దితినందనులు, అదితినందనులు సంధిచేసుకొని మందర పర్వతాన్ని పెకలించి తెచ్చారు. ఆ అద్రిపై పొడమిన ఓషధీ లత లను సముద్రగర్భంలో నిక్షేపించి, మందరాన్ని సముద్రంపై ఉంచి, వాసుకిని తర్రితాడుగా చుట్టనున్న తరుణంలో నీటిలో ఆధారం లేక మందరాద్రి జలధిలో మునిగిపోయింది. అప్పుడు దివిజనాథుడు నిస్సహాయుడై శ్రీనాథుని సంస్మరించాడు.

అప్పుడు సహస్రాక్షునికి పుండరీకాక్షుడు ప్రత్యక్షమై లోకోపకారార్థం సముద్రగర్భంలో లక్షయోజనవిశాలమైన కూర్మ రూపాన్ని ధరించి అవతరించాడు. తన వీపుపై అద్రిభారాన్ని వహించి దేవదానవులకు తోడు నిలిచాడు. కవ్వపు తాడుగా మథించేటప్పుడు బాధను సహించడానికి వాసుకికి మహాబలాన్ని ప్రసాదించాడు. రాక్షసులు పాము తలవైపు, దేవతలు తోకవైపు నిలబడ్డారు. కవ్వాన్ని చిలుకుతున్నప్పుడు పాము నోటినుండి వెలువడుతున్న దారుణ విషాగ్నిజ్వాలల వేడిమికి తల్లడిల్లి దనుజ

లందరూ హాహాకారాలు చేస్తే తోక వైపు నిలిచిన దేవతలు అనాయాసంగా పనిచేయసాగారు. క్రమక్రమంగా రాక్షసులు బలిమి కోల్పడి నీరసింపసాగారు. విషజ్వాలల తాపాన్ని తప్పించుకొనడానికి తోక వైపుకు పయనించిన మేఘాలు దేవతలపై చిత్తడి జల్లులను కురిసి వారికి అమందానందాన్ని కలుగజేశాయి.

ఈ ప్రకారంగా సముద్రమథనం జరుగుతున్నప్పుడు దుర్వాస శాపం వలన అదృశ్యాలైన దేవధనాలు అనేకం ఉద్భవించాయి. కల్పవృక్షం, కామధేనువు, చింతామణి, సౌందర్య లావణ్యవతులైన రంభాది అప్సరసలు, ఐరావతం, ఉచ్చైశ్రవం—వీటన్నిటినీ ఉపేంద్రుడు ఇంద్రునికి బహూకరించాడు. కుబేరునికి నవనిధులను ఇచ్చాడు. చంద్రుణ్ణి సతీపతికి శిరోభూషణంగా అందించాడు.

ఆ తర్వాత అమితరాజసంతో, మదించిన రూపురేకలతో కల్లుకుండను చేతపూని మదిరాసతి ఉదయించింది. విష్ణువు దానిని రాక్షసులకు ఇచ్చివేశాడు.

గీర్వాణుల గర్వాన్ని అణచడానికి శపించిన దుర్వాసుని కోపాగ్ని లాగా దారుణమైన విషం ప్రభవించింది. దానిని సర్పరాజులు స్వీకరించారు.

అనంతరం దివ్యమైన వస్త్రాలను, నగలను అలంకరించుకొని ఒకచేత కరక్కాయను, మరొకచేత అమృతకలశాన్ని ధరించి ఔషధయోగంలో నిష్ణాతుడైన ధన్వంతరి దుగ్ధసాగరం నుంచి వెలికి వచ్చాడు.

అంతవరకూ జన్మించిన సంపద్వైభవాలన్నీ ఒక ఎత్తు కాగా, క్షీరార్ణవం నుంచి లోకోత్తర సౌందర్యరాశి అయిన లక్ష్మి జన్మించింది. ఆమె కరకమలాన అరవిందం విరాజిల్లుతున్నది. పద్మాసనాసీనయై త్రిలోకాలకూ ఆరాధ్యదేవత అయిన ఆమె సముద్రరాజనందన...భక్తులకు పెన్నిధానం.

ఈ విధంగా శ్రీదేవి ఉదయించగానే ఆదిమహర్షులందరూ వేదగానపవిత్రమైన మహితకంఠాలతో శ్రీసూక్తాన్ని పఠించారు. తుంబురు విశ్వావసు గంధర్వులు సంగీతాన్ని ఆలపించారు. అప్సరసలు నృత్యాలను ప్రదర్శించి కన్నుల విందు చేశారు. దిగ్గజాలు పుణ్యనదీజలాలతో అభిషేకం గావించాయి. సముద్రుడు వాడని కలువపూలు తెచ్చాడు. విశ్వకర్మ దివ్యరత్నాభరణాలు ఇచ్చాడు. మహావైభవంతో ఒప్పారుతున్న ఆ దేవిని దేవదేవుడైన శ్రీధరుడు స్వీకరించి తన వక్షఃస్థలంలోనే ప్రేమతో నిలుపుకొన్నాడు.

దివిజశత్రువులకు ఏ సంపదలూ దక్కనీయక దామోదరుడు తన దాసులకే అన్నీ కట్టబెట్టాడని దానవులలో కల్లోలం చెలరేగింది. విప్రచిత్తి మొదలైన రాక్షసులు ఎదురువచ్చి అమృత కుంభాన్ని దేవతలనుంచి లాక్కొన్నారు.

అప్పుడు విష్ణువు నిశాచరమధ్యంలోకి స్త్రీపరివేషంలో ప్రవేశించి తన మోహనాకృతితో వారిని మత్తెక్కింపజేశాడు.

అందాలు చిలుకుతున్న ముఖం, అపూర్వమైన లావణ్యం. ఆ జగన్మోహినిని చూసి రాక్షసులు ఒళ్లు మరిచిపోయారు. పరవశింపజేసే ఆమె కన్నులు కలువ పువ్వుల్లా ఉన్నాయి. సన్నని నడుముకూ అందమైన చేతులకూ పొందును సమకూరుస్తున్న పొందికైన ఆమె వక్షోజాలు వారికి విభ్రాంతిని కలిగించాయి.

వారలా మైమరచి ఉన్న వేళ పద్మనాభుడు అమృత కలశాన్ని దేవతలకు అందించాడు. దేవతలు అమృతాన్ని ఆరగించి అజరామరు లయ్యారు. వారి పరాక్రమానికి వెరచి దానవులు పాతాళలోకానికి పారిపోయారు.

లక్ష్మీకటాక్షం చేత లోకాలు మళ్లీ సంపదలతో విలసిల్లాయి. దేవవల్లభుడు ఇంద్రపదవిని చేరుకొని పూర్వవైభవాన్ని

అధిగమించి ధర్మాచరణ బుద్ధితో పరిపాలనకు ఉపక్రమించాడు. లక్ష్మీనారాయణులను సంస్తుతించి జగత్తు చరితార్థమైంది.

క్షీరార్ణవంలో ఉదయించిన శ్రీదేవి — భృగుమహర్షికి ఖ్యాతియందు తొలుత జన్మించిన హేతువు చేత—పుత్రికాసమాన అయింది. ఆమెను శ్రీహరికి నిమిత్తమాత్రంగా కన్యాదానం చేసి భృగువు కృతార్థుడైనాడు.''

పుణ్యదాయకమైన లక్ష్మీ చరిత్రాన్ని ఆకర్ణించిన తరువాత మైత్రేయుడు ఇలా అన్నాడు—

''మునిసత్తమా! మీరు తొల్లింటి కథలలో ప్రస్తావించిన భృగువు మొదలైన ఋషీంద్రుల వంశ చరిత్రలను సవిస్తరంగా తెలుసుకోవాలని ఉన్నది. కరుణించి నన్ను కృతార్థుణ్ణి చేయండి.''

శిష్యుని అభిమతాన్ని మన్నించి పరాశరమహర్షి భృగువంశ క్రమాన్ని చెప్పసాగాడు:

భృగువంశం

''మైత్రేయా! దక్షప్రజాపతి కుమార్తె ఖ్యాతిని పెండ్లిచేసుకొన్నాక భృగువుకు ధాత విధాతలు జన్మించారు. వారికి మేరు పర్వత పుత్రికలైన ఆయతి నియతి భార్యలయ్యారు. అందులో ఆయతికి ప్రాణుడు, నియతికి మృకండుమహర్షి, ఆయనకు మార్కండేయుడూ జనించారు. ప్రాణుడికి వేదశిరుడు, అతనికి ద్యుతిమంతుడు, అతనికి అజరుడు పుట్టి భృగువంశం తామరతంపరగా అభివృద్ధి చెందింది.

మరీచిమహర్షికి సంభూతి గర్భంలో పౌర్ణమాసుడు, అతనికి విరజుడు, పర్వతుడు పుట్టి వంశవృద్ధి చేశారు.

అంగిరసునికి స్మృతి కడుపు పంటగా అనుమతి, రాక, సినీవాలి, కుహువు పేర్లతో నలుగురు కుమార్తెలు ఉదయించారు.

అత్రికి అనసూయ యందు చంద్రుడు, దుర్వాసుడు, దత్తాత్రేయుడు కలిగారు.

ప్రీతికి దత్తాగ్ని జనించాడు. అతడే స్వాయంభువ మన్వంతరంలో అగస్త్యమహర్షి.

పులహుడికి క్షమ, ఆమెకు కర్దముడు, సహిష్ణుడు, ఊర్ధ్వరేతుడు పుట్టారు. క్రతువుకు సన్నతియందు బొటనవ్రేలంత పరిమాణంలో ఊర్ధ్వరేతస్కులైన వాలఖిల్యాదులైన మహర్షులు అరవైవేలమంది కలిగారు. వసిష్ఠునికి ఊర్జయందు విరజుడు, గోత్రుడు, ఊర్ధ్వబాహుడు, సవనుడు, అనఘుడు, సుతపుడు, శక్రుడు జన్మించి ఉత్తమ మనువు కాలంలో సప్తర్షులై చిరకీర్తిని గడించారు. వహ్నికి స్వాహావధూటి కడుపున పావకుడు, పవమానుడు, శుచి పుట్టారు. వారు ముగ్గురికీ మరి నలభై ఏడుమంది పుట్టారు. పితృదేవునికి స్వధాగర్భంలో పితృగణాలు, మేనక, వైతరణి జనించారు. స్వధా పితృదేవులు యోగినీదేవత లయ్యారు.''

మైత్రేయుడు అడిగాడు: ''మహానివర్యా! స్వాయంభువమనువు వంశంలో జన్మించిన రాజులు, వారి గుణశీలాలు విశదీకరించండి,'' అని భక్తిపూర్వకంగా.

సకల పురాణ విద్యాధురంధరుడైన పరాశరుడు చెప్ప సాగాడు:

''మైత్రేయా! మనువులలో ప్రథముడైన స్వాయంభువ మనువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు జన్మించారు. వారిలో ఉత్తానపాదుడికి ఉత్తముడు, ధ్రువుడు అను పేర్లతో ఇద్దరు కుమారులు ఉదయించారు. పరమభాగవతోత్తముడైన ఆ ధ్రువుని పుణ్యగాథను శ్రవణపర్వంగా ఆలకించు.

ధ్రువుని చరిత్ర

పూర్వం ఉత్తానపాద మహారాజు భూమండలాన్ని ఏకాతపత్రంగా పరిపాలించి, క్షత్రియోచితమైన విధు లన్నింటినీ ధర్మమార్గంలో నిర్వర్తించి ఉత్తమ ప్రభు వని కీర్తి గడించాడు.

ఆయనకు ఇద్దరు భార్యలు. సురుచికి ఉత్తముడు, సునీతికి ధ్రువుడు జన్మించారు.

ఒకనాడు ఉత్తానపాదుడు నిండుకొలువులో ఉత్తముని తన తొడమీద కూర్చుండబెట్టుకొని ప్రేమగా బుజ్జగిస్తున్న తరుణంలో ధ్రువుడు చూసి తన సవతి తల్లి కొడుకు లాగానే తాను కూడా తండ్రి ప్రేమను చూరగొనాలని ఆశగా సింహాసనం దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో చెంతనే ఉన్న సురుచి తన సవతిపైని అసూయవల్ల సునీతి కొడుకును వెనక్కిలాగి, చీదరించుకొని "ఈ విశాలసామ్రాజ్య భోగభాగ్యాలన్నీ అనుభవించే అదృష్టం నీ కెక్కడిది? నేను మీ నాన్నగారికి ఎంతో ఇష్టమైనదానిని. అటువంటి నాకూ మీ అమ్మకూ సాపత్యం ఎక్కడుంది? నీ తల్లి నా కనుసన్నలలో వినయంగా నడుచుకోవలసింది పోయి, నేనూ రాజపత్నినే అన్నట్లు ప్రవర్తిస్తుంది. నీ తండ్రిగారికి ఆవిడంటే అసహ్యం.

ఈ సింహాసనం ఎక్కే గౌరవం ఉత్తానపాద మహారాజుగారి ప్రియసుతుడు ఉత్తముడికి మాత్రమే లభిస్తుంది. నువ్వు ఉత్తముడి కన్నా ఉత్తముడివైతే ఇక్కడ ఉండు. లేకపోతే పో."

అని నానా దుర్భాషలాడి చిన్నారి ధ్రువుని వెనుకకు త్రోసి, వీపు పగిలేలా చావబాది త్రోసివేసింది సురుచి.

భరింపరాని ఆ అవమానం వల్ల ధ్రువునికి దుఃఖం పొర్లి వచ్చింది. తండ్రి దగ్గరకు వెళ్లలేక, సవతి తల్లిని ఎదిరించలేక

అతను ఏడుస్తూ తన తల్లి దగ్గరకు వెళ్లి, తన పెదతల్లి మాటలను, తండ్రి చూసీచూడనట్లు ప్రవర్తించడాన్నీ చెప్పుకొన్నాడు.

తల్లి ధ్రువుని కన్నీళ్లు తుడిచి, శిరసు మూర్కొని కౌగలించుకొని తానూ ఏడ్చింది. "నాయనా! ఆమె ఉన్నమాటే చెప్పింది. మీ నాన్నగారికి వాళ్లిద్దరంటేనూ ప్రేమాభిమానాలు ఉన్నమాట నిజమే. నువ్వు నావంటి అభాగ్యురాలి కడుపున పుట్టావు" అని కన్నీరు మున్నీరుగా విలపించింది.

ధ్రువుడు మనస్సు చిక్కబట్టుకొని, తల్లిని ఊరడించి, "అమ్మా! రాజ్యాన్ని తమ్ముణ్ణే అనుభవించనివ్వు. ఏ దేవుడు మన తండ్రి తాతలకూ, ఇప్పుడు తమ్ముడికీ ఉత్తమ సంపదలను అనుగ్రహించాడో ఆయనే మనను కూడా రక్షిస్తాడు. ఈ క్షణికభోగాలు నాకెందుకు? దేవతలకన్నా ఉన్నతమైన శాశ్వతసౌఖ్యాన్ని పొందుతాను. నాకు తపస్సుకు వెళ్లడానికి అనుమతి ఇవ్వు" అని పలికి ఆమెకు నమస్కరించి బయలుదేరాడు.

దారిలో అతనికి జింకచర్మాలు కట్టుకొని ప్రసన్నాస్యులై ఉన్న సప్తమహర్షులు కనుపించి వివరాలు అడిగారు. ధ్రువుని మనస్సులో ఉదయించిన విరక్తినీ, నిర్వేదాన్నీ చూసి వారు "ఇతని సంకల్పబలమూ, కార్యదీక్షా పరిపక్వంగా ఉన్నాయి. యుద్ధంలో శత్రురాజులు విషదిగ్ధాలైన నిశితబాణాలను విసిరినప్పుడు చలింపని బలం కలిగిన ఈ రాజకుమారుడు సవతి తల్లి దుర్భాషలను భరింపలేకపోయాడు. ఇంత పసితనంలో ఎంత జీవితాన్ని చూశాడు!" అని సానుభూతి చెందారు. "నాయనా! కలువరేకుల్లాంటి కన్నులు కలవాడు, భక్తులకు ముక్తిని ప్రసాదించే కరుణామయుడు, అందరికీ ఆరాధ్యదైవం శ్రీ మహావిష్ణువును భక్తితో సేవించు. నీ పూర్వీకులందరూ ఆయన దయవల్లనే సర్వైశ్వర్యాలనూ పొందారు. ఆయనను

ఉపాసించి ఇహలోక భోగాలను త్యజించివేస్తే, ఆ ప్రభువు నిన్ను కరుణిస్తాడు'' అని పలికి, ఆశీర్వదించి, పరమ గోప్యమైన ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి తపస్సుచేసే విధానం తెలియజెప్పి అంతర్హితు లయ్యారు.

ధ్రువుడు ఉత్తరదిశకు పయనించి యమునాతీరంలో ఉన్న మధువనానికి వెళ్లాడు. కాళిందిలో తీర్థస్నానం చేసి మనస్సును ఇంద్రియవిషయాల నుంచి తప్పించి యోగనిష్ఠలో నివేశించి ధ్యాన సమాధిలో ప్రవేశించాడు. ఆదిదేవుని, గరుడవాహనుని, భక్తజన కల్పవృక్షాన్ని, శ్రీమన్నారాయణమూర్తిని మనసారా తలచుకొన్నాడు. ఒక పాదాన్ని మోకాలికి ఆనించి, ఒక్క కాలుపై నిలిచి, చేతులు పైకి జోడించి ఉగ్రతపస్సు చేస్తుండగా భూమి కంపించింది. కులపర్వతాలు వణికాయి. నీళ్లు నిండిన పడవలాగా భూమి ఒక ప్రక్కకు ఒరిగి సచరాచరప్రపంచం తల్లడిల్లింది.

తపస్సుకు విఘ్నాలు

ధ్రువుని తీవ్ర తపస్సు వలన అగ్ని ప్రజ్వరిల్లి మూడు లోకాలనూ భయకంపితం చేయసాగింది. ఇంద్రుడు యాములనే దేవగణాలతో సంప్రతించి, "మీరు భూతప్రేతపిశాచాలను పిలిపించి ఆ డింభకుని తపస్సు భగ్నంచేయండి,'' అని కోరాడు.

యాములు ధ్రువుని ఏకాగ్రతను భంగం చేయాలని అనేక విధాలుగా ప్రయత్నించి చూశారు. భయానక సర్పాలై బుసలు కొట్టి కరవబోయారు. పెద్దపులులై గాండ్రించి సింహాలై గర్జించి దిక్కులను గడగడలాడించారు. చిటచిటలాడే మంటలను నాలుగు వైపులా అంటించి ఆ సెగలకు చిటిలిపడే పెంకులు శరీరంపై పడేటట్లు చేశారు.

ధ్రువుడు చలించలేదు.

ఒక రాక్షసి సునీతి వేషం ధరించి గుండెలవిసేలా దుఃఖిస్తూ, ఉబ్బిన కళ్లతో బొంగురుపోయిన గొంతుకతో నీరసించిన దేహంతో అతని దగ్గరకు వచ్చి, "నాయనా! అందని పండ్లకోసం అర్రులు చాచడం ఎందుకయ్యా? నాకు మనోవ్యథను కల్పించి నువ్వు సాధించే దేమిటి? అయినా ఆ శ్రీహరి నీలాంటి పసివాళ్లను లాలించి, వరాలివ్వడం ఎన్నడైనా విన్నామా కన్నామా, చెప్పు. చేతికొచ్చిన పంటను వదులుకొని అడవిలో చెట్లు నరికినట్లు ఈ శ్రమంతా ఎందుకు తండ్రీ! నువ్వు రాకపోతే నేను నీ కళ్లెదుటే ప్రాణాలు విడిచి చచ్చి పడివుంటాను. లే నాయనా" అని పరిపరి విధాల వాపోయింది.

కొంతమంది రాక్షసులు ఆయుధాలు విసురుతూ పెడబొబ్బలు పెడుతూ రణగొణధ్వనులతో అల్లకల్లోలం చేశారు. శ్రీమన్నారాయణమూర్తిని హృదయకమలంలో నిలుపుకొని, ఏకాగ్రచిత్తంతో ధ్యానిస్తున్న బాలధ్రువునికి భక్తిపారవశ్యం వల్ల ఈ అవాంతరాలు సంభవిస్తున్న విషయమే తెలియరాలేదు.

దేవేంద్రుడు తన శక్తియుక్తులన్నీ విష్ణుభక్తుని సన్నిధానంలో నిష్ఫలాలని గుర్తించాడు. వైకుంఠవాసుని దగ్గరకు వెళ్ళి ఆయన పాదాలు కన్నుల కద్దుకొని, "భక్తరక్షకా! మధువనంలో నీ దర్శనార్థం తపస్సు చేస్తున్న ఆ బాలకుని దీక్షవలన తపోగ్ని జనించి త్రిజగత్తులనూ దహించి వేస్తున్నది. అతనిని పరీక్షింపదలచి నేను లెక్కలేనన్ని విఘ్నాలు కల్పించాను. స్వామీ! నీ భక్తుడు ఇంద్ర పదవి కోసమే తపస్సు చేస్తున్నాడో, సూర్యచంద్రులను మించిన ఉన్నతినే కోరుతున్నాడో తెలియదు. నీవు వచ్చి అతనికి అభీష్ట వరాలను ప్రసాదించు. లోకాలను రక్షించు" అని ప్రాధేయపడ్డాడు.

ధ్రువుని కర్మశేషం పరిపక్వమైనదని గ్రహించిన వాసుదేవుడు తన ప్రియభక్తుని సన్నిధిలోకి సర్వాలంకార భూషితుడై

పరివారసమేతంగా తరలివెళ్లి ప్రత్యక్షమయ్యాడు. యోగధ్యానంలో మనస్సును లయింపజేసి నిరావరణుడై ఉన్న ధ్రువునికి దివ్యదృష్టిని ప్రసాదించి, అతనిని భావవీథిలో ముందు పలుకరించి ఆ తర్వాత బాహ్యదృష్టికి గోచరించాడు.

పరాత్పరుని కృపావిపాకంచేత జ్ఞానములు మేల్కొని తెలివి పొందిన ధ్రువుడు కనులు తెరచి లోకమోహనమైన శ్రీమహావిష్ణువు దివ్యతేజస్సును కన్నులారా వీక్షించి పరమానందభరితుడై, "పరంధామా! అనేకానేక జన్మల పుణ్యఫలం రాశీభవించి నిన్ను కనుగొనే పరమభాగ్యం ప్రాప్తించింది. నీ చిన్మయాకృతిని నోరారా వర్ణించుకోవడానికి నాకు మాటలు రావడం లేదు. నిష్కళంకమై, సత్యభూషణమైన వాక్కును అనుగ్రహించు" అని కోరాడు. ఆ బాలభక్తుని భక్తితాత్పర్యాలకు విముగ్ధుడై మాధవుడు పరమ పవిత్రమైన ఉపనిషన్మంత్రాల చేత పరిష్కృతమై, సుస్వరమై, సువర్ణోజ్జ్వలమైన పాంచజన్యశంఖాన్ని అతని శిరస్సుపై క్షణకాలం పాటు ఉంచాడు.

శ్రీపాంచజన్యస్పర్శతో ధ్రువునికి అనశ్వరమైన వాగ్విభూతి కలిగింది. బ్రహ్మాదులకు అగమ్యమైన శ్రీమన్నారాయణ తత్త్వ వివేకం కలిగింది. స్వచ్ఛమై, మహాప్రకాశమయమైన వాఙ్మయోక్తులతో ప్రభువు లీలావిలాసాలను తనివితీరా స్తుతించాడు.

పరంధాముడు ఆనందతుందిల హృదయారవిందుడై ఇలా అన్నాడు:

ధ్రువుని పూర్వవృత్తాంతం

"భక్తచూడామణీ! పావనమైన ఈ భక్తిసంస్కారం నీకు ఒకనాటిది కాదు. జన్మ జన్మాంతరాల నుంచి అబ్బిన సుగంధం. నీవు పూర్వజన్మలో బ్రాహ్మణుడవు. శైశవంలోనే ఉపవీతుడివై

వేదశాస్త్రాలను సాంగోపాంగంగా అధ్యయన చేశావు. తల్లిదండ్రులను ప్రత్యక్షదైవాలుగా ఆరాధించి, వివేకవంతుడివై, నిరంతరమూ ఏకాగ్రచిత్తంతో నన్ను ధ్యానిస్తూ ఉండేవాడివి.

ఒకప్పుడు నీకు అమితైశ్వర్యవంతుడు, రూపసి, యౌవనుడూ అయిన రాజన్యునితో చెలిమి కలిగింది. అతని భోగభాగ్యాలను చూసి 'నాకూ అటువంటి ప్రభుత్వం ఉంటే బాగుండును' అనుకొన్నావు నువ్వు.

'బ్రతుకంటే కులమూ, ఐశ్వర్యమూ కలవాడిదే బ్రతుకు. అవి లేని జీవితం గవ్వకు సాటిరాదు' అని నీవు కోరావు. ఆ కారణంచేత ఉత్తమమైన స్వాయంభువ మనువు వంశంలో నీకు పుట్టుక కలిగింది. నా యందలి భక్తి నీకు పూర్వజన్మ సంస్కారంగా వెన్నంటి వచ్చింది. అస్తోకమైన పుణ్యాన్ని ఆర్జించావు. నీకు ఫల మాసన్నమయే శుభతరుణం వచ్చింది.

దేవతలు, గ్రహాలు, నక్షత్రాలు, సప్తమహర్షులకన్నా సమున్నతమైన ధ్రువపదం ఒకటి ఉన్నది. ఆ దివ్యస్థానంలో నువ్వు ధ్రువనక్షత్రరూపాన్ని వహించి నీ తల్లితో కలిసి కల్పపర్యంతం చిరస్థాయిగా విలసిల్లు. కల్పాంతసమయంలో నీకు చావు పుట్టుకలు లేని అనశ్వర మోక్షపదాన్ని అనుగ్రహిస్తాను."

అని పలికి జనార్దనుడు ధ్రువునికి అభీష్టవరాన్ని ప్రసాదించాడు.

ఆ తర్వాత ధ్రువుని దేవ దానవ యక్ష గంధర్వలోక వాసులందరూ వేయినోళ్ల వినుతించారు. అతను సూర్యమండలానికి వెళ్లి సూర్యకృతనీరాజనా లందుకొన్నాడు. చంద్రునివద్దకేగి సంభావనలు పొందాడు. నక్షత్రమండలానికి వెళ్లి నక్షత్రరూపులై ఉన్న పుణ్యాత్ముల పూజ లందుకొన్నాడు. బుధ మండలానికి వెళ్లి గౌరవాలు స్వీకరించాడు. అక్కడి నుంచి శుక్రస్థానానికి, అంగారక దేశానికి,

బృహస్పతి, శనిమండలాలకూ వెళ్లి తేజస్సును పొంది సమున్నతమైన ధ్రువపదానికి వెళ్లి శాశ్వతికానందాన్ని పొందాడు.

పరమ శుభదాయకమైన ఈ ధ్రువచరిత్రాన్ని విన్నవారికి, చదివినవారికి, వ్రాసినవారికి విష్ణుమహిమ పట్ల అచంచలవిశ్వాసం, నిశ్చలభక్తి కలిగి చిరసౌఖ్యం ప్రాప్తిస్తుంది.

ధ్రువ వంశం

కళ్యాణోచిత వయస్సు రాగానే ధ్రువుడు ధర్మపరిపాలనార్థం శంభువు పాణిగ్రహణం చేసి గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ఆ దంపతులకు శ్లిష్టి, భవ్యుడు అని ఇద్దరు కుమారులు కలిగారు. శ్లిష్టి సుచ్ఛాయ అనే సౌందర్యవతిని పెండ్లాడాడు. కొంతకాలానికి వారికి స్వాయంభువ మనువు వలె మహాబలశాలి, నిర్వక్రపరాక్రమశాలి అయిన రిపుడు జన్మించి షోడశకళాపరిపూర్ణుడైన చంద్రునిలాగా సంపూర్ణవృద్ధిని గడించాడు. క్రమేణ శ్లిష్టికి రిపుంజయుడు, విప్రుడు, వృకలుడు, వృకతేజుడు ఉదయించారు. శైశవంలో క్షత్రియోచిత విద్య లన్నింటినీ స్వాయత్తం చేసికొని, యౌవనం రాగానే ఇంద్రియ భోగ పరంపరను యథావిధిగా అనుభవించి, వార్ధకంలో మునివృత్తిని స్వీకరించేనాటికి శ్లిష్టి కొడుకులందరికీ పెళ్లిళ్లు చేసి తన బాధ్యతలను నిరాక్షేపణీయంగా నిర్వర్తించాడు. పెద్దకొడుకు రిపుడికి బృహతి యందు చాక్షుషుడు, అతనికి వరుణదేవుని వంశంలో జన్మించిన పుష్కరిణి గర్భంలో చాక్షుషమనువూ పుట్టారు. చాక్షుష మనువు వైరాజప్రజాపతి కుమార్తె నవలను చెట్టపట్టి పెక్కుమంది సంతానాన్ని పొందాడు. వారిలో ఊరుడు, పూరుడు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యవాక్కు, కవి, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అభిమన్యుడు అభివర్ణనీయ రూపగుణశీలాలు కలిగి తల్లిదండ్రులకు కడుపు పంటగా పెరిగి పెద్దవారయ్యారు. చాక్షుష

మనువు జ్యేష్ఠసుతుడు ఆగ్నేయి కరగ్రహణం చేసి చిరకాలం దాంపత్యసుఖాలను అనుభవించాడు. ఆ దంపతులకు అంగుడు, సుమనసుడు, స్వాతి, క్రతువు, అంగిరసుడు, శిబి జన్మించారు. అంగుడు మృత్యువు కుమార్తె సునీథను వివాహం చేసుకొన్నాడు. స్వాయంభువ మన్వంతరంలో శాశ్వతికయశస్సును పొందిన రాజన్యులలో ఈ భార్యాభర్తలకు కలిగిన వేనుడు అతి సుప్రసిద్ధుడు. అతని చరిత్ర వర్ణనీయ సన్నివేశ నిరంతరాయితం, శ్రీవిష్ణు మహిమలాభంచేత సుపవిత్రం.

వేనుని కుడిభుజాన్ని మహర్షివరేణ్యులు మథించగా ఉదయించిన పృథుచక్రవర్తి భూమండలాన్ని నిరాఘాటంగా పరిపాలించి తన రాజ్యప్రజలకు సుఖశాంతులను ప్రసాదించి, ధర్మస్థాపనం చేశాడు.''

అని ఉపక్రమించిన ఆచార్యదేవుని వాక్ప్రవాహవేగానికి చెలియలికట్ట నిలుపుతూ శిష్యప్రవరుడు మైత్రేయుడు—

''గురువతంసా! శ్రవణీయమైన ఆ వేనుని కథనూ, అనంతరీయ పృథుచక్రవర్తి చరిత్రాన్నీ కూడా వినిపించి నన్ను కృతార్థుని చేయండి'' అని వినమ్రుడై అర్థించాడు.

పరాశరమౌని వక్ష్యమాణప్రసంగాన్ని ఈ విధంగా కొనసాగించాడు—

వేనుని చరిత్ర

అంగ మహారాజు మృత్యువు కుమార్తె సునీథను వివాహం చేసికొని చిరకాలం ధర్మసంయుతపథంలో ప్రజానురంజకంగా రాజ్యాన్ని పరిపాలించి తన వంశపు కీర్తిప్రతిష్ఠలను భూమిపైని స్థిరంగా పాదుకొల్పాడు. ఆ దంపతులకు వేనుడు జన్మించి యుక్త వయసు ప్రాపించేనాటికి విద్యాభ్యాసం పూర్తిచేసుకొని, లోకాను

భవం గడించి తండ్రికి తగ్గ తనయు డనిపించుకొన్నాడు. తనచే నిర్వర్తనీయాలైన లౌకిక బాధ్యతలన్నీ సమగ్రంగా నిర్వర్తించి, అంగుడు తన సుతునికి సామ్రాజ్య కళ్యాణమంత్రాలతో పట్టాభిషేకం చేసి వానప్రస్థం స్వీకరించి భార్యాసమేతంగా అరణ్యాలకు వినిర్గమించాడు.

రాజ్యభోగాలు సంప్రాపించి, ఏకాతపత్రమైన అధికారం చేతికి వచ్చేసరికి వేనుడికి గర్వాతిరేకం ఉదయించింది. ఐశ్వర్యమదం పెచ్చరిల్లి స్మృతిశాస్త్రవిధులను కాలదన్ని ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తన తండ్రితాతలు ఆదరించి దానం చేసిన అగ్రహారాలను అల్లకల్లోలం చేసివేశాడు. వారిపై ఎన్నడూ లేని పన్నులు విధించి అన్యాయార్జితమైన ఆ ధనాన్ని చీకటిదారుల లోకి మళ్లించాడు. వేదవేదాంతాలను స్వానుభవంలో ప్రసన్నం కావించుకొని ధర్మపరులైన విద్వాంసులు ఎక్కడెక్కడ నెల కొన్నారో గాలించి పట్టుకొని వారిని దేశంనుంచి వెళ్లగొట్టాడు. ముక్కుపచ్చలారని లేత వయస్సులో మహాఋషులకు కూడా సాధ్యం కాని లోకాశ్చర్యకర తపస్సు చేసి సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువును సాక్షాత్కరింపజేసికొని ధన్యుడైన మహాభక్తుడు ధ్రువుని వంశంలో జన్మించానన్న ఇంగితం కూడా లేకుండా వేనుడు విష్ణుభక్తులను హింసించి, పాషండవృత్తులను వ్యాపింపజేశాడు. జారులూ చోరులూ ఆచారహీనులూ అయిన దుష్టజనులను ప్రోత్సహించి, వారి కపట ప్రశంసలకు పొంగిపోయి అమాయకులైన ప్రజలను చిత్రహింసలు పెట్టాడు.

కాలం గడిచే కొద్దీ వేనుడు ప్రజలకు మరింత మరింతగా దూరమైపోయాడు. చతురంభోధిపరీత భూవలయ సామ్రాజ్యైక నాయకుడినని అహంకరించి తానే సర్వమూ అని ప్రచారం కొనసాగించాడు. తన చుట్టూ చేరి పొగడ్తల వర్షం కురిపించని సాధుజను

లను కారాగారం పాలు చేశాడు. పెద్దవాళ్లూ, పూజనీయులు, బంధువులు, ఆశ్రితులు—అన్న వివేకం కోల్పోయి ఆచరింపరాని అపచారాలకు పూనుకొన్నాడు. కాదన్నవారిని ఖాతరు పెట్టక పాతర వేశాడు.

ఈ కైవడిని వేనుని దురాగతాలను సహింపలేక సామాన్యులు పంటపొలాలనూ, ఆస్తిపాస్తులనూ తెగనమ్ముకొని దేశాంతరాలకు వెళ్లిపోయారు. నేల తలపొలాలదాకా క్షామం వ్యాపించింది.

ఆ శోచనీయతరుణంలో కొంతమంది మునివరులు గుండె చేసుకొని, 'ఈ పాపవర్తనం వలన కలుగబోయే లోకవినాశాన్ని మనం తప్పించాలి—ధర్మగుణాన్ని కలిగించి వేనునికి పశ్చాత్తాపం ఏర్పడేటట్లుగా తగిన నీతులను బోధించి, సాత్త్వికమార్గానికి మళ్లించాలి'—అని నిశ్చయించి రాజు చెంతకు వెళ్లారు.

"ఓయీ! ఎటువంటి ఎటువంటి నిరుపమాన లోకాభివంద్య సుచరిత్రులైన మహనీయులు జన్మించిన పావనవంశంలో పుట్టుకను పొందావు, ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డావు, ఎంత అధోగతికి దిగజారిపోయావు!" అని వారందరూ ఆగ్రహోదగ్రులై వేనుని గర్హించి ప్రసంగించారు. "నీ పూర్వీకులను ఆదర్శంగా నిలుపుకొని, రానున్న తరాలలో నీ పేరు కలకాలం వెలుగొందే ధర్మకార్యాలను అనుష్ఠింపక ఈ దురాగతాలను సిగ్గులేకుండా తలపెట్టావు. తపస్సులను సాగనీయవు, తపస్వులను బ్రతకనీయవు. అజ్ఞులను ఆదరిస్తావు, యజ్ఞాలను చీదరిస్తావు. క్రతువులు లేక దేవతలకు ఆహుతులు అందడం లేదు. వారి దయతప్పి లోకంలో వర్షాలు లేవు. పంటలు వట్టిపోయి నేల నెరియలు పడుతున్నది. ఆకలితో శోకించే ఆర్తుల మొరాలకించని బధిరాంధుడని అందరూ నిన్ను అసహ్యించుకొంటున్నారు. ఇప్పటికైనా నీ కర్తవ్యం గుర్తించి ధర్మాన్ని మళ్లీ నెలకొల్పు. లోకాలోకాలకూ అధినాథుడైన వాసుదేవుని మనసారా

ప్రార్థించి పాపమోచనం చెందు" అని పరిపరివిధాల నచ్చజెప్పి చూశారు. "ఏ రాజ్యంలో వేదమంత్రాలను సలక్షణంగా జపించి ఋత్విజులు యజ్ఞాలను ఆచరిస్తారో ఆ రాజ్యంలో యజ్ఞపురుషుడైన శ్రీమన్నారాయణుడు స్వయంగా ప్రత్యక్షమై ఉంటాడు. ఆ పుండరీకాక్షుని ఉనికి వల్ల పుడమి మూడు పువ్వులు ఆరు కాయలుగా సర్వతోముఖాభివృద్ధిని చెందుతుంది. అనంతకళ్యాణగుణాకరుడైన శ్రీహరి ప్రసాదం సిద్ధించి నీ జన్మ చరితార్థం అవుతుంది" అని విష్ణుమహిమను వేయినోళ్లతో వెల్లడించారు. "నీకు యజ్ఞం చేసే అభినివేశం లేకపోతే, మేము ఆచరించి ఆ పుణ్యఫలాన్ని నీకు ధారపోస్తాము" అని కూడా అన్నారు.

అయినా దుర్మదోపహతుడైన వేనుడు మునీంద్రుల అనునయింపు వాక్యాలను చెవిపెట్టలేదు. పైగా వారి మాటలకు రెచ్చిపోయి—

"ఈ సృష్టిలో నాకన్నా అధికుడు మరొకడు లేడు. మీరు ముసలితనంవల్ల బుద్ధి మందగించి నా శక్తిని కనుగొనలేకుండా ఉన్నారు. నేను హరిహరబ్రహ్మల అంశవల్ల వారి ప్రతినిధిగా భూమిపైన అవతరించాను. నా ముందు మీరుచెప్పే ఆ దైవాల విలువ ఏపాటిది? నేను అన్నమాటే వేదం, నేను ఆజ్ఞాపించిందే ధర్మం" అని ప్రగల్భవచనాలు పలికాడు.

వేనుని నిందాపూరిత ప్రసంగానికి మునులందరూ కల్లోలితస్వాంతులై భయానకక్రోధులైనారు. అతని దుర్వివేకమూ, తమ పలుకులను ఆలింపని గర్వాతిరేకమూ కన్నా అతడు కావించిన విష్ణునింద వారికి కర్ణకఠోరంగా తోచింది. కన్నూ మిన్నూ కానని దురహంకారంతో నిర్నిమిత్తంగా నీరేజాక్షుని, నిఖిలాండపతిని, వాసుదేవుని తిరస్కరించిన పాపకర్మునికి రాజ్యభోగం అనర్హం. వీనిని జీవింపనిస్తే ధర్మానికి నిలువ నీడ లేకుండా చేయగలడు, అని

సంభావించి మునులు మారణమంత్రాలను ఉచ్చరించి, చేతనున్న దర్భలను దివ్యాస్త్రాలుగా పరిణమింపజేసి రాజు దేహంలో నాటారు.

ఈ విధంగా విగతజీవుడైన వేనుని కళేబరాన్ని తైలపాకం చేయించి, భూమండలాన్ని ధర్మపథంలో పరిపాలింపగల రాజుకోసం మునీంద్రులు లోకమంతా అన్వేషింపసాగారు.

వేనుడు మరణించిన మరుక్షణంలోనే ధరాతలం అరాజకం అయింది. దుర్గాధిపతులు తిరుగుబాటు చేసి ధనధాన్యాలను విచ్చలవిడిగా కొల్లగొట్టారు. శాంతిభద్రతలు లోపించి స్త్రీ బాలవృద్ధులు కడగండ్ల పాలయ్యారు.

అటువంటి విపద్వేళలో వేనుని రాజ్యం పొలిమేరల్లో ఒక పెద్ద ధూళిపటలం నేలమీది నుంచి నింగికి చెలరేగింది. 'రాజులేని రాష్ట్రాన్ని శత్రువుల బారి కాకుండా సంరక్షించుకోవడం సుశిక్షితులు కాని సామాన్యప్రజలకు ఎలా శక్యమౌతుంది?'—అని నిర్జరులను నిలదీస్తున్నట్లుగా, ఆ పెనుధూళి ఆకసాన్నంటింది. అలా నింగిమీదికి నేలపై నుంచి వస్తున్న దుమ్ము తెరలను ఒకవైపు సురలూ, నేల మీదినుంచి నింగికి లేస్తున్న పెంధూళిని మరోవైపు భూసురులూ ఆశ్చర్య చకిత మానసులై విలోకింపసాగారు. ఆ ధూళి లేచిన పరిసరాలలో ఉన్న క్షోణిదేవతలు గాలి వేగానికి నిలద్రొక్కుకొనలేక చలించి నేల కూలారు. చావగా మిగిలిన కొంతమంది బ్రాహ్మణులు రాజధాని వైపుకు పరుగులెత్తి మునీంద్రులున్న చోటికి వచ్చి జరుగుతున్న ఘోరదృశ్యాన్ని వర్ణించి చెప్పారు.

అప్పుడు మునులు అరాజకమైన ధరిత్రిని చూసి ప్రకృతి క్షోభిస్తున్నదని గ్రహించి, త్వరలో తగిన రాజును పట్టాభిషిక్తుని చేయకపోతే ప్రజానాశనం కాగలదని చింతించి, వేనుని మృత శరీరం నుంచే మరొక జీవుని ఉత్పాదిల్ల జేయాలని సంకల్పించారు.

వేదోక్తమైన ప్రాణోత్సర్గమంత్రాలను సస్వరంగా ఆలపించుతూ, వేనుని కళేబరంలో ఊరు ప్రదేశాన్ని అరణిగా చేసికొని మథియించుతూ ఒక ప్రాణమయతనువును ఆవిర్భవింపజేశారు.

కాల్చి పుటం పెట్టినట్లున్న భయానకమైన నల్లని శరీరం, తైలసంస్కారం లేక శిథిలమై లోహితవర్ణానికి తిరుగుతున్న విరబారిన వెంట్రుకలు, నాభితలాన్ని సమీపిస్తున్న బూచి గడ్డం, వికృతమైన రూపానికి సరిజోడయిన బొంగురు గొంతుకతో అర్థంలేని అస్పష్టధ్వనులను ఎలుగెత్తి కేకలు వేస్తూ ఆ నృశంసాకారం చిందులు వేయసాగింది. వక్రదంతాల నడుమ నాలుకను ఊయలవలె ఊగిసలాడించి, బానపొట్టపై చేతులువేసి భీకరంగా గోచరించిన ఆ వికృతాకృతిని పరికించి మౌనివరులు క్రూరకర్ముడైన వేనుని పాపశేషమే ఈ విధమైన ఘోరపరివేషాన్ని ధరించిందని గ్రహించారు. "నీవు నృశంసాకృతివి. రాజ్యపాలనకు యోగ్యమైన శరీరసౌష్ఠవం, బుద్ధివైభవం ఆజానజంగా నీకు లేవు. వింధ్యపర్వత సమీపంలో ఉన్న పర్వతారణ్యప్రాంతాల లోని మ్లేచ్ఛకిరాతులకు అధిపతివై శేషజీవితాన్ని గడుపు. ఈ నాటి నుంచి నీవు నిషాదుడనే పేరు అనువర్తించుగాక!" అని పలికి వారు దానిని పంపివేశారు.

ఈ విధంగా దురితరహితమైన వేనుని పునీతదేహాన్ని మళ్లీ మథనభూమికగా ప్రతిష్ఠించి మునులు అమందోత్సాహంతో ఉదాత్త అనుదాత్త స్వరిత ప్లుత స్వరావళులను ఉచ్చరించి అతిరహస్యాలైన వేదమంత్రాలను పఠిస్తూ అతని దక్షిణభుజాన్ని మళ్లీ చిలికారు.

పృథుచక్రవర్తి కథ

వైష్ణవభక్తినిధానులైన మహామునులు విశ్వరక్షణార్థం ఆచరించిన విచిత్రయాగం అనతికాలంలోనే సఫలమైంది. వేనుని దక్షిణ

భుజస్తంభారణి నుంచి సత్త్వగుణోపేతుడు, పరమధర్మశీలుడు, అజేయపరాక్రమశాలి ఐన పృథువు సముద్భవించాడు.

పృథువు జననం లోకానందజనకంగా విలసిల్లింది. ఎన్నడో అంగమహారాజు పదవీత్యాగం చేసిన తరువాత మళ్లీ ఇన్నాళ్లకు ధర్మసంస్థాపనోత్సుకుడైన రాజన్యుడు జన్మించాడని దేవతలు అమందానంద కందళిత హృదయారవిందులై పుష్పవృష్టి కురిపించారు. దిగంతాలలో దేవదుందుభులు ప్రతిధ్వనించాయి. సుర గరుడ యక్ష గంధర్వ కిన్నర కింపురుష బృందాలు ఉల్లాస నృత్యాలను ప్రదర్శించారు.

పుట్టుకతోనే సంప్రాప్తయౌవనుడైన పృథువు అవతరణకు సంతసించి అమరులు ఆతనికి ఒక అసామాన్యమైన ఖడ్గాన్ని, అభేద్యమైన కోదండాన్ని, అక్షయమైన బాణతూణీరాలను, అక్షీణమైన వజ్రకవచాన్ని శత్రువిజయోపకరణాలుగా ప్రసాదించారు. మహర్షివరుల మంత్రపూతశక్తి చేత మథింపబడిన శరీరం కలవాడైన వేనునికి నిషాదోత్పాదనంతోనే పాపశేషమంతా నశించి, ధర్మపరుడైన పుత్రుని జననంతో సద్గతులు ప్రాప్తించాయి.

మునులు అష్టోత్తరశత నదీజలాలను, తీరమృత్తికలనూ కొని తెచ్చి సువర్ణమణిపాత్రికలతో మంత్రజలాన్ని అభిషేకించి పృథు చక్రవర్తిని సింహాసనాసీనుని కావించారు. లోకానందసంధాయకమైన ఆ పట్టాభిషేకాన్ని సాక్షాత్తూ శ్రీపద్మగర్భుడే సలక్షణంగా నిర్వహించి, శ్రీహరి చక్రాన్ని అతని దక్షిణకరాన నిలిపి ఆశీర్వదించాడు. సామంత మహీపాలవర్గం సార్వభౌమునికి ఉత్సవోచిత బహుమానాలను తమ శక్తికొలది తీసుకొనివచ్చి సమర్పించారు.

లోకోత్తరమైన తన ప్రాదుర్భావం సార్థకంగా పృథువు మనుమార్గంలో రాజ్యపాలనం ప్రజాభిరంజకంగా నిర్వహించి ధర్మాన్ని

నాలుగు పాదాలా నడిపించాడు. అతని యేలుబడిలో ప్రకృతి ఆయా ఋతువులలో సహకరించి ధరణి సస్యశ్యామలం అయింది.

పాతక కృత్యాల మూలాన తేజాన్ని కోలుపోయిన లోకంలో మళ్లీ ప్రాభవాన్ని నెలకొల్పాలని చక్రవర్తి పృథుపైతామహం అనే మహాయజ్ఞాన్ని సంకల్పించాడు. అనూచానమైన వేదమంత్రాలను ఉపాసించి జీవన్ముక్తులైన ఋత్విజులను ఆహ్వానించి, తానే యజమానుడై, శాస్త్రోదితక్రమంలో పృథువు పృథుపైతామహాన్ని సాంగోపాంగంగా అనుష్ఠించాడు.

ఆ శుభతరుణంలో క్రతుహోమంలో ఆహుతిగా సమర్పించిన సంతానోదయమంత్రాల మహిమ వలన యజ్ఞవేదిక నుండి సూత మాగధులనే నామధేయాలతో ఇద్దరు శిశువులు ఉదయించారు.

అలా జనించిన ఆ శిశువుల దర్శనీయమైన ప్రసన్న తేజం, నేత్రాభిరామమైన రూపసౌందర్యం, వీణానిక్వాణం వంటి మధుర స్వనాలకు ముగ్ధులై మునిప్రవరులు వారిని ఆశీర్వదించారు. "విశ్వ శ్రేయస్సును సంకల్పించి పృథువు నిర్వహించిన మహాయజ్ఞంలో ఆవిర్భవించే మహావకాశం మీకు కలిగింది. ఏతత్పుణ్యఫలంగా చిరంజీవులై వర్ధిల్లండి. పృథువు యశోగానం చేసి ధన్యాత్ములై మెలగండి"—అని ప్రేమాదరాలతో ఆదేశించారు.

మహర్షుల ఆశీస్సులకు, సూత మాగధుల స్తోత్రపాఠాలకు యోగ్యమైన సుపథంలో జీవితాన్ని మలచుకొని పృథుచక్రవర్తి ప్రశంసనీయంగా రాజ్యపాలన చేశాడు. అనేక మహాక్రతువులను అనుష్ఠించి అతిథిమండలికి భూరిదక్షిణల నిచ్చి సర్వలోకాలనూ తనియజేశాడు.

ఈ రీతిగా ధర్మానుష్ఠాన నిష్ఠాగరిష్ఠుడై పృథుచక్రవర్తి సర్వాంసహామండలాన్ని సమర్థంగా ఏలుతున్న రోజులలో ఆశ్చర్యకరమైన ఒక ఘటన జరిగింది.

ఒకనాడు ఆకస్మికంగా పృథువు సమక్షంలోకి శోకవ్యాకుల చిత్తులై కొంతమంది ప్రజలు రుద్ధకంఠాలతో విలపించుతూ ఏతెంచారు. ఆకలి దప్పుల తీవ్రబాధకు శోషించి, నేలకు రాలిపోయే వారి దేహాలు చర్మాస్థికలు మిగిలిన జీవచ్ఛవాలలా ఉన్నాయి. వారి మనస్సులలోని దైన్యవిషాదాలను వెల్లడిస్తున్న దుఃఖాశ్రువులను చూసి చక్రవర్తి తల్లడిల్లిపోయాడు.

"ప్రభూ! లోకంలో ఎల్లెడలా దారిద్ర్యం ఘోరంగా తాండవిస్తున్నది. మా బాధలకు అంతులేదు."

"నరనాథా! ప్రకృతి బీభత్సాలు ముంచుకొని వచ్చి మా సస్యాలన్నీ వట్టిపోయాయి. పుడమి మాపైన ఎన్నడూ ఇంత క్రౌర్యాన్ని చూపలేదు."

"భూమినాయకా! నీ పాలనలో ప్రజలు కడగండ్లతో అలమటిస్తున్నారు. నేలపై ఓషధులు మొలవక అనారోగ్యంతో బాధపడుతున్న దీనులకు మందులు కూడా లభించడం లేదు."

"భూపతీ! ధన ధాన్యాలు లేవు. కరువుకాటకాలు ప్రాణాంతకంగా వ్యాపిస్తున్నాయి."

"తినడానికి అన్నం లేదు. క్షుత్పిపాసలు మమ్మల్ని దహించి వేస్తున్నాయి."

"మమ్మల్ని రక్షించమని నీ పాదాలను ఆశ్రయించడంకంటె వేరొక ఉపాయం మాకు గోచరించలేదు. శరణార్థులమై నీ సన్నిధిలోకి వచ్చాము."

—అని వారు పరిపరివిధాల విలపించగా పృథువు కన్నులు దయార్ద్రాలై, అంత ధీరోదాత్తునికీ కన్నీరు మున్నీరయింది.

"ఈ తీరున లోకంలో క్షామం నెలకొనడానికి కారణం ఈ భూదేవి. సస్యాలను ప్రజలకు అందించకపోగా ఓషధులను మాయం

చేసింది. నా పాలనలో జనులను క్షోభింపజేసిన భూదేవిని సంహరించి ఈరోజే దాని అధికారాన్ని సమాప్తం చేస్తాను.''

అని హుంకరించి పృథువు దివ్యశరాసనాన్ని గ్రహించి, నారిని సంధించి, అమ్ము చేతపూని, వింట తొడిగి, ఆకర్ణాంతం ఎక్కుపెట్టి, జ్యామోక్షణం చేయబోయాడు.

తనను సంహరించడానికి ధర్మావేశంతో వైరభావం వహించి దుర్నిరీక్ష్యుడై నిలిచిన పృథుచక్రవర్తి బాణఘాతానికి భయపడి భూదేవి గోవు రూపాన్ని ధరించి బ్రహ్మలోకానికి బయలుదేరింది. ఆమె మాయావేషాన్ని గుర్తుపట్టి పృథువు ఆగ్రహోదగ్రుడయి తన వింటి నారిని చతుర్దశ భువనాలూ ప్రకంపించేటట్లు భీకరంగా మ్రోగించాడు. తాను కూడా దివ్యవేగంతో గోస్వరూపధారిణి భూదేవిని వెన్నంటి వెళ్లసాగాడు. భూదేవి అతనిని ప్రసన్నం చేసికోవాలని శతవిధాల ప్రయత్నించింది.

''నరనాథా! క్రోధాన్ని త్యజించి, సమచిత్తంతో ఆలోచించు. నేను నీకేమి అపకారం చేశానని నాపైని ఇంత ఆగ్రహం?''

పృథువు: ''ఇంతకన్నా ఏమి అపచారం జరగాలి? భూతలం పైని సస్యోత్పాదనం లేక నా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. నిర్దయురాలివై నా వారిని క్షయింపజేసిన నిన్ను కరుణించకూడదు.''

''చక్రవర్తీ! నిర్హేతుకవైరంతో దోషవిరహిత ఐన అబలపై శస్త్రసంధానం చేస్తున్నావు. సస్యజీవనానికి ఆధారకారిణ్యైపిని హత మార్చితే భవితవ్యంలో మాత్రం ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తావు? ఆవేశంలో యుక్తాయుక్తాలను విస్మరించి నన్ను వధించడం నిష్ఫలయత్నం''.

''లేదు, నిస్సంశయంగా నువ్వు దుష్టచారిణివే. అమోఘమైన ఈ మార్గణంతో నిన్ను యమపురికి పంపి, నేటి నుంచీ దైవయోగబలంతో నేనే ఈ భూమి భారాన్ని వహిస్తాను. ప్రజలకు సస్యాలను

సమృద్ధంగా అందిస్తాను. ఆర్తులైన నా ప్రజలను సంరక్షించిన మహా పుణ్యఫలం ముందు నీవంటి పాతకిని వధించిన స్వల్పపాపం ఏపాటిది?''

అని పలికిన పృథుని రోషవచనాలను విని భయకంపిత గాత్రంతో భూదేవి ఇలా అన్నది:

''నాయనా! నిష్కారణంగా నాపై శరప్రయోగం చేసి పాతకానికి పాల్పడకు. కాలమహిమచేత లోకంలో ప్రకృతివైపరీత్యాలు సంభవించడం సహజం. లోకాల పుట్టుకకూ, నాశానికీ హేతువైన నారాయణుడే వాటి సుస్థితికికూడా ఆధారం. నీ ప్రజలకు వలసిన అన్ని సస్యాలూ, ఓషధులూ నాలో జీర్ణమై అవ్యక్త రూపంలో సజీవంగా ఉన్నాయి. ఇప్పుడు గోరూపంలో ఉన్న నాకు లేగదూడ కలిగినట్లయితే, నీవు దుగ్ధదోహనం చేసి, ఆ క్షీరాన్ని నేలపైకి పారించు. మళ్లీ ప్రళయం సంభవించే యుగాంతం దాకా పాడిపంటలు సమృద్ధంగా వెలువడుతాయి.''

భూదేవి సాంత్వనవాక్యాలతో శాంతించి పృథువు కర్తవ్యాన్ని పునరాలోచించాడు. చతుస్సముద్రముద్రితమైన ధరావలయంపైని—గోక్షీరధారలను ప్రవహింపజేయడానికి అనువైన సమతలం లేదు, అని సంభావించి అతడు ధారుణిపై ఉన్న మిట్టపల్లాలనూ, ఎత్తైన కొండప్రాంతాలనూ చదునుచేయాలని సంకల్పించాడు. అపూర్వమైన తన బాహుశక్తిసంపద నంతటినీ దక్షిణభుజంలోకి కేంద్రీకరించి, మహాబలంతో విశ్వంభరామండలంలోని సర్వపర్వతాలనూ ఒక్క పెనుప్రేటుతో కూలద్రోసి, సమస్థలాన్ని కలుగజేశాడు. ఆయా సమప్రాంతాలలో నివాసయోగ్యాలైన ప్రదేశాలను, జనపదాలను, పట్టణాలను వేరు వేరు సీమలుగా విభాగించి, మానవులకు అన్నసంపాదనకు ఉపాదేయంగా భూమిలో బహుసస్యసంపదలను నిక్షేపించాడు. అన్నివిధాల భోగభాగ్యాలకూ తగిన జీవనోపకరణాలను నేలలో దాచి ఉంచాడు.

భూదేవి కోరిన కోరిక ప్రకారం స్వాయంభువ మనువు వత్సమై వచ్చి గోవువద్ద నిలువగా పృథుచక్రవర్తి ఆమె నిండు పొదుగుల నుంచి అమృతోపమానమైన అక్షయ దుగ్ధధారలను పితికాడు. భూమి ఉపరితలంపైని ఆ పాలజాలు పారిన నేలలో పంటలు మొలకెత్తాయి. మానవసమాజం మళ్లీ సంపదభిరామంగా వర్ధిల్లింది.

పృథువు పృథుయత్నం వలన దేవతలు, దైత్యులు, కిన్నరులు, గంధర్వులు, యక్షులు, వివిధ జంతువులు—జీవజాలం అంతటికీ యథోచితమైన ఖాద్య ఖాదన భోజ్యవసతి కలిగి అతను అనేక సహస్రసహాయనాలు రాజ్యంచేసి ధర్మాన్ని రక్షించాడు.

పృథువు కరుణ మూలాన నిహతం కాకుండా మిగిలిన భూదేవికి ఆయన పేరు మీద పృథివి అనే నామాంతరం సిద్ధించింది.

ముల్లోకాలకూ అన్నదాత అయిన పృథుచక్రవర్తి పవిత్ర చరిత్రను ఆకర్ణించిన భాగ్యశాలులకు సంచితకర్మదోషాలు తొలగిపోయి, భవ్యమైన సుఖస్థితి కలుగుతుంది. వారికి పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు అశ్వమేధయాగం చేసిన మహాపుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు.''

అని పరాశరమౌని మైత్రేయునితో పలికాడు.

ప్రచేతసుల తపోదీక్ష

''కొంతకాలానికి పృథుచక్రవర్తికి ఇద్దరు సుతులు—అంతర్ధి, వార్ధి జన్మించారు. అంతర్ధికి శిఖండి గర్భంలో హావిర్ధానుడు పుట్టాడు. అతనికి అగ్ని వంశంలో పొడమిన ధిషణ అనే సౌభాగ్యవతి నిచ్చి వివాహం చేశారు. ఆ దంపతులకు కలిగిన కుమారుడు ధర్మపరతంత్రుడై వేదధర్మాన్ని కుశలంగా అనుష్ఠించిన పుణ్యశాలి. అతను యజ్ఞం చేసేటప్పుడు దర్భల అగ్రభాగాలను తూరుపు దెసకు అభిముఖంగా నిలిపినందువల్ల అతనికి ప్రాచీనబర్హి అన్న శుభ

నామం కలిగింది. ప్రాచీనబర్హి సముద్రరాజు కూతురు సౌవర్ణను పరిణయమాడి, పదిమంది సంతానాన్ని పొందాడు. వారికి ప్రచేతసులని పేరు వచ్చింది.

ప్రాచీనబర్హి పుత్రులైన ప్రచేతసులు ధనుర్వేదాన్ని సాంగోపాంగంగా ప్రయోగ ఉపసంహార పూర్వకంగా అభ్యసించి మహాయోధులని మన్నన గడించారు. మూరు తలలులేని ధర్మైక మార్గంలో తమ జీవితాలను మాననీయంగా మలచుకొని ఆత్మోన్నతిని సాధించారు.

ఒకనాడు ప్రాచీనబర్హి తన సుతులందరినీ సమక్షంలోకి చేరబిలిచి, "నాయనలారా! తల్లిదండ్రుల ఆనతిని జవదాటక మంచిని పెంచుకొని మన వంశంలో జనించిన మహాపురుషుల పేరు పెంపులకు మీరందరూ వన్నె సమకూర్చారు. మీకింక ఈ లోకంలో సాధించగలిగినదీ, ఆశించదగినదీ లేదన్నంతగా. వైరాగ్యపథంలో సౌఖ్యాన్ని ఉపార్జించారు. మీరు రక్షించిన ధర్మం మిమ్మల్ని తప్పక రక్షిస్తుంది. రాచరికపు ఈ కఠిన భారాన్ని త్యాగంచేసి, దీక్షాదక్షులై ఆర్తత్రాణపరాయణుడైన శ్రీమన్నారాయణుని సందర్శనభాగ్యం కోసమై తపస్సు చేయండి. ఆ వాసుదేవుడే మనకు ఇలవేల్పు. ఆ స్వామిని ప్రసన్నం చేసికొని, ప్రజాపతి పదవిని అర్థించి, భావికాలంలో చరాచరభూతజాతాన్ని సంకల్పసిద్ధంగా రూపొందించండి" అని ప్రబోధించాడు.

జనకుని ఆదేశాన్ని శిరసావహించి ప్రచేతసులు దక్షిణదిశకు వెళ్ళి సముద్రజలమధ్యంలో నిలిచి శ్రీమహావిష్ణువు అంఘ్రినీరేజాలను తమ హృదయపీఠికలపై స్థిరంగా పాదుకొల్పి స్వస్వరూపానుసంధానంలో ఏకాగ్రచిత్తులై పదివేల సంవత్సరాలు తపస్సు చేశారు.

ఈ తీరున ప్రగాఢధ్యానసమాధిలో ఉన్న తన భక్తవతంసుల సంకల్పదీక్షకు ప్రసన్నుడై శ్రీహరి వారి కోరిక లీడేర్చే తరుణం

ఆసన్నమైనదని గ్రహించాడు. శరద్వేళావిరాజమాన నీలమేఘ శ్యామసుందరుడు, కరధృత సుదర్శన పాంచజన్య కౌమోదకీ శార్ఙ్గ కోదండ సుదర్శనీయ తేజోవిలాసుడు, వాసుదేవుడు, తాపసమందారుడు, వైజయంతీప్రియుడు శ్రీధరుడు గరుత్మద్రథాన్ని అధిరోహించి జలమధ్యంలో ఉన్న ప్రచేతోవాసాంతికంలో ప్రత్యక్షమయ్యాడు. ప్రచేతసులు తమ పుణ్యాపరిపాకానికి, ప్రభువు కరుణాప్రసాదానికి ప్రమోదభరితమానసులై శ్రీమన్నారాయణుని దివ్య తేజాన్ని కన్నులారా వీక్షించి, ఆనందాతిరేకంతో ప్రస్తుతులను గానం చేశారు.

"పరంధామా! పరాత్పరా! జగదుత్పత్తి సుస్థితి విలయ కారకా! నిఖిలాండబ్రహ్మాండనాయకా! శుభాకారా! కరుణాపయోనిధీ! నీ దర్శన భాగ్యమే మాకు అభీష్టవరసంప్రాపణం. భవిష్యత్కల్పంలో ప్రజాపతులమై నీ సేవావిధి నిర్వర్తించుకొనే మహావకాశాన్ని మాకు ప్రసాదించు" అని వేడుకొన్నారు.

"మీరు జీవితచరమసంధ్యలో ఉన్నారు. మీకు సుతుడై పుట్టబోయే దక్షుడు రానున్న కల్పాదిమసమయంలో ప్రజాపతి పదాన్ని పొంది సృష్టికారకుడై మీ కోరికను సఫలం చేస్తాడు" అని పలికి వారి కళ్యాణపూర్తికి ఆశీర్వదించి శ్రీమహావిష్ణువు అంతర్హితుడయ్యాడు.

ప్రచేతసులు తపస్సు ముగించి వారాశిమధ్యం నుంచి వెలికి వచ్చేసరికి దేశంలో అరాచకం వ్యాపించి జనపదాలు నిర్జనాలైనాయి. పచ్చని పైరుపంటలు విలసిల్లిన ప్రాంతాలలో సాంద్రారణ్యాలు నెలకొన్నాయి. పదివేల సంవత్సరాలు రాజనందనులు లేనందున పరిపాలకులు లేక ప్రజావాసాలు భీతావహజంతువులకు

ఆటపట్టు లయ్యాయి. ఎటుచూసినా చెట్లూ పుట్టలూ గుబురుకొని అంతా అగమ్యగోచరంగా ఉన్నది.

ప్రచేతసులు తమ తపోమహిమ చేత ఒక తీవ్రఝంఝా నిలాన్ని కల్పించి జనస్థానాలకు అడ్డు నిలిచిన వృక్షమూలాలను తృటిలో పెకలించివేశారు. తమ అప్రతిమానకోపాగ్నినే సాధనం కావించి ఆ వృక్షతతిని దగ్ధం చేయడానికి ఉపక్రమించారు.

అప్పుడు దహింపబడగా మిగిలిన ఆ కొన్ని వృక్షాల అవశేషాల నుంచి వనవిభుడైన సోమదేవుడు అవతరించి క్రోధపరీతులైన ప్రచేతసులను తన చల్లని చూపుతో ఉపశమింపజేశాడు. తన కిరణాల మూలాన ఉపజీవించే తరుకదంబాన్ని సంరక్షించి సుశాంతిని కల్పించమని ఆయన వారిని ఆదేశించాడు. "శ్రీమన్నారాయణుడు దక్షప్రజాపతి జననానికై ప్రసాదించిన వరాన్ని మీరు సార్థకం చేయాలి. వివాహితులై గృహస్థాశ్రమధర్మాన్ని స్వీకరించి పాణిగృహీతీ గర్భంలో మీ దివ్యతేజాన్ని వినివేశించండి" అని వచించి శీతకిరణుడు లోకోత్తర సౌందర్యవతి ఐన ఒక కన్యాశిరోరత్నాన్ని ఆవిర్భవింపచేశాడు. "మీరు లేని సమయంలో జనసందోహాన్ని బాధించిన భూమిజాలను మీ క్రోధాగ్ని చేత దహించివేశారు. తపస్వులైన మీకు దీర్ఘకోపం సముచితం కాదు. ఈ లావణ్యరాశి మీ కొరకు మహీరుహతేజంతో అవతరించిన పుణ్యవతి. ఈమె పేరు మారిష. ఈమెను పరిణయం చేసికొన్నాక మీకు జన్మించే సుతునికి అమృతాంశుని తేజోంశ, ప్రచేతసుల తేజోంశ అమేయ శక్తిజనకాలై విభాసిల్లుతాయి" అంటున్న చంద్రుని పలుకులకు ఆశ్చర్యచకితులై ప్రచేతసులు "సుధాకరా! భూరుహాలకు ఈ జ్యోతిర్మయి జనించిన ఉదంతం మాకు అచ్చెరువు గొలుపుతున్నది. కృపాకలితుడివై మాకు ఆ గాథను సవిస్తరంగా చెప్పు" అని కుతూహలంతో అడిగారు.

మారిష జన్మవృత్తాంతం

పుణ్యాదాయకమైన శ్రీ విష్ణుపురాణాన్ని భక్తికుతూహలాలతో శ్రద్ధగా ఆకర్ణిస్తున్న మైత్రేయునికి పరాశరమౌని ప్రచేతసులకు చంద్రుడు చెప్పిన మారిష కథను ఆసాంతం వినిపిస్తున్నాడు—

"పూర్వం ఒకప్పుడు దైవజ్ఞుడైన కండుమహర్షి సాకార విష్ణుతేజాన్ని సందర్శించాలని సంకల్పించి గోమతీ నదీతీరం లోని ప్రశాంతసీమలలో చిరకాలం అతిఘోరతపస్సును ఆచరించాడు. ఆయన దీక్షాతత్పరతను చూసి అపక్షీణించిన దేవేంద్రుడు మునీంద్రుని తపస్సును భగ్నంచేయాలని సంకల్పించి ప్రమ్లోచన అనే అప్సరసను తన సమక్షానికి రావించాడు. "నీ అపురూపమైన లావణ్యంతో ఆ సంయమి చిత్తాన్ని పరవశింపజేసి కామమోహాన్ని కలిగించు. తపస్సును చెరిచి ఆయన బల వీర్య రూప ప్రజ్ఞా మేధాధనోత్సాహాలను నిర్మూలించు. ఈ కార్యంలో నీకు సహాయపడగల చెలిమికత్తెలను కూడా తోడు తీసుకొని వెళ్లు" అని ఆదేశించాడు.

సురేశ్వరుని ఆనతిని శిరసావహించి ప్రమ్లోచన గోమతీ నదీతీరంలో ఏకాంతంగా తపస్సు చేసుకొంటున్న కండువు ఆశ్రమానికి వెళ్లింది. అంతర్ముఖుడై నిశ్చలధ్యానసమాధిలో మనస్సును లయింపజేసి విగళితవేద్యాంతరమైన బ్రహ్మానందంలో ఓలలాడుతున్న ఆయన సమక్షంలో నిలువడానికి ఆమెకు ధైర్యం చాలలేదు. అయినా అనుల్లంఘనీయమైన పాకశాసనుని శాసనాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని వేకువ తొలిసంజ వెలుగుల వెల్లికలో చెలులతో కలిసి మహర్షి పరిచర్యలకు ఉపక్రమించింది.

ఆ ఉషోదయకాలంలో మలయపర్వతశిఖరాల లోని రాళ్ల దారుల మిట్టపల్లాలలో సొమ్మసిల్లి, గంధపు కొండల చరియల్లో పారుతున్న సెలయేళ్ల నిర్మల జలశీకరాలలో సేదతీర్చుకొని, నేలకు

రాలిపడిన సంపెంగ పువ్వుల నెత్తావులతో మత్తెక్కిన పిల్లగాలులు చల్లచల్లగా గోమతీనది ఒడ్డుకు తరలివచ్చాయి. కన్నులు మిరుమిట్లు గొలిపే లావణ్యలహరి ప్రమ్లోచన అప్సరసల అతిలోక శృంగార విలాస విభ్రమాలను ప్రదర్శిస్తూ నాట్యం చేసింది. తన శరీరసౌర భానికి సాటిరాకపోయినా ఎంతో అందాలొలికే మన్మథాస్త్రాలనూ మల్లెపువ్వులనూ కోసితెచ్చి ఆయన పాదాల చెంత అంజలించింది. రతిసమయంలో పరాకాష్ఠకు చేరిన శృంగారనాయిక పారవశ్యాన్ని వెల్లడించే కూజితస్వనంతో అతిమనోహరమైన సంగీతమాధుర్యాన్ని వెల్లివిరియించింది. మేఘాలమేడ నుంచి దిగివచ్చిన మెరుపు తీగ లాగా ఆయన తొడలపై కూర్చొని, మన్మథుని ఆవాసమందిరాల వలె ఉప్పొంగిన తన బింకపు పయోధరాల స్పర్శ తెలిసేటట్లు గాఢంగా ఆలింగనం చేసుకొన్నది. తన చేతివ్రేళ్లను ఆయన కరాంగు ళుల లోనికి జొనిపి బిగించి పూరేకుల వంటి ఎర్రని పెదవులతో ఆయనను చుంబించి అమృతాన్ని రుచిచూపించింది.

ప్రమ్లోచన దేవేంద్రుని ఆశయాన్ని సఫలం చేసింది. ఆమె శృంగారచేష్టలకు ఎన్నడూ లేని అపురూపమైన వింత పారవశ్యాన్ని పొంది, మదనాతురుడైన మహర్షి కన్నులు తెరిచాడు. అలౌకిక మైన బ్రహ్మానందానుభవం కోసం లౌకిక భోగాలన్నింటినీ తృణ ప్రాయంగా పరిత్యజించిన సంయమీంద్రుడు ఆ అప్సరస రూపవిభ్ర మాలకు లొంగిపోయాడు. ఆమెను కదిసి కౌగిలించుకొని ముద్దాడి ప్రేమగా లాలించి పలుకరించాడు. సురతసుఖాలతో మన్మథ రహ స్యాలను విప్పి చెప్పనిదే నేను బ్రతుకలేనని వాపోయాడు. "నీవు లేని ఊర్ధ్వలోకాలు నాకెందుకు? నీతోనే నా జీవితం. నీ ప్రేమ లోనే నాకు బ్రహ్మానందం" అని తహతహలాడాడు.

మహర్షి మనస్సులో ఉదయించిన మదనోద్రేకాన్ని గుర్తించి ప్రమ్లోచన సంతోషానికి మేరలేదు. "మీవంటి మునివరేణ్యులను

మోక్షపథాన్నుంచి భోగజీవితానికి మరల్చగలిగిన నా సౌందర్యం చరితార్థం. మీ కోరికకు అనుగుణంగా నడుచుకొని మీ సేవలో తరిస్తాను'' అని మాటయిచ్చింది.

కండువు తన తపోవనాన్ని ఉద్యానవనంగా, ఆశ్రమ ప్రాంతాన్ని రతికేళీవిశ్రమప్రాంతంగా మార్చివేసి ప్రేయసితో సురతక్రీడలలో తేలియాడుతూ యుగాలను క్షణాలుగా గడిపి వేశాడు. ఆటపాటలతో, నీటుమాటలతో, ఒకరి ఒకరు బంగారు నీడలలో శృంగారక్రీడలలో చరిస్తూ ఉండగానే వంద సంవత్సరాలు దొర్లిపోయాయి. ఇన్నాళ్లూ గడిచిన కాలాన్ని నెమరువేసుకొని అప్సరోలలామ మహర్షినుంచి సెలవుకోరింది. ''నేను దేవేంద్రుని కొలువులోని వేశ్యను. మీకు ఇంతకాలమూ ఇష్టభోగాల నందించి మనసారా సేవించుకొన్నాను. స్వర్గవాసులు నాకోసం ఎదురు చూస్తూ ఉంటారు'' అని వేడుకొన్నది. కాని కండువు అంగీకరించ లేదు. ''నీవు వచ్చి నిన్నా నేడూ కూడా అయినట్లు లేదు. ఈ సమయంలో నన్ను విడిచివెళ్లితే కాముని శరాల తాకిడిని భరించ లేక నేనేమైపోవాలి? నీవు లేనిదే ఎలా జీవిస్తాను?'' అని అన్నాడు. ఆమె ఆయన మనస్సు కనిపెట్టి మళ్లీ కొన్నాళ్లున్నది. మరి రెండు వందల సంవత్సరాలు కాగానే ఋషిని తనకు సెలవడిగింది. కండువు అంగీకరించలేదు. ఈ ప్రకారంగా పరస్పరానురాగంతో ప్రేమికులిద్దరూ ఇంపు సొంపారగా, ప్రతిక్షణమూ నిత్యవసంతంగా ప్రతి అనుభవమూ నిత్యనూతనంగా ఉల్లాసకేళీసల్లాపాలతో ఎంతో సంతోషంగా గడిపారు.

ఈ విధంగా ప్రమ్లోచనా కండువులు ఎడబాటు లేని ప్రేమార్ణవంలో మునిగి ఉండగా ఒకనాటి అపరసంధ్యవేళ కండు మహర్షి పర్ణశాల బయటికి వచ్చి సంధ్యావందనవిధికై నదీతీరానికి సన్నాహ మయ్యాడు. వేళకాని వేళలో ఇల్లు విడిచి ఈ విధంగా

ఎక్కడికి ప్రయాణమని దేవకాంత ఆయనను అడిగింది. "సాయం సంధ్య అతిక్రమించబోతున్నది. అనుష్ఠానాలు ముగించి దైవకార్యం నిర్వర్తించాలి. తాపసులకు ఆచారవిధులు తప్పి చరించడం ఉచిత కృత్యం కాదు" అని మౌనీంద్రుడు ఆమెతో పలికాడు.

దేవకాంత కన్నులలో హాసరేఖలు చిప్పిల్లాయి. దానిమ్మ గింజల వంటి తన దంతకాంతులు మిరుమిట్లు గొలిపేట్లు కిలకిలా నవ్వి, "ఓహో మహానుభావా! ఎన్నడూ లేని ఉద్యోగం మీకు నేటికి జ్ఞాపకానికి వచ్చింది. ఏమిటి విశేషం?" అని నర్మగర్భంగా వేళాకోళం చేసింది.

మహర్షికి ఆమె మాటలు అర్థం కాలేదు. "పద్మముఖీ! నేను ఈ గోమతీతీరంలో విష్ణుమూర్తిని సందర్శించాలని తపస్సుకోసం వచ్చాను. ఈ రోజు ఉదయం నేను సంధ్యాకృత్యాలు నెరవేర్చి, ఆశ్రమానికి తిరిగి వస్తుండగా నీవు ఎదురైనావు. నీతో పరిచయం ఏర్పడి, అనుబంధం వర్ధిల్లి మనం ఈ రోజంతా ఆనందంగా గడిపాము. ఇది మాపటి సంధ్య. నేను మళ్లీ జలతర్పణానికై బయలు దేరాను. ఇందులో నీవు అపహాస్యం చేయవలసిన అసంగతవిషయం ఏమున్నది?" అని ఆమెను ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"ఆర్యా! మీరు తపోదీక్షను విడిచిపెట్టి ఈ రోజు అపర సంధ్యవేళ దేవపూజకు బయలుదేరేనాటికి—సరిగ్గా తొమ్మిదివందల ఏడు సంవత్సరాల ఆరు నెలల మూడు రోజులు గడిచిపోయాయి. కామవ్యామోహంలో మునిగి మీకు రోజులు తెలియరాలేదు" అని ప్రమ్లోచన ఋషితో అన్నది.

ఆమె మాటలు విని కండుమహర్షి చకితుడై పోయాడు. "అధమభోగ్యమైన మదనజాలంలో చిక్కుకొని ఎంత విలువైన కాలం బూడిదలో పోసిన పన్నీరయిపోయింది! నీవు చెప్పినవి నమ్మదగిన మాటలేనా?" అని గుచ్చి గుచ్చి అడిగాడు. "మీరు బ్రహ్మ

జ్ఞానులు. భూతభవిష్యద్వర్తమానాలలో మీకు తెలియని సత్యాలు లేవు. యోగదృష్టితో గతాన్ని స్మరించి చూడండి'' అని అప్సరస పలికింది. కండువు ఆగ్రహోదగ్రు డయ్యాడు. ''ఓసి పాపాత్మురాలా! కపటనాటకంతో నాపైని నీ శృంగారవిలాసాలను గుప్పించి నా తపస్సును భగ్నం చేశావు. ఇది తప్పకుండా ఆ ఈర్ష్యాళువు దేవేంద్రుడు పన్నిన పన్నాగమే. నిన్నేం చేసినా పాపం లేదు. దురితకృత్యమే అయినా నీవు నాకు అంగజ సౌఖ్యాలను అందించావు. అందుచేత నిన్ను దయతో విడిచిపెడుతున్నాను. నీ ముఖం నాకు చూపించకు'' అని క్రోధావేశంతో అన్నాడు.

ఎర్రబారిన కన్నులతో, జేవురించిన మొగంతో, ప్రళయరుద్రునివలె నిప్పులు కురుస్తున్న ముని కోపాన్ని చూసి దేవకాంత పెనుగాలిలో దీపంలాగా నిలువెల్లా వణికిపోయింది. ఇంకా అక్కడే నిలిస్తే ఆ వశ్యవాక్కు శపించగలడనే భయంతో వ్యాకులపడుతూ ఆమె ఆకాశమార్గానికి ఉద్గమించబోతుండగా తొట్రుపాటు వలన, నెలలు నిండిన గర్భం జారి నేలపై పడింది. ఆమె శరీరం నుంచి ముని వీర్యం చెమట రూపంలో వెలికి పొర్లివచ్చింది. ఆ సమీపంలో మొలకెత్తిన లేత మొక్కల చిగుళ్లతో వీర్యబిందువులను తుడుచుకొంటూ ఆమె అక్కడినుంచి దేవవాసానికి వెళ్లిపోయింది. కండుముని కూడా ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టి పురుషోత్తమ తీర్థానికి వెళ్లి పరభార్యను సంగమించిన పాపకృత్యానికి ప్రాయశ్చిత్తంగా బ్రహ్మపారస్తోత్రాలను నియమనిష్ఠలతో అనుష్ఠించి, ఇంద్రియ సుఖాలను త్యజించి, బాహువులను ఊర్ధ్వముఖంగా పైకెత్తి జోడించి నిలిచి సంసారదుఃఖనివృత్తికారకుడైన పరంధాముడు శ్రీమహావిష్ణువును ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తూ మళ్లీ తపస్సు మొదలుపెట్టాడు.

ఓ ప్రచేతసులారా! ప్రమ్లోచన వెళ్ళిపోతూ దేహాన్ని తుడుచుకొన్న తరుపల్లవాలలో కండుమహర్షి వీర్యం ఉండిపోయింది. సూర్యుడు అస్తమించి రాత్రివేళ నేను ఉదయించినప్పుడు వాయువశాన చల్లనైన నా కిరణాలు సోకి, ఆ అమృతస్పర్శ వలన ఒక సుకుమారి జన్మించింది. అందుచేత ఈమె ప్రమ్లోచనా కండువులకూ, వాయువుకూ, నాకూ ఏకరీతిని కుమార్తె అవుతుంది. ఇటువంటి విచిత్రమైన పుట్టుక ముల్లోకాలలోనూ అనన్యం.

మారిష పూర్వజన్మవృత్తాంతం

ప్రాచీనబర్హి ప్రియకుమారులారా! మీ కన్నుల యెదుట దేదీప్యమాన తేజోవిలాసాలతో విలసిల్లుతున్న ఈ కోమలి మీ పాణిగ్రహణం చేసి, భవిష్యత్ప్రజాపతికి తల్లి కాగల సౌభాగ్యవతి. అందుకు నిదర్శనగా మీరు ఈమె పూర్వజన్మవృత్తాంతాన్ని కూడా సాకల్యంగా ఆకర్ణించండి—

పూర్వజన్మలో ఈమె ఒక మహారాజు భార్య. భర్త ప్రేమానురాగాలను చూరగొని, పట్టమహిషీభోగాలను అనుభవించాల్సిన ఈమెకు దైవదుర్విధి వలన అతిబాల్యవయస్సులోనే భర్త గతించి వైధవ్యం సంభవించింది. ఆనాటినుంచి ఈమె ఐహికసుఖాలను పరిత్యాగం చేసి, వైరాగ్యాన్ని అలవరచుకొని జగద్వల్లభుడైన జనార్దనుని పాదపద్మాలను నమ్ముకొని నిరంతరమూ ఆ శ్రీహరిని ఆరాధిస్తూ ఉండేది.

కొన్నాళ్ళకు ఆమె పూజలు ఫలించాయి. భక్తిగమ్యుడయిన పుండరీకాక్షుడు సాక్షాత్కరించి ఆమెను దయచూచాడు. "పతివ్రతాశిరోమణీ! నీ పుణ్యఫలం పరిపక్వమైంది. నీకేమి కావాలన్నా మనసు విప్పి అడుగు. నీ వాంఛితాన్ని నెరవేరుస్తాను" అని అభయం ప్రసాదించాడు. "లక్ష్మీవల్లభా! ఇంతకాలానికి ఈ దీనురాలిని కరు

ణించావా తండ్రీ! నా జీవితమంతా కష్టాలే. ఎటు చూసినా ఎదురు దెబ్బలే. బాల్యంలోనే భర్త గతించి ఏ సుఖానికీ నోచుకోని నన్ను కామవాంఛ దహించి వేస్తున్నది. ఈ జన్మలో అనుభవించలేక పోయిన సుఖాన్ని మరుజన్మలో నాకు పదిరెట్లు అధికంగా అనుభ వించే వరాన్ని ప్రసాదించు. అయోనిజనై పుట్టి పదుగురు పతులకు ప్రాణనాయికనై అభీష్టభోగాలను తృప్తిగా అనుభవించి, ప్రజాపతి పదవిని అధిరోహించే మహాపురుషుని కొడుకుగా కంటాను'' అని ఆమె శ్రీమన్నారాయణుని అర్థించింది.

శ్రీహరి కరుణవల్ల ఆమె ఈ జన్మలో అయోనిజగా వృక్ష తతులకు జన్మించింది. ఈమెను మీరు పరిగ్రహించండి. ఈమెవలన మీకు అనంతమహామహిమాన్వితుడైన దక్షప్రజాపతి ఉదయించి రానున్న కాలంలో అనేకానేక వంశాలకు కర్తృత్వాన్ని వహించి సృష్టికర్తయై శాశ్వతయశస్సును పొందుతాడు.''

ఈ విధంగా కర్తవ్యాన్ని ఆదేశించి చంద్రుడు ప్రచేతసు లకూ మారిషకూ శాస్త్రోక్తవిధులతో కళ్యాణం చేయించాడు. మారిష గర్భంలో ప్రచేతసులకు బ్రహ్మ తేజాన్ని సంతరించుకొని లోకారాధ్యుడైన దక్షప్రజాపతి జన్మించాడు. ఆయనే సమస్త సురాసుర జీవజాలానికి, ఈ చరాచరసర్వస్వానికీ సృష్టికర్త.''

అని అంటున్న పరాశరమహర్షిని మైత్రేయుడు—

''ఆచార్యసత్తమా! బ్రహ్మదేవుని కుడికాలి బొటనవ్రేలి నుండి అవతరించి, నవబ్రహ్మలలో ఒకడై వెలుగొందిన మహా నీయుడు దక్షప్రజాపతి ప్రచేతసులకు సుతుడై పుట్టడం ఏ విధంగా సంభవించింది? సవిస్తరంగా చెప్పండి'' అని అడిగాడు.

శిష్యుని ప్రశ్నకు సమాధానంగా పరాశరమౌని ప్రేమ భరి తంగా ఇలా పలికాడు—

“మైత్రేయా! నవబ్రహ్మలలో ఏడవవాడైన దక్షప్రజాపతి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన పద్మకల్ప వరాహాదికల్పాద్యవసానాలకు అతీతమైన ఆయుష్మంతుడు. ప్రతి మహాకల్ప ప్రారంభ సమయంలోనూ శూన్యమైన విశ్వాన్ని పునర్నిర్మించడానికి ఆ యా మన్వంతరాలలో, యుగాలలో ఒక్కొక్క ప్రజాపతి దక్షసంజ్ఞతో అవతరించి సృష్టివిలాసానికి కర్తయై భాసిల్లుతుంటాడు. వారిలో నీవు కోరిన ప్రచేతసుల పుత్రుడు దక్షప్రజాపతి సుచరిత్రాన్ని శ్రవణ పర్వంగా నీకు చెబుతున్నాను—

దక్షుని వంశాభివృద్ధి

చంద్రుని తేజోంశతో ప్రచేతసులకు జనించిన దక్షప్రజాపతి వయోవస్థాకాల విధు లన్నింటినీ నెరవేర్చి, తపస్సుకు అనువైన వైరాగ్యాన్ని కలిగినవాడై చిరకాలం ఘోరతపస్సును ఆచరించాడు. వాసుదేవుడు దక్షుని దీక్షను మెచ్చి ఆయనకు సాక్షాత్కరించి, పూర్వం ప్రచేతసులకు తాను ప్రదానం చేసిన వరానుసారం భూతసృష్టిని కావించడానికి అనుమతిని ప్రసాదించాడు.

నారాయణుని అనుజ్ఞను గైకొని దక్షప్రజాపతి అనన్య తేజో విలాసంతో అనల్పమైన కల్పనాశిల్పాన్ని సంతరించుకొని సృష్టి క్రియకు పూనుకొన్నాడు. అమృతాశనులై జరామరణాలు లేని త్రిదశులైన అనిమేష దేవతలను ముమ్మొదట సృజించి వారికి స్వర్గ లోక నివాసాన్ని కలుగజేశాడు. నరశరీరులూ, హయగ్రీవులూ, వీణాధరులూ అయిన కిన్నరులను, గంధర్వులనూ, యక్ష రాక్షస సిద్ధ సాధ్య భూత పిశాచ భూచర ఖేచర గణాలను, మృగాలు, పక్షులు, పాములు మొదలైన సచరాచర భూతజాతాన్ని వినిర్మించాడు. మానవులను కల్పించి వారిని భూమండలంపై నిలిపి అన్నోదకాలను, చిరాయువునూ ప్రసాదించాడు. ప్రకృతిశక్తులనూ, గ్రహ

తారకానక్షత్ర ఖగోళాలనూ, దృశ్యాదృశ్య వస్తుజాతాన్నీ ఉప కల్పించాడు. ఇంత విస్తారమైన ప్రమాణంలో భూతసృష్టి చేసినా ఆయనకు తృప్తి కలుగలేదు.

దక్షప్రజాపతి సృజించిన జీవులన్నీ అపూర్వాలై నానావ్యతో దర్శనీయంగా రూపుదిద్దుకొన్నా, సృష్టికర్త ప్రమేయం లేకుండా ప్రజావృద్ధి జరగలేదు. ఈ విధంగా లోకం స్తబ్ధం కావడానికి హేతువు ప్రాణులకు మిథునకర్మ లేకపోవడమే నని ఆయన గ్రహించాడు. వరుణప్రజాపతి కుమార్తె అసిక్నిని చేపట్టి ఆమెయందు సంతానకామాన్ని కలిగి దాంపత్యధర్మాన్ని నిర్వర్తించాడు. ఆ మిథునానికి హర్యశ్వాలనే పేరుగల అయిదువేలమంది కొడుకులు కలిగారు.

దక్షప్రజాపతి తన కొడుకు లందరికీ అమోఘమైన వీర్యసంపదను, ప్రజాపతిత్వశక్తిని అనుగ్రహించి, వారందరూ పెండ్లిండ్లు చేసుకొని సంతానాన్ని పొందాలని నియమించాడు. ఈ విధంగా బ్రహ్మకు దీటుగా ప్రతిసృష్టి చేస్తున్న ఆయన మహాశక్తికి విఘ్నాన్ని ఆపాదింప దలచి ఒకరోజు బ్రహ్మమానసపుత్రు డైన నారదమహర్షి హర్యశ్వాల దగ్గరకు వెళ్లి—

"నాయనలారా! లోకంలో సుఖభోగం ఏనాటికీ శాశ్వతం కాదు. నశ్వరమైన ఈ జీవితాన్ని క్షణికసుఖాల కోసం వ్యర్థం చేయడాన్ని ప్రాజ్ఞు లంగీకరించరు" అని ప్రసంగించాడు.

"మీకు నిజంగా సౌందర్యదర్శనాభిలాష ఉంటే మీ దృష్టిని రమణీరమణీయ శరీరాల కన్నా మనోజ్ఞమైన విషయాల వైపులకు మళ్లించండి. మీ తండ్రి నిర్మించిన ఈ బ్రహ్మాండంలో ఎన్నెన్ని వింతలు దాగి ఉన్నాయి! ఈ లోకోత్తర వైభవాన్ని కన్నుల పంటగా చూడకుండానే మీరు కాలాన్ని గడిపివేస్తున్నారు. ఈ విశ్వమంతా పర్యటించి జగత్తుల అంచులు చూడాల్సిన తరుణంలో

మీకు సంతానేచ్ఛలూ, కామప్రకోపమూ ఏమిటి?" అని పురికొల్పాడు.

హర్యశ్వులు నారదుని నర్మవచనాలను నమ్మి విశ్వసందర్శనానికై పరిపరి దెసలకు తరలివెళ్ళి, సముద్రం లోకి సంగమించిన పిల్లకాలువల వలె కలరూపు లేకుండా అదృశ్యమైపోయారు. ఎంత కాలం గతించినా వారి జాడ తెలియరాలేదు.

దక్షుడు కొన్నాళ్ళకు వైతరణిని చేసుకొని ఆమె యందు వేయిమంది కొడుకులను కన్నాడు. వారికి శబళాశ్వులని పేరుపెట్టి, వెనుకటివలెనే వారిని ప్రజాభివృద్ధికి నియోగించాడు.

ఈసారి కూడా నారదుడు మళ్ళీ సృష్టిక్రియకు అంతరాయాలు కల్పించాలని సంకల్పించి శబళాశ్వులకూ హర్యశ్వులతో చెప్పిన మాటలే చెప్పి ప్రలోభపెట్టాడు. దక్షప్రజాపతి ద్వితీయ సంతతివారు కూడా ఆ ప్రకారమే దిశాంతాలకు వెళ్ళి మళ్ళీ తిరిగిరాలేదు.

ఇలా ఉపర్యుపరిగా పుత్రసంతానం కడతేరుతున్నదని కోపించి దక్షప్రజాపతి ఈసారి వైతరణి గర్భంలో అరవైమంది కూతుళ్లను కని, వారిని అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశాడు.

దక్షుని పుత్రికలలో పదిమంది—విశ్వ, సాధ్య, అరుంధతి, భానవి, ముహూర్త, అరుణ, యామి, మరుద్వతి, వసువు, సంకల్పలను ధర్ముడు పెండ్లి చేసుకొన్నాడు.

దక్షుని కుమార్తెలలో అదితి, దితి, దనువు, అరిష్ట, సురస, శ్వసన, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, నిర, కద్రువ, ముని—ఈ పదముగ్గురినీ కశ్యప ప్రజాపతి వరించాడు.

ప్రజాపతి ఆత్మజాతలలో ఇరవైయేడుమంది—అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశీర్ష, ఆర్ద్ర, పునర్వసు, పుష్య, ఆశ్లేష, జనక, ఫల్గుణి, ఉత్తరఫల్గుణి, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనురాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ,

శ్రోణ, శ్రవిష్ఠ, ప్రచేతస, పూర్వప్రోష్ఠాపద, ఉత్తరప్రోష్ఠాపద, రేవతి—అనువారిని చంద్రుడు పరిణయమాడి వంశాభివృద్ధిగాంచాడు.

దక్షప్రజాపతి సుతలలో ఆరుగురిని అరిష్టనేమికి ఇచ్చారు. వారికి పదహారుమంది సంతానం. ఇద్దరిని బహుపుత్రుడు, ఇద్దరిని అంగిరసుడూ చేపట్టారు.

దక్షుని పెద్ద అల్లుడు ధర్ముని పదిమంది భార్యలలో విశ్వకు విశ్వాదేవతలు పన్నెండుమంది జన్మించారు. సాధ్యకు జనించిన సంతానానికి సాధ్యులని పేరు వచ్చింది. అరుణ అరుణ్వంతులను కన్నది. భానవికి భానుడు పుట్టాడు. ముహూర్తకు ముహూర్త దేవతలు జనించి దైవతాలుగా పరిఢవిల్లారు. మరుద్వతికి మరుద్గణాలు పుట్టారు. సంకల్పకు సంకల్పుడనే కొడుకు కలిగాడు. అరుంధతికి పృథ్వీ విషయులు జన్మించారు. వసువుకు ఎనిమిదిమంది కొడుకులు కలిగారు. వారికి అష్టవసువులని పేరు. ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధవుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అని వారి నామధేయాలు.

వసువులలో అగ్రజుడైన ఆపుడికి నలుగురు కొడుకులు—వైతండ్యుడు, శ్రముడు, శ్రాంతుడు, ధ్వని జన్మించారు.

ధ్రువునికి జనించిన కుమారుడు కాలుడు భూత భవిష్యద్వర్తమానాలను శరీరంగా ధరించి కాలస్వరూపుడై ప్రసిద్ధిని పొందాడు.

సోమునికి వర్చస్సు ఉదయించాడు. వర్చస్సు కొడుకు పేరు వర్చస్వి.

ధవుడు మెరుపుతీగవలె విభ్రమం గొలిపే సౌందర్యరాశి మనోహరను పెండ్లి చేసుకొన్నాడు. వారికి ద్రవిణుడు, హుతహవ్యుడు, శిశిరుడు, ప్రాణుడు, రమణుడు అనే పేర్లతో ఐదుగురు తనయులు జనించి అపారశక్తిసంపన్ను లయ్యారు.

అనిలుడు శివను స్వీకరించి ఆమెయందు ఇద్దరు సూనులను కన్నాడు. వారిలో మనోజవుడు మానవుల సంకల్పాలలోను, అవిజ్ఞాతగతి అనూహ్యావేగంలోను నివేశితశరీరులై చిరంజీవులయ్యారు.

అనలుని నందనుడు కుమారుడు శర స్తంబంలో ఉదయించాడు. అతనికి నలుగురు కొడుకులు: శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు, పృష్ఠజుడు.

ప్రత్యూషుడు తపోధనుడై మహర్షిపదాన్ని అలంకరించాడు. అతని సుతుడు దేవలమహర్షికి వేదవేదాంగపారగులైన క్షమావర్తుడు, మనస్వి జన్మించారు.

అష్టవసువులలో చివరివాడు ప్రభాసుడు బృహస్పతి చెల్లెలు యోగసిద్ధను చేసుకొన్నాడు. ఆ మిథునానికి శిల్పవిద్యాధిదైవతమైన విశ్వకర్మ జన్మించాడు.

విశ్వకర్మకు పెక్కుమంది సంతానం. వారిలో సంజ్ఞ, చిత్రాంగద, సురూప, బర్హిష్మతి తండ్రికి తగ్గ తనయ లనిపించుకొన్నారు.

విశ్వకర్మ కుమార్తె సంజ్ఞను సూర్యుడు వివాహం చేసుకొన్నాడు. వారికి మనువు, యముడు, యమి కలిగారు.

చాక్షుష మనువు వంశంలోని ఉత్తానపాద మహారాజు తమ్ముడు ప్రియవ్రతుడు సురూపను, బర్హిష్మతిని పెండ్లాడాడు. సురూపకు అగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, మహావీరుడు, రుక్మశుక్రుడు, ఘృతపృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవి అని పదిమంది కొడుకులూ, ఊర్జస్వతి అనే కుమార్తె జన్మించారు.

బర్హిష్మతికి ఉత్తముడు, తాపసుడు, రైవతుడు జన్మించారు.

ప్రియవ్రతుని సంతానం కూడా యుక్తవయస్సు రాగానే కళ్యాణాలు చేసుకొని వంశాంకురాలను కన్నారు.

అగ్నీధ్రుడు పూర్వచిత్తి అనే అప్సరోవనితను చేపట్టాడు. వారికి తొమ్మిదిమంది కొడుకులు: నాభి, కింపురుషుడు, హరి, ఇలావర్తుడు, రమ్యకుడు, హిరంచయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు.

వీరిలో కురువు పేరుమీదనే కురువంశాభివృద్ధి జరిగింది.

అగ్నీధ్రుని తమ్ములలో సవనుడు సునాభుని కుమార్తె సువేదను చేసుకొన్నాడు. భార్య నిండుచూలాలిగా ఉండగా సవనుడు కాలధర్మం చెందాడు.

ప్రియవ్రతమహారాజు మరణించిన తర్వాత ప్లక్షద్వీపానికి మేధాతిథి రాజయాడు. అతని కొడుకులలో శాంతహయుడు శాంతహయవర్షానికి, శిశిరుడు శిశిర వర్షానికి, సుఖోదయుడు సుఖోదయవర్షానికి, ఆనందుడు ఆనందవర్షానికి, శివుడు శివవర్షానికి, క్షేమకుడు క్షేమకవర్షానికి, ధ్రువుడు ధ్రువవర్షానికి చక్రవర్తులు.

విశ్వకర్మప్రజాపతి మూడవ కుమార్తె చిత్రాంగద సుదేవమహారాజు జ్యేష్ఠపుత్రుడు సురథుడు నైమిశారణ్యపరిసరాల్లో మృగయావినోదానికై సంచరిస్తుండగా చూసింది. వారి కన్నులు కలిసి ప్రేమికులైనారు. విశ్వకర్మకు తన కుమార్తె ప్రణయవార్త రుచింపక ఆమెను తన రాజ్యం నుంచి బహిష్కరించాడు.

విశ్వకర్మకు సురభి గర్భంలో నలుగురు కొడుకులు—అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు జన్మించారు.

త్వష్టకు తపోధనుడైన విశ్వరూపుడు కలిగాడు. ఇతనికే త్రిశిరసుడని కూడా నామాంతరం. అతనికి ఏకాదశ రుద్రులు—హరుడు, బహురూపి, త్ర్యంబకుడు, అపరాజితుడు, వృషాకపి, శంభుడు, కపర్ది, రైవతుడు, మృగవ్యాధుడు, శర్వుడు, కపాలి జన్మించారు.

కశ్యప ప్రజాపతి భార్యలలో అదితికి శక్రుడు, చక్రధరుడు జన్మించారు. చాక్షుష మన్వంతరకాలంలో తుషితులని మన్నన గడించిన పన్నెండుమంది దైవతాలు వైవస్వత మన్వంతరంలో అదితి గర్భంలో ద్వాదశాదిత్యులై జనించారు. చాక్షుష మన్వంతరంలో వీరి నామధేయాలు అర్యముడు, ధాత, త్వష్ట, పూషుడు, రవి, వివస్వంతుడు, సవిత, మిత్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు, తేజుడు అని ఉండగా నేటి కశ్యపసుతుల పేర్లు ఇవి: విష్ణువు, శక్రుడు, అర్యముడు, ధాతి, త్వష్ట, పూషుడు, వివస్వంతుడు, సవిత, మిత్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు.

దక్షుని జామాత బహుపుత్రునికి నలుగురు కుమార్తెలు—శంపాలతాంగులు కలిగారు. వారి వర్ణాలు గోధుమ, ఎరుపు, పసుపు, తెలుపు.

అంగిరస మహర్షికి రుచికుడు ఉదయించాడు. కృతాశ్వ మహర్షికి దైవపదాన్ని అధిరోహించిన పుత్రులు కలిగారు.

ఈ విధంగా శ్రీ మహావిష్ణువు వరప్రసాదంచేత ప్రజాపతి ధర్మాన్ని స్వీకరించిన దక్షప్రజాపతి వంశం తామరతంపరగా విస్తరిల్లింది.

దక్షుని వంశం : పాఠభేదాలు

[వ్యాసమహర్షి ప్రణీతమైన అష్టాదశపురాణాలలో ఏ కొన్నింటినైనా తులనాత్మకవివేకంతో అనుశీలించిన పాఠకులు వివిధ వంశానుక్రమణికలలో కనుపిస్తున్న పరస్పరవిభేదాలను ఈ సరికి గుర్తించే ఉంటారు.

పురాణాలలో విష్ణు – నారదీయ – భాగవత – గారుడ – పాద్మ – వారాహాలు శ్రీమన్నారాయణ ప్రశంసాత్మకాలు. కనుకనే వీటిలో సంవదించే కథలు అనేకం ఉన్నాయి. ఈ కథాసందర్భం చేతనే

మత్స్య - వాయు - బ్రహ్మాండ - వామన పురాణాలలో వంశాను చరిత వర్ణనలు కూడా విష్ణుపురాణంతో పెక్కుచోట్ల సరిపోలి ఉన్నాయి. లభిస్తున్న విష్ణుపురాణ లిఖితప్రతులలోనూ, ముద్రిత ప్రతులలోనూ ఈ వంశానుక్రమణికలలో ప్రసక్తించిన పేర్లలో అనేక వ్యత్యాసాలు కనబడుతున్నాయి.

పురాణప్రతుల వ్రాయసకాండ్రూ, ముద్రణ పరిష్కర్తలూ వ్రాతప్రతిలో సందేహం పొడచూపినప్పుడు ఇతర పురాణాలలో నిర్వచించిన వివరాలను యథాతథంగానో, యుక్తమని తోచిన మార్పులతోనో స్వీకరించినందువలన ఈ సమస్య మరింత జటిలం అవుతున్నది. నాకు ప్రకృతరచనలో విల్సన్ పండితుని అను వాదమూ, వెన్నెలకంటి సూరకవి ఆంధ్రీకృత విష్ణుపురాణ కావ్యమూ ప్రాయశః ఉపకరించినా, వాటిలో కూడా పరస్పరవిరుద్ధవాక్యాలు ఎన్నో తావులలో గోచరించాయి. పాఠకుల సౌకర్యం కోసం దక్ష వంశానుక్రమణికి అనుబంధంగా మరికొన్ని వివరాలను ఇక్కడ ఇస్తున్నాను—

మహావిష్ణువు నాభికమలం నుంచి బ్రహ్మ ఉదయించాడు. ఆయన నుండి ఇరవైముగ్గురు ప్రజాపతులు, మనువులు, మహర్షులు పుట్టి మానవసంతతిని విస్తరింపజేశారు.

1. వీరిలో దక్షప్రజాపతి ప్రచేతసులకు చంద్రుని తేజోంశతో జన్మించాడు. ఆయనకు అసిక్ని యందు ఐదువేలమంది హర్యశ్వులు, వేయిమంది శబలాశ్వులు, ఆ తర్వాత అరవైమంది కుమార్తెలూ కలిగారు. వీరిలో అదితి, దితి, దనువు, అరిష్ట, సురస, ఖస, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువ, ముని—కశ్యప ప్రజాపతి పత్నులైనారు. అశ్వయుక్కు, భరణి, కృత్తిక, రోహిణి, మృగ శిర, తారక, పునర్వసు, పుష్య, ఆశ్లేష, జనక, ఫల్గుణి, ఉత్తర

ఫల్గుణి, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనురాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రోణ, శ్రవిష్ఠ, ప్రచేతస, పూర్వ ప్రోష్ఠపద, ఉత్తర ప్రోష్ఠపద, రేవతి—చంద్రుని భార్యలు.

దక్షప్రజాపతికి పైని చెప్పినవారు కాక ఇంకా ఇరవై నలుగురు కుమార్తె లున్నారు. ఉత్తానపాదుని చెల్లెలు ప్రసూతి వీరికి తల్లి. వీరిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, మేధ, పుష్టి, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి అనే పదముగ్గురిని ధర్మ దేవుడు, ఖ్యాతిని భృగువు, సతిని శివుడు, సంభూతిని మరీచి, స్మృతిని అంగిరసుడు, ప్రీతిని పులస్త్యుడు, క్షమను పులహుడు, సంతతిని క్రతువు, అనసూయను అత్రి, ఊర్జను వసిష్ఠుడు, స్వాహను అగ్ని, స్వధను మనువు వివాహం చేసుకొన్నారు.

2. కశ్యప ప్రజాపతికి మొత్తం ఇరవైఒక్కమంది భార్యలు. వీరు—అదితి, దితి, దనువు, అరిష్ట, సురస, ఖస, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువ, ముని, పులోమ, కాలక, నత, దనాయువు, సింహిక, ప్రధ, విశ్వ, వినత, కపిల, ముని, కద్రువ. వీరిలో అదితికి ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు కలిగారు. దితికి హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, సింహిక జన్మించారు. దనువుకు ద్విమూర్ధుడు, శంబరుడు, అయోముఖుడు, శంకుశిరసుడు, కపిలుడు, శంకరుడు, ఏకచక్రుడు, మహాబాహువు, తారకుడు, మహాబలుడు, స్వర్భానువు, వృషపర్వుడు, పులోముడు, విప్రచిత్తి మొదలైన దానవులు పుట్టారు. సురభికి అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, ఏకాదశరుద్రులూ ఉదయించారు. వినతకు గరుత్మంతుడు, కద్రువకు శేషుడు, పురాణనాగుడు, ఆర్యకుడు, వాసుకి, కపింజరుడు, ఉగ్రకుడు, ఐరావతుడు, ఏలాపుత్రుడు, కలశపోతకుడు, తక్షకుడు, సహాముడు, సుమనసుడు, కర్కోటకుడు, నీలుడు, దధిముఖుడు, ధనంజయుడు,

అనిలుడు, విమలుడు, కాళియుడు, కల్మషుడు, పిండకుడు, మణి నాగుడు, శబలుడు, ఆప్తుడు, శౌఖుడు, పిండారకుడు, హస్తిపిండుడు, వాలి, కరవీరుడు, పీఠరకుడు, శిఖుడు, పుష్పదంష్ట్రుడు, సుముఖుడు, నిష్ఠానకుడు, బిల్వకుడు, కౌణపాశనుడు, హేమగుహుడు, బిల్వ పాండురుడు, కుఠారుడు, నహుషుడు, మృష్టాదుడు, కుంజరుడు, పింగ ళుడు, శంఖుడు, ప్రభాకరుడు, బాహ్యాకర్ణుడు, శిరాపూర్ణుడు, కుము దుడు, హస్తిపదుడు, హరిద్రకుడు, కుముదాక్షుడు, ముద్గరుడు, అప రాజితుడు, తిత్తిరి, కంబలుడు, జ్యోతికుడు, హలికుడు, అశ్వతరుడు, పన్నగుడు, కర్దముడు, కాలీకకుడు, శ్రీవహుడు, బహుమూలకుడు, వృత్తుడు, కౌరవ్యుడు, కర్కరుడు, సంవృత్తుడు, ధృతరాష్ట్రుడు, అర్కరుడు, పత్తుడు, శంఖపిండుడు, కుండోదరుడు, శంఖముఖుడు, సుబాహువు, మహోదరుడు, కూష్మాండకుడు, విరజసుడు, క్షేమ కుడు, శాలిపిండుడు మొదలైన నాగకుమారులు జన్మించారు. క్రోధ వశకు ఎనిమిదిమంది కుమార్తెలు. వారి పేర్లు—మృగి, మృగమంద, హరి, భద్రమత, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సురస, కద్రువ. తామ్రకు ఐదుమంది కూతుళ్లు జన్మించారు. వారు క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి.

3. స్వాయంభువ మనువు పధ్నాలుగురు మనువులలో మొదటి వాడు. తక్కినవారు స్వారోచిషుడు, ఔత్తమి, తామసుడు, రైవ తుడు, చాక్షుషుడు, వైవస్వతుడు, ధర్మసావర్ణి, రుద్రసావర్ణి, రౌచ్యదేవసావర్ణి, ఇంద్రసావర్ణి. స్వాయంభువమనువుకు పదిమంది సంతానం. వీరు అగ్నీధ్రుడు, అగ్నిబాహువు, మేధ, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సవనుడు, పుత్రుడు. ఇతని కాలంలోని సప్తమహర్షులు మరీచి, అంగిరసుడు, అత్రి, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, వసిష్ఠుడు.

స్వారోచిషుని కాలంలో ఔర్వుడు, స్తంభుడు, కశ్యపుడు, ప్రాణుడు, బృహస్పతి, దత్తుడు, నిశ్చ్యవనుడు సప్తఋషులు.

ఉత్తమ (ఔత్తమి) మనువు కాలంలో వసిష్ఠుని పుత్రులు రజస్సు, గోత్రుడు, ఊర్ధ్వబాహువు, సవనుడు, అనఘుడు, సుతపసుడు, శుక్రుడు, సప్తమహర్షులు.

తామసమనువు కాలంలో జ్యోతిర్మయుడు, పృథువు, కావ్యుడు, చైత్రుడు, అగ్నివనకుడు, పీవరుడు, నరుడు సప్తమహర్షులు.

రైవతమనువు కాలంలో హిరణ్యారోముడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహువు, వేదబాహువు, సుదాముడు, పరంజయుడు, మహాముని సప్తఋషులు. ఇతని కొడుకులు బాలబంధువు, సంభావ్యుడు, సత్యకుడు.

చాక్షుషమనువు కాలర్షులు సుమేధుడు, విరజుడు, హవిష్మంతుడు, ఉత్తముడు, మధువు, అతినాముడు, సహిష్ణువు. ఇతని సుతులు కురువు, పురువు, శతద్యుమ్నుడు, అభిమన్యుడు, తపస్వి, సత్యవంతుడు, శుచి, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు.

వైవస్వతమనువు కాలంలో సప్తర్షులు వసిష్ఠుడు, కశ్యపుడు, అత్రి, జమదగ్ని, గౌతముడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు. ఇతనికి ఇక్ష్వాకుడు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశువు, నృగుడు, దిష్టుడు, కరూషుడు, పృషధరుడు జన్మించారు. మహాభారతం ప్రకారం ఇతనికి వేనుడు, ధృష్ణుడు, నరిష్యంతుడు, నాభాగుడు, ఇక్ష్వాకువు, కరూషుడు, శర్యాతి, ఇళుడు, పృషధరుడు, నాభాగారిష్టుడు జన్మించారు.

సావర్ణిమనువు రానున్న యుగానికి పాలకుడు కాగలడని పురాణాల నిర్ణయం. ఇతని కొడుకులు విరజుడు, ఉర్వరీయుడు, నిర్మోకుడు. సావర్ణి కాలంలో దీప్తిమంతుడు, గాలవుడు, రాముడు,

కృపుడు, ద్రోణసుతుడు అశ్వత్థామ, పరాశరసుతుడు వ్యాసుడు, ఋష్యశృంగుడు సప్తమహర్షు లవుతారు. దేవీభాగవతం, కాశీఖండం అశ్వత్థామ భవిష్యత్కల్పంలో వేదవ్యాసుడై జన్మిస్తాడని చెబుతున్నాయి. విరోచనుని పుత్రుడు మహాబలి ఆ యుగంలో ఇంద్రుడై దేవలోకాన్ని పరిపాలిస్తాడు.

దక్షసావర్ణి కాలంలో ద్వాదశపారులు, ద్వాదశమరీచిగర్భులు, ద్వాదశ సుధర్ములు జన్మిస్తారు. ఇతని కొడుకులు ధృతకేతుడు, దీప్తికేతుడు, పంచహస్తుడు, నిరామయుడు, పృథుశ్రవుడు. ఇతని పాలన కాలంలో సవనుడు, ద్యుతిమంతుడు, భవ్యుడు, వసువు, మేధాతిథి, జ్యోతిష్మంతుడు, సత్యుడు సప్తమహాఋషులు.

బ్రహ్మసావర్ణి కాలంలో సుధాములు, విశుద్ధులు అనే పేరుగల దేవగణాలు శతసంఖ్యాకులై జన్మిస్తారు. శాంతి ఈ యుగంలో ఇంద్రపదవి నధిరోహిస్తాడు. హవిష్మంతుడు, సుకృతుడు, సత్యుడు, తపోమూర్తి, నాభాగుడు, అపరతిమౌజుడు, సత్యకేతుడు ఇతని కాలంలో సప్తర్షులు. బ్రహ్మసావర్ణి కొడుకులు పదిమందిలో సుక్షేత్రుడు, ఉత్తమౌజుడు, భూతిసేనుడు చక్రవర్తు లవుతారు.

ధర్మసావర్ణిమనువు కాలంలో విహంగములు, కామగులు, నిర్వాణరతులు అనే పేర్లుగల దేవతలు జన్మిస్తారు. వృషుడు, అగ్నితేజుడు, వపుష్మంతుడు, ఘృణి, ఆరుణి, హవిష్మంతుడు, అనఘుడు ఇతని కాలంలో సప్తర్షులు. ఇతని పుత్రులు సర్వత్రగుడు, సుధర్ముడు, దేవానీకుడు మొదలైనవారు.

రుద్రసావర్ణిమనువు కాలంలో రుద్రధాముడు ఇంద్ర పదవిని పొందుతాడు. హరితులు, రోహితులు, సుమనసులు, శుక్రమనసులు, సుపారులు అనే పేర్లుగల దేవతలు ఇతని కాలంలో ఉంటారు. తపస్వి, సుతపసుడు, తపోమూర్తి, తపోరతి, తపోధృతి, తపోద్యుతి, తపో

ధనుడు సప్తర్షులు. ఇతని కొడుకులు దేవవంతుడు, ఉపదేవుడు, దేవశ్రేష్ఠుడు.

రౌచ్యదేవసావర్ణి కాలంలో సుత్రాములు, సుకర్ములు, సుధర్ములు అనే దేవగణాలు జన్మిస్తాయి. దివస్పతి ఇంద్రుడై ప్రభవిస్తాడు. నిర్మోహుడు, తత్త్వదర్శి, నిష్ప్రకంప్యుడు, నిరుత్సుకుడు, ధృతిమంతుడు, అవ్యయుడు, సుతపసుడు ఇతని కాలంలో సప్తర్షులు. చిత్రసేనుడు, విచిత్రుడు ఇతని సుతులు.

ఇంద్రసావర్ణిమనువు కాలంలో శుచి దేవేంద్రుడౌతాడు. చాక్షుషులు, పవిత్రులు, కనిష్ఠులు, భ్రాజకులు, వాచావృద్ధులు దేవబృందాలు. అగ్నిబాహువు, శుచి, శుక్రుడు, మాగధుడు, అగ్నీధ్రుడు, యుక్తుడు, జితుడు సప్తమహర్షులు. ఉరుడు, గంభీరబుద్ధి ఇతని పుత్రులు.

4. ధర్ముడు దక్షప్రజాపతి కుమార్తెలలో శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, పుష్టి, తుష్టి, క్రియ, ఉన్నతి, బుద్ధి, మేధ, తితిక్ష, మూర్తి, హ్రీలను పెండ్లాడాడని భాగవతపురాణం; కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, బుద్ధి, లజ్జలను చేసుకొన్నాడని మహాభారతం పేర్కొంటున్నాయి. వీరు కాక ఇతని పత్నులు భాను, లంబ, కకుభ, జామి, విశ్వ, సాధ్య, మరుద్వతి, వసువు, ముహూర్త, సంకల్ప, సూనృత లున్నారు. వీరిలో ఒక్కొక్కరినుండి వేర్వేరుగా ఒక్కొక్క వంశం ప్రారంభమైంది.

5. అధర్ముని భార్య హింస. అనృతుడు, నిరుక్తి వీరి సంతతి. అన్నాచెల్లెళ్లు పెళ్లిచేసికొని భయుడు, నరకుడు, మాయ, వేదనలను కన్నారు. మాయకు మృత్యువు, వేదనకు రౌరవుని వలన దుఃఖుడు కలిగారు. మృత్యువుకు వ్యాధి, జర, క్రోధుడు కలిగారు.

6. ప్రహేతికి రాక్షసులు, హేతి జన్మించారు. హేతికి భయ గర్భంలో విద్యుత్కేశుడు, అతనికి లంకావాసులు, పాతాళవాసులు అయిన రాక్షసులూ జన్మించారు. వీరిలో లంకావాసులు రామరావణ యుద్ధంలో మరణించారు.

7. వశిష్ఠుడు తొలి జన్మలో అరుంధతిని చేసుకొని చిత్ర సేనుడు, పురోచిషుడు, విరచుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసు భృద్యానుడు, ద్యుమంతులను కన్నాడు. ద్వితీయ జన్మలో అక్ష మాలను గ్రహించి నిమి శాపంచేత నిహతుడైనాడు. మూడవ జన్మలో మిత్రావరుణుల పుత్రునిగా జన్మించాడు. ఇతనికి ఊర్జ కడుపులో రజస్సు, గోత్రుడు, ఊర్ధ్వబాహువు, సవనుడు, అనఘుడు, సుతపసుడు, శుక్రుడు జన్మించారు.

8. భృగువుకు ఖ్యాతియందు ధాత, విధాత, కవి, లక్ష్మి జన్మించారు. ధాతకు ప్రాణుడు, అతనికి ద్యుతిమంతుడు, అతనికి రాజవంతుడు కలిగారు. విధాతకు నియాతి గర్భంలో మృకండుడు, ఆయనకు మార్కండేయుడు జన్మించారు. ఉత్తరజన్మలో వరుణునికి ఉదయించిన భృగువుకు భూతుడు, చ్యవనుడు, వజ్రశీర్షుడు, శుచి, శుక్రుడు, సవనుడు పుట్టారు.

9. మరీచికి కళయందు కశ్యపుడు, పూర్ణిముడు; ఊర్ణయందు ఆరుగురు కొడుకులు జన్మించారు. ఈ ఆరుగురే పునర్జన్మలో శ్రీకృష్ణుని కన్నా ముందు దేవకీవసుదేవులకు జనించి కంసునిచే చంపబడ్డారు. మరీచికి సంభూతియందు పౌర్ణమాసుడు పుట్టాడు.

10. వినతకు అరిష్టనేమి, తార్క్ష్యుడు, అరుణుడు, గరుడుడు, అరుణి, శ్రీవారుణి జన్మించారు. సూర్యవంశీయ సగర మహారాజు అరిష్టనేమి కుమార్తె సుమతిని చేసుకొని రఘుకులానికి వంశకర్త అయ్యాడు. అరిష్టనేమికి ఇంకా పదహారుమంది సుతులు జన్మించారు.

11. హేతి తపస్సంపన్నుడై కూడా శాపగ్రస్తుడైనందున రాక్షసకులాన్ని కన్నాడు.

12. వివస్వంతుడు విశ్వకర్మ కుమార్తె సంజ్ఞను చేసికొన్నాడు. వామనపురాణం వీరే అశ్వినీదేవతలని పేర్కొనగా, మహాభారతంలో అశ్వినీదేవతలు, నాసత్యుడు, దస్రుడు వీరి సంతానమని చెప్పబడింది.

13. పృథువుకు అంతర్ధానుడు, వాది; అంతర్ధానునికి హవిర్ధానుడు, అతనికి ప్రాచీనబర్హి, శుక్రుడు, గయుడు, కృష్ణుడు, వ్రజుడు, అజినుడు జనించారు. ప్రాచీనబర్హికి ప్రచేతసులు పుట్టారు. ప్రచేతసుల భార్య మారిష అని విష్ణుపురాణం; వార్క్షి అని మహాభారతం.

14. స్థాణువుకు ఏకాదశరుద్రులు జన్మించినట్లు మహాభారత కథనం.

15. సంహ్రాదునికి ఆయుష్మంతుడు, శిబి, బాష్కలుడు కలిగారు.

16. అంగిరసునికి స్మృతియందు అనుమతి, రాక, కుహువు, సినీవాలి; ఖ్యాతియందు ఉతథ్యుడు, బృహస్పతి, సంవృత్తుడు కలిగారు. బృహస్పతి వంశంలో పావకుడు, పవమానుడు, శుచి జన్మించారు.

17. పులస్త్యునికి హవిర్భువు, ప్రీతి (ఈమెయందు దత్తోళి)· మానిని భార్యలు. మానినికి విశ్రవసుడు, అతనికి కైకసి వలన రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు, శూర్పణఖ పుట్టారు. విశ్రవసుడికి దేవవర్ణిని యందు కుబేరుడు జన్మించాడు.

18. పులహునికి క్షమయందు కర్దముడు, ఉర్వరీయుడు, సహిష్ణువు పుట్టారు.

19. క్రతువుకు సంతతియందు అరుంధతి, అరవై వేలమంది వాలఖిల్యులు జనించారు.

20. కర్దమునికి ఆకూతి యందు కపిలుడు, అతనికి గృత్సపతి, అతనికి బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు, బ్రాహ్మణునికి ధన్వంతరి, అతనికి కేతుమంతుడు, ఇత్యాదిగా జన్మించారు. కర్దముడికి పధ్నాలుగో తరంలో సత్యకేతుడు పుట్టాడు.

కర్దమునికి దేవహూతి యందు కళ, అనసూయ, అనసూయకు అత్రి, కళకు కశ్యపుడు కలిగారు.

21. అత్రికి అనసూయ యందు చంద్రుడు, దుర్వాసుడు, దత్తాత్రేయుడు జన్మించారు. దుర్వాసుని భార్య అజాముఖి. చంద్ర వంశంలో వరుసగా బుధుడు, పురూరవుడు, ఆయువు, నహుషుడు, యయాతి, శర్మిష్ఠ (ఈమె చెల్లెలు దేవయాని వలన యదు, తుర్వసు వంశాలు కలిగాయి), ఆ తర్వాత చంద్రవంశం అనంతంగా విస్తరించింది.

22. యదువుకు సహస్రజిత్తు, క్రోష్ఠ, నళ, రిపులు కలిగారు. ఇతనికి పన్నెండోతరంలో దుర్జయుడు రాజు.

23. ఇక్ష్వాకు వంశంలో అసంఖ్యాకంగా తరాలు వెలసి మహనీయులు పెక్కుమంది జన్మించారు.

ఈ విధంగా మానవసంతతి తామరతంపరగా విస్తరిల్లింది.]

ప్రహ్లాద చరిత్ర

కశ్యప ప్రజాపతికి ద్వితీయకళత్రం దితి గర్భంలో హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, వజ్రాంగుడు, సింహిక జన్మించారు. వజ్రాంగుడికి అసురాన్వయంలో ప్రాదుర్భవించిన వరాంగి నిచ్చి వివాహం చేశారు. వీరికి తారకాసురుడు పుట్టాడు.

సింహికను దైత్యరాజు విప్రచిత్తి పరిగ్రహించాడు. ఈ మిథునానికి మహాకాయుడు, మేఘవర్ణుడు, క్రూరకర్ముడూ ఐన రాహువు; తీక్ష్ణదంష్ట్రుడు, పింగళాక్షుడూ అయిన కేతువూ జన్మించి ఛాయాగ్రహాలై విలసిల్లారు.

దానవసార్వభౌము డైన హిరణ్యకశిపుడు లోకక్షయాన్ని కోరి బ్రహ్మను గూర్చి తపస్సు చేసి, ఆయనను ప్రసన్నం చేసికొని అనేక దివ్య వరాలను పొందాడు. తనవంటి మహాబలసంపన్నుడూ శక్తిమంతుడూ అతల వితల సుతల తలాతల రసాతల మహాతల పాతాళాది అధోలోకాలలోను, భూలోక భువర్లోక సువర్లోక మహర్లోక జనలోక తపోలోక సత్యలోకాలలోనూ లేడన్న గర్వంతో మదించి లోకకంటకంగా రాజ్యపాలనం మొదలుపెట్టాడు. తపోధనుల ఆశ్రమధర్మాలకు విఘ్నాలను కల్పించి, యజ్ఞయాగాలలో ఋషులు దేవతలకై సమర్పించిన ఆహుతులను తానే కైకొనసాగాడు. హవిస్సులు లేక ఆకలితో మాడి దేవతలు మనుష్యరూపంలో భూమికి దిగివచ్చి ఆకులూ అలాలూ వెతుక్కో-వలసి వచ్చింది. ప్రాణభయం వల్ల మునులు తపోవనాలను వదిలి గిరికందరాలకు పారిపోయారు. ధర్మానికి ఆదరువు నశించి ప్రజలు స్వేచ్ఛాప్రవృత్తికి, విశృంఖలవిహారాలకూ అలవాటుపడ్డారు.

హిరణ్యకశిపునికి నలుగురు కొడుకులు: ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు.

ఒకనాడు హిరణ్యకశిపుడు అమూల్యమైన మణిరత్నాలు పొదిగిన బంగారు సౌధంలో కొలువుతీరి మదిరాపానంతో మత్తెక్కి ఉన్న సమయంలో తన పెద్దకొడుకు ప్రహ్లాదుడిని సమక్షంలోకి చేరబిలిచి, ఇలా అన్నాడు—

"నాయనా! విద్యాభ్యాసం మొదలుపెట్టాక నువ్వు ఏమేమి సుభాషితాలను నేర్చుకొన్నావు? ఇంతకాలమూ గురువు నీకు బోధించిన రాజనీతి సారం ఏమిటి? నీ చేతిలో ఉన్న పుస్తకంలో ఏమని వ్రాసి తెచ్చావు? నీ విద్యలను ప్రదర్శించి అటు గురువులకూ, ఇటు నిన్ను కన్నవాళ్లకూ సంతృప్తిని కలిగించు. ఈ పేరోలగం లోని పెద్ద లందరికీ సంతోషంతో పులకోద్గమం కలిగేట్లు ఒక చక్కటి పద్యాన్ని పాడి వినిపించు."

తండ్రి మాటలకు ప్రహ్లాదుడు నయవినయాలు ఉట్టిపడే మృదు వాక్కుతో, "దానవేశ్వరా! కర్మవశాన మానవులై జన్మించిన వాళ్లకు విష్ణుసంకీర్తనం కన్నా వేరే పుణ్యకార్యం లేదు. ఇదే నేను గ్రహించిన సమస్తవిద్యలకూ సారభూతమైన సుభాషితం. విష్ణుభక్తి కన్నా వేరే రాజధర్మం లేదు. విష్ణునామజపం కంటె వేరే పాడదగిన ఉత్తమ సంగీతం లేదు" అని సమాధానం చెప్పాడు.

ప్రహ్లాదుని పలుకులు చెవులలో ములుకులై నాటుకొని హిరణ్యకశిపుడు ఉగ్రుడైనాడు. క్రోధారుణనేత్రాలలో నిప్పులను కురిపిస్తూ, గురువును చూసి, "ఇదా నువ్వు చేసిన నిర్వాహకం! పసిపిల్లవాడికి చదువు నేర్పమని నియోగిస్తే, మన వంశానికే శత్రువైన ఆ విష్ణువును గురించి నూరిపోశావు. గురువని గౌరవిస్తే కులద్రోహానికి పాల్పడ్డావు" అని మండిపడ్డాడు.

అప్పుడు రాక్షసగురువు రాజుకు నమస్కరించి, "దైత్యేశ్వరా! ఈ విషయంలో నా తప్పు ఎంతమాత్రమూ లేదు. తక్కిన విద్యార్థులకు నేర్పినట్లే నేను ఇతనికీ బోధించాలని ప్రయత్నించాను. కాని రాజకుమారుడు నేనన్న మాటలను లక్ష్యపెట్టడు. పాఠాలు కట్టిపెట్టి ముప్పూటలా విష్ణునామాన్ని జపిస్తూ ఒళ్లుమరిచి తిరుగుతుంటాడు" అని మొరపెట్టుకొన్నాడు.

అసురగురువు మాటలకు హిరణ్యకశిపుడు శాంతించి తన ప్రియనందనుని లాలించి, "నాయనా! ఆ విష్ణువు మన వంశానికి అగర్భశత్రువు. అతనివల్ల కీడు పొందనివాడు లేడు. నీవు గురువు మాటకు అనుగుణంగా వారు చెప్పినట్లు నడుచుకోవాలి. నా తర్వాత ఈ రాక్షసరాజ్యం నీది కాదా?" అని బుద్ధిచెప్పి, మళ్ళీ పాఠశాలకు పంపించివేశాడు.

ఇంటికి తిరిగివెళ్ళాక దితిజాచార్యుడు ప్రహ్లాదుడికి పరిపరి తీరుల లోకతంత్రాన్ని విశదీకరించాడు—

"కుమారా! మీ తండ్రి విష్ణునిరాసం చేశాడని సామాన్యునిగా భావించకు. ఆయన పితామహుని కోసం ఘోరతపస్సు చేసి దివ్య వరాలను పొందిన శక్తిశాలి. నా మాట విని రాక్షసుల విధి నియమాలను శ్రద్ధతో అధ్యయనించి పితరులకు ఆనందాన్ని కలిగించు" అని బుజ్జగించాడు.

ప్రహ్లాదుడు గురువు మాటలకు చలింపలేదు. కొండంత ధైర్యంతో గుండె చేసుకొని మొగమాటం లేకుండా తన అభిప్రాయాన్ని ఆయనకు వివరించి చెప్పాడు: "అయ్యా! మా తండ్రికి పట్టిన పిచ్చి మీకు కూడా పట్టినట్లుంది. ఘోరాతి ఘోరమైన కర్మపాశంలో చిక్కుకొని విముక్తిని కోరిన ముముక్షువులు శ్రీమన్నారాయణుని పాదపద్మాలను నమ్ముకొని తరిస్తుండగా ఆయనను అర్చించడం తగదని చెప్పడానికి మీరెవ్వరు? ఈ జగత్తు సృష్టి స్థితి లయాలకు ఆ పరంధాముడే మూల కారణం. అవ్యక్తమైన ప్రకృతిని, జీవాఖ్యపురుషుడిని, మహత్తత్త్వాన్ని ఆయన కాల రూపంలో తానే నియమిస్తున్నాడు. ఆయనను తనివితీరా సేవించుకొని పరమహంసలు ధన్యజీవితు లవుతున్నారు. నిత్యమూ దురిత కృత్యాలకు అలవాటుపడి పాపకర్ము లైన రాక్షసులకు పాఠాలు

బోధించి మీ బుద్ధి మందగించింది. లోకాలోకాలకూ నాయకుడైన జనార్దనుని స్వరూపజ్ఞానం లేని మీవంటి వివేకహీనుల వద్ద చదువు సాములు నాకు చేటుపాట్లతో సమానం. నాకు శ్రీహరి పదధ్యానమే సర్వస్వం.''

ప్రహ్లాదుని భక్తితత్పరతను విమర్శించే నేర్పు లేక, అతనికి పాఠాలను నేర్పలేక అసురగురువు మాటాడక ఊరుకున్నాడు.

కొన్నాళ్ళకు హిరణ్యకశిపుడు తన శతయోజన సమున్నతమైన కనక ప్రాసాదంలో అంతఃపుర స్త్రీలతో కలిసి మద్యపాన వినోదాలలో తేలియాడుతున్న వేళ ప్రహ్లాదుని పిలిపించి, అతని శిక్షణను పరీక్షించాడు. తండ్రి కట్టెదుట విష్ణుధ్యాన పరవశచిత్తంతో అర్ధనిమీలితలోచనుడై నిలిచి ప్రహ్లాదుడు అన్నాడు:

''నేను స్వర్గాపవర్గాలకు అతీతమైన శ్రీమన్నారాయణుని దివ్యసాన్నిధ్యాన్ని నా మనస్సులో కల్పించుకొని ఆయనను నిరతమూ సేవించుకొంటున్నాను. ఆ పరమాత్మ కరుణావర్షం కంటె నాకు కోరదగినది ఏదీ లేదు. రాక్షసుల పీచమడచే భక్తజన కల్పవృక్షాన్ని భజించి ధన్యుడనైన నాకు ధర్మచ్యుతుల నాస్తికనీతులూ దైతేయుల కుతంత్రాలతో పనిలేదు.''

ప్రహ్లాదుని పలుకులకు దితిజనాయకుడు నిలువెల్లా క్రోధావేశంతో కన్ను లెర్రజేసి, భయానకమైన వికటాట్టహాసంతో ''ఓరి దురాత్ముడా! పగవారి బానిసతొత్తువై కులాచారాలకు చిచ్చుపెట్టావు. తండ్రినన్న గౌరవం లేకపోగా రాజునన్న భయం కూడా లేకుండా ప్రేలుతున్నావు. సర్వలోకాలనూ బలదర్పంతో కాలిక్రింద అణిచిపెట్టిన జగన్నియంతను నన్నే ఎదిరించిన నిన్నేం చేస్తానో చూడు. నిన్ను నిలువెల్లా తెగనరికి పోగులుపెట్టినప్పుడు ఆ విష్ణువు

ప్రభావం ఎంతో నీ భక్తి విలువ ఎంతో తెలిసివస్తుంది'' అని గర్జా నిర్ఘోషాలతో హుంకరించాడు.

ఈ విధంగా పరుషవచనాలాడి హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని సర్వాంగాలనూ యమపాశాల వంటి కట్టుత్రాళ్ళతో బంధించి నానా విధాల బాధించాడు. శ్రీ గోవింద పాదారవింద భజనానందంతో మైమరచి ఉన్న బాలప్రహ్లాదుని బంధాలన్నీ శ్రీవల్లభుని కరుణవల్ల పటాపంచలైనాయి.

దైత్యనాయకుడు మండిపడి ఎనిమిది దిక్కుల నుంచీ దిగ్గజాలను తెప్పించి, వాటిచేత కొడుకును క్రూరాతిక్రూరంగా పొడిపించాడు. పుండరీకాక్షుని అక్షీణ కృపాకటాక్షంవలన భద్రదంతావళాల దంతాలు విరిగి పంతాలు తెగిపోయాయి.

యాతుధానపతి తన మహానసం నుంచి రక్కసి వంటవాళ్ళను పిలిపించి అన్నంలో విషం కలిపి తనయునికి తినిపించాడు. భగవద్ధ్యాన దివ్యామృతాన్ని పానంచేసి పావనుడైన ప్రహ్లాదునికి ఆ గరళమూ సుధాన్నమై జీర్ణమైపోయింది.

రక్షోధీశుడు కృతి అనే రాక్షసిని ప్రయోగించి సుతుని కడ తేర్చాలని సమకట్టాడు. కాని ఆశ్రితజనావనుడైన వసుదేవుని కృపావిపాకం కలిమివలన ఆ మాయాశక్తి అలవుతప్పి నిష్ఫలంగా మారింది. రాక్షసేశ్వరుడు శంబరాదులైన పెక్కుమంది రాత్రించరులచేత గాఢమైన అంధకారాన్ని కల్పింపగా సుదర్శన మంత్రాన్ని అనుష్ఠించిన ప్రహ్లాదుడు స్వయంప్రకాశమూర్తియై వెలుగొందాడు. మహాప్రళయానిలాన్ని రావించి వాయుస్తంభన కావింపగా లక్ష్మీనారాయణుని నామసంకీర్తనమే ఊపిరిగా జీవిస్తున్న ప్రహ్లాదుడు ప్రాణమయతనువై విరాజిల్లాడు. తండ్రి మాయలన్నీ తనయుని ముందు శక్తివిహీనాలైనాయి.

ఇన్ని మహాపదలు కలిగినా యజ్ఞవేదికలోని అగ్నిజ్వాల వలె తేజోమయుడై సముజ్జ్వలంగా ప్రకాశిస్తున్న ప్రహ్లాదుడు విష్ణు ధ్యానాన్ని మానలేదు.

ప్రహ్లాదుని జాగ్రత్స్వప్నాలు విష్ణుతేజోభరితాలు. ఒక్కొక్క సారి అతను పారవశ్యం చెంది పాంచభౌతిక తనువు లేనట్లే ప్రవర్తిస్తాడు. విష్ణుభక్తి నావను అధిరోహించి సంసారజలధిని తరించిన మహాత్ముల చరిత్రలను తలచుకొని తనలో తాను తన్మయత్వాన్ని పొందుతాడు. విష్ణుభక్తికి నోచుకోని భాగ్యహీనుల నిస్సారజీవితాలను చూసి నిస్పృహతో నవ్వుకొంటాడు. అతని పలుకూ తలపూ సర్వమూ విష్ణుమయం.

కొన్నాళ్లకు ప్రహ్లాదుడు ఒక వేకువజామున తండ్రివద్దకు వెళ్లి నమస్కరించి అన్నాడు—

"దైత్య సార్వభౌమా! నీవు బ్రహ్మనుంచి తిరిపెం తెచ్చుకొన్న ఈ అసురరాజ్య సంపదలను చూసుకొని మురిసిపోయి ఇదే శాశ్వతం అనుకొంటున్నావు. లోకంలో చోళవాళికే తప్ప నువ్వు వేళవాళికి కర్తవు కావు. పైగా నీకు వరాలను ప్రసాదించిన ఆ శతానందుడు కూడా శ్రీ మహావిష్ణువు నాభికమలం నుంచి ఉదయించిన వాడేనన్న విషయాన్ని విస్మరిస్తున్నావు.

తండ్రీ! విష్ణుభక్తి సంపన్నులైన మహాపురుషులు జన్మించిన ఉత్తమవంశాలు ఏ విధంగా ధన్యతను భజించాయో చదువంటి చతురత మీరిన నీకు తెలియనివి కాదు. అజ్ఞాన మోహావేశంలో ముక్తిపథాన్ని విడనాడిన నీ వంటి వివేకహీనులు సాత్త్వికులై ధర్మ పరిపాలనం చేస్తే ఎంత బాగుంటుంది!"

చిత్తపరితాప కారణాలైన ప్రహ్లాదుని పలుకులతో చమురు చల్లిన మంటలా కోపం రెట్టించి తోకతొక్కిన త్రాచులా ఎగిరిపడి

హిరణ్యకశిపుడు తత్క్షణమే పౌలోముడు, కాలకేయుడు, విప్రచిత్తి, రాహువు మొదలైన మహారాక్షసులను పిలిచి, "ఈ దౌర్భాగ్యుణ్ణి కాలపాశాలతో కట్టి సముద్రంలోకి విసిరి కడతేర్చండి. వీడు నా కంట పడటానికి వీల్లేదు" అని ఆజ్ఞాపించాడు.

రాక్షసయోధులు ప్రహ్లాదుని కాలసర్పాలతో గట్టిగా బంధించి సముద్రంలోకి విసిరిపారేశారు. అతని మృతకళేబరం మళ్ళీ పైకి తేలకుండా నూరేసి యోజనాల ప్రమాణం కలిగిన మహా పర్వతాలను పెకలించి తెచ్చి పైన నిలవరించారు.

పరమ భాగవతాగ్రేసరుడైన ప్రహ్లాదుడు వారి దుశ్చర్యలకు చలింపక శ్రీమన్నారాయణమూర్తిని, ఆదిదేవుని, లోకాధిపతిని, వాసుదేవుని, శతపత్రదళవిశాలనేత్రుని, కౌస్తుభ రత్నాలంకారుని, శ్రీహరిని తన హృదయసద్మంలో నిలిపి నిబిడమైన భక్తి భావంతో చేతులు జోడించి జలమధ్యంలో నిలిచి జలధిశాయిని ప్రార్థించాడు.

అప్పుడు విష్ణుభక్తునికి జరుగుతున్న ఘోరాన్యాయాన్ని చూసి సంక్షోభించి, సముద్రుడు ఉప్పొంగి తన తరంగ డోలికల మధ్య నిలిపి ప్రహ్లాదుని క్షేమంగా ఒడ్డుకు చేర్చాడు.

ఇన్ని ఉపద్రవాలను అవలీలగా ఎదురుకొని ముక్తుడై విలసిల్లిన బాలభక్తుని మందహాస సుందరవదనారవిందాన్ని చూసి జీవజాలం ఈతడే శ్రీమన్నారాయణుని అవతారమని జేజేలు పలికింది.

పుండరీకాక్షుని సాక్షాత్కారం

ఈ విధంగా వాసుదేవుని కరుణాప్రసాదం వలన కడలి వెలువడిన ప్రహ్లాదుడు భక్తిపూర్వకంగా కన్నులు మూసికొని, ఆత్మ సన్నిధిలో నెలవుకొన్న శ్రీహరిని ధ్యానించి, సాకారవిష్ణుతేజాన్ని భావవీథిలో దర్శించి, వేయినోళ్ళతో ప్రస్తుతించాడు. అప్పుడు

అతని భక్తిపరిపాకానికి ముగ్ధుడై శతకోటి సూర్యప్రభాభాసమాన నయనాభిరామ తేజోవిలాసుడు, పరిపూర్యమాణ పాంచజన్యనాద బ్రహ్మానందమయుడు, రమావల్లభుడు, శౌరి ప్రహ్లాదునికి సాక్షాత్కరించాడు.

కోటి కోటి మన్మథుల సౌందర్యం రాశీభవించిన పరమానంద స్వరూపుడు, తళుకొత్తే వెన్నెలరేకుల వంటి కలువకన్నులు, వేద నాదాలు రవళించే పసిడి మువ్వల మించుటందెలు, మేలి కడాని జరీ అంచుల పైడి వలువలు, కట్టాణి ముత్యాల కుచ్చు కటారి, కటి మీద వయ్యారపు నట్టువకాని భంగిమలో శృంగార తరంగితంగా నిలిపిన కేలు, వేరొక కేలు ముంగిటి భక్తులకు పెన్నిధానమై వెల సిన అభయముద్రతో చెలువొందగా — చెంగల్వ పూదండ, ఇంపులు గులుకుతున్న కెంపులు పొదిగిన కౌస్తుభ రత్నహారం, గొజ్జంగినీట మజ్జనమాడి గుబాళిస్తున్న తట్టుపునుగు మైపూత, కుడిరొమ్మపై నిగనిగని మచ్చ, భుజకీర్తులు, బాహుపురులు, తాయెతులు, మకర కుండలాలు, మణికిరీటం, ముత్తెపునామం, మొగపుల మొలనూలు, బొడ్డుమానికం, భుజగభూషలు, పుత్తడి జన్నిదం కంటికి నిండుగా తాల్చిన వేలుపు ప్రహ్లాదునికి సాక్షాత్కరించాడు.

నారాయణుడు, పంకేరుహనేత్రుడు, వాసుదేవుడు, శ్రీవల్ల భుడు, నిత్యుడు, పరమాత్మ, నిర్వికారుడు, శుద్ధస్వరూపుడు, జగ ద్హితుడు, గురుధర్మమూర్తి, బ్రహ్మణ్యదేవుడు, పరమపావనుడు, సదైకరూపుడు, సనకాదియోగీంద్ర సన్నుతుడు, గోవిందుడు, త్రిగుణ విరహితుడు, దురితనిరసనుడు, శ్రీహృషీకేశుడు, కేశవుడు దయతో ప్రహ్లాదుని మ్రోల సాక్షాత్కరించాడు.

అలా ప్రత్యక్షమైన తన దైవాన్ని విప్పారిన కళ్లతో కన్ను లారా చూసుకొని, ఆనందబాష్పాలు చెక్కిళ్ళపైకి జారుతుండగా,

కంఠం డగ్గుత్తికపోయి ప్రహ్లాదుడు ఇందిరామందిరునికి సాష్టాంగదండ ప్రణామం చేశాడు. శ్రీహరి అతనిని చేరువకు లాలించి, చెక్కిళ్లను పుణికి ప్రేమతో అన్నాడు—

"ప్రహ్లాదా! నీవు తండ్రి కల్పించిన మహాపదలకు చలింపక, భక్తిశిఖరాలను అధిరోహించావు. ఎన్ని కష్టాలు వచ్చినా నన్నే నమ్ముకొని, అపూర్వమైన నీ పుణ్యసంపదతో నాకు ప్రీతిని కలుగ జేశావు. వయస్సులో చిన్నవాడివైనా నీవు వెల్లడించిన అచంచల విశ్వాసాన్ని నిర్భరభక్తిభావాన్ని పరికించి నేను విముగ్ధుడనైనాను. నీ అభీష్ట వరాన్ని కోరుకో."

అని పలికిన దేవదేవునితో ప్రహ్లాదుడు, "విభూ! జననం మొదలుకొని ఈనాటి దాకా నీ దర్శనం కోసం పరితపించిన నాకు నీ దర్శనభాగ్యాన్ని ప్రసాదించావు. నాకింక అభిలషణీయ వరం ఏదీ లేదు. రాబోయే కాలంలో నేను ఎన్నెన్ని జన్మలలో ఏయే విధంగా జన్మిస్తానో, అప్పటి కాలగతులెలా ఉంటాయో తెలియదు. స్వామీ! భావిజన్మ లన్నింటిలోనూ నాకు నీయందు నిశ్చలమైన భక్తిభావాన్ని, నీ పాదసరోజాలను సేవించుకొనే మహావకాశాన్ని అనుగ్రహించు" అని ప్రార్థించాడు.

ప్రహ్లాదుని కోరికకు పరితుష్టుడై శ్రీహరి, "నాయనా! నీవు సామాన్యుడవు కావు. నాతో స్వస్వరూపాను సంధానం కావించు కొన్న మహాభక్తుడివి. పాపనిలయమైన రాక్షస వంశంలో జన్మించి కూడా వైష్ణవోత్తముడవై అలరారిన నీ పుణ్యకథ ముముక్షువులకు మార్గదర్శకంగా, మేలుబంతిగా వెలుగొందగలదు. నీ జన్మదోషా లన్నీ పరిభుక్తాలైనాయి. నీకు మోక్షమే కాని పునర్జన్మ లేదు. అందుచేత నీ అభీష్ట వరాన్ని అడుగు" అని దయానురాగాలు ధ్వనించే కంఠస్వరంతో పలికాడు.

శ్రీనిలయుని ప్రేమభావానికి సంతసించి ప్రహ్లాదుడు, "దేవా! నా తండ్రి జన్మదోషం వలన సంప్రాపించిన దుర్మతితో నీతో వైరం పూని అనేక పాతకకృత్యాలు చేశాడు. లోకాలకు కూడా ఆయన పాపకర్మల వలన కంటగింపు కలిగింది. ఉత్తుంగమైన హిమాలయ శిఖరాలలో జన్మించి నేలకు దిగివచ్చిన స్వచ్ఛ శీతల జలప్రవాహమూ, చండాల కులంలో జన్మించిన భాగ్యహీనుని ఇంటి ముందర పారిన వాననీళ్ల మురికి కాలువా పరమ పవిత్రమైన భాగీరథీ తోయంలో ప్రవేశించి పుణ్యజలాలు ఐనట్లు నీ సన్నిధానంలోని ఆత్మజ్ఞానికీ పాపాత్మునికీ కూడా మోక్షం లభిస్తున్నది. భక్తరక్షణ పరాయణుడవైన నీకు ఆయన మనస్సు మార్చి ధర్మపరుని చేయడం అసాధ్యం కాదు" అని కోరాడు.

ప్రహ్లాదుని కోరికను కాదనలేక వైకుంఠమందిరుడు అతని తండ్రిని పుణ్యశీలునిగా మార్చి, మోక్షపదాన్ని తప్పక ప్రసాదించ గలనని మాట యిచ్చాడు. "నీవు నీ తండ్రి కోసమై అర్థించావు, నీ కొరకు ఏదైనా అడుగు" అని ఆదేశించాడు. "నాకు నీయందలి భక్తిసంపద తప్ప అన్యభోగాల అక్కర లేదు. ధర్మార్థ కామ మోక్షాల నొసగే సర్వకర్మల లోనూ, సర్వకాలాల లోనూ నీ యందలి భక్తిని అనుగ్రహించు" అని ప్రహ్లాదు డడిగాడు.

శ్రీమహావిష్ణువు ప్రహ్లాదునికి కైవల్యపదాన్ని అనుగ్రహించి, ఇష్టభోగాలను పరిపూర్ణించి అంతర్ధాన మయాడు. ప్రహ్లాదుడు ఇంటికి తిరిగివెళ్లి తండ్రికి ప్రణమిల్లి నిలిచాడు. అప్పుడు కనక కశిపుడు సత్త్వోదయం కలిగి, ప్రహ్లాదుని పుత్రోత్సాహంతో కౌగి లించుకొన్నాడు. "నాయనా! నావల్ల పడరాని పాట్లు పడ్డావు. శ్రీపతి మహిమను గుర్తించలేని అజ్ఞానినై నిన్ను చిత్రహింసలు

పెట్టాను. ఆ శౌరి దయవల్ల నీవు చెక్కుచెదరక నిలిచావు. నాకదే మహాభాగ్యం'' అని సుఖాతిశయాన్ని పొందాడు.

హిరణ్యకశిపుడు ఈ విధంగా అనేక వేల సంవత్సరాలు ధర్మపరిపాలనం చేసి జనరంజకుడనిపించుకొన్నాడు. మునుల శాపం తగిలిన తనకు ఈ జన్మలో విష్ణుసాయుజ్యం సంప్రాపించే భాగ్యం లేదని, అందుచేత తనకు జన్మావసానం లభిస్తే బాగుంటుందనీ ఎంతగానో ఎదురుచూశాడు. చివరికి మరణాన్ని ఆకాంక్షించి తన సత్త్వాన్ని అణచి, రజోగుణాన్ని ఉద్రేకింపజేసి శ్రీహరితో మళ్ళీ కలహం పెట్టుకొన్నాడు.

అప్పుడు హిరణ్యకశిపుని సభామంటపస్తంభం నుండి శ్రీ మహావిష్ణువు దుర్నిరీక్ష్యమైన మహాతేజంతో ఉగ్రనరసింహుడై అవతరించాడు. సచరాచర భూతజాతానికి భీతిగొలిపే భయంకరాకృతితో హిరణ్యకశిపునికి సాక్షాత్కరించి అతనిని సంహరించి మోక్షపదాన్ని అనుగ్రహించాడు. దానవ సామ్రాజ్యానికి ప్రహ్లాదుని రాజును చేసి, మహనీయసంపదలను ప్రసాదించి, కర్మశేషం తీరాక జీవమోక్షాన్ని అనుగ్రహించాడు.

భగవద్భక్తి పరాయణుడైన ప్రహ్లాదుడు దైత్యలోకాన్ని ధర్మమార్గానికి పరివర్తింపజేశాడు. సర్వామోదకరంగా రాజ్యాన్ని పరిపాలించి విశ్వంలో వైష్ణవభక్తిని శాశ్వతీకరించాడు.

భాగవతాగ్రేసరుడైన ప్రహ్లాదుని దివ్యచరిత్రం భక్తి ముక్తిదాయకం.

ఈ భవ్యగాథను అష్టమినాడు, ద్వాదశి, అమావాస్య, పౌర్ణమి దినాలలో భక్తినైవేద్యపూర్వకంగా పఠించిన పుణ్యాత్ములకు అభీష్టసిద్ధులు కలుగుతాయి.

భూదానం, గోదానం చేసిన మహాఫలం లభిస్తుంది.'' అని ప్రహ్లాద చరిత్రాన్ని మైత్రేయునికి సవిస్తరంగా ఉపదేశించి పరాశర మహర్షి అనంతరీయ వృత్తాంతాన్ని వివరిస్తున్నాడు:

''ప్రహ్లాదునికి విరోచనుడు, ఆయుష్మంతుడు, శిబి, బాష్కలుడు అని నలుగురు పుత్రులు ఉదయించారు. వారిలో విరోచన మహారాజుకు బలి జన్మించాడు. బలికి బాణాసురుడు మొదలుగా గల నూరుమంది రాక్షసులు పుట్టారు.

ప్రహ్లాదుని వంశం పుత్రపౌత్రప్రాచుర్యంతో అనంతముఖంగా విస్తరించింది. నివాతకవచు లనే రాక్షసులు మూడుకోట్ల మంది జనించారు.

హిరణ్యకశిపుని పెద్దతమ్ముడు హిరణ్యాక్షుడికి ఝర్ఝరి, శకుని, భూతసంతాపనుడు, మహానాగుడు, మహాభాగుడు, కాలనాభుడు పుట్టారు.

కశ్యప ప్రజాపతి మూడవ భార్య దనువుకు వైశ్వానరుడు, ద్విమూర్ధుడు, శంకరుడు, శంకుశిరుడు, అయోముఖుడు, కపిలుడు, సంవరుడు, ఏకచక్రుడు, మహాబలుడైన తారకుడు, స్వర్భానుడు, వృషపర్వుడు, పులోముడు, విప్రచిత్తి అను పేర్లతో పదముగ్గురు సంతానం కలిగారు. వీరందరూ దానవలోకంలో విఖ్యాతిని గడించిన వారే.

స్వర్భానువుకు ప్రభ జన్మించింది. ఆమె తర్వాత వృషపర్వునికి పుట్టిన కూతురు శర్మిష్ఠను యయాతికిచ్చి వివాహం చేశారు.

వృషపర్వుడికి ఇంకా ఉపదానవి, హయశిరుడూ అని ఒక కూతురు, కొడుకూ పుట్టారు.

వైశ్వానరుడికి ఇద్దరు కుమార్తెలు, పులోమ—కాలిక. ఆ యిద్దరూ మరీచి భార్యలు. వారికి అరవై వేలమంది పిల్లలు కలి

గారు. తల్లు లిద్దరి దగ్గరా సమప్రేమతో పెరిగినందున వారికి పౌలోములనీ, కాలకేయులనీ పేరు వచ్చింది. అతి భయానకరూపులై క్రూరచర్యు లైనందున వారిని నిష్కరుణులని కూడా వ్యవహరిస్తారు.

విప్రచిత్తికి సింహిక గర్భంలో వ్యంశుడు, శల్యుడు, నభుడు, వాతాపి, నముచి, ఇల్వలుడు, ఖస్రిముడు, అంజకుడు, నరకుడు, కాలనాభుడు, స్వర్భానుడు, వక్త్రయోధి అని పన్నెండు మంది పుట్టారు.

ప్రహ్లాదుని జననం చేత పవిత్రీకృతమైన దైత్యవంశం ఇమ్మడి ముమ్మడిగా పెరిగి, వేలాదిగా లక్షలాదిగా విస్తరించింది.

కశ్యప ప్రజాపతి వలన తామ్రకు ఆరుగురు కూతుళ్లు : శుకి, శ్యేని, భాసి, సుగ్రీవి, శుచి, గృధ్ర.

శుకికి పక్షిసంతానం కలిగింది. చిలుకలు, గుడ్లగూబలు, గుడ్లగూబలకు శత్రువులైన కాకులూ పుట్టాయి.

శ్యేనికి డేగలు, ఆ తరువాత పావురాలు జన్మించాయి.

భాసికి గబ్బిలాలు పుట్టాయి. శుచికి నీటిపక్షులు; సుగ్రీవికి గుర్రాలు, నిప్పుకోళ్లు, గాడిదలు పుట్టాయి.

కశ్యపుని భార్య వినతకు గరుత్మంతుడు, సుపర్ణుడు జన్మించారు. వీరిలో గరుడుడు పక్షికులానికి రాజై, సర్పభోజనుడై జీవించాడు.

సురసకు వేయిమంది సర్పసంతానం కలిగింది. వారందరూ అనేక ముఖులూ, ఆకాశగమనులూ అయ్యారు.

కద్రువకు మహాబలిష్ఠులై బహుముఖాలు గల వేయిమంది అనిలాశనులు జన్మించారు. వీరిలో శేషుడు, వాసుకి, తక్షకుడు, శంఖుడు, శ్వేతుడు, మహాపద్ముడు, కంబళుడు, అశ్వతరుడు, ఏలాపుత్రుడు, నాగుడు, కర్కోటకుడు, ధనంజయుడు మొదలైన విష

నాగులు సుప్రసిద్ధులు. కద్రువ కొడుకులలో పెక్కుమంది గరుత్మంతుని వలన నిహతు లయ్యారు.

క్రోధవశకు క్రోధముఖాలు, నిశితమైన కోరలు గల క్రూర జంతుజాలం ఆవిర్భవించింది.

సురభికి గోవులూ, మహిషాలూ; ఇరకు లతలూ, తృణ జాతులూ; ఖసకు కామరూపు లయిన యక్షులు, రాక్షసులు; మునికి అప్సరోగణాలూ పుట్టాయి. అరిష్టకు అతి సౌందర్యవంతులైన గంధర్వులు జన్మించారు.

కశ్యప ప్రజాపతికి ఈ విధంగా వందలు వేల సంఖ్యలలో పుత్ర పౌత్రాంతరంగా వంశాభివృద్ధి జరిగింది. వారందరూ నేల నాలుగు చెరగులకూ పర్యటించి ఆవాసాలను ఏర్పరచుకొన్నారు. లోకాలలో వారికి ఆవశ్యకమైన స్థావర జంగమాలు వెలిసి భూత సృష్టి పరిపూర్ణమై విలసిల్లింది.

మైత్రేయా! పరమమైన శాంతికి నిధానం శ్రీమన్నారాయణుడు తన రాజసగుణం చేత స్వారోచిష మన్వంతరంలో ఏర్పరించిన సృష్టి విలాసాన్ని నీకు సవిస్తరంగా వివరించాను.

అదితినందను డైన దేవేంద్రుడు తన మహావిక్రమంతోనూ, భీషణ వజ్రధారల చేతనూ దైత్యసంఘాన్ని పరాస్తం చేసి కడ తేరుస్తూ వచ్చాడు. చెట్టంత కొడుకులు తన కన్నుల యెదుటనే కూలిపోతుంటే చూసి గర్భశోకంతో కుమిలిపోతున్నా, దితి కశ్యప ప్రజాపతికి భక్తితో సేవావిధులు నిర్వర్తిస్తూనే వచ్చింది. చివరికి సపత్నులు కూడా ఆమె భర్త్రనురాగానికి అచ్చెరు వందారు.

ఆ తర్వాత వైవస్వత మన్వంతరం వచ్చింది. కశ్యప ప్రజాపతి తన భార్య భక్త్యతిశయాన్ని, సేవాహేవాకాన్ని వీక్షించి,

ప్రీతస్వాంతుడై, నీ అభీష్టవరాన్ని కోరుకొమ్మని—దితిని ఆదేశించాడు.

అప్పుడామె "స్వామీ! ఇన్ని వేల సంవత్సరాలుగా నా పుత్రులను వధించి భరింపరాని దుఃఖాన్ని నాకు కలిగించిన ఆ దేవేంద్రుని సంహరించి, శచీదేవితో కలిసి ఇంద్రపదవిని అధిష్ఠింప గల ఒక మహాబలుని నాకు కొడుకుగా ప్రసాదించండి" అని వినమ్రంగా వేడుకొన్నది.

కశ్యప ప్రజాపతి దితికి ఆమె కోరిన వరాన్ని అనుగ్రహించి, "నీ గర్భంలో నివేశించిన ఈ అండాన్ని నీవు నూరు సంవత్సరాలు కాపాడుకోవాలి. గర్భవతివై ఉన్న సమయంలో నీ శరీరావయవాలను మలినం కానీయక, అమిత శుద్ధంగా ఆచారవతివై మెలగాలి. వ్రతభంగమైనదా, నీ గర్భం అంతరిస్తుంది" అని వచించి, తపస్సుకై వనసీమల కేగాడు.

ఈ విధంగా పుత్రదానం కావించి కశ్యపుడు నిష్క్రమించిన కొన్నాళ్లకు దితి గర్భం ధరించింది.

ఈ వార్తను కనిపెట్టి దేవేంద్రుడు తన పదవిని స్థిరంగా నిలబెట్టుకోవడం కోసం సవతి తల్లి సంతానాన్ని చంపివేయాలని నిశ్చయించాడు. దితి ఇంటికి వెళ్లి అతి వినయంతో నమస్కరించి, అనురాగం ఒలకబోస్తూ చుట్టరికాలు కలిపాడు. అతని కల్లబొల్లి మాటలు నిజమేనని విశ్వసించి, అతని సేవలన్నీ తనమీది ప్రేమతోనే నని నమ్మి ఆమె మోసపోయింది. పుత్రప్రేమతో దేవేంద్రుని ఆదరించి ఇంటనే నిలిపివేసింది. చూస్తూ ఉండగానే తొంభై తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకనాటి మధ్యాహ్నం దితి భోజనం చేసి, చేతులు కడుగుకొన్నాక పాదప్రక్షాళనం చేసుకోవడం మరచిపోయింది. జుట్టు

విరబోసుకొని, భుక్తాయాసంతో మేను వాల్చి నిద్రకొరిగిన సమయం చూసి దేవేంద్రుడు ఆమె గర్భంలోకి ప్రవేశించాడు.

అనాచారదోషం వల్ల వ్రతభంగం జరిగితే గర్భవిచ్ఛిత్తి కలుగుతుందని కశ్యప ప్రజాపతి చెప్పిన మాట నిజం అయింది.

దితి గర్భాశయంలో ఊపిరి పోసుకొంటున్న శిశువు ఆగంతకుని చూసి బిగ్గరగా రోదింపసాగాడు. ఇంద్రుడతనితో 'మా రోదీః మా రోదీః' (ఏడవకు, ఏడవకు) అని బుజ్జగిస్తూనే, వజ్రాయుధాన్నెత్తి శిశువు దేహాన్ని ఏడు ముక్కలుగా నరికివేశాడు. ఆ ఏడింటినీ మళ్లీ ఏడేసి తునియలుగా ఖండించి, ఆగర్భశత్రువు మరణానికి సంతోషిస్తూ యథాస్థానానికి వెళ్లిపోయాడు.

దితి గర్భంలో ఉన్న ఖండాలు దేవేంద్రుడు ఆశించినట్లు మరణించలేదు. నూరు సంవత్సరాలూ నిండగానే ఆమె నలభై తొమ్మిది మంది కొడుకులను కన్నది. దేవేంద్రుడు 'మా రోదీః' అని పలుకరించినందు వలన వారికి మరుద్గణాలని పేరువచ్చింది. జననానికి పూర్వమే ఇంద్రదర్శనం చేసిన పుణ్యం వలన వారు సాత్త్వికులై దేవతలకు సహాయంగా మెంపొందారు.

అధిపతుల నియమనం

వేనుని కొడుకు పృథుచక్రవర్తిని మునులు సింహాసనంపై అధిరోహించిన నాటినుంచి, బ్రహ్మ లోకంలో ఒక్కొక్క కార్యానికి ఒక్కొక్క అధికారిని ప్రత్యేకంగా నియమించాడు. చంద్రుని అధిపతిగా చేసి, అతనికి గ్రహాలు నక్షత్రాలు విప్రులు వృక్షాలు లతాలు నికుంజాలు తపస్సులూ యజ్ఞాలకు ఆధిపత్యాన్ని ప్రసాదించాడు. భూమిని పరిపాలించే రాజులకు వైశ్రవణుడైన కుబేరుని, జలాలకు వరుణదేవుని, ఆదిత్యులకు ఇంద్రానుజుడైన విష్ణువును నియమించాడు. అష్టవసువులకు పావకాగ్నిని, ప్రజాపతులకు దక్ష

ప్రజాపతిని, మరుద్గణాలకు వాసవుడిని, మునీంద్రులకు కపిలమహర్షిని, దైత్య దానవులకు (దితికి, దనువుకు కశ్యప ప్రజాపతి వల్ల జనించిన సంతానం) ప్రహ్లాదుడినీ అధిపతులను చేశాడు. యముడు పితృగణాలకు, ఐరావతం ఏనుగులకూ, గరుత్మంతుడు పక్షులకు, వాసుకి మహా సర్పాలకు, ఉచ్చైశ్రవం గుర్రాలకు, వృషభం గోవులకు, కేసరి మృగాలకు, వనస్పతులకు ప్లక్షం, పర్వతాలకు హిమాలయం బ్రహ్మ దయవల్ల ఆధిపత్యాన్ని పొంది జాత్యభివృద్ధిని అవిచ్ఛిన్నంగా కొనసాగించారు.

మైత్రేయా! ఈ విధంగా విష్ణుని అంశావతారాలుగా జన్మించి ఆధిపత్యాన్ని వహించిన ఈ అందరి పరిపాలన విశేషాలను గురించి, ఒక్కొక్కరి జీవిత సన్నివేశాలను గురించి సమీక్షా రూపంలో లఘుతరంగా చెప్పడం నలువకూ, వేయినోళ్ల చిలువకూ కూడా సాధ్యం కాదు.

నాయనా! ఈ సృష్టి సామస్త్యమూ వాసుదేవుని లీలా విలాసమే. చరాచరాల ఉనికి, కలిమి లేములు ఆయన ఆజ్ఞావశవర్తులే. ఈ కాలస్వరూప మంతా ఆయన మహిమాతిశయమే. ఉత్తరాయణ దక్షిణాయనాలు, పాడ్యమి విదియ తదియ చవితి పంచమి షష్ఠి సప్తమి అష్టమి నవమి దశమి ఏకాదశి ద్వాదశి త్రయోదశి చతుర్దశి పౌర్ణమి అమావాస్యలు, శుక్లపక్ష కృష్ణ పక్షాలు, చైత్ర వైశాఖ జ్యేష్ఠ ఆషాఢ శ్రావణ భాద్రపద ఆశ్వయుజ కార్తిక మార్గశిర పుష్య మాఘ ఫాల్గుణ మాసాలు, ప్రభవాది సంవత్సరాలు, కళలు, క్షణాలు, కాష్ఠలు, నిమేషాదులైన కాలం — ఆయన అభివ్యక్తరూపాలే. ఈ అనంతబ్రహ్మాండమూ, సప్తద్వీపాలు, సమస్త నదులూ సాగరాలతో కూడిన ప్రకృతి సర్వస్వం ఆయనకు జ్ఞాపికగా తేజరిల్లుతున్నది. దేవతలు దానవులు

నరులు కిన్నరులు గరుడులు గంధర్వులు యక్షులు రాక్షసులు మొదలుగా గల జీవజాలం ఆ పరాత్పరుని కరుణకు నిదర్శనం. సద్గురువు నుండి ఉపదేశపూర్వకంగా గ్రహించిన అధ్యాత్మ విద్యలు, ధర్మ పరిరక్షణకై లోక సమర్పణశీలంతో ఆచరించే మహాయజ్ఞాలు, బ్రహ్మానందానుభవానికై విరక్తిపథంలోనికి ప్రవేశించి అనుష్ఠించే జపాలు, తపస్సులు — ఈ అన్నింటిలో పఠించదగిన సాంగోపాంగ సరహస్య మంత్రవాఙ్మయం సర్వస్వమూ వాసుదేవుని అనంతశక్తిని శబ్దరూపంలో నిరూపిస్తున్నది. పంచభూతాలు, తన్మాత్రగుణాలు, కర్మేంద్రియ బుద్ధీంద్రియాలు మొదలుగా గల సచరాచర ప్రపంచం శ్రీమన్నారాయణుని దివ్యకృపాధీనం. ఋగ్యజుస్సామాథర్వణాలైన నాలుగు వేదాలు, వేదాంతరహస్యాలు, నీతిశాస్త్రాలు, మన్వాదులు నియమించిన ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఉపపురాణాలు, అనువాకాలు, కావ్యాలాపాలు, సంగీతాది విద్యలు, అరవైనాలుగు వ్రతాలు, వ్రతకల్పాలు, మూర్తామూర్తాలు అన్నీ ఆ పురుషోత్తముని మూర్తిభేదాలై వెలుగొందుతున్నాయి.

శ్రీమహావిష్ణువు సర్వాత్మలకూ అధిదైవతం. ఆయనను నమ్ముకొన్నవారికి ఆపదలు లేవు. నిర్మలచిత్తంతో ఆ మహానుభావుని ఆరాధించిన భక్తులకు పాపాలు నశించి, కర్మాంతంలో భగవంతుని సాయుజ్యభాగ్యం కలుగుతుంది.

ఈ పురాణాన్ని భక్తిశ్రద్ధలతో ఆకర్ణించిన పుణ్యచరితులకు కార్తీకమాసంలో వైష్ణవ వ్రతాన్ని పన్నెండు సంవత్సరాలు నియమనిష్ఠలతో ఆచరించి, పుష్కరిణిలో తీర్థస్నానం చేసిన మహాఫలం లభిస్తుంది.''

అని పరాశరమహర్షి శ్రీ విష్ణుమాహాత్మ్యాన్ని అభినుతించాడు.

విష్ణు పురాణము

ద్వితీయ భాగం

గురుదేవుని రమ్యకథనాన్ని తన్మయంగా వింటున్న మైత్రేయుడు, "మునిసత్తమా! వైవస్వత మనువు పుత్రులలో యశోవంతుడైన ఉత్తానపాదుని అన్వయక్రమాన్ని నాకు మనోభిరామంగా విశదీకరించారు. అతని తమ్ముడు ప్రియవ్రతుని వంశాభివృద్ధి గాథను, ఆయన కొడుకులకు జన్మించిన రాజుల పుణ్యచరిత్రలనూ పురాణించి చెప్పండి" అని ప్రార్థించాడు. సకల విద్యాధురంధరుడైన పరాశరమౌని అతను కోరిన విశేషాలను సవిస్తరంగా చెప్పాడు.

ప్రియవ్రతుని వంశానుచరితం

స్వాయంభువమనువు చిన్నకొడుకు ప్రియవ్రత మహారాజుకు యుక్తవయస్సు రాగానే అతనికి కర్దమ ప్రజాపతి కుమార్తె కామ్యను ఇచ్చి వివాహం చేశారు. ఆ దంపతులకు ఇద్దరు కూతుళ్లు— సామ్రాజ్ఞి, కుక్షి; పదిమంది కొడుకులు—ఆగ్నీధ్రుడు, మేధాతిథి, వపుష్మంతుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సవనుడు, మేధుడు, అగ్నిబాహుడు, పుత్రుడు జన్మించారు.

ప్రియవ్రతుని వంశంలో అనితరపూర్వమైన దైవీశక్తి అనంతముఖీనంగా నెలకొన్నది. ఆయన కుమారులలో మేధుడు, అగ్నిబాహువు, పుత్రుడు బాల్యాదపి వైరాగ్యసంపన్నులై విభాసిల్లారు. వారు తమ పూర్వజన్మానుభవాలను జ్ఞానదృష్టితో గ్రహించి, ఐహిక

భోగాలను పరిత్యజించి యోగబలం వల్ల మోక్షపదాన్ని అధిరోహించారు.

వార్ధక్యం రాగానే ప్రియవ్రతుడు తనకు కాలం ఆసన్నమైనదన్న అభిజ్ఞానంతో కొడుకులకు రాజ్యాన్ని సమవిభక్తంగా పంచి, వారికి పట్టాభిషేకం చేశాడు. తన కుమారసప్తకంలో ఆగ్నీధ్రునికి జంబూద్వీపాన్ని, మేధాతిథికి ప్లక్షద్వీపాన్ని, వపుష్మంతుడికి శాల్మలద్వీపాన్ని, జ్యోతిష్మంతునికి కుశద్వీపాన్ని, ద్యుతిమంతునికి క్రౌంచద్వీపాన్ని, హవ్యునికి శాకద్వీపాన్ని, సవనునికి పుష్కరద్వీపాన్ని ఇచ్చాడు. వారందరూ అపార శౌర్యవిక్రమాలతో రిపుదుర్నిరీక్ష్యంగా ధర్మపాలనం చేసి ఇంద్రసన్నిభులని కీర్తిపొందారు.

జంబూద్వీపాధిపతి ఆగ్నీధ్రమహారాజుకు దీప్తిమంతులు, సుగుణోపేతులు, ధర్మతత్పరులూ ఐన తొమ్మిదిమంది కొడుకులు — నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యుడు, హిరణ్వంతుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు — జన్మించారు. కొడుకులకు యుక్తవయస్సు రాగానే ఆగ్నీధ్రుడు జంబూద్వీపాన్ని తొమ్మిది భాగాలుగా విభజించి వారికి సమానంగా పంచియిచ్చాడు. హిమవత్పర్వతానికి దక్షిణాభిముఖంగా ఉన్న హిమవర్షాన్ని నాభికి, హేమకూట వర్షాన్ని కింపురుషునికి, నిషధరాజ్యాన్ని హరివర్షునికి ఇచ్చాడు. మేరుపర్వతాన్ని ఆవరించి నాలుగు దెసల లోనూ వ్యాప్తమైన విశాల సామ్రాజ్యాన్ని ఇలావృతునికి, మేరుపర్వత నీల పర్వతాల మధ్యభాగంలో విస్తరిల్లిన భూమి భాగాన్ని రమ్యునికి దత్తం చేశాడు. రమ్యుని సామ్రాజ్యానికి ఉత్తరదిశలో శ్వేతవర్షాన్ని హిరణ్వంతునికి ఇచ్చాడు. శృంగవన్నగాల సదేశాన్ని కురువుకు, మేరుపర్వతానికి పశ్చిమదిశలో వ్యాపించిన ప్రదేశాన్ని

భద్రాశ్వునికీ అప్పగించాడు. కేతుమాలునికి గంధమాదనదేశాన్ని ఇచ్చి రాజ్యవసతులను సమకూర్చాడు.

ఈ విధంగా సువిశాలమైన జంబూద్వీపాన్ని తన సుతులకు సంక్రమింపజేసి ఆగ్నీధ్రుడు వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ఆత్మజు లందరి వద్దా సెలవు తీసుకొని, తపోదీక్ష వహించి సాలగ్రామ తీర్థానికి వెళ్ళిపోయాడు.

హిమవర్షానికి రాజైన నాభి కొంతకాలానికి మేరుకాంతను వివాహం చేసుకొని ఆమెయందు పుత్రసంతానాన్ని పొందాడు. నాభి కొడుకు ఋషభునికి నూరుమంది కొడుకులు జన్మించారు. వారిలో అగ్రజునికి భరతుడని పేరుపెట్టారు.

కొంతకాలానికి నాభి తన తండ్రితాతల వలెనే నశ్వరమైన భోగజీవితం పట్ల విరక్తి కలిగి, శాశ్వతికమైన మోక్షపదవిని అభిలషించాడు. పెద్దకొడుకుకు రాజ్యాన్ని అప్పజెప్పి వేంకటాద్రి మీదుగా దక్షిణదేశంలోని పులస్త్యబ్రహ్మ ఆశ్రమానికి వెళ్ళాడు. వానప్రస్థవిధిలో అనేక శతాబ్దాలు నిలిచి, నైమిత్తిక కర్మానుష్ఠానాలను విడిచిపెట్టాడు. నగ్నదేహుడై ఇంద్రియోల్బణాన్ని అణిచి, వీరోద్రేకంతో అవధూతయై దివ్యజ్ఞానాన్ని పొందాడు.

భరతుడు నిఖిలభూమండలాన్ని ఏకాతపత్రంగా పరిపాలించి, దేశంలో ధర్మాన్ని సుస్థిరంగా పాదుకొల్పాడు. అజాతశత్రువైన అతని పాలనలో మహర్షుల యజ్ఞయాగాలకు అనుకూలంగా సర్వసౌకర్యాలూ సిద్ధించాయి. ప్రియవ్రతుడు నాటిన ధర్మబీజం జీవోన్మేషంతో అంకురితమై చిగురించి, మొగ్గతొడిగి భరతమహారాజు పాలనలో మూడు పువ్వులూ ఆరు కాయలుగా విలసిల్లింది. అతని కాలంలోనే నాభి వర్షానికి భరతఖండమని నూత్నాభిధానం కలిగింది.

ఈ విధంగా భరతుడు దివ్యతేజంతో కాశ్యపీ ఖండాన్ని పరిపాలించాడు. తన కుమారుడు సుమతికి రాజ్యభారాన్ని అప్పగించి, తాను కూడా తండ్రి వలెనే సాలగ్రామతీర్థానికి వెళ్లి తపస్సు చేసి, కాలాంతరంలో విప్రుడై జన్మించాడు.

భరతుని కొడుకు సుమతికి ఇంద్రద్యుమ్నుడు జనించి పితృపితామహుల యశోదీధితులను దశదిశలా అభివ్యాపింపజేశాడు. అతనికి పరమేష్ఠి, ఆతనికి ప్రతిహారుడు, అతనికి ప్రతిహర్త ఉదయించారు. ప్రతిహర్తకు భవుడు, భవునికి ఉద్గీథుడు, అతనికి ప్రస్తారుడు, ప్రస్తారునికి పృథువూ ఉద్భవిల్లారు. పృథువు కొడుకు నక్తుడు. అతనికి గయుడు, గయునికి నరుడు, అతనికి విరాట్టు, అతనికి ధీమంతుడు పుట్టారు. ధీమంతునికి మహాంతుడు, అతనికి మనస్యుడు, మనస్యునికి త్వష్టి ప్రాదుర్భవించారు. త్వష్టి కుమారుడు విరజుడు. అతనికి రజుడు, రజునికి శతజిత్తు జనించారు. శతజిన్మహీపతికి కాలక్రమేణ నూరుగురు కొడుకులు కలిగారు. వారిలో అగ్రజాతుడు విశ్వజ్యోతిషుడు.

ఈ రాజన్యుల కాలంలో భరతవర్షం తొమ్మిది భాగాలుగా మళ్లీ విభాగింపబడింది. వీరందరూ సాత్త్వికులై మనుమార్గంలో మునిధర్మానుసారం రాజ్యపాలనం చేశారు.

వరాహకల్పంలో స్వాయంభువుని ఏలుబడిలో ప్రజాసృష్టి ఈ విధంగా జరిగింది.''

అని వచించిన పరాశరమహర్షిని మైత్రేయుడు—''ఆచార్యవర్యా! మీరు ఇంతదాకా ప్రస్తావించిన ఈ ధరణీమండలం ఎంత విశాలమైనది? మీరు చెప్పిన సప్తద్వీపాల స్వరూపం ఎటువంటిది? నదులు, సాగరాలు, నానాప్రదేశాలు, పర్వతాలు, వనసీమల విస్తారం ఎంత? దైత్యులు, దేవతలు, గంధర్వుల ఆవాసాల విశేషాలను నాకు విపులీకరించి చెప్పండి'' అని కోరాడు.

సృష్టిస్వరూప నిరూపణం

"మైత్రేయా!

లోకయజభవుడు సృజించిన ఈ భూమండలంలో జంబూద్వీపం, ప్లక్షద్వీపం, శాల్మలద్వీపం, కుశద్వీపం, క్రౌంచద్వీపం, శాకద్వీపం, పుష్కరద్వీపం — ఇత్యాదిగా సప్తద్వీపాలు ఉన్నాయి.

ఈ ద్వీపాలను పరివేష్టించి ఏడు మహాసముద్రాలు — లవణ సముద్రం, ఇక్షువారిధి, సురావారాశి, సర్పిపయోధి, దధిజలధి, దుగ్ధార్ణవం, జలనిధులూ ఉన్నాయి.

ఇవన్నీ ఒకదాని కంటె ఒకటి రెట్టింపు పరిమాణం కలవి.

జంబూద్వీపం

సృష్టిలో వెలసిన సకల ద్వీపాలకూ మధ్యతలంలో హారంలో నాయకమణి వలె జంబూద్వీపం విరాజిల్లుతున్నది.

జంబూద్వీప మధ్యదేశంలో కనకరత్నమయమైన మేరు పర్వతం ఉన్నది. దీని ఎత్తు ఎనభై నాలుగు వేల యోజనాలు. మేరు మహాద్రి నిలిచిన భూమికి దిగువ పదహారువేల యోజనాల విస్తార మైన ఆధారపీఠం గర్భితంగా ఉన్నది.

మేరుపర్వతంలో అన్నింటికన్నా సమున్నతమైన శృంగం ముప్పైరెండు వేల యోజనాల విస్తీర్ణమూ, కొండచరియ పదహారు వేల యోజనాల వైశాల్యమూ కలిగి ఉన్నాయి. మనం నివసిస్తున్న ఈ భూమండలం ఒక పద్మం అయితే, దానికి కర్ణికవలె అమరిన మేరుపర్వతం యక్ష కిన్నర గంధర్వ మునిగణ దేవతా గణాలకు విహారనిలయం.

మేరుపర్వతానికి దక్షిణ దిగ్భాగంలో హిమవత్పర్వతం, హేమకూటం, నిషధపర్వతం ఆవరణలుగా అలరారుతున్నాయి.

మేరువుకు ఉత్తరదిక్కున అతివిశాలమైన నీలాచలం, శ్వేత పర్వతం, శృంగభూధరం ఉన్నాయి. పరస్పరాభిముఖంగా నిలిచిన ఈ పర్వతాలకు నడిమి ప్రదేశం అనేక శత సహస్ర యోజనాలలో విస్తరించింది. ఈ మూడు గిరీంద్రాలూ ఒక్కొకటి రెండు వేల యోజనాల ఎత్తు, వెడల్పు కలిగినవి.

హిమవత్పర్వతం శృంగభూధరాల మధ్యస్థంగా మహా ప్రమాణం కల మర్యాదాపర్వతా లున్నాయి.

మేరుశైలానికి తూర్పున దేవకూటం, పడమట జఠరపర్వతం నెలవుకొన్నాయి.

మేరుమహాచలం కేంద్రంగా, చుట్టూ ఉన్న ఈ శిలోచ్చయాల మధ్య అనేక దేశాలు వెలిశాయి. వాటికి వర్షాలని పేరు.

మేరుపర్వతానికి దక్షిణాన భరతవర్షం, కింపురుష వర్షం, హరివర్షం ఉన్నాయి. ఉత్తరదిశలో రమ్యకవర్షం, హిరణ్మయవర్షం, కురువర్షం విస్తరిల్లాయి. ప్రాగ్దిశలో భద్రాశ్వవర్షం, పశ్చిమాన కేతుమాలావర్షం, పశ్చిమోత్తర దిక్కులో తొమ్మిదివేల యోజనాల ఇలావృతవర్షం ఉన్నాయి.

అతివిస్తారమైన ఇలావృతవర్షంలో తూర్పున మందరపర్వతం, పశ్చిమాన విపులపర్వతం, ఉత్తరంలో సుపార్శ్వమని నామాంతరం పొందిన మేరుమందర పర్వతం, దక్షిణాన గంధమాదన పర్వతం ఉన్నాయి. ఇవి ఒక్కొక్కటి పదివేల యోజనాల ఉన్నతిని కలిగినట్టివి.

ఈ నాలుగు పర్వతాల పైన పదకొండు వందల యోజనాల ప్రమాణం కల మహావృక్షాలు అనేకం ఉప్పతిల్లాయి. గంధమాదనం పైన జంబూవృక్షం, కదంబం, బోధి, న్యగ్రోధం ఉన్నాయి. వీటిలో జంబూవృక్షానికి గొప్ప ఏనుగు పరిమాణంలో మహాఫలాలు

కాస్తాయి. ఈ వృక్షం మొలకెత్తిన ప్రదేశానికి జంబూద్వీపం అని పేరు వచ్చింది.

జంబూవృక్షానికి కాచిన కాయలు ఆరముగ్గి పండిన తర్వాత నేలకు రాలి ఆ ఫలరసప్రవాహం జంబూనదిగా ఏర్పడింది. అక్కడి తీరభూములను మనికిపట్లుగా చేసుకొని నివసించిన ప్రజలు ఆ నదీ జలాలను త్రాగి సంపూర్ణారోగ్యవంతు లయ్యారు. ఆ జలపాన మహిమ వలన వారిని ఆకలిదప్పులు, జరామరణాలు బాధించవు.

జంబూనది జలప్రవాహం ఉభయతటాలనూ ఒరుసుకొని పారినప్పుడు చల్లని గాలికి తీరపు నేలలో ఇంకిన నీటివల్ల అక్కడి నేల పసిమిరంగు తిరిగి, ఆ ప్రాంతానికి జాంబూనదమని పేరు వచ్చింది.

మేరుపర్వతానికి ప్రాక్పశ్చిమాలలో భద్రాశ్వ కేతుమాలులు రాజ్యాలను స్థాపించారు. వీటికి నడిమి భాగంలో మేరువుకు దగ్గరగా ఉన్నది ఇలావృతుని దేశం. దీనికి తూర్పున చైత్రరథవనమూ, ఉత్తరాభిముఖంగా దేవేంద్రుని విహారస్థలం నందనవనమూ ఉన్నాయి. దక్షిణాన గంధమాదన వనం, పశ్చిమంలో వైభ్రాజితవనం విల సిల్లాయి.

వైభ్రాజితవనానికి సమీపంలో అరుణోద, మహాభద్ర, సితోదాల తర్వాత మానససరోవరం ఉన్నది. ఈ నాలుగు సరస్సు లలో దేవతలు జలక్రీడలకై వస్తారు.

ఇవన్నీ కాక మేరుకర్ణికకు కేసరాల వలె ఇంకా అనేక మహాద్రులు భూమిని చొచ్చుకొని వెలికివచ్చాయి. తూర్పున సీతాంత పర్వతం, ముకుందాచలం, కురరీపర్వతం, మాల్యవంతా చలం ఉన్నాయి. వీటికి దక్షిణదేశంలో త్రికూటపర్వతం, శిశిర పర్వతం, పతంగపర్వతం, రుచకపర్వతం, నిషధపర్వతం, వెలు

పొందుతున్నాయి. పశ్చిమాన శిఖరాసపర్వతం, వైదూర్యపర్వతం, కపిలపర్వతం, గంధమాదన పర్వతం, జారుధిపర్వతం ఉన్నాయి. ఉత్తరముఖంగా ఉన్నవి శంఖకూటం, ఋషభపర్వతం, నాగాచలం, హంసపర్వతం, కాలంజరశైలం.

మేరుపర్వతం కడపటి కొమ్ము పైన పధ్నాలుగు వేల యోజనాల ప్రదేశంలో దేవతల రాజధాని అమరావతి విరాజిల్లుతోంది. శ్రీమహావిష్ణువు పాదకమలాల నుండి జన్మించి, శశాంకమండలాన్ని తడుపుతూ మేరువు మీదికి దిగివచ్చిన ఆకాశ గంగ ఈ అమరావతి దగ్గర నాలుగు పాయలుగా చీలి, సీత—అలకనంద—చక్షువు—భద్రానదులుగా ప్రవహింపసాగింది.

ఈ స్రవంతులలో సీత మేరుపర్వత ప్రాచీదిశలోని పర్వతాగ్రాల నుంచి భద్రాశ్వవర్షం లోనికి ప్రవేశించి, అక్కడ సముద్రోన్ముఖంగా మలుపు తిరిగింది. అలకనంద దక్షిణానికి నడిచి భారతవర్షంలో సప్తవేణికలుగా చీలి కడలిలో సంగమిస్తున్నది. చక్షుర్నది కేతుమాలవర్షాన్నుంచి; ఉత్తర కురుభూముల నుంచి భద్రానది, పైరుపొలాలను సస్యశ్యామలం కావించి పయోధిలో కలుస్తున్నాయి.

ఈ విధంగా ఆకాశగంగ అమరావతి సమీపంలో చీలి ప్రత్యంతపర్వతాల మధ్యతలంలో ప్రవహిస్తున్నప్పుడు సీతాది నదుల సౌందర్యాన్ని చూసి తీరాలి.

Dr. K... Lingamurthy
Nagarkurnool
Call No. ...0/ 27/2

ఈ స్థలం లోనే సిద్ధ చారణ గంధర్వులు సంచరించే అనేక రమణీయావాసా లున్నాయి. లక్ష్మీదేవి, శ్రీ మహావిష్ణువు, అగ్ని, సూర్యుడు నివసించే పవిత్రనిలయాలు ఇక్కడే దర్శనీయాలు.

శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించిన సచ్చరిత్రులకు ఈ పుణ్యస్థలాలలో చిరనివాసభోగం కలుగుతుంది. పాప చింత

నలతో నిశ్చింతగా జీవితాన్ని గడిపి దైవారాధనను విడనాడిన వివేకశూన్యులు పదివేల జన్మాలెత్తినా ఈ ప్రదేశాల పొలిమేరలకు కూడా రాలేరు.

వాసుదేవుడు ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క కాలంలో నామ రూప వైభవాలతో లీలామాత్రతనువై అవతరిస్తుంటాడు.

శ్రీహరి భద్రాశ్వవర్షంలో హయగ్రీవరూపుడు. కేతుమాల వర్షంలో ఆయన వరాహరూపధారి. భరతవర్షంలో కూర్మావతారుడు. కురువర్షంలో ఆయన మత్స్యాకృతిని ధరించాడు.

ఈ విశ్వంలో దృశ్యగోచరమైన సర్వమూ ఆ పరంధాముని లీలావిలాసానికి ప్రతీకలే. సకలం ఆయన కృపకు వశవర్తులే.

మనం నివసిస్తున్న ఈ భారతవర్షంలో తప్ప కింపురుషాది ఎనిమిది వర్షాలలోని జీవజాతానికి శ్రమాయాసాలు లేవు. దుఃఖం, శోకం, ఉద్వేగం, క్షుత్పిపాసలను అతిగమించి వారు పది పన్నెండు వేల సంవత్సరాల పరమాయువుతో జీవిస్తారు. ఆ దేశాలలో భూమి లోని ఊటనీరే కాని వర్షాలు కురిసే అవకాశం ఉండదు. భౌమోదక పానం లేక వారిని జరావ్యాధులు బాధించవు.

భారతవర్ష స్వరూపం

జంబూద్వీపంలో ఉత్తరాన హిమవత్పర్వతాల మొదలుకొని దక్షిణసముద్రతీరం వరకు తొమ్మిదివేల యోజనాలు వ్యాపించిన సువిశాల భూమిభాగానికి భారతవర్షమని పేరు.

కింపురుషాది వర్షాలన్నీ నిరంతర భోగభూములు కాగా భారత దేశం కర్మభూమియై విలసిల్లుతోంది. ఇందులో సత్కర్మలను ఆచరించిన పుణ్యజీవనులకు స్వర్గాపవర్గాలు, పాపచిత్తులకు అధోలోక నరకాలు సంప్రాప్తిస్తాయి. ఇక్కడ మానవులు భక్తితో అనుష్ఠించే యజ్ఞయాగాల వల్ల దేవతలకు హవిస్సులు అందుతాయి.

ఈ భరతఖండంలో ఏడు పర్వతశ్రేణులు ముఖ్యతమాలు. ఈ కులపర్వతాలు: మహేంద్రం, మలయం, సహ్యాం, శుక్తిమంతం, ఋక్షం, వింధ్యాం, పారిపత్ర నామాలు కలిగినవి.

ఇందులో తొమ్మిది ద్వీపాలు: ఇంద్రద్వీపం, కసేరుమద్ద్వీపం, తామ్రవర్ణద్వీపం, గభస్తిమంతద్వీపం, నాగద్వీపం, సౌమ్యద్వీపం, గాంధర్వద్వీపం, వారుణద్వీపం, కుమారికాద్వీపం ఉన్నాయి. ఇవి ఒక్కొక్కటి సహస్రయోజనవిస్తృతిని కలవి.

ఇవికాక భరతవర్షాన్ని చుట్టివస్తున్న సముద్రమధ్యంలో అంగద్వీపం, యమద్వీపం, మత్స్యద్వీపం, కుముదద్వీపం, కుశద్వీపం, వరాహద్వీపం, శంఖద్వీపం—అని ఆరు ద్వీపకల్పాలు కూడా ఉన్నాయి.

ఆదిమకాలం నుంచీ భరతఖండం బహుజనసంకులమైనది. ఇందులో ప్రాఙ్మండలాన కిరాతులు, పశ్చిమంలో యవనులు, మధ్య ప్రదేశంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రజాతులవారు యథాయోగ్యంగా కులవృత్తులను అనుసరిస్తున్నారు.

హిమవత్పర్వత పాదప్రదేశం నుంచి శతద్రువు, చంద్రభాగా నదులు అవతరించాయి. పారిపత్రంలో వేదస్మృతి, వింధ్యాచలం నుంచి నర్మద, సురసానదీమతల్లికలు పుట్టాయి. ఋక్షాద్రిలో తాపి, పయోష్ణి, నిర్వింధ్యా నదులు, సహ్యాద్రినుంచి గోదావరి, భీమరథ, కృష్ణవేణ్యాదులూ జన్మించాయి. మలయపర్వతంలో తామ్రపర్ణి, కృతమాలానదులు, మహేంద్రాద్రి నుంచి త్రిసామ, ఋషికుల్యాదులు ప్రవహించాయి. శుక్తిమంతంలో కుమారానది ప్రాదుర్భవించింది.

భారతభూమి దక్షిణంలో పుండ్రులు, కళింగులు, మగధులు, దక్షిణాది జాతులవారూ నివసిస్తున్నారు. తూర్పున కామరూపులు, కామరూపదేశానికి ఉత్తరంలో కురుపాంచాల ప్రజలూ ఉన్నారు.

పశ్చిమతీరప్రాంతంలో సౌరాష్ట్రులు, శూరులు, ఆభీరులు ఉంటున్నారు. అర్బుదపర్వత సమీపంలో కరూష మాళవులు, పారిపత్రాల దగ్గర సౌవీరులు ఉన్నారు. సౌవీరుల పొరుగున సైంధవులు, హూణులు, సాళ్వులు, సాకల మద్ర రామ అంబష్ఠదేశాలవారు, పారశీకులు నివసిస్తున్నారు. వీరందరూ నదీతీరాలలోని సారవంతమైన ప్రదేశాలలో భూమిని పండించి, అన్నోదకాలను సమకూర్చుకొంటారు.

ఆదికాలం నుంచి భారతవర్షంలోని అన్ని ప్రదేశాలలో, అన్ని కాలాలలో నిష్కాములైన మహర్షివరేణ్యులు పరార్థసౌఖ్యాన్ని, పరమపదాన్ని ఆకాంక్షించి వేదోక్తమైన యజ్ఞయాగాలతో భూతతృప్తి కావిస్తున్నారు.

భక్తిపరుల పుణ్యఫలం వలన పవిత్రమైన జంబూద్వీపంలో యజ్ఞపురుషుడైన శ్రీమన్నారాయణుడు అవతరించి, ఆర్తులకు తాపాలను నశింపజేసి మోక్షాన్ని ప్రసాదిస్తున్నాడు.

పుణ్యనదీనదాలు

భారతవర్షంలో దైవకార్యకరణాలకు యోగ్యమైన పుణ్యనదులు ఆసేతుశీతాచలమూ అసంఖ్యాతంగా ప్రవహిస్తున్నాయి. కులపర్వతశ్రేణులలో పొడచూపి, ఊషరక్షేత్రాలను సస్యశ్యామలీకరించి సాగరసంగమం చేస్తున్న జీవవాహినులు ఈ వర్షావాసులకు పరమపద సోపానాలు.

ఈ పుణ్యతరంగిణులలో అంత్రశిల అదృశ్య అనుష్ణ అసి అసిక్ని ఇక్షుమాళవి ఇరావతి ఉత్పలవతి ఉపేంద్ర ఋషికుల్య ఓఘవతి కంపన కపింజల కపిల కరతోయ కరీషిణి కాపి కావేరి కుంతల కుచీర కుమారి కుశచిత్ర కుశధార కృత్య కృష్ణవేణి కోశ కౌశికి గందకి గోదావరి గోమతి గౌరి చంద్రభాగ చంద్రమ చర్మణ్వతి

చిత్రవహ చిత్రసేన చిత్రోపల చులక జాంబూనది జ్యోతీరథ తమస తామసి తామ్ర తుంగవేన త్రిదివ దాసి దిశ దుర్గ దృషద్వతి దేవిక ధూతపాప ధృతవతి నర్మద నాళ నిచిత నివార నిశ్చిత పంచమి పయోష్ణి పర పలాశిని పవిత్ర పాతాళవతి పాపహాత పింజల పిచ్ఛల పురావతి పుష్పవేణి పూర్ణాశ పూర్వాభిరామ ప్రవర బాహుద బ్రహ్మబోధ్య బ్రహ్మమేధ్య బ్రహ్మణి భాగీరథి భారద్వాజి భీమ భీమరథి మంజుల మంజువాహిని మందవాహిని మందాకిని మకరి మధువాహిని మనింగ మరీష మహాగౌరి మహిత మహేంద్ర మహోపమ ముక్తిమతి మేన యమున యవక్ష రజని రథచిత్ర రహస్యశతకుంభ రోహి లోహతరిణి లోహిత్య వర వశ వరణ వాస్తు వితస్త విదిశ వినది విపాప విపాశ విశ్వామిత్ర వీణ వీరంకర వీరవతి వృషకాహ్వ వృషద్వతి వృషభ వేత్రవతి వేదవతి వేదస్మృత వేదాశ్వ వేన వైతరణి శతద్రు శతబల శివ శీఘ్ర శైవ్య సదాకాంత సదానీర సరయు సరస్వతి సర్వసంగ సింధువు సునస సుప్రయోగ సువామ సువాస్తు సేలు సోన హారిశ్రవ హస్తిసోమ హిరణ్వతి హేము—మొదలైనవి ఆ ప్రాంతవాసులకు ప్రాతఃస్మరణీయాలు.

నిత్యనైమిత్తిక విధులన్నింటికీ అవశ్యార్థాలయిన ఈ అమృతవాహినులలో జలరూపమైన శ్రీమన్నారాయణుని దివ్యతేజాన్ని సందర్శించి భక్తులు తన్మయులౌతారు.

ప్రజావిలాసం

కర్మభూమిగా వెలుగొందుతున్న భారతవర్షంలోని ప్రజలు యథాయోగ్యంగా సుకర్మలను అనుష్ఠించి భోగభూములకు, మోక్షపదానికీ ఉద్యమిస్తున్నారు. దేశ కాల పాత్రోచితమైన ఆచార సంప్రదాయాలను శక్త్యనుసారం పాటించి వీరందరూ మానవ జీవితాన్ని సార్థకం చేసుకొంటున్నారు.

ఈ ప్రజలలో అంగారులు అంగులు అంతచారులు అతావిశిఖరులు అధివాజ్యులు అనుపావృతులు అపరకాశులు అపవాహులు అభీరులు అళిందములు అశ్మకులు ఆత్రేయులు ఉత్కళులు ఉత్తములు ఉపావృతులు ఔడ్రులు కక్షులు కరభంజికులు కరీతులు కరీషకులు కరూషులు కర్ణాటకులు కాంతికులు కాంభోజులు కాలజోషులు కాలవులు కాళింగులు కాశీకోసలులు కాశ్మీరులు కాశ్యులు కిరాతులు కుంతకులు కుంతలులు కుక్కురులు కుత్తపరాంతులు కురువంశ్యులు కురువర్ణకులు కులష్ఠులు కులాద్యులు కుళిందాపత్యకులు కుశవిందులు కేకయులు కేరళులు కోకరకులు కొంకణులు కౌకుత్తకులు కౌరవ్యులు కౌశిజులు ఖాసీరులు గిరిగహ్వరులు గోపాలకక్షులు ఘృతసృంజయులు చక్రులు చర్మమండలులు చేద్యులు చోళులు చీనులు జాంగలులు జాఠరులు జిల్లికులు తంగణులు తనబాలులు తనయులు తామ్రలిప్తులు తోమరులు త్రిగర్తులు దరదులు దర్వ్యాలు దశమాలికులు దశీనిదర్భులు దాశార్ణులు ద్రావిరులు ధ్వజిన్యుత్సవసంకేతులు నలకాననులు నైకపృష్ఠులు పరతంగణులు పరాంతులు పహ్నవులు పాంచాలురు పాంశురాష్ట్రులు పారశీకులు పార్వతీయులు పాశివాతులు పుళిందులు పౌండ్రులు ప్రహ్లాదులు ప్రాచ్యులు ప్రోషకులు ప్రోష్ఠులు బభ్నులు బర్బరులు బహుబాధులు బాహ్లికులు బోధులు భరతులు భారద్వాజులు భోజులు మందకులు మత్స్యులు మద్రభుజంగులు మలయులు మల్లరాష్ట్రులు మల్లులు మాగధులు మాద్రేయులు మాలవర్తులు మాలవానులు మాహికులు మాహిషికులు మూషకులు మేఖలులు మేరుభూతులు మ్లేచ్ఛులు యక్రిల్లోములు యవనులు రమణులు రూపవాహికులు రోమణులు వంగులు వక్రతపసులు వాతజమరథోరజులు వాతాధానులు వాతాయనులు వానరాస్యులు వానవాసకులు వానవులు వింధ్యచుళుకులు వికల్యులు

విజయులు విదర్భులు విదేహులు శకులు శక్రిగ్దాత్రిహులు శనీయులు శాల్వసేనులు శాసికులు శూరసేనులు శైవాలులు శైశికతులు సమంగులు సమవేగవసులు సాళ్వులు సింధుపుళిందులు సిద్ధులు సుకూత్యులు సుదాములు సునయులు సుమల్లులు సోధులు సౌవల్యులు సౌహృదులు స్తనయోషికులు స్వక్షులు స్వరాష్ట్రులు షండులు హంసమార్గులు హూణులు——మొదలైన అనేక జాతీయు లున్నారు.

వీరందరూ దైవస్వరూపులే నని గుర్తించి ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యక్షంగా వాసుదేవుని దర్శింపగల పుణ్యాత్ముల సుకృతమే సుకృతం.

భారతవర్షానికి పర్యావరణలో భూమికి మొలత్రాడులా చుట్టుకొని రత్నాకరం ఉన్నది. అందులో వేయేసి యోజనాల సువిశాలద్వీపాలు తొమ్మిది కానవస్తాయి. ఇటువంటి శుభదాయక పుణ్యక్షేత్రాలు, మహానదులు, కులపర్వతాలు వెలసిన ప్రదేశం ఇక్కడ తప్ప మరెక్కడా లేదు.

ఈ కర్మభూమిలో జన్మించిన మానవులకు ప్రాపణీయమైన ఆనందం వర్ణనాతీతం.

ప్లక్షద్వీపం

జంబూద్వీపానికి వెలుపల ఒక వలయాకారంలో లక్షయోజనాల పర్యంతం లవణ సముద్రం ఉన్నది. ఆ వలయానికి ఆవల రెండు లక్షల యోజనాల విస్తృతమైన ప్లక్షద్వీపం ఏర్పడింది.

స్వాయంభువమనువు వంశీయులలో అగ్రేసరు డైన ప్రియవ్రతుడు తన రెండవ కొడుకు మేధాతిథికి ఈ ప్లక్షాన్ని ధర్మపరిపాలనార్థం ఇచ్చాడు.

మేధాతిథికి ఏడుగురు కొడుకులు పుట్టారు. వారందరికీ రాజ్యాధికారం ప్రాపించే సమయానికి ప్లక్షద్వీపాన్ని ఏడు భాగాలుగా

విభజించాడు. ఆదిత్యతేజులైన సుతులకు ఆయా ఖండాలను అప్ప గించి, తాను చతుర్థాశ్రమస్వీకారం చేసి తపోవనాలకు వెళ్లి పోయాడు.

ప్రియవ్రతుని పౌత్రు లందరూ ధర్మపరతంత్రులై ప్రజాభి రంజకంగా భూమిని పరిపాలించారు. ప్లక్షద్వీపం లోని సప్త దేశాలూ వారి నామాక్షరాల చేత అలంకరింపబడి శాంతభయవర్షం, శిశిర వర్షం, సుఖోదయవర్షం, ఆనందవర్షం, శివవర్షం, క్షేమకవర్షం, ధ్రువవర్షాలుగా లోకవిశ్రుతిని పొందాయి.

ప్లక్షద్వీపంలో ఏడు కులపర్వతా లున్నాయి. ఇవి రాజ్య భాగాలకు పొలిమేరలలో వెలిసి, రాజ్యవిభాగ రేఖలుగా కని పించడం మూలాన వీటికి మర్యాదాపర్వతాలని కూడా పేరు వచ్చింది. గోమేధపర్వతం, చంద్రపర్వతం, నారదపర్వతం, దుందుభి పర్వతం, సోమకపర్వతం, సుమనః పర్వతం, వైభ్రాజపర్వతం—ఈ సప్తాచలాల సానువులలో అనుతప్త, శిఖి, విపాశ, త్రిదివ, క్రము, అమృత, సుక్రీతా నదులు జన్మించి సముద్రాభిముఖంగా ప్రవ హిస్తున్నాయి.

ప్లక్షద్వీపంలో చిరంతనంగా వర్ణాశ్రమ ధర్మాలు నెల కొన్నాయి. ఇక్కడ బ్రాహ్మణులకు ఆర్యకులని వ్యవహారం. క్షత్రియజాతీయులను కురువు లంటారు. వైశ్యులను వివాసులు, శూద్రులను భావిజనులు అని సంబోధిస్తారు. కులాచలాల నుంచి జన్మించిన పుణ్యనదుల స్వాదుజలాన్ని ఆస్వాదించి వీరందరూ అపురూపమైన ఆనందాన్ని, వ్యాధులు సోకని ఆరోగ్యబలాన్ని ఉపార్జించారు. వీరి ఆయుర్దాయం ఐదువేల సంవత్సరాల దీర్ఘ కాలికం.

జంబూద్వీపంలో జంబూవృక్షం ఉన్నట్లే ఈ ద్వీపంలో ఒక ప్లక్ష (అశ్వత్థ) వృక్షం ఉన్నది. ఇక్కడ శ్రీమన్నారాయణుని అర్చామూర్తి చంద్రుని ఆకృతిలో వెలిసి విలసిల్లుతోంది.

భక్తులకు ఆయన చూపే దారిచూపే దీపకాంతి.

శాల్మల ద్వీపం

ప్లక్షద్వీపాన్ని ఆవరించి వృత్తాకారంలో రెండు లక్షల యోజనాల సువిశాలమైన ఇక్షుసముద్రం ఉన్నది. దానికి ప్రాకారమై అంతకు రెట్టింపు వైశాల్యం కల శాల్మలద్వీపం ప్రియవ్రతుని మూడవ కొడుకు వపుష్మంతుని ఏలికలో విరాజిల్లుతోంది.

వపుష్మంతుని పుత్రుల పేరిట శాల్మలంలో శ్వేతవర్షం, హరీతవర్షం, జీమూతవర్షం, రోహితవర్షం, వైద్యుతవర్షం, మానసవర్షం, సుప్రభవర్షం అవతరించాయి. ఈ రాజన్యుల దేశాలకు సరిహద్దులలో సప్తమహాద్రులు, వాటి శిఖరసానువుల నుంచి సప్తవాహినులు ఉదయించాయి.

శాల్మలద్వీపం లోని సప్తాచలాలు దుర్లభమైన వనస్పతులకు పెన్నిధులు. ఈ కులపర్వతాల పేర్లు: కుముదపర్వతం, ఉన్నతం, వలాహకం, ద్రోణం, కంకశైలం, మహిషం, కకుద్వంతం. వీటిలో ద్రోణాచలంలో అంకురించిన దివ్యౌషధుల ప్రభావం అమోఘమైనదని ప్రసిద్ధి.

ఈ ప్రాంతంలోని సరిత్ప్రవాహాలు యోని, తోయ, వితృష్ణ, చంద్ర, శుక్ల, విమోచని, నివృత్తి. ఈ నదీవేణికలలో నిత్యం నైమిత్తికం కామ్యం కాపిలం క్రియాంగం మలకర్షణం అనే షడ్విధ స్నానాలను ఆచరించి జీవులు పాపవిమోచనం పొందుతారు.

ఇక్కడ వర్ణచతుష్కానికి కపిలులు, అరుణులు, పీతులు, రోహితులు అని అభిధానకాలు కలిగాయి.

ఈ నేలపై పదకొండు వందల యోజనాల శాల్మలీవృక్షం మహామహిమాతిశయంతో ఉద్గమించింది.

శాల్మలద్వీపంలో శ్రీమహావిష్ణువు యజ్ఞహోమాలను వాయు రూపంలో స్వీకరించి భక్తులకు జీవమోక్షాన్ని అనుగ్రహిస్తున్నాడు.

శుక ద్వీపం

శాల్మలద్వీపానికి బహిరావరణలో వ్యాపించిన సురాసముద్రాన్ని చుట్టి ఎనిమిది లక్షల యోజనాల కుశద్వీపం జ్యోతిష్మంత భూపాలకుని యేలుబడిలో ఉన్నది.

జ్యోతిష్మంతునికి కూడా ఏడుగురు కొడుకులు జన్మించి కుల దీపకులై వర్ధిల్లారు. వీరి పేరిటనే ఉద్భిదవర్షం, వేణుమానవర్షం, సైరథవర్షం, లవణవర్షం, ధృతివర్షం, ప్రభాకరవర్షం, కపిలవర్షం పేర్లు చెల్లివచ్చాయి.

ఈ ద్వీపం లోని చాతుర్వర్ణ్యం దమి, సుషిమ, స్నేహ, మందేహ నామకులు. వీరందరూ విశ్వావాసుడైన వాసుదేవుని బ్రహ్మ ఆకృతిలో ఆరాధించి విహితధర్మాచరణం చేస్తున్నారు.

ఇక్కడ విద్రుమం, హేమశైలం, ద్యుతిమంతం, పుష్పవంతం, కుశేశయం, హరి, మందర సంజ్ఞలతో ముఖ్య కులపర్వతాలు; ధూతపాప, శివ, పవిత్ర, సమ్మతి, విద్యుదంభ, మహావన్య, సర్వ పాపహర నామాలతో సప్తాపగలూ విలసిల్లుతున్నాయి.

ఇవికాక కుశప్రాంతంలో అనేక భూమిధరాలు, స్రోత స్వినులూ కూడా ఉన్నాయి. కుశార్జునాలకు ఈ ద్వీపం పెట్టింది పేరు.

క్రౌంచ ద్వీపం

కుశద్వీపాన్ని ఆవర్తించిన ఘృతసముద్రానికి బహిర్వల యంలో పదహారు లక్షల యోజనాల విరివితో క్రౌంచద్వీపం గోచరిస్తుంది.

ప్రియవ్రతుని పుత్రుడు ద్యుతిమంతుడు ఈ మహాసామ్రా జ్యాన్ని పరిపాలించిన కాలంలో పుష్కరులు, పుష్కలులు, ధన్యులు, తిష్యులు వర్ణాశ్రమధర్మాలను వేదచోదితంగా అనుష్ఠించారు.

ఈ పవిత్రక్షేత్రంలో యజ్ఞపురుషుడైన నారాయణుడు శ్రీ రుద్రాకృతిలో వెలసి తనను నమ్ముకొన్న భక్తులను నమ్మ కంగా కాపాడుతున్నాడు.

క్రౌంచద్వీపంలో బృందారక బృందాలకు ఆవాసమందిరా లైన మహాకులపర్వతాలు క్రౌంచం, వామనం, అంధకారకం, దేవ వృతం, పౌండరీకవంతం, దుందుభి, మహాశైలం ఉన్నాయి.

ఈ పర్వతప్రాకారాల అంతర్వర్తులై ద్యుతిమంతుని తన యుల రాజ్యభాగాలు గోచరిస్తాయి. కుశలవర్షం, మల్లగవర్షం, ఉష్ణ వర్షం, పీవరవర్షం, అంధకారకవర్షం, మునివర్షం, దుందుభివర్షం— అని వీటికి పేర్లు.

పర్వతసానువుల నుంచి గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, క్షాంతి, పుండరీక మహానదులు ఆవిర్భవించి ప్రజావాసా లను సస్యోజ్జ్వలంగా ఉజ్జీవింపజేస్తున్నాయి.

ద్యుతిమంతుని కొడుకు లందరూ భీమబలులు. ఐనా శాంత చిత్తులై ధర్మనియతిని గౌరవించి వీరందరూ వైష్ణవాగ్రేసరులై వెలు గొందారు.

శాకద్వీపం

ప్రియవ్రతుని సూనుడు భవ్యమహారాజుకు ఏడుగురు ప్రాణ తుల్యులైన నందనులు — జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మనీచకుడు, కుసుమోదుడు, మౌదాకి, మహాద్రుముడు ప్రాదుర్భ వించారు. క్రౌంచద్వీపాన్ని చుట్టి పొడమిన దధిసముద్రానికి బహి ర్వలయం లోని శాకద్వీపాన్ని భవ్యుడు కొడుకులకు పంచి యిచ్చాడు.

ఆ పుణ్యసీమలు వారి వారి నామధేయాలతో వర్షాలై పరిఢవిల్లాయి.

భవ్యపుత్రుల కాలంలో వారి దేశాల పొలిమేరలలో ఉదయగిరి, జలాధార, రైవతక, శ్యామ, అంబికేయ, రమ్య, కేసరి కులపర్వతాల నుంచి పుణ్యనదీసప్తకం జన్మించింది.

ఈ కులాచలాల ప్రాంతంలో ఒక మహాశాకవృక్షం పెరిగింది. గాలి కదలికకు అల్లలనాడే దాని ఆకుల చల్లని నీడలో సేద తీర్చుకోనడానికి గంధర్వులూ, సిద్ధులూ అక్కడికి వచ్చిపోతుంటారు.

శాకద్వీపవాసులు చాతుర్వర్ణ్యాన్ని మృగులు, మాగధులు, మానసులు, మందగులు అని ఏర్పరించుకొన్నారు. సుకుమారి, కుమారి, నళిని, ధేనుక, ఇక్షు, వేణుక, గభస్తి — శైవలినులతో పాటు ఇతర నదీతీరభూములు వీరికి మనికిపట్లు.

శాకద్వీపమంటే నిజంగా భూతలస్వర్గమే. అక్కడి జనానీకానికి ధర్మానుష్ఠానమే తప్ప పాపస్వరూపం తెలియదు. ఆధిక్యానధికతలు, అసూయాద్వేషాలు, అన్యోన్యవైరాలు, పాతకకృత్యాలు— అక్కడ కలికానికైనా కనిపించవు.

పుష్కరద్వీపం

శాకద్వీపానికి బహిఃప్రాంగణంలో క్షీరోదం, దానికి వెంద లాన పుష్కరద్వీపమూ ఉన్నాయి. ప్రియవ్రతుని కొడుకు సవన మహారాజు దీనికి అధిపతి.

పుష్కరాధిపతి పుత్రులు మహావీరుడు, ధాతకి—మహావీర వర్షానికి, ధాతకివర్షానికి పాలకులయారు. ఈ రెండు వర్షాలను ఒక దాని నుంచి మరొకటి వేరుచేస్తూ మధ్యభాగంలో యాభై వేల యోజనాల మానసోత్తర పర్వతశ్రేణి వర్తులాకారంలో వ్యాపించింది.

మానసోత్తరం వలయాకృతికి అంతర్భాగంలో ధాతకివర్షం, బహిస్సీమలో మహావీరవర్షం ఉన్నాయి.

భరతవర్షంలో పుణ్యకార్యాలను ఆచరించి భోగభూములకు ప్రవేశించిన సచ్చరిత్రులు, దేవతలు, సిద్ధసాధ్యులు ఈ ఉభయ వర్షాల లోనూ శ్రమాపనోదనానికై వస్తుండడం పరిపాటి.

అన్యద్వీపాలలో వలె పుష్కరద్వీపంలో ఇతర పర్వతాలు, నదీనదాలు లేవు.

ఇక్కడ జీవజాతం ధర్మశీలంతో వాసుదేవ భక్తితాత్ప ర్యంతో దోషవిరహితం కావడం మూలాన ప్రజలకు వర్ణాశ్రమాలు, కులాచారాలు, దండనీతులు, శిక్షాస్మృతులు పుట్టలేదు. ఈ ప్రజ లలో జాతి కుల విభేదాలు లేవు. పాపానికి ఉనికిలేనందున ఈ భోగ భూమిలో యజ్ఞయాగాల విధినియమాలు కూడా ప్రవర్తిల్లలేదు. ఇక్కడ కాలానికి అఖండ సచ్చిదానంద స్వరూపమే తప్ప ఖండ విభాగం లేనందున యుగప్రమాణాలు లేవు. ధర్మోపదేశానికి వెల సిన త్రయీవిద్యలు, పురాణాలు, నీతిశాస్త్రాలు ఇక్కడ అజాత పూర్వాలు, అవిదితచరాలూ.

పుష్కరద్వీపవాసులకు సంకల్పవికల్పాలు లేవు. కామవికా రాలు, జరారోగాలూ లేవు. వీరికి కేవలం ఇచ్ఛామాత్రం చేతనే ఇష్టాన్న మృష్టాన్న భోజనాలు, సర్వభోగ్యవస్తువులూ ఉపలబ్ధాలు. సమచిత్తులై, శాంత తేజులై వీరందరూ పదివేల సంవత్సరాల పర మాయువును మహానందనీయంగా అనుభవిస్తారు.

పరమానందనిధానమైన ఈ బ్రహ్మస్థానంలోని పావనులకు శ్రీమన్నారాయణుడు బ్రహ్మరూపంలో సాక్షాత్కరించి కామి తార్థాలను ఈడేరుస్తాడు.

మైత్రేయా!

అద్యాపి నీవు తెలుసుకొన్న ఈ తొమ్మిది ద్వీపాలూ ఒక దానికంటె ఒకటి ద్విగుణమై అలరారుతున్నాయి.

సూర్యాతపం వల్ల, చంద్రోదయాస్తమయాల వల్ల ఇక్కడి సముద్రజలాలకు ఆటు పోట్లు సంభవించినా, నీటి పరిమాణంలో మార్పులు రావు.

లోకాలోక పర్వతం

పుష్కరద్వీపానికి అవతల స్వాదుజలమహార్ణవం ఉన్నది.

శుద్ధజలసాగరానికి బహిర్వలయంలో పుష్కర ద్వీపానికి రెట్టింపు పరిమాణంలో జనశూన్యమైన చక్రవాళ పర్వతం కనక వర్ణంలో విరాజిల్లుతోంది.

ఆ తర్వాత ఉన్నది సర్వశూన్యమైన అలోకం. ఇక్కడ దృశ్యదర్శనాలు రెండూ లేవు.

లోకానికీ ఈ అలోకానికీ నడిమి ప్రదేశంలో పదివేల యోజనాల మహాప్రమాణం కల లోకాలోక పర్వతం వెలిసింది. ఈ పర్వతోపరితలం స్ఫటికం కన్నా స్వచ్ఛమైన గరగరికతో బంగారు రంగులీనుతూ ప్రకాశమానమై భాసిల్లుతున్నది.

లోకాలోకపర్వతం త్రిభువనాలకూ పరాంతికం. ఈ మహాద్రి పైన ప్రాచీదిశలో వృషభం, పశ్చిమాగ్రాన పుష్పచూడం, ఉత్తర దిక్కులో వామనం, దక్షిణాన అపరాజితం అని నాలుగు దిగ్గజాలు నిలిచి లోకాభిరక్షణం చేస్తున్నాయి.

అనంతకోటి మార్తాండమండలమయూఖరేఖాశిఖా మహోజ్వలమైన లోకాలోకపర్వతం నుంచి సూర్యాది గ్రహతారకలు కాంతిపుంజాలను స్వీకరించి లోకాలకు ప్రసారిస్తున్నాయి.

బ్రహ్మాండ కటాహం

లోకాలోకపర్వతాలకు బహిర్నిలయంలో ఉన్నది సర్వ శూన్యమైన అలోకం. మూతపెట్టిన మంజూషలో చీకటి వలె, లోకాలోకాన్ని అతిక్రమించి అత్యంత నిబిడమైన మహాంధకారం ఉన్నది. అండానికి ఉపరితలంలో పెంకు ఒక్కటీ లోపలనున్న వాటిని కప్పివేసినట్లు బ్రహ్మ ఉపకల్పించిన ఈ సృష్టి సర్వాన్నీ ఆవర్తించి అనంతమహాపరిణామంలో బ్రహ్మాండకటాహం స్థిత్యంతానికి నిదర్శనగా ఉంటున్నది.

ఈ విధంగా భూమిపై దృశ్యగోచరా లయిన కులపర్వతాలు, మహార్ణవాలు, జనావాసాల మొత్తం పరిమాణం యాభై కోట్ల యోజనాలు.

సృష్టి స్వరూపం ఇది.''

ఈ రీతిగా నవద్వీపాల మాహాత్మ్యవర్ణనను కర్ణపర్వంగా ఆకర్ణించి పులకితగాత్రుడైన మైత్రేయుడు, ''మౌని కులావతంసమా! పరమ పవిత్రమైన భూమండల స్వరూపాన్ని అతిలోక రమణీయంగా వివరించి చెప్పారు. ఈ భూమితలానికి దిగువ వెలసిన అధోలోకాల వాస్తవ స్వరూపాన్ని సవిస్తరంగా నాకు విశదీకరించండి'' అని అభ్యర్థించాడు.

శిష్యుని కోరికకు సంప్రీతస్వాంతుడై కలకల నవ్వే కన్నులతో ఆప్యాయంగా చూచి, అంగీకార సూచనగా తల పంకించి, పరాశరమహర్షి ఇలా అన్నాడు:—

అధోలోక వర్ణనం

''భూమండలానికి అధోదేశంలో పదేసి వేల యోజనాల దూరంలో ఏడు మహాలోకాలు ఉన్నాయి. ఈ లోకాలకు అతలం,

వితలం, నితలం, గభస్తిమంతం, మహాతలం, సుతలం, పాతాళం అని పేర్లు త్రిలోకవిశ్రుతాలు.

ఈ లోకాల నామధేయాల వలెనే రూపధేయాలు కూడా అభిరామగుణాకరంగా విభాసిల్లుతుంటాయి.

వీటిలో అతలలోకం శుక్లవర్ణమయం. వితలం కృష్ణవర్ణ సమేతం. నితలం అరుణవర్ణాంకితం. గభస్తిమంతం పీతవర్ణ సంయుక్తం. మహాతలం శర్కరావర్ణయుతం. సుతలం శైల వర్ణాన్వితం.

మేదినీవలయానికి అధోవిభాగంలో డెబ్బైవేల యోజనాల దూరాన బంగారు రంగులీనుతూ సముజ్జ్వలంగా ప్రకాశిస్తున్న పాతాళలోకం అభివ్యాప్తమై ఉన్నది.

ఈ అన్ని లోకాలలో దానవులు, దైత్యులు, యక్షులు, భుజగాధీశ్వరులూ నిత్యనివాసులై ఆనందలోకాలలో తేలియాడు తుంటారు.

మైత్రేయా! బ్రహ్మమానసపుత్రుడైన నారదమహర్షి సమస్త లోకాలనూ ఆరసి చూసి ఒకనాడు నాతో—పాతాళలోకం దేవ పురి కంటె దివ్యభోగాలతో దేదీప్యమానంగా విలసిల్లుతున్నదని నొక్కి వక్కాణించాడు. జాతరూపతేజోవిలసితమైన ఆ ప్రదేశంలో నాగరాజుల ఫణామణిగణాలు నిండారిన వెలుగులతో కన్నుల పండుగగా చూపట్టుతుంటాయి. అక్కడ దైతేయ దానవరాజన్యులు ధరించిన తాళిగోణాల పట్టుచెంగులు నేలకు జీరాడుతుంటే, లీలా సర్పభూషణాల చలచ్చేలాంచలాల వలె గోచరిస్తాయి.

పాతాళలోకంలో సూర్యచంద్రులకు తేజోదర్శనమే తప్ప ఉష్ణశైత్యాలు లేవు. వేవెలుగు మిట్టమధ్యాహ్నం కాసిన ఎండకు

నిండువెలుగే కాని వేడిమి ఉండదు. రేవెలుగు నట్టనడిరేయి కురిసిన పండువెన్నెలకు వెలుగుచిన్నెలే తప్ప చల్లదనం లేదు.

దర్శనీయమైన ఆ దివ్యలోకంలో ఎటు చూసినా నిర్మల జలాలతో, నిండైన నడకలతో పారే సెలయేళ్లలో వెల్లివిరిసిన తామర పువ్వుల మత్తెక్కించే మరందబిందువులను గ్రోలి పరవశించిన తుమ్మెదరాజుల మనోహరమైన సంగీతనిస్వనం ప్రతిధ్వనితమై వినవస్తుంటుంది.

నాగలోకం భోగభాగ్యాలకు పుట్టినిల్లు. అక్కడ లభించే భక్ష్యాలు, భోజ్యాలు, లేహ్యాలు, చోష్యాలు, పానీయాలు, సుగంధ ద్రవ్యాలు, అలంకార సామగ్రి, నగలూ నాణ్యాలకు అంతులేదు.

సప్తపాతాళాలకు అధోవిభాగంలో మహాంధకారం నిబిడమై ఉన్నది. దానికి పర్యంతాన సూర్యచంద్రులను మించిన పడగల వెలుగుతో సహస్రశీర్షుడైన ఆదిశేషుడున్నాడు.

ఆదిశేషుడు సర్పకులానికి అధిదైవతం. ఆయన అపర పురుషోత్తమావతారుడు. ఆ అనంతుని అనంత మహామహిమ వర్ణనకు అతీతం; వాచామగోచరం.

సర్పజరరస్వామి భోగమండలం పైన భూమండలం నిలిచి ఉన్నది.

ఆదిశేషుని అనంతవిభవైశ్వర్యాలు అనంత మహిమాన్వితాలు. ఆ సహస్రశీర్షుని శీర్షాలను విభూషించిన కిరీటాలలో పొదగబడిన వారిధరగర్భోద్భూతమణిరత్నాల దివ్యకాంతులు దశదిశలకూ కలయప్రాకి లోకాలకు దీప్తిని ప్రసాదిస్తున్నాయి. ఆయన మధుపానం చేసి మాధుర్య పారవశ్యం వలన మత్తుకలిగి ఎర్రబారిన కన్నులతో ఉద్రూత లూగుతున్నప్పుడు నిఖిల సాగర నదీ నద పర్వతారణ్య సంకులమైన భూమి కంపించి జగమంతా అల్లకల్లోల మౌతుంది.

భోగీశ్వరుని రూపరేఖలను మాటలలో బొమ్మకట్టి చూపడం సాధ్యం కాదు. ఆ సౌందర్యరత్నాకరుని నిశ్వాసపవనాలు హరిచందన పరిమళంతో పాతాళాన్ని సురభిళం కావిస్తున్నాయి.

ఆ విరాట్పురుషుని కన్నులపంటగా సందర్శించిన అప్సర సిద్ధ సాధ్య గంధర్వోరగ చారణులకు కూడా ఆయన ప్రాభవాన్ని సమగ్రంగా వర్ణింపగల వైఖరీశక్తి లేనందుననే ఆ అనంతమహిమునికి అనంతుడని పేరు వచ్చింది.

ఆదిఫణీశ్వరుని సన్నిధానంలో కైలాసశిఖరాలనుంచి దిగివచ్చిన ఆకాశగంగ సన్నగిల్లి పాయలుతీరి ఆయన పాదదేశం చెంత మందగమనంతో ప్రవహిస్తుంటుంది. లాంగల ముసలాలు ఆయన దివ్యలాంఛనాలు.

సచరాచర భూతజాతమూ అనంతుని అనంత కృపాధీనం. ఆ మహనీయుని ఆగ్రహానుగ్రహాలే లోకాలకు విలయస్థితి కారణాలు. ఆయన కరుణాకటాక్షాన్ని ఆశ్రయించిన సత్పురుషుల పుణ్యమే పుణ్యం.

ఈ విధంగా యాభైకోట్ల యోజనాల సువిస్తారమైన భూమండలాన్ని ఆదిశేషుడు తలపూవు చందాన అలవోకగా భరిస్తున్నాడు. ఆయన మహిమగౌరవానికి, క్షితిసంభరణశక్తికి శ్రీమన్నారాయణుని దివ్యప్రభావమే కారణం.

శేషవృదాకువును సద్గురువుగా ఉపాసించి పూర్వం గర్గమహర్షి జ్యోతిశ్శాస్త్రాన్ని, శకున శుభాశుభాలనూ గుర్తెరిగి నిరవధిక పాండిత్యాన్ని గడించాడు. ఆ విద్యాపతిని అర్చించి వైష్ణవజనులు నరకాలను అతిగమించి పుణ్యలోకాలను అధిగమిస్తున్నారు.

నరకలోక వర్ణనం

శేషనివాసమైన పాతాళలోకానికి అధోభాగంలో బ్రహ్మాండ గత గర్భోదకా లున్నాయి. ఈ ఉదకాలకూ, పాతాళానికీ నడిమి తలంలో నానావిధ నరకలోకాలు వెలిశాయి.

నరకంలో దారుణమైన అగ్నివహ్ని నిత్యమూ ప్రజ్వరిల్లు తుంటుంది. పాపవర్తనులై జీవించి మరణానంతరం కర్మఫలాన్ని అనుభవించడానికి జీవులు ఈ ఘోరనరకాలలో ప్రవేశించి యథో చిత శిక్షలను పొందుతారు.

నరకాలు శతసహస్రాధిక సంఖ్యలో ఉన్నాయి. ధర్మకర్త యముడు వీటికి సర్వాధిపతి. అధశ్శిరం, అప్రతిష్ఠం, అవీచి, అవీచి తమం, అసిపత్రవనం, కాలసూత్రం, కృష్ణం, క్రిమిభోజనం, క్రిమీశం, తప్తకుంభం, తమసం, తాలం, దారుణం, పాపం, పూయవాహం, మహాజ్వాలం, రుధిరాంధం, రోధం, రౌరవం, లవణం, లాలాభక్షం, వహ్నిజ్వాలం, విమోహనం, విశాసనం, వైతరణి, శ్వభోజనం, సందంశం, సూకరం—మొదలుగా పాపకర్మోపలక్షణనివాసాలైన ఈ నరకాలు భయానక చిత్రహింసలకు మనికిపట్లు.

పాపవర్తనులైన దుష్కర్ములు తమ తమ కర్మఫలాలను బట్టి ఆ యా నరకాలను పొందుతారు.

న్యాయస్థానంలో ధర్మాధికారి సమక్షంలో కాని, నలుగురూ కొలువుతీరి ధర్మాధర్మాలను విచారించిన ప్రదేశంలో కాని దోషు లకు సహాయం చేయకూడదు. పక్షపాతంతో కూటసాక్ష్యాలు చెప్పి అధర్మపరులకు తోడై ధర్మానికి చేటు కలిగించిన పాపాత్ముడు రౌరవమహానరకంలో పడి కృతాంతశిక్షల వాత బడతాడు.

గర్భస్థశిశువును చంపించినవాడు, సాటి మనిషిని చంపిన వాడు, గోహత్య చేసినవాడు, దారి దోచుకొన్నవాడు రోధ నర కాన్ని చేరి బాధ లనుభవిస్తాడు.

బ్రహ్మహత్య కావించినవాడు, సువర్ణసంపదలను అపహరించినవాడు, మద్యపానం చేసినవాడు, వీరితో స్నేహం చేసినవారు సూకరనరకాన్ని పొందుతారు.

క్షత్రియ వైశ్య కులజులను కూల్చినవారు, అధ్యాత్మగురువు భార్యతో అక్రమసంబంధం పెట్టుకొన్న నయవంచకులు, తాల నరకాన్ని చెందుతారు.

తోబుట్టువులతో సంగమించిన నీచులు, రాయబారిని వధించిన వారు భీకరమైన తప్తకుంభనరకంలో పాపఫలితాన్ని చవిచూస్తారు.

ఆప్తులను, మిత్రులను, అపరిచితులను నమ్మించి మోసం చేసిన విశ్వాసఘాతకులు, స్వలాభం కోసం భార్యను అమ్మజూపిన వాళ్లు, చెరసాల కాపరులు, గుర్రాల వర్తకులు తప్తలోహ నరకంలో బాధలకు గురవుతారు.

శారీరకవాంఛతో మత్తెక్కి వావివరుసలు లేకుండా కూతురితోనూ, కోడలితోనూ సంగమదోషానికి పాల్పడ్డ దుర్మార్గులకు మహాజ్వాలనరకం ప్రాప్తిస్తుంది.

పరావిద్యను ఉపదేశించిన గురువును అగౌరవించి కీడు తలపెట్టినవారు, వేదాలను దూషించి అశౌచాన్ని తలపెట్టినవాళ్లు, వేదవిక్రయులు, అన్యకాంతలతో కామచారులై ప్రవర్తించినవారు లవణనరకంలో ప్రవేశిస్తారు.

ఆచారసంప్రదాయాల లోని మేలిమిని వ్యతిరేకించి సన్మార్గాన్ని తప్పినవారు, పరుల సొమ్ముకోసం ఆశపడే చోరులు విమోహ నరకానికి గమిస్తారు. తండ్రిని ద్వేషించిన కృతఘ్నుడు, బ్రహ్మవేత్తలనూ దైవాన్నీ దూషించిన అవివేకులు, అమూల్యసంపదలను పాడుపెట్టిన జ్ఞానహీనులు క్రిమిభోజన నరకంలో పడతారు.

పరులకు అపకారాన్ని తలపెట్టి క్షుద్రశక్తులను ఆరాధించిన దుర్జనుడు, అతని మందిమార్బలం క్రిమిశనరకం లోని ఇక్కట్లకు చిక్కుతారు.

పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని తాను భుజించేముందు దేవతలకు, ఋషులకు, పితరులకు సమర్పించి ఋణవిమోచనం పొందని దౌర్భాగ్యులు లాలాభక్షనరకంలో శిక్షార్హు లవుతారు.

శత్రుసంహారానికై ప్రయోగించే బాణాలను తయారుచేసిన ఆయుధకారకులు వేధక నరకానికీ, కుంతం తోమరం పట్టిసం గద మొదలైన ఇతర శస్త్రాలను తయారుచేసిన కార్మికులు అతిభయంకర మైన విశసననరకానికీ పాపఫలాన్ని అనుభవించడానికి వెళ్తారు.

ఈ తీరున జీవులు ఆచరించే దుష్కర్మ లన్నిటికీ ఒక్కొక్క విధమైన నరకం ఉన్నది.

ధర్మవ్యతిరేకంగా తన అనుయాయుల వద్దనుంచి బహుమతులను స్వీకరించిన మదోన్మత్తులు, క్షుద్రశక్తులకు ఆహుతులను వ్రేల్చిన ఆచారవిహీనులు, జాతకఫలాలను చెప్పడానికి జ్యోతిశ్శాస్త్రాన్ని నేర్చుకొన్నవారూ అధోముఖనరకవాసానికి వినిర్గమిస్తారు.

ఇంటిలో పిల్లలకు తెలియకుండా మధురభక్ష్యాలను రహస్యంగా భుజించిన నిర్దయాత్ములు, తేనె నువ్వులు నూనె నెయ్యి పాలు పెరుగు బెల్లం మజ్జిగ మద్యమాంసాలను విక్రయించిన బ్రాహ్మణులు, పక్షులు మృగాలు మొదలైనవాటిని స్వేచ్ఛగా సంచరింపనీయక బంధనాల్లో ఉంచి పెంచినవాళ్లు, చేపలు పట్టి జీవించేవాళ్లు, రంగస్థలం పైన జనసమక్షంలో తమ విద్యను ప్రదర్శించినవాళ్లు, వేశ్యలను నమ్ముకొని నీచంగా బ్రతికే పరాన్నభుక్కులు, విషం పెట్టినవారు, రహస్యాలను చేరవేసినవారు, భార్యను వ్యభిచారానికి దింపినవారు, పర్వసమయంలో విధి నియతు

లను పాటింపనివారు, ఇల్లు కాల్చినవారు, విశ్వాస ఘాతకులు, తాంత్రికులు, కొండెగాండ్రు, క్రతుసమయంలో సోమరసాన్ని అమ్ముకొన్న బ్రాహ్మణుడు, నయవంచకుడు ఘోరాతిఘోరమైన రుధిరాంధంలో బాధలను అనుభవిస్తారు.

తేనెపెరలను రేగగొట్టిన వాడు, గ్రామానికి చేటు కూర్చిన వాడు, అసత్యవాది వైతరణినరకం లోనికి త్రోసివేయబడతారు.

ఇతరుల భూమిని ఆక్రమించినవారు, వంశాచారం తప్పి చరించినవారు, కలుషాత్ములు, మోసంచేసి బ్రతికేవాళ్లు, పరభాగ్యోపజీవులు అధమమైన కృష్ణనరకం లోనికి కూలి దారుణవ్యథలను చవిచూస్తారు.

అడవులలో పెరుగుతున్న వనవృక్షాలను ఛేదించి జీవనాధారాన్ని సమకూర్చుకొన్నవాడు అసిపత్రవనంలో చిక్కి అనేక సంవత్సరాల దుర్భర వేదనను అనుభవిస్తాడు. ఉన్ని కోసం, చర్మ మాంసాల కోసం గొర్రెలను మేపి జీవించేవాడు, జంతువులను వేటాడినవాడు వహ్నిజ్వాల నరకానికి వెళ్తారు. ప్రాయశ్చిత్తం లేని వ్రతలోపం ఆచరించినవాడు, ఆశ్రమధర్మచ్యుతిని పొందినవాడు, ఆడి తప్పిన వాడు సందంశనరకానికి వెళ్లి యథోక్తంగా ఘోరశిక్షల పాల్పడతారు.

పగటివేళ శయనించిన బ్రహ్మచారి, తనకు తెలియకుండానే వీర్యస్ఖలనం చెందిన కాముకుడు, తమ సంతానం ఎంత జ్ఞానవృద్ధులైనప్పటికీ వారిచేత ఆధ్యాత్మికోపదేశం పొందినవాళ్లూ శ్వభోజ మహానరకంలో యాంతనలను అనుభవిస్తారు.

ఈ విధంగా ఉపబోధ్యమైనవే కాక ఇంకా అనేక శత సహస్రవిధాల మహానరకాలు పాతాళలోకానికి అధోభాగంలో, బ్రహ్మాండగత గర్భోదకాల పైన కానవస్తాయి.

మానవులు ఆచరించిన, ఆచరింపగల పాపకృత్యాలు ఎన్ని ఉన్నాయో ఆయా దుష్కృతాలకు ఫలితంగా వారు అనుభవించే నరకాలూ అన్ని ఉన్నాయి. పుణ్యాత్ములు స్వర్గనివాసానికి వెళ్లి వర్ణనాతీత సుఖానుభవాన్ని పొందినట్లే—దేశాచార కులాచారాలను వ్యతిక్రమించిన పాపాత్ములు భయానక నిరయాలకు వెళ్లి నరక కూపంలో దారుణ బాధలను అనుభవిస్తారు.''

అని ఈ విధంగా పరాశరమహర్షి నరకస్వరూపవివిదిషతో శ్రద్ధాళువై తన వచనాలను ఆలకిస్తున్న శిష్యవతంసుని ప్రేమ పూర్వకంగా పరికించి, కించిన్మందహాసం చేశాడు. పరేంగితవిదుడైన ఆ మహనీయునికి తన శిష్యుని మనస్సులో ఉప్పొంగుతున్న ఆలోచనాతరంగాలు కూలంకషంగా అవగత మైనాయి. నరక స్వరూపాన్ని గుర్తెరిగి, పాపపుణ్యఫలానుభవాన్ని గ్రహించిన వివేకులు కూడా తెలిసో తెలియకో పాపకృత్యాన్ని ఆచరించినప్పుడు వారికి కర్తవ్యం ఏమిటి? తాము చేసిన తప్పు తెలిసికొని, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నవారికి నరకప్రాప్తి తప్ప వేరే గత్యంతరం లేదా? అని మైత్రేయుడు ప్రశ్నించకముందే ఆయన సందేహ నివృత్తికి ఉపక్రమించాడు.

విష్ణుధ్యాన ఫలం

''మైత్రేయా! లోచూపుతో ఆలోచించి చూస్తే ఈ స్వర్గమూ నరకమూ అన్నవి ఇహలోకంలోనే తప్ప వేరే లేవని అనిపిస్తుంది. హృదయం ఒక అమందమైన ఆనందానుభవానికి స్పందించడమే స్వర్గం. హృదయానికి దుఃఖం వాటిల్లడమే నరకం.

విదితంగా కాని, అవిదితంగా కాని జీవి ఆచరించిన దోషాదోషాలు అన్నింటికీ ప్రాయశ్చిత్త విధులు ఉన్నాయి. దుష్కర్మలను

చేసినవాళ్లు అందుకై ఉపదిష్టమైన ప్రాయశ్చిత్తాన్ని నిర్వర్తించి పాపవిమోచనం పొందవచ్చునని స్మృతిశాస్త్ర నిర్ణయం.

పూర్వం స్వాయంభువాదులైన మనువులు, గౌతమ యాజ్ఞవల్క్యాదులైన మహామునులు లోకోపకారార్థం పాపకర్మలకు అనురూపమైన ప్రాయశ్చిత్త విధులను సమగ్రంగా నిరూపించారు. ఇందుచేత పాపఫలం ఉపశమించి, నిరవధిక పుణ్యలోక సుఖాలు కలుగుతాయి.

నాయనా! ప్రాయశ్చిత్తం లేని పాతకకర్మల నుండి కూడా విముక్తిని ప్రసాదించి, అపూర్వమైన పుణ్యఫలానుభోగ్యతను కరుణించే తరుణోపాయం శ్రీమన్నారాయణుని నామస్మరణం.

ఊహాగోచరమైన సుఖభోగాలకు, స్వర్గాపవర్గాలకూ అతీతమైన కైవల్యపదాన్ని అభిలషించిన శోకార్తులకు శ్రీమహావిష్ణువు నామజపం కంటె పాలనీయధర్మం వేరొకటి లేదు. అధ్యాత్మతత్త్వానుసంధానం చేత నశింపని పాపచయం, క్రతుదీక్షితులై దానధర్మాలు చేసినా లయింపని పాతకం, జపతపోనుష్ఠానాలు వ్రతాలూ ఉపవాసాలూ ఆచరించినా తొలగని దుష్కృతమూ కూడా భక్తిసంయుతంగా శ్రీమన్నారాయణుని హృదయసద్మంలో పాదుకొలిపి, వేదవేద్యా! బోధగమ్యా! నాదబ్రహ్మానందమయా! త్రివిక్రమా! చక్రపాణీ! లోకసన్నుతా! అచ్యుతా! నారాయణా! హృషీకేశా! కేశవా! దామోదరా! గోవిందా! ముకుందా! పరమానందా! జనార్దనా! విష్టరశ్రవా! దుష్టసంహారా! పరాత్పరా! హరీ! దైత్యారీ! మురారీ! అని నోరారా స్మరించినప్పుడు పాపసంచయం పటాపంచలై పోతుంది.

వాసుదేవుడు భక్తరక్షణకళాపూర్ణోదయుడు. ఆ పుండరీకాక్షునితో స్వస్వరూపానుసంధానం కావించుకొని శ్రీవల్లభుని దివ్య

నామసంకీర్తనంతో జీవితాలను పండించుకొన్న ముముక్షువులు అనితరసాధ్యమైన కైవల్యభోగాన్ని ఉపార్జింపగలుగుతున్నారు.''

ఊర్ధ్వలోకాల స్వరూపకథనం

ఈ విధంగా పరాశరమౌని విశదీకరింపగా నరకలోక నివారకమైన శ్రీవత్సాంకుని దివ్యనామవైభవాన్ని భక్తిపారవశ్యంతో ఆలకించిన మైత్రేయుడు పులకితగాత్రు డయ్యాడు. బృందారక లోకం లోని కుందారవింద మందార మకరంద బిందునిష్యంద మైన సుందర గోవింద కథాసందర్భానికి సంస్పందించి అమందానందం కందళించిన డెందంతో నందనందనునికి వందనా లందించి, ''వందనీయ చరితా! కందువచూపుతో వింధైన మీ పొందికను చెంది, కందెరలు డింది ఇందిరామందిరుని నామసంకీర్తన మహిమను గ్రహించాను. ఆ పరమానందముకుందుని సుప్రభావం విస్తరిల్లిన భువరాది లోకాల స్వరూపాన్ని గురించి నాకు సంపూర్ణంగా తెలియజెప్పండి'' అని ప్రార్థించాడు.

ఆచార్యవచనశుశ్రూషానిరతు డైన శిష్యుని సంశయానికి సమాధానంగా పరాశరమహర్షి ఊర్ధ్వలోకాల స్వరూపవర్ణనకు ఉపక్రమించాడు:

''మైత్రేయా! ప్రతినిత్యమూ సుధాకర దివాకర కాంతిరేఖలు ప్రసరించి దర్శనీయమై గోచరిస్తున్న ఈ చతుస్సముద్ర ముద్రిత ధరావలయం యాభైకోట్ల యోజనాల వైశాల్యాన్ని కలిగి ఉన్నది. ఈ భూమితలానికి ఉపరిభాగంలో అంతే ప్రమాణంలో ఆకాశ మండలం కనుపిస్తుంది. భూమికి శతసహస్ర యోజనాల దూరంలో దేదీప్యమానమైన సూర్యమండలం, అక్కడినుంచి లక్షయోజనాల దూరంలో చంద్రమండలం దివారాత్రాలకు మూలద్రవ్యాలై వెలుగొందుతున్నాయి. చంద్రునికి లక్షయోజనాల అవతల నక్షత్ర

మండలం, అక్కడికి రెండేసి లక్షల యోజనాల వెందలాన బుధ శుక్ర అంగారక బృహస్పతి శనైశ్చర మండలాలు వరుసగా విభాసిల్లుతున్నాయి. శనిస్థానానికి లక్షయోజనాల బహిర్నిలయంలో సప్తర్షిమండలం, ఆ తర్వాత సర్వోపరిగా ధ్రువపదం విరాజిల్లుతున్నాయి. ఈ ధ్రువమండలం లోనే ఉత్తానపాదుని పుత్రుడై, శ్రీమహావిష్ణువు కరుణాతిరేకం వలన దివ్యవరప్రసాదితుడైన ధ్రువుడు వేయి దివ్యయుగాల ప్రమాణంతో ఆకల్పాంతమూ అధివసించి జ్యోతిశ్చక్రానికి ఆధార మయ్యాడు.

ధ్రువమండలానికి నూరు లక్షల యోజనాల సుదూరంలో మహాస్సంపన్నమైన మహర్లోకం ఉన్నది. ఇది యోగనిష్ఠాగరిష్ఠులైన సంయమీంద్రులకు ఆనందనిలయం. కర్మవశాన భూమండలంపై నిలిచి తమ అసాధారణ తపోబలం వలన మహర్లోక నివాస భాగ్యానికి నోచుకొన్న భృగ్వాది మహాఋషులు బ్రహ్మదివస పర్యంతం ఇక్కడ ఉంటారు.

మహర్లోకానికి రెండు కోట్ల యోజనాల అవతల ఉన్నది జనలోకం. కేవల సత్త్వస్వరూపులై శ్రీమన్నారాయణ చరణ స్మరణంతో ముక్తిశిఖరాలను అధిరోహించిన సనకసనందన సనాతన సనత్కుమారులూ, మహాయోగులూ నివసించే పుణ్యక్షేత్రం ఇది.

ధ్రువపదానికి ఏకాదశకోటి యోజనాల అవతల తపోలోకం వెలిసింది. ఈ లోకవాసులైన వైభ్రాజులు దివ్యతేజోమయాత్ములు. వీరి సమక్షంలో అగ్నికి దాహకత్వశక్తి లేదు.

తపోలోకానికి పన్నెండు కోట్ల యోజనాల తలపాలంలో అఖండసచ్చిదానందరూపమైన సత్యలోకం ఉన్నది. నిర్వికల్పమైన ఈ బ్రహ్మమండలంలో ఉనికిని పొందిన మహాత్ములకు ఉత్తరజన్మ భయాలు లేవు.

మరొక విధంగా చెప్పాలంటే భూమండలం పాదచారులైన మానవులకు యానగమ్యం. కాశ్యపీఖండం మొదలుకొని సూర్య మండలం వరకు విస్తరిల్లిన వాతావరణమండలానికి భువర్లోకమని నామధేయం. ఈ భువర్లోకం కామగమనులైన అప్సరసలకు, సిద్ధ సాధ్య గణాలకూ ఇరవుపట్టు. గభస్తి మద్గోళం నుంచి పధ్నాలుగు లక్షల యోజనాల పార్యంతిక దేశం స్వర్లోకం.

భూర్భువఃస్వర్లోకాలకూ, జనతపఃసత్యలోకాలకూ నడుమ కానవచ్చేది మహర్లోకం.

భూతలం నుంచి స్వర్లోకం వరకు వ్యాపించినవి కృతక లోకాలు. ఇవి కల్పాంతం వరకు స్థితిమంతాలై సృష్టిప్రళయం జరిగి నప్పుడు అణగిపోతాయి. జనలోకం మొదలు సత్యలోకం దాకా ఉన్నవి అకృతకలోకాలు. ఇవి పద్మభవు డున్నంత కాలమూ ఉండి ఆ తరువాత విలయాన్ని చెందుతాయి.

సప్తలోకాల నడుమ పొడమిన మహర్లోకం ఈ ఉభయ లక్షణలక్షితమై, కల్పాంతం సంభవించిన వేళల్లో కొంత కొంతగా లయించి బ్రహ్మదివసావసానంలో ఊర్ధ్వలోకాలతో పాటు సంహృతిని పొందుతుంది.

సూర్యుని స్యందనం

భూమండలానికి ఉత్తరాభిముఖంగా లక్షయోజనాల సుదూ రంలో చతుర్భుజతేజోంతర్వర్తి ఐన శ్రీ సూర్యనారాయణుడు మహాప్రమాణవంతమైన దివ్యరథాన్ని అధిరోహించి లోకాలకు కాంతిని ప్రసాదిస్తున్నాడు.

అత్యంత విశాలమైన సూర్యస్యందనం నూటయాభై ఏడు లక్షల యోజనాల దీర్ఘమైన ఇరుసుపై నిర్మితమైంది. ఈ ఇరుసుకు

ఒకవైపు మనుష్యకాలమానానికి ఆధారభూతమయిన కాలచక్రం బిగింపబడి ఉన్నది.

కాలచక్రం వినిర్మితి కూడా అసాధారణంగా గోచరిస్తుంది. దీనికి నడుమ పొడిచిన తూములు మూడు ఉన్నాయి. చక్రాన్ని చుట్టుకొనివచ్చి అయిదు కడకమ్ములూ, బాహ్యపరిధిలో ఆరు అంచులూ కానవస్తాయి.

కాలచక్రం ఒకసారి ఆవృత్తిని చెందినప్పుడు మానవులకు శరత్సమాపనం జరిగి మళ్లీ సంవత్సరారంభం అవుతున్నది.

సూర్యరథానికి కాలచక్రాన్ని బిగించిన ఇరుసుకు మరొక వైపున లంబమానమైె ఒక నిలువుదిమ్మ ఉన్నది. ఈ దాపలి దిమ్మ అగ్రభాగాన్నుంచి లాగి కట్టిన త్రాళ్ల కొసలు జ్యోతిశ్చక్రసంయుతుడైన ధ్రువుని కడచేతిలో పట్టు తప్పకుండా నిలిచి ఉన్నాయి.

రవిస్యందనానికి బిగించిన కాడి కూడా అతిదీర్ఘమయినది. కాని బండి నొగను దీనికి సరిగా మధ్యప్రదేశంలో కట్టలేదు. గుర్రాలు బేసి సంఖ్యలో ఉన్నందువలన, ఈషను బిగించిన చోటికి కుడివైపున నూటయాభై ఏడు లక్షల యోజనాల నిడివిగల మెడంలో నాలుగు రథాశ్వాలు, ఎడమవైపున నలభై అయిదు లక్షల యోజనాల నిడివి ఉన్న చోట మూడు రథాశ్వాలు పూన్చబడ్డాయి. బండి కాడికి కూడా వలవలి వైపున మరొక ఎత్తైన నిలువుదిమ్మ ఉన్నది.

తేరికి రెండు వైపులలో ఒకదానికొకటి ఎదురెదురుగా ఉన్న దిమ్మలు వేరు వేరు కోణప్రమాణాలను కలిగినందున సూర్యరథం గానుగెద్దు వలె ఎల్లవేళలా గుండ్రంగా తిరగడం సంభవిస్తున్నది. ధ్రువుని కరగతమై ఉన్న రశనల నిడివి పెరిగినప్పుడు దూరం కూడా అధికమై దక్షిణాయనమూ, తరిగినప్పుడు దూరం స్వల్పమై ఉత్తరాయణమూ ఏర్పడతాయి.

పుష్కరద్వీపం లోని మానసోత్తరభూముల పైన సూర్య రథానికి బిగించిన కాలచక్రం కదలాడుతున్నప్పుడు దాని ప్రభావం వలన పుష్కరద్వీపవాసులకు కాలపరిగతి ఏటేటా తెలియ వస్తున్నది.

స్వచ్ఛందతనువైన శ్రీ సూర్యస్యందనానికి షడ్వింశతిచ్ఛందాలలోని ఏడు పవిత్రాకృతులు—గాయత్రి (ఇది పాదానికి ఆరేసి అక్షరాలు గల షష్ఠచ్ఛందం. ప్రస్తారవశాన దీనినుండి అరవై నాలుగు సమవృత్తాలు జన్మించాయి), బృహతి (ఇది నవమచ్ఛందం. ఇందులో ప్రతి చరణం లోను తొమ్మిదేసి వర్ణాలు, ప్రస్తారం చేయగా అయిదువందల పన్నెండు సమవృత్తాలు కని పిస్తాయి.), ఉష్ణిక్కు (నూటయిరవై ఎనిమిది సమవృత్తాలు కలిగిన ఈ సప్తమచ్ఛందంలో ఒక్కొక్క పాదానికి ఏడు వర్ణాలు కూర్చ బడతాయి.), జగతి (పన్నెండవ ఛందమైన ఈ రూపంలో చర ణానికి ద్వాదశాక్షరాలు, గురులఘువుల విన్యాసభేదం వలన నాలుగు వేల తొంభై ఆరు సమవృత్తాలూ ఏర్పడ్డాయి.), త్రిష్టుప్పు (ఏకాదశచ్ఛందమైన ఇందులో రెండువేల నలభై ఎనిమిది సమవృత్తభేదాలు పాదానికి పదకొండు వర్ణాల చొప్పున ఉప్పతిల్లాయి.), అనుష్టుప్పు (ప్రసిద్ధమైన ఈ అష్టమచ్ఛందంలో పాదానికి ఎనిమిదేసి వర్ణాల ప్రకారం గురు లఘు స్థానవినిమయం చేత రెండువందల యాభై ఆరు సమవృత్తాలు పుట్టాయి.), పంక్తి (ఈ దశమచ్ఛందంలో ప్రతి చర ణానికి పదేసి అక్షరాలు ఉంటాయి. ఇందులో ప్రస్తారవశాన వేయిన్ని ఇరవై నాలుగు సమవృత్తాలు కలిగాయి. ఈ ఛందా లన్నింటిలోనూ ఇవే కాక ఇంకా అనేక గతిభేదాలు శాస్త్రదృష్టికి గోచరిస్తాయి.)—తురంగాలై పరిఢవిల్లుతున్నాయి.

సూర్యుని రథం: ఒక వివరణ

[విష్ణుపురాణం సంస్కృతమూలంలో లభిస్తున్న పాఠాన్ని బట్టి సూర్యరథస్వరూపం స్పష్టంగా అర్థం కావడం లేదు. ఆంగ్లానువాదానికి విల్సన్ పండితుడు స్వీకరించిన మాతృకను అనుసరించి రథం నిడివి తొమ్మిదివేల యోజనాలు. దీనికి బిగించి పద్దెనిమిదివేల యోజనాల బండి నొగ రథం నిడివికి రెట్టింపు పరిమాణంలో ఉన్నది. ఒక ఇరుసు నూటయాభైఏడు లక్షల యోజనాలది, మరొకటి నాలుగువేల అయిదువందల యోజనాలది—ఆదిత్యవాహనానికి రెండు ఇరుసులున్నాయి. వీటిలో మొదటి ఇరుసుకు వెలుపలి అంచున స్థగిత మయినది కాలచక్రం.

విల్సన్ ప్రతిలో నలభైఅయిదువేల యోజనాలకు బదులు నాలుగువేల అయిదువందల యోజనాలని పొరపాటుగా అచ్చయిందేమో తెలియదు. వెన్నెలకంటి సూరకవి ఆంధ్ర శ్రీవిష్ణుపురాణంలో రెండవ అక్షం కొలత నలభైవేల యోజనాలని ఉన్నది. ఈయన రథానికి ఇరవై అయిదువేల యోజనాల ప్రమాణంగల మూడవ ఇరుసు కూడా ఉందని, కాలచక్రం నాభులలో నుంచి అక్షాలను సరికూర్చారనీ వ్రాశాడు. విష్ణుపురాణం ఆంగ్ల—హిందీ అనువాదాలలో దేనిలోనూ ఈ మూడవ ఇరుసు ప్రసక్తి కనబడదు. లఘుచక్రాలు లేనప్పుడు శతాంగానికి అక్షత్రయం వలన ప్రయోజనం ఏమిటో వ్యాఖ్యాతలు వివరించలేదు.

మత్స్యపురాణం ప్రస్తావించిన సూర్యరథ ప్రమాణం వేరొక విధంగా కనుపిస్తున్నది. దీని ప్రకారం రథం పొడవు, వెడల్పు పదేసివేల యోజనాలతో నలుచదరంగా ఉన్నది. వాయుపురాణం ఈ పాఠంతో సంవదిస్తుండగా, భాగవత పురాణంలో రథభాగం పొడవు ముప్పైఆరు లక్షల యోజనాలు, వెడల్పు తొమ్మిది లక్షల

యోజనాలూ అని పేర్కొనబడింది. లింగపురాణం భాగవత పాఠంతో సంవదిస్తున్నది.

కాల చక్రానికి ఉన్న నాభులు మూడూ ఉదయం మధ్యాహ్నం రాత్రులకు సంకేతమని విష్ణుపురాణ వ్యాఖ్యాతలు వ్రాశారు. అంచులు ఐదూ అయిదు సంవత్సరాలని, ప్రభవాదిగా అరవై సంవత్సరాలు కావడానికి పన్నెండు ఆవృత్తు లవుతాయని, చక్రం కడకమ్ములు ఆరూ ఆరు ఋతువులకు ప్రతీకలని వీరి భావన. మూల పాఠంలో ఈ వివరణం లేదు. భాగవత పురాణం ప్రకారం కాల చక్రం తూములు మూడూ వేసవి కాలం, వర్షాకాలం, చలి కాలాలను సూచిస్తాయని, చక్రానికి అంచులు అయిదు కాక పన్నెండు నిలిచి పన్నెండు నెలలను ఏర్పరిస్తాయని తెలుస్తున్నది.

భవిష్య, మత్స్య, వాయు పురాణాలలో హరిదశ్వ రథ వర్ణనం కొంత విస్తృతంగా గోచరిస్తుంది. రథంలో చోదకుడు కూర్చునే భాగం సంవత్సరానికి కారకం. బండి కాడికి, ఇరుసుకు బిగించిన మేకులు అర్థ కామాలకు గుర్తు. బండికి అడుగున బిగించిన చట్రం రాత్రి. కాల మానం లోని నిమేషాలే రథచక్రానికి యానగమ్యాలు.

భాగవత పురాణం కూడ విల్సన్ పండితుడు స్వీకరించిన విష్ణు పురాణ మూల పాఠంలో వలె స్యందనానికి రెండు ఇరుసులు ఉన్నాయని, పెద్ద ఇరుసు ప్రమాణంలో నాలుగోవంతు చిన్న ఇరుసు ప్రమాణం—అంటే ముప్పైతొమ్మిది లక్షల ఇరవై అయిదు వేల యోజనాలని పేర్కొన్నది.

మహాభారతం ఆది పర్వంలో ఈ కాల నియమనం రవిరథం చేత కాక మరొక విధంగా చెప్పబడింది. పాతాళ లోకంలో ధాత, విధాతలు స్త్రీరూపంలో తెలుపు, నలుపు దారాలను పేనుతుంటారు. ఆ దారాలే అహోరాత్రాలు. పన్నెండు కమ్ములు కలిగిన కాల

చక్రాన్ని ఆరుగురు కుమారులు అహర్నిశమూ పరివరిస్తుంటారు. ద్వాదశారచక్రం పన్నెండు నెలల సంవత్సరానికి, కుమార షట్కం ఋతువులకూ సంకేతం.

దీనివలన మహాభారత కథనానికీ విష్ణుపురాణ పాఠానికీ వైషమ్యం ఉన్నదని భావింపకూడదు. ఉదంకోపాఖ్యానంలో శిష్యునికి పైలమహర్షి వివరీకరించినది పాతాళలోక స్వరూపం. ప్రకృతార్థం విష్ణుపురాణంలో చెప్పబడినది భూలోకవాసులకు అనుభూయమానమయిన కాలస్వరూపం. ఈ రెండింటి ప్రమాణాలూ వేర్వేరని ఇంతకు ముందే పరాశరుడు మైత్రేయునితో అన్నాడు.

భారతీయ శిల్పాలలో చిత్రితమైన సూర్యరథం బోధాయనుని శుల్బసూత్రాలను అనుసరించినట్లు మనం సులభంగానే ఊహింపవచ్చు. ఋగ్వేద ఆర్యులు ఉపయోగించిన రథం, క్రీస్తుపూర్వ సహస్రాబ్దంలో ఈజిప్టు, ఐరోపీయ శిలాయుగాల నాటి మానవులు నిర్మించిన రథం కొంచెం ఇంచుమించుగా ఇటువంటివే.]

మానసోత్తర మహాశైలం తూరుపు సానువుల పైన పాకశాసనుడు పరిపాలిస్తున్న వస్వౌకసారాపురం దివౌకసులకు నిలయమై విభాసించింది.

బిడౌజ రాజధానికి ఆగ్నేయదిశలో యమధర్మరాజు అధీనమై నెలవొందిన సంయమనీపురం గోచరిస్తుంది.

యమపురికి ఉత్తరదిక్కులో సోమదేవుని ఆవాసమైన విభావరీపురమూ, మానసోత్తరానికి అపరసానువులపై వరుణదేవుని ఏలుబడిలో ముఖ్యపట్టణమూ ఉన్నాయి.

ఈ విధంగా పుష్కరద్వీపం లోని మానసోత్తర పర్వతాలపై వెలసిన పట్టణాలు నాలుగూ అనేక యోజనాల వైశాల్యం కలిగి సూర్యకాంతి పౌష్కల్యం చేత అభివర్ణనీయ తేజోభిరామంగా రూపొందాయి.

ఆకాశ మధ్యంలో సూర్యుడు అవ్యయంగా ప్రకాశిస్తున్నప్పుడు భూతలం పైని పరస్పరాభిముఖంగా ఉన్న ద్వీపాలలో ఒకచోట పగలు, మరొకవైపున రాత్రి ఏకకాలంలో సంభవిస్తాయి. అంధకారావరణలో నుంచి ఆదిత్య దర్శనం కలిగినప్పుడు సూర్యోదయమయినదనీ, సూర్యతేజోమూర్తి కానరానప్పుడు సూర్యాస్తమయం జరిగిందనీ సంభావిస్తామే తప్ప నిత్యుడైన ఆదిత్యునికి ఉదయాస్తమయాల వికల్పాలు లేవు.

భూలోకవాసులకు కమలాప్తదీప్తి కలిమిలేముల వలన దివారాత్రాలు కలుగుతున్నాయి. ఘడియలు, నిమేషాల గణనం ఏర్పడుతున్నది.

ఈ విధంగా అఖండమైన కాలస్వరూపం సాక్షాన్మహావిష్ణువైన శ్రీ సూర్యనారాయణుని తేజోదర్శనం వలన ఖండమై విద్యోతించి లోకంలో జ్యోతిర్విద్య ఆవిర్భవించింది.

భూమండలానికి ప్రాక్పశ్చిమ దక్షిణోత్తర భాగాలలో ఏ వైపున సూర్యుని ఉనికి ఉన్నదో, స్థానాన్ని బట్టి మానసోత్తర నగానికి ఆ వైపున ఉన్న మూడు పురాలలో సూర్యరశ్మి వ్యాపిస్తుంది. అహంమిత్రునికి సమీపవర్తులకు వెలుగు, దూరచరిష్ణువులకు చీకటి కలుగుతాయి.

ఆకసం నట్టనడుమ మార్తాండ మయూఖాలు వెలుగొందుతున్నప్పుడు వస్వోకసారాపురంలో ప్రాభాతం, సంయమని లో మధ్యాహ్నం, ముఖ్యపురంలో సాయాహ్నం, విభావరిలో మధ్యరాత్రమూ ఏకసమయంలో కలుగుతాయి. ఈ ప్రభావం ఒక్కొక్క మండలంలో ముప్పైఆరు ముహూర్తాల పర్యంతం ప్రసరించి అనంతరీయ కాలం ప్రవేశిస్తూ ఉంటుంది. ఈ పురాలలో హిరణ్యాగర్భుడు ఉదయించిన దిశకు తూర్పు అని, అస్తమించిన దిగ్భాగానికి పడమర అని సంజ్ఞలు వర్తిస్తాయి.

దివారాత్రాల పర్యాప్తి

భూమండలానికి సర్వమధ్యంగా నిలిచిన మేరుపర్వతం శిఖరాగ్రం పైన కనకప్రభామండితమైన బ్రహ్మసభ ఉన్నది. జ్యోతిశ్చక్రగతమైన సూర్యగ్రహం సర్వకాల సర్వావస్థల లోనూ ఈ మేరువుకు దక్షిణ దిక్కులో స్థితమై ఉంటుంది. సూర్య కిరణాలు ఉత్తరానికి ప్రసరించి స్వర్ణాద్రిని తాకినప్పుడు, దుర్నిరీక్ష్యమైన పద్మగర్భ పరిషత్కాంతుల వలన పరావర్తనం చెంది భూలోకంలో రాత్రింబవళ్లు కలుగుతాయి.

బ్రహ్మసభను చుట్టి సూర్యుడు ఉత్తరాభిముఖంగా పరిభ్రమిస్తున్నప్పుడు మకర సంక్రాంతి వేళ మొదలు కుంభ మీన మేష వృషభ రాశుల మీదుగా మిథునాన్ని దాటేవరకు ఆరునెలల కాలం ఉత్తరాయణం. అక్కడినుంచి సూర్యుడు దక్షిణాభిముఖంగా బయలుదేరి కర్కాటకం మొదలు సింహ కన్యా తులా వృశ్చికాల మీదుగా ధనూరాశిని అతిగమించే దాకా దక్షిణాయనం.

సూర్య సంచారమార్గంలో రాశిచక్రం ముప్పదేసి ముహూర్తాలు గల పన్నెండు భాగాలుగా విభజింపబడి ఉన్నది. సూర్యుడు ఒక్కొక్క రాశిలో రెండు నక్షత్రాలపై ఒక్క పాదం లెక్కన తొమ్మిదేసి పాదాలుగా ఇరవైఏడు నక్షత్రాలను యథాక్రమంలో అనుగమించినప్పుడు ఉత్తరాయణంలో పదమూడున్నర నక్షత్రాలలో పగళ్లు పద్దెనిమిది ముహూర్తాలు, రాత్రిళ్లు పన్నెండు ముహూర్తాలు చరిస్తాడు. దక్షిణాయనంలో మందవేగుడై నడిచినప్పుడు పదమూడున్నర నక్షత్రాలలో పగళ్లు పన్నెండు ముహూర్తాలు, రేలు పద్దెనిమిది ముహూర్తాలూ గడుస్తాయి.

మేరువుకు ప్రదక్షిణం కావిస్తున్న సూర్యుని గమనాన్ని కుమ్మరివాని చేతిలోని సారెతో సరిపోల్చవచ్చు. కులాల చక్రం పరిధి

అతివేగంగా తిరిగినట్లుగా సూర్యుడు దక్షిణాయనంలో పరిభ్రమిస్తున్నప్పుడు పగళ్లు కురచగానూ, రాత్రులు దీర్ఘంగానూ ఉంటాయి. కదిలేటప్పుడు కుమ్మరి చక్రపు నడిమి సెమ్మె అల్పవేగంతో కనిపించినట్లు ఉత్తరాయణ కాలంలో పగళ్లు ద్రాఘిష్ఠం గానూ, రాత్రులు అల్పీయం గానూ కలుగుతాయి. మేష తులా సంక్రమణాల విషువత్పుణ్యకాలంలో మాత్రం అహర్నిశలు సమవిభక్తాలై విభాసిస్తాయి.

కాలస్వరూపుడైన ద్వాదశాత్ముడు గగనప్రాంగణంలో దివ్యప్రభాభాసమానుడై తేజరిల్లి తన దర్శనాన్ని ప్రసాదించిన దివోవేళకు వ్యుష్టి అనీ, సూర్యదర్శనం కానేరని రాత్రివేళకు ఉష అనీ అభిధానాలు కలిగాయి.

దివారాత్రాల సంధ్యాసమయం ప్రతినిత్యమూ రెండు రూపాలలో వర్తిష్యమాణమై ఉన్నది. వ్యుష్టి గతించి ఉష ప్రవేశింపనున్న సమయానికి సాయంసంధ్య అని, ఉష గడిచి వ్యుష్టి రానున్న వేళకు ఉషస్సంధ్య అని వ్యవహారం. ఉషస్సంధ్యలో సూర్యుని తేజాన్ని అగ్ని స్వీకరించి దినమర్యాదను పరిపాటింపగా నిశాసమయంలో అగ్ని తేజాన్ని చంద్రుడు కైకొని దీప్తిని పొందుతున్నాడు. ఈ ఉభయసంధ్యల లోనూ సూర్యాగ్ని తేజాలు ఆపస్సులను ప్రవేశించి, ఆ నీడలు అంబరవీథిలో ప్రతిఫలించడం వలన ప్రాతరుషస్సులు ఎరుపెక్కి అరుణాంశురాగదీప్తులతో అలరారుతున్నాయి.

పూర్వం ఒకప్పుడు పద్మకల్పాదిమకాలంలో జలజాతాసనుడు తపస్సమాధిలో నిలిచి జాగ్రత్సృష్టినియమనానికి పూనుకొన్నపుడు తామసగుణం ఉద్రేకించి బ్రహ్మావలగ్నం నుంచి అతిభయానకరూపులైన అసురులు జన్మించారు. ఆయన తమశ్శక్తి రాత్రి రూపాన్ని పొంది జగద్వ్యాప్తమై నెలకొన్నది. అప్పుడు చతుర్ముఖుడు మళ్లీ అంతర్ముఖుడైనాక సత్త్వగుణం పరిఢవిల్లి ఆయన ముఖపద్మం నుంచి

మనోజ్ఞాకారులై సురలు జన్మించారు. ఆ సత్త్వతేజం దిన రూపాన్ని చెంది సూర్యకాంతి చేత ప్రకటీకృతం అయింది. ఆ తరువాత కొంత కాలానికి పరమేష్ఠి సాత్త్విక గుణోదయం వలన పితృగణాలు ప్రభవించాయి. ఆయన సత్త్వశక్తి సాయంసంధ్యా రూపాన్ని ధరించింది. మరికొంత కాలం గడిచాక విరించి రజోగుణం వలన ప్రేరితమై మనుష్యజాతి ఆవిర్భవించింది. ఆయన రజశ్శక్తి నుంచి ఉషస్సంధ్య కలిగింది.

ఈ విధమైన ప్రభవాల ప్రభావం చేతనే ఉషస్సంధ్యాసమయంలో మనుష్యులు, దివసవేళ దేవతలు, సాయంసంధ్యలో పితృగణాలు, రాత్రికాలంలో నిశాచరులు అధిక బలాన్ని కలిగి శక్తి సంపన్నులై రాణిస్తున్నారు.

ఉషావ్యుష్టులకు నడిమి సంధ్యలలో అనుదినమూ మందేహులని పేరుగల మహాబలశాలులైన రాక్షసులు జన్మించి సూర్యమండలాన్ని భక్షించడానికి బయలుదేరుతారు. బ్రహ్మవిద్యాపరులైన విప్రులు ప్రణవనాద పూర్వకంగా గాయత్రీమంత్రాన్ని జపించి, శ్రీసూర్యనారాయణునికి భక్తిపూర్వకంగా అర్ఘ్యాలను సమర్పించినపుడు ఆ జలాలు వజ్రాయుధాలుగా మారి ఊర్ధ్వముఖంగా ప్రయాణించి మందేహులను సంహరిస్తాయని వారికి ప్రజాపతి శాపం ఒకటున్నది.

అందుచేతనే బ్రహ్మభూయాన్ని ఆకాంక్షించిన ఉపవీతులూ విప్రులూ విధిగా సంధ్యోపాసనం నిర్వర్తించాలి.

మానవాళి అంజలించి సమర్పించిన అర్ఘ్యాల వలన శత్రుసంహారం జరిగి సూర్యుడు సంతృప్తిని చెంది దీప్తిమంతుడవుతాడు. బ్రాహ్మణులు అగ్నిహోత్రాన్ని జ్వలింపజేసి సూర్యోజ్యోతిర్మంత్రంతో ఆహుతులను వ్రేల్చినప్పుడు మందేహులతో పోరాటం వలని కలిగిన బడలిక తీరి సూర్యతేజం మళ్లీ ఉజ్జ్వలమై భూమి పైకి ప్రసరిస్తుంది.

అందుచేత లోకంలో ఎంత గొప్పవారైనా తత్తత్కాలోచిత సాంధ్య విధులను నియమం తప్పకుండా నెరవేర్చాలి, యమనియమాలను స్వాధీనం చేసుకొని, భావనాత్రయాన్ని అధిగమించి ఎంత విద్యాబుద్ధులను నేర్చినా—అగ్నిహోత్రవిధులను యథోక్తంగా ఆచరింపని బ్రాహ్మణులను సూర్యనారాయణునికి ద్రోహం తలపెట్టిన విశ్వాసఘాతకు లనే చెప్పాలి.

సూర్యునికి బ్రహ్మణ్యులు సంతరించిన మహస్సుకన్నా అధికతరమై మార్తాండమండలాంతరిష్ణువు లైన వాలఖిల్యుల తేజోవిభవం ఒప్పారుతున్నది.

వైష్ణవాగ్రేసరులూ పరమసాత్త్వికులూ అయిన వాలఖిల్యులు నిజంగా ధన్యాత్ములు. బ్రహ్మమానసపుత్రులలో ఒకడైన క్రతుమహర్షికి సంతతి గర్భంలో అంగుష్ఠమాత్రదేహులై అవతరించిన ఈ జితేంద్రియులు ప్రతినిత్యమూ ఆదిత్యమండలంలో సవిత్రభిముఖంగా నిలిచి ఆయన తేజోభిరక్షణం కావిస్తున్నారు. వీరి తోడ్పాటువలన సమకూరిన సూర్యకాంతి భూమిపైకి ప్రసరించి జీవజాతానికి ప్రాణశక్తిని చేకూరుస్తున్నది.

సప్తాశ్వ రథయానం

ఈ కరణిని ధ్రువమండలాంతర్గత మైన ద్యుమణి రథం ముందుకు పర్యాలిడుతున్నప్పుడు కాలస్వరూపం మనుష్యలోకానికి ఖండమై విద్యోతిస్తున్నది.

కాలవిభాగంలో తొలిచిన్నె అయిన మనుష్యుల కనురెప్పపాటు వేళకు నిమేషం అని పేరు. పదిహేను నిమేషాల కాలం ఒక కాష్ఠ. ముప్పై కాష్ఠలు ఒక కళ. త్రింశత్కళలు ఒక ముహూర్తం. ఇటువంటి ముప్పై ముహూర్తాలు కలిసి ఒక దివారాత్రం.

సూర్యుని సంచారమార్గం ఉత్తరాయణ దక్షిణాయనాలలో ఉన్నప్పుడు రాత్రింబవళ్ల ప్రమాణం మారుతున్నప్పటికీ సంధ్యా ప్రమాణం మాత్రం అన్ని కాలాల్లోనూ ఒకే విధంగా పదిహేను కళల పర్యంతం భాసిస్తుంది. ఈ తీరున వ్యాప్తి తరువాత అర్థ ముహూర్తమూ, ఉష అనంతరం అర్థముహూర్తమూ, సంధ్యా సమయం అవుతుంది.

దివస్సులో మూడు ముహూర్తాల కాలం ప్రాతర్వేళ. దినంలో అయిదవ భాగం ఇది. ప్రాతస్సుకు పిదప మూడు ముహూర్తాలు సంగవకాలం. ఆ తర్వాత మూడేసి ముహూర్తాల ప్రమాణంతో మధ్యాహ్నం, అపరాహ్ణం, సాయంకాలం—మొత్తం పదిహేను ముహూర్తాలలో వ్యాప్తి పరిసమాపనం చెంది, సాయంసంధ్యతో కలిసి ఉష ప్రవేశిస్తుంది. మళ్లీ రాత్రికి పదిహేను ముహూర్తాలు గడుస్తాయి.

ఇలా ముప్ఫయ్యేసి ముహూర్తాల పదిహేను దివారాత్రాలు కలిసి ఒక పక్షం. రెండు పక్షాలు ఒక మాసం, రెండేసి నెలలు ఒక ఋతువు. మూడు ఋతువులు ఒక అయనం కాగా రెండు అయనాలు ఒక హాయనం.

కాలగమనంలో సంవత్సరక్రమాన్ని నాలుగు విధాలుగా మనం గుర్తింపవచ్చు: రాశిచక్రంలో సూర్యుని సంచారాన్ని బట్టి ఏర్పడినది సౌరమానం. పూర్ణిమాచంద్ర దర్శనాన్ని అనువర్తించి రూపొందినది సౌమ్య (చాంద్ర) మానం. వరుసగా ముప్ఫై సూర్యోదయ సూర్యాస్తమయాలను లెక్కించి చూచేది సాయన మానం. నక్షత్రాలలో చంద్రుని సంచారమార్గాన్ని అనుశీలించితే అది నాక్షత్ర మానం.

సంవత్సరాలను ప్రభవాదిగా ఉపలక్షించడం వలన అరవై యేండ్ల జ్ఞాపిక సులభసాధ్య మవుతోంది. ఈ అరవై యేండ్లూ

బృహస్పతి యానాన్ని అనుసరించి ద్వాదశహాయనాలకు ఒకటి చొప్పున అయిదు భాగాలుగా విభజింపబడ్డాయి. వీటికి సంవత్సరం, పరివత్సరం, ఇద్వత్సరం, అనువత్సరం, వత్సరం—అని సంకేతాలు కలిగాయి.

సంవత్సరానికి పన్నెండు మాసాలు. సూర్యుడు ఉత్తరాయణంలో సంచరించినప్పుడు తపోమాసం, తపస్యమాసం, మధుమాసం, మాధవమాసం, శుక్రమాసం, శుచిమాసం గడిచిపోతాయి.

సూర్యుడు మకరసంక్రమణ నాటినుంచి దక్షిణాభిముఖుడై కొనసాగినప్పుడు క్రమంగా నభోమాసం, నభస్యమాసం, ఇష మాసం, ఊర్జమాసం, సహోమాసం, సహస్యమాసం ప్రవర్తిల్లుతాయి.*

లోకాలోక పర్వతానికి నాలుగు దిక్కులలోనూ ఉన్న సానువులపై నిలిచి కర్దమప్రజాపతి కొడుకులు సుధాముడు, శంఖపాదుడు, ఇంకా హిరణ్యరోముడు, కేతుమంతుడు లోకాలలో అహర్నిశల పర్యాప్తి సమ్యగ్రూపంలో భాసిల్లడానికి తోడ్పడుతున్నారు.

---

* విష్ణుపురాణ కథకుడు ప్రకృతం మైత్రేయునికి అభివర్ణిస్తున్నది, వేదకాలపు ఖగోళశాస్త్రం ఆధారంగా దర్శించిన విజ్ఞాన సారం. అనంతరీయకాలంలో నభోమాసానికి శ్రావణం, నభస్యకు భాద్ర (పద)ం, ఇషకు ఆశ్వయుజం, ఊర్జకు కార్తికం, సహస్సుకు మార్గశిరం, సహస్యకు పు(పౌ)ష్యం, తపోమాసానికి మాఘం, తపస్యకు ఫాల్గుణం, మధువుకు చైత్రం, మాధవానికి వైశాఖం, శుక్రకు జ్యేష్ఠం, శుచికి ఆషాఢం అనే పర్యాయనామాలు కలిగి నేటికీ వాడుకలో ఉన్నాయి.

విష్ణుపదం

నభోమండలంలో సూర్యమండలం కన్నా అనేక గుణితంగా కాంతిమంతమై ప్రకాశిస్తున్న అగస్త్యపదానికి చేరువనే మూడు నక్షత్రావస్థానాలు ఉన్నాయి. వీటిలో ఉత్తర దిక్కున వెలసినది ఐరావత నక్షత్రావస్థానం. దక్షిణాన ఉన్నది జారద్గవం. ఈ రెండింటికీ మధ్యతలం వైశ్వానర నక్షత్రావస్థానం.

నక్షత్రావస్థానాలు మూడింటిలోనూ ఒక్కొక్క చోటా మూడేసి వీథులు ఉన్నాయి. ఒక్కొక్క వీథిలోనూ మూడేసి నక్షత్రాలు కనబడతాయి.

ఉత్తర దిగ్భాగంలో ఉన్న ఐరావతావస్థానంలో నాగవీథి, గజవీథి, ఐరావతీ వీథి ఉన్నాయి. వీటి స్వరూపాలను సులభంగానే ఊహించవచ్చు: అశ్విని, భరణి, కృత్తికల సముదాయం నాగవీథి. రోహిణి, మృగశీర్ష, ఆర్ద్రల నికురుంబం గజవీథి. పునర్వసు, పుష్యమి, ఆశ్లేషల కదంబం ఐరావతీ వీథి.

జారద్గవ నక్షత్రావస్థానంలో ఆర్షభి, గోవీథి, జారద్గవీ వీథి భాసిస్తున్నాయి. మఖ, పూర్వఫల్గుణి, ఉత్తర ఫల్గుణీ నక్షత్రాల సమాహారం ఆర్షభీ వీథి. హస్త, చిత్ర, స్వాతి నక్షత్రాల సందోహం గోవీథి. విశాఖ, అనూరాధ, జ్యేష్ఠల సమూహం జారద్గవీ వీథి.

దక్షిణాన విద్యోతిస్తున్న వైశ్వానర స్థానంలో అజవీథి, మృగ వీథి వైశ్వానరీవీథి గోచరిస్తాయి. వీటిలో అజవీథి మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢల బృందం ఉన్న ప్రదేశం. శ్రవణ, ధనిష్ఠ, శత భిషల సంఘాతం మృగవీథి. పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతీ నక్షత్రాల సమావేశస్థలం వైశ్వానరీ వీథి.

అగస్త్యపదానికి ఉత్తరాన, అజవీథికి దక్షిణ దిగ్భాగంలో వైశ్వానర పథానికి ఆవరణలో మోక్ష మార్గోపాధి అయిన పితృ

పథం ఉన్నది. ఇది పితృదేవతలకూ, మంత్రద్రష్టలైన ఆదిమహర్షులకూ ఆలవాలం. బ్రహ్మదివసం గతించి కల్పావసానంలో ప్రళయం సంభవించిన తరువాత పద్మగర్భుడు మళ్లీ సృష్టికి ఉపక్రమించినపుడు ఈ మహర్షులు వేదమంత్రాలను పునరుద్ధరించి లోకాలలో వేద ధర్మాన్ని అభివ్యాపింపజేస్తారు.

నాగవీథికి ఉత్తరదిశలో ఎనభై ఎనిమిదివేలమంది సిద్ధులు నివసించే దైవపదం ఉన్నది. వీరు జితేంద్రియులై ధర్మనిష్ఠ కలిగి కల్పాంతం వరకూ ఉపజీవించి వైఖానస తేజంలో విలీనమైపోతారు.

సప్తర్షి మండలానికి ఊర్ధ్వాభిముఖంగా లక్ష యోజనాల దూరంలో ధ్రువపదం ఉన్నది. ఈ రెండు ప్రదేశాలకూ మాధ్యమికంగా వెలసినది శ్రీమన్నారాయణుని పరమపదమైన విష్ణుపదం.

విష్ణుపదం సర్వజీవజాతానికీ ఆరాధ్యమండలం. ఈ పవిత్రావాసాన్ని ఆధారంగా నిలుపుకొని జ్యోతిశ్చక్రాన్ని చేతపూనిన ధ్రువుడు తన స్థానంలో తేజరిల్లుతున్నాడు.

చతుర్దశభువనాల లోనూ సచ్చరిత్రులని పేరెన్నికగన్న తపోధనులూ, సంయమి ప్రవరులూ ఈ పరమపావన పదానికి వచ్చి జన్మజన్మాంతరాల మహాపుణ్యఫలాన్ని పొంది ధన్యతను చెందుతారు.

విష్ణుపదం శ్రీమన్నారాయణ చరణస్మరణపరాయణులైన భక్తగణాలకు ఎంత సన్నిధానంలో ఉన్నదో, శ్రీహరి పాదసేవాహేవాకానికి నోచుకోని భాగ్యహీనులకు అంత విప్రకృష్టంగా ఉన్నది.

విష్ణునిలయ సౌభాగ్యాన్ని అభివర్ణించడానికి వేయినాలుకలున్నా చాలవు. శ్రీమహావిష్ణువు అడుగుదమ్ములను హృదయ వీథిలో పాదుకొల్పుకొని బ్రహ్మభావనాపరులైన సనకాది మునీంద్రులూ, దామోదరుని సన్నిధి సేవకు నోచుకొని కర్మభావనాపరులైన

పురందరాది బృందారకులూ, బ్రహ్మకర్మతత్పరులై భవ్యవివేకాన్ని గడించిన పద్మగర్భాదులూ అష్టాక్షరీమంత్రరాజాన్ని భక్తిపూర్వకంగా జపించి—ఏ సచ్చిదానందనిలయాన్ని 'తద్విష్ణోః పరమం పదం' అని సంభావిస్తారో—ఆ విష్ణుపదాన్ని నోరారా ఎంత కొనియాడినా తనివితీరదు.

ఆకాశగంగ

పరమోత్తమమైన విష్ణుపదంలో శ్రీ వాసుదేవుని అంఘ్రి కమలాల నుంచి ఆకాశగంగ అవతరించింది. ఆయన కాలి బొటన వ్రేలి నుంచి ఆవిర్భవించిన ఆ గగనగంగాతరంగిణి దక్షిణాభిముఖంగా క్రిందకు జారి, కైలాసాచలం పైని ధూర్జటి జటాజూటాన్ని చేరి, అక్కడి నుంచి అనేక సహస్రయోజనాలు పారి, సప్తర్షి మండలాన్ని పవిత్రీకరించి, నక్షత్ర గ్రహ తారకా మండలాల మీదుగా ఎనభై ఎనిమిదివేల యోజనాల చంద్రమండలాన్ని ఆప్లావించి, చంద్ర చంద్రికలలో వెల్లివిరుస్తున్న అమృతధారల శీతల శ్వేతకాంతుల నిగారింపులతో మేరుపర్వతం పైకి దూకి, దేవేంద్ర రాజధాని అమరావతి సమీపంలో సీత, అలకనంద, చక్షువు, భద్ర అనే పేర్లతో నాలుగు పాయలుగా చీలి జంబూద్వీపాన్ని ప్రవేశించింది.

అమరావతి దక్షిణపు అంచున ఆకాశగంగ నుండి విడిపడిన అలకనందావేణిక కైలాస శిఖరాలపై శ్రీమహాదేవుని కపర్దంలోనికి ప్రవేశించి నూరు దివ్యసంవత్సరాల కాలం అక్కడే నిలిచింది. ఆ తర్వాత కాలాంతరంలో సూర్యవంశ సంజాతుడైన భగీరథుని ప్రయత్నం వలన భూమికి దిగివచ్చింది. పూర్వం ఒకప్పుడు కపిల మహర్షి ఆగ్రహానికి పాల్పడి, ఆయన కోపాగ్నిలో శలభాలై మాడిపోయిన సగరపుత్రుల భస్మావశేషాలపై అలకనందను ప్రవహింపజేసి భగీరథుడు తన పితరులకు పుణ్యలోకాలను కలుగజేశాడు.

పరమపావనమైన భాగీరథీ తీరం రమాదేవీ సమేత శ్రీమన్నారాయణునికి నిత్యనివాసం. ఐహిక సుఖభోగాలపై విరక్తి కలిగి మోక్షాభిలాష కలిగి తపస్సు కోసం గంగాతీరానికి వచ్చిన విష్ణుభక్తులకు సకలశుభాలూ సంప్రాప్తిస్తాయి.

గంగాస్నానం సకల కలిమలాపహరణం. పుణ్యకాలాలలో గంగాతరంగిణికి వెళ్లి శ్రాద్ధకర్మలు ఆచరించి తిలోదక పిండదానాలను జీవితంలో కనీసం ఒక్కసారి చేయగలిగితే చాలు, వారి కులమంతా ఏడేడు జన్మల పాప పంకం నుంచి విముక్తిని పొందుతుంది.

దూరదేశాలలో ఉన్నవాళ్లు విష్ణుపాదోద్భవను సందర్శించే భాగ్యం కలుగలేదని కుమిలిపోనవసరం లేదు. భక్తిపూర్వకంగా ఆ పుణ్యవాహినికి ప్రణమిల్లితే చాలు, మూడు జన్మలలో సంఘటించిన దుఃఖభారం తొలగి మనస్సుకు ప్రశాంతి లభిస్తుంది.

ఈ విధంగా ముజ్జగాలకూ పుణ్యఫలమై వెల్లివిరుస్తున్న గంగానదికి పుట్టినిల్లయిన విష్ణుపథంలో చిరకాలంగా వైష్ణవాగ్రేసరుడయిన శింశుమార ప్రజాపతి మకర రూపంలో నిలిచి నివ్వటిల్లుతున్నాడు.

శింశుమార చక్రం

శింశుమారుని పుణ్యచరితం భవజలధికి తారక మంత్రం. పూర్వం ఉత్తానపాదుని పెద్దకొడుకు తపస్సుచేసి ధ్రువపదాన్ని అధిరోహించినట్లే ఈ శింశుమారుడు కూడా శ్రీహరి పాదాలను నమ్ముకొని, ఆయన దయవల్ల విష్ణుపదాన్ని చేరి మొసలి రూపులో జ్యోతిర్మండలానికి ఆలవాల మయ్యాడు. అతి బృహద్రూపంలో పరిఢవిల్లిన ఆ మహామకరానికి తోకవైపున ధ్రువమండలం ఉన్నది. కాలచక్రానికీ, సూర్య చంద్ర గ్రహ తారకా సముదయానికీ కూడా ఆధారమైన శింశుమార మహాచక్రాన్ని తిప్పుతూ, తానూ మండలా

కారంలో పరిభ్రమిస్తూ శింశుమారుడు లోకాలోకాలనూ గతి తప్ప కుండా కాపాడుతున్నాడు.

శింశుమార ప్రజాపతి మకరరూపంలో తిరుగుతూ నిట్టూర్పులను విడుస్తున్నప్పుడు ఆయన నిశ్వాసపవనాలు పొడవైన త్రోవలుగా రూపొందాయి. ధ్రువుడు ఆ వాయునాళాలతో గ్రహనక్షత్రాలనూ, సూర్యచంద్రులనూ తన దృఢబంధంలో బిగించి వాటిని వర్తులాకారంలో నడుపుతున్నాడు.

నిత్య ప్రసరణశీలమైన సూర్యుని కిరణాల నుండి ప్రాణశక్తి కలుగుతోంది. ప్రాణశక్తి వలన పుడమిపై సస్యాలు మొలకెత్తి ప్రాణికోటి సుస్థితికి మూలకంద మవుతున్నాయి.

సూర్యుని వలన వానలు కురుస్తున్నాయి. సంవత్సరంలో ఎనిమిది నెలల కాలం పాటు రవి భూమిపైగల జలాలను తన కిరణాలతో ఆకర్షించి, తక్కిన నాలుగు నెలలలో ఆ జలసారాన్ని వృష్టిరూపంలో భూమిపైకి వర్షింపజేసి పైరుపొలాలను నిండుగా పండిస్తున్నాడు. ఈ తీరున భూతజాతానికి అన్నోదకాలు లభిస్తున్నాయి.

ఋతుకర్త అయిన ప్రభాకరుడు భూమి ఉపరితలంపై గాలిలో గల తేమను తన కరాలతో పీల్చి, ఆ ఉదకసారాన్ని శీతకిరణమండలం లోనికి ప్రసరింపజేస్తాడు. సూర్యుని నుండి గ్రహించిన ఆ జలబిందువులను శీతకిరణుడు గగనమండలంలో నిక్షేపిస్తాడు. అక్కడ వ్యోమ ధూమాలు, జ్యోతిస్సులు, మరుత్తుల సన్నిపాతం వలన ఆకాశంలో అభ్రసమితి జన్మిస్తున్నది. అలా జన్మించిన మేఘాలకు వృష్టి సంస్కార కాలంలో వాయుబంధాలు సడలి వర్షా బిందువులు భూమిపై కురుస్తాయి.

ఈ విధంగా సముద్రాలు, నదులు, భూమి, భూతజాతం—వీటన్నింటినుంచీ సూర్యుడు జలకణాలను ఆకర్షించి వార్షుకాభ్రాల ద్వారా కురిపిస్తున్నాడు.

సూర్యుడు భూమినుంచి గ్రహించిన నీటికణాలు మళ్లీ మేఘాల వలన క్రిందికి దిగివస్తున్నట్లే, దేవలోకంలో పారుతున్న ఆకాశగంగ నుంచి గ్రహించిన వారి బిందువులు కూడా భూమికి వర్షారూపంలో వచ్చి చేరుతున్నాయి. అయితే ఈ గగన గంగాజలాలు మబ్బుల నుంచి కాక, ఆకాశం స్వచ్ఛంగా నిర్మేఘమై ఉన్నప్పుడు సూర్యుని కిరణాల ద్వారా నేలపైన జల్లుగా కురుస్తున్నాయి. ఈ విధంగా కురిసిన పుణ్యజలాలలో స్నానం చేసినవారు నిజంగా అదృష్టవంతులు. వారికి జన్మత్రయ దుఃఖాల తాపం తొలగి, అఘమర్షణ మహాఫలం కలుగుతుంది.

సూర్యుడు కృత్తిక మొదలుకొని ఉన్న బేసిసంఖ్యగల నక్షత్రాలలో ప్రవేశించినప్పుడు మాత్రం నిర్మేఘమైన అంబరతలం నుంచి వర్షపాతాన్ని సూర్యకిరణాలు తీసికొనిరావు. ఆ సమయంలో భూమికి ఎనిమిది దిక్కులలోనూ నిలిచి ఉన్న దిగ్గజాలు వారి కణాలను సూర్యుని నుంచి అందుకొని, తమ తొండాల ద్వారా నేలపైకి గుమ్మరిస్తాయి. సూర్యుడు సరిసంఖ్య గల నక్షత్రాలలో ఉన్నప్పుడు మాత్రమే అతని మయూఖాలు జలవృష్టిని భూమికి మోసితెస్తాయి.

సూర్యుడు లేనిదే జీవులకు జీవనోపాయం లేదు. లోకంలో యజ్ఞయాగాలు, చాతుర్వర్ణ్యం, వేదవాణి, దేవాలయాలు, పశుపక్షిమనుష్య చరాచర జీవజాతం అతని కిరణాలు అందించిన ప్రాణశక్తితో ప్రాణాలను నిలుపుకో గలుగుతున్నాయి.

ఈ విధంగా లోకాలోకాలకూ నాయకుడయిన వాసుదేవుడు శింశుమార చక్రానికి పదిలమైన ఆధారం. శింశుమారుడు ధ్రువ

స్థానానికి ఆధారం. ధ్రువుడు కాలాత్మకు డైన సూర్యునికి ఆధారం. సూర్యుడు సచరాచర జీవజాతానికి ఆధారం.

సర్వాధారమైన శ్రీమన్నారాయణుని దివ్యశక్తిని ఉపాసించి మోక్షపదవిని పొందడం కంటె ముముక్షువులకు వేరే ప్రార్థన ఏముంటుంది?''

అని పలికి పరాశరమౌని మైత్రేయునితో ఇంకా ఇలా అన్నాడు—

సూర్యరథ పరివారం

ఈ విధంగా జ్యోతిర్మయుడైన హిరణ్యగర్భ సూర్యనారాయణుడు ఉత్తరాయణ దక్షిణాయనాలలో ప్రయాణిస్తున్నప్పుడు, సూర్యుని స్యందనం ఒక్కొక్క అయనం లోనూ నూట యెనభై మండలాల వంతున, మొత్తం మూడువందల అరవై మండలగతులలో ముందుకు నడుస్తుంది.

జ్యోతిశ్చక్రంలో బృహద్రథమధ్యగతు డైన సూర్యునితో కలిసి ఆయన పరివారం సమస్తమూ తరలివస్తుంది, పదహారుమంది అప్సరసలు అరదంలో ఆయనకు అభిముఖంగా నిలిచి శ్రీవిష్ణుమాహాత్మ్యాన్ని రమ్యంగా అభినయిస్తూ నాట్యవేదాన్ని ప్రదర్శిస్తారు. మహిత వైఖానసు లైన భక్తాగ్రేసరులూ, మహర్షిమండలమూ విష్ణునామ సంకీర్తనం చేసి, అపూర్వమైన భక్తిపారవశ్యంతో తన్మయు లౌతారు. శ్రుతిసుభగ స్వరాలను అలవోకగా పలికించే గంధర్వుల మనోహర గానస్రవంతులు వెల్లివిరుస్తాయి. రాక్షసగణం ఆ రథ సోపానాలపై వినమ్రంగా నిలబడి ఆయన కనుసన్నలలో మెలగుతుంది. అశ్వాలను పూన్చి, జీను బిగించి రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించడానికి సర్పరాజులూ, పగ్గాలను పట్టి ఉంచడానికి యక్షముఖ్యులూ ఉంటారు. పన్నెండుమంది ఆదిత్యులు నిర్దిష్ట

సమయాలలో రథాన్ని ప్రవేశించి ఈ పరివారానికి ఆధిపత్యం వహిస్తారు.

ఈ ఏడుగురూ సూర్యశతాంగవర్తులై నిలిచి శీతోష్ణాలూ, వర్షమూ ఆ యా ఋతువులను అనుసరించి ప్రవర్తిల్లేటట్లు ధర్మ పరిపాలనం చేస్తారు.

రవి రథాన్ని అన్ని వేళల లోనూ పర్యావరించి అంగుష్ఠ మాత్ర దేహు లయిన వాలఖిల్య మునులు విష్ణునామాన్ని ధ్యానిస్తూ యానమార్గానికి ఉత్సవసంరంభాన్ని కలిగిస్తారు.

మధుమాసం వచ్చినప్పుడు ఆదిత్యధాత్రి ఆధిపత్యంలో పులస్త్యమహర్షి, గానవిద్యాప్రవీణు డైన గంధర్వశిఖామణి తుంబురుడు, అప్సరోనాయిక క్రతుస్థల, యక్షనాయకుడు రథకృత్తు, సర్పరాజు వాసుకి, హేతి రాక్షసుడూ సూర్యరథంలో ఉంటారు.

మాధవమాసం రాగానే సహస్రాంశు వాహనంలో ఆర్యమంతుని ఆధిపత్యంలో పులహమహర్షి, నారదుడు, అప్సరఃకాంత పుంజికస్థలి, యక్షపతి రథౌజుడు, కచనీర సర్పం, అసురపతి ప్రహేతి భాసిల్లుతారు.

శుచిమాస వేళలో మిత్రుడు స్యందనాధిపతి. ద్యుమణి రథంలో అత్రిమహర్షి, హాహాగంధర్వుడు, దేవవేశ్య మేనక, యక్షమాళి రథస్వనుడు, భుజగాధ్యక్షుడు తక్షకుడు, పౌరుషేయ దైత్యుడూ అధివసిస్తారు.

శుక్రమాసం ప్రవేశించగానే ఆదిత్యవరుణుని ఆధిపత్యంలో వసిష్ఠమహర్షి, హూహూ గంధర్వుడు, అప్సరస సహజన్య, యక్షశ్రేష్ఠుడు రథచిత్రుడు, నాగరాజు నాగుడు, బుధ రాక్షసుడూ కమలాప్తుని తేరిలో తేజరిల్లుతారు.

నభోమాసంలో అహర్పతివాహనం ఇంద్రాదిత్యుని నేతృత్వంలో నడుస్తుంది. రథగతులై అంగిరసమౌని, విశ్వావసు గంధర్వుడు, దేవవేశ్య ప్రమ్లోచ, యక్షుడు స్రోతస్సు, ఏలాపత్ర ఫణి, అదే పేరుగల ఏలాపత్ర రాత్రించరుడు చెల్వొందుతారు.

నభస్యమాసం పొడచూపగానే వివస్వదాదిత్యుని ఆధిపత్యంలో వికర్తన రథాన్ని భృగుమహర్షి, ఉగ్రసేన గంధర్వుడు, అప్సరోవనిత అనుమ్లోచ, యక్షవతంసుడు ఆపూరణుడు, వాతాశనపతి శంఖపాలుడు, వ్యాఘ్ర దైతేయుడు నడిపిస్తారు.

ఇషామాసంలో ఖగవాహనానికి పూషాదిత్యుడు అధిపతి. వాహనగతులై గౌతమమహర్షి, సురుచి గంధర్వుడు, అప్సరోలలామ ఘృతాచి, యక్షముఖ్యుడు సుషేణుడు, పాపజేడు ధనంజయుడు, యాతుధానుల నేత వాతుడూ నెలకొంటారు.

ఊర్జమాసం అడుగుపెట్టగానే ఆదిత్యపదంలోనికి పర్జన్యుడు ప్రవేశించి ఆధిపత్యాన్ని స్వీకరిస్తాడు. దివాకరస్యందనంలో భరద్వాజ మహర్షి, నభోమాసంలో వచ్చిన విశ్వావసువు కాక అదే పేరుగల మరొక విశ్వావసు గంధర్వుడు, అప్సరస విశ్వాచి, సేనజిద్యక్షుడు, ఐరావత సర్పం, చాప రాక్షసుడు ప్రవర్తిల్లుతారు.

సహోమాసం వచ్చిన వెంటనే ఆదిత్యస్థానాన్ని అంశుమంతుడు స్వీకరించి రథనేతృత్వాన్ని వహిస్తాడు. దినాధిపరథంలో కశ్యపమహర్షి, చిత్రసేన గంధర్వుడు, అప్సరస ఊర్వశి, యక్షపతి తార్క్ష్యుడు, మహాపద్మ చక్షుశ్శ్రివం, విద్యుద్రాక్షసుడు పరివారమై విలసిల్లుతారు.

సహస్యమాసం రాగానే ఆదిత్యునికి భగుడని నామధేయం కలుగుతుంది. అతని ఆధిపత్యంలో అహస్కరుని రథంలో క్రతుమహర్షి, గంధర్వపతి ఊర్ణాయువు, దేవవేశ్య పూర్వచిత్తి, యక్ష

రాజు అరిష్టనేమి, సర్పకులం లోని కర్కోటకుడూ సహాయగణమై సమకూడుతారు.

తపోమాసంలో త్వష్టకు ఆదిత్యపదవి లభిస్తుంది. అతని ఆధిపత్యంలో భాస్కర వాహనాన్ని జమదగ్నిమహర్షి, ధృతరాష్ట్ర గంధర్వుడు, దేవకాంత తిలోత్తమ, యక్షుడు ఋతజిత్తు, కంబళ దర్వీకరం, బ్రహ్మోపేత రాక్షసుడు అనుచరవర్గమై విరాజిల్లుతారు.

తపస్యమాసం ప్రవేశించగానే ఆదిత్యపదంలో నిలిచి విష్ణువు ఆధిపత్యాన్ని వహిస్తాడు. విశ్వామిత్ర మహర్షి, గంధర్వుడు సూర్య వర్చస్వి, దేవవనిత రంభ, యక్షేశుడు సత్యజిత్తు, అశ్వతర సర్పం, యజ్ఞాపేత రాక్షసుడు సూర్యరథయానానికి తోడ్పడుతారు.''

మైత్రేయుని సందేహం

అని ఈ విధంగా లోకాభిరామమైన సూర్యనారాయణుని దివ్యస్వరూపాన్ని తన్మయుడై వర్ణించిన పరాశర మౌని వచనాలను అమితాశ్చర్యంతో వింటున్న మైత్రేయుడు —

''మౌనికులోత్తమా! మీరింతవరకూ నాకు కాలాత్మకుడైన సూర్యభగవానుని మహిమాతిశయాన్ని సవిస్తరంగా విశదీకరించారు. అంతేకాక సూర్యశతాంగానికి కట్టబడిన కాలచక్రం ఋతువులను కలుగజేస్తున్నదని, సూర్యరథంలోని పరివారం ఋతుధర్మాలను పాటిల్ల జేస్తున్నదని మీరన్నారు. ఈ విశేషా లన్నింటినీ సమన్వయించుకొందామంటే ఒక్క సందేహం నన్ను బాధిస్తున్నది.

జ్యోతిశ్చక్రంలో సూర్యుని ఉనికి వలన ప్రయోజనం ఏమిటి? అతనికి విహితకర్తవ్యం ఏమిటి? అన్ని కార్యాలనూ తన రథ చక్రమూ, పరివారమూ చక్కబెట్టుకొని పోతుంటే ఆయన గొప్పదనం ఏమనుకోవాలి?

దయచేసి నా సంశయాన్ని నివృత్తి చేసి నన్ను అనుగ్రహించండి'' అని ప్రార్థించాడు.

ఈ ప్రశ్నలను అడుగుతున్నప్పుడు మైత్రేయుని ముఖరేఖలలో ప్రస్ఫుటిస్తున్న గాఢజిజ్ఞాసను పరికించి, పరాశరమౌని అమంద పరితోషాన్ని పొందాడు. శిష్యుని మనస్సులో ఉదయించిన ఈ సందేహం తాను చెప్పబోతున్న విషయానికి నాందీప్రాయంగా భాసించి, ఆయన కన్నులలో దయామిళితమైన విస్ఫూర్తి తొణికిసలాడింది. ప్రసన్నచిత్తంతో, మృదువచనాలతో శ్రీకరమైన విష్ణుమాహాత్మ్యాన్ని అభివర్ణిస్తూ ఆయన తన కథనాన్ని కొనసాగించాడు.

''నాయనా! ఆకాశమండలాంతర్గతుడైన సూర్యనారాయణుడు స్వయంప్రకాశమూర్తి కాదు. శ్రీహరి కరుణాప్రసారమే ఆతని దీధితులకు హేతువు.

గదిలో వెలిగించిన దీపం ఎంత చిన్నదయినా, చుట్టూరా ఆవరించి ఉన్న చీకట్లను పటాపంచలు చేస్తుంది. అడవుల్లో రగుల్కొనే దారుణ దావాగ్నిపుంజం వెలుగుతో పోలిస్తే గృహదీపకాంతి అందులో సహస్రాంశం కూడా కాదు.

సప్తాశ్వరథాన్ని ఆరోహించి సప్తగణాలూ పరివేష్టింపగా గగనాంతరాళంలో వెలుగులను విరజిమ్ముతూ పయనించే వికర్తనుడు వాసుదేవుని వలన తేజోధిక్యాన్ని సంతరించుకొని తేజరిల్లుతున్నాడు. అనుపమానమై తోచే అతని కాంతి శ్రీహరి దివ్యకాంతిలో అల్పాల్పభాగం కూడా కాదు.

ఆదిలో నారాయణాంశ వలన వేదమధుకోశం ఉదయించి సూర్యుని మూలాన ప్రకటరూపాన్ని పొందింది. ప్రాతఃకాలంలో ఋగ్వేదం సూర్యుని నుంచి దీధితిని గాంచి ప్రకాశమాన మౌతున్నది.

మధ్యాహ్నవేళలో యజుర్మంత్రాలు దీప్తిమంతాలై విలసిల్లుతాయి. అపరాహ్ణంలో సూర్యతేజం వలన బృహద్రథంతరాది సామాలు వెలుగొందుతాయి.

పరివార పరివృతుడైనంత మాత్రాన ప్రభాకరుని మహిమానంత్యం తన గురుత్వాన్ని కోల్పోవడం లేదు. శ్రీహరి వైభవానికి నామధేయసాక్షి అయిన అతని వలననే అఖండమైన కాలస్వరూపం ఖండమై విద్యోతించి, మళ్లీ శ్రీహరినే అభివ్యంజింపజేస్తున్నది.

సూర్యమండలం నుంచి ఉత్పాదిల్లిన కాంతికిరణాలు అనంతముఖినంగా బయలుదేరి బ్రహ్మాండాంతరాళం లోనికి అనేక రూపాలలో ప్రసరిస్తున్నాయి. ఈ కిరణజాతంలో ప్రభూతమైన కళలు కూడా అనేకం ఉన్నాయి.

సూర్యకిరణావిర్భూతమైన కళలలో సుషుమ్నకళ శీతాంశుమండలానికి ప్రయాణించి చంద్రునికి అమృతాంశను కలిగిస్తున్నది. ఇదికాక ఇంకా ప్రాదుర్భవిల్లిన కళలలో హరికేశకళ నక్షత్రమండలానికి, విశ్వకర్మకళ బుధమండలానికి, విశ్వకార్యకళ శుక్రమండలానికి, సంపద్వసుకళ అంగారక మండలానికి, అర్వావసుకళ బృహస్పతి మండలానికి, స్వరాట్కళ శనిమండలానికి తేజోరూపంలో ప్రయాణించి కాంత్యుష్ణాలను కలిగిస్తున్నాయి.

సుషుమ్నకళలో నిండారిన అమృతాన్ని స్వీకరించి సుధాకరమండలం శుక్లపక్షంలో దినదినప్రవర్ధమానంగా కాంతులను విరజిమ్ముతుంది. శుక్లపక్షసుధాంశుని వెన్నెలలో కాలకు తాపశాంతిని, చల్లదనాన్ని ప్రసాదిస్తుంది.

కృష్ణపక్షం రాగానే చంద్రకిరణాల లోని అమృతాన్ని దేవతలు భుజిస్తారు. అందుచేతనే కృష్ణపక్షదినాలలో చంద్రునికాంతి క్షణక్షణమూ క్షీణించి అమావాస్యనాటికి నిశ్శేషమైపోతుంది.

అమృతసారమైన చంద్రజ్యోత్స్న వలన దేవతలకు నెలలో సగభాగం పరితోషం కలుగుతుంది. పక్షద్వయం గతించగా మిగిలిన రెండు దినాలలో శీతకిరణుని మయూఖాలను పితృదేవతలు భుజిస్తారు.

చంద్రుని స్యందనం

సూర్యస్యందనానికి వలెనే జ్యోతిశ్చక్రంలో పరిభ్రమిస్తున్న చంద్రునికి కూడా మహాప్రమాణవంతమైన దివ్యరథం ఉన్నది.

చంద్రుని అరదానికి కట్టిన ఇరుసులకు మూడు చక్రాలు ఉన్నాయి. బండి నొగకు రెండువైపులా అయిదేసి గుర్రాలుగా కాడికి పూన్చిన హయాలు మొత్తం పది. ఇవి మల్లెపువ్వుల కన్నా తెల్లనైన నిగారింపు గలిగిన దివ్యాశ్వాలు. నక్షత్రవీథులలో పర్యటించే చంద్రరథాన్ని సూర్యశతాంగం లాగానే వాయునాళాలతో బంధించి ధ్రువుడు తన చేతివ్రేళ్లతో దృఢంగా పట్టుకొని మండలాకారంలో త్రిప్పుతున్నాడు.

జ్యోత్స్నాకరుని రథమూ, అశ్వాలూ—రెండూ ఉదగర్భంలో నుంచి ఉద్భవించాయి. ఇవి కల్పావధి వరకూ జీవించి, కల్పాంతంలో తక్కిన జీవులతోపాటు లయాన్ని చెందుతాయి.

కృష్ణపక్షం చివరి రోజున చంద్రుని పదిహేనవ కళను పితృదేవతలు పానం చేసి సంతుష్టిని పొందినందున అమావాస్యకు పితృతిథి అని పేరు వచ్చింది.

అమావాస్య నాడు చంద్రుడు తేజోరూపంలో ప్రసరించే తన కిరణాల ద్వారా భూమిపైన గల లతలలోనికి ప్రవేశించి, వనౌషధులలో అమృతాన్ని పరిపూర్ణించి మొక్కలలో జీవశక్తిని ఉద్దీపింపజేస్తాడు. అందుచేత ఆ రోజు వృక్షశాఖల నుంచి ఆకులను కోసినా,

కనీసం కొనగోటితో గిల్లజూచినా మర్త్యులకు బ్రహ్మహత్య కావించిన మహాపాతకం చుట్టుకొని దారుణమైన కష్టాలు కలుగుతాయి.

కృష్ణపక్షంలో చంద్రుని కళలను ముప్పైమూడు కోట్లమంది దేవతలు, అగ్నిదేవుడు భుజించిన తరువాత, వెన్నెలరేడు రెండు కళలతో మిగిలి, సూర్యమండలోపకంఠానికి చేరినప్పుడు సూర్యచంద్రుల సంగమం ఏర్పడుతుంది. ఆ పర్వకాలంలో కృష్ణపక్షపు చివరి కళ భానుమండలం లోనికి ప్రవేశించి అమావాస్య దినాన గాఢాంధకారం కలుగుతుంది.

పితృతిథి వేళలో చంద్రకళను భుజించే పితృగణాలు బ్రహ్మమానసపుత్రులైన మనుప్రజాపతి వంశంలో జన్మించాయి. వీరిలో సోమసదస్యులు, అగ్నిష్వాత్తులు, బర్హిషదులు, సోమపులు, హవిర్భుజులు, ఆజ్యపులు, సుకాలికులు—అందరూ ప్రసిద్ధులే.

గ్రహమూర్తుల రథాలు

సూర్యచంద్రులకు వలెనే జ్యోతిశ్చక్రంలో స్థితిమంతాలై విలసిల్లుతున్న ఇతర గ్రహాల అధిపతులకు కూడా ప్రయాణ సాధనాలున్నాయి.

గ్రహమూర్తులలో చంద్రుని అంశతో జన్మించిన బుధుడు విహరించే రథం వాయ్వగ్నుల సమ్మేళనంతో రూపొందింది. ఈ రథాశ్వాలు ఎనిమిదీ గోరోజనపు వన్నెతో చూడముచ్చటగా ఉంటాయి.

శుక్రుని రథం కూడా సూర్యేందువాహనాల భాతిని అతి విశాలమైనది. ఈ దివ్యరథానికి పూన్చిన అశ్వాలు మాత్రం అన్నీ పుడమిపై జన్మించినవే. రథంలో శుక్ర పీఠానికి చేరువనే ధనుర్బాణాలు, రథానికి టెక్కెం ఉన్నాయి.

అష్టకోణాకృతిలో విస్తరిల్లిన భౌమరథం అగ్నిలో కాల్చి పుటం పెట్టిన అపరంజివన్నెలో ధగధగ లాడుతున్నది. ఈ శతాంగానికి కట్టిన తురంగాలు ఎనిమిదీ ఇంపు సొంపులు పెంపారిన కెంపు వన్నెల తులకింపులతో మహావేగవంతాలై గమిస్తాయి.

సంవత్సరానికి ఒక్కొక్క నెలవు చొప్పున రాశిచక్రంలో సంచరించే బృహస్పతి రథం స్వర్ణ వర్ణంలో వర్ణనీయంగా విరాజిల్లుతున్నది. ఈ అరదానికి పాండుర వర్ణంలో కన్నుల పండుగ చేస్తున్న ఎనిమిది గుర్రాలను అమరించారు.

సూర్యసుతుడైన శనైశ్చరుని రథం చిత్ర విచిత్ర కాంతులను వెల్లగక్కుతూ మందగమనంతో ముందుకు నడుస్తుంది. ఈ రథానికి పూనజేసిన గుర్రాలన్నీ ఆకాశంలో ప్రభవించినవి.

స్వర్భానుమండలాధిపతి రాహువు అసితాశ్వాలు పూన్చిన ధూసరవర్ణరథాన్ని అధిరోహించి, గ్రహణసమయాలలో సూర్య చంద్రులను కబళించటానికి మహోత్సాహంతో ఉన్ముఖుస్తాడు.

కేతుగ్రహరథం పొగచూరిన కసరువన్నెలో ఉన్నది. దీనికి అమరిన వారువాలు ఎనిమిదీ రక్తవర్ణంతో మెరుగెక్కి వాయు వేగంతో సంచరిస్తాయి.

ఈ విధంగా జ్యోతిశ్చక్రగతాలయిన గ్రహతారకా నక్షత్ర నక్షత్రావస్థానాలు సమస్తం వాయునాళ బంధనాల వలన ధ్రువుని స్వాధీనంలో నిలిచి వాసుదేవుని ఆజ్ఞావశవర్తులై అలరారుతున్నాయి.

ధ్రువపదంలో మొసలిరూపు దాల్చి జగన్మోహనంగా ప్రవర్తిల్లుతున్న శింశుమారుని రాత్రిపూట చర్మచక్షువులతో చూడగలిగిన పుణ్యాత్ములకు బహుజన్మ పాపాపనోదనం కలిగి అభీష్టఫల వాంఛలు సిద్ధిస్తాయి.

మైత్రేయా! త్రిలోకేశ్వరుడైన పుండరీకాక్షుని మహిమాతిశయం వలన అవతరించిన శింశుమారుడు, తద్గతమైన జ్యోతిశ్చక్రం,

సూర్యేందుగ్రహతారకా నక్షత్రి సర్వస్వం, మహాద్వీపాలు, కుల పర్వతాలు, సముద్రాలు, నదీనదాలు, అరణ్యాలు, పుణ్యతీర్థాలు, భూమండలం, భూర్భువరాది లోకాలు, వేద శాస్త్ర పురాణ సాకల్యం, పుణ్య పాప కర్మలూ—ఈ సచరాచర భూతజాతం ఆశ్రితావనుడు శ్రీమన్నారాయణుని అభివ్యక్త రూపాలే.

శ్రీమహావిష్ణువే శింశుమారుడు. విష్ణువే జ్యోతిశ్చక్రం. విష్ణువే మహాద్వీపాలు. విష్ణువే కులాచలాలు. నదీనదాలు, వారి ధరాలు, లోకాలు, దిశలు, పృథగ్భావంతో గోచరిస్తున్న సర్వమూ సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణువు అవతారాలే.''

ఈ విధంగా పరాశరమహాసీంద్రుడు ప్రేమాదరాలతో విశదీక రించిన బ్రహ్మాండ స్వరూపవైభవాన్ని సంపూర్ణంగా గ్రహించి పరమానందభరితుడైన మైత్రేయుడు ఇంకా ఇలా ప్రశ్నించాడు:—

''ఆచార్యదేవా! నాభివర్షాధీశ్వరుడయిన భరతమహారాజు తన పేరిట చెలువొందిన భరతఖండానికి రాజుగా కొడుకు సుమతికి పట్టాభిషేకం చేసి, సాలగ్రామతీర్థానికి వెళ్లి జన్మాంతరంలో విప్రుడై అవతరించాడని మీరింతకు పూర్వం అన్నారు.

భరతరాజన్యుడు తనకు విహితమైన క్షత్రియ ధర్మాన్ని నిరాక్షేపణీయంగా నిర్వర్తించి, అవసానదశలో మునివృత్తిని స్వీక రించిన పుణ్యాత్ముడు. శ్రీహరిని నమ్ముకొన్న భక్తుడై కూడా అతడు మళ్లీ బ్రాహ్మణుడై జన్మించడానికి కారణం ఏమిటి? ఆ తర్వాత అతని జీవితం ఎలా కొనసాగింది? కర్మశమం కలిగి మోక్ష పదాన్ని అధిగమించాడా? లేక సామాన్యుల వలె సంసారబంధాలలో చిక్కుకొని సతమతమయ్యాడా?

దయతో ఆ చరిత్రాన్ని ఉపదేశించి నన్ను అనుగ్ర హించండి.''

అని ప్రార్థించిన మైత్రేయునికి పరాశరమహర్షి జడభరతోపాఖ్యానాన్ని వివరించాడు.

జడభరతోపాఖ్యానం

స్వాయంభువమనువు కులకలశార్ణవంలో నిండు చందురుడై ప్రియవ్రతమహారాజుకు నాలుగవ తరంలో జన్మించిన భరతుడు నాభివర్షాన్ని సర్వజనరంజకంగా పరిపాలించాడు. కాలం గడిచి జీవిత చరమసంధ్య సమీపిస్తున్న వేళ అతనికి ఐహికసుఖభోగాల పైన వాంఛలు తొలగి వైరాగ్యోదయం కలిగింది. కామనలు నశించి అద్వితీయమైన ఆత్మజ్ఞానాన్ని పొందిన తర్వాత తన కిక కర్తవ్యకర్మలు లేవని గుర్తించి కొడుకుకు రాజ్యాన్ని అప్పజెప్పి మహానది పరిసరాలలో ఉన్న సాలగ్రామ తీర్థానికి వెళ్లిపోయాడు.

అనాత్మవిషయా లయిన సర్వక్రియలనూ పరిత్యాగం చేసి నివృత్తిమార్గాన్ని చేపట్టిన భరతునికి సాలగ్రామతీర్థంలో చిత్త శాంతి లభించింది. నిరంతరమూ శ్రీహరి ధ్యానంలో నిమగ్నమై ఆత్మతేజస్సును ఉద్దీపింపజేశాడు. జాగ్రత్స్వప్నాలలో కూడా అతని పెదవి కొసలంటి నారాయణ నామస్మరణమే వినిపించేది. యజ్ఞేశా! అచ్యుతా! గోవిందా! మాధవా! అనంతా! కేశవా! శ్రీకృష్ణా! హృషీకేశా! అని ఒళ్లుమరిచిపోయిన పారవశ్యంతో శ్రీమహావిష్ణువు నామసంకీర్తనం చేయసాగాడు.

క్రియాచరణం లేకపోయాక భరతుడు నైమిత్తిక అనుష్ఠానాలను కూడా మానివేశాడు. ఫలం, పుష్పం, తృణమో పణమో ఏదో దొరికినదానిని దొరికినట్లుగా తెచ్చి కృష్ణార్పణం అనుకొనేవాడు. కేశవ నామాలను పారాయణ చేసుకోవడం తప్ప అతనికి మరొక ధ్యాసే ఉండేది కాదు.

ఒకనాటి ఉదయం భరతుడు జాము పొద్దెక్కకుండానే లేచి మహానదీతీరానికి వెళ్లాడు. ఆ పుణ్యజలాలలో స్నానంచేసి, లోలోపల నీలోపలాంగుని స్మరిస్తూనే తీరాన కాలోచితకర్మలను ఆచరిస్తున్నాడు. ఇంతలో ఒక వింత జరిగింది.

భరతుడు స్నానార్థం ఏతెంచిన ప్రదేశానికి చేరువలోనే గండకీమహారణ్యం ఉన్నది. ఆ అడవిలో నుంచి నెలలు నిండిన ఒక ఆడజింక ప్రసవవేదన వల్ల సొమ్మసిల్లి దప్పికతో ఆయాసపడుతూ మహానదిలో నీళ్లు తాగటానికి అక్కడికి వచ్చింది. ఇసుకలో నడుస్తూ వచ్చి తడినేల పైన ముంగాళ్లు నిలిపి నీళ్లల్లో మూతిపెట్టి నాలికతో రుచిచూసి నెమ్మది నెమ్మదిగా దాహం తీర్చుకొంటున్నది. ఇంతలో ఆ సమీప ప్రాంతాన్నుంచి గుండెలు తడి ఆరిపోయే భయానకమైన ఒక సింహగర్జన వినవచ్చింది. సృష్టిప్రళయం సంభవించినప్పుడు ప్రళయకాలపర్జన్యాల గర్జానిర్ఘోషం దిగంతాలలో ప్రతిధ్వనించినట్లు మార్మ్రోగిన ఆ ఘోరనాదానికి నీళ్లుతాగుతున్న జింక తీగతెగిన ఆకులా గడగడలాడిపోయింది. ఎక్కడో ఉన్న సింగం తనమీదికి దూకుతోందన్న భయంతో దిక్కులు తోచక వెనక్కు తిరిగి ఊపిరి బిగబట్టి కాళ్లుచాచి కుప్పించి ముందుకు గంతువేసింది.

అలా భయపడిన జింక వెనక్కు తిరిగి మరీ ఎత్తుగా దూకేసరికి ప్రసవ సమయం కావడం మూలాన గర్భం కడుపులోనుంచి బయటికి తోసుకొనివచ్చి నీళ్లల్లోకి జారిపోయింది. ముందు పురికిన తల్లి జింక ఆ హఠాత్పరిణామానికి తట్టుకొనే సత్తువ లేక నేల కూలి ఒళ్లంతా పచ్చిపుండై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

అనభ్యూహితంగా తన కళ్లయెదుట రెప్పపాటు కాలంలో జరిగిపోయిన ఈ ఆకస్మిక ఘటనకు భరతుని హృదయం తల్లడిల్లిపోయింది. అతను గాలిరివ్వటలా ముందుకు దూకి నీళ్లపైన పడిన

గర్భాండం మునిగిపోయే లోపలే చేతులు చాచి వెలికి తీసి ఒడ్డుకు చేర్చాడు. అనురాగభరంతో విప్పారిన కనుదమ్ములతో ఆ నిసువును ఆప్యాయంగా స్పృశించి సేద తీర్చాడు.

కొంతసేపటికి ఆ జింకపిల్ల కన్నులు విచ్చి అలవోకగా లేచి కదలాడసాగింది. తల్లిపాల కోసం దాని ప్రాణాలు తహతహలాడాయి. ఆకలితో గొంతు ఇగిరింకిపోతుంటే చూసి భరతుడు ఏ తీరుననైనా దాని అసువులను కాపాడాలని నిశ్చయించుకొన్నాడు.

ఆ విధంగా రాజయోగిప్రవరుడై భవబంధాలను త్రెంచివేసి మోక్షద్వారంలో నిలుచొన్న భరతునికి ఆ నూత్నజీవిపై మమకారం మొలకెత్తి అక్కడికక్కడే పుష్పపల్లవ ఫలోపేతమయిన మహావృక్షంగా రూపుదాల్చింది.

ఏణశాబకపు ప్రాణరక్షణం చేయాలని సంకల్పోదయం కాగానే భరతుడు ఆ పరిసరాలలో ఉన్న తరుపల్లవాలను, మృదులపత్రాలనూ కోసి తెచ్చి సుతిమెత్తటి పొత్తిళ్లను తయారుచేశాడు. నదీతీరంలో లభించిన ఆ జింకపిల్లను చేతులతో లాలిస్తూ ఆప్యాయంగా పైకి లేవనెత్తి, పొత్తిళ్లను గుండెలకు హత్తుకొని తన ఆశ్రమానికి తీసుకొనివెళ్లాడు.

ఆ జింకపిల్ల భరతుని లాలనలో అల్లారుముద్దుగా పెరిగింది. సాలగ్రామతీర్థం లోని సారవంతమైన భూభాగంలో మొలకెత్తిన బాలతృణకాండాలనూ, మధురభక్ష్యాలనూ కొనితెచ్చి, ఆ పసికూన ఆకలిని కనిపెట్టి తానే చేతులతో నెమ్మది నెమ్మదిగా తినిపించి మురిసిపోయేవాడు. ఈ విధంగా ఆతని ప్రేమామృతాన్ని కడుపారా గ్రోలి ఆ జింకపిల్ల రకరకాల గారాబాలు పోయేది. అతని సమక్షంలో నిలిచి చెంగు చెంగున గంతులేస్తూ ముద్దుముచ్చటలు కురిపించేది. ఎప్పుడయినా అది పైరుపొలాల వెంబడిని గడ్డిమేస్తూ

వేళకు తిరిగి రాకపోయేసరికి, ఏ క్రూరమృగం పొట్టన బెట్టుకొన్నదో అని తల్లడిల్లిపోయేవాడు. అంతంతలోనే అది ముంగాళ్లతో ప్రేమగా తాకుతూ, నాలుకతో పాదాలను నాకుతూ తన కళ్లెదుట ప్రత్యక్షమయేసరికి ఎదురుచూపుతో అలిసి రక్తిమం నిండిన ఆయన కన్నులలో మళ్లీ జీవకళ తళుకొత్తేది. ఆ కృష్ణసారం శుక్లపక్షచంద్రునిలా దినదినాభివృద్ధిని చెందుతూ ఉంటే ఆయనకు దానితోడిదే లోకమై, అది లేకపోతే జీవించలేని స్థితికి వచ్చేశాడు.

కాలం గడిచేకొద్దీ ఆ జింకపిల్ల పెరిగి పెద్దది కాసాగింది. కాసారప్రాంతంలోని ఫలపాకాల వలన నెమ్మేను బంగారువన్నె తిరిగి కొత్త జిగి పొడచూపింది. లేతకొమ్ములు మొలకెత్తి దాని ముఖంలో వింత సోయగం ప్రవేశించింది. ఆ మెత్తని శృంగాలతో గీరుతూ అల్లరి చేస్తుంటే భరతునికి గిలిగింతలతో పులకోద్గమం కలిగేది. ఆయన యోగాసనాసీనుడై ధ్యానధారణకు ఉపక్రమించే సమయానికి అది కూడా వచ్చి ఆయన ఒడిలో పవ్వళించేది. దానికి ఆలనాపాలనా అన్నీ తనే కనుక నిద్రాభంగం కాకుండా వీవసల వీస్తూ శైత్యోపచారాలు చేస్తూ ఉండగానే యుగాలు క్షణాలలా దొర్లిపోసాగాయి.

ఒకరోజు ఉదయం ఆ జింకపిల్ల ఇంకా తెల్లవారకుండానే ఆకలితో లేచి తృణాగ్రాలను రుచిచూస్తూ ముందుకు అడుగేస్తూ అడవిలోకి వెళ్లిపోయి దారితప్పి ఎంతసేపటికీ మరి తిరిగిరాలేదు.

సాయంతనం దాకా ఎదురుచూసి జింకపిల్ల మరలి రాకపోయేసరికి భరతుడు నితాంతమైన దుఃఖసముద్రంలో మునిగి నిలువు నీరయ్యాడు. జాలిమాలి ఏ తోడేలు తినేసిందో, ఏ పెద్దపులి మింగేసిందో అని విలవిలలాడాడు. ఇన్నాళ్లూ తల్లీ తండ్రీ తానే అయి పెంచి పెద్దచేసిన మృగశాబకం కానరాలేదని మరింత మరింతగా

క్రుంగిపోసాగాడు. ఆయనకు ఎటుచూచినా ఆ పసికూన రూపమే కళ్లముందు కదలాడుతున్నట్లు కనిపించసాగింది. ఆఖరికి తన ఆశ్రమంలో పెరిగిన లేతగడ్డిపోచలు కూడా ఆయనకు సామవేదాన్ని స్వరయుక్తంగా గానంచేస్తున్న బాలవటువుల్లా అనిపించి, ఈ ఆశ్రమ పరిసరాల్లోనే పచ్చగడ్డి ఇంత సమృద్ధంగా దొరుకుతుంటే ఎక్కడికో వెళ్లవలసిన అవసరం ఏమొచ్చింది? నన్ను విడిచి ఒక్క క్షణమైనా ఉండలేదే, ఎక్కడ ఏ బాధల్లో చిక్కుకున్నదో అని కుమిలిపోయాడు. నెరియలు పడ్డ నేలలో ఆ జింకపిల్ల అడుగుజాడలను పోల్చుకుంటూ దాని జాడ కనిపెడదామని విఫలప్రయత్నం చేశాడు. సమీపంలోకి ఏ జంతువు వచ్చినా, ఎక్కడో గాలికి నేలమీద దుమ్ము లేచినా, తన జింకపిల్ల వస్తున్నదేమోనని తహతహలాడేవాడు.

కొన్నాళ్లకు ఆ జింకపిల్ల దారులను పసిగడుతూ అరణ్యంలో నుంచి ఆశ్రమాన్ని సమీపించి భరతుని దగ్గరకు వచ్చేసింది.

ఈ విధంగా భరతుడు మోహపాశంలో చిక్కుకొన్నాడు. భూమండలాన్ని ఒక్క గొడుగు కిందికి తెచ్చి ధర్మమార్గంలో పరిపాలించినవాడు, ప్రాప్యమైన ఇష్టభోగాలు పరిపూర్ణంగా సంప్రాపించాక సంసారబంధాల నుంచి వైరాగ్యం కలిగి తురీయాశ్రమాన్ని స్వీకరించిన మహాత్ముడు, కైవల్యపదాన్ని కోరి అనంతమైన భోగభాగ్యాలనూ, భార్యాపుత్రులనూ, బంధుమిత్రులనూ అలవోకగా విడిచిపెట్టి సాలగ్రామతీర్థాన్ని చేరిన ముక్తపురుషుడు—కర్మవశాన మళ్లీ అజవంజవపు రక్తిపథంలోనికి అడుగు పెట్టాడు. చూస్తూ ఉండగానే కాలం గడిచిపోయి అతనికి వార్ధక్యం వచ్చి మృత్యువు సంప్రాపించింది.

భరతుడు చనిపోయేటప్పుడు దారుణమైన అవస్థపడ్డాడు. తాను వెళ్లిపోయాక తన పెంపుడు జింక గతి ఏమవుతుందోనన్న దిగులుతో

అతని మనసు మనసులో లేదు. ఆ జింకపిల్ల కూడా ఆయన అవస్థను గుర్తించి దుఃఖంతో కళ్లనీళ్లు పెట్టుకున్నది. తన యజమాని, తన ప్రాణదాత, తన సర్వస్వం — తనను విడనాడనున్నాడని తెలిసి, అది తండ్రి అంతిమసమయంలో చూస్తూ నిస్సహాయంగా నిలబడిన పుత్రుని వలె విలపించింది. దాని ముఖరేఖల లోనే చూపులు నిలిపి, దాని కన్నుల లోనే కన్నులు కలిపి, దాని ఆలోచనలతోనే చింతా వ్యాకులితచిత్తుడై విడవలేక విడవలేక భరతుడు ప్రాణాలు విడిచాడు.

ఈ విధంగా మృగశాబక సంగదోషం వలన భరతుడు ఉత్తరజన్మలో కాలంజరపర్వతాల సమీపంలోని జంబూమార్గ వనంలో జింకగా పుట్టాడు.

హరిణమై జన్మించినా దైవకృప వల్ల పూర్వ జన్మల లోని ఉత్తమ సంస్కారాలు భరతునికి వాసనా రూపంలో వెన్నంటి వచ్చాయి. ఆ పుణ్యఫలం చేత అతను తల్లిని విడిచిపెట్టి మళ్లీ సాలగ్రామతీర్థానికి వచ్చి చేరాడు. ఆత్యంతికమైన కర్మశమం పైననే దృష్టినిలిపి, దేహధారణ నిమిత్తం ఆ పరిసరాలలో లభించిన జీర్ణ తృణాలనూ, ఎండుటాకులనూ తిని సంతుష్టిని చెందుతూ చిత్త శాంతితో జీవితం గడిపాడు. తన ప్రాగ్జన్మార్జితమైన జ్ఞానసంపద అంతా స్వయంప్రకాశమానమై భాసించి, అతను ఆ హరిణ దేహంలో కర్మ పరిభుక్తం అయేదాకా ఉన్నాడు.

ఈ విధంగా జీవితశేషాన్ని గడిపి భరతుడు ఆ జన్మలో దేహయాత్రను చాలించి అనంతరజన్మలో ఉత్తమ బ్రాహ్మణ వంశంలో జన్మించాడు.

పూర్వపుణ్యాలన్నీ ఫలించి భరతునికి ఈ జన్మలో ఆజానజమైన బ్రహ్మజ్ఞానం సిద్ధించింది. ఆ బాల్యవయస్సు లోనే అతను వేదశాస్త్రాలను నిశ్శేషంగా నేర్చుకొని, కులాచారసంప్రదాయాలను

నైష్ఠికతతో ఆచరించి, ధర్మమార్గంలో చరించి, మోక్షవిద్యను కరతలామలకం చేసికొన్న విప్రోత్తముని వలె ప్రవర్తించేవాడు. ఉపనయనం కాగానే అతనికి గురుముఖంగా వైదికవిద్యలను చెప్పించాలని తల్లిదండ్రులు ఎంతగానో ప్రయత్నించారు. కాని శబ్ద ప్రామాణ్యం చేత అధిగమింపదగిన తత్త్వసారాన్ని తన పుట్టుకకు పూర్వమే తెలిసికొన్న భరతుడు ఆ నిరుపయోగకరమైన బోధనలను తిరస్కరించాడు. కర్మపరులు అజ్ఞానం లోకి ప్రవేశిస్తారని, అనాత్మభావం తొలగి ఆత్మజ్ఞానం సిద్ధించడమే జీవితానికి పరమార్థమనీ గుర్తించాడు. కర్మారంభం వలన తాను మళ్లీ మోహావ్యావర్తంలో పడగలనని గ్రహించి నిర్మోహత్వాన్ని వహించాడు.

పూర్వజన్మలలో తాను చేసిన పొరపాట్ల వలన గుణపాఠాన్ని నేర్చుకొన్న భరతుడు ఈ జన్మలో మళ్లీ బంధనాల లోనికి ప్రవేశించలేదు. అభీష్టవస్తువులను గురించి నిరంతరం చింతిస్తూ ఉండటం వలన కామం ఉద్దీపించి శోకమోహాలు కలుగుతున్నాయని, ఈ జన్మలో విషయాసక్తిని త్యజించివేశాడు. యోగమార్గం లోనికి అడుగుపెట్టిన సర్వసంగపరిత్యాగులు ప్రచ్ఛన్నవేషంలో లేకపోతే వారి తత్త్వచింతనకు అవాంతరాలు కలుగుతాయని పెద్దలు చెప్పిన ఉపదేశాన్ని పాటించి, మొరకు రూపు తాల్చి మూర్ఖుని వలె ప్రవర్తింపసాగాడు. బాహిరమైన వేషభాషల పట్ల శ్రద్ధాసక్తులు సన్నగిల్లి స్నానసంధ్యలనూ, పూజాపురస్కారాలనూ మానివేశాడు. వెర్రివాడిలా వీథుల వెంటబడి ఒళ్లంతా దుమ్ముకొట్టుకొని మలిన దేహంతో కనబడేవాడు. పొలికేకలు వేస్తూ నోటికి వచ్చినట్లు పెడసరంగా అపభ్రంశపు మాటలాడేసరికి జనం అసహ్యించుకొని అతనిని చూస్తేనే చీదరించుకొనేవారు.

ఒక్కొక్కసారి ఆకతాయి పిల్లలు చదువుమాని తన దగ్గరకు వస్తే భరతుడు వాళ్లతో కలిసి విజృంభించి అల్లరిచేసేవాడు.

ప్రామినుకులను తరిచి సారనవనీతాన్ని వెలికితీసిన మహావిద్వాంసులు కనిపిస్తే సగౌరవంగా అభివాదం చేసి తప్పుకోక వారి దారికి అడ్డం నిలిచి వేళాకోళం పట్టించి అపహాస్యం కావించేవాడు. పురజనులు కోపంతో తిట్టి కొట్టి పరాభవిస్తే, ఇంకా పెచ్చరిల్లి భూతప్రేతపిశాచాల కన్నా వికృతంగా ప్రవర్తించేవాడు. ఆ పూట తిండి దొరకకుంటే గుగ్గిళ్లో, అడవిదుంపలో, వన్యఫలాలో భోజనయోగ్యం కాకపోయినా తిని కడుపు నింపుకొనేవాడు.

ఈ విధంగా మనస్సన్న్యాసియై నిర్లిప్తంగా కాలం వెళ్లమార్చుతున్న భరతునికి కొన్నాళ్లకు తండ్రి గతించాడు. అతనిని ఇన్నాళ్లూ కంటికి రెప్పలాగా కాపాడుతూ అతని జీవితానికి పెనవేసుకొన్న ఆ చరమబంధం కూడా విచ్చిపోయింది.

భరతుడికి రానురాను పనిపాట్ల ఒత్తిడి ఎక్కువ కాసాగింది. అన్నదమ్ములూ బంధువులూ అతని చేత పైరుపొలాలలో వెట్టిచాకిరీ చేయించుకొనేవారు. అతను కూడా ఫలాపేక్ష లేకుండా ఏదో దేహధారణకు తిండి గడిస్తే చాలన్నట్లు యదృచ్ఛాలాభంతో సంతుష్టి చెంది ఎవరేం చెబితే ఆ పని చేసిపెట్టేవాడు. ఎవరైనా తనకు దేయభృత్యం ఇవ్వలేదని వాదనలకు దిగక నిశ్చింతగా ఊరుకునేవాడు.

భరతుడు ఈ తీరున సాధారణ బ్రాహ్మణుడై క్షేత్రకర్మలలో కుదురుకొని ఉండగా, ఒకనాడు సౌవీరదేశాన్ని పరిపాలిస్తున్న వీరభూపతి సంసారదుఃఖ పరంపరలతో కడాసించి జీవితాన్ని అద్వితీయమైన బ్రహ్మజ్ఞానంతో పండించుకోవాలని సర్వసంగపరిత్యాగం చేసి ఇక్షుమతీనది ఒడ్డున ఉన్న కపిలమహర్షి ఆశ్రమానికి వెళుతూ మార్గమధ్యంలో సాలగ్రామతీర్థానికి వచ్చాడు.

సౌవీరరాజుతో పాటు అతని పరివారం కూడా ముక్తా ముక్తంగా తరలివచ్చింది.

రాజసేవకులు . దూరాయాసంతో సొమ్మసిల్లిపోయారు. బోయీలకు రాజు కూర్చొన్న పల్లకిని కేలబట్టి లేవనెత్తడానికి మనిషిసాయం కావలసి వచ్చింది. అప్పుడు వారిలో అగ్రవేతనుడు ఊరి తలపొలంలో తలవంచుకొని పనిచేసుకొంటున్న భరతుణ్ణి పరికించి, "ఈ లావరి చదువుసంధ్యలు లేని బ్రాహ్మణబ్రువుని వలె గోచరిస్తున్నాడు. తోడూ నీడా ఎవరూ ఉన్నట్టు లేరు. వీణ్ణి అదలించి జీతమూ బత్తెమూ లేకుండా కొలువులో పెట్టుకోవచ్చు" అని తలపోసి, భుజాస్ఫాలనం చేసి భరతుని రెక్కపట్టుకొని లాక్కువెళ్లి తన స్వజనంతో కలుపుకొన్నాడు.

ఈ విధంగా ఆత్మయోగరతాత్ముడై అత్యున్నత శిఖరాలనధిరోహించిన బ్రహ్మజ్ఞాని శిబికావాహకుడై రాజపల్యంకికను వీపుపై కెత్తుకొని మోయవలసి వచ్చింది.

భరతుడికి రాజాందోళికను సమనిమ్నోన్నతంగా నడుపుకొనిపోవడం చేతకాలేదు. దృష్టిని దర్శనార్థ్యం పైని నిలపక నాసాగ్రానికి అంతికంలో కాడి కొనపైన కేంద్రీకరించి ముందుకు నడవటం మూలాన మిట్ట పల్లాలు వచ్చినప్పుడు పల్లకీ ఊగులాడసాగింది. దుష్కర కార్యాభ్యాసం లేని అతని విషమగమనం మూలాన బోయీలకు కూడా పాదుకలు తడబడి పల్లకీ భుజాలపై నుంచి ప్రక్కల కొరిగి, లోపల సుఖోపవిష్టుడై ఉన్న సౌవీరనృపతికి తల్లడపాటు కలిగింది. అతను బోయీలను ఉచ్చైస్స్వరంతో మందలించి, "ఏమిటి ఈ కుదుపు? పల్లకిని భుజ మధ్యాని కెత్తుకొని సమవేగంతో నడవండి" అని ఆజ్ఞాపించాడు. అప్పుడు కూడా భరతుని అసామర్థ్యం వలన ఆందోళిక ముందు వెనుకలకు కదలాడి రాజుకు

మళ్లీ శరీరాయాసం కలిగింది. అతను కుపితుడై, "ఎవరురా అది! రాజశిబికను ఇంత నిర్లక్ష్యంగా మోస్తున్నవాడు" అని క్రోధావేశంతో గద్దించాడు. అయినా పల్లకి ఋజుగమనంతో ముందుకు సాగలేదు. శిబికావాహకులు ఇక చేసేది లేక, "ఓ రాజేంద్రా! వీడెవడో ఏపుగా బలిసి ఉన్నాడని చూసి రాజసేవలోకి నియోగించి కొనితెచ్చాము. వీడి నడక వక్రం. మాతో సమానంగా అడుగువేయటం చేతకాక ఊగిసలాడిస్తున్నాడు" అని రాజుతో మొరపెట్టుకొన్నారు.

వాహకుల పలుకుల నాలించి సౌవీరనృపతి భరతుని కేసి పరిహాసపూర్వకంగా అన్వీక్షించాడు. "ఏమోయి! నీ దేహం చూడగా కమ్మెచ్చున తీసినట్లు కండలుప్పొంగి బలిష్ఠమై గోచరిస్తున్నది. దూరం నడిచినందువల్ల అలసినావా, ఏమిటి? అలవు తప్పి శిబిక ఊగిసలాడుతున్నది" అని ప్రశ్నించాడు.

జాల్మవృత్తిలో సంచరిష్యమాణు డయినా అకుంఠిత సత్యదీక్ష చేత నిర్భీకుడైన భరతబ్రాహ్మణుడు రాజు మాటలకు ఈ విధంగా సమాధానం చెప్పాడు.—

భరతుడు: రాజా! త్రోవనడిచి నేను డస్సినందువలన కర్తవ్యహాని సంభవిల్లిన దనటం అసత్యోదంతం. నాకు సమ్మతం కాదు.

రాజు : ఓయీ! నువ్వు కొత్తవాడివై మార్గాయాసం వలన సొమ్మసిల్లినది నిజం కాకపోతే శిబిక ఊగులాడటం ఎలా సంభవించింది? ఆ శిబికను నువ్వు మోయలేదంటావా ఏమిటి?

భరతుడు: రాజా! నీవు పలికినది వాస్తవమే. నేను త్రోవనడిచి అలసిపోలేదు. నీ శిబిక నాచే మోయబడలేదు. నీ ఆగ్రహం నిర్హేతుకం సుమా!

రాజు : అయ్యా! ఇంతమంది పరివ్రాజకులు చూస్తుండగా నువ్వు పల్లకిని భుజాని కెత్తుకొన్నావు. శిబిక ఊగులాడి నాకు శరీరాయాసం కలిగింది. ప్రత్యక్షప్రమాణం చేత కన బడుతున్నదానిని కాదని వాదిస్తున్నావు. ఇది నీకు సమంజసమేనా?

భరతుడు: రాజా! నీవు ప్రత్యక్షగోచరం అంటున్నది ఆధారాధేయ భావాన్ని అనుశీలించి చేసిన నిరూపణ కాదు. ఏది ప్రత్యక్షమని నీవు అంటున్నావో, ఆ ప్రమాణవిమర్శకు గీటురాయి ఏమిటి? నేను శిబికను మోసినది నీ వను కొంటున్న ప్రత్యక్షప్రమాణానికి విషయం కాదు. శిబికా భారం నాపై నిలిచినదికూడా తర్కసహమైన వ్యాహారం కాదు. ఈ రెండూ మిథ్యాప్రసంగాలే. విను—

అని పలికి భరతవిప్రుడు సౌవీరనృపతికి పరమార్థ వివేకాన్ని కరతలామలకంగా ఉపదేశించాడు:

''నరపతీ! నీవు ప్రత్యక్షప్రమాణం చేత సమ్యగభిజ్ఞాతమని చెప్పిన సన్నివేశాన్ని ఒక్కసారి సుమతివై అనుశీలించి చూడు. నా పాదాలు నేలపై మోపబడి స్తిమితంగా ఉన్నాయి. వాటి బరువును నేల మోస్తున్నది. పాదాలు తమపైన ఉన్న పిక్కల బరువును మోస్తున్నాయి. ఆ జంఘల పైని ఊరువులు, జఘనం, కటిప్రదేశం ఉన్నాయి. జంఘల బలిమిపై ఊరువుల సుస్థితి ఆధారపడి ఉంటుంది. ఊరువులు ఉదరభారాన్ని వహిస్తున్నాయి. ఆ ఉదరంపైన వక్షో భరం ఉన్నది. వక్షస్సు భుజాల బరువును మోస్తున్నది. భుజాలు శిబికను భరిస్తున్నాయి.

నృపాలా! శరీరంలో ఉపర్యుపరిగా అమరిన వివిధావయవాలు శిబికాభారాన్ని ఏకసమయంలో వహింపగలుగుతున్నాయి. వీటిలో

ఏ ఒక్కటి ప్రత్యేకంగా నేను అనబడే వ్యవహారానికి ఉపలక్షకం కాదు. వీటి సమాహారరూపాని కైనా పృథివ్యాది ద్రవ్యగుణ విరహితంగా వ్యవహారం లేదు.

ఈనాడు రాజలాంఛనాలతో పల్లకీ యెక్కి, సుఖాసనాసీన మైన ఒక శరీరాన్ని, నిన్ను, పార్థివేంద్రుడు అనీ; పల్లకీని భుజాల పైని తాల్చిన ఒక శరీరాన్ని, నన్ను, వాహకుడనీ అంటున్న వ్యవహారం శరీరభేదం చేత ఏర్పడినది. ఈ మన రెండు దేహాలనే కాక సృష్టిలో ఉత్పన్నమైన సమస్త భూతజాతాన్నీ పృథివ్యప్తేజో వాయ్వాకాశ ద్రవ్యపంచకం వహిస్తున్నది. సత్త్వమూ రజస్సు తమస్సు లనే మూడు గుణాల పరిణామరూపమైన వెల్లువలో పడి దేహం ప్రవర్తిల్లుతున్నది.

ఓ మహీనాయకా! లోకంలో 'నేను', 'నీవు' అని ఉపాధి భేదం చేత ద్విధాభూతమై ఘటిల్లిన వ్యవహారానికి అవిద్య కారణం. ఈ అవిద్య వలన సర్వాన్తర మయిన ఆత్మస్వరూపాన్ని తెలుసు కోనంత వరకూ బుద్ధికి నామరూపాల ఉపాధిదృష్టి మాత్రమే స్ఫురిస్తుంది. అటువంటి దృష్టికి ఈ సృష్టిలో వివిధ నామరూపాలతో అనేక పదార్థాలున్నాయని, అవి అన్నీ విభిన్నాత్మలనీ గోచరిస్తుంది. 'నేను' అన్న ఉపాధిలో నిలిచిన ఆత్మ, యుష్మదుపాధిలో నిలిచిన ఆత్మ ఒకటేనా? లేక సమానలక్షణాలు కలిగిన రెండు భిన్నాత్మలా? అని సందేహం పొడమినప్పుడు స్థూలదృష్టికి రెండూ వేర్వేరుగా ఉన్నట్లే కనబడుతుంది. ఈ నానాత్వ వ్యవహారదృష్టి జీవికి స్వాభావిక మైన అవిద్య వలన సంక్రమించిన లక్షణం.

కర్మకు లోపడి ప్రవర్తిల్లిన దేహానికి కర్మసంచయం వలన హానివృద్ధు లేర్పడినట్లు గుణాతీతమై, శుద్ధచైతన్య స్వరూపమైన ఆత్మకు సంప్రాప్తించవు.

రాజా! నేను పీవరదేహంతో ఉన్నప్పటికీ శిబికను సరిగా మోయలేకపోవడం వలన నీకు శరీరాయాసం కలిగినదంటున్నావు. నిర్హేతుకమైన ఈ దుర్బలయుక్తి నీకు సర్వాంతరమైన ఆత్మజ్ఞానం లేకపోవడం మూలాన సంభవించింది. ఈ విధమైన నానాత్వ వ్యవహారం మిథ్యాభూతమని గ్రహింపకపోగా, ప్రత్యక్షప్రమాణాన్ని చూపడం గొప్ప సత్యాభినివేశం అయినట్లు నీవు అనర్థాపాదకంగా ప్రసంగించావు.

అంతేకాదు. ఈ శిబికాభారం స్థితిమంతమవడం నాపట్ల ఎంత సత్యమో నీ పట్ల కూడా అంతే సత్యం.

భూమి, పాదాలు, జంఘలు, ఉదరం, ఊరువులు, వక్షస్సు, భుజాలు — ఇన్నింటిపైన ఆధారితమై ఉన్న శిబికను మోస్తున్న కర్మదేహానికి తదుపలక్షితమైన శరీరంతో ఆభాసమాత్ర మయిన వ్యవహారభేదాన్ని పరిత్యజించు.''

అని స్ఫుటోక్తులతో శాంతంగా పలికి ఆ ధరామరేంద్రుడు మళ్లీ ఎప్పటివలెనే పల్యంకికను ఎగుబుజాల కెత్తుకొని మౌనంగా ముందుకు నడువసాగాడు.

సౌవీరునికి పరమార్థోపదేశం

ఈ విధంగా పరమదుర్లభమైన తత్త్వవివేకాన్ని తనకు అనాయాసంగా ప్రసాదించిన ఆ బ్రహ్మవిద్యాధరుని నెనరు వెల్లువకు సౌవీరనృపతి ముగ్ధుడయ్యాడు. జడుని రూపుతాల్చి అపకృష్టద్విజుని భాతి సంచరిష్ణువైన ఆ మహాత్ముడు తనకు సన్నిధి ననుగ్రహించి ధర్మావేశంతో శావించిన సదుపదేశాన్ని తలచుకొని అతని కన్ను లలో కృతజ్ఞత క్రేళ్లురికింది. పల్లకీ దిగి ఆయన పాదకమలాలను కన్నుల కద్దుకొని, సవినయంగా ఇలా పలికాడు—

"మహాత్మా! ప్రచ్ఛన్నవేషం ధరించినప్పటికీ మీలో తొణికిసలాడుతున్న విజ్ఞానదీప్తిని గుర్తింపలేకపోయిన అవివేకిని. క్షంతవ్యుడ ననడానికి కూడా నాకు నోట మాటరావడం లేదు. ముమ్మొదట ఆ శిబికను విడిచిపెట్టి మీచే బరువుమోయించిన నా తప్పిదాన్ని కాచి నన్ను కటాక్షించండి.

ఆర్యా! బ్రహ్మజ్ఞానసంపన్నులైన మీరు ఈ తీరున జాల్మ వృత్తిలో ఎందుకు చరిస్తున్నారు? ఈ నీచకర్మల లోనికి ఎలా ప్రవేశించారు? మీరెవ్వరు? మీ గురించి తెలుసుకోవాలన్న కుతూహలంతో ఈ విశేషాల నర్థించినందుకు నన్ను దయతో మన్నించండి."

అని ప్రార్థించిన సౌవీరుని చూచి ఆ విప్రోత్తముడు ఈ విధంగా సమాధానం చెప్పాడు:

"రాజేంద్రా! సర్వానుభవయుక్తులకూ శీర్షణ్యమైన 'సోఽహం' అన్న తత్త్వార్థాన్ని స్వానుభవంలో గ్రహించాలన్న కోరిక ఉంటే జీవికి దేహధారణం తప్పదు. ఈ దేహం దేహికి కర్మానుభవ నిమిత్తమై కలుగుతున్నది. ఆ ఉపభోగవాంఛ కలిమిచేతనే నేను కూడా ప్రాదుర్భవించాను. ఈ జీవికి దేశకాలవశత మూలాన సుఖ దుఃఖాలు కలుగుతాయి. జీవులకు ఈ సుఖదుఃఖపరంపరను ధర్మా ధర్మాలే కలుగజేస్తాయి. ఈ ధర్మాధర్మాలు రెండూ మానవులకు కర్మలను ఉపభోగించడానికి నిమిత్తహేతువులు. వీటి వలన ఆగమన స్ఫురణ కలిగి జీవులకు మోక్షాభిలాష ఉదయించి కర్మసంచయం ఉపశమిస్తుంది."

ఈ పలుకులను ఆకర్ణించి సౌవీరనృపతి, "మహీసురోత్తమా! మీరు నిరూపించిన ఉక్తిప్రత్యుక్తులతో నాకు సహేతుకమైన జ్ఞాన స్వరూపం అవగతప్రాయమవుతున్నది. కాని మీరిందాక పేర్కొనిన

'సోఽహం' అన్న పలుకు తాత్పర్యార్థం నా మనస్సుకు భాసింప లేదు. ఈ మహావాక్యాన్ని చరాచరవస్తుజాతానికి అన్వయించడం ఉచితమా? లేక సర్వాన్తరమైన ఆత్మకు ఉపలక్షణంగా అన్వయించడం ఉచితమా? నాకు విశదీకరించి చెప్పండి'' అని ప్రార్థించాడు.

సౌవీరుని ప్రశ్నావళికి సమాధానంగా భరత బ్రాహ్మణుడు పరమార్థసారాన్ని ఉపదేశించాడు.

''నరపతీ! కర్మానుభవానికి కేవలం ఉపాధిమాత్రభూతాలయిన దేహాదులలో పరమాత్మలక్షణాన్ని ఆరోపించడం భ్రాంతిమూలకం. అందుచేత సోఽహం వాక్యార్థాన్ని ఆత్మయందు మాత్రమే సమన్వయించి చెప్పాలి. అనాత్మవిషయాలలో ఆత్మజ్ఞానాన్ని అనువర్తించి చెప్పకూడదు.

'నేను' అని పలికినప్పుడు అహమిత్యర్థంలో శబ్దాన్ని ఉచ్చరిస్తున్నది నాలుక. ఈ ఉచ్చారణక్రియలో జిహ్వావయవానికి దంతాలు, పెదవులు, తాలువు సహకారకాలవుతున్నాయి. వీటిని వాఙ్నిష్పాదనహేతువులని అంటారు. శబ్దోచ్చారణకు తోడ్పడినంత మాత్రాన ఈ శరీరాంగాలు కాని, వీటిచేత ఉచ్చరింపబడిన వాక్కు కాని 'నేను' అనే శబ్దానికి విషయభూతాలు కావు. కరచరణాది పృథగ్లక్షణాల చేత లక్షితమైన ఈ శరీరాన్ని ఆత్మగా నిరూపించడం వివేకం అనిపించుకోదు.

పార్థివేంద్రా! త్రిలోకీపరంధాముడైన విశ్వాత్మకుడే అద్వితీయ పరబ్రహ్మవస్తువు. నీకూ, నాకూ, తక్కిన లోకులకూ పరాత్పరుడయిన ఆ మహానుభావుడే లోకాలోకాల లోనూ అఖండమై, పరిపూర్ణమై, మహత్స్వరూపమైన ఏకాకృతిలో నెలకొని ఉన్నాడు. ఆ పరమాత్మను కాదని హస్తమస్తకాదులు కలిగిన ఈ దేహమే ఆత్మ అని భ్రాంతిని చెందటం అవిద్యాఫలం.

సమస్తంతో ఏకత్వమే ఆత్మయొక్క వాస్తవమైన స్వరూపం. అది స్వయంజ్యోతిః స్వరూపం. అటువంటి సర్వాత్మ భావమే జ్ఞాన పరమార్థం. స్వాభావికమూ, చైతన్యజ్యోతిః స్వరూపమూ, పరమార్థమూ అయిన పరమాత్మతో పరిష్వక్తుడయి ఏకత్వాన్ని పొంది సర్వాత్మకు డైన మహాజ్ఞానికి బాహ్యాభ్యంతరాలు రెండూ లేవు. తనకంటె బాహ్యమైన వస్త్వంతరం ఒకటి ఉన్నదని కాని, సుఖదుఃఖాత్మకమైన తన స్వరూపం దానికంటె విలక్షణమని కాని అతనికి అనుభవసిద్ధాలు కావు.

సృష్టిలోని నానాత్వమే బాహ్యాభ్యంతరాది విశేషాలను మనం గుర్తించడానికి కారణం. వస్త్వంతరాన్ని మనకు అభిముఖంగా భాసింపజేస్తున్న అవిద్యే ఈ నానాత్వానికి కారణం.

సర్వదేహాలలోనూ వ్యవస్థితు డయిన పరమాత్మ ఒక్కడే అయినప్పుడు ఉపాధిమాత్ర విభాగం చేత నేను — నీవు అన్న భేదభావాన్ని కలిగి ఉండటం జ్ఞానలక్షణం కాదు.

సౌవీరపతీ! నీవు రాజువు. ఇది నీ పల్లకీ. వీరందరూ నీ పల్లకీ బోయీలు. ఇది నీ పరివారం. అంతమాత్రం చేత ఇది నీ పరివారమనీ అనడానికి వీలులేదు. లోకసంజ్ఞార్థమై ఏర్పడిన నానాత్వ దర్శనమూ అసందిగ్ధం కాదు.

రాజా! నీవు అధిరోహించిన ఈ శిబికనే చూడు. ఇది దారువినిర్మితం. ఆ దారువు అరణ్యవృక్షాల నుంచి వచ్చినది. కనుక నీ వెక్కినది దారువా? వృక్షమా? దారువే అయితే ప్రజలు నిన్ను చూసినప్పుడు—"అదిగో, మా రాజు దారువుపై కూర్చున్నాడు" అనాలి. పోనీ వృక్షమే అందామంటే, ప్రజలు—"అదిగో, మహారాజు గారు వృక్షారూఢుడై వెళ్తున్నారు" అనాలి. నిజానికి నీ వెక్కినది చెట్లను కొట్టి తెచ్చిన దారుసంఘాతమే. ఆ శకలాలను

వస్త్రంగులు చేర్చి చిత్రికపట్టి రూపొందించగా పల్లకీ అయింది. అలాగే ఒక గొడుగు విడిభాగాలను జ్ఞాపకం చేసికొని చూడు. వాటిని దగ్గరకు చేర్చినపుడు అది ఆతపత్రం. ఛత్ర శకలాలను మనం ఛత్రమని అనలేము కదా!

నృపసత్తమా! ఇదే న్యాయాన్ని నీవు నాకూ, నీకూ, సర్వ జీవులకూ అనువర్తించి చూడు. లోకంలో ఉన్న భేదాలన్నీ లోక వ్యవహారం కోసం ఏర్పడినవే కాని పరమాత్మ నుంచి తాము వేరన్న అభిజ్ఞానంతో కాదు. ఈ మనుష్యులూ, స్త్రీపురుష విభేదాలూ, గోమహిషమేషాలూ, వాజులు, కుంజరాలు, పాదపాలు అన్న వ్యాహారం కర్మయోనులైన జీవులకు శరీరాకృతిభేదం చేత ఏర్పడినదే కాని ఆత్మభేదం చేత కాదు. ఈ దేవ తిర్యఙ్మనుష్యాది దేహాభిత్తులు శుద్ధ బుద్ధ ముక్త కేవల అఖండ సచ్చిదానంద స్వరూపమైన ఆత్మాభిధానకాలు కావు. లోకుల చేత రాజు, రాజభటుడు అని సిద్ధించిన వస్త్వంతరాభాస చిత్తవిభ్రాంతి జనితమే తప్ప సత్యదర్శనంతో అంటున్న మాట కాదు.

లోకంలో నానాత్వదృష్టి చేత గోచరీభూత మవుతున్న పృథగ్విభేదాలకు అవిద్యా నిష్పన్నమైన చూపులోపమే నిమిత్త కారణం.

నరనాథా! సౌవీరనామకుడవై ఈ భూమిభాగాన్ని పరిపాలిస్తున్న నీవు ఈ దేశవాసులందరికీ మహారాజువు. నీ తల్లిదండ్రులకో! కేవలం కొడుకువు మాత్రమే. ఒకరికి పుత్రుడవై జన్మించిన నీవు నీ ధర్మపత్నికి భర్తగా ఆరాధ్యుడవు. నీ సుతులు నిన్ను తండ్రివని గౌరవిస్తారు. శత్రువులు నిన్ను వైరివని విద్వేషిస్తారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా కానవస్తున్న వ్యవహారాలలో నిజమైన నీవు ఎవరివో చెప్పగలవా? నీ శరీరంలో నీ ఉనికి

ఎందులో ఉన్నది? ఈ పరిదృశ్యమానమైన నీ శీర్షమే నీవని అనుకో వచ్చా? లేక నీ కంఠమూ, ఉదరమూ, పాదాదికాలలో ఏది నీవుగా నిరూపితవ్యం? ఇవన్నీ కలిసి నీవుగా ఏర్పడ్డాయని అంటే మరి నీవు ఈ సమస్తావయవాల లోనూ పృథగ్వ్యవస్థితిని కూడా కలిగి ఉన్నావు. నీవు ఈ సర్వస్వానికీ అన్యుడవైతే ఆ అన్యాన్ని గుర్తించి నీయందు అహంభావనను చేయగలవు. కాని పృథక్కరణ నిష్పాద్యమై ఉన్నదానిలో తత్త్వవివేకం ఎలా సాధ్యపడుతుంది?''

ఈ విధంగా పరమార్థసమన్వితాలైన మేలి పలుకులను వీనులవిందుగా విని సౌవీరనృపతి ఆ ద్విజోత్తమునికి ప్రశ్రయావనతుడై నమస్కరించి ఇలా అడిగాడు:

''భగవత్స్వరూపా! ప్రకృతిమహద్వివత్షు కలిగి అశేషమైన ఈ భూతజాతంలో మీరు కావించిన ఐక్యభావనను గురించి తెలుసుకొన్నాక నా మనస్సు జ్ఞానమయం కాకపోగా చిత్తవిభ్రాంతి మరీ ఎక్కువౌతున్నది. మీరు చెప్పినదంతా యథార్థమే; సందేహం లేదు.

మీరిందాక ప్రసంగారంభంలో ''ఈ పల్లకిని మోస్తున్నది నేను కాదు; ఈ పల్లకీ నా భుజాల పైన లేదు. పల్లకీని మోస్తున్న ఈ శరీరం నాకన్నా అన్యమైనది'' అని పలికిన వాక్యాలు మీరు చెప్పినప్పుడు యుక్తియుక్తంగా ఉన్నట్లు భాసించినా, పునర్విమర్శ చేసినప్పుడు మరింత విభ్రమాస్పదంగా కనిపిస్తున్నాయి. ఎంత ఆలోచించినా మీ మాటలలోని అంతరార్థం నాకు అంతుపట్టడం లేదు.

మహాత్మా! నేనిప్పుడు మహాభాగుడైన కపిలమహర్షిని సందర్శించి పరమార్థసారాన్ని తెలుసుకోవాలని బయలుదేరాను. ఆయన సాక్షాత్తూ భగవంతుడైన శ్రీమహావిష్ణువు అంశతో అవతరించిన మహాజ్ఞాని. వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్లు కామితార్థ

కల్పభూజం అయిన ఆ సంయమీంద్రుడు మార్గమధ్యం లోనే నన్ను కరుణించి, నాకు మీ రూపంలో దర్శనభాగ్యాన్ని ప్రసాదించినట్లయింది. అనంతమైన విజ్ఞానజలవీచికలకు మీరు జలధి సన్నిభులని గ్రహించాను. మీ పాదాలను నమ్ముకొన్న నన్ను అనుగ్రహించి నాకు పరమార్థమైన శ్రేయః స్వరూపాన్ని విశదీకరించండి'' అని పరిపరివిధాల సౌవీరనృపతి భరతబ్రాహ్మణుని వేడుకొన్నాడు.

నృపతి మాటలకు ఆ ద్విజోత్తముడు ప్రసన్నాస్యుడై ఈ విధంగా సమాధానం చెప్పాడు:

''నరనాథా! నీ వడిగిన ప్రశ్నను బట్టి నీ వాంఛితం పరమార్థ జ్ఞానమో లేక శ్రేయోభిజ్ఞానమో నాకు స్పష్టంగా అవగతం కాలేదు. అవి రెండూ ఒకటి కావా? అని అడుగుతావేమో, ముందు శ్రేయోలక్షణాన్ని గ్రహిస్తే అది పరమార్థప్రదం కాదని సులభంగానే అర్థమౌతుంది.

లోకంలో జీవులు తమతమ ఇష్టదైవతాలను ఆరాధించి ధన ధాన్యాలను పొందుతున్నారు. భూములనూ, రాజపదవులనూ, పుత్ర పౌత్రాదిక వంశాభివృద్ధినీ కోరి వ్రతాచరణం చేయగా ఫలప్రాప్తి కలుగుతున్నది. ఇవన్నీ శ్రేయాలు. ఈ శ్రేయాలలో ఏది గొప్పది? ఏది మరీ ప్రాపణీయం? అంటే, దేనికదే గొప్పది. దేనికదే ప్రాపణీయం. కాని పరిశీలించి చూస్తే ఇందులో ఏ ఒక్కటీ పారమార్థికం కాదు.

మానవులు యజ్ఞాత్మకమైన కర్మలను ఆచరిస్తే ఫలాభిలాషకు అనురూపంగా స్వర్గప్రాప్తి కలుగుతుంది. అది శ్రేయమే కాని పరమార్థం కాదుకదా!

యోగవిద్యను అభ్యసించిన మహాయోగులు సమాధ్యవస్థలో జీవునికి పరమాత్మతో సాయుజ్యభావన కలుగుతుందని అంటారు.

వీరి సంకల్పంలో కూడా కామనాశనం లేదు. అందుచేత ఇదీ పరమార్థం కానేరదు.

శ్రేయాలు శతసహస్రాధికంగా ఉండవచ్చును కాని అవేవీ పరమార్థ వివేకోదయానికి ఉపస్కారకాలు కావు.

ధర్మాభిలాష చేత కొందరు ధనాన్ని వ్యయం చేస్తే వారికి ధర్మం చేకూరే మాట నిజమే కాని, సామాన్యంగా వారు నిష్కామ కర్మగా కాక ఏదో ప్రయోజనాన్ని ఆశించి ధర్మాలు చేస్తారు. వారికి కామ ఫలానుభవం కలుగుతుందే కాని పరమార్థతత్త్వం తెలియదు. పుత్రుని వలన పున్నామనరకాలు తొలగి పోతాయని పుత్రుడే పరమార్థం అంటే తాను కూడా మరొకరికి పుత్రుడే కదా! అందుచేత పరమార్థం పరంపరాగత మనే విపరీతలక్షణం ఏర్పడుతుంది. కార్యకారణాత్మకమైన ఈ కర్మసంచయం వలన ఆత్మావగతిని పొందడం సాధ్యం కాదు.

'నేను మహారాజును, సుఖభోగాలకు ఆలవాలమయిన రాజ్యాదిప్రాప్తి నాకు పరమార్థం' — అంటే రాజ్యం ఉన్నన్నాళ్లూ పరమార్థం ఉన్నదనీ, రాజ్యం లేనప్పుడు లేదనీ అనుకోవాలి. ఇక ఋగ్యజుస్సామవేదాల నుండి నిష్పాద్యా లయిన యజ్ఞయాగాలను కూడా పరమార్థాలని భావింపకూడదు. వాటిలో కర్మఫలనిరూపణం మాత్రమే ఉన్నది కాని పరమార్థలక్షణం లేదు.

మట్టితో తయారుచేసిన కుండకు మన్ను కారణం; మట్టినుంచి పుట్టిన కుండ కార్యం. ఏ కారణం చేత కార్యం పుడుతున్నదో, ఆ కార్యం కారణాని కంటె విభిన్నం కాదు. అలాగే ఏ కామన చేత కామ్యకర్మ కలుగుతున్నదో, అది కామ్యవర్జితం కాదు.

అంతేకాక కాలాంతరంలో నశించిపోయే కుశలు, సమిధలు, ఆజ్యాలు మొదలైనవాని చేత ఆహావనీయమైన యజ్ఞకర్మ కూడా

నాశభావాన్ని పొందుతుందే కాని శాశ్వతఫలాన్ని ప్రసాదింప లేదు. నాశిద్రవ్యోపపాదితమైన సంస్కారకర్మలు అవినాశ రూప మైన పరమార్థాన్ని సాధించలేవు. ముక్తికోసం ఆచరించే విధులన్నీ సాధ్యసాధనభావం చేత సాధకునికి పరమార్థప్రదాలు కావు. ఆత్మ పరమాత్మల సంయోగాన్ని కోరి చేసే ఆత్మధ్యానంలోనూ ఆత్మో పాధులను వేరుచేసి చూడటం ఉన్నది. ఒక ద్రవ్యం మరొక ద్రవ్యంగా మారడం భౌతికధర్మవిరుద్ధం కనుక ఆత్మ పరమాత్మగా మారుతుందనుకోవడం దోషదూషితం.

భూపాలతిలకా! ఇన్ని కారణాల చేత దురవగాహమైన పర మార్థోపాయాన్ని సంక్షేప రూపంలో వివరిస్తున్నాను:

పరమార్థజ్ఞానసంస్కృతమైన మనస్సు చేత జిజ్ఞాసువులు ఆత్మ జ్ఞానాన్ని పొందుతారు. సర్వాంతరితమైన ఆత్మలో ఇతరజ్ఞాననివృత్తి కలగడమే ఆత్మజ్ఞానం. శుద్ధచైతన్యస్వరూపమైన ఆత్మపదార్థం నామము, జాతి మొదలైన ఉపాధులూ; యోగవిషయాలు, ధ్యాన ధారణాలు, స్వదేహాపరదేహాలు అన్న భేదభావనలూ లేని ఏక స్వరూపం.

బ్రహ్మము సత్యజ్ఞానానందాత్మకం. పరిణామాతీతమూ, వికార విరహితమూ, అఖండమూ, నిర్దోషమూ, సర్వవ్యాపకమూ అయిన బ్రహ్మమనే సత్యపదార్థం తప్ప మరొక్కటి లేదు.

దృశ్యమానమైన బహిరంతరప్రపంచం అనిత్యం. బ్రహ్మ మొక్కటే నిత్యం.

మనుష్యుని స్థూలశరీరం పృథివ్యాది పంచభూతాలతో రూపొందినది. ఇది పైతొడుగు వంటిది. మృత్యువు దీని మార్పు. అభేదవ్యాపకమైన వాయువు వేణురంధ్రాల నుంచి వినిర్గమించి షడ్జాదిసప్తస్వరాలుగా రవళించినా వాయుస్వరూపంలో పరిణామ

వికల్పాలు లేవు. బ్రహ్మాత్మైక్యాన్ని నిర్గుణోపాసన వలన అధిగమించడమే జీవన్ముక్తి.

బ్రహ్మము సచ్చిదానందస్వరూపం. ఇది మాయతో కూడినప్పుడు సగుణబ్రహ్మ మనబడుతున్నది. సమష్ట్యుపాధిలో ఉపహితమైన బ్రహ్మం ఈశ్వరుడు. వ్యష్ట్యుపాధిలో ఉపహితమైన చైతన్యం జీవుడు. ఈ ఇరువురూ పరబ్రహ్మానికి ప్రతిబింబాల వంటివారు. బ్రహ్మాది భేదరూపాలు పరమాత్మని కంటె వేరు కావు. ఏక పదార్థానికి రూపభేదాలు బాహ్యకర్మ ప్రవృత్తి వలన ఏర్పడినవి. బాహ్యమైన దేవమనుష్యాది రూపభేదాలు ఉపధ్వస్తాలైనప్పుడు బాహ్యాభ్యంతరాలకు ఆవరణశూన్యమైన ఏకస్వరూపజ్ఞానం కలుగుతుంది.''

అని ఈ విధంగా ద్విజావతంసుడు అత్యంత దురవగాహమైన పరమార్థసారాన్ని గంభీర వచనాలతో ముక్తసరిగా చెప్పి ముగించేసరికి సౌవీరనృపతి చింతాక్రాంతుడై తలవంచుకొని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. అతని మనస్సులో పొలిచిన సందేహం ఇంకా నివృత్తి కాలేదని గ్రహించి భరతవిప్రుడు అద్వైతాంతర్గతమైన ఒక కథానకాన్ని ఉపదేశించాడు.

ఋభునిదాఘ చరిత్రం

''పూర్వం సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికి మానస పుత్రుడై ఋభు డనుపేరు గల మహర్షిసత్తముడు ఉదయించాడు. అతను పుట్టుకతోనే బ్రహ్మజ్ఞానసంపన్నుడై తత్త్వసద్భావనల గుర్తెరిగిన ధన్యాత్ముడు. ఆ మహానుభావుని వద్ద అంతేవాసితను నెరపి తాపత్రయశాంతి నధిగమించిన నిదాఘుని చరిత్ర చిరస్మరణీయమైనది.

పులస్త్యబ్రహ్మ కుమారుడైన నిదాఘుడు బాల్యం నుంచీ ఋభుమహర్షిని ఆశ్రయించి ఆత్మబోధకై జ్ఞానతత్త్వాన్ని అధ్యయనం చేయసాగాడు. అనతికాలం లోనే ఋభుడు తన శిష్యునికి ఒక్క అద్వైత వాసనను తప్పించి తక్కిన సర్వవిద్యలనూ సమగ్రంగా ఉపదేశించాడు. విద్యావధి ముగిసిన తర్వాత నిదాఘుడు గుర్వనుజ్ఞను పొంది నివాసార్థం దేవికానదీతీరంలో ఉన్న వీరనగరానికి వెళ్లాడు. ఆ ప్రదేశం అతనికెంతో నచ్చింది. తనకు నిత్యోదనానికి, కర్మాచరణకూ తగిన వసతులన్నీ సమకూర్చుకొని అందమైన ఒక ఉద్యానవనానికి సమీపంలో ఇల్లుకట్టుకొని అక్కడే స్థిరపడ్డాడు. చూస్తూ ఉండగానే వేయి సంవత్సరాలు దివ్యంగా గడిచిపోయాయి.

కొంతకాలానికి ఋభుమహర్షి శిష్యుని చూసివద్దామని బయలుదేరి నిదాఘుని ఇంటికి వచ్చాడు. ఆయన దూరం నడిచి ఇల్లు చేరే సమయానికి నిదాఘుడు అప్పుడే వైశ్వదేవం ముగించుకొని గోగ్రాసాన్ని తినిపించడానికి బయటికి వచ్చి గృహద్వారంలో నిలబడి ఉన్న అతిథిని చూశాడు. ఎప్పుడో చిన్నప్పుడు చూసిన తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు కనిపించిన వ్యక్తిని అతడు కాలాంతరంలో గుర్తుపట్టలేకపోయాడు. అయినా భోజనం వేళ సహపంక్తికి వచ్చాడు కదా అని ఎదురేగి, పూజకోసం జలాదులను సమర్పించి సాదరంగా ఇంట్లోకి తీసుకొని వెళ్లాడు. ఋభుడు కాళ్లూ చేతులూ కడుగుకొని, లోపలికి వెళ్లి అతను చూపించిన సుఖాసనం పైని ఉపవిష్టుడయ్యాడు. అప్పుడు గృహస్థు, "అయ్యా! మార్గశ్రమంతో అలిసిపోయి వచ్చారు. వంటయింది. భోజనానికి లేవండి" అని ఆయనను ఆప్యాయంగా లోనికి ఆహ్వానించాడు.

ఋభుమహర్షి నిదాఘునితో అపరిచితుని వలెనే ప్రవర్తిం చాడు. "విప్రవర్యా! నేను ఆహారవిషయాలలో గట్టి నియమనిష్ఠ లున్నవాడిని. లభించింది కదా అని ఏదో ఒకటి కుత్సితాన్నం తినడం నాకు అలవాటు లేదు. ఇంట్లో వంటకాలు ఏమేం చేశారో ముందు చెప్పండి. నాకు నచ్చితేనే తింటాను" అని అన్నాడు.

"ద్విజోత్తమా! భక్తిశ్రద్ధలతో పరిపాకం చేయించిన కమ్మని రసావళ్లు, నేతిలో వండిన మినప వడలు, చాపట్లు, యవాన్నమూ, బహువిధాల అపూపాలూ ఉన్నాయి. వీటిలో మీకు నచ్చినవే, యథేచ్ఛంగా కడుపునిండా భుజించండి. మీకు తృప్తి కలిగితేనే నాకూ తృప్తి" అని నిదాఘు డన్నాడు.

నేస్తు పలుకులకు ఋభుడు మొగం చిట్లించి, "ఇవేమి భక్ష్యాలు! నీ విప్పుడు చెప్పినవన్నీ కదన్నాలే. నాకు నిజంగా మృష్టాన్నం పెట్టాలనుకొంటే యవలతో గిన్నెకు పోసి పరమాన్నం వండించు. మీగడ తేరిన చిక్కటి పాలూ, గడ్డపెరుగూ తెప్పించు" అని ఆజ్ఞాపించాడు.

నిదాఘుడు తన వేశ్మానికి అభ్యాగతుడై ఏతెంచిన ఋభు మహర్షి వచనాలను శాంతంగా ఆలకించాడు. ఏకై వచ్చి మేకై నట్లు ఆతిథ్యాన్ని కోరి వచ్చినవాడు ఆజమాయిషీ చేస్తున్నాడని భావింపకపోగా, ధర్మపత్నిని పిలిచి, "ఈ పదార్థాలు వీరికి రుచి గొలిపేవిగా లేవు. ఇవి లోపలికి తీసుకొని పోయి వీరు చెప్పినవాటి ఏర్పాట్లు చూడు. మన ఇంటిలో ఇప్పటి కిప్పుడు వెంటనే వండటానికి వీలైన భక్ష్యోపసాధనా లన్నింటినీ అతి శోభనంగా తయారు చెయ్యి" అని పురమాయించాడు. భర్త మాటను ఎన్నడూ జవ దాటని ఆ పుణ్యవతి క్షణంలో సరసాన్నపానాలను అతిరుచ్యంగా

వండి, ఇంటికి వచ్చిన అతిథికీ, భర్తకూ అమిత మోదాస్పదంగా కొసరి కొసరి తినిపించింది.

ఇష్టాన్న భోజనా లయ్యాక నిదాఘుడు స్వస్థచిత్తుడై కూర్చున్న అతిథిని సమీపించి, "మహాత్మా! శాకపాకాలు ఎలా ఉన్నాయో, ఏమిటో, కడుపునిండా భుజించారా? బడలిక తీరిందా? ఆత్మసంతుష్టి కలిగిందా?" అని కుశలానుయోగాలు అడిగాడు. "మీ నివాసం ఎక్కడ? ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తూ మా గృహాన్ని మీ రాకతో పావనం చేశారు?" అని కుతూహలంతో ప్రశ్నలు కురిపించాడు.

నిదాఘుని మాటలకు ఋభుమహర్షి ఈషత్ప్రఫుల్ల వదనంతో మందహాసం చేశాడు. తన వక్తవ్య విషయానికి అనురూపంగా ప్రశ్నావళి అమరినదన్న అభిజ్ఞానంతో సంతోషం కలిగి ముఖ రేఖలు వికసించి చెక్కిళ్లు ఎరుపెక్కాయి. దయార్ద్రనేత్రాలతో అతనిని పరికిస్తూ ఈ విధంగా ఉపన్యసించాడు—

"అయ్యా! ఆకలిగొని శోకంతో పరితపిస్తున్నవానికి మృష్టాన్న భోజనాలవలన తృప్తి కలగడం సహజమే. కానీ నేనిక్కడికి క్షుధార్తుడనై రాలేదు. ఆకలే లేనప్పుడు ఇక భోజనతుష్టి ఎలా కలుగుతుంది?

అసలు ఆకలి, దాహం అన్నవి జీవులకు దేహధర్మాలు. పృథివ్యాది పంచభూతాల చేత వినిర్మితమైన ఈ దేహం ధాతుమయం. ధాతువులను జఠరాగ్ని దహించినప్పుడు కడుపులో ఆకలి పుడుతుంది. శరీరాంతరితమైన జలకణాలు క్షయించినప్పుడు దాహం కలుగుతుంది. ఈ ఆకలి దప్పులు శరీర వికృతులు. ఇవి నాకు పూర్వమూ, నేడూ, ఎన్నడూ లేవు. ఇవి దేహధర్మాలు కనుక వీటిని దేహధారణ నిమిత్తం యథాయోగ్యంగా ఉపశమింపజేయుడమే కర్తవ్యం.

మనస్సుకు స్వాస్థ్యమూ, సంతుష్టి అన్నవి చిత్తధర్మాలు. వీటికి శరీర సుఖదుఃఖాలతో సంబంధాన్ని కల్పించుకోవడం భావ్యం కాదు.

ఏకవ్యాపకమై, సమస్తగతమై, విశుద్ధస్థితిలో ఉన్న పరమాత్మస్వరూపం తానే అని తెలుసుకొన్న పురుషులకు తమకంటె అన్యమైన వస్తువు మరొకటి ఉండదు. వారికి లోకాలలో కోరదగిన వస్తువు కాని, వస్తువుపై కోరికలు కాని ఉండవు. సర్వాంతర్గతుడైన తనకంటె అన్యమై, పొందదగిన మరొక వస్తువు ఉందనుకొన్నపుడు మాత్రమే శరీరం దానికోసం 'తాపాన్ని చెందడం, శరీర ధర్మాన్ని అనుసరించి తాను కూడా దుఃఖించడం జరుగుతాయి. ఆత్మనిరతులను దేహధర్మాలు బాధించవు కనుక వారికి తత్ప్రభవమైన సుఖదుఃఖాలు కూడా కలుగవు.

నిదాఘా! ఇది కాక నీ వడిగిన ప్రశ్నలు మూడు. నా నివాసం ఎక్కడ? ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చాను? ఇక్కడినుంచి ఎక్కడికి వినిర్గమిస్తున్నాను? వీటికి కూడా సమాధానం విను.

సర్వవ్యాపకమై, సర్వాంతరితమైన ఆత్మకు గంతవ్యమైన మరొక ప్రదేశం ఉండదు. ఆత్మస్వరూపులైనవారికి గమనాగమనాల ప్రసక్తి లేదు. సర్వాత్మజ్ఞానం కలిగిన తరువాత నేను కాని, నీవు కాని ఎక్కడి నుంచు ఎక్కడికి ప్రయాణిస్తున్నాము? అన్న సందేహం అసలు తలయెత్తదు. ఏకదేశ నికేతనత్వం, అన్యదేశయానభావం అనాత్మభావనలు శరీరమే ఆత్మ అని భ్రమించడం వలన కలుగుతున్నాయి.

నాయనా! నేనిందాక వండిన వంటకాలను కాదని వేరే మృష్టాన్నం కావాలని అడిగాను. నా మాటలకు నీవేమంటావోనని నేను కుతూహలంతో ఎదురు చూశాను. నిజానికి మృష్టామృష్టాలన్న

భేదం అన్నగతమైన లక్షణం కాదు. ఈ చిత్తగతభేదకల్పనం వలన ఉద్వేగానుద్వేగాలు ఏర్పడి సుఖదుఃఖవివర్తాలు కలుగుతున్నాయి. అన్నపానాలవలన చేకూరగల ఫలం దేహధారణమాత్రమే మట్టితో కట్టిన గోడకు మళ్లీ మట్టిని పూసి గట్టిగా నిలబెట్టినట్లు పార్థివమైన ద్రవ్యాలతో వినిర్మితమైన దేహానికి పార్థివమైన ద్రవ్యాలు పోషకాలుగా వినియోగపడుతున్నాయి. యవధాన్యాలు, గోధుమలు, తైలఘృతాలు, దధిక్షీరాలు, ఫలపాకాలు సర్వమూ పార్థివమైన పరమాణువుల చేరిక వలన రూపొందాయి. వీటియందు మృష్టామృష్టతలను ఆరోపించుకొని సుఖదుఃఖాలను చెందడం నీకు భావ్యం కాదు. నీవు ఆచరిస్తున్న ఈ కర్మలలో ఏ ఒక్కటీ ఆత్మజ్ఞానానికి సాధకం కాదు. బ్రహ్మవేత్తలకు కర్మారంభంతో నిమిత్తం లేదు. ఐహికవిధులను పరిత్యజించి పరమార్థజ్ఞాన సంస్కృతమైన మనస్సుతో ఆత్మతేజాన్ని దర్శించు.''

ఈ పలుకులతో నిదాఘునికి పరమార్థసారం సంపూర్ణంగా తెలిసి వచ్చింది. అతడు ఋభుమునీంద్రుని పాదపద్మాలపై మిళిందోపమంగా వ్రాలి, ''మహాత్మా! మీ రెవరో కాని నా కన్నులు తెరిపించడానికి మానుషవిగ్రహంతో సాక్షాత్కరించిన దయామయులు. మీరు కావించిన తత్త్వోపదేశంవలన నా మోహవిభ్రాంతి తొలగిపోయింది'' అని తన ధన్యతను వినివేదించాడు.

అప్పుడు ఆగంతుకుడై వచ్చిన జటాధారి తన నిర్వారాన్ని గురించి వక్కాణించాడు: ''నేను ఋభువును, నీ చిన్ననాటి ఒజ్జను. నీకు ప్రజ్ఞనొసగి పరతత్త్వ వివేకాన్ని కలిగించడానికే వచ్చాను. ఈ జగత్తు పరమాత్ముడైన శ్రీవాసుదేవుని స్వరూపం. ఇందులోని సర్వస్వాన్నీ భేదశూన్యమైన ఏకాకృతిగా గ్రహించి శ్రీమన్నారాయణుని ధ్యానించు'' అని బోధించి ఋభుమహర్షి యథేచ్ఛాగతిని వెళ్లిపోయాడు.

చూస్తూ ఉండగానే మళ్లీ వేయి సంవత్సరాలు అలవోకగా దొర్లిపోయాయి. మానీంద్రుడు తన శిష్యునికి జ్ఞానదానం చేయాలని సంకల్పించి వీరనగరానికి ఏతెంచాడు.

ఆ సమయంలో వీరనగరాన్ని పరిపాలిస్తున్న రాజన్యుడు పట్టపుటేనుగు నెక్కి సైన్యపరివార సమేతంగా ఊరేగింపు వెళు తున్నాడు. నిదాఘుడప్పుడు సమీపంలో ఉన్న అరణ్యం నుంచి సమిధలనూ, దర్భపోచలనూ తీసుకొని ఇంటికి తిరిగివస్తూ ఆ ఊరేగింపును చూశాడు. వ్రతదీక్షలూ ఉపవాసాలతో దేహం కృశించి నీరసంగా ఉన్నందున జనసమ్మర్దాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్లే సత్తువ లేక అతను దారి తొలగి ఒక బండరాతిమీద చతికిలబడ్డాడు. ఋభుడు దూరం నుంచే తన శిష్యుని రూప రేఖలను గుర్తుపట్టి, అపరిచితునివలె అతని చెంతకేగి అభివాదం చేశాడు. "అయ్యా! ఈ జనసందోహాన్ని చూస్తుంటే నాకు మతిపోతున్నది. ఏమిటి ఈ కోలాహలం? ఈ సందడికి దూరంగా మీరిక్కడ ఒంటరిగా ఎందుకు కూర్చొన్నారు?" అని ప్రశ్నలు వేశాడు.

అతని మాటలకు నిదాఘుడు శాంతంగా సమాధానం చెప్పాడు. రాజుగారి ఊరేగింపును చూడడానికి జనం గుమిగూడారు, ఈ తొక్కిసలాటకు ఎడంగా ఉండాలని ఇక్కడికి వచ్చాను, అని వివరించాడు. "అయ్యా! నాకందరూ ఒక్కలాగే కనిపిస్తున్నారు. వీళ్ళలో ఎవరు రాజు? ఎవరు ప్రజలు?" అనడిగాడు ఋభుడు. ఆ కనిపిస్తున్న ఉజ్జ్వలవేషధారి రాజు. ఆ ఏనుగుచుట్టూ చేరినవారందరూ ప్రజలు అని నిదాఘుడు బదులు పలికాడు. "ఈ పృథగ్రూపాలలో రాజెవరో నాకు తెలిసింది. కాని వీళ్ళల్లో ఏనుగు ఎక్కడుంది?" అనడిగాడు ఋభుడు. అదిగో, అద్రిశృంగసముచ్ఛ్రితమైక్రిందనున్న ఆ ఉన్మత్తజంతువు ఏనుగు. దానిపైన ఉన్నవాడు రాజు, అని చూపించాడు నిదాఘుడు. "అయ్యా! వాహ్యావాహకత్వాలు

నాకు అర్థం కావడం లేదు. పైకి ఎక్కడం, క్రిందనుండటం అంటే ఏమిటో తెలియజెప్పండి'' అన్నాడు ఋభుడు.

ఆగంతుకుని ప్రశ్నల వర్షానికి అలిగి నిదాఘుడు ఎగిరి లంఘించి అతని మెడవంచి వీపుమీద కూర్చొని, ''పైకి ఎక్కడం అంటే ఇదే. నేను రాజులాగా నీమీద కూర్చున్నాను. నువ్వు ఏనుగులాగా నన్ను మోస్తూ క్రిందనున్నావు. నీకు బోధపడేందుకు మంచి దృష్టాంతం చూపించాను. అర్థమయిందా?'' అని హుంకరించాడు. అప్పుడు ఋభుడు, ''గజారోహణం చేసిన రాజు వలె మీదికెక్కి మరీ వివరించడం చాలా బాగున్నది. అయితే ఇందులో ఎవరు మీరో, ఎవరు నేనో అర్థం కావడం లేదు. ఈ రెండింటికీ తేడా ఏమిటన్నది కూడా సెలవీయండి'' అని ప్రశ్నించాడు.

అద్వైత జ్ఞానసారం ఉట్టిపడుతున్న ఆ మాటలను వినగానే ఉలికిపడి నిదాఘుడు తత్తరపాటుతో సత్వరంగా దిగనురికి గురుదేవుని పాదయుగళిపై వ్రాలాడు, ''భగవన్! మీరు నా ఆచార్యులైన ఋభుమహానీంద్రులు. మీరు తప్ప ఈ తీరున అద్వైతవాసనా సంస్కృతమైన మానసం కలవారు మరొకరు లేరని నాకు తెలుసు'' అని ఆనందోద్వేగాలతో పలికాడు.

ఋభుమహర్షి వచ్చిన పని నెరవేరింది. శిష్యుని మనస్సులో అనాత్మభావం తొలగి ఆత్మజ్ఞానోదయం కలిగినదని గ్రహించాక ఆయన కలరూపును వెల్లడించాడు. ''నాయనా! నేను ఋభుడనే. పూర్వం నీ వాచరించిన శుశ్రూషలను తలచుకొని సంతోషిత స్వాంతుడనై నీకు బ్రహ్మవిద్యను ఉపదేశించడానికి వచ్చాను. సకల పరమార్థసారభూతమైన అద్వైతాన్ని నీ విప్పుడు తెలిసికొన్నావు. ఇక నీ గురించి నాకు చింతలేదు. సుఖవై మెలగు'' అని ఆశీర్వదించి నిజనివాసానికి వెళ్లిపోయాడు.

గురూపదేశ మహిమవలన అద్వైతపరుడైన నిదాఘుడు సర్వాత్మభావనం కలిగి బ్రహ్మజ్ఞానమయుడై ముక్తిని పొందాడు.

సౌవీరనృపతీ! ధర్మవేత్త వయిన నీవు కూడా బంధువులైనా, నీకు శత్రువులైనా అందరిలోనూ తుల్యభావనం చేసి సర్వగతమైన ఆత్మను గుర్తించి సమచిత్తంతో మెలగాలి. ఆకాశంలో తెల్లగా ఉన్నట్లూ, నీలవర్ణంలో ఉన్నట్లూ రంగులు వేర్వేరుగా కనుపట్టినా ఆకాశం ఒక్కటే అయినట్లు ఉపాధికృత పృథగ్భేదాలు భాసించినా ఆత్మస్వరూపం ఒక్కటే.

ఏకవ్యాపకుడై, సమస్తగతుడైన అచ్యుతుడే పరమాత్మ. ఆతడే నేను; అతడే నీవు; అతడే సర్వాంతరితుడు.

శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి. భేదమోహాలను పరిత్యజించి ఆయనతో అద్వైతస్థితిని భజించు''

ఈ విధంగా ద్విజరూపంలో ఉన్న ఆతడు కావించిన పరమార్థోపదేశాన్ని ఆచరించి సౌవీరభూపతి బ్రహ్మజ్ఞానాన్ని పొందాడు.

జడభరతునికి శరీరయాత్ర ముగిసి పూర్వజన్మానుస్మరణం కలిగింది. తన కర్మ పరిపక్వమై ఫలోన్ముఖమౌతున్నదని గ్రహించాడు. జాతిస్మరణాప్తబోధం వలన అతనికి పునర్జన్మలు లేని అపవర్గసౌఖ్యం సంప్రాపించింది.

జ్ఞానదాయకమైన ఈ జడభరత - నరేంద్ర సారవృత్తాన్ని భక్తితో చదివినవారు, విన్నవారు విమలమతులై సంసరణక్లేశాల నుంచి విముక్తిని పొందుతారు.''

అని పరాశరమహర్షి మైత్రేయునికి బోధించాడు.

విష్ణుపురాణము

తృతీయ భాగం

శ్రవణకల్హారోదయామోదంగా శ్రీ పరాశరమహామునీంద్రుడు పురాణించిన పుణ్యకథానకాన్ని భక్తిశ్రద్ధలతో ఆకర్ణించి మైత్రేయుడు మేరలేని ఆనందార్ణవంలో ఓలలాడాడు. శ్రీమహావిష్ణువు లీలావిలాసాన్ని పూర్వోత్తర సంహితంగా ఉపాఖ్యానరూపంలో వెల్లడి చేసిన ఆచార్యుని వచనాలను తన డెందంలో కందళించుకొన్నాడు. గురూపదేశ ఫలితంగా జ్ఞానాభివృద్ధికి అనురూపమైన జిజ్ఞాస అతిశయించి, అతను ఈ విధంగా పరిప్రశ్నించాడు—

''ఆచార్యదేవా! అపూర్వమైన మీ కృపావిపాకంవలన నేను అర్ణవపరీతమైన మేదినీవలయం పూర్ణస్వరూపాన్ని అవగతం చేసికొన్నాను. సూర్య చంద్ర గ్రహతారకా సుస్థితులనూ, జ్యోతిశ్చక్ర ప్రభావాన్నీ తెలుసుకొన్నాను. ఋషిగణావిఖ్యాతినీ, చాతుర్వర్ణ్యం పుట్టుకను, తిర్యగ్యోనిజన్మాలను, ధ్రువ ప్రహ్లాదచరిత్రలనూ మీ ముఖతః విని గ్రహింపగలిగాను. వీటిని వింటున్నప్పుడు నా మనస్సులో మరికొన్ని సందేహాలు కలిగాయి.

ఆర్యా! మీ రిందాక పేర్కొన్న మన్వంతరాల క్రమం ఏమిటి? ఆయా మనువుల పరిపాలనలో సుగృహీతనాములైన కీర్తనీయుల భవ్యచరిత్రలను నాకు దయతో విశదీకరించి చెప్పండి''

అని ప్రార్థించిన మైత్రేయునికి పరాశరమహర్షి అతీతానాగత మన్వంతరాలను గురించి చెప్పసాగాడు.

మన్వంతరాల కథనం

"మైత్రేయా! నీ వడిగినట్లుగానే—పూర్వం గతించిన మన్వంతరాలూ, ఇక ముందు రానున్న మన్వంతరాల స్వరూపాన్ని గురించి చెబుతున్నాను, విను.

శ్రీమన్నారాయణుని కరుణాకటాక్షం వలన సచరాచర భూతసృష్టికి ఉపక్రమించిన పద్మగర్భుని దివసకాలంలో మానవ మానాన్ని అనుసరించి నాలుగువందల ముప్పైరెండు కోట్ల సంవత్సరాలు గతిస్తాయి. ఈ సమయంలో పధ్నాలుగు మంది మనువులు ఒక్కొక్కరూ డెబ్బైఒక్క మహాయుగాల కాలంపాటు సృష్టిని పరిపాలిస్తారు. ఒక్కొక్క మహాయుగమూ నలభై మూడు లక్షల ఇరవై వేల హాయనాలు కాగా చతుర్దశమనువుల పాలనకాలం నాలుగు వందల ఇరవైతొమ్మిది కోట్ల నలభై లక్షల ఎనభై వేల మానవ సంవత్సరాల ప్రమాణం కలిగి ఉన్నది.

మనువుకూ మనువుకూ మధ్యకాలంలో సృష్టిప్రళయం సంభవించి సర్వశూన్యమైపోతుంది. ఈ ప్రళయకాలం మొత్తం రెండు కోట్ల యాభైతొమ్మిది లక్షల ఇరవై వేల సంవత్సరాలు. ఈ ప్రళయ పయోధి జలాల నుంచి మళ్లీ భూతధాత్రి ఆవిర్భవిస్తుంది.

మనువులలో స్వాయంభువమనువు సర్వ ప్రథముడు. ఇతని అనంతరం స్వారోచిషమన్వంతరం వచ్చింది. ఆ తరువాత క్రమానుగతంగా ఔత్తమీ మన్వంతరం, తామస మన్వంతరం, రైవత మన్వంతరం, చాక్షుషమన్వంతరం పరిఢవిల్లాయి. ఇక సూర్యనందనుడైన వైవస్వతుని మన్వంతరం ఇప్పుడు నడుస్తున్నది.

స్వాయంభువ మన్వంతరం

స్వాయంభువ మన్వంతరంలో యామాజితులని పేరుగల రెండు అర్హితగణాలవారు దేవతాపదవిని అధిరోహించి త్రిదివలోకంలో అధివసించారు. స్వాయంభువుని ఏడుగడలో మరీచి, అంగిరసుడు, అత్రి, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, వసిష్ఠుడు, సప్తర్షి మండలమై తేజరిల్లిననాటి విశేషాలు, అతని సంతతి విశ్వ విశ్వంభరా భరాన్ని భరించిన వృత్తాంతమూ నీకు సువిదితపూర్వాలు.

స్వారోచిష మన్వంతరం

కల్పాదిమ కాలంలో స్వాయంభువమనువు ఏకోత్తరసప్తతి మహాయుగాలు భూతధాత్రిని పరిపాలించిన తరువాత ప్రళయం సంభవించి పద్దెనిమిది లక్షల యాభైఒక్కవేల నాలుగువందల ఇరవై ఎనిమిదిన్నర సంవత్సరా లున్నది. ఆ తర్వాత స్వారోచిష మన్వంతరం వచ్చింది.

స్వారోచిషుని కాలంలో పారావతులు, తుషితులు అని పేర్లు గల సుపర్వగణాలు జన్మించి యజ్ఞాహుతులను స్వీకరించి హావిర్భుజులై పెంపు గడించారు. ఈ దేవతాగణాలకు మనువుగా శక్ర పదవిని విపశ్చితు డనే పేరుగల స్వారాజు చేపట్టి స్వర్లోకాన్ని పరిపాలించాడు.

స్వారోచిషమనువుకు చిత్రుడు, చైత్రుడు, మదనుడు, కింపురుషుడు మొదలుగా గల పెక్కుమంది సుతులు జన్మించి ప్రజానురంజకంగా లోకాలను కాపాడారు.

ఈతని పాలనకాలంలో ఊర్జమహర్షి, స్తంబుడు, ప్రాణుడు, దత్తోళి, ఋషభుడు, నిశ్చరుడు, అర్వరీవంతుడు సప్తఋషులై భూత సృష్టిని ధర్మాధ్వనీనంగా తీర్చి దిద్దారు.

ఔత్తమీ మన్వంతరం

తృతీయమనువైన ఔత్తమి ఏడుగడకు వచ్చినప్పుడు సుధాములు, సత్యులు, శివులు, ప్రదర్శనులు, వశవర్తులు, అని అభిధానాలు కలిగిన అయిదు దేవతాగణాలవారు త్రిదశాలయాన్ని మనికిపట్టుగా చేసికొని, హవ్యాలను స్వీకరించి లోకాలలో ధర్మపరిపాటికి తోడుపడ్డారు. ఈ దేవగణాలు ఒక్కొక్కదానిలోనూ ద్వాదశశాఖలు ప్రాదుర్భవించి దివౌకసాన్వయం తామరతంపరగా ప్రవర్ధిల్లింది.

ఆ తరుణంలో వేల్పుకూటువులకు మన్నినిగా సుశాంతుడు శక్రపదవిని చేపట్టి అమరావతిని పరిపాలించాడు.

ఔత్తమీ మన్వంతరంలో వసిష్ఠుని ఏడుగురు కొడుకులు— రజస్సు, గోత్రుడు, ఊర్ధ్వబాహువు, సవనుడు, అనఘుడు, సుతపసుడు, శుక్రుడు సప్తమునిమండలమై వెలుగొందారు.

ఔత్తమికి అనేకసంఖ్యాతంగా కొడుకులు కలిగారు. వీరిలో అజుడు, పరశుడు దివ్యుడు సుప్రసిద్ధులు.

తామస మన్వంతరం

మనువులలో నాలుగవవాడైన తామసుని పరిపాలన కాలంలో హరిగణాలు, సత్యగణాలు, సుధీగణాలు అని పేరుగల మూడు దేవగణాలవారు దేవవాసాన్ని చేరి యజ్ఞహోమాలను పరిగ్రహింపసాగారు.

ఈ మూడు దేవగణాల లోనూ మళ్లీ ఇరవైఏడు శాఖోపశాఖలు కలిగి క్రమంగా ఏకోత్తరాశీతి విబుధబృందాలు ప్రభవించాయి.

శిబి అనే పేరుగల ఒక క్రతుదీక్షాపరుడు ఆ సమయంలో నూరుమహాక్రతువులను ఆచరించి ఇంద్రపదవిని పొందాడు.

ఆ కాలంలో జ్యోతిర్ధాముడు, పృథువు, కావ్యుడు, చైత్రుడు, అగ్ని, వనకుడు, పీవరుడు సప్తర్షులై కీర్తిగడించారు.

తామసమనువుకు అమేయబలసంపన్నులైన పుత్రులు ఉదయించారు, వీరిలో నరుడు, ఖ్యాతి, శాంతహయుడు, జానుజంఘుడు మొదలైనవారు గొప్ప రాజులై కాశ్యపీ ఖండాన్ని మనుధర్మానుసారం చిరకాలం పరిపాలించారు.

రైవత మన్వంతరం

తామసాంతరం గడిచిన తర్వాత భూతధాత్రిని పరిపాలించి మించినవాడు మనువులలో అయిదవవాడైన రైవతాహ్వాయుడు.

రైవతుని కాలంలో విభుడు శక్రస్థానీయుడై ఆ పదవిలో కల్పాంతం దాకా ఉన్నాడు. అమితాభులు, అభూతరజులు, వైకుంఠులు, సుమేధులు అనే పేర్లుగల నాలుగు దేవగణాలవారు ఆ తరుణంలో నిర్జరవాసంలో నెలకొని యజ్ఞాహుతులను అందుకొనేవారు.

కొంతకాలానికి ఈ దేవతలలో మళ్లీ పద్నాలుగేసి ఉపగణాలు ఏర్పడి మొత్తం షట్పంచాశదుపగణాలతో సుపర్వాణమండలం అతిశయించింది.

రైవతాంతరంలో సప్తర్షులై రహిల్లిన తాపసోత్తముల పేర్లు: హిరణ్యరోముడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహువు, వేదబాహువు, సుధాముడు, పర్జన్యుడు, మహాముని.

రైవత మనువుకు బాలబంధుడు, సుసంభావ్యుడు, సత్యకుడు మొదలైన నరేంద్రులు ఉదయించి దేవేంద్రునికి దీటుగా రాజ్యపాలనం చేశారు.

స్వాయంభువమనువు తర్వాత పుడమిని రెండు వందల ఎనభై నాలుగు మహాయుగాల సుదీర్ఘకాలం పరిపాలించిన మనువులు నలు

గురూ—స్వారోచిషుడు, ఔత్తమి, తామసుడు, రైవతుడు ప్రియవ్రతమహారాజు వంశార్ణవంలో పూర్ణచంద్రులై ఉదయించినవారే.

పూర్వం కల్పాదిమ కాలంలో రాజర్షితల్లజుడైన ప్రియవ్రతుడు శ్రీమహావిష్ణువును భక్తితో ఆరాధించి మన్వంతరాధిపులూ, అన్వయోత్తంసులూ అయిన వీరందరూ తన వంశంలో జన్మించేటట్లు అభీప్సితవరాన్ని పొంది ధన్యతను చెందాడు.

రైవతుని పాలనకాలం పరిపూర్ణించిన తరువాత చాక్షుష మన్వంతరం వచ్చింది.

చాక్షుష మన్వంతరం

చాక్షుషమనువు కాలంలో భూతలాన ధర్మదేవత నాలుగు పాదాలా నడిచింది. ఆద్యులు, ప్రసూతులు, భవ్యులు, పృథుగులు, మహానుభావులైన లేఖులు అనే అభిధానాలచే సమలంకృతు లయిన అయిదు దేవగణాలకు చెందిన పుణ్యశీలురు ఈ సమయంలో దివౌకసులై నాకసుఖాలను నిరతిశయంగా అనుభవించారు.

ఈ దేవగణాలలో కాలాంతరాన ఎనిమిదేసి గణాలు మళ్లీ కలిశాయి. వీరందరికీ మనోజవు డనే పేరుగల దేవేంద్రుడు అధీశుడై నిలిచాడు.

సుమేధమహర్షి, విరజుడు, హవిష్మంతుడు, ఉత్తముడు, మధుడు, అతినాముడు, సహిష్ణుడు చాక్షుషుని కాలంలో సప్తర్షి మండలాన్ని విభూషించిన సంయమీంద్రులు.

ఊరుడు, పూరువు, శతద్యుమ్నుడు మొదలైన ప్రముఖ యోధు లందరూ చాక్షుషమనువు సూనులై అనంతర కాలంలో పృథ్వీపతు లయ్యారు.

ఈ ఆరూ అతీతమన్వంతరాలు.

వైవస్వత మన్వంతరం

మన్వంతరాలలో ఇక ప్రస్తవనీయమైనది ఇప్పుడు నడుస్తున్న సప్తమాంతరం. ఈ మహాయుగసంహాతికి వివస్వంతుని (సూర్యుని) పుత్రుడు వైవస్వతుడు అధిపతి. మహాద్యుతిమంతుడైన ఈతనికి శ్రాద్ధదేవుడని నామాంతరం కలిగింది.

సాంప్రతమైన ఈ మన్వంతరంలో ఆదిత్యులు, వసువులు, రుద్రులు మొదలైన దేవగణాల వారు నాకలోకాన్ని మొగరించి యజ్ఞాహుతులను అందుకొంటున్నారు. వీరందరూ త్రిదశేశ్వరుడయిన పురందరుని ఆజ్ఞానువర్తులు.

సప్తర్షిమండలాన్ని వశిష్ఠుడు, కశ్యపుడు, అత్రి, జమదగ్ని, గౌతముడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు సమలంకరించారు.

సూర్యాత్మజునికి తొమ్మిదిమంది కుమారులు—ఇక్ష్వాకుడు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, నృగుడు, కరూశుడు, పృషధ్రుడు, వసుమంతుడూ జన్మించారు. వీరందరూ వేదచోదితమైన అశ్వమేధాది మహాక్రతువులను ఆచరించి మహాయశస్సును పొందిన ధార్మికోత్తములు.

వైవస్వతుని కొడుకులందరూ ప్రత్యేకంగా వంశకర్తలయ్యారు. సూర్యవంశం అప్రతిమాన తేజోభిరామంగా విస్తరించింది.

నారాయణుని తేజోంశలు

నిరూపమానమైన శ్రీమహావిష్ణువు శక్తి సత్త్వోద్రేకాన్ని చెంది నిఖిలమన్వంతరాల లోనూ అన్వర్థమై చరాచరోపహిత భూత సృష్టిని కాపాడుతున్నది.

పౌరస్త్యమన్వంతరంలో నారాయణుని తేజోంశ స్వాయంభువమనువు రెండవ కుమార్తె ఆకూతికి మానసపుత్రుడై యజ్ఞుడనే పేరిట వ్యక్తరూపాన్ని దాల్చింది.

స్వారోచిషమన్వంతరం వచ్చాక తత్పూర్వం యజ్ఞుని రూపంలో అవతరించిన అదే అంశ తుషితాదేవి గర్భసంభవుడైన తుషితాది సురగణాలకు సహోదరమై అజితునిగా అభివ్యక్తమయింది.

ఔత్తమీ మన్వంతరంలో ఈ అజితుడు సత్యాదేవికి సుర శ్రేష్ఠులైన సత్యగణాలతో సత్యనామధేయంతో ప్రాదుర్భవించాడు.

తామసాంతరంలో సత్యుడు హర్యాదేవికి హరియై హరిగణాలతో జన్మించాడు.

రైవతమన్వంతరంలో హరి సంభూతికి మానసపుత్రుడై మానసుడనే పేరుతో అభూతరజ, రైవతాది దేవగణాలతో అవతరించాడు.

చాక్షుషమనువు కాలంలో మానసుడు శ్రీమన్నారాయణ తేజోంశగా వికుంఠాదేవికి వైకుంఠదేవతా సహిత వైకుంఠుడై జన్మించాడు.

ఇక సాంప్రత వైవస్వత మన్వంతరంలో వైకుంఠ శ్రీమహావిష్ణువు కశ్యపప్రజాపతికి అదితి గర్భంలో వామనుడై ఉదయించాడు. ఈ వామనావతారంలో శ్రీహరి త్రివిక్రమస్ఫురణ కలిగి మూడు అడుగులతో ముల్లోకాలనూ ఆక్రమించి నిహతకంటకమైన త్రైలోక్యాన్ని పురందరునికి అప్పజెప్పాడు.

ఈ తనుసప్తకంతో సప్తమన్వంతరాలలో పుండరీకాక్షుడైన శ్రీ వాసుదేవుడు ప్రజాభిరక్షణం కావించాడు.

'విష్ణు' మహాశబ్దం విశ — ప్రవేశనే అన్న ధాతువు నుంచి ఏర్పడింది శ్రీమహావిష్ణువు మహాత్మశక్తి విశ్వగత సర్వభూతాల లోనూ ఏకాంతరితమై ఉన్నందున ఆయనకు విష్ణు నామధేయం అన్వర్థం.

సర్వదేవతలు, మనువులు, మనుతనూజులు, సప్తర్షులు, త్రిదశనాయకులూ—అందరూ శేషపర్యంకుని అశేషవిభూతులే.

సావర్ణిమనువు జన్మవృత్తాంతం

సృష్ట్యాదిమ కాలంలో విశ్వకర్మ ప్రజాపతి కుమార్తె సంజ్ఞకు సూర్యునితో వివాహం జరిగింది. ఆ దంపతులకు వైవస్వతమనువు, యముడు, యమి జన్మించారు. కానీ సంజ్ఞకు సూర్యదేవుని ప్రచండ తేజాన్ని సహించే శక్తి లేక, పతి సన్నిధానంలో మరొకరిని నిలువరించి తానక్కడినుంచి వైదొలగాలని సంకల్పం కలిగింది. తన ఛాయకు తనవంటి శరీరాకృతిని కల్పించి, భర్తృసేవార్థం నిజవేశ్మంలో నిలిపి, తపస్సుకై అరణ్యావాసానికి వెళ్లిపోయింది.

ఛాయ సూర్యదేవునికి భక్తిశ్రద్ధలతో సేవావిధులను నిర్వర్తించింది. భర్త ఆమె నిజరూపం తెలియక సంజ్ఞ అనే అనుకొంటూ వచ్చాడు. క్రమంగా వారికి శనైశ్చరుడు, మనువు, ఒక కుమార్తె—తపతి జన్మించారు.

ఛాయ తనకు సంతానం కలుగనంతవరకూ సంజ్ఞకు పుట్టిన పిల్లలను ప్రేమగానే చూసుకొన్నది. ఆ తర్వాత ఆమెకు సవతి పిల్లలపై శ్రద్ధానురక్తులు సన్నగిల్లాయి. ఒకప్పుడు యమునికీ, ఆమెకూ కలహం కూడా అయింది. యముడు కోపగించుకొని ఆమెను కాలితో తన్నబోయాడు. పాదఘాతానికి భీతిల్లి ఆమె ముందుగానే అతని దక్షిణపాదం వ్యాధిగ్రస్తమై క్రిమిదష్టమయేటట్లు శపించివేసింది.

యముడు తండ్రి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకొన్నాడు. "ధర్మశీలినైన నాకు వివాదసమయంలో ఉద్రేకం కలిగింది. ఆమె నిష్కారణంగా నన్ను శపించింది. మేము నిజంగా తల్లీ కొడుకులమే అయితే ఈ విధంగా పొరపొచ్చాలు కలిగేవి కావేమో!" అని వాపోయాడు.

అతీతకథానకాన్ని మరుగుపుచ్చాలని ఛాయ ప్రయత్నింప లేదు. భర్త అడిగిన వెంటనే ఆమె జరిగిన వృత్తాంతాన్ని యథాతథంగా చెప్పివేసింది. సూర్యుడు సమాధిదృష్టితో లోకాలను గాలించి, తన భార్య ఉత్తర కురుభూములకు సమీపారణ్యంలో అశ్వాకృతిని ధరించి ప్రచ్ఛన్నవేషంలో తపస్సు చేస్తున్నదని గ్రహించాడు. తన కొడుకు కాలిపై ప్రాలిన క్రిమికీటకాలను భక్షించడానికి ఒక కుక్కుటాన్ని సృజించి, అతనికి శాపవిమోచనమార్గాన్ని ఉపదేశించాడు.

ఇన్నాళ్లూ తనను ఎడబాసి తపోదీక్షలో ఉన్న సంజ్ఞపై సూర్యుని హృదయం మరులుగొన్నది. తానూ వాజిరూపాన్ని ధరించి భార్యను కలుసుకొన్నాడు. వారికి తత్సమాగమం వలన అశ్వినీదేవతలు, రేవంతుడు జన్మించారు. కొంతకాలానికి సంజ్ఞాసూర్యులు స్వస్థానానికి తిరిగి వచ్చారు.

అప్పుడు విశ్వకర్మప్రజాపతి జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొని, తన కుమార్తెకు సహాయం చేయాలని సంకల్పించాడు. చక్రాకృతి గల ఒక మహాశాణాన్ని చేతబట్టి సూర్యకిరణాల అంచులను ఒకటొకటిగా అరగదీశాడు. ఈ తీరున మార్తాండమయూఖాలలో ఎనిమిదవ వంతు తేజం తరిగిపోయింది. సంజ్ఞాసూర్యుల పునస్సమాగమం సాధ్యమయింది.

శ్రీమహావిష్ణువు తేజోంశ అయిన సూర్యుని కిరణాలనుంచి శాతితమై నేలకు రాలిపడిన రజం అవ్యయమైన వైష్ణవతేజం కనుక వ్యర్థం కాలేదు. కన్నులకు మిరుమిట్లు గొల్పుతూ జాజ్వల్యమానంగా ఉన్న ఆ దివ్యతేజంతో శిల్పకళాకోవిదుడు విశ్వకర్మ అనేకవిధాల ఆయుధాలను ఉపకల్పించాడు. విష్ణువుకు చక్రాన్ని, శివునికి

త్రిశూలాన్ని, కుబేరునికి శివికను, కుమారస్వామికి శక్తిని, ఇంకా అన్య దేవతానికరానికి తత్తదుచితశస్త్రాలనూ నిర్మించి ఇచ్చాడు.

మైత్రేయా! ఛాయాసూర్యులకు జన్మించిన ద్వితీయ సంతానం మనువు తన పూర్వజుడైన వైవస్వతునికి సవర్ణుడే కనుక అతనికి సావర్ణిమనువు అని నామధేయం కలిగింది. ఆతని పేరిటనే అష్టమాంతరానికి సావర్ణికం అని పేరు వచ్చింది.

సావర్ణి మన్వంతరం

సాంప్రతాంతరం గడిచి రానున్న ఎనిమిదవ మన్వంతరానికి పట్టాభిషిక్తుడు కాబోతున్న సూర్యనందనుడు సావర్ణి ప్రస్తుతం శ్రీమహావిష్ణువు ప్రసన్నతను కోరి తపోదీక్షలో ఉన్నాడు.

సావర్ణిమనువు ఏలుబడిలో సుతపస్సులు, అమితాభులు, ముఖ్యులు దేవతాపదవీస్థులై యజ్ఞహోమాలను అందుకొంటారు. ఈ మూడు శాఖలలో ఇరవైఒక్క ఉపశాఖలు ప్రవర్తిల్లి దేవలోకం త్రిషష్టిగణసంయుతమై అలరారుతుంది.

ఈ మన్వంతరంలో అత్రివంశోద్భవు డయిన దీప్తిమంతుడు, భృగుకులంలో పుట్టిన గాలవుడు, కుశికాన్వయుడు పరశురాముడు, శారద్వతుని పుత్రుడు కృపాచార్యుడు, భారద్వాజ వంశీయుడైన ద్రోణాచార్యుని పుత్రుడు అశ్వత్థామ, మా వశిష్ఠాన్వయంలో నా కుమారుడు వ్యాసుడు, కశ్యపగోత్రజుడు ఋష్యశృంగ మహర్షి సప్తర్షులుగా ప్రభవిస్తారు.

వామనావతారంలో తన యింటికి యాచకుడై వచ్చిన శ్రీమహావిష్ణువుకు దానమిచ్చి, ఆయన తృతీయ పాదనివేశానికై తన శిరస్సును అర్పించిన పుణ్యాత్ముడు వైరోచన బలిచక్రవర్తి సావర్ణ్యంతరంలో ఇంద్రపదవిని పొందనున్నాడు.

సావర్ణికి విరజుడు, అర్వరీవంతుడు, నిర్మోహుడు ఆదిగా పెక్కుమంది సుతులు జన్మించి నరనాయకులై భూమండలాన్ని నిష్కంటకంగా పరిపాలిస్తారు.

దక్షసావర్ణి మన్వంతరం

తొమ్మిదవ మనువు దక్షసావర్ణి కాలంలో ద్వాదశ గణాన్వితులైన పారులు, మరీచిగర్భులు, సుధర్ములు త్రిదివలోకంలో ఉన్నప్పుడు షట్త్రింశతిగణాలతో దేవలోకం చెన్నుమీరుతుంది. మహావీరుడైన అద్భుతుడు ఇంద్రపదాన్ని అలంకరించి జగచ్చక్రాన్ని నిర్వక్రంగా పరిపాలిస్తాడు.

సవనుడు, ద్యుతిమంతుడు, భవ్యుడు, వసువు, మేధాతిథి, జ్యోతిష్మంతుడు, సత్యర్షి ఆ కాలంలోని సప్తఋషులు.

దక్షసావర్ణికి ధృతకేతువు, దీప్తికేతుడు, పంచహస్తుడు, నిరామయుడు, పృథుశ్రవుడు ఆదిగా పెక్కుమంది సుతులు జన్మిస్తారు.

బ్రహ్మసావర్ణి మన్వంతరం

అద్యాపి సంభవిష్యమాణమైన దశమమన్వంతరానికి బ్రహ్మసావర్ణి అధిపతి.

అతని పాలనకాలంలో సుధాములు, విశుద్ధులు, శతసంఖ్యులు మొదలైనవారు సురస్థానీయులు. శాంత మహాబలి ఇంద్రుడు.

హవిష్మంతుడు, సుకృతుడు, సత్యుడు, అపాంమూర్తి, నాభాగుడు, అప్రతిమౌజుడు, సత్యకేతుడు సప్తర్షిమండలంలో అధివసించి, ప్రత్యంతధాత్రిని తమ ఉనికి చేత పవిత్రీకరిస్తారు.

బ్రహ్మసావర్ణికి సుక్షేత్రుడు, ఉత్తమౌజుడు, హరిసేనుడు మొదలుగా పదిమంది కొడుకులు జన్మిస్తారు.

ధర్మసావర్ణి మన్వంతరం

వర్తమానకల్పంలో రానున్న ఏకాదశమన్వంతరానికి ధర్మసావర్ణికం అని పేరు. ఈ అంతరంలో విహంగములు, కామగములు, నిర్వాణరతులు ప్రముఖ దేవతాగణాలు. ఒక్కొక్క గణంలోనూ త్రింశత్సంఖ్యాతులై దేవతలు ప్రభవించి సురాన్వయం బహుగుణంగా విస్తరిల్లుతుంది, ఆ సమయంలో భూతలాన నిర్విఘ్నంగా శత క్రతువులను ఆచరించిన వృషుడు శ్రీహరి ప్రసాదం వలన శక్ర పదవిని స్వీకరిస్తాడు.

నిశ్చరుడు, అగ్నితేజుడు, వపుష్మంతుడు, విష్ణువు, ఆరుణి, హావిష్మంతుడు, అనఘుడు, ఈ పదకొండవ అంతరంలోని సప్త మహర్షులు.

ధర్మసావర్ణి సుతులు సర్వగుడు, సర్వధర్ముడు, దేవానీకుడు మొదలైనవారందరూ పృథివీశ్వరులు.

రుద్రసావర్ణి మన్వంతరం

పన్నెండవ మన్వంతరంలో శ్రీ రుద్రసుతుడైన సావర్ణి పట్టాభిషిక్తుడై భూమండలాన్ని డెబ్భైఒక్క మహాయుగాలు పరిపాలిస్తాడు.

రుద్రసావర్ణి కాలంలో ఇంద్రుని పేరు ఋతుధాముడు. హరితులు, రోహితులు, సుమనసులు, సుకర్ములు, తారులు అని ప్రత్యేక దశకాన్వితులైన దేవగణాలవారు అమరులై దైవతభోగాలను అనుభవిస్తారు.

తపస్వి, సుతపుడు, తపోమూర్తి, తపోరతి, తపోధృతి, తపోద్యుతి, తపోధనుడు—ఈ మన్వంతరంలో ప్రభవింపనున్న సప్తర్షులు.

రుద్రసావర్ణికి వీరాగ్రేసరు లయిన దేవవంతుడు, ఉపదేవుడు, దేవశ్రేష్ఠుడు మొదలైన సత్పుత్రులు జనించి రాజు లవుతారు.

రౌచ్యసావర్ణి మన్వంతరం

త్రయోదశ మన్వంతరానికి అధిపతి కాగల రౌచ్యమనువు కాలంలో త్రయస్త్రింశద్విశాఖలతో సుధాములు, సుధర్ములు, సుకర్ములు వేల్పులై నిర్జరాన్వయం తొంభైతొమ్మిది గణాల మహా సంఖ్య కలిగి ఏపారుతుంది. వీరికి దివస్పతి ఇంద్రపదవి మూలాన అధినేత కాగలడు.

సప్తర్షులు : నిర్మోహుడు, తత్త్వదర్శి, నిష్ప్రకమ్పుడు, నిరుత్సుకుడు, ధృతిమంతుడు, అవ్యయుడు, సుతపుడు.

రౌచ్యసావర్ణి కొడుకులు చిత్రసేన విచిత్రాది మహీంక్షితులందరూ శుభచరిత్రులు.

భౌత్యసావర్ణి మన్వంతరం

చతుర్దశ మన్వంతరాలలో పార్యంతికాంతరానికి నియంత కాగల భౌత్యసావర్ణి కాలంలో చాక్షుషులు, పవిత్రులు, కనిష్ఠులు, భ్రాజికులు, వచోవృద్ధులు అనే అయిదు దేవగణాల సముదాయానికి శుచి పేరుగల ఇంద్రుడు నాయకుడవుతాడు.

అగ్నిబాహుడు, శుచి, శుక్రుడు, మాగధుడు, గృధ్రుడు, యుక్తుడు, అజితుడు సప్తఋషులు.

భౌత్యసావర్ణి కుమారులు ఊరు గభీర బ్రధ్నాదులు నృపులై మహీతలాన్ని పరిపాలిస్తారు.

యుగవ్యవస్థ

కృత త్రేతా ద్వాపర కలియుగాలు గతించిన వెంటనే ఆ చతుర్యుగాంతంలో సంభవించే మహాప్రళయంలో వేదవాఙ్మయం విలుప్తమైపోతుంది. అప్పుడు అగమ్యాగోచరమైన వేదరాశిని సముద్ధరించి సప్తమహర్షులు భూతసృష్టి జరిగిన తర్వాత మళ్లీ లోకాలకు

అందజేస్తారు. ఈ యుగావర్తనంలో కృతయుగాదిని స్మృతిప్రణేత అయిన మనువు జన్మించి విధినిషేధరూపమైన ధర్మశాస్త్రాన్ని ప్రవచిస్తాడు. యజ్ఞభోక్తలైన దేవతలు, మనువులు, మనుపుత్రులు, మనువంశంలో పుట్టిన రాజన్యులు, సప్తర్షులు, దేవగణాలు, దైవతాధికరణికుడైన శక్రుడు ఆయా మన్వంతరాలలో జగదభిరక్షణానికి అధికారులు.

ఈ విధంగా సహస్రయుగపర్యంతమైన చతుర్దశ మన్వంతరాలు, మనుసంధికాలాల మొత్తానికి కల్పమని పేరు. ఇది పద్మగర్భునికి ఒక దివసకాలం. మళ్లీ అంతే ప్రమాణం కలిగిన సహస్రయుగాల కాలం రాత్రి. దివాసమయంలో బ్రహ్మరూపధరుడై భూతసృష్టిని కావించిన శ్రీమన్నారాయణుడు రాత్రిసమయంలో స్వమాయాసంస్థితమైన త్రైలోక్యాన్ని గ్రసించి, ఏకాకారమైన ప్రళయ మహార్ణవంలో శేషాహిపై యోగనిద్రలో శయనిస్తాడు. రాత్రి కల్పం అతీతమైనాక అవ్యయాత్ముడైన జనార్దనుడు యథాపూర్వంగా మేలుకొని, రజోగుణంచేత ఉద్రిక్తుడై పునఃసృష్టి కావిస్తూ కల్పం తర్వాత కల్పాన్ని శిల్పీకరిస్తాడు.

మైత్రేయా! మన్వాదులందరూ వాసుదేవుని సాత్త్వికాంశలై ప్రవర్తిల్లినప్పుడు స్థితివ్యాపారలక్షణుడైన శ్రీమహావిష్ణువు యుగవ్యవస్థను ఏ తీరున కొనసాగిస్తున్నాడో విను.

కృతయుగంలో వాసుదేవుడు సర్వభూతహితార్థమై కపిలాది మహర్షి స్వరూపాలను ధరించి లోకాలకు జ్ఞానపరమార్థాన్ని ఉపదేశిస్తాడు. త్రేతాయుగంలో ఆ ప్రభువు చక్రవర్తి స్వరూపధరుడై దుష్టులను నిగ్రహించి జగత్త్రయాన్ని పరిరక్షిస్తాడు. ద్వాపరయుగంలో వేదవ్యాసుని రూపుతాల్చి వేదరాశిని చతుర్భాగాలుగా విభజించి వాటిని అనేక శాఖలుగా అభివ్యాపింపజేస్తాడు. కలియు

గాంతంలో శ్రీహరి కల్కిస్వరూపాన్ని ధరించి దుర్వృత్తులను పరిహరించి వేదధర్మాన్ని ప్రతిష్ఠాపిస్తాడు. ఈ విధంగా అనంత మహిముడయిన ఆయనే జగత్తులను ఉత్పాదించి, చేవలునించి, అంతంలో త్రుంచివేస్తున్నాడు. భూతభవిష్యద్వర్తమానకాలాత్మకుడైన ఆ మహాత్మునికి అధీనమై సమస్తమూ విస్తరిల్లుతున్నది.''

అని వచించి పరాశరమహర్షి ''విప్రవరా! నీ అభీష్టానుసారం మన్వంతరాలు, మన్వంతరాధిపుల స్వరూపాన్ని సమగ్రంగా నిరూపించాను. ఇంకా ఏమి చెప్పమంటావు?'' అని అడిగాడు.

మైత్రేయుడు—''భగవన్! మీరు బోధించిన కథానకాల ద్వారా విష్ణువు నుండి విష్ణువులో విష్ణువై పొడమిన జగత్తు యొక్క పూర్ణ స్వరూపాన్ని సాకల్యంగా తెలుసుకొన్నాను. ఇంతకన్నా నాకు కోరదగిన దేమున్నది?

ప్రతి ద్వాపరయుగంలోనూ వాసుదేవుడు వేదవ్యాసుడై భాసించి వేదరాశిని విభజిస్తాడని మీరన్నారు. ఇంతవరకూ ఏయే కాలంలో ఎవరెవరు వేదవ్యాసత్వాన్ని భజించి ధన్యులయ్యారో, వేదశాఖలు ఏయే రీతుల విలసిల్లాయో విశదీకరించండి'' అని కోరాడు.

పరాశరుడు మైత్రేయుని అనుయోగానురూపంగా తన కథనాన్ని కొనసాగించాడు.

వేదవ్యాస నిరూపణం

''మైత్రేయా! అనంతమైన వేదశాఖల సంఖ్యాపరిగణనం మానవమాత్రులకు సాధ్యం కాదు. అందుచేత అతిగహనమైన ఆ మహావిషయాన్ని నీకు సంక్షేపంగా తెలియజేస్తున్నాను.

మహామునీ! ద్వాపరం ద్వాపరంలోనూ శ్రీమహావిష్ణువు వ్యాసరూపధరుడై అవతరించి అల్పవీర్యులు, అల్పతేజులు, అల్ప

బలులూ అయిన మనుష్యుల కోసం వేదరాశిని నాలుగు భాగాలుగా విభజించి, అనంతశాఖోపశాఖలను నివ్వటిల్లజేసి వేదవ్యాసాభిధానాన్ని వహిస్తున్నాడు. భూతహితార్థమై ఏర్పడిన వేదభేదాలు మానవులకు ధర్మాచరణాన్ని, శ్రీమన్నారాయణ మహత్త్వాన్ని ఉపదేశిస్తున్నాయి. ఇప్పుడు నడుస్తున్న ఈ వైవస్వతమన్వంతరంలో గడిచిపోయిన ఇరవై ఎనిమిది మహాయుగాల లోని ద్వాపరాలలో ఇరవై ఎనిమిదిమంది వ్యాసరూపులై వారి వారి యుగాలలో వేదవాఙ్మయాన్ని చతుర్విభక్తంగా లోకాలకు అందజేశారు.

వైవస్వత మన్వంతరంలోని ప్రథమ ద్వాపరంలో సాక్షాత్తు చతుర్ముఖబ్రహ్మ తానే వేదవ్యాసుడై నారాయణాంశతో జన్మించి నాలుగు వేదాలను సాంగోపాంగంగా నిరూపించాడు. ఆ తరువాత వచ్చిన ద్వాపరాలలో ప్రజాపతి, అసురాచార్యుడైన శుక్రుడు, దేవగురువు బృహస్పతి, లోకసాక్షి సూర్యుడు, ధర్మకర్త మృత్యువు, ఇంద్రుడు, వశిష్ఠుడు, సారస్వతుడు, త్రిధాముడు, త్రిశిఖుడని పేరు గల త్రివృషుడు, భరద్వాజుడు, అంతరిక్షుడు, ధర్ముడని పేరొందిన వర్ణి, త్రయ్యారుణి, ధనంజయుడు, క్రతుంజయుడు, సంజయుడు, భరద్వాజుడు, గౌతముడు, హర్యాత్ముడని నామాంతరం గల ఉత్తముడు, వాజశ్రవాన్వయుడైన వేనుడు, సోమశుష్మాయన వంశంలో పుట్టిన తృణబిందుడు, వాల్మీకి నామాంతరంతో భృగు కులంలో జన్మించిన ఋక్షుడు వేదవ్యాసులైనారు. ఇరవై అయిదవ ద్వాపరంలో మా తండ్రి శక్తి, ఇరవై ఆరవ ద్వాపరంలో నేను, నా అనంతరం జాతుకర్ణుడు, ఇరవై ఎనిమిదవ మహాయుగంలో కృష్ణద్వైపాయనుడు వ్యాసరూపధరులమై ఋగ్యజుస్సామాథర్వణ వేదాలను, వేదాంగాలైన శిక్ష వ్యాకరణం ఛందస్సు జ్యోతిషం నిరుక్తం కల్పాలను, ఆగమపురాణాలను, అష్టాదశ విద్యలను లోకాం

తరితంగా వ్యాపింపజేశాము. నా కుమారుడు కృష్ణద్వైపాయనుని ప్రభావపరిధి వ్యతీతమయాక రానున్న ద్వాపరయుగంలో ద్రోణ పుత్రుడు అశ్వత్థామ వేదవ్యాసుడై అవతరించి వైష్ణవాంశతో వేదో న్నయనం కావిస్తాడు.

వ్యాసుని వేదవిభాగక్రమం

విశ్వసృష్టిస్థితి ప్రళయకారణమైన నారాయణ పరబ్రహ్మం ఓంకారశబ్దవ్యవస్థితమై ఉన్నది. బృహత్త్వ బృంహణత్వాల చేత దీనికి బ్రహ్మమని పేరు వచ్చింది. బ్రహ్మభావనం చేయగలవారికి భూర్భువఃస్వరాది వ్యాహృతులలో అభివ్యాప్తమై ఉన్న ప్రణవ తత్త్వాన్ని ఋగ్యజుస్సామ విద్యలు ఛందోముఖంగా ఆవిష్కరిస్తు న్నాయి. అనాదిమధ్యనిధనుడు, స్వీయమాయా జనితమైన జగత్తులో తానే సర్వాంతరితుడై నెలకొన్నవాడు, పరమాత్ముడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరాత్మకుడైన మహాత్ముడు శ్రీమన్నారాయ ణుడు అద్వితీయుడు. వేద వేద్యుడయిన ఆయనే ఋగ్యజుస్సామ సారాత్మకుడై వేదమయ శరీరాన్ని ధరించి వేదాలను సృజించాడు. వేదశాఖాసర్వస్వమూ ఆ పరంధాముని లీలాతనువిలాసం. శాఖా ప్రణేత, సమస్తశాఖాగత నిర్మలజ్ఞానస్వరూపుడు, అనంతుడు, భగవ త్స్వరూపుడైన నారాయణుడే వేదపురుషుడు.

ఆదికాలంలో అగ్నిహోత్రం, దర్శపౌర్ణమాసం, చాతు ర్మాస్యం, పశుయజ్ఞం (అశ్వమేధం), సోమయజ్ఞం అని ఐదువిధాల యజ్ఞక్రియలు ప్రాకృత—వైకృత భేదంచేత దశవిధాలుగా విహిత మైనప్పుడు కర్మకలాపవ్యాహృతిగా శతసహస్రసమ్మితమైన వేదరాశి ఆవిర్భవించింది. నా కుమారుడైన కృష్ణద్వైపాయనుడు దీనిని నాలుగు వేదాలుగా విభజించాడు. ఇంతకు పూర్వయుగాలలో వ్యాసులమైన

మేమందరమూ ఇదే రీతిగా వేదవిభాగం చేసి వేదవ్యాసుల మైనాము. ఈ యుగంలో ఏయే వేదశాఖలు కలిగాయో, అవే శాఖలను మేము తత్పూర్వయుగాలలో ఉపకల్పించాము.

మైత్రేయా! ఈ విధంగా నారాయణస్వరూపా లయిన వేదాలను లోకోపకారార్థం వేర్పరిచిన కృష్ణద్వైపాయనుడు కూడా నారాయణ స్వరూపుడే. మానవమాత్రులకు ఆ వేదవ్యాసత్వమూ, పంచమవేదమైన శ్రీ మహాభారత కర్తృత్వమూ, అలౌకిక వాగ్వైభవమూ అసాధ్యం. ఆ మహాత్మకృతమైన వేదవిభాగక్రమాన్ని నేను నీకు యథాతథంగా విశదీకరిస్తున్నాను.

ప్రథమ ద్వాపరంలో పద్మగర్భుడు తానే వేదవ్యాసుడై దిగి వచ్చి వ్యవస్థీకరించిన వేదరాశిని బ్రహ్మోపదిష్టుడైన కృష్ణద్వైపాయనుడు నాలుగు భాగాలుగా విభజించాడు. వేదశాస్త్రపారంగతులైన నలుగురు శిష్యులను రావించి, ఋగ్వేదానికి పైలుని, యజుర్వేదానికి వైశంపాయనుని, జైమినిని సామవేదానికి, అథర్వణవేదానికి సుమంతుని శ్రావకులుగా నియమించాడు. రోమహర్షణుడని పేరుగల సూతుని ఇతిహాస పురాణప్రవచనాలకు శిష్యునిగా స్వీకరించాడు.

వేదశరీరం అవిభక్తమై ఏకరాశిగా ఉన్నప్పుడు యజుర్వేదం ఒక్కటే ప్రరూఢమై ఉండేది. వేదవ్యాసుడు దీనిని నాలుగు భాగాలుగా విడదీసిన తర్వాత యజ్ఞక్రియలను నిర్వర్తించడానికి అధ్వర్యుడు, హోత, ఉద్గాత, బ్రహ్మలను ప్రధానులుగా నిలిపి ఆధ్వర్యవానికి యజుస్సులను, హౌత్రానికి ఋక్కులను, ఔద్గాత్రానికి సామాలను, బ్రహ్మత్వానికి అథర్వణాలను ప్రయోగించాలని నిర్దేశించాడు.

ఈ విధంగా కృష్ణద్వైపాయనుడు వేదపాదపాన్ని నాలుగు శాఖలుగా విభజించినప్పుడు కొమ్మలకు రెమ్మలు పుట్టుకొచ్చాయి.

క్రమేణ శాఖోపశాఖలు కలిగి, వాచామగోచరమైన వేదారణ్యం ఉత్పతిల్లింది.

వేదసంహితలు అనేకముఖంగా అభివ్యాపించాయి. పైల మహర్షి తనకు లభించిన ఋక్సంహితలను రెండుగా విభజించి ఇంద్ర ప్రమితికి, బాష్కలునికి ఉపదేశించాడు. బాష్కలుడు తాను ప్రసారం చేసిన సంహితాభాగాన్ని నాలుగు పాదాలుగా విభాగించి బౌధ్య అగ్నిమాథర యాజ్ఞవల్క్య పరాశరులకు బోధించాడు. వారందరూ తమకు లభించిన అంశాలను అసంఖ్యాక శిష్యగణాలకు నేర్పసాగారు.

ఇంద్రప్రమితి పొందిన ఋక్సంహితాభాగాన్ని అతని కొడుకు మాండూక్యుడు, శిష్యుడు వేదమిత్రుడు అధ్యయనం చేశారు. మాండూక్యుడు తన కొడుకు సత్యశ్రవునికి, అతను తన సుతుడు సత్యహితునికి, సత్యహితుడు తన పుత్రుడు సత్యశ్రీకి తమకు వంశానుగతంగా సంక్రమించిన సంహితాభాగాన్ని బోధించారు. సత్యశ్రీ నుండి అతని శిష్యులు శాకల్యుడు, రథంతరుడు, బాష్కలి నేర్చుకొన్నారు.

వేదమిత్రునికి కూడా శాకల్యుడని పేరున్నది. అతను ఋక్సంహితను అయిదు భాగాలుగా వేరుచేసి, ముద్గల - గోముఖ - వాత్స్య - శాలీయ - శిశిరర్షులకు ఉపదేశించాడు.

సత్యశ్రీ శిష్యుడైన రథంతరశాకపూర్ణి తన సంహితాంశాన్ని మూడు భాగాలు చేసి క్రౌంచ - వైతాలిక - బలాకులకు నేర్పాడు. సత్యశ్రీ మరొక శిష్యుడు నిరుక్తకారుడై ప్రసిద్ధిని గడించాడు. బాష్కలి నామధేయుడైన మరొక ఋషి ఋక్సంహితను మూడు భాగాలుగా ఏర్పరించి తన శిష్యులైన కాలాయని - గార్గ్య - కథాజవులకు బోధించాడు. కాలాంతరంలో వీరందరూ ఋక్సంహితా ప్రవర్తకు లయ్యారు.

కృష్ణద్వైపాయనుని శిష్యుడైన వైశంపాయనుడు యజుర్వేదాన్ని ఇరవైఏడు శాఖలుగా విడదీసి విద్యార్థులకు బోధింపసాగాడు. ఈ విధంగా వైశంపాయనుని వద్ద చదువుకొన్న వేదవేత్తలలో గురుసేవాతత్పరుడై అనతికాలం లోనే ధర్మశాస్త్రసారాన్ని గ్రహించిన బ్రహ్మరాతసుతుడు యాజ్ఞవల్క్యుడు అగ్రేసరుడు.

ఆ కాలంలో వైశంపాయనుని శిష్యులందరూ మేరుపర్వతశిఖరాల పైన సమావేశమై నిగూఢమైన వేదార్థాన్ని చర్చించుకొనేవారు. ఆ సమావేశానికి ఎవరయినా నిర్ణీత సమయానికి రాకుండా ఆలస్యం చేస్తే వారికి వారంరోజుల లోగా బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొంటుందని ఒక నియమం ఏర్పడింది. దురదృష్టవశాన ఒకప్పుడు వైశంపాయనుడే సమావేశస్థలానికి ఆలస్యంగా వెళ్ళాడు. నియమవ్యతిక్రమదోషం వలన అతనికి బ్రహ్మహత్యాపాతకం సంక్రమించింది. చెల్లెలి కొడుకును ముద్దాడుతుండగా పొరపాటున అతని కాలు తగిలి మేనల్లుడు అక్కడికక్కడే మరణించాడు.

వైశంపాయనుడు పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తన శిష్యులందరినీ చేరబిలిచి, "నేను కావించిన బ్రహ్మహత్యాపాతకానికి ప్రాయశ్చిత్తంగా మీరందరూ కలిసి ఏదైనా గొప్ప వ్రతం ఆచరించి నాకు అఘవిమోచనం కలిగించండి" అని కోరాడు. అప్పుడు జనమధ్యంలో కూర్చున్న యాజ్ఞవల్క్యుడు లేచి, "ఇక్కడ చేరిన బ్రాహ్మణానీకంలో అందరూ క్లేశితులూ, అల్పతేజులూ, అసమర్థులైన వీరితో కలిసి ఆచరించే వ్రతం నిష్ప్రయోజకం" అని పలికాడు. అప్పుడు గురువు క్రుద్ధుడై, "నా కళ్లెదుటే విగుర్వించి సద్బ్రాహ్మణులను అవమానించావు. నీవంటి అయోగ్యులకు విద్యార్హత లేదు. నీకు నేర్పిన చదువులను వెళ్లగక్కి ఇక్కడినుంచి తొలగిపో" అని ఆజ్ఞాపించాడు.

యాజ్ఞవల్క్యుడు గురువు ఆగ్రహవాక్యాలకు చలింపలేదు. "మీ శిష్యులు వ్రతాచరణసమర్థులు కారని నేను సత్యమే పలికాను. నిజమెప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుంది. మీనుంచి నేర్చుకొన్నది చాలు" అని సవినయంగా వచించి, ఉదరాంతరితాలైన యజుస్సులను మాంసశోణితాల రూపంలో వెలిగ్రక్కి, నిజవాసానికి వెళ్లిపోయాడు.

యాజ్ఞవల్క్యుడు ఛర్దిచేసిన రక్తమాంసాలను వైశంపాయనుని శిష్యులు తిత్తిరిపక్షుల రూపంలో భుజించారు. ఆ విధంగా కృష్ణయజుర్వేదసారం తైత్తిరీయంగా రూపు దిద్దుకొంది. గుర్వనుజ్ఞను పాటించిన వైశంపాయనుని శిష్యులకు చరకులని పేరువచ్చింది.

యాజ్ఞవల్క్యమహర్షి తన ఆశ్రమానికి వెళ్లి ప్రాణాయామపరాయణుడై చిరకాలం సూర్యభగవానుని ఆరాధించాడు. ఎట్టకేలకు అతని తపస్సు ఫలించి ఋగ్యజుస్సామభూతుడు, త్రయీధామవంతుడు అయిన శ్రీ సూర్యనారాయణుడు ప్రసన్నుడై వాజిరూపంలో సాక్షాత్కరించి వైశంపాయనునికి కూడా తెలియని అయాతయామాలని పేరుగల అతిరహస్యమైన శుక్లయజుర్వేదశాఖను ప్రసాదించాడు. వాజిరూపధరుడైన సూర్యుని నుంచి ఆసాదితమైన వేదశాఖ కనుక దీని అధ్యేతలకు వాజులని పేరు కలిగింది.

యాజ్ఞవల్క్యుని శిష్యులు కణ్వుడు, వైధేయుడు, శాలి, మధ్యందినుడు, సపేయి, విదగ్ధుడు, ఉద్దాలి, తామ్రాయని, వాత్స్యుడు, గాలవుడు, శైశిరి, ఆటవ్యుడు, పర్ణుడు, విరణుడు, సాంపరాయనుల పేర్లమీదుగా పదిహేను శుక్లయజుర్వేదశాఖలు పుట్టి క్రమంగా వాజసనేయం ఏకోత్తరశతాధికంగా విస్తరిల్లింది.

వ్యాసమహర్షి శిష్యుడైన జైమిని వద్ద అతని కొడుకు సుమంతుడు, పౌత్రుడు సుకర్ముడు—ఇద్దరూ సామవేదం చెప్పుకొన్నారు.

సుకర్ముడు సాహస్రసంహితను సంకలించి తన శిష్యులు కోసలీయ హిరణ్యనాభుడు, పౌష్పింజులకు బోధించాడు. పౌష్పింజుని శిష్యులు పదిహేనుమంది సామవేదానికి ఔత్తరాహ పాఠాలను ఏర్పరించారు. వీరికి ఉదీచ్యసామగులని పేరు. హిరణ్యనాభుని శిష్యులు పదిహేను మంది ప్రాచ్యసామగులై పదిహేను సామశాఖలను ప్రచారంలోకి తెచ్చారు. పౌష్పింజుని ఇతరశిష్యులు లోకాక్షి, కుథుమి, కుషీది, లాంగలి, వారి శిష్యులు ఇంకా అనేకశాఖలను వ్యాపింపజేశారు. హిరణ్యనాభుని శిష్యులలో కృతి ఇరవైనాలుగు శాఖలను కల్పించాడు. ఈ విధంగా సామవేదం బహుముఖంగా వర్ధిల్లింది.

కృష్ణద్వైపాయనుని సన్నిధిలో అథర్వవేదాన్ని గ్రహించిన సుమంతుడు తన శిష్యుడు కబంధునికి సాంగోపాంగంగా బోధించాడు. కబంధుని వద్ద అధ్యయనించిన దేవదర్శుడు మౌద్గ—బ్రహ్మబలి—పిప్పలాదులకు, పథ్యుడు జాజలి—కుముదాది—శౌనకులకు ఉపదేశించారు. వీరందరి పేర్లమీద అథర్వశాఖలు ఏర్పడ్డాయి. శౌనకుడు తన భాగాన్ని రెండుగా విడదీసి, బభ్రు—సైంధవాయనులకు వేర్వేరుగా బోధించాడు. బభ్రువు పేరుమీద ముంజికేశాంతరం, సైంధవాయనుని పేరిట సైంధవశాఖ ప్రభవించాయి. ఈ సంహితలలో బభ్రుశాఖను రెండు భాగాలుగాను, సైంధవాన్ని మూడు భాగాలుగాను విభజించి ముంజికేశి నక్షత్ర—వేద—సంహితా—ఆంగిరస—శాంతికల్పాలను రూపొందించాడు. వీటిలో నక్షత్రకల్పంలో పద్మగర్భుని సృష్టికథనం, గ్రహనక్షత్రస్తోత్రాలు ఉన్నాయి. వేదకల్పంలో వైదికక్రియాకలాపం, సంహితాకల్పంలో మంత్రవిధులు, ఆంగిరసకల్పంలో శత్రునిబర్హణ—అభిచార మంత్రాలు, శాంతికల్పంలో గజహయశిక్షణ విధానాలు, పిశాచాది దుర్గ్రహబాధానివృత్తులు సంగ్రథితాలు. ఈ అథర్వవేదంలో సర్పబాధానివారణ,

సర్వకామసిద్ధి, సర్వశాంతికర్మ, దుస్స్వప్నసామన, వాణిజ్యలాభ, స్త్రీసౌభాగ్య, అయుతహోమతుల్య, బుద్ధివృద్ధి, స్థానలాభ, కృషిలాభ, సౌభాగ్యవృద్ధి, బంధనవిముక్తి, శత్రునాశ, స్త్రీసుఖలాభ, గర్భలాభ, పుత్రలాభ, మార్గమంగళ, ఐశ్వర్యలాభ, మృత్యుంజయ మహామంత్రాలు సర్వాంగీణంగా ఉపదేశింపబడ్డాయి.

పురాణాల అనుక్రమణిక

ఆ తర్వాత పురాణార్థవిశారదుడైన కృష్ణద్వైపాయనుడు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు, కల్పసిద్ధులతో కూడిన పురాణసంహితను వినిర్మించి రోమహర్షణుడని పేరుగల సూతునికి ఉపదేశించాడు. సూతుడు తన శిష్యులైన సుమతి, అగ్నివర్చసుడు, మిత్రాయువు, శాంశపాయనుడు, అకృతవర్మ సావర్ణులకు బోధించాడు. వీరిలో శాంశపాయనుడు, కాశ్యప నామాంతరం గల అకృతవర్మ, సావర్ణి పౌరాణికులై మూలసంహితలను పురాణింపగా రోమహర్షణుడు స్వయంగా పూనుకొని రోమహర్షణికాసంహితను విరచించాడు. ఈ నాలుగు సంహితల సారమే మనమిప్పుడు చెప్పుకొంటున్న శ్రీవిష్ణు పురాణం.

పురాణసర్వస్వానికి బ్రహ్మపురాణం ఆద్యమని అభియుక్తోక్తి. పురాణజ్ఞులైన పెద్దలు ప్రధానంగా పద్దెనిమిది పురాణాలను పేర్కొంటారు. అవి: బ్రాహ్మం - పాద్మం - వైష్ణవం - శైవం - భాగవతం - నారదీయం - మార్కండేయం - ఆగ్నేయం - భవిష్యం - బ్రహ్మవైవర్తం - లైంగం - వారాహం - స్కాందం - వామనం - కౌర్మం - మాత్స్యం - గారుడం - బ్రహ్మాండం. ఇవి కాక ఉపపురాణాలు అనేకం ఉన్నాయి. వీటన్నింటిలోనూ సర్గం - ప్రతిసర్గం - వంశం - మన్వంతరం - వంశానుచరితం నిరూపితాలు.

మైత్రేయా! నేనిప్పుడు విశదీకరిస్తున్న మహాపురాణం శ్రీవిష్ణుపురాణం. ఇది పాద్మానికి తరువాత తార్తీయీకంగా పేర్కొనబడుతున్నది. ఈ మహాపురాణంలో ప్రపంచోత్పత్తికథనం, ప్రతిసర్గం, వంశ మన్వంతరాదులలో భగవంతుడైన శ్రీమహావిష్ణువు సర్వాతిశాయి మహాప్రభావం లోకోత్తరంగా అభివర్ణింపబడింది.

అష్టాదశ విద్యలు

ఋగ్యజుఃసామాథర్వణ వేదాలు నాలుగు, వేదాంగాలైన శిక్షావ్యాకరణచ్ఛందోనిరుక్తజ్యోతిషకల్పాలు ఆరు, మీమాంసా న్యాయవిస్తరాలు, పురాణసర్వస్వం, ధర్మశాస్త్రాలు—ఇవి చతుర్దశ విద్య లనబడుతున్నాయి. ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థశాస్త్రాలతో కలిసి ఇవి అష్టాదశవిద్యలు.

ఋషిప్రకృతులు ప్రధానంగా మూడు విధాలు: రాజులై జన్మించి ఋషిత్వాన్ని సాధించిన విశ్వామిత్రాదులు రాజర్షులు, దైవాంశసంభూతులై ఋషిపదాన్ని అధిరోహించిన నారదాదులు దేవర్షులు. వనజగర్భోద్భవులై బ్రహ్మజ్ఞాను లయిన వశిష్ఠాది బ్రాహ్మణర్షులు బ్రహ్మర్షులు.

మైత్రేయా! మనమింతవరకూ అనుశీలించిన వేదాలు, వేద శాఖలు, శాఖాకర్తలు, శాఖాభేదాలు, భేదహేతువులు సమస్త మన్వంతరాల లోనూ సమానంగా ప్రవర్తిల్లుతాయి. జ్ఞాతవ్యవిషయా లన్నింటికీ మూలమైన ప్రాజాపత్య శ్రుతి నిత్యస్వరూపిణి. శ్రుతి శాఖ లన్నీ దీనికి వికల్పరూపాలు.''

అని పరాశరమహర్షి వేదసంబద్ధ మహావిషయాలను మైత్రే యునికి సులభగ్రాహ్యంగా విశదీకరింపగా మైత్రేయుడు—

యాతనానివృత్త్యుపాయం

"ద్విజోత్తమా! బ్రహ్మాండ కటాహం లోని సప్తద్వీపాలు, పాతాళవీధులు, సప్తలోకాలు అన్నింటిలోనూ స్థూలరూపాలు, సూక్ష్మరూపాలు, అతిస్థూల స్థూలతరాతిసూక్ష్మ సూక్ష్మతర ప్రాణులు అంగుళంలో ఎనిమిదవ అంశం ఏడమైనా లేకుండా సర్వేసర్వత్ర నిండి ఉన్నాయి. ఈ జీవజాతాలు యావజ్జీవితం కర్మబంధాలకు కట్టు పడి, ఆయుర్భోగం తీరిన తర్వాత తమకు ప్రచోదితమైన యాతన లను అనుభవించడానికి యమలోకానికి నిర్గమిస్తున్నాయి. యాతనల నుంచి విముక్తిని పొందిన జీవులు దైవతాదుల రూపాన్ని పొందగా, ప్రారబ్ధకర్మం గతించనివారు మళ్లీ భూమిపై జన్మించి యాతనలను పొందుతున్నారు. ఈ విధంగా మన శాస్త్రాలు నిర్ణయించిన జనన మరణాల పరివృత్తిని అతిగమించి కాలపాశనివృత్తిని పొందడం ఎలాగో వివరించండి" అని కోరాడు.

మైత్రేయుని ప్రశ్నానికి పరాశరమహర్షి అంగీకారసూచ కంగా తల పంకించి, "పూర్వం నకులునికి ఇదే సంశయం కలిగి నప్పుడు భీష్మపితామహుడు చెప్పిన సమాధానం విను" అంటూ భీష్ముని పలుకులను యథాశ్రుతంగా అనువదించాడు:

"భీష్ముడు: "నకులా! పూర్వం ఒకప్పుడు నా వద్దకు కళింగ దేశం నుంచి నా ప్రియసఖుడైన ఒక ద్విజోత్తముడు వచ్చాడు. మాటల సందర్భంలో నీ వడిగిన ప్రశ్ననే తానూ ఒక మునీంద్రుని అడిగానని అన్నాడు. ఆ మౌని జాతిస్మరత్వం చేత పూర్వ జన్మలను గుర్తెరిగిన మహాజ్ఞాని, ధర్మరతుడు. ఒక వ్యక్తి తన పూర్వజన్మలో జరిగిన వృత్తాంతాన్ని జ్ఞాపకం చేసుకొని చెప్పగలగటం అన్నది నేనంతకు ముందు కనీవినీ ఎరుగని అపూర్వానుభవం. యాతనా

నివృత్తికి ఆయన ఉపదేశించిన మార్గోపాయాన్ని నా మిత్రుడు ఆప్త భావంతో నాకు తెలియజేశాడు.

యమగీత: వైష్ణవ లక్షణాలు

నరకలోకేశ్వరుడైన యమధర్మరాజు ఒకప్పుడు తన కింకరుని చేరబిలిచి, అతని చెవిలో రహస్యంగా శ్రీవల్లభుని ఆశ్రయించిన ముముక్షువుల సుప్రభావాన్ని, వారి యెదుట తన శక్తిహీనతను వెల్లడించాడు. ''నీవు భూలోకం నుంచి జీవులను పట్టితెచ్చేటప్పుడు మధుసూదనప్రపన్నులైన భక్తాగ్రేసరులను తాకబోకు. నేను విష్ణు భక్తులకు తప్ప అన్యులకు మాత్రమే ప్రభువును. విష్ణునాభికమలోద్భవుడైన విధాత నన్ను లోకాల హితాహితాలకై నియమించాడు. నా శక్తి విష్ణుపరాధీనమే కాని స్వతంత్రం కాదు. శ్రీహరిని ఆరాధ్యదైవంగా సేవించిన పుణ్యాత్ములకు నేను కూడా వశవర్తినే. క్షితిజలపరమాణువులు వాయుప్రసారం వలన పైకెగసి మళ్ళీ వర్షారూపంలో ధరిత్రిని చేరినట్లు దేవతలు, మనుష్యులు, జంతుజాలం శ్రీహరి నుంచి ఆవిర్భవించి శ్రీహరిలోనే విలీనమౌతున్నాయి. స్వర్ణాన్ని కరిగించి రూపొందించిన ఆభరణాలు మూలద్రవ్యమైన స్వర్ణానికి అన్యతరం కానట్లుగానే జనార్దనుని నుంచి పొడమిన ప్రాణికోటి జనార్దనునికే రూపాంతరం. ఆజ్యసేచనంవల్ల దరికొన్న అగ్నికి మల్లే శ్రీమన్నారాయణుని పాదపద్మాలను నమ్ముకొన్న భక్తజనులకు నువ్వు దూరంగా ఉండాలి'' అని ఆనతిచ్చాడు.

దండధరుని వచనాలకు యమపురుషుడు, ''విభూ! మీరు నిర్దేశించిన ఆ వైఘానసులను ఎలా గుర్తుపట్టాలో నాకు విశదంగా చెప్పండి'' అని విన్నవించుకొన్నాడు.

ధర్మకర్త విష్ణుభక్తులను అభివర్ణించాడు.

"తనకు విహితమైన వర్ణాశ్రమ ధర్మాలను యథావిధిగా నిర్వర్తించిన అచంచల దీక్షాపరుడు, శత్రుమిత్రపక్షాల యెడ సమభావం కల ధర్మవర్తనుడు, పరద్రవ్యాపహరణవాంఛ లేని నిష్కాముడు, కలలోనైనా పరులకు కీడు తలపెట్టని విశుద్ధాత్ముడు ఎక్కడ కనుపించినా ఆతడు విష్ణుభక్తుడని గ్రహించాలి.

అరిషడ్వర్గాన్ని శమింపజేసి కలికలుషములంచేత మలినం కాని విమలచిత్తుడు ఎక్కడున్నా అతడు శ్రీజనార్దనుని హృదయసద్మంలో పాదుకొలిపిన హరిభక్తుడేనని తెలుసుకోవాలి.

పరుల సొమ్ము బంగారమైనా గడ్డిపోచ వలె తృణీకరింపగల ధన్యాత్ముడే శ్రీమహావిష్ణుభక్తుడు. అమృతాంశుని తుహినశీతల కిరణమధ్యంలో హుతాశనదీప్తిజ్వాలలు ప్రజ్వలించనట్లే నిర్మల స్ఫటికాకృతి విభాసమానుడైన వాసుదేవుని భక్తులను మత్సరాది దోషాలు అంటలేవు.

నిర్మలాత్ముడు, విమత్సరుడు, ప్రశాంతుడు, పరిశుద్ధవర్తనుడు, అఖిలసత్త్వాలనూ ప్రేమభావంతో ఆదరింపగల స్నిగ్ధహృదయుడు, ప్రియహితవచనుడు, మాయాతీతస్వభావుడు, చిత్తనిత్యస్థిత వాసుదేవ స్వరూపుడు శ్రీమహావిష్ణువు భక్తుడని గుర్తించాలి. బాలరసాల వృక్షం నేలలోని సారాన్ని గ్రోలి చారుతరమై భాసించినట్లు శ్రీమన్నారాయణాంఘ్రి నీరేజ సేవాహేవాకంతో తనివిచెందిన వైష్ణవోత్తముల రూపం పరమసాత్త్వికమై గోచరిస్తుంది.

యమనియమాది అష్టాంగయోగాలతో క[illegible]
వేసికొన్న సజ్జనులు, నిరంతర శ్రీహరిపదాస[illegible]
మానమత్సరులు కనిపించినప్పుడు యమకింక[illegible]
ప్రణమిల్లి దూరం తొలగిపోవాలి.

సూర్యోదయం కాగానే చీకటి మటుమాయమైనట్లు అనాది మధ్యనిధనుడు, శంఖచక్రగదాఖడ్గహస్తుడు, అవ్యయుడు, పరమ పురుషుడు అయిన వాసుదేవపరబ్రహ్మాన్ని స్మరించిన పుణ్యాత్ముల యెదుట మనవంటివారి ప్రభావం నిరస్తమైపోతుంది.

ప్రాణులను హింసించి, పరుల ధనాన్ని అపహరించి, అసత్య నిష్ఠురోక్తులాడిన కలుషాత్ముని కఠిన హృదయం శ్రీ మహావిష్ణు నివాసమందిరం కాజాలదు.

పరుల సౌభాగ్యాన్ని చూసి ఓర్వలేని ఈర్ష్యాళువు, పెద్దలను గౌరవింపని అవినయశీలుడు, సజ్జనులను బాధించే కలుషాత్ముడు, యజ్ఞయాగాలు చేయని ఆచారవిహీనుడు, ఐశ్వర్యలోభం పెచ్చరిల్లి దానవిముఖులైన అధర్మపరుల కరకుటెడదలలో జనార్దనునికి ప్రవేశం లేదు.

ధనసంపాదన వ్యామోహంలో పడి ఆప్తమిత్రులు, బంధువులు, ఆఖరికి కన్న తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, తనను ఆశ్రయించిన భృత్యవర్గాలపట్ల కూడా దయావిహీనుడై ప్రవర్తించిన శఠుడు విష్ణుభక్తుడు కాడని వెంటనే గుర్తింపవచ్చు.

ఎటువంటి వారికైనా కీడు తలపోసే అశుభమతి, దుష్టవర్తనుడు, చెడు స్నేహాలు మరిగి ఆర్యులను ధిక్కరించిన నీచుడు, పాపాలు చేసి వాటిని కప్పిపుచ్చేందుకు అంతకన్నా ఘోరమైన పాపాలు చేసే నరరూపపశువు వాసుదేవుని భక్తులు కాలేరు.

...జనులు పాపకర్దమానికి దూరవర్తులు. సకలమూ శ్రీ
...మైన లీలావిలాసమని గుర్తించి, పరమాత్ముడూ
...దనంతుడేనని మనసారా నమ్మిన మాననీయులకు
...ా ఉండాలి. శ్రీ కమలనయనా! వాసుదేవా!
అచ్యుతా! శంఖచక్రకరా! మమ్మల్ని

దయతో కాపాడు తండ్రీ! అని శరణువేడిన నారాయణభక్తులను సమీపించక వారికి దూరదూరంగా అపసరిల్లాలి.

పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడు ఏ మహాత్ముల హృదయకమలాలలో నెలవుకొని ఉన్నాడో, ఆ విష్ణుభక్తావతంసులకు సర్వోన్నతమైన విష్ణుపదం సంప్రాప్తిస్తుంది.

విష్ణుభక్తుల కనుచూపు మేరలో యమభటులకు ప్రవేశం లేదు. నరకాధినాయకుడనైన నా దోర్వీర్యం అప్రతిహతమైన చక్రాయుధం ముందు నిష్ఫలమైపోతుంది సుమా!''

అని ఈ విధంగా యమధర్మరాజు తన కింకరునితో పరమ రహస్యంగా పలికిన వాక్యాలను ధర్మపరివ్రాజకుడు తన సహచరులతో చెప్పి యమభటులు విష్ణుభక్తులకు దూరంగా ఉండాలని ఆజ్ఞాపించాడు. యమభటుల ద్వారా బహుజన్మలకు పూర్వం ఆలించిన మునీంద్రుడు నా మిత్రుడైన కళింగ విప్రునికి తెలియజేశాడు.

నకులా! మానవులు అపారమైన ఈ సంసార మహార్ణవాన్ని తరించడానికి శ్రీవిష్ణుభక్తిని మించిన ఉపాయాంతరం లేదు. కేశవుని నమ్ముకొన్న భక్తజనులను యముడు, యమకింకరులు, పాశదండాలు, యమయాతనలు బాధింపలేవు.''

అని కురుకుల పితామహుడు నకులునికి ఉపదేశించిన యమగీతను ముగించి పరాశరమహర్షి, ''మైత్రేయా! నీ ప్రశ్నానుగతంగా వైవస్వతప్రోక్తమైన విష్ణుభక్తిమాహాత్మ్యన్ని సంస్మరించి నా మనస్సు ప్రసన్నమైంది. ఇంకా ఏమి వినదలచావు?'' అని అడిగాడు.

మైత్రేయుడు: ''భగవన్! సంసారంపై విజిగీష కలిగిన మానవులు శ్రీమహావిష్ణువును ఆరాధించి పొందదగిన సత్ఫలాన్ని తెలియజెప్పండి.''

పరాశరుడు: "నీవడిగిన ఈ ప్రశ్నను పూర్వం సగరచక్రవర్తి ఔర్వమహర్షిని అడిగాడు. సర్వజ్ఞుడైన ఆ మహర్షి సమాధానం చిరస్మరణీయం."

అని ఆ వృత్తాంతాన్ని సాకల్యంగా వినిపించాడు.

విష్ణ్వారాధన విధానం

వైవస్వతమన్వంతరంలో ఇక్ష్వాకు మహారాజుకు ఇరవైనాలుగో తరంలో జన్మించిన సగరచక్రవర్తి ఒకనాడు ఔర్వమహర్షికి నమస్కరించి, "శ్రీమహావిష్ణువును ఏ విధంగా ఆరాధించాలి? విష్ణుభక్తులకు ఎటువంటి ఫలోపలబ్ధి కలుగుతుంది?" అని ప్రశ్నించాడు.

"శ్రీమన్నారాయణుని భక్తితో ఆరాధించినవారికి అభీష్టఫలాలు సిద్ధిస్తాయి. అచ్యుతారాధకులు ఎవరు ఏ కోరిక కోరుకొంటే వారికి ఆ కోరిక ఫలిస్తుంది. భౌమసుఖాల చిరంతనభోగం, నాకసంప్రాప్తి, సర్వోత్తమమైన నిర్వాణమూ కలుగుతాయి" అని పలికి భృగుపౌత్రుడు మాధవారాధన విధానాలను విశదీకరించాడు.

"మానవులు తమకు విహితమైన వర్ణాశ్రమధర్మాలను భక్తిశ్రద్ధలతో ఆచరించడం వర్ణాశ్రమవిధానాలలో సర్వోత్తమ విధానం. విష్ణువుకు అంతకంటె తోషకారణం మరొకటి లేదు. యజ్ఞయాగాలు, జపమూ తపస్సుల వలన నారాయణుడు సంతోషిస్తాడు.

మానవులు హింస చేయరాదు. తన తోటివారిని హింసించే నిర్దయాత్ముడు తదంతరితుడైన వాసుదేవునే హింసిస్తున్నాడు.

సదాచారవర్తనులు తమ తమ వర్ణాలకు విధింపబడిన ధర్మాలను యథాక్రమంగా నిర్వహించి మానవసేవలో మాధవసేవను పండించుకోవాలి. స్వధర్మతత్పరమైన చాతుర్వర్ణ్యం విష్ణుప్రియమై విలసిల్లుతుంది.

విష్ణుభక్తులు పాపపంకిలంలోనికి ప్రవేశింపకూడదు. పరులపై అపవాదులను లేవదీసి దుష్ప్రచారాలు సాగించడం, ఆ విన్నమాటకు మరి నాలుగు కలిపి నీలాపనిందలను వ్యాపింపజేసే పిశునవృత్తులు, కల్లబొల్లి మాటలు, ఉద్వేగకర భాషణలు విష్ణుభక్తులకు తగని పనులు.

పరస్త్రీ పరాఙ్ముఖులు, పరద్రవ్యాన్ని తృణప్రాయంగా పరిగణింపగల వివేకశీలురు, పరహింసావిముఖులు, అనుద్వేజకంగా మాట్లాడే శాంతచిత్తులు కేశవునికి పరితోషాన్ని కలిగించి పరమ పదాన్ని పొందుతారు.

అకోపనుడు, అహింసారతుడు, దేవబ్రాహ్మణ భక్తుడు, గురు సేవాతత్పరుడు, తన వలెనే సర్వభూతాలకూ మేలు చేకూరాలని ఆశించే హితకాముడు, రాగద్వేషాలు లేని సమచిత్తుడు, అకలుషాత్ముడు—వీరే విష్ణువుకు ప్రీతిపాత్రులు.

వర్ణాశ్రమాలలో పాటింపదగినవి ఇవీ! అని శాస్త్రాలు ఏయే ధర్మాలను నిర్దేశించాయో వాటన్నిటినీ పాటించడమే ఉత్తమోత్తమమైన ఆరాధనం.''

అని పలికిన భృగుపౌత్రుని విలోకించి సగరుడు—

''ద్విజవర్యా! మీరు ప్రస్తుతీకరించిన ఆ వర్ణధర్మాలను, ఆశ్రమధర్మాలను నాకు దయతో విశదంగా బోధించండి'' అని కోరాడు. ఔర్వమహర్షి బోధించాడు.

వర్ణధర్మాల నిరూపణం

''మానవులకు బ్రాహ్మణ—క్షత్రియ—వైశ్య—శూద్రలు జన్మతః సంప్రాప్తమైన వర్ణాలు. ఈ వర్ణోపలబ్ధి కలిగిన ...య తింగా పాటింపదగిన కొన్ని ముఖ్యధర్మాలను ధర్మ... ధినిషేధ రూపంలో ఉపపాదించాయి.

బ్రాహ్మణులు తమకు ఉన్నంతలో దానధర్మాలు చేయాలి. యజ్ఞాహుతులను వేల్చి దేవతలకు తృప్తిని కలిగించాలి. వేదార్థాన్ని గ్రహించి స్వాధ్యాయతత్పరులై తదేకతానంగా మెలగాలి. ఉభయసంధ్యలలో శ్రీసూర్యనారాయణునికి జలాంజలి సమర్పించి నిత్యోదకులై అగ్నిపరిగ్రహం కావించాలి.

బ్రాహ్మణులు యజ్ఞయాగాలను, పూజావ్రతాలను ధర్మనిర్వహణానికి, దైవతారాధనకు మాత్రమే సంకల్పించాలి. తమ స్వార్థం కోసం అమాయకులను మోసగించకూడదు. ఒకవేళ జీవనార్థమై యజ్ఞాలను చేయించినా, తనకు శాస్త్రసమ్మతంగా వచ్చిన దక్షిణలను మాత్రమే ప్రతిఫలంగా స్వీకరించాలి. వాణిజ్యదృష్టితో ధనార్జనకు పూనుకోరాదు.

యజనయాజనాలతోపాటు అధ్యయనాధ్యాపనాలు కూడా విప్రులకు కర్తవ్య విధులే. గురువులు తమ విద్యార్థులకు వేదశాస్త్రాలను బోధించి వారి శక్తికి మించని గురుదక్షిణను కైకొనాలి. అంతేకాని వేదాలను అమ్మకానికి పెట్టి శాస్త్రోపదేశం నెపంతో లాభాలు ఆర్జించాలనుకోవడం విష్ణుద్రోహమే.

ఉత్తములు సమస్తభూతజాతానికీ హితాచరణం చేయాలి. కలలో కూడా అహితాన్ని తలపోయకూడదు. ప్రాణికోటి పరస్పర స్నేహభావంతో కలిసి మెలిసి సుఖంగా ఉండటమే బ్రాహ్మణులు సాధింపదగిన మహైశ్వర్యం. అందుకు కృషిచేయడమే వారికి విధినియతం.

బ్రాహ్మణులు పరధనాన్ని ఆశింపకూడదు. తృష్ణాపీడితుల భవబంధాల నుంచి విముక్తి సాధ్యం కాదు.

శిష్యులు తనకు విద్యానిష్క్రయంగా సమర్పించిన దక్షి
విద్వత్సభలలో వాక్యార్థం చేసి అర్హితచిహ్నంగా పొందిన
తపస్సు చేసి భగవదనుగ్రహం వలన పొందిన వరా

వాప్తం, యజ్ఞం చేయించి అధ్వర్యవానికి పుచ్చుకొన్న శాస్త్ర సమ్మతమైన ప్రతిఫలం, తనయందలి ఆదర భావంతో ధనాఢ్యు లొసగిన ప్రీతిదాయం, తనకు వంశానుగతంగా పెద్దల నుంచి సంక్రమించిన సంపదలు—అనే ఏడు విధాల శుక్లాలు మాత్రమే బ్రాహ్మణులకు స్వీకార్యధనాలు. ఇవి తప్ప తనకు రాయి దొరికినా, రత్నమే లభించినా పరుల ద్రవ్యాన్ని అపహరించడం పాపకృత్యమని గ్రహించి సద్బుద్ధితో మెలగాలి.

విప్రులు ఋతుకాలంలో కళత్రభోగాన్ని అనుభవించి సత్సంతానాన్ని పొందాలి. సంతతిని పొందిన భాగ్యవంతులకు పితృలోకాలలో నిరవధిక సంస్థానం కలుగుతుంది.

క్షత్రియులకు వేదశాస్త్రాధ్యయనం, భూసురులకు చేసే దాన ధర్మాలు, బహువిధ యజ్ఞాచరణం విహితకర్తవ్యాలు. శస్త్రాస్త్రాల ప్రయోగోపసంహారాలను అభ్యసించి పృథ్వీచక్రాన్ని అగ్నితేజస్సుతో పరిపాలించాలి. ప్రజలకు ఈతిబాధలు, శత్రుభయాలు లేకుండా శాంతిభద్రతలను కల్పించి, వారిని కన్నతండ్రి వలె కాపాడాలి.

రాజులకు భూమిపాలనం శ్రీమహావిష్ణ్వంశ సంభూతి వలన కలుగుతున్నది. రాజ్యాన్ని నిష్కంటకంగా పాలించిన భూనాయకునికి అతని యేలుబడిలో జరిగిన యజ్ఞాది కర్మల పుణ్యఫలంలో భాగం లభిస్తుంది.

వర్ణాశ్రమ ధర్మాలను కాపాడి, దుష్టశిక్షణ శిష్టరక్షణలను సమర్థంగా నిర్వర్తించిన రాజులకు వారు కోరుకొన్న లోకాలు సంప్రాప్తిస్తాయి.

వైశ్యులకు పశుపాలనం, వాణిజ్యం, వ్యవసాయం అర్హకర్మలు. వీరు కూడా ఉపవీతులై బాల్యం నుంచి వేదశాస్త్రాలను అధ్యయనం చేసి ధర్మమార్గం అవలంబించాలి. శక్తికొలది యజ్ఞ

కృత్యాలను నెరవేర్చి దానధర్మాలు చేయాలి. నిత్యవిధులను, నైమిత్తికవిధులను అనుష్ఠించాలి. కుటుంబపోషణకు వాణిజ్యాన్ని చేపట్టినా క్రయవిక్రయాలను ధర్మసమ్మతంగా కొనసాగిస్తూ ధనార్జనం చేయాలి.

చతుర్థకులజులు బ్రాహ్మణ — క్షత్రియ — వైశ్య వర్ణాలలో జన్మించిన సత్పురుషులను ఆశ్రయించి, తమకు నియమితమైన ఆచార సంప్రదాయాలను పాటించాలి. అంతశ్శౌచం, బాహ్యశౌచం, సచ్ఛీలం, నిష్కల్మషమైన స్వామిభక్తి, మంత్రాలు లేని యజ్ఞ కృత్యాలు, పరస్త్రీలూ పరధనాల పట్ల వైమనస్యం, సత్పురుషులతో సత్సంగం, విప్రజనరక్షణం విహిత కర్తవ్యాలు.

శూద్రులు పంచయజ్ఞాలను మంత్రవర్జితంగా నిర్వర్తించాలి. ఇల్లు కట్టుకొన్నప్పుడు, సంతానం కలిగినప్పుడు, సంతోషసమయాలలోనూ పాకయజ్ఞం చేసి వైశ్వదేవం సమర్పించాలి. నిత్యారాధనకు వేదమంత్రాలను పరిహరించి పురాణాలలో వ్యాహృతమైన స్తోత్రాలను, ప్రార్థనాశ్లోకాలను వినియోగించాలి.

ఈ విధంగా చాతుర్వర్ణ్యానికి ప్రత్యేకంగా విధింపబడినవి కాక అందరికీ సమానంగా వర్తించే కులధర్మాలు కొన్ని ఉన్నాయి.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు అందరూ కుటుంబ పోషణకు చాలినంత ధనాన్ని సంపాదించాలి. శీలసంపదను పెంపొందించుకొని యుక్తాహార విహార నిద్రలతో దేహారోగ్యాన్ని కాపాడుకోవాలి. ధర్మానికి తాను లొంగి, అర్థకామాలను తన స్వాధీనం చేసుకోవాలి. ధర్మపత్నిని ఋతుకాలంలో కలిసి దీర్ఘాయువు, విద్యా వివేకాలు, మహాయశస్సు, తేజోవిలాసం కలిగిన సత్సంతానాన్ని పొంది లోకానికి సమర్పించాలి.

వర్ణ ధర్మాలను పాటించినవారు వర్ణ ద్వేషాలను పరిత్యజించాలి. సకల భూతాలూ శ్రీవాసుదేవుని మూర్తిభేదాలే నని గుర్తించి, భూతదయ కలిగి లోకహితానికై కృషి చేయాలి.

వర్ణ ధర్మాల పరమార్థం ఆత్మజ్ఞానమే. అందుకు ధర్మనిరతులు క్షమాశీలాన్ని, వినయగుణాన్ని, అనభిమానితనూ అలవరచుకోనాలి. వేషభాషలను ప్రసన్నంగా, జనప్రియకరంగా తీర్చిదిద్దుకోవాలి.

మైత్రి, సత్యం, దయ, మంచితనం, కలిగి నలుగురికీ కన్నాకుగా, తలలో నాలుకగా ప్రవర్తించాలి.

శాంతచిత్తులై ఇంద్రియాలను జయించి ఆత్మతేజాన్ని ఉద్దీపింప జేయాలి.

ఇవన్నీ వర్ణధర్మాలు!

ఆపద్ధర్మాలు

ధర్మనిర్వాహణకు ఉపక్రమించిన మానవులకు అభీష్టసిద్ధి కలిగే లోగా ఎన్నో విఘ్నాలు అడ్డువస్తాయి. చెప్పలేనన్ని అవాంతరాలు కలిగేసరికి ధైర్యస్థైర్యాలు సన్నగిల్లి పోతాయి. ఈ అడ్డంకులను లెక్కచేయక ధర్మదీక్షకలవారు తమ కులాచారాలకు అనుగుణంగా స్వధర్మాన్ని ఆచరించాలి.

అయినప్పటికీ ఒక్కొక్కప్పుడు ఆపద్ధర్మంగా ఆచరింపదగిన విధులు కొన్ని ఉన్నాయి.

వేదధర్మానికి ఆదరువు నశించి, కష్టకాలం దాపురించినపుడు బ్రాహ్మణులు క్షత్రియ—వైశ్యోచిత కృత్యాలను చేపట్టి ధర్మాచరణం చేయాలి.

దేశం పరాధీనమై, అస్వాతంత్రతానియత నావకాశం లేని ఉత్తమక్షత్రియులు ధర్మసంర కృత్యాల నైనా అవలంబించాలి.

సస్యశ్యామలమైన ధరిత్రిని శత్రువుల పాల్పడకుండా రక్షింపగల సమర్థులు లేనప్పుడు వైశ్యులు క్షత్రధర్మాన్ని చేపట్టి ప్రజారక్షణకు ఉత్సహించి ధర్మాన్ని కాపాడాలి.

ఇవి కాక మరేవిధంగా కర్మసంకరం జరిగినా, అది ధర్మవిరుద్ధం. శాస్త్రసమ్మతం కాదు.

ఇవైనా ఆయా వర్ణధర్మాలను ఆచరింపగల సమర్థులు లేని విపత్కాలంలో మాత్రమే ఆపద్ధర్మంగా అంగీకరింపబడ్డాయి. వీటిని స్వార్థప్రయోజనాల కోసమూ, అధికారవిస్తరణ కోసమూ వినియోగించడం పాపహేతువు.''

•

అని ఔర్వమహర్షి సగరచక్రవర్తికి ఆశ్రమధర్మాలను ఉపదేశించాడు:

ఆశ్రమ ధర్మాలు

''వర్ణధర్మనిరతులైన మానవులకు ఆశ్రమధర్మాలను కూడా ధర్మశాస్త్రాలు నిరూపించాయి. ఈ ఆశ్రమాలు నాలుగు: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం.

ఉపనయనం కాగానే బ్రహ్మచర్యాశ్రమం లోనికి ప్రవేశించిన బాలకులు వేదాలను అధ్యయన చేయటానికి గురుదేవుని ఆశ్రమంలో నివసించాలి. వేదశాస్త్రాలు, పురాణసంహితల సారాన్ని కరతలామలకం కావించుకొన్న ఆ మహాత్మునికి భక్తిశ్రద్ధలతో శు[illegible] [illegible]చరించి వేదార్థాన్ని గ్రహించాలి. గురువు యెదుట [illegible]నయవిధేయతలతో నిలబడి, ఆయన ప్రశ్నింపగానే [illegible]ాలను చెప్పి, ఆయన పాదపద్మాలకు నమస్క-

గురువు ప్రసన్నుడై ఉపదేశించిన విద్య శిష్యులకు యుక్త కాలంలో రాణిస్తుంది. సద్గురుకటాక్షం అలవడిన ధన్యాత్ములకు బహుజన్మల విద్యాఫలం సద్యఃపరనిర్వృతిని కలుగజేస్తుంది.

బ్రహ్మచారి ఉభయసంధ్యల లోనూ శ్రీసూర్యనారాయణునికి అర్ఘ్యాన్ని సమర్పించాలి. అగ్నిని వేల్చి కర్మానుష్ఠానాలను నియతంగా ఆచరించాలి.

శిష్యులకు వినయమే అలంకారం. గురువు నిలబడి ఉన్నప్పుడు శిష్యుడు కూడా నిలబడాలి. గురువు నడుస్తున్నప్పుడు తాను కూడా అనుసరించాలి. ఆయన ఉపవిష్టుడైనాకనే సమక్షంలో తాను కూర్చోవాలి. ఎట్టి పరిస్థితులు తలకొన్నా గురువుకు ప్రతికూలంగా ప్రవర్తింపకూడదు.

బ్రహ్మచారి గురుముఖంగా మాత్రమే వేదాన్ని అభ్యసించాలి. పాఠం చదువుతున్నప్పుడు అన్యమనస్కంగా ఉండకూడదు.

భిక్షాటనం చేసి తెచ్చుకొన్న అన్నపానాదులను బ్రహ్మచారి గురువు అనుమతిని పొంది భుజించాలి. గురువు స్నానసంధ్యలకు వెళ్లిన స్థలంలోనే తాను కూడా నిలిచి, ఆయన తరువాత స్నానాదికం ముగించుకొని, సంధ్యావందనం చేయాలి. అగ్నిహోత్రవిధులకు, శాకపాకాలకు గురువు చెప్పిన చొప్పున సమిధలను, ఫలపుష్పాలను సంపాదించి తెచ్చి ఆయన అనుగ్రహాన్ని పొందాలి.

ఈ విధంగా బ్రహ్మచర్యాశ్రమంలో ప్రవేశించి వేదాధ్యయనం చేసిన విద్యార్థి విద్యావధి ముగిసిన అనంతరం గురువు కోరకపోయినా తన శక్తిమేరకు దక్షిణలను కొనితెచ్చి విద్యానిష్క్రయంగా ఆయనకు సమర్పించాలి.

ఆ తరువాత ఆచార్యుని అనుమతిని పొంది శాస్త్రోక్తంగా వివాహం చేసికొని గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలి.

గార్హస్థ్యాన్ని అవలంబించిన ధర్మనిష్ఠులు ధర్మమార్గంలో ద్వితీయపురుషార్థాన్ని సాధించి తమ శక్తికొలది గృహస్థకార్యాలను నెరవేర్చాలి.

గృహస్థులు క్రమం తప్పకుండా నైమిత్తికవిధులను నిర్వర్తించాలి. నివాపాంజలి సమర్పించి పితృదేవతలను, యజ్ఞయాగాలు చేసి దేవతలను, ఇష్టమృష్టాన్నాలతో అతిథులను ఆరాధించాలి. వేదాధ్యయనంతో మునులను, సత్సంతానాన్ని పొంది ప్రజాపతిని, బలిహరణాది కర్మల చేత భూతాలను, సత్యవాక్యం చేత సమస్త ప్రపంచాన్నీ ఆరాధించాలి.

తనకు విహితమైన కర్మకలాపాలను సంపూర్ణంగా నెరవేర్చిన పురుషునికి పుణ్యలోకాలు కలుగుతాయి.

గృహస్థులు తమ ఇంటికి ఆకలిగొని వచ్చిన అతిథి—అభ్యాగతులను గౌరవాభిమానాలతో ఆదరించి, యథాశక్తిగా వారిని సంతోషపరచాలి. అసంకల్పితంగా తన ఇంటిముందుకు వచ్చిన పరివ్రాజకులు, బ్రహ్మచారులు భిక్షను స్వీకరించి, గృహమేధికి పుణ్యలోకాలను ప్రసాదిస్తారు.

ఒక్కొక్కప్పుడు బ్రాహ్మణులు పృథివీదర్శనానికి, తీర్థస్నానానికి, వేదోక్తమైన పుణ్యకర్మలను ఆచరించడానికి దేశాటనం చేస్తూ గృహస్థుల ఇళ్లకు వస్తారు. తినడానికి తిండి, ఉండడానికి చోటు లేక తిరిగి తిరిగి అలిసిపోయినవారు, దూరదేశాలకు పయనిస్తూ చీకటిపడే వేళకు ఆ ఊరిలో బసచేసినవారు గృహస్థుని ఇంటిలో తలదాచుకొంటారు. వీరందరినీ శ్రీకృష్ణపరమాత్మ మూర్తిభేదాలుగా గుర్తించి, గృహాంగణం లోనికి ఆహ్వానించి, మధురవాక్యాలూ కుశలప్రశ్నలతో ఆత్మీయత నెరపాలి. అభ్యాగతులకు సుఖాసనాన్ని చూపి, ఉపవిష్టులైనాక మధురాన్నాలను సమర్పించి, సుఖనిద్రకు తగిన శయనాదులను సమకూర్చాలి.

ఏ అతిథి గృహస్థుని ఇంటికి వెళ్లి ఆశాభంగాన్ని పొందుతాడో, ఆ అతిథి బహుజన్మలలో ఆర్జించిన దుష్కృతాలన్నీ గృహస్థుకు, గృహమేధి పుణ్యఫలాలు అతిథికీ సంక్రమిస్తాయి.

సత్పురుషుల గృహంలో అతిథితిరస్కారం, నిష్కారణంగా అహంకారప్రదర్శనం, కపటభాషణం, కష్టపడి సంపాదించిన ధనం వ్యయమౌతున్నదని వృథాపరితాపం, సాధుజనదూషణం కలికానికైనా కానరావు.

అతిథిసత్కారాది పుణ్యకర్మలు ఆచరింపబడుతున్న గ్రామాలు ధర్మనిలయాలై, సర్వసమృద్ధంగా అలరారుతాయి. ఈ గృహస్థధర్మాలను భగవదర్పణతాత్పర్యంతో కావించిన మహాత్ములు బంధాల నుంచి బయటపడి పుణ్యలోకసౌఖ్యాలను అనుభవిస్తారు.

ఆశ్రమోదితవిధులను ధర్మమార్గంలో అనుష్ఠించి కృతకృత్యులైన గృహస్థులు పరిణతవయస్సులో వానప్రస్థాన్ని స్వీకరించాలి. తన చేతులతో పెంచి పెద్దచేసిన కొడుకులు చేతికెదిగి వచ్చాక కుటుంబభారాన్ని వారికి అప్పజెప్పి, భార్యను వారింటనే నిలిపి కాని, ఆమె అభీష్టానుసారం తనతో తీసికొని కాని అరణ్యవాసానికి వెళ్లపోవాలి.

వానప్రస్థులు మోహబంధాలను పరిత్యజించి, తపస్సును ఉపక్రమించాలి. సుఖభోగాలను విడిచిపెట్టి కేశశ్మశ్రు జటాధరులై కందమూలాలు, ఫలాలు, ఆకులూ అలాలతో కడుపు నింపుకొంటూ శేషజీవితాన్ని గడపాలి. జంతుచర్మాన్ని కట్టుపుట్టాలు గాను, కుశగ్రాసాన్ని అంపోత్తరీయంగాను ధరించి భూమిపై శయనించాలి. త్రికాలాలలోనూ సంధ్యోపాసనార్థం సవనస్నానాలు ఆచరించి నిత్యవిధులను నెరవేర్చాలి. ఇష్టదేవతలను శ్రద్ధాభక్తులతో ఆరాధించి, ఆహవనీయాలను అగ్నికి వేల్చాలి.

వానప్రస్థులు జనావాసాలకు దూరంగా ఏకాంతప్రదేశంలో ఉన్నా అతిథులూ అభ్యాగతులూ వచ్చిపోతుంటారు. వారిని భక్తి పూర్వకంగా పూజించి భిక్షను సమర్పించాలి. బలిప్రదానంతో భూతతృప్తిని కావించాలి.

అరణ్యావాసంలో ఉన్నవారు అందుకు తగినట్లుగా జీవితాన్ని మలచుకోవాలి. వన్యతైలాలను శరీరానికి రాసుకొని అభ్యంగ స్నానం ఆచరించాలి. శీతోష్ణాలను లెక్కచేయక తపోదీక్షను కొనసాగించాలి.

ధర్మైకనిష్ఠతో విహితకృత్యాలను నెరవేర్చిన వానప్రస్థులకు సర్వపాపాలూ క్షయించి అనశ్వరమైన పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయి.''

అని పలికి ఔర్వమహర్షి సగరమహారాజుతో—

''ఇక చతుర్థమైన సన్న్యాసాశ్రమ స్వరూపాన్ని నీవిప్పుడు తెలుసుకోవాలి.''

—అంటూ భిక్షుధర్మాలను తెలియజేశాడు.

''అమృతత్వసాధన మయిన ఆత్మజ్ఞానాన్ని పొందినవారు, పొందగోరినవారు మత్సరాదులను విడిచిపెట్టి తురీయాశ్రమాన్ని స్వీకరించాలి. బ్రహ్మవిదులకు కర్మారంభంతో పనిలేదని గుర్తించి సమస్తకర్మలను, త్రివర్గాలను పరిత్యజించాలి.

సన్న్యాసులకు శత్రుమిత్రభేదాలు, బాహ్యాభ్యంతరాలు, స్వపరభేదాలు లేవు. సర్వాత్మభావం కలిగి జ్యోతిస్స్వరూపమైన ఆత్మ అందరిలోనూ ఏకమై ఉన్నదని గ్రహించినవారికి భేదకధర్మాలు ప్రస్ఫుటించవు. మనోవాక్కాయకర్మవిశుద్ధిని అలవరచుకొని సకల జనులు, పక్షిమృగాలు, చరాచరాలపట్ల హితభావనం చేయాలి. ద్రోహచింతనం కూడదు.

భార్యాబిడ్డలు, బంధుమిత్రులు, తనవారు, పెరవారు మొదలైన సర్వసంగాలను పరిత్యజించాలి.

సన్న్యాసులు దేశాటనం కావిస్తూ గ్రామప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ ఒక్క రాత్రికంటె ఎక్కువ కాలం బస చేయకూడదు. పట్టణప్రాంతమైతే అయిదు రాత్రులను మించి ఉండకూడదు. ఏ దేశంలో సంచరించినా, ఏ ఇంటిలో భిక్ష స్వీకరించినా గృహస్థులకు ప్రీతి, సంతోషం కలిగేటట్లు ప్రవర్తించాలి. ఎదుటివారి మంచితనాన్ని ఆసరా చేసుకొని తన చిత్తానికి తోచినట్లు వ్యవహరించి చెడ్డపేరు తెచ్చుకోకూడదు.

చతుర్థాశ్రమస్థులు భిక్షాటనం చేసి జీవించాలి. భక్ష్యభోజ్యాలు దొరికాయి కదా అని జిహ్వాచాపల్యాన్ని ప్రదర్శించక దేహధారణకు చాలినంతవరకే భుజించాలి. ప్రశస్తవర్ణాల గృహస్థులు వంటలు ముగించి కడుపునిండా భోజనాలు చేశాక, పొయ్యిలో నిప్పులు ఆర్పివేసిన తర్వాత వారి ఇంటికి వెళ్లి భిక్షాన్నం గ్రహించాలి.

సర్వసంగాలనూ పరిత్యజించిన పరివ్రాజకులు కామ-క్రోధ-మోహ-లోభ-మద-మాత్సర్యాలను, సర్వదోషగుణాలను విడిచివేయాలి.

కర్మపరిత్యాగం చేసిన బ్రాహ్మణులకు అగ్నిహోత్రవిధులు కూడా అనవసరం. ఆ అగ్నిహోత్రం వారి శరీరసంస్థితమై ఉండనే ఉన్నది. ఆ శరీరాగ్నిని స్వముఖంలోనే వేల్చాలి. అందుకు భిక్షగా అంగీకరించి తెచ్చుకొన్న పదార్థాలే హవిస్సులు.

ఆత్యంతిక ఫలాన్ని ప్రసాదించే మోక్షాశ్రమాన్ని స్వీకరించినవారు విశుద్ధాత్ములై ఆత్మావలోకనానికి ఉద్యమిస్తారు.

జ్ఞానాగ్నిని ప్రజ్వలింపజేసిన మహాత్ములు చిదుగులు లేకుండా వెలిగిన వహ్నివలె స్వయంజ్యోతీరూపంలో ప్రకాశిస్తున్న స్వాత్మ తేజాన్ని కనుగొని ద్విజన్ములకు ప్రాప్యమైన బ్రహ్మలోకాన్ని అలంకరిస్తారు.''

అని ఈ విధంగా ఔర్వమహర్షి చాతుర్వర్ణ్యధర్మాలను, ఆశ్రమధర్మాలను చెప్పడం ముగించాక సగరచక్రవర్తి—

''మహాత్మా! పురుషులు ఆచరింపదగిన విధులను తెలియ జెప్పండి'' అని కోరాడు.

సర్వజ్ఞుడైన భృగుశ్రేష్ఠుడు సమగ్రంగా విశదీకరించి చెప్పాడు:

ఆశ్రమస్థులకు నియతవిధులు

''మానవులు ఆచరింపదగిన విధులు నిత్యం, నైమిత్తికం, కామ్యం అని ప్రధానంగా మూడు విధాలు.

పురుషులు తమకు పుత్రసంతానం కలుగగానే జాతకర్మాది క్రియలను, బిడ్డ అభ్యుదయం కోసం నాందీముఖం మొదలుగా గల శ్రాద్ధవిధులనూ ఆచరించాలి.

కొడుకు పుట్టిన రోజున ఇద్దరు బ్రాహ్మణులను ఆహ్వానించి, వారిని తూర్పుకు అభిముఖంగా సుఖాసనాలపై కూర్చొనబెట్టి భోజ నాదికం సమర్పించాలి. తన శక్తికొలది దేవతలకు, పితృదేవతలకు, భూసురులకు యథోచితదానాలు చేయాలి.

ఆరోజు వృద్ధిశ్రాద్ధం కూడా నిర్వహించాలి. హోమాంతంలో యవధాన్యాలు, పెరుగు, బియ్యపు పొట్టు కలిపి చేసిన పిండాలను దైవతీర్థం (చేతివ్రేళ్ల కొసలు), ప్రాజాపత్య (చిటికెనవ్రేలి మొదలు) తీర్థాలతో స్పృశించి, తీర్థోదకాలతో కలిపి నాందీముఖు లని పేరుగల పితృదేవతలకు సమర్పించాలి. వారికి సర్వోపచారా లతో ప్రదక్షిణ నమస్కారాలు చేయాలి.

పుత్రోదయం జరిగిన పదిరోజుల తర్వాత పదకొండవ రోజున నామకరణోత్సవం జరుగుతుంది.

నామకరణం ఒక సంస్కారం. వంశాచారాన్ని అనుసరించి తమ కులదైవతాల పేర్లను, పితృపితామహులు, విద్యాగురువుల పేర్లను జ్ఞాపకం చేసికొని తగిన పేరు పెట్టాలి.

బ్రాహ్మణుల సంతానానికి నామధేయాంతంలో శర్మ అని, క్షత్రియులకు పేరుచివర వర్మ, వైశ్యులకు గుప్త, శూద్రులకు దాస శబ్దాలను నిలపాలి.

శిశువు నామధేయం అభిరామమనోహరంగా ఉండాలి. అర్థం లేని పేర్లు, అపశబ్దాలు, అప్రశస్తపదాలు, అమంగళకరమై జుగుప్సావహంగా ఉండే పేర్లు పెట్టకూడదు.

మగపిల్లల పేర్లు సమాక్షరాన్వితంగా ఉండాలి. అతి దీర్ఘ నామాలు, మరీ కురచగా ఉండే పేర్లు బాగుండవు.

పేరులో గుర్వక్షరాలు ఎక్కువగా ఉండకూడదు. సులువుగా ఉచ్చరించడానికి వీలుగా అసంయుక్తాక్షరాలను, మధురస్వరాలను ఎన్నుకోవాలి.

పురుషులు తమ సంతానానికి యథోచితకాలాలలో విహితమైన కర్మలను తమతమ వర్ణధర్మాలకు అనుగుణంగా నిర్వహించాలి. అన్నప్రాశనం, కేశసంస్కారం జరిపించాలి. పుత్రునికి బ్రహ్మోపదేశం చేయించి వేదోక్తప్రకారం యజ్ఞోపవీతాన్ని ధరింపజేసి చదువు కోసం సద్గురువు ఇంటికి పంపించాలి.

బ్రహ్మచారి గురువు సన్నిధిలో విద్యాభ్యాసం ముగించుకొని గురుదక్షిణ నిచ్చి ఆయన అనుమతిని పొందాక గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలి.

అన్ని ఆశ్రమధర్మాలకూ గృహస్థాశ్రమమే ముఖ్యాశ్రయం. అందువల్ల గృహస్థులు కాగోరినవారు కన్యకావరణంలో జాగ

రూపులై ఉండాలి. తన జీవితాన్ని దేదీప్యమానంగా వెలిగించి ధర్మార్థకామాలను మోక్షాభిముఖంగా నడిపింపగల ఉత్తమురాలిని చేపట్టాలి.

కన్యకా లక్షణాలు

ధర్మాచరణం కావింపదలచిన పురుషుడు తన వయస్సులో మూడవ వంతు మాత్రమే కలిగిన ఉత్తమ కన్యను వివాహం చేసుకోవాలి. ఉభయకుటుంబాల ఆచారసంప్రదాయాలూ పరస్పరం అవిరుద్ధంగా, ఆమె తన అభిరుచులకు తగినట్లుగా ఉండాలి.

పురుషుడు వధువు రూపాన్ని సూక్ష్మంగా పరిశీలించాలి. కేశాలు అతిమాత్రంగా పెరిగినా, జుట్టు రాలిపోయి కేశవిహీనంగా భాసించినా వివాహానికి అంగీకరింపకూడదు.

మిక్కిలి నల్లగానూ, పసుపువన్నె లోనూ ఉన్న కన్యను ఒప్పుకోకూడదు. పుట్టుకతోనే వికలాంగి, అధికాంగి అయితే పెండ్లికి సమ్మతింపకూడదు.

అశుభ్రం, తరచు అనారోగ్యం, దీర్ఘరోగాలు, అసత్కులీనత కలవారితో సంబంధాన్ని తిరస్కరించాలి.

చెడునడతలను కప్పిపుచ్చిన దుష్టాత్మురాలు, జారిణి, దుర్భాష లాడేది, తల్లిదండ్రుల నుంచి వ్యాధులు సంక్రమించిన రోగిణి, గడ్డమూ మీసమూ పెరిగినామె, మగలక్షణాలు కలది పరిణయానికి తగరు.

ఘుర్ఘురస్వరం, హీనస్వరం, కాకిగొంతు కలవారిని వివాహం చేసుకోకూడదు.

కనురెప్పలు బరువుగా మూతపడిన అనిబద్ధేక్షణ, కన్నులు వృత్తాకారంలో అమరినది స్వీకారయోగ్యలు కారు.

పిక్కలు, చీలమండల పైన రోమాలు కలదానిని, నవ్వినపుడు బుగ్గలు సొట్టపడేదానిని ప్రాజ్ఞులు అంగీకరింపరు.

కరకు చర్మం, తెల్లని గోళ్లు, ఎర్రబారిన కళ్లు, బలిసిన కరచరణాలు కల కన్యతో పాణిగ్రహణం చేయకూడదు.

కన్య వరుని సమక్షంలో మరీ పొట్టిగా ఉన్నా, మరీ దీర్ఘకాయగా కనిపించినా పెండ్లికి తగదు.

కనుబొమలు కలిసిపోయినామె, గొగ్గిపళ్లు, భయపెట్టే ముఖకవళికలూ కల కన్యలు అపరిగ్రాహ్యాలు.

వరుడు ఈ లక్షణాలను సూక్ష్మంగా పరిశీలించాలి. తల్లివంక అయిదు తరాలను, తండ్రివైపు ఏడు తరాలను పరీక్షించి, తన కుల గోత్రాలకు అనువైన పద్ధతిలో వివాహం చేసుకొంటే మంచిది.

వివాహాలు ఎనిమిది విధాలు: బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం.

ఈ అష్టవిధవివాహాలలో తమ వర్ణధర్మాలకు తగిన సద్వివాహం చేసికొని ధర్మపత్నీసమేతంగా గృహస్థవిధులను ఆచరించిన మహాత్ములకు సత్కళత్రావాప్తి వలన ఉత్తమ ఫలసిద్ధి చేకూరుతుంది.

వివాహం చేసికొని సంసారబంధాలలో చిక్కుకొనడం ఇష్టం లేనివారు యావజ్జీవం బ్రహ్మచర్యవ్రతాన్ని అనుష్ఠించాలని సంకల్పించినట్లయితే వారు గురువు వద్దనే విద్యాభ్యాసం చేస్తూ కాలం గడపాలి. గురువుకు, ఆయన సంతతికి శుశ్రూషలు చేస్తూ జ్ఞానసారాన్ని గుర్తెరగాలి.

ఈ విధంగా బ్రహ్మచర్యవ్రతాన్ని చేపట్టినవారు శ్రీమహావిష్ణువు భక్తులై, పరివ్రాజకులై, భాగవతోత్తములై సర్వోన్నత ధామాన్ని పొందుతారు.''

ఆ తర్వాత సగరచక్రవర్తి—''గృహస్థులు పాటింపదగిన సదాచారాలను వివరించండి''—అని కోరాడు.

ఔర్వమహర్షి గృహస్థులు ఆచరింపదగిన సదాచారాలను, నిత్యకృత్యాలను వివరించాడు.

గృహస్థ ధర్మాలు

''సత్ — శబ్దానికి సాధువు అని అర్థం. సాధువుల ఆచారమే సదాచారం.

పూర్వం స్వాయంభువాది మనువులు, ప్రజాపతులు, సప్త మహర్షులు ఈ సదాచారాలను కల్పించి మానవకోటికి ఉపదేశించారు.

గృహస్థులు ప్రతినిత్యం సూర్యోదయానికి పూర్వమే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేచి ప్రశాంతచిత్తంతో ధర్మార్థాలను, వాటికి అనుకూలమైన ఇతరవిషయాలను ఆలోచించాలి. ధర్మార్థాలకు అవిరుద్ధమైన కామనలను, వాటి సాధనోపాయాలను స్మరించాలి. అర్థకామాలు ధర్మవిరుద్ధంగా కనబడినా, లోకులకు సమ్మతం కాని అధర్మాలోచనలు కలిగినా, వెంటనే సరిదిద్దుకోవాలి.

అనంతరం ప్రక్కమీాది నుంచి లేచి ఇంద్రియవృద్ధి నిమ్మని సూర్యభగవానునికి నమస్కరించాలి. గ్రామానికి నైరృతిదిశలో శరవిక్షేపభూమి కంటె దూరంగా జనసంచారం లేనిచోటికి వెళ్లి, తలకు గుడ్డచుట్టుకొని, గడ్డిపరచిన నేలపై పగటివేళ ఉత్తరాభిముఖం గాను, రాత్రివేళ దక్షిణాభిముఖం గాను కూర్చొని మూత్రపురీషాలను విసర్జించాలి. కాళ్లు కడుక్కొన్నాక, నోరు పుక్కిలించి ఉమ్మివేశాక నీరు ఇంటిలోనికి రాకుండా గృహాంగణానికి వెలుపలగా పారే ఏర్పాటు చెయ్యాలి.

ధర్మనిరతులైన గృహస్థులు తన నీడపైన, చెట్లనీడలు పడు తున్న చోట్ల, గోవులు, అగ్ని, సూర్యుడు, వాయువు, గురువు, బ్రహ్మజ్ఞులకు అభిముఖంగాను మేహనం విడువకూడదు.

పైరుపొలాలలో, ఆవుల మందల్లో, జనమధ్యంలో, మార్గ మధ్యంలో, నదులలో, ప్రవాహతీరాలలో మూత్రోత్సర్జనం తగదు. శ్మశానప్రాంతంలో కూడా నిషిద్ధం. ఈ కాలకృత్యాలను మౌనంగా కూర్చొని వడివడిగా ముగించుకోవాలి.

ఆ తరువాత మృత్తికాశౌచం ఆచరించాలి. అందుకు పుట్ట మన్ను, ఎలుకలు తవ్విన మన్ను, తడిమన్ను, మరొకరు శౌచానికి వాడిన మన్ను, ఇంటిగోడలకు అలదిన మన్ను, పురుగులు చేరినది, నాగేటి చాలు వెంబడి నేలనుంచి పైకి లేచిన మన్ను పరిహరించాలి. ఇవి శౌచకర్మలకు తగవు.

గుప్పెడు మంటితో పురుషాంగాన్ని, మూడు గుప్పిళ్ల మన్ను తీసికొని గుదస్థానాన్ని శుభ్రం చేసుకోవాలి. పది గుప్పిళ్ల మృత్తి కను ఎడమ చేతికి, ఏడు గుప్పిళ్లు కుడిచేతికి శౌచార్థం ఉపయో గించాలి.

నురుగు, వాసన, బుడగలు, లేని పరిశుభ్రజలంతో నోటిని పుక్కిలించి, కాళ్లూ చేతులూ కడుక్కోవాలి. కేశవాది నామాలను స్మరించి, గోకర్ణహస్తాన్ని పట్టి మినుపగింజ మునిగేంత పరిమాణం గల నీళ్లను చేతిలోకి తీసుకొని మూడుసార్లు త్రాగాలి. రెండుసార్లు ముఖప్రక్షాళనం చేసుకోవాలి. శిరస్సు, లలాటం, చెవులు, కన్నులు, ముఖం, కంఠం, బాహువులు, ఉదరం, నాభి, హృదయస్థానాలను స్పృశించాలి.

ఆచమనానంతరం గృహస్థు[illegible] స్నానంచేసి, శుభ్రంగా తల దువ్వుకొని అద్దం ముందు నిలబడి [illegible]ధన విధానం ముగించాలి.

గృహస్థుడు తన వర్ణధర్మాలు, కులవృత్తులకు అనుగుణంగా కష్టపడి పనిచేసి ధనార్జన చేయాలి. న్యాయసమ్మతంగా ఆర్జించిన ఆ ధనంతో సోమం, హవిస్సు, పాకం — మొదలైన యజ్ఞాలు చేసి దైవతాలను సంతోషపెట్టాలి.

స్నానానికి ప్రవాహజలం శ్రేష్ఠంగా ఉంటుంది. ప్రతినిత్యం నదీనదాలు, చెరువులు, మడుగులు, కొండల దగ్గర సహజంగా ఏర్పడిన నీటిబుగ్గలు, జలపాతాల శుభ్రజలాలతో స్నానం చేయాలి.

వాతావరణం బాగులేనప్పుడు, ప్రవాహజలాల చెంతకు వెళ్ల డానికి వీలులేనప్పుడు ఇంటివద్దనే బావిదగ్గర పొడినేలపై నిల బడి స్నానం చేయాలి. అనారోగ్యం వలన స్నానం చేయటానికి వీలులేకపోతే, తత్కాలోచితమంత్రాలను మాత్రం జపించి మంత్ర స్నానం ఆచరించాలి.

అనంతరం శుచివస్త్రాలు కట్టుకొని తీర్థోదకాలను గైకొని దేవ తీర్థం, ఋషితీర్థం, పితృతీర్థాలతో దేవతలు, ఋషులు, పితృదేవత లకు తర్పణలు విడవాలి.

దేవతలు, ఋషులకు మూడేసి పర్యాయాలు, ప్రజాపతికి ఒక్కసారి, పితృదేవతలకు మూడుసార్లు తర్పణలు విడవాలి.

ప్రతిదినం ఉభయవంశాల పితృదేవతలకు తర్పణలు విడిచి వారికి సద్గతులను కలిగించాలి. తన పితామహునికి, ప్రపితామహు నికి, మాతామహునికి, ఆయన తండ్రి తాతలకు, పితరులకు, మాతా మహికి, ఆమె తల్లికి తర్పణలు విడవాలి.

ఆచార్యదంపతులను, మేనమామలను, ఇతరబంధువులను, తనకు ప్రియమిత్రులను, భూమిపతిని తలచుకొని శ్రద్ధాంజలి సమర్పించాలి.

ఆ తర్వాత భూతతృప్తికై తర్పణలు విడిచి సర్వులకూ నమస్కరించాలి.

"నేను సమర్పిస్తున్న ఈ ఉదకాల వలన దేవతలు, అసురులు, యక్షులు, సర్పజాతులు, గంధర్వులు, రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు, సిద్ధులు, కూష్మాండాలు, వృక్షాలు, పక్షులు, జలచరాలు, భూచరాలు, సర్వజంతువులు, చరాచరాలు తృప్తిని పొందుతారు గాక!

"ఘోరమైన నరకాలలో పడి యాతనలను అనుభవిస్తున్న వారికి ఈ ఉదకాలు ఆప్యాయనాన్ని పొందించి బాధా నివృత్తిని కలుగజేస్తాయి గాక!

"నా బంధువులు, అబంధువులు, పూర్వజన్మలలోని బంధువులు అందరూ ఈ జలాంజలిని స్వీకరించి తృప్తులౌతారు గాక!

"ఈ తిలోదకాలు ఎక్కడెక్కడున్నవారి ఆకలిదప్పులను, పరితాపాలను హరించి అమృతాయన మగుగాక!"

అని చదువుతూ కామ్యోదకాలను సమర్పించిన మనుష్యుడు సర్వజగత్తులకూ సంతోషకారకుడు.

ఈ విధంగా గృహస్థులు తమ పూర్వీకులకు భక్తిశ్రద్ధలతో సమర్పించిన ఆప్యాయనాల వల్ల అనంత పుణ్యఫలం కలిగి బహుజన్మలలో ఆర్జించిన పాపభారం నుంచి విముక్తిని పొందుతారు.

ఆచమనానంతరం గృహస్థులు శ్రీసూర్యనారాయణుని ఉపాసించి, "శ్రీమన్నారాయణుని తేజస్సుతో భాసిల్లుతున్న బ్రహ్మస్వరూపునికి, వివస్వంతుడై జగత్తులకు వెలుగును ప్రసాదిస్తున్న కర్మసాక్షికి—అభివందనం" అని జపించి అర్ఘ్యాలను సమర్పించాలి.

సంధ్యాసమర్చలను ముగించుకొని ఇంటికి తిరిగివచ్చి గృహార్చనవిధులను నిర్వర్తించాలి. ఇష్టదేవతాలను పూ వారికి ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీ వస్త్రం, యజ్ఞోపవీతం, గంధపుష్పాక్షతలు,

తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం—ఇత్యాదులైన షోడశోప చారాలను నివేదించాలి.

అప్పుడు అగ్నిహోత్రాన్ని వెలిగించాలి. ప్రజాపతికి ఆహుతులను వేల్చి, ఇలువేల్పులకు, కశ్యపప్రజాపతికి, అనుమతికి సమర్పించాలి. శేషాన్ని భూమికి, ఉదకాలకు, పర్జన్యునికి ఉంచాలి. ద్వారంలో ధాతృవిధాతృలకు, వారి మధ్య బ్రహ్మకు అర్పించాలి. ఆ తర్వాత దిక్పాలకులను ప్రసన్నం చేసుకోవాలి. పూర్వాది దిశలలో ఇంద్ర-యమ-వరుణ-సోములకు హుతశేషమైన బల్యంశాన్ని నిలపాలి. ప్రాగుత్తరాల నడుమ ఈశాన్య దిగ్భాగంలో ధన్వంతరికి బలిని ఉంచాలి.

ఈ విధంగా గృహార్చనాన్ని పూర్తిచేసి వైశ్వదేవానికి ఉపక్రమించాలి. తర్వాత వాయవ్యదిశలో వాయువుకు, అనంతరం సమస్తదిక్కులకు, బ్రహ్మకు, అంతరిక్షానికి, సూర్యనారాయణునికి బలి అన్నాన్ని ఉంచాలి. విశ్వేదేవతలకు, సకలభూతాలకు, పితృదేవతలకు, యక్షులకు బలి సమర్పించాలి.

ఆ తరువాత వేరే అన్నాన్ని తీసుకొని శుచిర్భూతమైన భూభాగం పైన నిశ్శేషభూతజాతానికీ బలి అర్పించాలి.

"నేను సమర్పిస్తున్న ఈ అన్నాన్ని దేవతలు, మనుష్యులు, పశువులు, పక్షిమృగాలు, సిద్ధులు, యక్షులు, సర్పజాతులు, రాక్షసులు, ప్రేతపిశాచాలు, వృక్షాలూ—అందరూ స్వీకరిస్తారు గాక!

"పిపీలికాలు, క్రిమికీటకాలు, కర్మబంధాలకు కట్టుపడిన జీవులందరూ నాచే సమర్పితమైన ఈ అన్నాన్ని భుజించి సంతృప్తస్వాంత[illegible]ాలను పొందుతారు గాక!

[illegible]ంలో ఏ భాగ్యహీనులు తల్లి, తండ్రి, బంధు[illegible] లేక తినడానికి అన్నోదకాలు లభించక కట

కట లాడుతున్నారో, వారందరికీ నాచే సుప్రదత్తమైన ఈ అన్నం సంతృప్తిని, సంతోషాన్ని కలుగజేస్తుంది గాక!

"ఈ పంచభూతాలు, భూతజాతాలు, ఈ అన్నం—ఇవన్నీ శ్రీమహావిష్ణువు స్వరూపాలు. అందుచేత నేను సమర్పించిన ఈ అన్నమే భూతనికాయానికి ఆధారభూతమైన ఆహారంగా పరిణమించి, సర్వులకూ ఏకరీతిని సంతోషాన్ని కలిగిస్తుంది గాక!

"చతుర్దశ భూతగణాలలో ఉనికిని పొందిన సకలభూతాలూ వారికోసం తెచ్చి ఉంచిన ఈ అన్నాన్ని భుజించి మోదాన్ని చెందుతారు గాక!"

అని కాలోచితమంత్రాలను ఉచ్చరించి గృహస్థులు బలి కృతాలను మిక్కిలి శ్రద్ధతో సమర్పించాలి.

కొడుకులు లేక పిండోదకాలను కోల్పోయిన అగతికులకు, పతితులకు తర్పణాలు విడిచి అన్నాన్ని భూతహితార్థం నేలపై ఉంచాలి. దానిని కుక్కలు, పక్షులు, చండాలాది మనుష్యులు తింటే భూతతృప్తి కలుగుతుంది.

అనంతరం గృహస్థుడు ఘటికలో చతుర్థాంశమైన గోదోహ మాత్రకాలం, లేదా అంతకన్నా కొంచెం ఎక్కువసేపు ఇంటిముందు నిలబడి అతిథిపరిగ్రహణార్థం ఎదురుచూడాలి. అతిథి రాగానే ఎదురేగి, స్వాగతం పలికి ఇంటిలోనికి సగౌరవంగా తీసికొనివెళ్లి సుఖోపవిష్టుని గావించి కాళ్లుకడిగి భక్తిపూర్వకంగా ఆదరించాలి. ఆయన ఆచమనాదికం ముగించుకోగానే శ్రద్ధతో వండిన రుచికరమైన పదార్థాలను వడ్డించి కడుపునిండా పెట్టాలి. అతిథిని ఆప్యాయంగా పలకరించి, కుశలప్రశ్న లడిగి, ఆయన అడిగిన ప్రశ్నలకు ప్రీతికరంగా జవాబు చెప్పాలి. భోజనం చేసి అతిథి వెళ్లిపోయేటప్పుడు ప్రేమాదరాలతో మాట్లాడి సగౌరవంగా వీడ్కోలు నివ్వాలి.

ఒక్కొక్కప్పుడు అపరిచితవ్యక్తులు దేశసంచారం చేస్తూ మార్గమధ్యంలో తన గ్రామానికి వస్తారు. వారి ఊరూ పేరూ, గుణశీలాలు, కులగోత్రాదికం తెలియకపోయినా గృహస్థులు యథావిధిగానే అతిథిపూజలు చేసి, అన్నదానాదులతో వారికి ప్రీతిని కలిగించాలి. అతిథిపూజతో శ్రీమహావిష్ణువును పూజిస్తున్నట్లే భావించి ఏ కొంచెమూ తక్కువ చేయకుండా తమకు ఉన్నంతలో సత్కరించి పంపాలి.

ఇంటిముందు అన్నార్తుడైన అతిథి ఆకలితో దహించుకొని పోతూ ఉంటే తన కేమీ పట్టనట్లు చూస్తూ ఊరుకొన్న గృహస్థుడు అంతంలో నరకానికి వెళ్లి యాతనలను అనుభవిస్తాడు.

అతిథులు భుజించిన తర్వాత ఇంటిలోని స్త్రీ బాలవృద్ధులందరికీ వడ్డింపజేసి, వారు తృప్తిగా తిని లేచాక తాను కూడా భోజనానికి కూర్చోవాలి. వీరందరూ ఆకలితో వేచి ఉండగా అలక్ష్యం చేసి ముందుగా భుజించిన గృహస్థులకు పాపం వాటిల్లి నరకంలో శ్లేష్మభుక్కు లవుతారు.

స్నానం చేయకుండా అన్నం తిన్నవారు అశౌచదోషానికి పాల్పడి అధోలోకాలలో మలభోజన శిక్షకు గురి అవుతారు.

సంధ్యావందనం మాని యథేచ్ఛగా భోజనం చేసినవారు అనాచారదోషం వలన నరకానికి వెళ్లి చీమూ నెత్తురూ తింటారు.

అసంస్కృతాన్నాన్ని తిన్నవారికి మూత్రాశనం, పిల్లలకు పెట్టకుండా భుజించిన కఠినాత్ములకు దుర్గంధ భూయిష్ఠమైన పురీష భోజనం, అగ్నిహోత్రవిధులను లెక్కచేయనివారికి క్రిమికీటకాల కుత్సితాన్నం, అన్నదానం చేయనివారికి విషాన్నం నరకశిక్షలని తెలుసుకోవాలి.

ఏయే కర్మల వల్ల ఎటువంటి గుణదోషాలు కలుగుతాయో తెలుసుకొని, దుష్కర్మలను పరిహరించి సత్కర్మలను ఆచరించిన

ధర్మనిరతులకు పాపబంధాలు కలుగవు. సాటిలేని ఆరోగ్యం, అశేష బలవృద్ధి, బహుకాల దోషశాంతి కలుగుతాయి.

స్నానం చేసిన వెంటనే దేవతలు, మహర్షులు, పితృదేవతలకు తర్పణాలు విడవాలి. జపాదికం పూర్తిచేసి, హోమార్చనవిధులను నిర్వర్తించి, అతిథులు బ్రాహ్మణులు ఆచార్యులు తన కుటుంబ సభ్యులు, అందరూ తిన్నాక, ధవళవస్త్రయుగ్మం, గంధమాల్యాక్షతలు, కుడిచేతికి ప్రశస్తమైన రత్నాభరణం ధరించి, సంతోషంగా భోజనానికి కూర్చోవాలి. భోజనసమయంలో గృహమేధి ఏక వస్త్రాన్ని ధరించకూడదు. కూర్చొనేటప్పుడు కాళ్లూచేతులూ తడి లేకుండా శుభ్రంగా తుడుచుకోవాలి. ప్రోక్షణోదకాలు చిలకరించి శుచిగా వండిన ప్రశస్తమైన అన్నాన్ని తూర్పు లేదా ఉత్తరాభిముఖంగా కూర్చొని, విశుద్ధవదనంతో ప్రీతిపూర్వకంగా భుజించాలి. క్రోధావేశాలను కలిగించే సంభాషణలను పరిహరించి, నిండు మనస్సుతో నెమ్మది నెమ్మదిగా రసాస్వాదన చేస్తూ, మౌనంగా భుజించాలి.

భోజనసమయంలో వంటకాలను పరిశుభ్రమైన గిన్నెలలో అన్నప్రీతికరంగా వడ్డించాలి. ఫలమాంసాదులు తప్ప చల్లబారిన అన్నాన్ని, అపక్వాన్నాన్ని, ఎండిపోయిన కాయగూరలను తినకూడదు. ఆ పూటకు తినగలిగినంత మాత్రమే వడ్డించుకోవాలి. పదార్థాలను వృథాగా పారవేయకూడదు. భోజనానికి చాలినంతగా కాక ఊరికే వినోదార్థమై కొట్టితెచ్చిన వృథామాంసాలను వర్జించాలి. దేవతలకు సమర్పింపగా మిగిలిన అర్చావశిష్టాన్ని మాత్రమే స్వీకరించాలి. సారం పిండివేసిన నీరసపదార్థాలు ఆస్వాదయోగ్యంగా ఉండవు. అకాలభోజనమూ, నిలబడి చేసే భోజనమూ నిషిద్ధాలు.

అన్నపు ముద్దలను అగ్నిలో పడవేయడం, తెట్టుగట్టిన పై అన్నాన్ని పారవేయడం పాపహేతువులు.

అన్నం వలన బలారోగ్యాలు, వీర్యవృద్ధి కలుగుతాయి. అందువల్ల అన్నం ఎప్పుడూ శుచిగా, రుచిగా ఉండాలి. భోజన ప్రారంభంలో మధురరసాలను, మృదుభక్ష్యాలనూ తినాలి. అనంతరం రుచికరంగా వండిన లవణామ్లాలను, కారపు కూరలను, తిక్తపదార్థాలను భుజించాలి. చివరిగా ద్రవపదార్థాలతో భోజనం ముగించాలి.

ఈ విధంగా పంచప్రాణాహుతిపూర్వకంగా భోజనం చేసి, తూర్పు లేదా ఉత్తరాభిముఖంగా తిరిగి శుద్ధజలాలతో ముఖప్రక్షాళనం కావించాలి. ఉచ్ఛిష్టనివారణార్థం నోరు పుక్కిలించి శుభ్రం చేసుకోవాలి. పాదాలను, మణికట్టు దాకా చేతులను కడుగుకోనాలి.

అనంతరం సుఖాసనం పైన ప్రశాంతంగా ఉపవిష్టులై నారాయణస్మరణపూర్వకంగా ఇష్టదేవతలను తలచుకోవాలి.

''నేను భుజించిన ఈ అన్నం వాయుప్రేరితమైన వహ్ని చేత భక్షింపబడి నాకు తృప్తిని కలిగిస్తుంది గాక!

''సుఖజీర్ణమైన అన్నం పంచభూతాత్మకమైన నా శరీరధర్మ పరిణామానికి తోడ్పడి నాకు అవ్యాహత సుఖానుభవాన్ని కలిగిస్తుంది గాక!

''సుఖజీర్ణమైన అన్నం—ప్రాణం, అపానం, ఉదానం, సమానం, వ్యానం అనే అయిదు విధాల వాయువులుగా పరిణతిని చెంది, నాకు అవ్యాహతసుఖానుభవాన్ని చేకూరుస్తుంది గాక!

''అగ్ని, అగస్త్యుడు, బడబానలం — నేను భుజించిన అన్నాన్ని జీర్ణింపజేసి, తత్పరిణామం వల్ల సంభవించే సుఖానుభవాన్ని, రోగాలు లేని బలమైన శరీరాన్ని నాకు ప్రసాదిస్తారుగాక!

"ఇంద్రియాలతో కూడిన దేహా లన్నింటిలోనూ దేహియై నిలిచి ప్రధానభూతు డైన శ్రీమహావిష్ణువు, ఆయననే నమ్ముకొన్న నాకు ఎల్లవేళలా ఆరోగ్యాన్ని సమకూర్చాలి గాక!

"విష్ణువే అన్నభోక్త; విష్ణువే అన్నం; విష్ణువే అన్న పరిణామం—అని నేను భుజించిన ఈ అన్నం సుఖంగా జీర్ణమౌతుంది గాక!"

అని భక్తిపూర్వకంగా పలికి, జీర్ణక్రియార్థం కడుపుమీద చేతులతో గట్టిగా రుద్దుకోనాలి.

ఆ తర్వాత కార్యకారిత్వంలో ఏమరుపాటు, కునికిపాట్లు లేకుండా అనాయాసకరంగా జీవనోపాయకర్మలను నిర్వర్తించుకోవాలి. మనస్సు అపమార్గాలు తొక్కకుండా వేదశాస్త్రప్రసంగాలతో కాలం గడపాలి.

గృహస్థులు తప్పనిసరిగా ఉభయసంధ్యలనూ సకాలంలో నిర్వర్తించాలి. సూర్యోదయానికి పూర్వం ఇంకా నక్షత్రాలు మినుకుమినుకు మంటుండగానే ప్రాతస్సంధ్యను, సూర్యాస్తమయానికి ముందుగా అపరసంధ్యా విధులనూ ముగించుకోవాలి. ఇంట్లో సూతకం, అశౌచం, అనారోగ్యం వంటివి కలిగినప్పుడు తప్ప సర్వకాల సర్వావస్థల లోనూ సంధ్యావందనం చేసితీరాలి. సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి, సూర్యుడు అస్తమించిన తర్వాత నిద్రకు ఉపక్రమించాలి. ఈ వ్యవస్థను అతిక్రమించిన దురాత్ములు సూర్యభగవానుని అగౌరవించిన పాపానికి తామిస్రనరకంలో పడి యుక్తశిక్షలను అనుభవిస్తారు.

సాయంకాలం కాగానే గృహస్థురాలు ... వాప్తి
నిమిత్తమై పంచమకులజులకు, తక్కిన దుః ...
తంగా అన్నదానం ... గృహ ...

అతిథిని తన శక్తిమేరకు పూజించి, ఆయన భోజనం చేశాక సుఖనిద్రకు తగిన వసతులను సమకూర్చాలి. ఇంటిలో పర్యంకాలు లేకపోతే కనీసం అధశ్శయ్యనైనా ఏర్పాటు చేయాలి.

రాత్రిసమయంలో వచ్చిన అతిథిని సత్కరిస్తే దేవతలు సంతుష్టిని చెందుతారు. రాత్రివేళ వచ్చిన అతిథికి ఆశాభంగం కలిగిస్తే గృహస్థునికి పగటివేళ కంటె ఎనిమిదింతలు అధికపాపం కలుగుతుంది.

రాత్రి భోజనానంతరం పాదప్రక్షాళనాదికం పూర్తిచేసుకొని గృహస్థుడు శయనగృహం చేరాలి.

సుఖనిద్రను కోరినవారి పర్యంకం దారునిర్మితమై అస్ఫుటితంగా ఉండాలి. పగుళ్లు లేక సమనిమ్నోన్నతంగా ఉన్న సువిశాలమైన శయ్యపై మెత్తని పరుపువేసుకొని, తూర్పువైపు తలగడగా నిద్రించడం ప్రశస్తం. ప్రాఙ్ముఖంగా వీలులేనివారు దక్షిణదిశకు తిరిగి శయనించాలి. ఇందుకు విపరీతంగా పశ్చిమోత్తరాలలో పడుకొనడం రోగహేతువు.

గృహస్థులు సంతానార్థం తృతీయపురుషార్థాన్ని అభిలషించాలి. శయనవేళకు చక్కగా స్నానంచేసి, సుగంధ ద్రవ్యాలను, పుష్పమాలలను యథోచితంగా అలంకరించుకొని ప్రసన్నచిత్తులై పరస్పరానురాగభావంతో శయనమందిరాన్ని ప్రవేశించాలి. ప్రియాలాపాలతో, మృదుసల్లాపాలతో ఒకరి నొకరు సుముఖీకరించుకొని నిపుణంగా రతికేళి జరపాలి.

పున్నామనక్షత్రా లయిన అశ్విని, కృత్తిక, రోహిణి, పునర్వసు, పుష [illegible] హస్త, అనూరాధ, శ్రవణం, పూర్వాభాద్ర, ఉత్తర [illegible] కాలాల లోను, జ్యేష్ఠాయుగ్మాదులు ఘటిల్లి న [illegible] ంలో ధర్మపత్నీసమాగమం సుఖాపాదక

గృహస్థధర్మాశ్రితులు [illegible] తో సురతభోగాలను ఆశింపకూడదు. ఎంత పుష్ప[illegible]యినా స్నానం చేయని అశుచి, రోగగ్రస్తురాలు, రజస్వలాస్త్రీలకు దూరంగా ఉండాలి.

గర్భిణి, ప్రసవవేదన నుంచి ఇంకా కోలుకోనని పచ్చి బాలింతరాలు, క్షుద్బాధతో సొమ్మసిల్లినది, అతిగా భుజించి భుక్తాయాసంతో రొప్పుతున్నది, తనయందు మన్మథభావోదయం కానిది, అన్యపురుషుని కామించినది, బహుపురుషపరిచయం కలది, అతికాముకురాలు, అసలు కామప్రేరణలు లేనిది, రతికార్యానికి విముఖురాలు, ప్రకుపితాంగన – రతిస్థాయికమైన ఉత్తమశృంగారానికి తగరు.

చతుర్దశి, అష్టమి, అమావాస్య, పౌర్ణమాసి, రవిసంక్రమణ దినాలలో రతికేళి నిషిద్ధం. ఏతత్సమయంలో గృహస్థులు ఐహిక సుఖభోగాల నుంచి మనస్సును ఉత్తమధర్మాలవైపు మళ్లించి విష్ణుధ్యానంతో కాలం గడపాలి. ఈ నియమాన్ని అతిక్రమించిన కలుషచిత్తులకు విణ్మూత్రభోజన మహానరకం విధింపబడింది.

గృహస్థులు తమ దేహారోగ్యానికి అనురూపంగా కామతంత్రాలను వ్యవస్థీకరించుకోవాలి. అంతేకాని అతిమాత్రంగా కామలోలురై, వీర్యవృద్ధి కోసం ఔషధాలను వినియోగించడం మంచిది కాదు.

ఉత్తమవంశంలో జన్మించిన ధర్మశీలురు అనుచిత ప్రదేశాలలో శృంగారక్రీడలు జరుపకూడదు. యజ్ఞశాల, ఇంటిలో అగ్నిహోత్రాన్ని వెలిగించడానికి శుద్ధిచేసిన ప్రదేశం, గృహప్రాంగణం, పశువులను కట్టివేసిన చోటు, పుణ్యతీర్థం, పుణ్యక్షేత్రం, పౌరచతుష్పథం, శ్మశానస్థలం—రతికార్యానికి తగవు. జలక్రీడా సమయంలో నీళ్లలో సంభోగించడం ప్రశస్తం కాదు. పర్వదినాలు, సంధ్యాసమయాలలో దంపతులు కలియకూడదు. దివామైథునం

పాపదాయకం. అయి   సతీపతులు సంయమాన్ని అలవరచుకొని దాంపత్య   ధర్మసమ్మతంగా తీర్చిదిద్దుకోవాలి.

శీలవ్యతిక్రమం వలన మానవులు వర్ణాశ్రమధర్మాలను పాటించి బహుజన్మలుగా ఆర్జించుకొన్న పుణ్యఫలమంతా నిష్ప్రయోజన మైపోతుంది. క్షణికమైన కామోద్రేకానికి లోనై పారదారిక రతులకు పాల్పడినవారు రాక్షసులతో సమానులు. హేయాతిహేయమైన పరవనితాసంభోగం అధర్మకృత్యమే కాదు—ఘోరనరకదాయకమూ, ఇహపరవిచ్ఛేదకమూ అని గ్రహించి, సాధువర్తనులు అన్యకాంతలను గురించిన పాపచింతనలను స్వప్నంలో కూడా రానీయకూడదు. ఆర్య సమ్మతంగా వివాహం చేసికొన్న స్వీయధర్మపత్నిని ఋతుకాలంలో కలిసి, లోకహితకారకులైన ఉత్తములను సంతానంగా పొంది ధన్యతను చెందాలి.''

అని వివరించి, ఔర్వమహర్షి సగరచక్రవర్తితో ఇంకా ఇలా అన్నాడు:

''సదాచారవర్తనులు ఉభయవేళలా సంధ్యాగ్నివిధులను నిర్వర్తించి, దేవతలను, గోబ్రాహ్మణులను, సిద్ధులను, పెద్దవారిని, ఆచార్యులను యథోక్తంగా పూజించాలి. అనుదినం స్నానం చేసి, ప్రశస్తంగా ఉతికి ఆరవేసిన అనుపహతవస్త్రాలను ధరించాలి. మంచి మాలికలను, సుగంధద్రవ్యాలను సౌందర్యసాధనలుగా వినియోగించి రూపధేయాన్ని, శరీరారోగ్యాన్ని కాపాడుకోవాలి. గరుడపచ్చలు, రత్నమాణిక్యాలు పొదిగిన స్వర్ణాభరణాలను చేయించుకొని తత్తదుచితసందర్భాలలో అలంకరించుకోవాలి. అభ్యంగస్నానాదులను ఆచరించి, తలదువ్వుకొని, ప్రస్నిగ్ధామలమై పరిమళభరితంగా విరాజిల్లుతున్న కేశపాశంలో అందమైన తెల్లని పువ్వు

లను అలంకరించుకొని ఉజ్జ్వలాకృతిలో జనాకర్షణీయంగా కనిపించాలి.

సజ్జనులు ఎన్నడూ పరుల సొమ్మును అపహరింప కూడదు. వినోదానికైనా అప్రియాన్ని పలుకకూడదు. ప్రియోదంతమే కదా అని అసత్యం చెప్పకూడదు. తనకు, లోకులకు ఎంత బాధాకరంగా తోచినా, పరుల దోషాలను పరోక్షంగా ఉన్నప్పుడు ప్రస్తావింప కూడదు. సంధిభేదనం, అన్యకర్మోపజీవనం, పరనిందాప్రవచనం విడిచిపెట్టాలి. అసద్వాహనాలను అధిరోహించకూడదు. ఏటి ఒడ్డున మట్టిదిబ్బల నీడలో విశ్రమింపకూడదు.

గృహస్థాశ్రమస్థులు సత్సంగాన్ని అలవరచుకొని భవ్య వర్తనులు కావాలి. తనను ద్వేషించేవారిని, చెడునడతలకు అలవాటు పడి పతితులైన దురాత్ములను, ఉన్మత్తులను దూరంగా ఉంచాలి. అపకృత్యాలు చేసి పెక్కుమందితో విరోధం పెట్టుకొన్న వారిని చేరదీయకూడదు. అంకుటాలు, ఆమె భర్త, వ్యభిచారి, అసత్యవాది, కలహప్రియుడు, అతివ్యయశీలుడు సన్మార్గరతులతో స్నేహానికి తగరు. అపమార్గాలు త్రొక్కినవారితో స్నేహం అపకృత్యాలకు కారకమై, ఒక్కొక్కప్పుడు వారికన్నా అధోగతికి దిగజారుస్తుంది.

ప్రవాహజలానికి ఎదురీది స్నానం చేయకూడదు. అగ్నిదగ్ధమవుతున్న ఇంటిలోకి ప్రవేశింపకూడదు. చెట్ల పైకొమ్మలకు ఎగబ్రాకితే ప్రమాదం. జనసంచారం లేని అటవీప్రాంతాలలో ఏకాకిగా ప్రయాణం చేయకూడదు. శూన్యగృహంలో నిద్రానివాసాలు తగవు. ప్రమాదాలు కొనితెచ్చే పనులను జాగ్రత్తగా పరిశీలించి ముందుగానే నివారించాలి.

జనమధ్యంలో పళ్లుకొరకడం, ముక్కు చీదడం, వివృతాస్యంతో పెద్దగా ఆవులించడం, అసహ్యాకరంగా గొంతు సవరించుకొనడం, దగ్గడం, ఉచ్చైస్స్వరంతో విరగబడి నవ్వడం, అసభ్యచేష్టలను చేయడం సంస్కారహీనతకు నిదర్శనలు. గోళ్లు కొరకడం, గడ్డిపోచలను తెగలాగడం, శ్మశ్రుకేశాలను కొరకడం, మట్టిగడ్డలు పెళ్లగించడం వినాశహేతువులు. శుచిగా లేనప్పుడు జ్యోతిశ్శాస్త్ర పరిశోధనలకై నక్షత్రాలను, గ్రహతారకలను పరిశీలించకూడదు. శవాలను, చంద్రుని విపరిణామాలుగా కలిగిన శవగంధాలను చూసి అసహ్యించుకొనరాదు. నగ్నంగా ఉన్న పరస్త్రీలను చూడకూడదు. సూర్యుని ఉదయాస్తమయాలను తిలకింపకూడదు.

శృంగాటకాలు, మహావృక్షాలు, శ్మశానప్రదేశాలు, దుష్టస్త్రీ సంచారస్థలాలలో రాత్రివేళ సంచరింపకూడదు.

గౌరవింపదగిన పెద్దలు, దేవతలు, దేవతావిగ్రహాలు, ధ్వజపటాల నీడల పైన కాలుపెట్టకూడదు. దీపచ్ఛాయలో నిలువకూడదు.

వెంట్రుకలు, ఎముకలు, ముళ్లు, అమేధ్యం, యజ్ఞాహుతుల భస్మశేషం, ఒకరు స్నానం చేయగా తడిసిన నేల కనబడగానే దూరానికి తప్పుకోవాలి.

అనార్యులను, అసత్పురుషులను ఆశ్రయింపకూడదు. పాములకు దూరంగా ఉండాలి.

మెలకువ వచ్చిన తర్వాత పక్కమీద దొర్లుతూ బద్ధకంగా ఉండకూడదు. నిద్రవేళలో మేలుకొని ఆరోగ్యం పాడుచేసుకోకూడదు.

పొగమంచు, ఉప్పెన, మండుటెండ ఉన్నప్పుడు ప్రయాణం పెట్టుకోకూడదు. మార్గమధ్యంలో దంతాలు, కొమ్ములు ఉన్న జంతువులు ఎదురైతే తెలివిగా ప్రక్కకు తప్పుకోవాలి.

ఆచమనం, స్నానం, నిద్ర - నగ్నంగా ఆచరింపకూడదు. మొలత్రాడు లేకుండా శౌచవిధులు, ఆచమనాలు, దైవతార్చనం తలపెట్టరాదు. ఏకవస్త్రం ధరించి హోమం, దేవతాపూజ, ఆచమనం, ద్విజులకు ప్రణామం, జపతపాలు చేయకూడదు.

సాధువర్తనులతో పరిచయం, సజ్జనులతో మైత్రి క్షణంలో సగభాగం లభించినా మహైశ్వర్యంగా భావించాలి. దుష్ప్రవర్తన కలవారితో సహవాసం చేయకూడదు. ఉత్తములతోనూ, అధముల తోనూ విరోధం పెట్టుకొనకూడదు. వివాహమయినా వివాద మయినా తుల్యశీలాలు కలవారితోనే సంకల్పించాలి. నిష్కారణంగా జగడాలకు, శుష్కవైరాలకు కాలుదువ్వకూడదు. కష్టం వచ్చినా నష్టం వచ్చినా భరించాలే తప్ప వైరార్జితమైన విత్తాన్ని ఆశింప కూడదు.

స్నానం చేసిన వెంటనే శరీరాన్ని చేతులతో లేదా స్నాన శాటితో నీళ్లలో ఉండగానే తుడుచుకోరాదు. కేశసంస్కారం, ఆచమనాదికం కూడా ఉత్థితులై ఆచరింపకూడదు.

పెద్దల యెదుట కాలుపై కాలు వేసికొని అవినయంగా కూర్చొనకూడదు. చేతులను మోగాళ్లపైగా నిలిపి, వీరాసనంలో నమ్రతగా కూర్చోవాలి. దేవాలయాలలో, నిత్యపూజావిధులలో ప్రదక్షిణం చేయవలసినప్పుడు అపసవ్యంగా తిరిగితే పాపం కలుగుతుంది.

సూర్యచంద్రులు, అగ్ని, వాయువు, నీరు, పూజనీయులు కని పించినప్పుడు వారికి అభిముఖంగా ఉమ్మివేయడం, మూత్రపురీషాలను విసర్జించడం నిషిద్ధకృత్యాలు. కాలిబాటలపైన అమేధ్యాన్ని పార వేయకూడదు. నిలబడి మూత్రవిసర్జనం చేయకూడదు. శ్లేష్మం, విణ్మూత్రాలు, నెత్తురు కనబడినప్పుడు వైదొలగాలి; వాటిని దాటు

కొని వెళ్లకూడదు. సవనాలలో, మంగళాచరణసమయాలలో, అన్నం తినేటప్పుడు గొంతు సవరించుకొంటూ శ్లేష్మం ఉమ్మివేస్తే పండితులు అసహ్యించుకొంటారు.

ఎట్టి పరిస్థితి లోనూ స్త్రీలను అగౌరవింపకూడదు. అలాగని వారిని గుడ్డిగా నమ్మడమూ తప్పే. వారికి అనవసరంగా అధికారం అప్పజెప్పకూడదు. మంచి చెప్పినపుడు తిరస్కరించకూడదు.

ఇంటిలో నుంచి బయటికి వెళ్లేటప్పుడు దేవతావిగ్రహాలకు, పుష్పాదిమంగళద్రవ్యాలకు, రత్నాలకు, ఆజ్యహవిస్సులకు, పెద్ద వారికి నమస్కరించి గడప దాటాలి. తొలిసారి దర్శించినపుడు చతుష్పథాలకు ప్రణమిల్లాలి. హోమార్చనవిధులను సకాలంలో నిర్వర్తించాలి.

చేతనైనంతలో నలుగురికీ ఉపకారం చేయాలి. దీనజనోద్ధరణకు కృషి చేయాలి. బహుశ్రుతులను, సద్వర్తనులను ఉపాసించాలి.

దేవతలను, మహర్షులను భక్తిశ్రద్ధలతో పూజించి, పితృదేవతలకు పిండోదకాల నొసగి, అతిథులను సత్కరించిన పుణ్యాత్మునికి ఉత్తమలోకనివాసభాగ్యం కలుగుతుంది.

హితంగా, మితంగా, సర్వజనప్రియకరంగా మాట్లాడి లోకులను ఆకట్టుకొన్న సత్యభాషణుడు అక్షయ పుణ్యలోకాలను పొంది అనంతభోగభాగ్యాలను అనుభవిస్తాడు.

వినయశీలం, ధీమత్త్వం, క్షమాగుణం, విద్యాభిజనవార్ధక్యాల పట్ల గౌరవభావం కల ఆస్తికుడు స్వర్గపదాన్ని చూరగొంటాడు.

పర్వసమయాలు, అశౌచవేళలు, అకాలవర్షాదినాలను అనధ్యాయదినాలుగా పరిగణించాలి. ఆరోజు విద్యార్థులు వేదాధ్యయనం చేయకూడదు.

సద్వర్తనులు అసూయాద్వేషాలను, క్రోధాన్ని ప్రశమింపజేసి ఎల్లవేళలా ప్రశాంతంగా ఉండాలి. అట్టివారినే అజాతశత్రువులని అంటారు. వారు స్వపరభేదాలు లేకుండా సర్వజనులకూ శ్రేయాన్ని అభిలషిస్తారు. వారి సమక్షంలో భయకంపితులకు ఊరట కలుగుతుంది. స్వర్గాన్ని దూసి యిచ్చినా వారి సాద్గుణ్యానికి విలువ కట్టలేము.

శరీరారోగ్యమే సర్వశ్రేయాలకూ మూలకందం. ఆధివ్యాధులు రాకుండా దేహారోగ్యాన్ని కాపాడుకోవాలి. వర్షాతపాల వల్ల బాధలు కలుగకుండా ఆతపత్రాన్ని తీసుకొనివెళ్లాలి. రాత్రులలో అటవీప్రయాణం తప్పనిసరి అయితే చేతికర్రను ఉంచుకోవాలి. శరీరరక్షణకై పాదరక్షలను ధరించాలి. ఎక్కడో గాలిలోకి, చుట్టుపక్కలకు, దూరానికి దిక్కులు చూస్తూ కళ్లు తేలవేసి నడవకూడదు. అనుద్విగ్నంగా నిలబడి, చూపు నేలపై నిలిపి రెండు గజాలవరకు పరిశీలిస్తూ జాగ్రత్తగా నడవాలి.

విద్యావినయాలలో సుశిక్షితులైన ప్రాజ్ఞులే సదాచారపరులు. వారే శ్రీమన్నారాయణుని పాదపద్మారాధకులు. వారే నిజమైన విష్ణుభక్తులు.

ఈ విధంగా లోకంలో అశేషంగా కనిపిస్తున్న దోషహేతువులను వివేకించి తమ ప్రవర్తనను ధర్మార్థకామాలకు అనురూపంగా మలచుకొన్న ధన్యాత్ముల జీవితాలు పాపపంకిలం కాలేవు. అంతర్విశుద్ధులైన ఆ మహనీయులకు మోక్షసామ్రాజ్యం కరతలామలకం. శ్రీ వాసుదేవుని జగన్మోహన తేజోవిలాసం మూర్తీభవించిన ఆ మహాత్ముల జీవితాలు మానవాన్వయ కలశరత్నాకరం పైన జిగితేరిన మీగడ తరకలు. ఇంద్రియవిజయాన్ని సాధించి వీతరాగులైన ఆ సదాచారస్థితుల ఉనికి వ ' భూమండలం ఇంకా నివాసయోగ్యంగా విలసిల్లుతున్నది.

అందుచేత ధర్మపరులు నిత్యసత్యవచనులై జీవించాలి. ముఖస్తుతుల కోసం అసత్యం చెప్పకూడదు. ఒకవేళ తాను చెప్పబోయే సత్యం ఇతరులకు దుఃఖహేతువుగా పరిణమింపగలదని భాసించినప్పుడు మౌనంగా ఊరుకోవడం మంచిది. ఎంత హితవాక్యమైనా అప్రియం పలుకకూడదు.

మనసా వాచా కర్మణా లోకహితాన్ని ఆకాంక్షించి ఇహపరాలు రెండింటినీ ఆనందమయం చేసుకోవాలి.''

అని చెప్పగానే సగరభూపతి—

''మహాత్మా! సదాచారధర్మాలను తెలుసుకొన్నాను. నాకిక అపరకర్మలను గురించి విశదంగా చెప్పండి''—అని కోరాడు.

ఔర్వమహర్షి మృతులకు కావింపదగిన వైదిక కర్మలను ఉపదేశించాడు.

కర్మానుష్ఠాన విధులు

''సదాచారపరులు నిర్వర్తింపవలసిన కర్మకలాపాలు అనేకం ఉన్నాయి. వీటి అనుష్ఠానం వలన మానవులకు ఉభయలోకాలలోనూ అభ్యుదయాభివృద్ధులు కలుగుతాయి.

అనుష్ఠానపరులు ప్రతిదినం విధిగా ఆచరింపవలసిన ముఖ్యకర్మలు కొన్ని ఉన్నాయి. వీటికి నిత్యకర్మలని పేరు. సంధ్యావందనం, దైవతోపాసనం మొదలైనవి నిత్యకర్మలు.

ఏదో ఒక నిమిత్తాన్ని పురస్కరించుకొని నిర్దిష్టవేళలలో అనుష్ఠింపదగినవి నైమిత్తికకర్మలు. ఇవి ఏకోద్దిష్టం, అన్నశ్రాద్ధం మొదలైనవి.

ఒక కోరికను మదిలో సంకల్పించుకొని అభిప్రేతసిద్ధి కోసం ఆచరింపదగినవి కామ్య[illegible]లు. పుత్రకామేష్టి, రాజసూయం, అశ్వమేధం వంటివి.

ఐశ్వర్యాన్ని, అభ్యుదయాభివృద్ధులను కాంక్షించి నడుపదగిన విధులు వృద్ధికర్మలు. జాతకర్మం ఇత్యాదులు.

కర్మపాశబద్ధులై జన్మించినవారికి భోగాంతంలో మరణం కూడా తప్పదు. మృతులకు పరమపదప్రాప్తిని కోరి వారి సపిండులు, సమానోదకులు, సమీపబంధువులు అగ్నిసంస్కారం, ఏకోద్దిష్టం, సపిండీకరణం, ప్రతిసాంవత్సరిక మృతాహంలో అన్నశ్రాద్ధం మొదలైన పుణ్యకర్మలను ఆచరించాలి. ప్రేతకర్మక్రియాచరణం వలన ఊర్ధ్వలోకావాప్తి కలుగుతుంది. ఇవన్నీ సపిండనకర్మలు.

పౌర్ణమాస్యమావాస్యలలో, పర్వదినాలలో అనుష్ఠింపవలసిన ప్రత్యేకవిధులు కొన్ని ఉన్నాయి. వీటికి పార్వణశ్రాద్ధకర్మలని పేరు.

బహుదక్షిణాక యజ్ఞాలలో విద్వద్వరిష్ఠులైన బ్రహ్మవేత్తలను సమావేశపరచి పూజ్యపూజాక్రమంలో చేయదగినవి గోష్ఠీకర్మలు.

ధర్మహాని కలిగినప్పుడు పశ్చాత్తాపం చెందినవారు పాటింపదగిన వ్రతాదులు ప్రాయశ్చిత్తకర్మలు. అపచార నిష్క్రియంగా విశుద్ధిని కోరి అనుష్ఠించే ఈ సత్కర్మలకు శౌచకర్మలు, శుద్ధికర్మలు అని కూడా వ్యవహారం ఉన్నది. వీటిలో అవాంతరభేదాలు అసంఖ్యాకంగా ఉన్నాయి.

కుమార్తె పూర్ణగర్భిణిగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఆచరింపవలసిన సీమంతాదులకు కర్మాంగాలు అని పేరు.

యజ్ఞాలు, హోమవిధులలో దైవతావాహన పూర్వకంగా ఆచరింపవలసినవి దేవకర్మలు.

ప్రయాణసమయంలో, తీర్థస్నానాదులు చేసినప్పుడు, సమంత్రకంగా అనుష్ఠింపదగినవి యాత్రాశ్రాద్ధ కర్మలు.

ఆరోగ్యైశ్వర్యాలను కోరి సుముహూర్తంలో ఆచరింపవలసిన పౌర్ణమాసాదులు పుష్టిశ్రాద్ధకర్మలు.

ఈ విధంగా నిర్వహింపవలసిన సత్కర్మలలో దేవకార్యాల కన్నా పితృకార్యాలు విశిష్టమైనవి. అందుచేత ధర్మనిష్ఠితులు పైతృకకర్మలను తప్పకుండా ఆచరించాలి.

పుత్రోదయం కలిగినప్పుడు తండ్రి సచేలస్నానం చేసి కొడుకు అభ్యుదయం కోసం జాతకర్మవిధులను నిర్వర్తించాలి. దేవబ్రాహ్మణులను, పితృదేవతలను పూజించి, ఇద్దరు బ్రాహ్మణులను వామభాగాన కూర్చోబెట్టుకొని వైశ్వదేవం సమర్పించాలి. తూర్పుముఖంగా నిలబడి పిండాలను దేవతీర్థాదులతో స్పృశించి దధ్యక్షతలతో కలిపి శ్రాద్ధకర్మలను ఆచరించాలి. ఇంటిలో అభ్యుదయాభివృద్ధులు సంభవించినప్పుడు సమర్పించిన శ్రాద్ధాలను నాందీముఖులని పేరుగల పితృదేవతలు స్వీకరిస్తారు. కొడుకులూ కూతుళ్ల వివాహాలు, గృహప్రవేశం, నామకరణం, కేశసంస్కారం, సీమంతోన్నయనం, పుత్రపుత్రికా ముఖదర్శనోత్సవం మొదలైన సమయాలలో నాందీముఖులను, పితృగణాలను పూజించాలి.

ఇవన్నీ పితృపూజానియమాలు.

ప్రేతకర్మ క్రియావిధులు

జాతకర్మాదుల వలెనే ప్రేతకర్మక్రియావిధులు కూడా అపరిహార్యంగా ఆచరింపవలసిన ముఖ్యవిధులు.

అంత్యకాలం సమీపించినదని తెలియగానే మానవుని శిరస్సు దక్షిణాభిముఖంగా—నేలపై శయనింపజేయాలి. ప్రాణోత్క్రమణ సమయంలో బ్రాహ్మణునికి ఒక ఆవును దానంగా సమర్పించాలి. చిట్టచివరిగా 'అచ్యుతా! అనంతా! గోవిందా!' అని శ్రీమన్నారాయణుని నామత్రయాన్ని భక్తిపూర్వకంగా జపించాలి.

మరణానంతరం మంగళస్నానాలు ఆచరించి, స్రక్చందనాలతో అలంకరించి, ఊరేగింపు తీసుకొనివెళ్లి గ్రామానికి బహి

ర్భూమిలో ఉన్న శ్మశానప్రదేశంలో అగ్నిసంస్కారకర్మలను ఆచరించాలి. శవదహనం ముగిసిన తర్వాత జలాశయానికి వెళ్లి సచేలస్నానం ఆచరించాలి. బంధువు లందరూ దక్షిణాభిముఖంగా నిలబడి, "ఎక్కడెక్కడ ఉన్నవారయినా మీకిది చేరుతుంది గాక!" అని పలుకుతూ శ్రద్ధగా తర్పణలు విడవాలి. సాయంకాలం గోగణాలు ఇళ్లకు చేరుకొనే వేళకు వాటితోపాటు గ్రామానికి తిరిగి రావాలి. చీకటి పడి నక్షత్రోదయ మవుతున్న సమయానికి నేలపైన చాపలు పరుచుకొని ఆపూట నిద్రకు ఉపక్రమించాలి.

మృతులకు ప్రేతకర్మలను చేసి పిండప్రదానం కావించాలి. కర్మకాండ ముగిసిన దాకా మాంసభోజనం పూర్తిగా వర్జించి శాకాహారం మాత్రమే భుజించాలి. అంతకాలమూ విప్రులను భోక్తలుగా పిలిచి అన్నసమారాధనం చేయాలి. విప్రులు, స్వబంధువర్గాల వారు కడుపునిండుగా భుజించి తృప్తిపొందితే మృతాత్మకు సంతృప్తి కలుగుతుంది. అందువల్ల ఇద్దరు బ్రాహ్మణులను తూర్పుముఖంగా కూర్చొనబెట్టి వైశ్వదేవాన్ని, ముగ్గురు బ్రాహ్మణులను ఉత్తరాభిముఖంగా కూర్చొనబెట్టి పైతృకార్థాన్ని వేదోక్తప్రకారంగా నిర్వర్తించాలి. తన గోత్ర నామాలను ప్రవర చెప్పుకొని పితృదేవతలను, బ్రాహ్మణులను ఆరాధించాలి. భోజనాలు వడ్డించినపుడు విశ్వేదేవతలకు స్వర్ణపాత్రలను, పితృదేవతలకు వెండి గిన్నెలను పెట్టి అగ్నిహోత్రవిధులైన అగ్నౌకరణాలను అనుష్ఠించాలి. హుతశేషాన్నాన్ని పితృపాత్రలలో ఉంచి రక్షోఘ్నమంత్రాలను జపిస్తూ శాకపాకాలను నైవేద్యం సమర్పించాలి. ఆ సమయంలో అతిథులు వస్తే భోక్తల అనుమతిని పొంది వారిని కూడా ఆహ్వానించి సహాపంక్తిభోజనం వడ్డించాలి. ఆ తర్వాత ఉచ్ఛిష్టసన్నిధిలో పిండప్రదానం చేసి, తిలోదకాలను సమర్పించాలి. వచ్చినవా

రందరూ ఆశీర్వదించి మరలివెళ్లాక ఇంటికి వచ్చిన బంధువులు, కుటుంబసభ్యులతో తానూ భుజించాలి.

కూటస్థుని దగ్గర నుంచి ఏడు పురుషాంతరాల వరకు సపిండులు, ఆ తర్వాత ఏడుగురు పురుషుల దాకా సమానోదకులు, అక్కడి నుంచి ఏడుగురు పురుషులకు సగోత్రికులు అని వ్యవహారం. ఈ సాపిండ్యం కొడుకు పుట్టినప్పుడు సప్తపూరుషం, స్త్రీసంతాన విషయమై త్రైపూరుషం అని వ్యవహారం. వీరందరినీ అనుసరించే అశౌచం ప్రవర్తిల్లుతున్నది.

కర్మకాండ మొదలైనాక ప్రథమ - తృతీయ - సప్తమ - నవమ దినాలలో వస్త్రత్యాగం, బహిఃస్నానం చేయాలి. మృతులకు తిలాంజలి సమర్పించాలి. బంధువర్గాలు తిలోదకాలను భూమిపై విడిస్తే సరిపోతుంది.

నాలుగవ రోజున అస్థికలను, భస్మావశేషాన్ని కొనితెచ్చిన నాటినుంచి సపిండులకు అంగసంస్పర్శదోషం తొలగిపోతుంది. సమానోదకులకు ఆనాటినుంచి మృతాశౌచం లేదు.

మృతాశౌచం ఉన్నప్పుడు సపిండులు శయ్యాసనాదులను వినియోగించడం సమ్మతమే కాని సుగంధద్రవ్యాలను, పుష్పాలంకరణలను చేసుకోకూడదు. అశౌచకాలంలో స్త్రీసంభోగం ధర్మసమ్మతం కాదు.

ఈ మృతాశౌచవిధులన్నీ ఉపవీతుల విషయంలో ప్రవర్తిల్లుతున్నాయి. చనిపోయినవారు శిశువులైనప్పుడు, దేశాంతరంలో మరణించినప్పుడు, పతితులకు, మునిధర్మాన్ని అవలంబించినవారు నిధనం చెందినప్పుడు మృతాశౌచం సద్యోనివర్తక మవుతున్నది. శిశువు మరణించినప్పుడు తండ్రికి, జ్ఞాతులకు జాతాశౌచ శేషంతోనే శుద్ధి కలుగుతుంది. దశాహం బ్రతికి మరణించిన శిశువుకు వయోవస్థను బట్టి అనుష్ఠింపదగిన మృతాశౌచవిధు లున్నాయి.

మృతాశౌచం కలిగినవారి యింట బంధువులు పదిరోజుల పాటు భోజనాలు చేయకూడదు. సపిండాదులు ఆ సమయంలో దాన ప్రతిగ్రహాలను, యజ్ఞాలను, స్వాధ్యాయవిధులను పూర్తిగా విరమించాలి.

బ్రాహ్మణులకు మృతాశౌచం పదిరోజులు ఉంటుంది. క్షత్రియులకు ద్వాదశాహం, వైశ్యులకు పక్షకాలం, శూద్రులకు మాస పర్యంతం కొనసాగుతుంది.

అశౌచకాలం ముగియగానే అసమసంఖ్యలో కనీసం ముగ్గురు బ్రాహ్మణులను భోక్తలుగా పిలిచి, భోజనానంతరం దర్భలలో పిండాన్నాలను ప్రేతభుక్తికై నిలపాలి. అతిథి సమారాధనల తర్వాత తమ తమ వర్ణధర్మాల ననుసరించి బ్రాహ్మణులు శుద్ధ జలాలను, క్షత్రియులు ఆయుధాన్ని, వైశ్యులు ప్రతోదాన్ని, శూద్రులు దండాన్ని తాకి విశుద్ధిని పొందాలి. అనంతరం స్వీయకుల వృత్తులను అనుసరించి నిత్యకృత్యాలను యథాపూర్వకంగా నడుపుకోవాలి.

మృతాహం తర్వాత ఒక సంవత్సరకాలం ప్రతినెలా అదే రోజున శ్రాద్ధకర్మలను ఆచరించాలి. అప్పుడు మాత్రం పూర్వమంత విస్తృతంగా వైశ్వదేవాన్ని, తక్కిన క్రియాంగాలనూ పాటించ నక్కరలేదు. ఆహ్వానాదిక్రియాకలాపాన్ని, దైవనియోగాన్ని పరిహరించి, ప్రేతకర్మగా ఒక్క పిండం ఉంచాలి. తనకు శక్తి ఉన్నంతలో భోక్తలను పిలిచి అన్నదానం చేయాలి. భోజనానంతరం యజమాని వారిని "మీకు సంతుష్టి కలిగిందా!" అని ప్రశ్నింపగా భోక్తలు, "మృతునికి అక్షయసంతృప్తి చేకూరుతుంది గాక!" అని సమాధానం చెబుతారు. ఈ కార్యకర్మానికి ఏకోద్దిష్టం అని పేరు.

ఈ విధంగా సంవత్సరాంతం దాకా ఏకోద్దిష్టాలు పెట్టి సపిండీకరణవిధులను నిర్వర్తించాలి. నువ్వులు, సుగంధ ద్రవ్యాలు, ఉదకాలను కలిపి నాలుగు పాత్రలలో పోసి ఒక గిన్నెను మృతునికి, మూడింటిని పితృదేవతలకు సమర్పించాలి. మృతునికి కూడా పితృదేవతాత్వం సంప్రాప్తించినట్లు గుర్తుగా మొదటి గిన్నె లోని వస్తువులను తక్కిన మూడింటిలో కలిపివేయాలి. ఆ నాటినుంచి పితృదేవతలకు విడిచిన తర్పణాలు మృతునికి కూడా అందుతాయి.

ఈ విధంగా పైతృకకర్మలను ఆచరించడానికి కొడుకు, మనుమడు, మునిమనుమడు, మృతుని సోదరుడు, సోదరుని సంతానం, సపిండుల సంతతివారు అర్హులు. వీరెవరూ లేనప్పుడు సమానోదకుల సంతతివారు, తల్లివైపు సపిండులు నిర్వహించాలి. ఉభయవంశాల లోనూ పుత్రసంతతి లేనప్పుడు స్త్రీలు పైతృకకర్మలను అనుష్ఠించాలి. అసలు సంతానం కలగని పక్షంలో మృతుని ఆస్తిపాస్తులు ఎవరికి సంక్రమిస్తే వారే పితృశ్రాద్ధాలను ఆచరించాలి.

శ్రాద్ధకర్మలు పూర్వ-మధ్యమ-ఉత్తర భేదాలచేత మూడు విధాలు.

మృతునికి అగ్నిసంస్కారం మొదలుకొని మృతాశౌచం ముగిసిన తర్వాత వారిస్పర్శ, ఆయుధస్పర్శాదుల పర్యంతం ఆచరించిన క్రియలన్నీ పూర్వక్రియలు. మాసతిథులలో నెలనెలా పెట్టిన ఏకోద్దిష్టాలు మధ్యమక్రియలు. ప్రేతానికి పితృదేవతాస్థానాన్ని ఆపాదించిన సపిండీకరణాదులు ఉత్తరక్రియలు. వీటిలో పూర్వక్రియలను మృతుని తల్లిదండ్రులు, సపిండులు, సమానోదకులు, లేదా వారసులు నిర్వర్తించాలి. పూర్వోత్తర క్రియలను పెద్దవారు చనిపోయినప్పుడు కొడుకులు, కూతుళ్లు, దౌహిత్రులు, వారి కొడుకులు ప్రతి సంవత్సరం ఆచరించాలి.

ఉత్తరక్రియానిరూపణం

గృహస్థధర్మాశ్రితులు ఉత్తరక్రియలను బహు శ్రద్ధాసమన్వితులై ఆచరించాలి. ప్రతి నెలా కృష్ణపక్షం పదిహేను రోజులూ, కృష్ణపక్ష అష్టమినాడు సమర్పించిన శ్రాద్ధవిధుల వల్ల బ్రహ్మ-ఇంద్రుడు-రుద్రుడు-అశ్వినీ దేవతలు-సూర్యుడు-అగ్ని-అష్టవసువులు-మరుత్తులు-విశ్వదేవతలు-పితృగణాలు - పక్షులు - మానవులు - పశువులు - సరీసృపాలు - ఋషిగణాలు - సమస్తభూతజాతానికి సంతుష్టి కలుగుతుంది.

పితృతర్పణాలకు నియతకాలవిధు లన్నవి లేవు. శ్రాద్ధసమర్పణకు ఆవశ్యకమైన ద్రవ్యలాభం కలిగినప్పుడు, విశిష్టంగా సమ్మానింపదగిన బ్రాహ్మణోత్తములు తన గృహానికి అరుదెంచినప్పుడు పైతృకకర్మలను నిర్వర్తింపవచ్చును. సూర్యచంద్రులు సమవిభక్తంగా వెలుగొందిన విషువత్పుణ్యకాలం, మేషాదిరాసులలో రవి సంక్రమణదినాలు, సూర్యామృతాంశు గ్రహణాలు, దుస్స్వప్న దోషాలు కలిగినప్పుడు, నవసస్యాగమ శుభవేళల లోను ఇచ్ఛాశ్రాద్ధాలను సమర్పించాలి.

ఇచ్ఛాశ్రాద్ధాల వలన పితృదేవతలు అపరిమిత సంతోషాన్ని పొందుతారు. అమావాస్య నాడు యోగతార అనురాధ - విశాఖ - స్వాతి నక్షత్రాలలో ఒకటైనప్పుడు సమర్పించిన శ్రాద్ధవిధి వలన పితృదేవతలకు ఎనిమిది సంవత్సరాల పార్యంతికమైన సంతృప్తి కలుగుతుంది. అమావాస్యనాడు యోగతార పుష్యమి - ఆర్ద్ర - పునర్వసులలో ఒకటైనప్పుడు అర్చితులైన పితృగణాలకు ద్వాదశహాయనాల సంతృప్తి ఘటిల్లుతుంది. ధనిష్ఠ - పూర్వాభాద్ర - శతభిషా నక్షత్రాలలో ఒకటి అమావాస్య నాడు యోగతార కావడమూ,

ఆనాడు పితృక్రియలను ఆచరించడమూ బహుజన్మల మహాపుణ్యం చేసుకొంటేనే కాని సాధ్యం కాదు.

పితృదేవతార్చనం

పూర్వం ఒకప్పుడు బ్రహ్మమానసపుత్రుడైన శ్రీ సనత్కుమారుడు పురూరవశ్చక్రవర్తి కోరగా పరమగోప్యమైన పితృదేవతార్చన విధానాన్ని ఈ విధంగా తెలియజేశాడు.—

చతుర్యుగాలకు ప్రారంభదినాలు పితృదేవతల అభ్యర్చనకు సమర్థమైన పరమపవిత్రతిథులు.

వైశాఖ శుద్ధ తదియ నాడు కృతయుగం ప్రారంభమయింది. కార్తీక శుక్ల నవమి రోజున త్రేతాయుగం, నభోమాస బహుళ త్రయోదశి, మాఘ పంచదశి దినాలలో ద్వాపర—కలి యుగాలు సముదితాలైనాయి. ఈ నాలుగూ అనంత పుణ్యతిథులని సర్వపురాణాలూ ఏకగ్రీవంగా అంగీకరించాయి. వీటితోపాటు సూర్యామృతాంశుగ్రహణాలు, అగ్రహాయన మాఘ ఫాల్గుణ బహుళాష్టమి దినాలు, ఉత్తరాయణ దక్షిణాయన ప్రారంభదినాలు, మన్వంతరాల సాంవత్సరిక పుణ్యాహాలు, సూర్యుడు మేషరాశిలో ప్రవేశించిన రోజు కూడా సుప్రశస్తమైన తిథులు. ఈ శుభసమయాలలో పితృదేవతలకు తిలోదకాలు సమర్పిస్తే వారికి వేయిసంవత్సరాల దీర్ఘాయువు కలుగుతుంది. ధనిష్ఠాయుక్త పౌర్ణమినాడు బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే పితృదేవతలకు తత్ఫలితంగా పదివేల సంవత్సరాల మహాయుష్యం సంభవిస్తుంది. భాద్రపదమాసంలో ఆర్ద్రాయుక్త పౌర్ణమాసి వేళ ఆచరించిన శ్రాద్ధవిధుల వలన పితృదేవతలకు యుగాంతం వరకు పుణ్యలోక స్థితి కలుగుతుంది. శతభిషానక్షత్రయోగం కలిగిన మాఘబహుళ పంచదశి నాడు పితృగణాలకు శ్రాద్ధకర్మలను ఆచరిస్తే-ఆచరించినవారికి అనల్పపుణ్యఫలాలు సిద్ధిస్తాయి.

పితృదేవతలకు పిండోదకాలను విడిచి గంగ - శతద్రువు - యమున-విపాశ - సరస్వతి - గోమతి నదులలో స్నానం చేసిన ముముక్షువులకు సకలపాపకర్మలూ నశించి అనంతఫలం చేకూరుతుంది.

"ఈ శ్రాద్ధాలను అందుకొని మాకు ద్వాదశమాస పర్యాప్తమైన మహాతృప్తి కలిగింది. ఇక మీ తరువాతి తరాలవారు మాఘ బహుళాంతంలో ఏ పుణ్యతీర్థం లోనో సమర్పింపనున్న తోయాలను అందుకొనడానికి వేచి ఉంటాము."

—అని పితరులు నిండుమనస్సుతో ఆశీర్వదిస్తారు.

పితృగీతలు

"పితృదేవతార్చనామహాఫలాన్ని పితృదేవతలే ఉపశ్లోకించిన వాక్యావళికి పితృగీతలని నామధేయం కలిగింది. పరమశుభదాయకమైన పితృగీతను ఆకర్ణించిన భక్తకోటికి అంతర్విశుద్ధి, మహైశ్వర్య భోగం, అభివాంఛితావాప్తి కలుగుతాయి."

అని పలికి బ్రహ్మవిద్వరిష్ఠుడైన సనత్కుమారుడు బుధాత్మజునికి అతిరహస్యమైన పితృగీతను వెల్లడించాడు.

"చంద్రవంశాగ్రణీ! అనన్యవిదితమైన పితృదేవతా శుభవచనాలను విని నీకు తన్మహిమ స్ఫుటగోచరమవుతుంది. నాయనా! వారు పూర్వం ఈ విధంగా ఉపదేశించారు—

"ధనవ్యయాన్ని లెక్కచేయక మా కోసం పిండాన్నాలను నిర్వాపించిన శ్రద్ధాళువులు ధన్యులై విలసిల్లుతారు. ఉత్తర జన్మలో వారికి ఉత్తమవంశాభిజననం, సాటిలేని సౌఖ్యభోగాలు కలుగుతాయి.

"పితరులను భక్తితో పూజించి విప్రులకు అన్నశ్రాద్ధం సమర్పించినవారికి ఐశ్వర్యం, రత్నవిభూషణాలు, విలువైన వస్త్రాలు, భూవసతి, వాహనాదులు, సమస్త భోగభాగ్యాలూ లభిస్తాయి.

"విప్రులకు అన్నదానం చేయలేనివారు కనీసం అపక్వధాన్యాలైనా తమ శక్తికొలదిగా సమర్పించాలి. అవి కూడా లేనివారు సద్బ్రాహ్మణులకు భక్తిపూర్వకంగా ప్రణామం చేసి, చేతివ్రేళ్ల కొసలపై నువ్వుగింజల నుంచుకొని జలాంజలి పట్టి తిలోదకాలను భూమిపై విడిచివేయాలి. ఆ ఒక్కపూటకు ఎలాగైనా కష్టపడి గోగ్రాసం సంపాదించి ఒక్క ఆవుకైనా గవాహ్నికంగా ఇవ్వాలి. ఈ సత్కర్మవలన మాకు అపరిమితానందం ఘటిల్లుతుంది.

"ఇక సర్వాభావం కలిగి ఈ మాత్రపు స్వల్పకార్యాన్ని కూడా చేయలేనివారు సద్భక్తులైన పక్షంలో పితృారాధనను విరమించకూడదు. అరణ్యానికి వెళ్లి, చేతులు పైకెత్తి, "నా వద్ద ధనధాన్యాలు సర్వమూ వట్టిపోయాయి. శ్రాద్ధోపయోగకర వస్తువు ఏ ఒక్కటీ నాకు లభించలేదు. వాయువీథిలో ఊర్ధ్వాభిముఖంగా చేతులను జోడించి నేను సమర్పిస్తున్న ఈ నమస్కారం నా పితరులైన మీకు తృప్తిని ఘటిస్తుంది గాక!" అని ఉచ్చైచ్చస్స్వరంతో పలికితే మేమందరమూ ప్రీణితస్వాంతుల మౌతాము."

—అని విశ్రుతమైన ఈ పితృగీత సారాన్ని మననం చేసుకొని మానవులు శ్రద్ధాసక్తులతో పైతృక కర్మలను అనుష్ఠించాలి."

నిమంత్రణ బ్రాహ్మణ స్వరూపం

సగరచక్రవర్తికి పూర్వం సనత్కుమారోదితమైన పితృదేవతార్చన విధానాన్ని విశదీకరించిన తర్వాత ఔర్వమహర్షి అపరకర్మలలో భోక్తగా పిలువదగిన సద్బ్రాహ్మణుని స్వరూపాన్ని వివరించాడు.

"పైతృకశ్రాద్ధాలలో బ్రాహ్మణార్థం కావించడానికి పిలువదగిన బ్రాహ్మణుడు కృష్ణయజుర్వేదంలోని మధుత్రయాన్ని, త్రిణాచి

కేత—'' అని ఇత్యాదిగా గల మూడు త్రిణాచికేత అనువాకాలను, త్రిసుపర్ణ—'' ఇత్యాదిగా కల త్రిసుపర్ణానువాకత్రయాన్ని అధ్యయన చేసి ఆ అర్థసారాన్ని నిజజీవితంలో అనుష్ఠించిన యోగ్య త్రిణాచికేతుడు, త్రిమధుడు, త్రిసుపర్ణుడూ అయి వేదాలను సాంగోపాంగంగా నేర్చుకొన్న శ్రోత్రియుడై ఉండాలి. అతడు యోగవిదుడు, జ్యేష్ఠసామగుడూ అయితే ప్రశస్తంగా ఉంటుంది. అనేక యజ్ఞాలు చేయించిన ఋత్విజుడు, తపోనిష్ఠుడు, పంచాగ్ని కృత్యాలలో అభిరుచి కలవాడు పైతృకశ్రాద్ధానికి నియమింపదగినవారు.

ఇక స్వబంధువర్గంలో—మేనమామ, మేనల్లుడు, కూతురికొడుకు, తన అల్లుడు, మామగారు, ప్రియశిష్యుడు, తల్లిదండ్రుల పట్ల భక్తిశ్రద్ధలు కలవాడు — వీరందరూ నిమంత్రణానికి అర్హాస్థానీయులు.

బ్రాహ్మణార్థానికి పిలువదగనివారిని ఎట్టి పరిస్థితిలోనూ ఆహ్వానింపకూడదు. మిత్రవంచకుడు, దంతాలూ, గోళ్లూ నలుపెక్కినవాడు, నపుంసకుడు, అగ్నికార్య వేదాధ్యయనాలకు విముఖుడైన అనాచారపరుడు, సోమాలను అమ్ముకొన్నవాడు, పరస్త్రీలతో వ్యభిచరించి నిందలకు గురైనవాడు, నేరస్తుడు, పిశునవృత్తులకు అలవాటుపడినవాడు, క్షుద్రులకు తోడ్పడిన గ్రామయాజకుడు, భృతకుల వద్ద అధ్యయనాధ్యాపనలు కావించినవాడు, పరభార్యను వివాహం చేసుకొన్నవాడు, తల్లిదండ్రులను అగౌరవించినవాడు, వృషలీపుత్రుని పెంచుకొన్నవాడు, వృషలిని పెండ్లాడిన కులాచార వ్యతిరేకి, హరికథావిముఖుడు నిమంత్రణకు యోగ్యులు కారు.

పైతృకశ్రాద్ధాలకు ముగ్గురు బ్రాహ్మణులను, దైవికాలకు ఇద్దరు లేదా అయిదుగురు బ్రాహ్మణులను పిలవాలి. పిత్రర్థానికి మాత్రం బ్రాహ్మణులను బేసిసంఖ్యలో పిలవడం సాధ్యం కానప్పుడు

ఒక్కరినే పిలిచినా దోషం లేదు. దైవికార్థాలకు భోక్తలను యథా యోగ్యంగా పిలుచుకోవచ్చు.

శ్రాద్ధకర్మ లాచరించే తరుణంలో ఇంటికి అతిథులు వచ్చిన ట్లయితే వారిని కూడా భోజనానికి నిలిపివేయాలి. అనభ్యాహితంగా వచ్చిన అతిథ్యభ్యాగతులకు భోక్తృసంఖ్యా నియమాలు అను వర్తించవు.

నిమంత్రణానికి ఆహ్వానించిన బ్రాహ్మణులు ఇంటికి రాగానే ఎదురేగి, పాదశౌచానికి నీళ్లిచ్చి, కాళ్ల తడి ఒత్తి, ఆచమనాదులు పూర్తయాక వారు కూర్చొనే చోట దర్భలను పరిచి సుఖోపవిష్టు లను కావించాలి. ఆ నాడు కావింపవలసిన కార్యక్రమానికి తత్తదు చిత విధులను నిర్దేశించాలి.

శ్రాద్ధ విధులు ముగిసిన తర్వాత బ్రాహ్మణులు, యజమాని భోజనాలకు కూర్చోవాలి. అంతకు పూర్వం భుజిస్తే ఒక్క వారికే కాక పితరులకు కూడా లజ్జాకరమైన గతులు కలుగుతాయి.

బ్రాహ్మణులను పితృదైవికాది శ్రాద్ధకర్మలకు నిమంత్రింప గానే గృహస్థుడు భక్తిశ్రద్ధలతో మాతామహ శ్రాద్ధాన్ని, వైశ్వ దేవాన్ని సమాచరించాలి. అంతంలో విశ్వదేవార్థం ఇద్దరు బ్రాహ్మ ణులను తూర్పుముఖం గాను, పైతృకార్థం ముగ్గురిని ఉత్తరాభిముఖం గాను కూర్చొనబెట్టి శాకపాకాలు వడ్డించాలి. ఈ ఉభయవర్గాల బ్రాహ్మణులకు ఏకపాకం, ఏకత్ర భోజనం దోషమని కొందరు, దోషం లేదని కొందరు మహర్షులలోనే అభిప్రాయభేదా లున్నాయి. అటువంటి సమయాలలో గృహస్థుడు తన కులాచారాన్ని బట్టి యథో చితంగా నిర్ణయించుకోవాలి.

శ్రాద్ధకర్మను ప్రారంభింపగానే గృహస్థుడు బ్రాహ్మణాను మతిని గైకొని సుఖాసనార్థం కుశలను పరిచి, అర్ఘ్యప్రదానం చేసి

దైవతాలను ఆవాహన చేయాలి. దేవతలకు యవధాన్యాలు కలిపిన ఉదకాలతో శ్రద్ధాంజలి సమర్పించి, పువ్వులు, చందనం, ధూప దీపాలతో యథాశక్తి పూజించాలి. అనంతరం బ్రాహ్మణానుమతిని పొంది వామప్రదేశంలో దర్భాసనాలు పరిచి పితృదేవతలను ఆవాహన చేయాలి. వారికి ఎడమ చేతితో తిలోదకాలిచ్చి యథాశక్తి పూజించాలి. అప్పుడు మళ్లీ బ్రాహ్మణుల అనుమతిని పొంది అతిథులకు, ఆకలితో ఉన్నవారికి, యోగులకు అన్నదానం చేయాలి. తనచే ఆరాధింపబడుతున్న అతిథ్యభ్యాగతులందరూ శ్రీమన్నారాయణుని స్వరూపభేదాలే కనుక వారి యోగ్యతాయోగ్యతలను, కులగోత్రాలను పరిగణింపకూడదు. వచ్చినవారికి ఆశాభంగం కలిగితే గృహస్థునికి శ్రాద్ధక్రియా ఫలం లభింపకపోగా పూజ్యపూజా వ్యతిక్రమ దోషం వాటిల్లుతుంది.

అనంతరం బ్రాహ్మణులచేత అనుజ్ఞాతుడై గృహస్థుడు వ్యంజనక్షారవర్జితమైన అన్నాన్ని కుడిచేతిలోకి తీసికొని, ''కవ్యాలను పితృదేవతల వద్దకు కొనిపోతున్న అగ్నికి సమర్పితం'' అని పలికి అగ్నికి సమర్పించాలి. అదేప్రకారం పితృదేవతలకు మూలమైన సోమునికి, అతని తర్వాత వైవస్వతునికి సమర్పణగా అన్నపు ముద్దలను ఆహుతి ఇవ్వాలి. ప్రతి సమర్పణ వాక్యాన్ని స్వాహాశబ్దాంతంగా ఉచ్చరించాలి. హుతావశేషంలో అతిస్వల్ప భాగాన్ని బ్రాహ్మణుల విస్తరిలో ఉంచి ఇష్టమృష్టాన్నాలను, మధుర భక్ష్యాలను వడ్డించాలి. భోక్త కుడి మోకాలిని స్పృశించి, ఆయన సమ్మతితో విశ్వదేవ ఆవాహనమంత్రద్వయాన్ని ఉచ్చరించాలి.

భోక్తలకు అన్నాదులను నెమ్మది నెమ్మదిగా వడ్డించాలి. ఎట్టి పరిస్థితిలోనూ త్వరపెట్టకూడదు. పరుషవాక్యాలు పలికి వారికి భోజనంపట్ల విరక్తిని కలిగించకూడదు. భోక్తలు కూడా ప్రశాంత

చిత్తంతో సుముఖులై వడ్డించిన పదార్థాలను ప్రీతిపూర్వకంగా భుజించాలి.

ఆ తర్వాత దీపం వెలిగించి రక్షోఘ్న మంత్రాలను జపించి రక్షోవినాశ చిహ్నంగా జ్యోతిని ఆర్పివేయాలి. భూమిపై నువ్వులను విడిచి పితరులను ధ్యానించాలి:

"నేను కావించిన ఈ అగ్నిహోమం వలన తనివితీరి నా తండ్రిగారికి, పితామహ ప్రపితామహులకు తృప్తి కలుగుతుంది గాక!

"నేను భూమిపై ఉంచి సమర్పించిన ఈ పిండాల వలన నా తండ్రిగారికి, పితామహ ప్రపితామహులకు తృప్తి కలుగుతుంది గాక!

"నేను భక్తిశ్రద్ధలతో ఈ రోజు కావించిన శ్రాద్ధకర్మ వలన నా తండ్రిగారికి, పితామహ ప్రపితామహులకు తృప్తి కలుగుతుంది గాక! నా మాతామహునికి తృప్తి కలుగుతుంది గాక! ఆయన తండ్రి తాతలు, విశ్వదేవులు, నిఖిలదైవతాలు సంతృప్తిని; యాతుధానులు వినాశాన్ని పొందుతారు గాక!

"యజ్ఞేశ్వరుడు, హవ్యకవ్యాల భోక్త, అవ్యయాత్ముడు, సర్వేశ్వరుడు ఐన శ్రీమన్నారాయణుడు ఈ పితృద్రవ్యాలను స్వీకరింపగా రాక్షసశక్తులకు అపాయం ఘటిల్లుతుంది గాక!"

అని భక్తిపూర్వకంగా ఉచ్చరించాలి.

భోజనానంతరం గృహస్థుడు కొంత అన్నాన్ని భూమిపై వెదజల్లి, బ్రాహ్మణులకు ఆచమనార్థం నీటిని తానే అందివ్వాలి. ఆ తర్వాత వారిచే అనుజ్ఞాతుడై నువ్వులు కలిపిన పక్వాన్నంతో పిండాలను చేసి పితృతీర్థంతో స్పృశించి జలాంజలి విడిచివేయాలి. అనంతరం మాతామహాదులకు తర్పణలు విడవాలి. దర్భలను దక్షిణాభిముఖంగా పరిచి ప్రథమపిండాన్ని పుష్పధూపాలతో పూజించి తన తండ్రికొరకై సమర్పించాలి. ఆ తర్వాత తాతముత్తాతలకు

పిండప్రదానం చేసి, తక్కినవారికి దర్భమూలాలను చేతులతో రాస్తూ ప్రీతిని కలిగించాలి. అదే విధంగా మాతామహాదులకు కూడా పిండప్రదానం చేసి బ్రాహ్మణునికి ఆచమనార్థం నీటిని అందివ్వాలి. బ్రాహ్మణులకు దక్షిణల నిచ్చాక వారు స్వధాశబ్దంతో గృహస్థుని ఆశీర్వదించాలి.

అప్పుడు గృహస్థుడు విశ్వదేవతలను ఉద్దేశించి, "ఈ కర్మ క్రియల వలన మీరు ప్రీణితస్వాంతు లవుతారు గాక!" అని పలుకగా, బ్రాహ్మణులు "తథాస్తు!" అని ఆశీర్వదిస్తారు.

ఆ తర్వాత పితృదేవతలకు, దైవతాలకు తిలోదకా లివ్వాలి. తొలుత తండ్రివైపు వారికి, అనంతరం తల్లివైపు వారికి శ్రాద్ధాలను సమర్పించాలి. బ్రాహ్మణులను సమ్మానించి, వారందరూ గృహోన్ముఖు లైనాక బంధుమిత్రపరివారసమేతంగా తానూ భుజించాలి.

ఈ విధంగా శాస్త్రోక్తంగా ఆచరించిన గృహస్థులకు సర్వాభీష్టాలూ సిద్ధిస్తాయి.

మానవుల అభ్యుదయానికి పితృదేవతల కరుణావృష్టి ఆధారం. పితృగణాలకు చంద్రుడు ఆధారం. చంద్రుని కళలకు యజ్ఞయాగాలు ఆధారం. అందుచేత గృహస్థులు యోగరతుడైన ఉత్తమ ఋత్విజుని ఆశ్రయించాలి.

వేయిమంది బ్రాహ్మణుల కన్న ఒక్క యోగిని ముందుంచుకొని కావించిన శ్రాద్ధకర్మల వలన భోక్తలు, గృహస్థుడు, సర్వజనులూ తరిస్తారు.

శ్రాద్ధోపయుక్త వస్తువులు

శ్రాద్ధకర్మలలో మాంసాన్ని సమర్పించడం కూడా ఉన్నది. దీన్ని పలపైతృకం అంటారు. ఇందువలన పితరులకు మాంసపర్యాప్తమైన తృప్తి కలుగుతుంది.

కారుదున్నపోతు – కుందేలు – ఖడ్గమృగం – గొఱ్ఱె – చేప – జింక – పంది – పక్షులు – ముంగిస, మాంసపు వంటకాలకు తగినవి. కలియుగంలో గోక్షీరం, దధిఘృతపాయసాదులను మాంసోపమాన ద్రవ్యాలుగా సమర్పించవచ్చు.

ఈ పైతృకకర్మలను గయాక్షేత్రంలో ఆచరించినవారి జన్మం పితృప్రీతికరమై సార్థకం అవుతుంది.

అనుములు – కాంచనారాలు – గోధుమలు – నల్ల ఆవాలు – నివ్వరి ధాన్యాలు – నువ్వులు – పెసలు – యవధాన్యాలు – వడ్లు – వనౌషధులు యోగ్యవస్తువులు.

పంట ఇంటికి రాగానే అగ్రయణాదులతో శుద్ధిచేయని ధాన్య జాతం – ఆళ్లు – ఉలవలు – కందులు – చిరుతవడ్లు – నల్లరాగులు – మసూరాలు – రాజమాషాలు – సజ్జలు – విసర్జనీయ సస్యాలు.

అల్లం – ఈలకూర – గుమ్మడి – గోంగూర – చెంచలి – తుంటికూర – నక్కదోసకాయ – నల్లతోటకూర – నీరుల్లి – నేతిబీర – పుచ్చకాయ – పుల్ల బచ్చలి – పొన్నగంటికూర – మునగ – ముల్లంగి – వెల్లుల్లి – సొరకాయ శ్రాద్ధకర్మలకు తగవు.

పెరుగు కలిపిన పేలపిండి, బీడు నేలలో మొలిచినవి పైతృకానికి అనర్హావస్తువులు.

రాత్రి నిలవచేసిన నీరు – మురికి నీరు – నురుగు తేలిన నీరు – ఒంటికొమ్ము జంతువుల పాలు – అయోగ్యాలు.

నపుంసకుడు – అపవిద్ధుడు – కులభ్రష్టుడు – చండాలుడు – పాషండుడు – కల్లుతాగి మత్తెక్కినవాడు – రోగగ్రస్తుడు – నగ్న పురుషుడు – పంది – కోతి – కోడి – కుక్క – శవవాహకులు – మైలపడినవారు – అవిశుద్ధులు దర్శించిన శ్రాద్ధకర్మకు పితృగణాలవారు రారు.

భూమిపై తిలవిక్షేపం వలన యాతుధానులకు వినాశం కలుగుతుంది. అమేధ్యం, కేశదుష్టం అయిన అన్నాన్ని సమర్పింప కూడదు. నామగోత్రాది ప్రవర చెప్పుకొని భక్తిశ్రద్ధలతో ఏ అన్నాన్ని పెడితే దేవతలు ఆ అన్నాన్నే భుజిస్తారు. అందువల్ల వారికై వండిన ఫలపాకాలు సుపరీక్షితమై విశుద్ధంగా ఉండాలి.

సగరమహారాజా! పరమగోప్యమైన ఒక ఐతిహ్యాన్ని ఈరోజు నేను నీ ఇష్టాపూర్తిని కోరి వెల్లడిచేస్తున్నాను—విను:

గయాక్షేత్రానికి వెళ్లి పిండాలను సమర్పించినవారికి పితౄణం నిశ్శేషంగా తీరిపోతుంది. వారు సన్మార్గరతులై అనంత సుఖాలను పొందుతారు.

భాద్రపద - మాఘ మాసాలలో త్రయోదశి నాడు పాలు - తేనె - ఆజ్యాలను సమర్పించినవాడు, రజస్వల కాని కన్యను వివాహం చేసుకొన్నవాడు, నీలవృషభానికి కట్లువిప్పి విడిచిపెట్టినవాడు, అశ్వమేధయాగం చేసినవాడు అంతంలో పితృస్వరూపులై తమ సంతతివారు సమర్పించిన పూజలను అందుకొంటారు.

అతి రహస్యమైన ఈ విశేషాన్ని పూర్వం ఒకప్పుడు వైవస్వతమనువు పుత్రుడైన ఇక్ష్వాకుమహారాజు హిమాలయోపకంఠంలోని కలాపోపవనంలో ఉండగా పితృదేవతల ముఖతః విని నాకు తెలియజెప్పాడు.''

అని ఈ విధంగా ఔర్వమహర్షి సగరచక్రవర్తికి బోధించిన గృహస్థధర్మాలను శ్రీ పరాశరమహర్షి మైత్రేయునికి వినిపించగా—

మైత్రేయుడు—

''మహానుభావా! మీరిందాక నగ్నపురుషదర్శనం శ్రాద్ధక్రియాభంగహేతువని అన్నారు. నాకు ఆ నగ్నసంజ్ఞార్థాన్ని విశదీకరించండి'' అని కోరాడు.

పరాశరుడు నగ్నశబ్దార్థాన్ని ఉపదేశించాడు.

నగ్న లక్షణాలు

మానవలోకంలో ప్రవర్తిల్లిన సమస్తవర్ణధర్మాలకూ ఋగ్యజుస్సామ వేదాలు మూలకందాలు. మోహాంధకారంలో పడి శ్రుతి ప్రతిపాదిత ధర్మశాసనాలను నిందించి వేదదూషణకు పాల్పడిన అజ్ఞానులను నగ్నులని అంటారు.

పూర్వం ఒకప్పుడు కురుకులపితామహుడైన భీష్మునికి మా తాతగారు వశిష్ఠమహర్షి చెప్పిన కథానకాన్ని ఈ సందర్భంలో ఉదాహరించడం సముచితంగా ఉంటుంది.

ఆదికాలంలో ఒకప్పుడు దేవదానవులకు తుములమైన సంగ్రామం జరిగింది. ఆ మహాయుద్ధంలో హిరణ్యకశిపుని కొడుకైన హ్లాదుడు రాక్షసులకు నాయకత్వం వహించి దేవతలను ఓడించి స్వర్గధామం నుంచి వారిని తరిమివేశాడు.

దేవతలు క్షీరసముద్రం ఉత్తరతీరానికి పారిపోయి అనంత మహిమాన్వితమైన శ్రీమహావిష్ణుస్తోత్రరాజాన్ని గానం చేశారు.

శ్రీ మహావిష్ణుస్తవం

"భగవంతుడు, సర్వలోకారాధ్యుడు, ఆద్యుడు ఐన శ్రీమన్నారాయణుడు ఈ మా వాక్కులను దయతో విని ప్రసన్నుడు కావాలని విన్నవించుకొంటున్నాము:

దేవా! ఏ మహాత్ముని నుండి సమస్తసృష్టి ఆవిర్భవించి, ఎవరియందు విలీనమవుతున్నదో—ఆ సర్వేశ్వరుని, నిన్ను స్తుతించడానికి ఎంత వాగ్వైభవం ఉన్నా తనివితీరదు. మాటలకు అందని నీవంటి మహాత్ముని సంపూర్ణంగా అభివర్ణించడం ఎటువంటి శక్తిమంతులకైనా సాధ్యం కాదు. అల్పవచస్కులం, అందులోనూ పరాజయావమానంతో క్రుంగిపోయిన దీనులం నిన్ను ఏమని సంతోషపెట్టగలము?

ప్రభూ! నీవే మాకు సర్వస్వానివి. పృథివి, జలాలు, తేజస్సు, వాయువు, ఆకాశం అన్నీ నీ అభివ్యక్తరూపాలే. మూర్తామూర్త శరీరాలతో సర్వతః అభివ్యాపించి ఉన్న సర్వభూతాత్మకుడవు నీవే. అంతఃకరణానివి, ప్రధానపురుషుడవు, పురుషోత్తముడవు నీవే. ఈ అనంతసృష్టినిర్మాణ మర్మకర్మఠుడై నీ నాభికమలం నుంచి ప్రాదుర్భవించిన బ్రహ్మదేవుడవూ నీవే. ఇంద్రుడు, రుద్రుడు, అష్టవసువులు, అగ్నిషోమవరుణాదులు సర్వదేవాత్మకుడవైన నీ దివ్య స్వరూపాలుగా అభివ్యక్త మౌతున్నాయి.

అనాదినిధన స్వరూపా! నీకు ప్రణామం. సర్వభూతాంతరాత్మా! నీకు అభివాదం!

దంభస్వభావంతో కన్ను మూసుకొనిపోయి తితిక్షా శమదమాలను విసర్జించిన దైత్యాత్మకుడవైన శ్రీగోవిందునికి —

క్రౌర్యమాయామయమైన అసితరూపాన్ని ధరించి నిశాచరాత్మకుడవైన పురుషోత్తమునికి —

స్వర్గంలో ప్రాపణీయాలైన సర్వధర్మాలకూ ఫలోపకరణానివైన ధర్మస్వరూపునికి —

నిస్సంగులలో నిస్సంగుడివై, బంధితులలో బంధనానివై, గమనాదులలో గతిమంతుడవైన సిద్ధాత్మకునికి —

అనంతభోగాలతో అతిశయించిన క్రౌర్యస్వభావమూ, ద్విజిహ్వాలూ కల నాగాత్మకుడవైన శేషతల్పునికి —

నిర్మల జ్ఞానమయాకృతివై శాంతఋషిస్వరూపునివైన శ్రీమన్నారాయణునికి —

కల్పాంతంలో సమస్తభూతజాలాన్నీ ఆహారంగా భక్షించే కాలాత్మకుడవైన పుండరీకాక్షునికి —

సర్వలోకాలకూ లయంకరమైన మహాప్రళయతాండవంలో లగ్నచేతస్కుడైన రుద్రాత్మకునికి —

Dr. Kasilayai Lingamurthy
Nagarkurnool.
Cell No: 87307 27772

రజోగుణం వలన సర్వకర్మలకూ కారకాత్మకమైన నర స్వరూపాన్ని ధరించిన పరమపురుషునికి —

తామసాకృతిచే ప్రేరేపింపబడి అష్టావింశద్విధాపూర్ణమై, పశ్వాత్మకమైన సర్వాత్మకునికి —

జగత్తులకు సిద్ధిసాధనమై, వృక్షాదిభేదాలతో యజ్ఞాంగభూతమైన ముఖ్యాత్మకునికి —

తిర్యఙ్మనుష్య చరాచర సర్వస్వంలో ఏకరూపంలో వెలుగొందుతున్న సర్వాత్మకునికి —

నీకు నమస్కారం!

అర్థిజనకల్పవృక్షా! రక్షోధ్యక్షవిపక్షా! ధర్మరక్షా సుదీక్షా! పుండరీకాక్షా!

మమ్మల్ని రక్షించు.''

అని సంస్తుతింపగానే సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు గరుత్మద్రథాన్ని అధిరోహించి శంఖచక్రగదాఖడ్గహస్తుడై దేవతలకు తన దర్శనభాగ్యాన్ని ప్రసాదించాడు.

దేవతలు వాసుదేవుని పాదపద్మాలకు మోకరిల్లి తమకు వచ్చిన కష్టాన్ని విన్నవించుకొన్నారు. ''దేవా! దైత్యుల బారి నుంచి శరణార్థులమై మేము నీ చెంతకు వచ్చాము. దైత్యానీకంతో స్వర్గాన్ని దండెత్తి ప్లాదుడు మమ్మల్ని స్వర్గధామం నుంచి త్రోసివేశాడు. యజ్ఞభాగాలు లేక అమరకులం సంక్షోభిస్తున్నది. జగత్తును సర్వాన్తరితమైన నీ మాయాశక్తి విలసనగా దర్శించి సర్వకాల సర్వావస్థలలోనూ స్వవర్ణధర్మాభిరతులమై వేదమార్గాన్ని అనుసరిస్తున్నాము. కారణకారణుడవైన నీ వుండగా ఆ దైత్యులు మాకేన్నో అపకారం చేశారని వారిని మా చేతులతో చంపలేక, మా అందరిలోనూ ఏకాకృతివై వెలుగొందుతున్న నిన్ను శరణు కోరి నీ పాదాలను ఆశ్రయించాము. దైత్యుడవు, దానవుడవు, దేవ

తవు, దేవేశ్వరుడవు ఐన నీవే మాకు కర్తవ్యాన్ని బోధించి శక్తిని ప్రసాదించు'' అని వేడుకొన్నారు.

శ్రీ మహావిష్ణువు వారి మొరాలకించి ప్రసన్నుడైనాడు. తన శరీరం నుంచి ఒక మాయామోహన రూపాన్ని సృజించి దేవతలకు వరంగా ఇచ్చాడు. ''వేదబాహ్యులైన దైత్యులు ఏతన్మాయా మోహితులై స్వశక్తులను కోల్పోతారు. మాయాపారవశ్యంలో అప్రతిభులై నిలుచున్నవారిని నిలుచున్నట్లే సంహరించి మీరు విజయాన్ని సాధిస్తారు. విశ్వవిశ్వంభరాభారసంభరణ మహాయత్నంలో నాకు, నా భక్తులకు అడ్డువచ్చినవారికి వినాశం తప్పదు'' అని అభయాన్ని ప్రసాదించాడు.

మాయామోహుడు భూమండలానికి దిగి వచ్చి నర్మదా తీరానికి వెళ్ళి ఆశ్రమవాసం చేయసాగాడు. నెమిలి యీకలను ధరించి ముండిత శిరస్సుతో దిగంబరుడై కనిపించిన అతనిని చూసి తపోదీక్షితులై ఉన్న రాక్షసులు చుట్టుముట్టారు.

మాయామోహుడు శాంతవచనాలతో ప్రసంగించి క్షణంలో రాక్షసులను ఆకట్టుకొన్నాడు. ''ఓ దైత్యపతులారా! ఐహికాముష్మికాలలో ఏ మహాఫలాన్ని కోరి మీరిక్కడ తపస్సు చేస్తున్నారు?'' అని కుశలానుయోగాలు మొదలుపెట్టాడు.

''అయ్యా! మాకు ఐహికాలను గురించి ఆసక్తి లేదు. ఆత్యంతికమైన ఆముష్మికఫలానికై తపస్సు మొదలుపెట్టాము. అయినా ఈ వివరాలు మీకెందుకు? ఏమన్నా చేతనైతే ముక్తి మార్గాన్ని మాకు చూపించండి. లేదా మీ పని మీరు చూసుకోండి'' అని వారు సమాధానం చెప్పారు.

మాయామోహుని యత్నం సఫలమయింది. ''మీరు ముక్తిని కోరుకొన్నవారైతే నేను చెప్పినట్లు నడుచుకోండి. నేను

వివరిస్తున్న ధర్మమర్మాలు తెలిసిన తర్వాత మోక్షం మీకు సులభ గమ్యం. మీవంటి మహాబలులకు నేను ప్రవచిస్తున్న ధర్మం మార్గ దర్శకంగా ఉంటుంది'' అని ఈ విధంగా అసలు సంగతిని విడిచిపెట్టి అరచేతిలో స్వర్గం చూపించాడు. కుయుక్తులను ప్రదర్శించి వారిని వేదధర్మాల నుంచి అపాకరించాడు.

''ఇది ధర్మం కావచ్చు, ధర్మం కాకపోనూవచ్చు; సత్యం కావచ్చు, అసత్యమూ కావచ్చు; విముక్తి నివ్వవచ్చు, ఇవ్వకపోనూ పోవచ్చు; పరమార్థం కానూవచ్చు, అవకపోనూవచ్చు; కార్యమే కావచ్చు, అకార్యం అయినా కావచ్చు; దిగంబరుల ధర్మమూ కావచ్చు, కానివారిదీ కావచ్చు''—అని ఒక దుర్గమమైన విద్యా రణ్యాన్ని ప్రబోధించి రాక్షసులను మోహపారవశ్యంలో ముంచె త్తాడు. ఆ మాటల ప్రవాహంలో పడి కొట్టుకొనిపోయి రాక్షసులు అర్థాలు వెతుక్కోవడం మానివేశారు. స్వధర్మాన్ని పరిత్యజించి క్రొత్తగా వచ్చిన ఆ దిగంబరధర్మాలకు అలవాటుపడ్డారు.

''మీరు పాటిస్తున్నది మహాధర్మం. ఈ ధర్మాన్ని పాటించ డానికి మీరే అర్హులు. ఈనాటి నుంచి మీకు అర్హతులని, మీ ధర్మానికి అర్హతధర్మమని పేరు కలుగుతుందిగాక!'' అని ఆ మాయా గురువు వారి పేరు మార్చి, వేషభాషలను కూడా మార్చి వేశాడు.

ఈ విధంగా రాక్షసులను మోహపాశంలో ముంచెత్తి శ్రీమహావిష్ణుదూత అనతికాలంలోనే రాక్షసకులాన్ని దిగజార్చి, వారిలో కొందరు గురుశిష్యులను కూడా నియమించాడు. వారు ఇతరప్రాంతాలకు వెళ్లి తమ ప్రచారాన్ని కొనసాగించారు. చూస్తూ ఉండగానే దైత్యకులం వేదభ్రష్టమైపోయింది.

కొన్నాళ్లకు మాయామోహుడు రక్తవస్త్రాలను ధరించి మరొక కొత్త ధర్మాన్ని లేవదీశాడు.

"ఓ దైత్యులారా! మీరు స్వర్గాన్ని కోరినవారైతే ఈ పశుహింసను కట్టిపెట్టండి. నిర్వాణం కావాలనుకొంటే యజ్ఞయాగాలను మానివెయ్యండి. మీవంటి ప్రబుద్ధుల కోసం రూపొందించిన నా ప్రబోధాన్ని వినండి. ఈ జగత్తు నిరాధారమైనది. అంతా భ్రాంతి మూలకం" అని ప్రవచింపసాగాడు.

మాయాబోద్ధ కల్లబొల్లి మాటలను విశ్వసించి రాక్షసులు యజ్ఞాదులను మానివేశారు. వారిలోనూ కొందరు ప్రబుద్ధులు బయలుదేరి ఆ బోధలను ప్రచారం చేశారు. వీరితో రాక్షసగణం వేదబాహ్యమైనది చాలక రెండువర్గాలుగా చీలిపోయింది.

పాషండధర్మాలను వ్యాపింపజేయడంతో మాయామోహుడు ఊరుకోలేదు. ఇంకా కొన్నివాదాలను లేవదీశాడు. అసలు దేవుడే లేడన్నాడు. వేదాభ్యాసం మానిపించి రాక్షసులను జడబుద్ధులుగా, సుఖలుబ్ధులుగా తయారు చేశాడు. అతని శిష్యులలో కొందరు యజ్ఞకర్మలపైన, బ్రాహ్మణుల పైన విరుచుకుపడ్డారు. "నెయ్యిపోసి జంతువుల గొంతుకోస్తే ఏదో ఒరిగి పడుతుందనుకోవడం వట్టి మూర్ఖత్వం. ఈ కట్టెలు తగలబెట్టి దేవేంద్రుడికి తిండి పెడుతున్నా మనుకుంటున్న వాళ్లు పిచ్చివాళ్లు. పోనీ వాళ్ళ మాటే నిజమైతే, కాలిన కట్టెలు మింగుతున్నవాడు ఆకులూ అలాలూ తిని కాలం గడుపుతున్న వాళ్ల కంటె హీనంగా బతుకుతున్నా డనుకోవాలి. నోరులేని జంతువులను చంపితేనే స్వర్గంవస్తుంటే, ఈ యాజకుడి తండ్రిని చంపితే మరింకెంత పుణ్యం లభిస్తుందో కదా! ఇక్కడ శ్రాద్ధం పెట్టి ఎక్కడో కనబడని లోకాల్లో ఉన్నవాళ్లకు అందించగలవాడు ఇంట్లో కూర్చుని పొరుగింట్లో వాడి కడుపు నింపలే డెందుకని?" అని వాళ్లు చప్పట్లు కొడుతుంటే మాయామోహుడు వారిని మరీ రెచ్చగొట్టేవాడు. "శ్రేయస్సు అనేది ఎవడో చెప్పినట్లు చేస్తే ఊడిపడేది కాదు.

మంత్రాలకు చింతకాయలు రాలిపడే కాలం పోయింది. హేతువాదంతో ఆలోచించి నేను చెప్పినట్లుగా నడుచుకోండి'' అని ఉపన్యసించి మరికొందరు దైత్యులను తన పక్షానికి త్రిప్పుకొన్నాడు.

ఇలా దైత్యులు వేదధర్మాన్నుంచి వేరుపడి శక్తియుక్తులను కోల్పోయాక దేవతలు వారితో కయ్యానికి దండుకట్టి వచ్చారు. అప్పుడు జరిగిన యుద్ధంలో ధర్మబలం కలిగిన దేవతలు అధర్మపరులైన రాక్షసులను ఊచకోత కోశారు. రాక్షసులు చేతులు కాలాక ఆకులు పట్టుకొన్నా లాభం లేకపోయింది.

*　　　*　　　*

మైత్రేయా!

త్రయీ సంవరణమే మానవాళికి తరుణోపాయం. ఆ సంవరణాన్ని విప్పివేసిన అధర్మపరులకే నగ్నులని వ్యవహారం. వర్ణధర్మాశ్రితులకు ఆశ్రయమైన ఆశ్రమధర్మాల స్వరూపం నీవింతకు పూర్వం తెలుసుకొన్నావు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం ఇవే ఆశ్రమాలు. ఇక వేరే పంచమ ధర్మోదయానికి అవకాశం లేదు.

ఎవరు ధర్మభ్రష్టులో వారే నగ్నులు. నిత్యాది కర్మలను నిర్లక్ష్యం చేసి ధర్మమార్గం నుంచి దిగజారినవారు శరణ్యాంతరం లేక తమ లోపాలను కప్పిపుచ్చుకొనడానికి దిగంబర ధర్మాలను స్వీకరిస్తారు.

నిత్యకర్మలను అనుష్ఠింపగల దేహారోగ్యం సమృద్ధంగా ఉన్నప్పుడు ఒకరోజు అశ్రద్ధ వహించినవారికి ఏకాహపర్యాప్తమైన పాపం వాటిల్లుతుంది.

పక్షం రోజులు అశ్రద్ధ వహించినవారు ప్రాయశ్చిత్తవిధులను ఆచరించి దోషవిముక్తులు కావాలి.

ఒక సంవత్సరంపాటు క్రియావిహీనంగా బ్రతికిన సదాచార విముఖులకు పాపం కలగడమే కాక వారి ముఖం చూసినవారికి కూడా వాటిల్లుతుంది. వారిని తాకితే సచేలస్నానం చేయాలి.

ఏ గృహస్థుని ఇంటిలో దేవతార్చనం, భూత సంతృప్తి ఘటనం జరగడం లేదో ఆ ధర్మభ్రష్టుని ఇల్లు పాపపంకిలం. భగవంతుడు ప్రసాదించిన ఉచ్ఛ్వాస నిఃశ్వాసలను ప్రాణాయామంతో పవిత్రీకరించుకోని విష్ణుధ్యానరతాత్ములై, విష్ణునామ సంకీర్తన పండితులై జీవితాన్ని విష్ణుతేజోవిలసితంగా వెలయింపని విష్ణు విముఖుల ఇల్లు నరకానికన్నా హీనప్రదేశం. వారితో సహవాసం అంతకన్నా పాతకం. వారితో నిద్రాహారవిహారాలను కావించిన వారికి కూడా పాపం కలుగుతుంది.

ప్రతినిత్యం దైవతార్చనం, సంధ్యావందనం, అతిథిసత్కారం కావింపక భోజనానికి కూర్చున్నవాడు ఆ పాపఫలాన్నే భుజిస్తాడు. స్వధర్మాన్నుంచి అధఃపతనం చెందినవారు హీనకర్ములకు లొంగిపోయి నగ్నసంజ్ఞితు లవుతారు. అనాచార దోషదూషితులైన ఈ నగ్నులు పరికించిన శ్రాద్ధకర్మలకు దేవతలు, పితృదేవతలు రారని నేనింతకు ముందు అన్న మాటలోని అంతరార్థం ఇదే.

శతధన్వుని వృత్తాంతం

పూర్వం యదుకులంలో జన్మించిన శతధన్వు డనే మహారాజు మహీమండలాన్ని ధర్మసమ్మతంగా పరిపాలించి లోకంలో విష్ణుతేజాన్ని సముద్దీపింపజేశాడు. అచిరకాలం లోనే అతని కీర్తిప్రఖ్యాతులు దిశదిశలకూ ఎగబ్రాకాయి.

శతధన్వుని భార్య శైబ్య. ఆమె సత్యశౌచాలు, దయాస్వభావం మూర్తీభవించిన దొడ్డ ఇల్లాలు.

రాజదంపతులు ప్రతినిత్యం శ్రీ జనార్దనుని ఆరాధించి యజ్ఞ కర్మలు, దానధర్మాలు విస్తారంగా చేశారు. పుణ్యక్షేత్రాలను, పుణ్యతీర్థాలను దర్శించి శ్రీమన్నారాయణుని సేవావిధులను నిర్వర్తించుకొన్నారు.

కొంతకాలానికి శతధన్వుడు కార్తీకపున్నమి నాడు పుణ్య భాగీరథీతోయాలలో శ్రాద్ధకర్మ లాచరించి, ధర్మపత్నీ సమేతంగా స్నానం చేసి, నీళ్లనుంచి గట్టుమీదికి వచ్చేసరికి ఆయనకు విలువిద్య నేర్పించిన ఆచార్యుని సన్నిహితమిత్రుడు డొకడు సమీపానికి వస్తూ కనిపించాడు.

రాజు అతనికి ఎదురేగి, ఆప్యాయంగా పలకరించి కుశల ప్రశ్నలు వేసి కొంతసేపు సంభాషించాడు. రాజమహిషి మాత్రం ఉపవాసక్లేశంతో నీరసించి ఉన్నందున ముండితశిరస్కుడైన ఆ పాషండుని వైపు చూడగానే ముఖం త్రిప్పుకొని సూర్యునికేసి చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

ఇంటికి తిరిగివచ్చాక మళ్లీ యథాప్రకారం విష్ణుపూజలను కొనసాగిస్తూ ఆ దంపతులు ధర్మాధ్వనీనులై ప్రశాంతంగా జీవించారు.

నిరంతరమూ మహాసంగ్రామాలలో శత్రువులను జయించి, దిగ్విజయాన్ని సాధించిన మహాయోధుడు, నిరంతర శ్రీమహావిష్ణు ధ్యానపూజాపరాయణుడు శతధన్వుడు కొంతకాలానికి కర్మ పరిభుక్తమయాక పంచత్వాన్ని పొందాడు.

ఉపవాససమయంలో పాషండునితో సంభాషించి మౌనవ్రతం భంగమైన పాపఫలితంగా శతధన్వుడు విదిశాపురంలో కుక్కగా పుట్టవలసివచ్చింది.

రాజపత్ని శతధన్వుని మృతకాయంతో అగ్నిప్రవేశం చేసింది. ఆమె ఉత్తర జన్మలో కాశీదేశపు రాజుకు కుమార్తెగా జన్మించింది.

కాశీరాజపుత్రికి పూర్వపుణ్యం వలన జాతిస్మరత్వం కలిగింది. అచిరకాలం లోనే ఆమె సమస్తవిద్యలను సంపూర్ణంగా అభ్యసించింది. క్రమంగా యౌవనోచిత వపుర్విజృంభణం కలిగి ఆమెకు లోకోత్తర సౌందర్యరాశి అని పేరువచ్చింది.

తండ్రి ఆమెకు తగిన వరుణ్ణి అన్వేషించి వివాహం చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టాడు. కాని ఆమె ఏదో ఒక అభ్యంతరం చెబుతూ వివాహప్రయత్నాలను విరమింపజేస్తూ వచ్చింది.

జాతిస్మరత్వం వలన పూర్వజన్మానుభవాలు ఆమెను వెన్నంటి వచ్చాయి. దివ్యదృష్టితో తన భర్త శ్వానంగా జన్మించాడని గ్రహించి, అన్యపురుషుని పెండ్లాడరాదని నిశ్చయించుకొన్నది.

ఒకప్పుడు ఆమె విదిశకు వెళ్లి పురవీథులలో సంచరిస్తున్న ఆ కుక్కను చూసి తన ప్రాణేశ్వరుడే అని గుర్తుపట్టింది. వరమాలను అతని కంఠంలో అలంకరించి, అన్నపానాదులు సమర్పించింది. ఆ శ్వానం తన జన్మలో మొదటిసారిగా లభించిన మృష్టాన్నాలను అపురాపురుమంటూ తిని, తనకు కలిగిన సంతోషాన్ని జాతిసహజమైన తన ధోరణిలో తోకజాడించి గంతులు వేస్తూ ప్రకటించింది. ఆ వికటచేష్టలకు రాజకుమార్తె సిగ్గుపడి, తన భర్తకు ప్రణామం చేసి, "మహారాజా! తీర్థస్నానం చేసివస్తూ దాక్షిణ్యలలితులైన మీరు అపముహూర్తంలో పాషండునితో సంభాషించిన వృత్తాంతాన్ని జ్ఞాపకం చేసుకోండి. ఆనాటి మౌనవ్రతహాని దోషం వలన మీరు కుక్కగా పుట్టారు. దేహాంతరంలో ... భార్యను" అని సవినయంగా ప్రసంగించింది.

ఈ మాటలతో శ్వానానికి త... ...ం కథావశేషం వలె జ్ఞాపకం వచ్చి పట్ట... నిర్వేదంతోనే విదిశాపురాన్ని విడిచి... మార్గమధ్యంలో ప్రాణాలు విడిచి స...

రాజకుమార్తెకు ఈ విషయం తెలిసి కోలాహాలగిరి కందరాలకు వెళ్లి తన భర్తను కలుసుకొన్నది. "మహారాజా! నేను మీ భార్యను, మీరు తీర్థస్నానం ఆచరించి పాషండునితో ప్రసంగించిన విషయమూ, ఉత్తరజన్మలో శ్వానమై జన్మించిన మిమ్మల్ని నేను చూడవచ్చిన విషయమూ జ్ఞాపకం ఉన్నదా?" అని ప్రశ్నించింది.

సృగాలానికి జాతిస్మరత్వం కలిగింది. అది తన నిస్సహాయతకు, దురవస్థకూ శోకించి ఆ దుఃఖంతోనే కొన్నాళ్లకు ప్రాణం విడిచి తోడేలుగా పుట్టింది.

కాశీరాజపుత్రి మళ్లీ దివ్యదృష్టితో తన భర్త రూపాన్ని దర్శించి అక్కడికి వెళ్లింది. "మీరు నిజంగా వృకదేహులు కారు. చతుస్సముద్ర ముద్రితమైన భూమండలాన్ని ధర్మసమ్మతంగా పరిపాలించిన సార్వభౌములు. శతధన్వులై, శ్వానమై, సృగాలమై, వృకరూపాన్ని ధరించిన మిమ్మల్ని కలుసుకోవాలని ఇంత దూరం వచ్చాను" అని పలికింది.

ఆ వార్త విని పూర్వజన్మ జ్ఞానం కలిగి తోడేలు తన దుస్థితికి విలపించి చింతాక్లేశంతో అసువులు బాసి గృధ్రమై జన్మించింది.

రాజకుమార్తె మళ్లీ తన భర్తృదేహాన్ని గుర్తుపట్టి అక్కడికి వెళ్లి పూర్వకథానకాలను జ్ఞాపకం చేసింది. "ఒకే ఒక్కసారి
పాషండునితో [illegible] సిన పాపం మిమ్మల్ని జన్మజన్మలకూ
వెన్నంటివ [illegible] రిప్పుడు గ్రద్ద రూపంలో ఉన్నా, మీ
పూర [illegible] చూడండి" అని విన్నవించుకొన్నది.

[illegible] ప్రాణాలు విడిచి కాకిగా జన్మించింది.
[illegible] అక్కడికీ వెళ్లింది. "ఈ విధంగా
[illegible] ు భుజిస్తున్న మీరు ఒకప్పుడు

ధరాతలేశ్వరులు. ఈ నాటికీ ప్రజలు మీకు సమర్పిస్తున్న శ్రాద్ధాలను జ్ఞాపకం చేసుకొని చూడండి'' అని ప్రార్థించింది.

కాకి ఆ తర్వాత నెమలిగా జన్మించింది. రాజకుమార్తె స్వయంగా తానే ఆ నెమలిని అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేయసాగింది.

ఆ సమయంలో కాశీరాజు అశ్వమేధయాగాన్ని సంకల్పించి ఋత్విజులను రావించి జయప్రదంగా పూర్తిచేశాడు. యాగాంతంలో అవబృథస్నానాలు చేస్తున్నప్పుడు రాజపుత్రి తన పెంపుడు మయూరానికి స్నానం చేయించి, తాను కూడా స్నాతపవిత్ర దేహంతో వెలికివచ్చి భర్తకు పూర్వజన్మలను జ్ఞాపకం చేసింది.

నెమలి ఆ దేహాన్ని విడిచి మనుష్యజన్మను పొంది గుణశీలాలు గల ఉత్తమ వంశంలో పురుషుడై జన్మించింది.

కాశీరాజు తన కుమార్తెకు స్వయంవరాన్ని ప్రకటించాడు. కొలువుకూటానికి వచ్చిన అభ్యర్థులలో తన భర్తను గుర్తుపట్టి రాజకుమార్తె అతనినే వరించింది.

ఆ దంపతులు కలిసిమెలిసి అన్యోన్యంగా సుఖజీవితం గడిపారు. కొంతకాలానికి కాశీరాజు అస్తమించాక శతధన్వుడు రాజ్యాన్ని విస్తరింపజేసి మొత్తం విదేహరాజ్యాన్ని పరిపాలించాడు. వారికి పుత్రసంతానం కలిగి పున్నామనరక భయం తొలగిపోయింది.

శతధన్వుడు శ్రీమహావిష్ణుసేవావిధులతో అనాయాసంగా జీవితాన్ని గడిపి పండువయస్సులో ప్రాణత్యాగం చేశాడు. అతని మృతకాయంతో ధర్మపత్ని [illegible] చేసింది. అనంతమైన పుణ్యఫలం వలన వారు ఇం[illegible] వాసాల కన్న సమున్నతమైన కామదోహన [illegible] శాశ్వతానందాన్ని పొందారు.

మైత్రేయా! పాషండులతో సంభాషణం ఎంత దోషకరమో, యాగాంతంలో అవభృథస్నానం ఎంత పుణ్యావహమో విశదీకరించడానికి ఈ కథానకాన్ని ప్రస్తావించాను. నిత్యకర్మలను ఒక నెలరోజుల పాటు విస్మరించినవాని ముఖదర్శనమే పాపహేతువయితే వేదధర్మాన్ని అతిక్రమించి వేదబాహ్యులైనవారితో సంభాషణం ఎంత మహాపాప మవుతుందో ఊహించవచ్చు.

అందుచేత సదాచారనిరతులు దుర్జనులకు దూరంగా ఉండాలి. పాషండులు, దురాచారపరులు, నయవంచకులు, శఠాత్ములు కనిపిస్తే మర్యాదకోసమైనా వారితో మాట్లాడకూడదు. వారి ప్రసంగాలకు చెవి ఒగ్గకూడదు. వారిని చేరదీయకూడదు.

పాపకర్ములతో సహవాసం కంటె పాతకం వేరొకటి లేదు కదా!''

అని నగ్నలక్షణాలను పరాశరమహర్షి మైత్రేయునికి ఉపదేశించాడు.

విష్ణు పురాణము

చతుర్థ భాగం

ఈ విధంగా పూర్వ భవితవ్య మన్వంతరాలు, మహర్షివరేణ్యుల పుణ్యకథాసంస్తుతులను నిస్తులంగా విస్తరింపబూని పరాశర మహర్షి సమస్త ప్రశస్తవస్తువులనూ ప్రస్తావించేసరికి మైత్రేయుడు సంప్రీతస్వాంతుడై —

"మహాత్మా! భూమండలాన్ని పరిపాలించిన రాజన్యోత్తముల వంశానుచరితాన్ని వివరించండి" అని కోరాడు.

అతని కాంక్షితాన్ని వక్తవ్యాంశానికి భూమికగా స్వీకరించి, మౌనీంద్రుడు తన కథానకాన్ని కొనసాగించాడు.

సూర్య-చంద్రవంశాల చరిత్ర

"మైత్రేయా! పద్మగర్భసమారంభమైన శ్రీవైవస్వత మన్వం
తరంలో భూమండలాన్ని పరిపాలించిన సూర్యా ... మృతాంశు వంశాల
రాజులందరూ నారాయణుని తేజో ... స్మరణీయులైన
ఆ మహాప్రభువుల వంశానుక్ర ... కర్ణించిన
సుధర్ములకు పాపనిర్మోచ ... లుగు
తాయి.

"బ్రహ్మాండకటా ...
విష్ణువు నాభికమల ...
జన్మించి స ...

ఆ సమయంలో బ్రహ్మదేవుని కుడిచేతి బొటనవ్రేలిని జన్మస్థానంగా గైకొని దక్షప్రజాపతి జన్మించాడు.

దక్షుని కుమార్తె అదితి. ఆమె కశ్యపప్రజాపతి ధర్మపత్ని. ఆ దంపతులకు కాలాత్మకుడైన శ్రీసూర్యనారాయణుడు ఉదయించాడు.

సూర్యునికి విశ్వకర్మ ప్రజాపతి సంజ్ఞ నిచ్చి వివాహం చేశారు. ఆ మిథునానికి సాంప్రతమన్వంతరాధీశుడయిన వైవస్వతుడు జన్మించాడు.

వైవస్వతమనువుకు ఇక్ష్వాకుడు-నృగుడు-ధృష్టుడు-శర్యాతి-నరిష్యంతుడు - ప్రాంశుడు - నాభాగుడు - నేదిష్ఠుడు - కరూషుడు-పృషధ్రుడు జన్మించి మహీపతులై విలసిల్లారు.

పుత్ర సంతానం కలగడానికి పూర్వం వైవస్వతుడు పుత్రకామేష్టిని ఆచరించాడు. వశిష్ఠమహర్షి ఆధ్వర్యవంలో యాగం సలక్షణంగా జరిగింది. యాగారంభంలో హోత పుత్రోదయాన్ని, అతని భార్య శ్రద్ధాదేవి కుమార్తె కావాలనీ సంకల్పించారు. హోతృకాపచార దోషం వలన అపహుతమై వారికి ఇళాదేవి జన్మించింది. యాగపురుషులైన మిత్రావరుణులు కరుణించి ఆమెను పురుషునిగా మార్చారు. దేవత [illegible]గ్ర ప్రసాదంతో జన్మించిన అతని శరీరకాంత్యౌజ్జ్వల్యానికి [illegible] ఇదంద్రులు సుద్యుమ్ను డని పేరు పెట్టారు.

[illegible] . గర్వగంధం ప్రాపించిన

వారి [illegible] రంగా రూపొందుతుంది.

[illegible] వ్యాలన్నీ సమగ్రంగా

[illegible] పద్గర్వాలతో

మదించి ఎవ్వరినీ లెక్క చేయక ఇచ్ఛకు వచ్చినట్లు విచ్చలవిడిగా తిరగడం మొదలుపెట్టాడు. ఒకప్పుడు పరపురుషులు ప్రవేశింపరాని పార్వతీపరమేశ్వరుల రహస్యక్రీడావనంలో సంచరిస్తూ ఉంటే పరమేశ్వరుడు కోపించి అతనిని మళ్లీ వనితగా మార్చివేశాడు.

ఈ విధంగా స్త్రీ రూపాన్ని ధరించిన సుద్యుమ్న చంద్రుని కొడుకైన బుధుని ఆశ్రమానికి పరిసరప్రాంతాలలో దారితప్పి ఏకాంతంగా నడయాడుతుంటే సోమాత్మజుడు చూసి ప్రథమదర్శనంలోనే ఆమెను మోహించాడు.

ఆ సమాగమం సుద్యుమ్నారౌహిణేయుల పరస్పర తపఃఫలంగా పరిణమించింది. బుధుడు ఆమె సౌందర్యానికి విముగ్ధుడైనాడు.

''సృష్టికర్త లోకంలో ఉన్న సౌందర్యలావణ్యాలను రాశిపోసి ఈ రమణీలలామను సృజించాడు. నెమ్మదిని సమ్మోహింపజేసే ఈమె కెమ్మోవి కమ్మతేనెలను ఆస్వాదింపగలగడమే బహు జన్మల పుణ్యఫలం. ఈ యింతి కౌగిలింతల పులకింతలతో నిరంతర కంతుకేళీ సంతోషితస్వాంతుడనై జీవితాన్ని పండించుకోవడమే దేహమున్నందుకు ఫలం. వసంతమాసంలో చిగురించిన నవరసాలకిసలయాలను మెసవిన వనకోకిలల పంచమస్వరం కిలారించిన ఈమె పలుకులను వినగలగడమే వీను లున్నందుకు ప్రతిఫలం.''

అని సంభావించి రోహిణీనందనుడు సుద్యుమ్నకు తన అభీప్సితాన్ని తెలియజేశాడు. కొంతకాలానికి ఆ దంపతులకు పురూరవుడు జన్మించాడు. చంద్రవంశం చరితార్థమైంది.

సుద్యుమ్నుడు శాపగ్రస్తుడైనాక సూర్యవంశాంకురం ఇంకా కలుగలేదని వైవస్వతుడు చింతాక్రాంతు డయ్యాడు. అప్పుడు

మహర్షులు యజ్ఞేశ్వరుడైన శ్రీమహావిష్ణువును ప్రార్థించి ఇళాదేవిని మళ్లీ సుద్యుమ్నునిగా పరివర్తింపజేశారు. కాలాంతరంలో సుద్యుమ్నునికి ముగ్గురు కొడుకులు, ఉత్కలుడు - గయుడు - వినతుడు జన్మించారు.

సుద్యుమ్నుడు స్త్రీత్వాపాదిత దోషం వలన పట్టాభిషేకానికి అర్హతను కోల్పోయాడు. అప్పుడు కులగురువైన వసిష్ఠమహర్షి వైవస్వతునికి కర్తవ్యాన్ని ఉపదేశించి, గంగానదికి ప్రాగ్దిశలో ఉన్న ప్రతిష్ఠానపురాన్ని అతనికి సంక్రమింపజేశాడు. సుద్యుమ్నుడు ధర్మపరుడై సకల భోగాధిష్ఠానమైన ఆ పుణ్యభూమిని మనుధర్మానుసారంగా చిరకాలం పరిపాలించి, రాజ్యాధికారం పురూరవునికి ఇచ్చివేసి వానప్రస్థాన్ని స్వీకరించాడు.

వైవస్వతుని పుత్రులందరూ చక్రవర్తులై భూమండలాన్ని నిష్కంటకంగా పరిపాలించారు.

ఒకప్పుడు పృషధ్రుని వలన ఒక ఆవు చనిపోయింది. గోహత్యాపాతకానికి ఫలితంగా అతను శూద్రుడై, కులభ్రష్టుడయ్యాడు. అతని పేరిట శూద్రవంశం ఉత్పాదిల్లింది.

కరూషుడు వింధ్యాచలానికి ఉత్తరదిశను ప్రజాభిరంజకంగా పరిపాలించి సాటిలేని కీర్తిప్రఖ్యాతులను గడించాడు. అతని పుత్రులు మహాయోధులై రాజ్యాన్ని నలుదెసలకూ వ్యాపింపజేశారు. వారి సంతతికి కారూషులని పేరు వచ్చింది.

నేదిష్ఠునికి నాభాగుడు జన్మించి వైశ్యధర్మాన్ని చేపట్టాడు. అతనికి బలంధనుడు, బలంధనునికి వత్సప్రీతి, వత్సప్రీతికి ప్రాంశుడు, ప్రాంశునికి ప్రజాని, ప్రజానికి ఖనిత్రుడు, ఖనిత్రునికి మహాబలుడైన చక్షుపుడు, చక్షుపునికి వింశుడు, వింశునికి వివింశతి, వివింశతికి ఖని

నేత్రుడు, అతనికి మహాబలైశ్వర్య విక్రమోర్జస్వలుడైన కరంధముడు, కరంధమునికి అవిక్షితుడు, అవిక్షితునికి మహాపరాక్రమశాలి మరుత్తుడు జన్మించారు.

మనువంశోత్తములలో మరుత్తుడు అగ్రగణ్యుడు. తన కుల ధర్మానికి అనురూపంగా భూమండలాన్ని ఎనభై అయిదు వేల సంవత్సరాలు పరిపాలించి సమర్థుడని పేరు తెచ్చుకొన్నాడు. అతని యేలుబడిలో ప్రజలు స్వర్గభోగాల కన్నా అతిశయంగా సుఖశాంతులను చూరగొన్నారు.

పండువయస్సులో మరుత్తునికి క్రతుకృత్యాలపై మనసు మళ్లింది. ఆంగీరసప్రజాపతి కొడుకైన సంవర్తుని ఋత్విజునిగా రావించి, త్రిభువనాశ్చర్యకరమైన అశ్వమేధ యాగాన్ని ఆచరించాడు. భూమండలమంత విశాలమైన యాగశాలను నిర్మించి, భూజనులందరినీ రావించి భోజనాదులు సమకూర్చాడు. క్రతుశాల మొదలుకొని కలశాల వరకు సువర్ణాన్ని పోతపోశాడు. సోమపానానికి సాక్షాత్తు దేవేంద్రుడినే కొనివచ్చి సమక్షంలో తనియజేశాడు. నిర్విఘ్న పరిసమాప్తి కోసం యజ్ఞవాటికను మరుద్గణాలు పరివేష్టించి వేయి కళ్లతో కాపు నిలిచాయి. ఆనాడు బ్రాహ్మణులకు దక్షిణగా పసిడిగనులను త్రవ్వి తలకెత్తారు. సృష్టి ప్రారంభం మొదలుకొని ఇటువంటి మహాయజ్ఞాన్ని ఏ మహారాజూ నిర్వహింపలేదని మహాకవులు ముక్తకంఠంతో కవితాగానం చేశారు. ఈ నోటా ఆ నోటా ఈ మాటే మేటి పాటగా గాటంగా నాటుకొని చాటువులు పాటిల్లాయి.

మరుచ్చక్రవర్తికి నరిష్యంతుడు జన్మించాడు. అతని కొడుకు దమభూపతి. దమునికి రాజ్యవర్ధనుడు, అతనికి సుధృష్టి, సుధృష్టికి నరుడు, నరునికి కేవలుడు, అతనికి బంధుమంతుడు, బంధుమంతునికి

వేగవంతుడు, అతనికి బుధుడు, బుధునికి తృణబిందుడు, తృణబిందునికి ఇలబిల అన్న పేరిట ఒక కుమార్తె జన్మించారు.

కొంతకాలానికి తృణబిందుడు అప్సరసలలో అతిలోక సౌందర్యవతి అయిన అలంబసను పెండ్లి చేసుకొన్నాడు. వారికి లోక విఖ్యాతచారిత్రుడైన విశాలుడు ఉదయించాడు. విశాలుని పేరిట సర్వవిద్యలకూ ఆలవాలమైన వైశాలీ నగరం వెలిసింది.

విశాలభూపతికి హేమచంద్రుడు, అతనికి సుచంద్రుడు, సుచంద్రునికి ధూమ్రాశ్వుడు జన్మించారు. ధూమ్రాశ్వుని కొడుకు సృంజయుడు. అతని కుమారుడు సహదేవుడు. సహదేవునికి కృశాశ్వుడు, అతనికి సోమదత్తుడు కలిగారు.

అనతికాలంలోనే సోమదత్తుడు పది అశ్వమేధ యాగాలను నిర్వహించి బ్రాహ్మణులకు భూరిదక్షిణల నిచ్చాడు. యాగాశ్వగతిపరీతమైన ధరాతలాన్ని రక్షించి అతి విస్తారంగా దానధర్మాలు చేశాడు. యజ్ఞేశ్వరుడైన శ్రీమహావిష్ణువును ఆరాధించి భక్తాగ్రేసరుడై మోక్షసామ్రాజ్యాన్ని చూరగొన్నాడు.

సోమదత్తునికి జనమేజయుడు, అతనికి సుమతి జన్మించారు.

తృణబిందుని మహిమ వలన వైశాలీ ప్రభువులు ధర్మవర్తనులై రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలించారు. అతని యశోలత శ్రీహరి సహకారదోహదంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లింది.

వైవస్వతమనువు నాలుగవ కొడుకు శర్యాతికి అనర్తుడు, సుకన్య జన్మించారు. సుకన్యను తపోధనుడై లోకవిఖ్యాతిని గడించిన చ్యవనమహర్షికిచ్చి వివాహం చేశారు.

అనర్తుడికి రేవతుడు జన్మించి కుశస్థలీపురాన్ని మహావైభవంగా పరిపాలిం డు. అతనికి నూర్గురు కొడుకులు పుట్టారు.

వారిలో పెద్దవాడు కకుద్మి. అతనికి రైవతుడని కూడ పేరు కలిగింది.

రేవతీబలరాముల వివాహం

కకుద్మికి సౌందర్యలక్ష్మీప్రత్యగ్రావతారమైన రేవతి జన్మించింది. రాజదంపతులు ఆమె ఆడింది ఆటగా, పాడినది పాటగా అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు. యౌవనోదయవేళకు ఆమె సౌందర్యం సంపూర్ణంగా వికసించింది. కన్నులు తెల్లకలువల వలె విప్పారి చంచలాకృతులైనాయి. శరీరం నునుపుతేలి లావణ్యాన్ని సంతరించుకొన్నది. ఊరువులు, జఘనాలు, జంఘులు బలీయాలై తేజరిల్లాయి. నఖశిఖరాలు, నయనాంతాలు, బింబాధరాలు, కుచచూచుకాలు ఎరుపుతిరిగి శోభాయమానంగా రూపుదిద్దుకున్నాయి. నడుము సన్నబడి, జీవనసుధారసపూరాలు నిండనున్న సూచనగా వక్షోజాలు పైకి ఉప్పొంగాయి. నడక శృంగార రంజితమై ఇభరాజగమనాన్ని సరిపోలింది.

రైవతుడు ఆమె పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. లోకాలన్నీ గాలించినా ఆమెకు తగిన వరుడు లభింపక అతను బ్రహ్మలోకంలో శతానందుని ఆస్థానానికి వెళ్లాడు. ఆ సమయంలో చతుర్ముఖుని సముఖంలో హాహాహూహూ గంధర్వులు లోకసమ్మోహనకరంగా గానం చేస్తున్నారు. ఆ దివ్యసంగీతానికి పరవశించి బ్రహ్మదేవుడు నిమీలితనేత్రాలతో తదేకతానంగా వింటుండడం చూసి కకుద్మి తానూ అక్కడే వేచి ఉన్నాడు. యుగాలు క్షణాలుగా గడిచిపోయే ఆ గంధర్వ గానాన్ని వింటూ ఒక ముహూర్తం సేపు నిలబడ్డాడు.

గీతావసానంలో రైవతకకుద్మి పరమేష్టికి నమస్కరించి, "మహాత్మా! సృష్టికర్తవైన నీకు తెలియనిదేమున్నది? సూర్యాన్వ

యంలో జన్మించిన ఈ కల్యాణవతి రేవతి నా కుమార్తె. ఈమెకు అనురూప శుభ లక్షణాలు గల ఉత్తమవరుని కోసం అన్వేషిస్తూ, మీరీమెకు ఎవరిని నిర్ణయించారో తెలిస్తే నా శ్రమ సార్థక మవుతుందని ఇక్కడకు వచ్చాను'' అని విన్నవించుకొన్నాడు. విరించి తల పంకించి, ''అసలు నీవు ఎవరికి చేయాలనుకొంటున్నావో ముందు చెప్పు. దానిని బట్టి నీకు నచ్చే వ్యక్తిని నేను చూపిస్తాను'' అని అభయమిచ్చాడు.

రైవతుడు తన ఎరుకలో ఉన్న కొంతమంది రాజన్యుల నామధేయాలను పేర్కొన్నాడు. వారిలో అర్హు లెవరో, అనర్హు లెవరో తన అభిప్రాయాన్ని విశదీకరించాడు.

కకుద్మి మాటలకు పితామహుడు తన దశనకాంతులు దశ దిశలా ప్రసరింపగా మందహాసం చేసి, ఈ విధంగా అన్నాడు:

''ఓయీ, నీవంటున్నది ఏనాటి సంగతి! వరాన్వేషణలో పడి నీవు భూమండలం నుంచి ఊర్ధ్వలోకాలకు వచ్చావు. ఇక్కడి కాల ప్రమాణంలో ముహూర్తకాలం పాటు గంధర్వగానాలను ఆలకిస్తూ నాకోసం నిలబడ్డావు. ఇప్పటికి మీ లోకంలో అనంతమహాయుగాలు గడిచిపోయాయి. రాజ్యాలు పోయి రాజ్యాలు వచ్చాయి. అప్పటి చక్రవర్తు లందరూ గతించి కొత్తవాళ్లు వచ్చారు. వైవస్వతాంత రంలో ఇరవైఎనిమిదో ద్వాపరయుగం ఇప్పుడు నడుస్తున్నది. కొద్ది కాలంలో కలియుగం ప్రవేశింపబోతున్నది. ఎన్నడో త్రేతాయుగం ప్రారంభపు దినాలలో జీవించిన నీ భార్య, బంధుమిత్రులు, పరివార సచివ సామంత మండలేశ్వరు లందరూ కాలగర్భంలో కలిసి పోయారు. నీవు వివాహప్రయత్నాలను మళ్లీ సరిక్రొత్తగా మొదలు పెట్టాలి సుమా!''

శతానందుని మాటలకు విషాదాశ్చర్యాలు ముప్పిరిగొనగా రైవతుడు చకితుడై పోయాడు. "దేవా! నిస్సహాయుడనైన నేనిక చేయగలిగిన దేమీ లేదు. నా కుమార్తెకు తగిన వరుని మీరే ప్రసాదించాలి" అని పితామహుని పరిపరి విధాల ప్రార్థించాడు.

ఆ విధంగా తనను శరణువేడిన కుశస్థలీవిభుని పట్ల కమలాసనాసీనుడు ప్రసన్నుడై అతనితో ఇలా అన్నాడు:

శ్రీ బలరామావతారం

"కకుద్మీ! శ్రీమన్నారాయణుడు సర్వలోకేశ్వరుడు. సర్గ స్థితి సంహృతి త్రితయముక్తాకారుడైన శ్రీమహావిష్ణువు సదసత్స్వరూపుడై విభాసిల్లుతున్న ఆదిదైవతం.

వాసుదేవుడు అనాదినిధన స్వరూపుడు. ఆయనే సృష్టి స్థితి లయాలకు కారణశరీరుడు, సృష్టి స్థితి లయాలను పొందుతున్నదీ ఆయనే. సృష్టి స్థితి లయాలూ ఆయనే.

కాలస్వరూపుడైన ఆ అవ్యయాత్ముడే కళాకాష్ఠానిమేషాది విభాగక్రమంలో దర్శనగోచరుడై ఉన్న విరాట్పురుషుడు.

సత్త్వస్వరూపు డయిన శ్రీమన్నారాయణ పరబ్రహ్మతేజం రజోగుణం చేత ఉద్రేకాన్ని పొందినపుడు సృష్టికర్తనైన నన్ను ఉపకరణగా పరిగ్రహించి భూతసృష్టిని కావిస్తున్నది.

ఆ వైష్ణవతేజమే తామసశీల మైనప్పుడు రుద్రాకృతిని తాల్చి జగత్ప్రళయానికి హేతుభూతమై విలసిల్లుతున్నది.

ఆయన తననుండి తానే ఉత్పాదించిన తన స్వరూపాన్ని తానే అనంతుడై సహస్రశీర్షాల పైన ధరియిస్తున్నాడు.

సూర్యచంద్రులు ఆ స్వయంజ్యోతిర్మయుని తేజోంశలు. ఆయన భూస్వరూపుడై భూతసృష్టికి ఆధారం. జలరూపుడైనప్పుడు

ధర్మనిర్వహణ పరంధాముడు. తేజస్స్వరూపుడై దృశ్యదర్శనాలకు కారణం. వాయురూపాన్ని సంతరించుకొన్నపుడు జీవజాతానికి ప్రాణదాత. ఆకాశరూపుడై విశ్వానికి మనికిపట్టు.

వేదప్రతిపాదితుడు, వేదవేదాంతవేద్యుడు, వేదాత్మకుడు ఐన శ్రీమహావిష్ణువు సర్వాంతర్యామి. సర్వభూతాంతరాత్మ. ఆ మహాత్మకుడు ధర్మసంస్థాపనం కోసం ఇప్పుడు భూమండలంలో లీలా మానుషవిగ్రహుడై యదుకులంలో అవతరించాడు. దేవతల రాజధాని యైన అమరావతి కంటె అధికభోగాలతో పూర్వం నీవు పరిపాలించిన కుశస్థలి ఉన్నచోట ఇప్పుడు ద్వారక అనే పట్టణం వెలసింది. అక్కడ శ్రీహరి బలదేవుడై చెలువొందుతున్నాడు. ఆయన సాక్షాత్తు శ్రీమన్నారాయణపరబ్రహ్మావతారం. ఆయనే నీ కుమార్తెను చేపట్టగల పురుషోత్తముడు. నీ కుమార్తె కూడా ఆ మహానుభావునికి అనురూపగుణశీలాలు కలిగిన రమణీలలామ. ఏ పరంధాముని పాదపద్మాలను కన్నులపంటగా తిలకించి తరించాలని పరమహంసలు కూడా కలలుకంటారో ఆ పరాత్పరుని పాదాలు కడిగి నీ వంశాన్ని వైష్ణవతేజంతో పవిత్రీకరించు. వీరి దాంపత్య జీవితం అన్యోన్యతాగౌరవాహ్లాదోపేత చిరాయురభ్యుదయ సౌఖ్యశ్రీలతో అలరారుతుంది.''

కమలాసనుని ఆశీర్వచనాన్ని శిరసావహించి రైవతుడు భూమండలానికి తిరిగి వచ్చేసరికి మనుష్యజాతి గుర్తుపట్టడానికి వీలు లేనంతగా మారిపోయింది. ఎక్కడ చూసినా దుర్బలకాయులు, తేజోవిహీనులు, అల్పమతులే కనిపించారు. వారి ముఖాలపై ఇంతకుముందెన్నడూ లేని దైన్యమూ, విషాదం తాండవిస్తున్నాయి. పరస్పర కలహాలతో, గృహచ్ఛిద్రాలతో మానవులు వ్యగ్రులై ఉన్నారు.

రైవతుడు సరాసరి బలదేవుని వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఆయన తాళధ్వజుడై హలాయుధాన్ని ధరించి బంధుమిత్రపరివార సమేతంగా కొలువుతీరి ఉన్నాడు. సంగ్రామకళలలో ఆకలు తీరిన యోధానుయోధులను అవలీలగా జయించిన ఆ మహాబలుని వక్షః స్థలం విశాలమైన స్ఫటికపు కొండవలె సమున్నతమై ఉన్నది. రేవతి శరీరప్రమాణం వర్తమానద్వాపరయుగానికి అనుగుణంగా లేదని భావించి అతను నాగలికి గుచ్చి ఆమె పొడవైన దేహాన్ని హ్రస్వ తరం కావించాడు. రేవతీ బలదేవుల పాణిగ్రహణోత్సవాన్ని మహా వైభవోపేతంగా జరిపించి రైవతుడు వియ్యంకు లందరి వద్ద సెలవు తీసికొని హిమవత్పర్వతభూములకు వెళ్లి కైవల్యాన్ని పొందాడు.

రైవతకకుద్మి వంశాభివృద్ధి

త్రేతాయుగారంభంలో రైవతుడు బ్రహ్మలోకానికి వెళ్లి ఎంతకాలానికీ తిరిగి రాకపోయేసరికి పుణ్యజనులని పేరుగల రాక్ష సులు కుశస్థలి పైకి దండెత్తారు. వారి ధాటికి ఆగలేక రైవతుని సోదరులు తొంభైతొమ్మిదిమందీ చెట్టుకొకరూ పుట్టకొకరూ చెల్లా చెదరై పారిపోయారు. రాజులేని రాజ్యాన్ని కొల్లగొట్టి అల్లకల్లోలం చేసి రాక్షసులు కుశస్థలిని నాశనం చేశారు.

పారిపోయిన రైవతుని సోదరులు మళ్లీ రాజ్యాలను సంపా దించి భూమిని సస్యశ్యామలంచేసి భూతతృప్తి ఘటించారు. క్షత్రియ తేజం జగన్నుతమై వర్ధిల్లింది.

మనుపుత్రుడైన ధృష్టుని కొడుకులందరూ మహాయోధులై తమ వంశగౌరవాన్ని దేశం నలుమూలలా చాటి చెప్పారు. వారి పేరిట ధార్ష్టకవంశం వెలిసింది.

వైవస్వత నందను డైన నాభాగునికి విష్ణుభక్తాగ్రేసరు డైన అంబరీషుడు జన్మించాడు. అంబరీషునికి విరూపుడు, అతనికి పృషదశ్వుడు, పృషదశ్వునికి రథీనరుడు జన్మించారు.

రథీనరుడు ధర్మనిరతుడై భూమండలాన్ని చిరకాలం పరిపాలించి లోకంలో క్షాత్రవీర్యాన్ని, బ్రహ్మతేజాన్ని సముద్దీపింపజేశాడు. అతని సంతతివారికి ఆంగిరసులని వ్యవహారం ఏర్పడింది. ఆంగిరసులలో కొందరు క్షత్రియధర్మాన్ని, మరికొందరు బ్రాహ్మణధర్మాన్ని వెలయింపజేశారు.

పురంజయుని తేజోవిలాసం

వైవస్వత మనువు ఒకసారి శైత్యబాధవలన ముక్కు చీదినప్పుడు అతని నాసికారంధ్రం నుంచి ఇక్ష్వాకువు జన్మించాడు.

ఇక్ష్వాకువుకు నూరుమంది కొడుకులు పుట్టి తండ్రికి తగ్గ తనయు లనిపించుకొన్నారు. వారిలో వికుక్షి, నిమి, దండుడు సుప్రసిద్ధులు.

ఇక్ష్వాకువు కొడుకులలో యాభైమంది శకుని నాయకత్వంలో ఉత్తరదిగ్భాగానికి వెళ్లి రాజ్యాలను స్థాపించారు. నలభైఎనిమిదిమంది దక్షిణాపథానికి వెళ్లి యావరాజ్యాలకు అభిషిక్తులయ్యారు.

ఒకప్పుడు ఇక్ష్వాకువు అష్టకశ్రాద్ధం ఆచరించాలని సంకల్పించి, పెద్దకొడుకు వికుక్షిని పిలిచి మృగమాంసాన్ని తెమ్మని అనుజ్ఞాపించాడు.

తండ్రి ఆనతిని ఔదలదాల్చి వికుక్షి మృగయార్థం అడవికి వెళ్ళాడు. మార్గమధ్యంలో కానవచ్చిన జింకలను, అనేక క్రూరమృగాలను, ఇతర జంతువులను వధిస్తూ కాననమధ్యంలో నిదాఘతాపానికి సొమ్మసిల్లిపోయాడు. అక్కడే ఒక వృక్షమూలాలం చెంత నీడలో కూర్చొని, పట్టితెచ్చినవాటిలో ఒక కుందేలు చర్మం ఒలిచి

మాంసఖండాలను కర్రకు గ్రుచ్చి నిప్పు సెగమీద కాల్చి పక్వ మాంసాన్ని కడుపారా భుజించాడు. ఆ తర్వాత సేదదీరి మరికొన్ని మృగాలను చంపి ఇంటికి తిరిగి వచ్చాక తండ్రికి సమర్పించాడు.

అప్పుడు ఇక్ష్వాకుల కులపురోహితుడు వశిష్ఠమహర్షి శ్రాద్ధ కర్మలకు మాంసనైవేద్యాన్ని ప్రోక్షించి శుద్ధిచేయడానికి వచ్చి, అది భుక్తావశిష్టమని, ఉచ్ఛిష్టంతో సమానమని గ్రహించాడు. పల పైతృకానికి అవిశుద్ధాన్నం పనికిరాదని చెప్పి వంటకాలను తీసి వేయించాడు.

అవితర్కితంగా సంభవించిన ఈ అపకృత్యాన్ని తెలుసుకొని ఇక్ష్వాకువు క్రుద్ధుడైనాడు. పితృశ్రాద్ధంలో అపచారం వాటిల్లి నందుకు ప్రతిక్రియగా వశిష్ఠుడు వికుక్షిని కుందేలుమాంసం తింటూ శశాదుడవు కమ్మని శపించాడు.

శశాదుడు పశ్చాత్తాపం చెంది, ధర్మనిరతుడై యజ్ఞ యాగాలుచేసి రాజర్షి పదాన్ని పొందాడు. తండ్రి తర్వాత సింహా సనం అధిష్ఠించి భూమండలాన్ని ధర్మసమ్మతంగా పరిపాలించి జన రంజకుడని పేరు తెచ్చుకొన్నాడు.

శశాదుని కొడుకు పురంజయుడు.

పురంజయుని వృత్తాంతం

త్రేతాయుగంలో ఒకప్పుడు దేవదానవులకు యుద్ధం జరి గింది. ఆ మహాసంగ్రామంలో దానవులు విజృంభించి దేవతలను పరాభవించి స్వర్గధామం నుంచి వారిని తరిమివేశారు. దేవతలు దైన్యాపనోదానికై శ్రీమహావిష్ణువు చెంతకు వెళ్లారు.

ఆ సమయంలో శ్రీమన్నారాయణుడు క్షీరార్ణవమధ్యంలో శేషతల్పం పైన శయనించి ఉన్నాడు. శతసహస్రకోటి సూర్యప్రభా విభాసమానుడైన ఆ మహాత్ముని సన్నిధానంలో దివ్యశృంగార

లీలావిలాసవతి సింధురాజనందన పాదసంవాహనం చేస్తున్నది. సనక సనందన సనత్కుమార సనత్సుజాతాది మహామునులు వక్షోలంకృత వైజయంతీప్రియుడు శ్రీధరుని ప్రమోదప్రసాదాలను కోరి సంసేవించుకొంటున్నారు.

శ్రీహరి దేవతలను ప్రసన్నాస్యుడై వీక్షించి, "మీ అభివాంఛితం నాకు తెలుసు. రాజర్షివతంసుడైన శశాదుని తనూజుడు పురంజయుడు నా అంశవలన సందీప్తతేజుడై పృథ్వీచక్రాన్ని నిర్వక్ర విక్రమంతో పరిపాలిస్తున్నాడు. రాక్షసగణాలను నిర్మూలించి అతను మీకు కలిగిన దుర్దశను తొలగిస్తాడు" అని అభయప్రదానం చేశాడు.

దేవతలు సరయూనది తీరాన ఉన్న సాకేతనగరానికి వెళ్లి పురంజయునికి పాదాక్రాంతులైనారు. "క్షత్రియకులావతంసమా! దైవతకులానికి వాటిల్లిన ఆపదలను వినివారించడానికి నీవు తప్ప మాకు శరణ్యాంతరం లేదు. దుర్నిరీక్ష్యమైన బలతేజస్సులతో చెలరేగి శాత్రవకోటిని సంహరించు. మమ్మల్ని రక్షించు" అని వేడుకొన్నారు.

అమరుల కోరికను కాదనలేక పురంజయుడు, "మీ అభ్యర్థనను మన్నించడం నాకు సమ్మతమే. భూతకాలాన శతక్రతువుల నాచరించి సురకులానికి అధినాయకుడైన దేవేంద్రుడు నన్ను తన భుజస్కంధాలపై మోసికొని వెళ్ళగలిగితే నేను ఇంద్రవాహుడనై రక్షోగణాలను శిక్షిస్తాను" అని మాట యిచ్చాడు.

ఇంద్రాది దేవతలు గత్యంతరం లేక పురంజయుని నియమానికి సమ్మతించారు. దేవేంద్రుడు వృషరూపాన్ని ధరింపగా అతని కకుత్స్థలాన్ని అధిరోహించి శశాదసుతుడు దానవానీకాన్ని శత్రుశేషం లేకుండా పరిమార్చివేశాడు. దేవతలు మళ్లీ హవిర్భుజులయ్యారు.

ఈ విధంగా వృషభం మూపుపై కూర్చొని యుద్ధం చేసిన పురంజయునికి కకుత్‌స్థుడని పేరు కలిగింది. అతని వంశం కాకుత్థ్స వంశ మయింది.

కకుత్థ్సునికి అనేనసుడు జన్మించాడు. అతని కొడుకే పృథు చక్రవర్తి.

పృథువుకు విశ్వగశ్వుడు, అతనికి ఆర్ద్రుడు, ఆర్ద్రునికి యువనాశ్వుడు, అతనికి శ్రావస్తుడు, శ్రావస్తునికి బృహదశ్వుడు, అతనికి కువలయాశ్వుడు ఉదయించారు.

కువలయాశ్వుని కాలంలో ధుంధుడనే రాక్షసుడు ఉత్తంక మహామునికి తపోభంగం కలిగించి, పుణ్యాశ్రమాలలో ఋషుల యజ్ఞయాగాలను ధ్వంసం చేయసాగాడు. సుజన స్వజనరక్షాదీక్షితుడై కువలయాశ్వుడు ఇరవై ఒక్కవేలమంది కొడుకులను, చతురంగబలాలను వెంటబెట్టుకొని ధుంధుని వధార్థం ఉత్తంకుని ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ దైత్య-రాజన్యులకు ఘోరమైన సంగ్రామం జరిగింది. మాయాయుద్ధతంత్రాలలో కుశలుడైన ధుంధుడు తన వేడి నిట్టూర్పులనుండి దారుణదావాగ్ని జ్వాలలను పుట్టించి కువలయాశ్వుని సైన్యాలపై ప్రయోగించాడు. నిఃశ్వాసపవనవైశ్వానర జ్వాలలు భూనభోంతరాళాలను క్రమ్ముకొని దృఢాశ్వుడు, చంద్రాశ్వుడు, కపిలాశ్వుడు తప్ప కువలయాశ్వుని తక్కిన కొడుకులందరూ ఆ మహాగ్నిశిఖలలో భస్మీపటల మయ్యారు. పుత్రశోకోపహతుడై కువలయాశ్వుడు లోకభీకరంగా పరాక్రమించి తుములయుద్ధంలో దైతేయపతిని సంహరించాడు. ఆనాటినుండి అతనికి ధుంధుమారుడని బిరుదనామం లభించింది.

దృఢాశ్వుని కుమారుడు హర్యశ్వుడు కూడా పితామహుని వలెనే మహాపరాక్రమశాలి. అతనికి నికుంభుడు జన్మించాడు.

నికుంభుని కొడుకు సంహతాశ్వుడు. సంహతాశ్వుని పుత్రుడు కృశాశ్వుడు. అతనికి ప్రసేనజిత్తు పుట్టాడు. ప్రసేనజితుని సుతుడు యువనాశ్వుడు.

యువనాశ్వునికి సంతానం కలుగలేదు. రాత్రి చేరువైన కొద్దీ నీడలు పొడుగైనట్లు రానురాను అతని మనస్సులో వేదనానలం క్రమ్ముకొని కాల్చివేయసాగింది. 'లోకాల నన్నింటినీ జయించి నిరవధికమహైశ్వర్యాలను గడించాను. దుష్టశిక్షణ చేసి శిష్ట జనులను రక్షించాను. ఈ మొత్తాన్ని ఎవరి కోసం ధారపొయ్యాలి? లోకాన్ని కొనగలిగిన ధనరాసులున్నా సంతానం లేని దంపతుల జీవితం విచారసాగరం కదా! పుత్రులు లేక పితౄశ్రాద్ధాలను కోల్పోయి ఇహపరాలు రెండింటికీ చెడినవాడనై నేను బావుకొనేదేమిటి? వార్ధక్యంలో జాలితలచి నా కష్టసుఖాలను ఎవరు చూస్తారు?' అని చింతలో చిక్కి శల్యమైనాడు.

అప్పుడు మునులు జాలిగొని రాజును ఓదార్చారు. "మేము శ్రీ విష్టరశ్రవుని యజ్ఞేశునిగా పొనర్చి పుత్రకామేష్టిని ఆచరిస్తాము. భూతభవ్యభవత్ప్రభువు కరుణించి నీకు సంతానాన్ని ప్రసాదిస్తాడు" అని ధైర్యం చెప్పారు.

అనంతరం మునులు ఋత్విజులై పుత్రకామేష్టిని సలక్షణంగా జరిపించారు. అయితే అనుకోకుండా ఒక అవాంఛనీయ ఘటన జరిగింది.

యాగం పరిసమాప్తి చెందనున్న రోజు రాత్రి మునులు మంత్రజలాలను విన్యసించిన బంగారు కలశాన్ని యాగవేదికపై నిలిపి బహుదినాయాసం వలన నిద్రాముద్రితులైనారు. యువనాశ్వునికి ఆ సమయంలో మెళకువ వచ్చి దప్పిక కలిగింది. అప్పటికి రాత్రి సగం గడిచి పరిచారకులు కూడా త్రుళ్లిలు కట్టి నిద్ర

పోతున్నారు. వారిని మేలుకొలపడం ఇష్టంలేక అతను కలశంలో ఉన్న మంత్రజలాలను త్రాగి మళ్లీ నిద్రపోయాడు.

తెల్లవారేసరికి మునులు లేచి రిక్తకలశాన్ని చూసి విభ్రాంతిని పొందారు. "యాగవేదికపై నిలిపిన కలశంలోని జలాలను పానం చేసిన రాణి గర్భవతి కాగలదు. అవి కామ్యఫలాన్ని ప్రసాదించే మంత్రజలాలు" అని రాజుతో అన్నారు. రాజు ఆ మాటలకు వెలవెలబోయి, జరిగిన సంగతిని చెప్పేశాడు.

మునుల వాక్యం ఫలించి యువనాశ్వుడు గర్భవంతుడైనాడు. నవమాసాలూ నిండి అతని కుక్షి దక్షిణభాగాన్ని చీల్చుకొని చక్రవర్తి లక్షణోపేతుడయిన కొడుకు జన్మించాడు.

పుత్రోదయానికి సంతసించి మునులు ఆ శిశువును పెంచి పోషించడానికై తగిన దాదికోసం లోకాలను గాలింపసాగారు. అప్పుడు దేవేంద్రుడు ప్రత్యక్షమై, "మాం ధాస్యతి" అని పలికి శిశు పోషణభారాన్ని తానే స్వీకరించాడు. అమోఘమైన ఇంద్రుని ఆశీర్వాదాన్ని ఆధారం చేసికొని మునులు యువనాశ్వసుతునికి మాంధాత అని పేరు పెట్టారు.

ఇంద్రుడు తన చూపుడువ్రేలిని మాంధాత నోటిలో ఉంచి అజరామరులకే తప్ప అన్యులకు దుర్లభమైన అమృతాన్ని స్రవింపజేశాడు. ఆ సుధాధారలను గ్రోలి మాంధాత మహాబలవంతుడై సప్తద్వీప వసుంధరను ఏకచ్ఛత్రితంగా పరిపాలించాడు. సూర్యోదయ సూర్యాస్తమయాలు ఎంతవరకు దృగ్గోచరమౌతాయో అంత మేరకు నిరుపమాన యశోవిశాలుడైన మాంధాత సామ్రాజ్యం విస్తరిల్లినదని కవులూ పౌరాణికులూ ఉపశ్లోకించారు.

మాంధాత శశబిందుని కుమార్తె బిందుమతిని వివాహం చేసుకొన్నాడు. ఆ దంపతులకు పురుకుత్సుడు, అంబరీషుడు, ముచి

కుందుడు ప్రభవించారు. కాలక్రమంలో వారికి యాభైమంది కుమార్తెలు కూడా కలిగారు.

సౌభరి చరిత్రం

ఈ విధంగా మాంధాత ధర్మసమ్మతంగా రాజ్యపాలన చేస్తున్న రోజులలో సౌభరి అనే తపశ్శాలి ఉండేవాడు.

సౌభరి సాకేతపురసమీపం లోని ఒక పుణ్యానదీ గర్భం లోనికి వెళ్లి, ఆ అంతర్జలాలలో నిలిచి శ్రీమహావిష్ణువు సాక్షాత్కృతి కోసం పన్నెండు సంవత్సరాలు ఘోర తపస్సు చేశాడు. ఆ నీళ్లల్లో మందుడని పేరుగల ఒక మత్స్యరాజు కళత్రబంధుమిత్రపరివార సమేతంగా కాపురం చేస్తున్నాడు. లంకంత కాపురంలో పిల్లలు, మనవలు, పసిపాపలు క్రేళ్లురుకుతూ కేరింతలు కొడుతూ అల్లరి చేస్తుంటే మత్స్యరాజ దంపతులు సంతోషంతో పులకించిపోయే వారు. ఒక్కొక్కప్పుడు వాళ్లు ఆటల్లో పడి తన ప్రక్కనుంచి దూసుకొనిపోతుంటే గిలిగింతలు కలిగి సౌభరికి తపోభంగ మవుతుం డేది. చేపరేని సుఖజీవితాన్ని చూసినప్పుడల్లా మునీంద్రునికి తాను కూడా అటువంటి సుఖాలను పొందాలని అనిపించేది. నీచయోనిజ మైన దీనికే ఇంత సంతోషంగా ఉంటే సర్వోత్తమమైన మానవ జన్మను పొంది నేనెందుకిలా సుఖత్యాగం చేయాలి? అని సంకల్పించి సౌభరి తపస్సు విడిచి నీళ్లనుంచి బయటికి వచ్చి సరాసరి రాజు వద్దకు వెళ్లాడు.

తన ఆస్థానానికి సౌభరిముని ఏతెంచాడని తెలియగానే మాంధాత సింహపీఠిక నుంచి దిగ్గున లేచి సగౌరవంగా ఎదురేగి అర్ఘ్యపాద్యాలతో సత్కరించి ఆయనను లోనికి తీసుకొనివచ్చాడు.

రాజసౌధంలో సుఖోపవిష్టుడై సౌభరి మాంధాతకు తన మనస్సులో ఉదయించిన సంకల్పాన్ని వినిపిస్తూ ఇలా అన్నాడు—

"లోకాభివంద్యచరిత్రుడైన కాకుత్స్థుని వంశంలో జన్మించిన రాజులందరూ పూజ్యపూజాపరాయణులు. సూర్యాన్వయుల ఇంటికి వచ్చి రిక్తహస్తాలతో తిరిగివెళ్లిన అర్థార్థులు లేరు. రాజా! క్షేత్ర మెరిగిన వ్యవసాయం, పాత్రమెరిగిన దానం ధర్మపరులకు సద్యః ఫలాన్ని కలుగజేస్తాయి. నేను గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలని నిర్ణయించుకొన్నాక నాకు తగిన వధువు కోసం తపస్సు విడిచి బైటికి వచ్చాను. నేను కోరడమే తడవుగా పెక్కుమంది రాజన్యులు తమ పుత్రికలకు పాణిగ్రహణం చేయించాలని తహతహలాడుతారు. నీకు యాభైమంది కుమార్తెలున్నారు. వారిలో ఒక పుత్రికను నాకిచ్చి వివాహం చెయ్యి."

మునీంద్రుని వాక్యాలను ఆలించి రాజు సంభ్రమాశ్చర్యాలతో అతనిని చూశాడు. జరావిశీర్ణమై, అన్నోదకాలు లేక ఉపవాసక్లేశాలతో కృశించి ఉన్న దుర్బలకాయం, తైలసంస్కారం లోపించి ఎర్రబారి జడలుకట్టిన కేశపాశం, ముళ్లకంప వలె పెరిగి రొమ్ముదిగిన శ్మశ్రువులనూ పరికించి అవుననలేక, అతని తపశ్శక్తిని తలపోసి కాదనలేక ఆలోచనలో పడ్డాడు.

మాంధాతకు కలిగిన సంకోచాన్ని కనిపెట్టి సౌభరి అతనిని త్వరపెట్టాడు. "రాజా! ఇంకా ఎందుకు సంకోచిస్తున్నావు? సూర్యాన్వయంలో జన్మించిన రాజులను కోరరాని కోరిక ఏదీ నేను కోరలేదు. నీ పుత్రికను నాకిచ్చి వివాహం చేసి కన్యాదానఫలాన్ని పొందు. ఆలస్యం చేయకు" అని హెచ్చరించాడు. రాజు తన అనిష్టాన్ని మరుగుపుచ్చి, "మునీంద్రా! తొల్లింటి నుంచి మా సూర్యాన్వయంలో స్త్రీలకు స్వయంవరాన్ని ప్రకటించడం ఆచారంగా ఉంటున్నది. వరుల ఆభిజాత్యం, విక్రమసంపదలు ఎంత గొప్పవయినా స్వయంవరంలో తిరస్కృతులైనవారికి కన్యాదానం

చేయకూడదు. అదీకాక ఉత్తమమైన క్షత్రియవంశంలో జన్మించి భోగభాగ్యాలకు అలవాటుపడిన వారు మున్యాశ్రమాలలో కంద మూలాలు తింటూ జీవించడానికి అంగీకరిస్తారా? అని నా సందేహం. నాకేమీ పాలుపోవడం లేదు'' అని ముక్తాముక్తంగా తన మనో భావాన్ని వ్యక్తీకరించాడు.

సౌభరి అతని మాటలకు మందహాసం చేశాడు. ''అయ్యా! అదే మీ ఆచారమైతే నన్ను మీ అంతఃపురానికి పంపించు. నీ కుమార్తెలలో ఎవరైనా నన్ను పెండ్లాడేందుకు సమ్మతిస్తే సరేసరి. లేకపోతే నేను తలవంచుకొని వచ్చినదారినే వెళ్లిపోతాను. నీకు ఏ విధంగానూ బాధ కలిగించను'' అని మాట యిచ్చాడు.

గత్యంతరం లేక మాంధాత మునివాక్యాన్ని అంగీకరించాడు. హెగ్గడివాణ్ణి పిలిచి, ''ఈయనను అంతఃపురం లోనికి తీసుకొని వెళ్లు'' అని ఆజ్ఞాపించాడు.

వర్షధరునితో కలిసి సౌభరి రాణివాసానికి వెళ్లి మాంధాతృ సుతలను చూశాడు.

రాజకుమార్తెలు ముని ఊహించినదానికన్నా సౌందర్య వతులు. వయోనురూపలావణ్యం కలిగిన ఆ మదవతులు పర పురుషులకు చొరరాని ఆ రహస్యప్రదేశానికి వచ్చిన సౌభరిని ఆశ్చర్య చకితలై చూసి కోలాహలం చేస్తూ చుట్టూ గుమిగూడారు. నూత్న పురుషాలోకనం చేత వారి కన్నులు విప్పారి ఆ అంతిపురం కలువలు నిండిన కొలనువలె శృంగారరసాకరమై ప్రకాశించింది. నవరత్న ఖచిత చంద్రకాంతశిలాతలాల పైన, లలితమృదులకలహంసతూలికా తల్పాల పైన కూర్చొని కేళీవినోదాలలో తేలియాడుతున్న లీలా వతులు, సౌభరిని చూసి పలకరించాలని ముందుకు వచ్చారు. వారిలో కొందరికి పులకోద్గమాలు కలిగి కుచచూచుకాలు, మర్మావ

యవాలు చెమర్చి మన్మథభావోద్రేకం వల్ల అలిసినట్లు కని పించారు.

అప్పుడు వర్షధరుడు వారందరినీ కలయజూచి, "ఈ మునీంద్రుడు మీలో ఒకరిని వివాహం చేసుకొంటానని ప్రభువులవారిని కోరగా స్వయంవరప్రకటనార్థం నన్ను మీవద్దకు పంపించారు. మీలో ఎవరైనా సమ్మతిస్తే వివాహం చేయడానికి అభ్యంతరం లేదని ప్రభువులవారు ఇతనికి మాట యిచ్చారు" అని రాజాజ్ఞను తెలియజేశాడు. అంతఃపుర కాంతలలో కలకలం బయలుదేరింది.

అయితే ఈ అద్భుతానికి కారణం లేకపోలేదు. మాంధాత కొలువునుంచి బయలుదేరి అంతిపురాన్ని చేరుకొనే లోపల సౌభరి ముని తన తపశ్శక్తి వలన లోకంలో అందానికి పేరుపడిన సిద్ధసాధ్య గంధర్వగణాల కన్నా మనోహరమైన లోకోత్తరసౌందర్యం రాశీభ వించిన దివ్యమంగళవిగ్రహాన్ని ధరించాడు. ఆ రూపం పురుషులకే మోహాస్పదంగా ఉన్నది.

తండ్రి ఆనతి వినగానే రాజకుమార్తెలు తమలో తాము వాదించుకోవడం మొదలుపెట్టారు. "మీరందరూ దూరంగా ఉండండి. ఇతను నా భర్త" అని ఒక రాకుమార్తె సిగ్గు విడిచి స్పష్టంగా చెప్పివేసింది. తక్కినవారు ఆమె మాటలకు అడ్డుపడ్డారు. ఈతనిని నేనే ముందు చూశాను—ఇతనిని బ్రహ్మ నా కోసమే సృజించి నా వద్దకు రప్పించాడు—నీకన్నా ముందు ఈయన నన్ను చూశాడు — నేను ఈయనకు భార్య కావడం కోసమే ఇన్నాళ్లూ వేచి ఉన్నాను - నీకన్నా ముందు నేనే ఎన్నుకొన్నాను—నాకు కాకుండా చేసే అధికారం నీ కెక్కడిది — అంటూ వారు కలహింప సాగారు.

వర్షధరుడు రాజువద్దకు వెళ్లి జరిగిన వృత్తాంతాన్ని పూస గ్రుచ్చినట్లు చెప్పగా విని మాంధాత ఆశ్చర్యపడ్డాడు. తనకు ఏ

మాత్రం ఇష్టంలేకపోయినా కులపురోహితుని పిలిపించి సుము హూర్తం నిర్ణయించి యాభై మంది కుమార్తెలనూ సౌభరి కిచ్చి ఒకే లగ్నంలో పెళ్లి చేశాడు. వరుని కాళ్లు కడిగి పాదోదకాన్ని శిరస్సుపై చల్లుకొని తన శక్తికొలది సమ్మానించి ఇచ్చిన మాట నిలబెట్టుకొన్నాడు.

సౌభరిముని భార్యలందరినీ తీసుకొని తన ఆశ్రమానికి వెళ్లాడు. శిల్పాచార్యుడైన విశ్వకర్మ ప్రజాపతిని పిలిచి, "నేను గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, భార్యలను కాపురానికి తీసుకొని వచ్చాను. వీరందరికీ వేర్వేరుగా నివాసయోగ్యమైన మందిరాలను, కేళీవనాలను, జలాశయాలను, గృహాలంకారానికి తగిన అందమైన వస్తువులను, హంసతూలికాతల్పాలను, ప్రసాధనసామగ్రిని ఈ లోకంలో ఎవ్వరూ ఎన్నడూ కనీ వినీ ఎరుగని విధంగా రూపొం దించాలి" అని ఆదేశించాడు.

మునీంద్రుని నోటిమాట నోటిలో ఉండగానే విశ్వకర్మ ప్రజా పతి సర్వవస్తువులనూ కన్నుల ముందు సాక్షాత్కరింపజేశాడు. వివిధ మణిరత్నఖచిత సువర్ణకుడ్యాలతో విశాలమైన గదులను కట్టి స్ఫటిక గోపురాలను నిలబెట్టాడు. వేర్వేరు ఋతువులలో పుష్పించే వివిధ సుమలతాదులను, ఫలవృక్షాలను, రమ్యోపవనాలను సృజించి సృష్టికి ప్రతిసృష్టి చేశాడు. కలహంసలు, కారండవాలు జలకేళి సలుపుతున్న జలాశయాలలో కలువపూలను నింపి, ఆ ప్రక్కనే పికశుకశారికాబృందాలు సంగీత సభలను నిర్వహించడానికి వీలుగా సుందరారామాలను ఉపకల్పించాడు.

ఆ దివ్యప్రదేశాన్ని తన తపశ్శక్తితో నందమహానిధికి నిధా నంగా వెలుగొందజేసి సౌభరిముని కళత్రపరివారసమేతంగా అక్కడ నివాసాన్ని ఏర్పరచుకొన్నాడు. భార్యలందరిపట్ల సమప్రేమ కలిగి

దక్షిణనాయకుడై నిత్యకేళీవిలాసాలతో సురతసుఖాలను అనుభవిస్తూ ఉండగానే చిరకాలం గడిచిపోయింది.

కొంతకాలానికి మాంధాతకు తన కుమార్తెలపై మనసు మళ్లింది. ఆ రోజు ఇంటికి వచ్చి అడిగిన ముని మాయాపరివేషాన్ని చూసి వివాహానికి అంగీకరించాడే కాని, తన కూతుళ్ళు ఎలా ఉన్నారో అన్న ఆందోళనతో అతనికి మనసు మనసులో లేదు. అందుచేత అతను సౌభరి ఆశ్రమానికి ధర్మపత్నీసమేతంగా వెళ్లాడు.

పూర్వం సౌభరిముని ఉన్న ఆశ్రమస్థలానికి వచ్చి మాంధాత తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. నేలంతా బీడువారి నెరియలు పడిన ఆ ప్రదేశంలో ఇప్పుడు మేడలు, మందిరాలు ఆకాశానికి లేచాయి. కాంచనవినిర్మితసౌధోపరిస్ఫటిక గోపురాలపై సూర్యకాంతి ప్రతిఫలించి కనులకు మిరుమిట్లు గొల్పుతున్నది. తాగడానికి నీళ్లులేక కటకటలాడే ఆ చోట రమ్యజలాశయాలలో కలహంసలు జలక్రీడలాడుతున్నాయి, ఎక్కడ చూసినా సిరిసంపదలు తాండవిస్తున్నాయి.

మాంధాత అక్కడ చేరువనే కనుపిస్తున్న మొదటి గృహంలోనికి వెళ్లి తన కుమార్తెను కౌగిలించుకొని, ఆప్యాయంగా పలకరించాడు. ఆమె ముఖం వెనుకటివలె కాక నిండుతనం తేలి కళకళలాడుతున్నది. చిరకాలానికి కూతురును చూసిన పరమానందంతో అతని కన్నులలో ఆనందాశ్రువులు తొణికిసలాడాయి. "అమ్మా! ఎలా ఉన్నావమ్మా! నీ చెల్లెళ్లు ఎలా ఉన్నారు? నీ కాపురం ఎలా ఉన్నది? మునీంద్రుడు నిన్ను ప్రేమగా చూసుకొంటాడా? మేమంతా జ్ఞాపకం వస్తుంటామా తల్లీ?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

రాజకుమార్తె తండ్రి మాటలకు క [illegible] నవ్వింది. "నాన్నా! అందరూ బాగున్నారు. ఇక్కడి భోగ [illegible] వ్వు చూస్తూనే

ఉన్నావు కదా! ఈ రమణీయమైన ఉద్యానవనాలు, కేళీజలాశయాలు, పుష్పలతలు, ప్రకృతిశోభలు, ఐశ్వర్యభోగాలు, వెలలేని ఆభరణాలు, ఈ దుస్తులు — జీవితంలో ఎన్నడూ లేని సుఖాలను అనుభవిస్తున్నాము. పుట్టిల్లు నాకు జ్ఞాపకం రాలేదంటే మీరు కోపం తెచ్చుకోకూడదు. మీరు మాకై ప్రేమతో ఇంతమంచి సంబంధాన్ని వెతికి తెచ్చినందుకు మేము మీకెప్పుడూ ఋణపడి ఉంటాము. పోతే, నాకున్నదల్లా ఒకటే చింత. ఆయన సర్వకాల సర్వావస్థలలోనూ నన్నే అంటిపెట్టుకొని, నా గురించే ఆలోచిస్తూ, నా చెల్లెళ్లను నిరాదరిస్తున్నారని నాకప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. అయినా ఈ విషయమై వాదిస్తే వారి ప్రేమను కోల్పోతానేమోనని స్వార్థం అడ్డువచ్చి మాట్లాడలేకపోతుంటాను. నాకు దిగులంటూ ఉంటే అదొక్కటే దిగులు'' అని తండ్రితో చెప్పింది.

రాజు మనస్సు వికలమైపోయింది. కుమార్తె సుఖంగా ఉన్నదని సంతోషించాలో, తక్కినవాళ్లు పతిప్రేమను కోల్పోయారని విచారించాలో తెలియక ఖేదమోదాలతో సతమతమవుతూ అతను రెండవ కుమార్తె ఇంటికి వెళ్లాడు.

ఇలా ఒక్కొక్క ఇంటికీ వెళ్లి మాంధాత అసలు రహస్యాన్ని గ్రహించాడు. తన కుమార్తెలందరూ నాథుడు ఎల్లవేళలా తననే అంటిపెట్టుకొని తక్కినవాళ్లను నిర్లక్ష్యం చేస్తున్నాడని భావిస్తున్నారు. భర్తృప్రేమను చూరగొన్నామన్న గర్వం వారి కళ్లల్లో అతిశయంగా కనిపిస్తున్నది. లోకంలో ఎక్కడాలేని ఐశ్వర్యం, సుఖభోగాలు ఇక్కడ ఉన్నాయి. తన పుత్రికలు నిజంగా అదృష్టవతులు.

మాంధాత [illegible]త్తుడై సౌభరిముని వద్దకు వెళ్లి కృతజ్ఞతా గౌరవాలతో [illegible]శాడు. ''మీ అమోఘమైన శక్తిని

కన్నులారా కనుగొన్నాను. నా కుమార్తెలందరూ మహానందంలో ఉన్నారని తెలిసి మా యిద్దరికీ పరమానందం కలిగింది.'' అని పలికి అల్లుని ఆతిథ్యాన్ని స్వీకరించి, కొంతకాలం వారితో సంతోషంగా గడిపి, వారందరికీ ధనకనకవస్తువాహనాలను బహుమతులుగా ఇచ్చి, ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు.

సౌభరికి యాభైమంది భార్యలకూ నూటయాభైమంది కొడుకులు జన్మించారు. అతను తన పుత్రులను కూడా అమితప్రేమతో అల్లారుముద్దుగా చూసుకొన్నాడు. ఒకరోజు ఏకాంతంగా కూర్చొని తనలో తను ఇలా వితర్కించాడు—

''నా జీవితం ఇంతవరకూ ఎదురుదెబ్బలు లేకుండా సుఖంగానే గడిచింది. భార్యలందరూ ఆరోగ్యంగా ఉన్నారు. పిల్లలకు నేడో రేపో నోరుతిరిగి మాటలు రాగానే వారికి వేదశాస్త్రాలు బోధించి విద్యాబుద్ధులు కలిగిస్తాను. బాల్యంలో అభ్యసించిన విద్య జీవితాంతం రాణిస్తుంది. పిల్లలు నడక మొదలుపెట్టేసరికి తల్లిదండ్రులు వారికి నయమార్గగతులను నేర్పించాలి. ఇక పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యాక వీళ్లకు పెళ్లిళ్లు చేయాలి. కోడళ్లు వస్తారు. వాళ్లకు మళ్లీ పిల్లలు పుడతారు. మనవలు, మునిమనవలతో జీవితం హాయిగా గడిచిపోతుంది.''

ఈ ఆలోచనలు వచ్చాక సౌభరి హృదయం చింతాక్రాంతమయింది. అతను ఒక్కసారి వెనక్కితిరిగి తన జీవితానుభవాలను నెమరువేసుకొన్నాడు.

''ఆహా, నేను ఎంత చిత్తవిభ్రాంతికి లోనయ్యాను! సహస్ర వత్సరాలో, శతసహస్రవత్సరాలో—నశ్వరమైన ఈ భోగభాగ్యాలను ఎంతకాలం అనుభవించినా కోరికలకు అంతులేదు. ఈ పసిపిల్లలను చూసి నాలో మళ్లీ సరికొత్త బంధాలు రేకెత్తుతున్నాయి.

వీళ్లు పెద్దవాళ్లయి పెళ్లిళ్లు చేశాక మాత్రం సంతృప్తి కలుగుతుందని నమ్మకం ఏమిటి? అప్పుడు వాళ్లను చూసుకొంటూ నేను మాత్రం ఎంతకాలమని జీవించగలను?''

అని ఈ విధంగా చింతించి అతను సంతోషమన్నది ఆత్మగతమే తప్ప వస్తుగతం కాదని జీవితంలో తొలిసారిగా గుర్తించాడు.

''భార్యాబిడ్డల వల్ల కలుగుతున్న సంతోషం సాధనఫల స్వరూపం. దీనివలన ఆత్మజ్ఞానం కలుగకపోగా బంధాలు మరికొన్ని పెరుగుతున్నాయి. నిర్వికారమైన ఆత్మ కర్మఫల సాధనాలకు విదూరమైనది. నివృత్తిమార్గం లోనుంచి నేను మళ్లీ ప్రవృత్తుల లోనికి ప్రవేశించాను. ఆనాడు మత్స్యరాజు కళత్రపుత్రబంధు మిత్రులతో పొందిన ఆనందాన్ని చూసి అసూయపడి అదే బ్రహ్మానంద మనుకొని తుచ్ఛమైన వాంఛలకు లోనయ్యాను. నా ఒక్కడి దేహమే నాకు భారమనిపించి ముక్తిసాధన కోసం తపస్సు మొదలు పెట్టినవాడిని—ఒక్కరినీ ఇద్దరినీ కాదు—యాభైమందిని పెళ్లి చేసుకొన్నాను. పిల్లల్ని కన్నాను.

లోకంలో దుఃఖహేతువు లన్నింటికీ సంసారమే మూలం. ధీమంతుడైనవాడు బంధనాల లోనికి ప్రవేశింపకూడదు. ఆత్మస్వరూపాన్ని గ్రహించి తద్విషయమైన జిజ్ఞాసను శమింపజేసుకోవాలి.

బ్రహ్మవిదులకు ధర్మాధర్మాలు రెండూ సంతాపహేతువులే. బ్రహ్మచింతనాసక్తిని పొందికూడా నేను బ్రహ్మజ్ఞానాన్ని పొందలేదు. ఇకనైనా మించిపోయినది లేదు. కర్మపరిత్యాగం చేసి ఆత్మజ్ఞానంలో సర్వకర్మలనూ భస్మీపటలం చేస్తాను. సర్వభూతాంతరాత్మ, సర్వభూతహితాత్ముడు అయిన శ్రీమన్నారాయణుని ఉద్దేశించి తపస్సు చేస్తాను. అణువుకన్నా అణుతరుడు, మహత్త్వాని కన్నా మహత్స్వరూపుడు ఐన ఆయనే నన్ను అంధకారాన్నుంచి

తప్పించి ఆత్మజ్యోతిస్సును ప్రకాశింపజేస్తాడు. శ్రీవత్సలాంఛనుని, శ్రీపతిని, శ్రీనివాసుని, శ్రీవిలాసుని, శ్రీకరుని, శ్రీధరుని, శ్రీప్రదుని, శ్రీస్వరూపుని, శ్రీమంతుని, శ్రీమహావిష్ణువును ఆశ్రయించి శ్రీకైవల్యపదాన్ని చేరుకొంటాను.''

వైరాగ్యోదయం కలుగగానే సౌభరి విద్వత్సన్న్యాసాన్ని స్వీకరించి పాపవిముక్తుడై సత్త్వైక నిధానమైన శ్రీహరిపదాన్ని చూరగొన్నాడు.

పరమ శుభదాయకమైన శ్రీ సౌభరి చరిత్రాన్ని చదివిన వారు, విన్నవారు, పాడినవారు శ్రీనాథుని కరుణవల్ల ఎనిమిది జన్మల వరకు పాపకర్మలకు దూరమౌతారు. జీవితాన్ని భగవద్భాగవత సేవలో పండించుకొని అతిదుర్లభమైన మోక్షసామ్రాజ్యాన్ని అధిగమిస్తారు.

పురుకుత్సుని చరిత్ర

మాంధాత కొడుకులలో అంబరీషునికి యువనాశ్వుడు, అతనికి హారితుడు జన్మించారు. హారితుని వంశం వారు అంగిరసహారీతులయ్యారు.

ఒకప్పుడు భూమండలానికి అధోలోకాలలో కశ్యపముని కొడుకులైన మౌనేయులని పేరుగల గంధర్వులు ఆరుకోట్లమంది విజృంభించి అక్కడ ఉన్న సర్పగణాలను పరాభవించి, వారి శిరస్సులపైనున్న మణిమాణిక్యాలను, అనంతరత్నైశ్వర్యాలను అపహరించారు. గంధర్వుల ముందు బలహీనమైన సర్పజాతికి మళ్లీ కోలుకొనడానికి వీలులేనంత నష్టం వాటిల్లింది.

భుజగపతులందరూ సుధాపయోధి మధ్యంలో భుజగతల్పంపైన యోగనిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువు చెంతకు వెళ్లి శ్రుతి

పక్వమైన కంఠాలతో వైదికసూక్తాలను గానం చేశారు. "భగవన్! మాకీ దురవస్థ తొలగిపోయే సదుపాయం ఏమిటి?" అని పరిదీన వదనాలతో పరిపరివిధాల ప్రార్థించారు. శ్రీహరి వారి భక్తివిధేయతలకు ప్రహృష్టుడై, "నేను మాంధాతృసుతుడైన పురుకుత్సుని రూపంలో గంధర్వగణాలను జయిస్తాను. మీరు చింతిల్లవద్దు" అని అభయాన్ని ప్రసాదించాడు.

వాసుదేవునికి దండవత్ప్రణామాలను ఆచరించి పాతాళానికి తిరిగి వచ్చాక చక్షుఃశ్రవోధీశులు సమావేశమై, పురుకుత్సుని తమకు సహాయం చేయమని కోరదలచారు. ఆ మహాత్కార్యంలో ఉరగనాయకులకు తోడ్పడదలచి నర్మదానది పురుకుత్సుని వద్దకు వెళ్లి పాతాళానికి కలిగిన ఆపదను గూర్చి తెలియజేసింది. ఆశ్రితజనమందారుడైన పురుకుత్సుడు సోమపుత్రితో కలిసి పాతాళానికి వెళ్లి గంధర్వగణాలను నాశనం చేశాడు.

తమకు కలిగిన దురవస్థను తొలగించిన పురుకుత్సునికి పాతాళలోకపతులు అవిచ్ఛిన్నవంశాభ్యుదయాన్ని అనుగ్రహించారు. నర్మదానదిని స్మరించిన పుణ్యాత్ములకు తమ జాతివలన భీతికలుగకుండా వరాన్ని ప్రసాదించారు. ఉభయ సంధ్యలలోనూ నర్మదానదిని భక్తిశ్రద్ధలతో సంకీర్తించిన మానవులకు భోజనసమయంలో విషం తిన్నా అమృతాయమానమౌతుందని మాటయిచ్చి భుజగేంద్రులు నర్మదా పురుకుత్సులను యథోచితంగా సన్మానించారు.

పురుకుత్సుని వంశం అభ్యుదయపరంపరాభివృద్ధులతో అవిచ్ఛిన్నంగా కొనసాగింది. అతనికి త్రసదస్యుడు జన్మించి తండ్రికి తగ్గ తనయుడనిపించుకొన్నాడు. త్రసదస్యునికి సంభూతుడు, అతనికి అనరణ్యుడు ఉదయించారు. రావణుడు దిగ్విజయాన్ని సాధించినపుడు చంపిన రాజులలో ఈ అనరణ్యుడు కూడా ఉన్నాడు.

అనరణ్యునికి పృషదశ్వుడు, అతనికి హర్యశ్వుడు, అతనికి సుమనసుడు, సుమనసునికి త్రిధన్వుడు, అతనికి త్రయ్యారుణి, త్రయ్యారుణికి సత్యవ్రతుడు జన్మించారు.

సత్యవ్రతుడు శాపవశాన చండాలుడై త్రిశంకు నామాన్ని ధరించి అరణ్యావాసం చేశాడు.

సత్యవ్రతుడు శాపగ్రస్తుడైన రోజులలో కోసలదేశంలో దుర్భరమైన అనావృష్టి కలిగి దేశమంతటా కరువుకాటకాలు వ్యాపించాయి. ప్రజలకు అన్నోదకాలు లేక కడగండ్లు పడుతున్న ఆ దుర్భిక్షపు రోజులలో త్రిశంకుడు విశ్వామిత్రమహర్షి కుటుంబాన్ని ఆదుకొన్నాడు. ప్రతినిత్యం అడవికి వెళ్లి జింకమాంసం తెచ్చి, భార్యాబిడ్డలతో విశ్వామిత్రుడు కాపురం ఉన్న చోటికి సమీపంలో ఒక వటవృక్షానికి వ్రేలాడదీసి, గంగానది ఒడ్డున మహర్షి చండాలాన్నం తిన్నాడన్న వదంతి రాకుండా అక్కడినుంచి రహస్యంగా వెళ్లిపోయేవాడు. అలా పన్నెండేళ్లు గడిచాయి.

కరువు తీరిన తర్వాత త్రిశంకుడు తనకు చేసిన సహాయానికి సంతోషించి విశ్వామిత్రమహర్షి అతనిని బొందితో స్వర్గానికి పంపించాడు.

త్రిశంకునికి హరిశ్చంద్రుడు, అతనికి రోహితాశ్వుడు, అతనికి హరితుడు, హరితునికి చుంచుడు జన్మించారు. చుంచునికి విజయుడు, సుదేవుడు జన్మించారు. విజయునికి రురుకుడు, అతనికి వృకుడు, అతనికి బాహుకుడు ప్రభవించారు.

బాహుకుడిని చంద్రవంశంలో జన్మించిన హైహయులు. తాళజంఘులు కలిసి యుద్ధంలో ఓడించి అయోధ్యను కొల్లగొట్టారు. బాహుకుడు భార్యలందరితో కలిసి అరణ్యాలకు పారిపోయాడు.

ఆ సమయంలో బాహుకుని పట్టపురాణి గర్భవతిగా ఉన్నది. తనకు కలుగని సంతాన భాగ్యం మహారాజ్ఞికి మాత్రం ఎందుకు

కలగాలని సవతులలో ఒకతె ఆమెకు విషాన్నం కలిపి పెట్టింది. ఆ గరళ ప్రభావం వలన గర్భం స్తంభించి ఏడేళ్లు గడిచినా శిశువు బయటపడలేదు. బాహుకుడు రాజ్యభ్రష్టుడైనాక వ్యాధిగ్రస్తుడై కొంతకాలానికి ఆ అడవిలోనే ప్రాణత్యాగం చేశాడు. మహారాణి ఆయనతో కలిసి అగ్నిప్రవేశం చేయాలని చితిపై కూర్చున్నది.

అపుడు ఔర్వమహర్షి ఆపద్బాంధవుని వలె ఆ ప్రదేశానికి వచ్చాడు.

సతీసహగమనం ధర్మవిరుద్ధం

"అమ్మా! నీవు చేస్తున్న పని ధర్మసమ్మతం కాదు. నీ గర్భంలో సూర్యాన్వయోద్భవరాజన్యోత్తంసుడు పుట్టి పెరుగుతున్నాడు. అతను మహా పరాక్రముడు. యజ్ఞాలు చేసి చక్రవర్తియై భూతలాన శాశ్వతకీర్తిని పొందనున్నాడు. ఆత్మహత్యాభ్రూణహత్యాదోషాలకు పాల్పడి నీవు సాధింపదలచినది ఏమిటి?"

—అని నచ్చచెప్పి సతీసహగమనాన్ని మాన్పించాడు.

సగరుని చరిత్ర

రాజపత్నిని ఔర్వమహర్షి తన ఆశ్రమానికి తీసుకొని వెళ్లాడు. కొంతకాలానికి ఆమెకు బాలసూర్యప్రభావిభాసమాన దేహంతో సుందరాకారుడైన కుమారుడు కలిగాడు. ఔర్వుడే ఆ శిశువుకు జాతకర్మాది సంస్కారాలను నెరవేర్చి, గర (విష) సహితంగా జన్మనందిన కారణం చేత సగరుడని నామకరణం చేశాడు. ఆయనే స్వయంగా పూనుకొని సగరునికి వేదశాస్త్రాలను, సంగ్రామవిద్యలను సంపూర్ణంగా ఉపదేశించాడు.

కొన్నాళ్లు గడిచాక సగరుడు తల్లి వద్దకు వెళ్లాడు. "అమ్మా! మనం ఇక్కడ ఎందుకిలా అజ్ఞాతంగా ఉంటున్నాము? నా తండ్రి

ఎవరు? ఆయన ఇప్పుడెక్కడకు వెళ్లారు?'' అని ప్రశ్నలవర్షం కురి పించాడు. బాహుకపత్ని సవతి తనకు చేసిన అన్యాయాన్ని, తండ్రిని శత్రువులు పరాభవించిన వృత్తాంతాన్ని ఉన్నదున్నట్లుగా వివ రించింది.

ఆ మాటలను వినగానే సగరుడు కోపోద్దీపితుడై తండ్రికి జరి గిన అవమానానికి ప్రతీకారం చేస్తానని ప్రతిన బూని అయోధ్యకు వెళ్లి శత్రువులను కారుచిచ్చు వలె దహించివేశాడు.

హైహయ తాళజంఘులు మరణింపగానే వారి మిత్రులైన యవనులు, కాంభోజులు, పహ్లవులు, పారదులు వశిష్ఠమహర్షి వద్దకు పారిపోయి ఆయన శరణు వేడారు.

అప్పుడు శరణాగతత్రాణుడైన సూర్యవంశగురువు సగరుని వద్దకు వెళ్లి యుద్ధాన్ని విరమింపజేశాడు. ''నాయనా! నీ శత్రువు లను నేను వర్ణధర్మాల నుంచి బహిష్కరించి కులాచారభ్రష్టులను కావించాను. ఇక వారు జీవన్మృతులతో సమానం. నీవు చంపినా చంపకపోయినా ఒకటే. అంతేకాక భయార్తులై శరణువేడినవారిని వధించడం ధర్మసమ్మతం కాదు. నా మాట విని వీరిని విడిచిపెట్టు'' అని సాంత్వనవాక్యాలు పలికాడు.

సగరుడు ఆచార్యుని మాటలను మన్నించి విద్వేషికరాన్ని విడిచివేశాడు. ఆనాటి పరాజయానికి గుర్తుగా యవనులు అర్ధ ముండితశిరస్కులైనారు. పారదులు క్షురకర్మ మానివేసి దీర్ఘ కేశాలను పెంచుకోవడం మొదలుపెట్టారు. పహ్లవులు తల గొరిగించుకొని గడ్డం మాత్రం పెంచసాగారు. వర్ణధర్మ బహిష్కృతు లైన ఆ వేదబాహ్యులను మ్లేచ్ఛులుగా ప్రకటించి సగరుడు వారికి పితృకర్మలు లేకుండా చేశాడు. శత్రువిజయాన్ని సాధించి స్వాధిష్ఠా నానికి వచ్చి రాజ్యాభిషిక్తుడై చతుస్సముద్ర ముద్రిత మహీమండ లాన్ని ఏకాతపత్రంగా పరిపాలించాడు.

సగరపుత్రుల వృత్తాంతం

యుక్తవయస్సు రాగానే సగరచక్రవర్తి కశ్యపమహర్షి కుమార్తె సుమతిని, విదర్భరాజపుత్రిక కేశినినీ వివాహం చేసుకొన్నాడు. వారిని తన ప్రేమానురాగాలతో సుముఖీకరించుకొని సురతకేళీవిలాసాలలో ఓలలాడిస్తూ రాజభూయంతో పాటు దాంపత్య ధర్మాన్ని సహితం సర్వాంగపరిపుష్టంగా పరిపాలించాడు.

కొన్నాళ్లకు సగరునికి తన పితృపితామహుల వలెనే చక్రవర్తి లక్షణోపేతు డయిన అన్వయోద్ధారకుని పుత్రునిగా పొందాలని సంకల్పం ఉదయించింది. అతను ఆశ్రితజనకల్పతరువైన ఔర్వమహర్షిని ఆశ్రయించి తన కోరికను విన్నవించుకొన్నాడు. అతని సద్భక్తికి ప్రసన్నుడై ఔర్వుడు వరదానం చేశాడు. "నీ భార్యలలో ఒకరికి వంశవర్ధను డైన కుమారుడూ, మరొకరికి అరవైవేల మంది కొడుకులూ కలుగుతారు. ఎవరి అభిమతానుసారం వారు కోరుకోవచ్చు" అని అనుగ్రహించాడు.

మహర్షి మాటలను వినీవినగానే కేశిని కులదీపకుడైన కుమారుడు తనకు జన్మించాలని మొక్కుకొన్నది. సుమతి అరవైవేలమంది కొడుకులను కనాలని సంకల్పించింది. ఋషివాక్యానుసారం వారి కోరికలు తీరి వైదర్భికి అసమంజసుడు, కాశ్యపికి అరవైవేలమంది కొడుకులూ ఉదయించారు.

అసమంజసుడు బాల్యంనుంచి రాజపుత్రుడనన్న గర్వంతో అహంకరించి చెడునడతలకు అలవాటుపడ్డాడు. సగరుడు అతని దుష్ప్రవర్తనను చూసి కూడా పసివాడు కదా, కొంత పెద్దరికం వస్తే అల్లరితగ్గి సాత్త్వికు డవుతాడని తలపోసి ఏమీ అనలేక పోయాడు. పెళ్లిచేస్తే ఇంటిపట్టునన్నా ఉంటాడని తగిన సంబంధం

చూసి పెళ్లి చేసినా అతనిలో మార్పురాలేదు. వివాహ ఫలితంగా అతనికి అంశుమంతుడనే కొడుకు జన్మించాడు.

పౌత్రోదయం కాగానే సగరుడు కొడుకుపై మమకారం చంపుకొని అతనిని ఇంటినుంచి వెళ్లగొట్టాడు.

అన్నగారికి గృహబహిష్కారశిక్ష విధింపబడినదని తెలియగానే సగరరాజపుత్రులు అరవై వేలమందీ అంతకన్నా అధికంగా అసమంజసవర్తనం మొదలుపెట్టారు. యజ్ఞయాగాలు జరుగుతున్న చోట్లకు వెళ్లి ఋషిధర్మాన్ని అపధ్వస్తం చేశారు. వారి అల్లరులకు తల్లడిల్లి పృథ్వి కల్లోలపడసాగింది. లోకపాలకులైన రాజనందనులే అధర్మవర్తనులై చరిస్తుంటే భూజనులకు రక్షణ లేకుండా పోయింది.

అప్పుడు దేవతలు శ్రీమన్నారాయణుని అంశావతారమైన కపిలమహర్షి వద్దకు వెళ్లారు. ఆర్తత్రాణపరాయణుడై జగదభిరక్షణం కోసం మానుషవిగ్రహాన్ని ధరించిన ఆ మహాత్ముడు దేవతలకు ధైర్యం చెప్పి, ''సగరసుతులందరూ స్వల్పకాలంలోనే నశింపనున్నారు. మీరు వారిని గురించి కలత చెందకండి'' అని వారికి చిత్తశ్శాంతి కలిగించాడు.

ఆ సమయంలో సగరచక్రవర్తి హయమేధాన్ని సంకల్పించి యాగదీక్షను వహించాడు సగరాత్మజులు అరవై వేలమందీ యాగాశ్వగతిని అనుసరిస్తూ దిగ్విజయార్థం బయలుదేరారు. అప్పుడు ఒక అజ్ఞాతవ్యక్తి రాజనందనుల కంటపడకుండా అశ్వాన్ని అపహరించి ఒక భూమిబిలం చెంత అంతర్ధానమయ్యాడు.

హయాపహరణవార్తను వినగానే సగరుడు కొడుకులను పిలిచి అశ్వాన్ని వెంటనే పట్టితెమ్మని ఆజ్ఞాపించాడు. వారు గుర్రం కాలిగిట్టల వెంబడిని అడుగుజాడలను గుర్తుపడుతూ యాగాశ్వం మాయమైన చోటనున్న బిలాన్ని చూసి, ఒకరి తరువాత ఒకరుగా

ఒక్కొక్క యోజనం చొప్పున తవ్వుకొంటూ పాతాళలోకానికి చొచ్చుకొని వెళ్లారు.

కపిలాశ్రమం

పాతాళలోకంలో కపిలమహర్షి ఆశ్రమసీమ ఉన్నది. ఆ సమయంలో సంయమీంద్రుడు శరత్కాల సవిత వలె దీధితులీనుతూ తపోదీక్షలో యోగాసనాసీనుడై ఉన్నాడు. యాగాశ్వం ఆయన చెంతనే పచ్చికను మేస్తూ స్వేచ్ఛగా సంచరిస్తున్నది.

దీక్షాతురంగాన్ని చూడగానే సగరసుతులు చిందులు తొక్కారు. "ఇదిగో వీడే హయాన్ని దొంగిలించి యాగానికి విఘాతం కల్పించిన దురాత్ముడు. వీణ్ణి చంపండి, నిలువునా నరకండి" అని దుర్భాషలాడుతూ కపిలమహర్షిని చుట్టుముట్టారు.

సగరపుత్రుల కోలాహలధ్వనులతో కపిలర్షికి తపోభంగమైంది. ఆగ్రహోదగ్రుడై ఆయన ఈషత్పరివర్తితవిలోచనాలతో దృక్కులను సారించి చూచే లోగానే ఆయన శరీర సముత్థితమైన మహాగ్నిజ్వాలలు రాజాత్మజులను భస్మీపటలం చేసివేశాయి.

యాగాశ్వాన్ని వెంబడించి వెళ్లిన కొడుకులందరూ కపిల మహర్షి క్రోధానలంలో దగ్ధమయారని వినగానే సగరుడు శోక సముద్రంలో మునిగిపోయాడు. ప్రారంభించిన యజ్ఞకార్యాన్ని పూర్తి చేయాలి కనుక పుత్రశోకాన్ని దిగమింగుకొని అంశుమంతుణ్ణి పిలిచాడు. తాతగారి ఆనతిని శిరసావహించి అంశుమంతుడు బిల మార్గం గుండా పాతాళానికి వెళ్లి కపిలమహర్షిని సందర్శించాడు.

అంశుమంతుని భక్తివినయాలు, సత్ప్రవర్తన కపిల భగవానుని ఆకట్టుకొన్నాయి. బహుదూరం ప్రయాణించి వచ్చి తన కనుల యెదుట నిలిచిన ఆ యువకునిలో సూర్యవంశీయుల తేజోవైభవాన్ని సందర్శించి ఆయన ప్రసన్నుడైనాడు.

"నాయనా! ఈ యాగాశ్వాన్ని తీసుకొనివెళ్లి మీ తాత గారికి అప్పజెప్పు. నీ సాధుశీలాన్ని మెచ్చి నీకొక వరాన్ని ఇస్తున్నాను. నీ మనుమడు లోకనుతిపాత్రుడై స్వర్గలోకంనుంచి గంగానదిని భూమికి అవతరింపజేస్తాడు. నీవూ ఆయుష్మంతుడివై కలకాలం వర్ధిల్లు!"

అని ప్రీతిపూర్వకంగా పలుకగా అంశుమంతుడు మహర్షికి ప్రణమిల్లి—

"దేవా! బ్రహ్మదండహతులైన నా పితరులకు స్వర్గప్రాప్తి కలగాలని ఆశీర్వదించండి. వారికి సద్గతులను ప్రసాదించండి" అని వేడుకొన్నాడు.

గంగామాహాత్మ్యం

సంయమీంద్రుడు ఆతని కోరికను విని మందహాసం చేశాడు. "నాయనా! నా పలుకులలోని అంతరార్థాన్ని నీవు గ్రహించలేదా? నీ మనుమడు త్రిదశాలయం నుంచి గంగాతరంగిణిని భూమికి అవతరింపజేస్తాడు. ఆ పరిపూత జలశీకరాలు నీ పితరుల అస్థికలను, భస్మావశేషాన్ని స్పృశింపగానే వారికి స్వర్నివాసభోగం కలుగుతుంది. సకలకల్మషాపహారిణి, లోకపావని, గంగానది సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు పాదాంగుష్ఠం నుంచి ప్రాదుర్భవించిన పుణ్యామందాకిని. నిత్యాభిసంధిపూర్వకంగా ఆ పవిత్రజలాలలో స్నానంచేసిన పుణ్యాత్ములకు అవ్యయమైన త్రిదివపదం కలుగుతుంది. అప్రయత్నంగానైనా ఆ దివ్యతోయాలు శరీరంలోని ఏ ఒక్క అంగానికి లవలేశం సోకినా పాపకర్మలు నశించి, బహుజన్మదుర్లభమైన నాకలోకసుఖనివాసం సద్యోలబ్ధమవుతుంది" అని గంగామాహాత్మ్యాన్ని విశదీకరించి విష్ణ్వంశసంభూతుడైన కపిలభగవానుడు సగరపౌత్రుని అనుగ్రహించాడు.

అధ్వరాశ్వాన్ని తీసుకొని అంశుమంతుడు తండ్రివద్దకు వెళ్లాడు. సగరచక్రవర్తి శాస్త్రోక్తంగా అశ్వమేధాన్ని పూర్తి చేశాడు.

కపిలాశ్రమాన్ని అన్వేషిస్తూ సగరపుత్రులు త్రవ్విన బిల మార్గానికి చేరువనే గంగాముఖద్వారోపకంఠంలో సముద్రం ఉన్నది. సగరచక్రవర్తి కొడుకుల పేరుమీదుగా సముద్రానికి సాగరం అని పేరు ఆనాటి నుంచి ప్రచారం లోకి వచ్చింది.

సగరచక్రవర్తి తర్వాత అంశుమంతుడు రాజ్యానికి వచ్చాడు. అతని కొడుకు దిలీపమహారాజు.

దిలీపునికి భగీరథుడు జన్మించి కపిలమహర్షి అన్నట్లుగానే గంగానదిని స్వర్గాన్నుంచి భూమికి అవతరింపజేశాడు. భగీరథ యత్నానికి గుర్తుగా గంగానదికి భాగీరథి అని పేరు కలిగింది.

భగీరథునికి శ్రుతుడు, అతనికి అయుతాశ్వుడు జన్మించారు. నిషధదేశాధిపతి నలుడు శాపవశాన రాజ్యాన్ని కోలుపోయినపుడు అతనికి సహాయం చేసి ఆదుకొన్న అక్షహృదయవేత్త ఋతుపర్ణ మహారాజు ఈ అయుతాశ్వుని కొడుకే.

ఋతుపర్ణునికి సర్వకాముడు ఉదయించాడు. అతని పుత్రుడు సుదాసుడు. సుదాసునికి మిత్రసహుడనే పేరిట సౌదాసుడు జన్మించాడు.

సౌదాసుని చరిత్ర

ఋతుపర్ణుని ప్రపౌత్రుడు ఒకప్పుడు మృగయావినోదార్థం సమీపారణ్యానికి ఏకాంతంగా వెళ్లాడు. అక్కడ అతనికి మహోగ్ర ధ్వానాలతో అటవీస్థలిని ప్రకంపింపజేస్తున్న రెండు మహోగ్ర వ్యాఘ్రాలు కనిపించాయి. అసలే మృగాలు కానరావడంలేదని వెతుకులాడుతున్న సౌదాసుడు క్రోధోద్రిక్తుడై శరాసనానికి శర సంధానంచేసి ఒక్క వేటున వాటిలో ఒకదాన్ని కూల్చివేశాడు.

అమ్ము దెబ్బ తగిలి పెద్దపులి నేలకు వాలుతున్న సమయంలో ఆ మ్రియమాణదేహం కరాళవదనంతో అతి భీకరమైన రాక్షసాకారంగా మారిపోయింది. రాజు మళ్లీ విల్లెక్కుపెట్టే లోగానే వీను మిగిలిన రెండవ పులి వికటాట్టహాసం చేసి "దీనికి ప్రతీకారం అనుభవిస్తావు చూడు!" అని గర్జించి అంతర్థానమైపోయింది.

సౌదాసుడు అడవినుంచి తిరిగివచ్చి రాచకార్యాల సందడిలో ఆ వృత్తాంతాన్ని పూర్తిగా మరచిపోయాడు.

కొన్నాళ్లకు సౌదాసుడు తన తండ్రితాతల వలెనే యజ్ఞాన్ని చేయాలని సంకల్పించి కులపురోహితుడైన వసిష్ఠ మహర్షి ఆధ్వర్యవంలో మహావైభవోపేతంగా యాగాన్ని అనుష్ఠించాడు.

ఈ విధంగా యాగం పరిసమాప్తమైనపుడు చివరి రోజున వసిష్ఠ మహర్షి వైశ్వదేవానికి ముందు అనుష్ఠానానికి వెళ్లిన సమయం కనిపెట్టి శార్దూలరాక్షసుడు వసిష్ఠుని రూపు తాల్చి రాజువద్దకు వెళ్లాడు—

"ఓయీ! ఈరోజు నాకు మాంసభోజనం చేయాలని ఉన్నది. వెంటనే వంటవాళ్లను పిలిపించి పలాశనం వండమని చెప్పు. నేను అనుష్ఠానానికి వెళ్లి ఇక్కడున్నవాడిని ఇక్కడున్నట్లే క్షణంలో తిరిగివస్తాను."

—అని రాజుకు పురమాయించాడు.

సౌదాసుడు ఆచార్యుని అభిమతానుసారం మహానసంనుంచి సూపకారులను పిలిచి మాంసభోజనం వండింపజేశాడు. రాక్షసుడు వంటవాని వేషం ధరించి పాకశాల లోనికి ప్రవేశించి నరమాంసంతో వంటచేశాడు. భక్ష్యాన్ని ఒక స్వర్ణపాత్రికలో తెచ్చి రాజు చేతిలో ఉంచాడు.

వసిష్ఠమహర్షి అనుష్ఠానాదికం ముగించుకొని భోజనానికి వచ్చి కూర్చొనేసరికి వడ్డనకోసం కాచుకొని ఉన్న సౌదాసుడు

ఆయనకు హిరణ్యపాత్రస్థితమయిన మనుష్యమాంసాన్ని సమర్పించాడు.

భోజనానికి సంజుడుతిండి చూడగానే వసిష్ఠమహర్షి సౌదాసునిపై మండిపడ్డాడు. "ఓరి దురాత్ముడా! రాజునని మదించి ఎంత పాతకానికి ఒడిగట్టావు! సర్వసంగాలనూ పరిత్యజించి దేహధారణ నిమిత్తం ఫలక్షీరాలను మాత్రం భుజిస్తున్న నాకు నిషిద్ధాన్నాన్ని, అందులోనూ మనుష్యమాంసాన్ని వడ్డించావు. ఈ దురాగతానికి ప్రతిఫలంగా రాక్షసుడివై మనుష్యమాంసాలనే తింటూ నికృష్టంగా జీవించు!" అని శపించాడు.

మహర్షి ఆగ్రహవచనాలకు సౌదాసుడు నివ్వెరపోయి, "ఆచార్యా! మీరే కదా మాంసభోజనాన్ని తెమ్మని నన్ను ఆజ్ఞాపించారు. అప్పుడలా పలికి ఇప్పు డీవిధంగా శపించడం మీకు న్యాయమేనా?" అని ఆచార్యుని నిలదీసి అడిగాడు.

అప్పుడు వసిష్ఠమహర్షి సమాధినిష్ఠుడై యోగదృష్టి వలన అతీతవృత్తాంతాన్ని గ్రహించాడు. రాజు దోషం లేదని తెలుసుకొన్నాక శాంతచిత్తుడై, "నేను నీ కొసగిన శాపం పన్నెండు సంవత్సరాలు మాత్రమే ప్రవర్తిల్లుతుంది. ఆ తర్వాత నీవు యథాప్రకారం ధర్మజీవితాన్ని గడుపగలవు" అని శాపమోక్షణాన్ని అనుగ్రహించాడు.

అనాలోచితంగా తొందరపడి తనను దారుణమైన శాపానికి గురిచేసిన వసిష్ఠమహర్షిపై మనసు విరిగి సౌదాసుడు ఆవేశంతో జలాలను చేతిలోకి తీసుకొని ఆయనను శపించబోయాడు. అప్పుడు రాజమహిషి మదయంతి ఆయనను వారించింది. "వసిష్ఠమహర్షి మన కులగురువు. దైవతసమానుడు. ఆగ్రహంలో నైనా ఆచార్యుని శపించడం తగదు" అని నచ్చజెప్పింది.

భార్య పలుకులకు సౌదాసుడు మెత్తబడ్డాడు. చేతిలోకి తీసుకొన్న శాపజలాలను భూమ్యాకాశాలకు విడిచిపెడితే లోకాపకారం వాటిల్లుతుందని ఆ నీటిని తన పాదాలపైననే చల్లుకొన్నాడు.

ప్రతీపభావంతో సౌదాసుని మనస్సులో చెలరేగిన ప్రతీకార జ్వాలకు ప్రతీకగా ఉష్ణతాధిక్యంతో ప్రజ్వరిల్లుతున్న ఆ శాపజలాలు సోకి అతని పాదాలు దగ్ధచ్ఛాయను పొందాయి. కల్మాషపాదత్వం వలన అతనికి కల్మాషపాదుడని పేరువచ్చింది.

వసిష్ఠమహర్షి శాపానుసారం కల్మాషపాదుడు రాక్షసత్వాన్ని పొంది అరణ్యానులలో సంచరిస్తూ మనుష్యమాంసాన్ని భక్షింప సాగాడు. అతని అకృత్యాలకు అంతు లేకుండాపోయింది.

ఒకప్పుడు కల్మాషపాదుడు నిర్జనమైన ఒక గహన కాంతారంలో నరమాంసం కోసం వెతుకులాడుతూ తిరుగుతుండగా చెట్ల చాటున ఒకచోట మునిదంపతులు కనిపించారు. ఆ సమయంలో వారు పరస్పరానురక్తులై ఒకరి నొకరు కౌగలించుకొని రతికేళిలో ఉన్నారు. ఆకస్మికంగా తమ మీదికి ఉరికిన రాక్షసుని చూసి త్రాసార్తులై వారిద్దరూ అక్కడి నుంచి తొలగిపోవాలని విఫల ప్రయత్నం చేశారు.

కల్మాషపాదుడు నరమాంసం కోసం తమ మీదికి వచ్చిపడ్డాడని గ్రహింపగానే బ్రాహ్మణపత్ని రాక్షసుని పాదాలపై పడి కనీసం తన భర్తనైనా విడిచిపెట్టమని పరిపరివిధాల ప్రార్థించింది. "త్రిలోక మహిత చరిత్రులైన రాజన్యోత్తములు జన్మించిన ఇక్ష్వాకు కులానికి తిలకాయమానుడవైన నీవు మునిజనులను హింసించడం ధర్మం కాదు. భర్తలేని భార్యకు లోకంలో నిలువ నీడలేదు. అందుచేత నయినా దయతలిచి ఆయనను విడిచిపెట్టి నన్ను సంతోషంగా భుజించు" అని ప్రాధేయపడింది.

ఈ విధంగా విహ్వాలమై శోకిస్తున్న ముని ధర్మపత్నిని చూసి కల్మాషపాదరాక్షసుని రాతిగుండె అణుమాత్రమైనా చలించ లేదు. గుండెలు పగిలేలా విలపిస్తున్న ఆమె కళ్లెదుటనే గోవుపై కురికిన వ్యాఘ్రంలాగా మునిని చేతబట్టి గోళ్లతో చీల్చి చంపుతూ పచ్చి మాంసాన్ని భక్షించివేశాడు.

దారుణమైన భర్తృమరణాన్ని చూస్తూ నిస్సహాయంగా ప్రాన్పడి ఉన్న బ్రాహ్మణి కన్నులలో నిప్పులు కురిశాయి. "ఎంత బ్రతిమాలినా కనికరం లేకుండా రతికేళీగతమై ఉన్న ముని మిథు నాన్ని విడదీసి బ్రహ్మహత్యాపాతకానికి ఒడిగట్టావు. నీవు కూడా ఇలాగే భార్యతో భోగప్రవృత్తిని చెందినపుడు అతృప్తుడివై కాపాడే దిక్కు లేకుండా చస్తావు!" అని శపించి అగ్నిప్రవేశం చేసింది.

కొంతకాలానికి మహర్షి శాపావధి తీరిన తర్వాత సౌదాసుడు రాజ్యానికి తిరిగి వచ్చాడు. ఒక శాపన్నుంచి విముక్తి కలిగితే మరొక శాపం చుట్టుకొందన్న భయంతో అతనికి మనసు మన సులో లేదు. స్త్రీ విషయాభిలాష వల్లనే తనకు మృత్యువు కలుగ నున్నదని గ్రహించి భార్యతో కలయికలు మానివేశాడు.

భార్యా సంగమాన్ని పరిత్యజించినందువలన రాజుకు సంతానం కలుగలేదు. చిరకాలం గడిచినాక అతను పుత్ర సంతా నానికై వసిష్ఠమహర్షిని ప్రార్థించాడు.

సౌదాసుని ప్రార్థనను మన్నించి వసిష్ఠుడు మదయంతికి గర్భా ధానం చేశాడు. ఆ విధంగా ఆమె ఏడు సంవత్సరాలు కడుపుతో ఉన్నది. ఎంతకాలానికీ శిశూదయం కలుగకపోయేసరికి వేసరిల్లి ఆమె ఒక పదునైన రాతిముక్కను తీసుకొని గర్భాన్ని పొడుచు కొన్నది. ఆ బాధవల్ల పిండం కదిలి భూపతితమై పుత్రుడు జన్మిం

చాడు. అశ్మకంతో పొడిచినప్పుడు పుట్టినందువల్ల ఆ శిశువుకు అశ్మకుడని పేరు పెట్టారు.

అశ్మకునికి మూలకుడు జన్మించాడు. పూర్వం పరశురాముడు కార్తవీర్యార్జునునిపై ఆగ్రహించి భూమండలాన్ని ఇరవై ఒక్కసార్లు నిఃక్షత్రియం కావించిన రోజులలో సాకేతపురానికి వచ్చినప్పుడు మూలకుడు అంతఃపురంలో వివస్త్రలైన స్త్రీలమధ్య తలదాచుకొన్నాడు. ఆడవాళ్లను ఆశ్రయించి ప్రాణరక్షణ చేసుకొన్నాడని అతనికి నారీకవచుడని పేరు కలిగింది.

మూలకునికి దశరథుడు, దశరథునికి ఇళబిలుడు, అతనికి విశ్వసహుడు, విశ్వసహునికి ఖట్వాంగుడు జన్మించారు. ఈ ఖట్వాంగునికే దిలీపుడని నామాంతరం.

ఇక్ష్వాకు వంశపు రాజులలో దిలీపుని చరిత్ర సుప్రసిద్ధం. ఒకప్పుడు దేవదానవులకు తుములమైన పోరు సంఘటిల్లింది. దేవతల ఆహ్వానాన్ని పురస్కరించుకొని దిలీపుడు యుద్ధానికి వెళ్లి దానవులను చిత్రవధ చేశాడు. దేవతలు అతని సహాయానికి కృతజ్ఞులై అతనికి ఒక అభీప్సితవరాన్ని ఇవ్వదలిచారు.

దానం చేయడమే తప్ప దిలీపునికి ప్రతిగ్రహించడం తెలియదు. అతను వరస్వీకారానికి సుముఖతను చూపలేదు. "మహాత్ములారా! దుష్టశిక్షణావకాశమే నాకు మహాభాగ్యం. అయినా ఈ వరప్రాప్తసుఖభోగాలను అనుభవించడానికి నాకింకా ఎంత ఆయుర్దాయం మిగిలి ఉన్నదో చెప్పండి" అని అతను దేవతలను ప్రశ్నించాడు.

దేవతలు దిలీపుని ప్రశ్నకు ముఖాముఖాలు చూసుకొని, "ఓ రాజా! నీ కింకా ఒక్క ముహూర్తప్రాణమైన ఆయుష్యం మిగిలి ఉన్నది" అని చెప్పారు.

ఆయుర్భోగం తీరనున్నదని తెలుసుకోగానే దిలీపుడు దేవతలను వరం కోరకుండానే తన దివ్య విమానాన్ని ఆరోహించి భూమండలానికి తిరిగి వచ్చాడు. "నా ఆత్మకన్నా నాకు బ్రాహ్మణులే ఆత్మీయులన్న మాటే సత్యమైతే; నేను కలలోనైనా స్వధర్మాన్ని అతిక్రమించని సత్ప్రవర్తన కలవాడినైతే; నేను సకలదేవతా మనుష్యపశుపృక్షాది సచరాచరాలలో బ్రహ్మభావన చేసిన సమదర్శినైతే—ఆత్మస్వరూపుడైన పరమాత్ముడు శ్రీవాసుదేవ నారాయణ పరబ్రహ్మాకృతి నాకు ప్రసన్నం కావాలి" అని సంకల్పించి, ఆత్మైక్యాన్ని చెంది, బ్రహ్మాదులకు కూడా వశంకాని కైవల్య పదాన్ని పొందాడు.

దిలీపుని యశోదీధితులు దశదిశలకూ అభివ్యాపించాయి. "ఖట్వాంగునివంటి రాజు భూతలాన భూతభవితవ్యాలలో కానరాడు. సశరీరుడై స్వర్గపదాన్ని సందర్శించి భూమికి తిరిగి వచ్చి ముహూర్తమాత్రంలో మళ్లీ ముల్లోకాలకూ అతీతమైన స్థానాన్ని చేరుకొన్నాడు. ధన్యుడంటే అతనే ధన్యుడు. జీవితమంటే అతని జీవితమే జీవితం" అని సప్తర్షులు ఛందోమయ శ్లోకాలలో ఉపశ్లోకించారు.

ఖట్వాంగునికి దీర్ఘబాహువు, దీర్ఘబాహునికి రఘుమహారాజు, రఘువుకు అజమహారాజు, అతనికి దశరథమహారాజు జన్మించారు.

శ్రీరామచరిత్రం

దశరథమహారాజు పుత్రకామేష్టి చేశాడు. ఆయన యింట లోకాలోకాలకూ ఉత్పత్తి స్థితివిలయకారకుడైన శ్రీ మహావిష్ణువు జగత్స్థిత్యర్థమై ఆత్మాంశతో రామ - లక్ష్మణ - భరత - శత్రుఘ్నులుగా వచ్చి అవతరించాడు.

దశరథాత్మజులలో అగ్రజుడైన రాముడు బాల్యంలోనే విశ్వామిత్ర యాగసంరక్షణకు వెళ్లి తాటకను పరిమార్చాడు. సందర్శన మాత్రం చేతనే అహల్యకు పాపవిమోచనాన్ని ప్రసాదించాడు. జనకమహారాజు ఇంటిలో మహేశ్వరచాపాన్ని అనాయాసంగా విరిచి జనకరాజతనయ అయోనిజ సీతను వీర్యశుల్కంగా పరిగ్రహించాడు.

శివకోదండవిఖండనోదంతం నేల నాలుగు చెరగులా కలియ ప్రాకింది.

క్షత్రవంశక్షయానికి కంకణం కట్టుకొన్న హైహయ కుల వైరి పరశురాముని సత్త్వాన్ని అపాకరించి శ్రీరాముడు జమదగ్ని సుతుని బలావలేపాన్ని తొలగించాడు.

తండ్రిమాటకు కట్టుపడిన రామచంద్రుడు పట్టాభిషేకాన్ని వదులుకొని సీతాలక్ష్మణులతో వనవాసానికి వెళ్లాడు. విరాధ-ఖర-దూషణాదులను, కబంధుని, వానరరాజు వాలిని వధించాడు. వారధి కట్టి లంకకు వెళ్లి అశేషరాక్షసకులక్షయాన్ని కావించి జనకాత్మజాతను అపహరించిన దశగ్రీవుని సంహరించాడు.

జానకి అగ్నిప్రవేశం చేసి తన విశుద్ధవర్తనను నిరూపించుకొన్నది. నిఖిలదేవతాగణ సంస్తూయమాన శుభచరిత్రులై సీతారామలక్ష్మణులు అయోధ్యానగరానికి తిరిగి వచ్చారు. శ్రీరామ పట్టాభిషేకం జరిగింది.

భరతుడు గంధర్వదేశాలకు ఆధిపత్యాన్ని వహించి ఘోరాహవంలో మూడుకోట్లమంది గంధర్వులను హతమార్చాడు. శత్రుఘ్నుడు అమిత బలశౌర్యాలతో విక్రమించి మధుపుత్రకుడైన లవణుడనే రాక్షసేశ్వరుని వధించి మధురా నగరాన్ని స్వాధీనం చేసుకొన్నాడు.

ఈ విధంగా త్రేతాయుగంలో దుష్టనిబర్హణం జరిగింది.

లోకంలో వేదధర్మాన్ని పాదుకొల్పి రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు దేవపదానికి వెళ్లిపోయారు.

మానుషవిగ్రహుడై అవతరించిన శ్రీమహావిష్ణువు సన్నిధానంలో మెలగి రామరాజ్యంలో ధర్మవర్తనులై జీవించిన కోసల వాసులందరికీ మోక్షం లభించింది.

రామభూపాలునికి కుశలవులు, లక్ష్మణునికి అంగద – చంద్రకేతులు జన్మించారు. భరతునికి తక్షుడు, పుష్కరుడు కలిగారు. శత్రుఘ్నునికి సుబాహువు, శూరసేనుడు ఉదయించారు.

కుశమహారాజుకు అతిథి, అతిథికి నిషధుడు, అతనికి నలుడు జన్మించారు.

నలుని కొడుకు నభసుడు. అతనికి పుండరీకుడు, పుండరీకునికి క్షేమధన్వుడు, క్షేమధన్వునికి దేవానీకుడు ప్రభవించారు.

దేవానీకునికి అహీనాగుడు, అతనికి పారిపాత్రుడు కలిగారు.

పారిపాత్రునికి దళుడు, దళునికి ఛలమహారాజు, అతనికి ఉక్థుడు, ఉక్థునికి వజ్రనాభుడు, వజ్రనాభునికి శంఖనాభుడు, అతనికి హిరణ్యనాభుడు పుట్టారు.

శంఖనాభుని కొడుకు ఆత్మతేజోనిరతుడై భోగజీవితాన్ని పరిత్యజించాడు. మహాయోగీశ్వరుడైన జైమిని సన్నిధిలో వేదాంత శ్రవణం చేసి యాజ్ఞవల్క్యునికి యోగవిద్యను ఉపదేశించాడు.

హిరణ్యనాభునికి పుష్యుడు, పుష్యునికి ధ్రువసంధి, అతనికి సుదర్శనుడు, సుదర్శనునికి అగ్నివర్ణుడు, అగ్నివర్ణునికి శీఘ్రుడు, శీఘ్రునికి మరుడు జన్మించారు.

మరుడు చిరంజీవి. యోగవిద్యను అభ్యసించి నిస్సంగుడై ఇప్పటికీ కలాపగ్రామంలో నివసిస్తున్నాడు. అతనే ఆగామి యుగంలో సూర్యవంశ క్షత్రియులకు మూలపురుషుడై వంశకర్త కాబోతున్న మహాపురుషుడు.

మరునికి ప్రసుశ్రుతుడు, అతనికి సుసంధి, అతనికి అమర్షుడు, అమర్షునికి మహాస్వంతుడు, మహాస్వంతునికి విశ్రుతవంతుడు, అతనికి బృహద్బలుడు జన్మించారు.

భారత యుద్ధంలో కౌరవపక్షాన పోరాడిన బృహద్బలుని పదమూడవనాటి యుద్ధంలో అభిమన్యుడు సంహరించాడు.

పరమపావనమైన ఇక్ష్వాకు వంశంలో జన్మించిన రాజన్యుల చరిత్రలను ఆకర్ణించినవారికి సర్వశుభాలూ సమకూడుతాయి.''

అని పరాశరమహర్షి మైత్రేయునికి శశాదుని వంశానుచరితాన్ని విశదీకరించాడు.

నిమిచక్రవర్తికి దేవతల వరదానం

ఇక్ష్వాకు చక్రవర్తి కుమారుడైన నిమి ఒకప్పుడు సహస్ర వత్సరాల సత్త్రయాగాన్ని చేయాలని సంకల్పించి వశిష్ఠమహర్షి దగ్గరకు వెళ్లాడు. ''రవివంశానికి ఆచార్యులైన మీరు యజ్ఞానికిహోతగా నిలిచి నన్ను కృతార్థుని గావించండి' అని ఆయనను సంప్రార్థించాడు.

నిమిచక్రవర్తి కోరికను విని వశిష్ఠుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు—

''నాయనా! నీ యాగానికి రావడం నాకు సమ్మతమే. అయితే కొద్ది క్షణాల క్రితమే దేవేంద్రుడు ఇక్కడికి వచ్చి అమరావతిలో జరుగనున్న పంచశతవత్సరాల మహాధ్వరానికి హోతగా రమ్మని నన్ను ఆహ్వానించాడు. నేనిప్పుడు అక్కడికే బయలుదేరుతున్నాను. దేవకార్యం ముగియగానే భూమండలానికి తిరిగివచ్చి నీచేత యాగం చేయిస్తాను.''

వశిష్ఠుని పలుకులకు మారుపలుకు లేకుండా తలపంకించి నిమిచక్రవర్తి అక్కడినుంచి తిరిగి వెళ్లిపోయాడు.

వశిష్ఠమహర్షి స్వర్గానికి వెళ్లి ఇంద్రయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా జరిపించాడు. ప్రాయశ్చిత్తం లేకుండా యాగాన్ని సలక్షణంగా పూర్తిచేయించి, ఆ వెంటనే ఆలస్యం కాకుండా భూమికి తిరిగి వచ్చాడు.

వశిష్ఠమహర్షి అనుకున్నట్లు నిమి ఆయనకోసం ఎదురుచూడ లేదు. గౌతముని హోతగా నిలిపి అతను అప్పటికప్పుడే యాగ మధ్యంలో ఉన్నాడు. మునిజనులు ఉచ్చైఃస్వరంతో మంత్రాలను పఠిస్తున్నారు. చూడవచ్చిన జనసందోహాల కోలాహాలంతో యజ్ఞ వాటిక కళకళలాడుతున్నది.

తన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరయిందని వశిష్ఠు నికి పట్టరాని ఆగ్రహం కలిగింది. తనకోసం పాపం ఎదురుచూస్తుం టాడని తను వాయువేగ మనోవేగాలతో తిరిగి వచ్చేసరికి తనకు మాటమాత్రం తెలియజేయకుండా మరొకరిని కుదుర్చుకొన్నాడని నిమిచక్రవర్తిపై ఆయనకు కోపం మిన్నంటింది. క్రోధావేశాలు ముప్పిరిగొనగా ఉద్విగ్నుడై ఆయన రాజును విదేహుడవు కమ్మని శపించివేశాడు.

ఆ సమయంలో నిమి చక్రవర్తి కార్యభారంతో అలిసి నిద్రా గతుడై ఉన్నాడు. అతనికి మెలకువ వచ్చాక పరిజనులు జరిగిన వృత్తాంతాన్ని తెలియజేశారు.

నిమికి మహర్షిపట్ల వైరభావం ఉదయించింది. "ఆగ్రహం కలిగిన వెంటనే వశిష్ఠుడు నాతో మాట్లాడి ఉంటే ఈ అపార్థం ఏర్పడేది కాదు. ఏం ముంచుకొనిపోయిందని నా యెదుటపడకుండా ఇలా చాటుమాటున శపించాడు? ఈ దుష్టగురువు కూడా విదేహుడు కాదగినవాడే" అని హుంకరించి, వశిష్ఠమహర్షికి ప్రతిశాపం ఇచ్చి, అమోఘమైన ఆయన వచనానుసారం శరీరాన్ని పరిత్యజించాడు.

రాజు శాపం ఫలించి వశిష్ఠుని దేహం భూపతితమై ఆయన తేజం మిత్రావరుణులను చేరింది.

మిత్రావరుణులు మహర్షి తేజాన్ని చాలాకాలం తమలో నిలుపుకొన్నారు. ఒకప్పుడు వారికి అనభ్యాహితంగా దేవవేశ్య ఊర్వశి తారసిల్లింది. లోకోత్తరమైన సౌందర్యం రాశీభవించిన ఆ అపూర్వలావణ్యవతిని చూడగానే కామోద్రేకం కలిగి వారికి వీర్యపతనమైంది. అది నిమిత్తంగా గ్రహించి వశిష్ఠమహర్షి దేహధారణ చేసి పునర్జీవితు డయ్యాడు.

వశిష్ఠమహర్షి శాపంవలన విదేహుడైన నిమిచక్రవర్తి భౌతిక కాయాన్ని మహర్షులు తైలగంధాదులతో అలంకరించి దానిని సద్యోమృతప్రాయంగా భాసింపజేశారు. గౌతముని ఆధ్వర్యవంలో యాగం నిర్విఘ్నంగా కొనసాగింది.

యజ్ఞం పరిసమాప్తమైనాక భాగాలను స్వీకరించడానికి దేవతలు దిగివచ్చారు. ఋషులు వారికి స్వాగతసత్కారాలు జరిపి, "మీకు సమర్పితంగా ఈ జన్నాన్ని సంకల్పించిన యజమానునికి మీరు వరప్రదానం చేయండి" అని కోరారు.

దేవతలు సంతుష్టులై నిమిచక్రవర్తికి యథాప్రకారం శరీరాన్ని ప్రసాదించాలని అనుకొన్నారు.

అయితే అశరీరుడై దేవతల పలుకులను ఆలిస్తున్న నిమికి పునర్దేహధారణం సమ్మతం కాలేదు:

"ఓ భగవత్స్వరూపులారా! నన్ను మళ్లీ ఈ దేహకూపంలోనికి పడద్రోయకండి. అఖిలసంసారదుఃఖాలకూ ఆలవాలమైన ఈ శరీరాన్ని పొందడమే నిజంగా దుఃఖహేతువు. శరీరాత్మల వియోగభావం వలన దేహప్రీతి కలిగి ఆత్మజ్ఞానం నశిస్తుంది. నాకీ దేహం అక్కరలేదు. నేను విదేహుడనైనా ప్రాణికోటి కన్నులలో నన్ను నిలిపి, వారికి సశరీరినై గోచరించే వరాన్ని నాకు ప్రసాదించండి."

అని సంప్రార్థించాడు.

దేవతలు నిమిచక్రవర్తి కోరికను మన్నించి అతనిని ప్రాణి కోటి కన్నులలో నిలిపి అంతర్ధాన మయ్యారు.

ఆనాటినుంచి మానవులకు నిమి సత్త్వంవలన నిమిషత్వం కలిగింది. వారి కనురెప్పలకు ఉన్మేషనిమేషాలు కలిగాయి.

నిమేషప్రమాణాన్ని అనుసరించి మనుష్యులకు ఖండస్వరూపమైన కాలమానం ఏర్పడింది.

దేహధారణాన్ని తిరస్కరించి విగతదేహుడైన నిమిచక్రవర్తికి విదేహుడని పేరువచ్చింది.

జనకరాజవంశం

శరీరత్యాగం చేసేనాటికి నిమిచక్రవర్తికి సంతానం లేదు. అందువలన దేశం అరాజకమై ఋషిధర్మాలకు భంగం కలుగుతుందని మునులు ఆందోళన చెందారు. చక్రవర్తి దేహాన్ని అరణిగా చేసుకొని అతని దక్షిణభుజాన్ని మథించారు. వారి సంకల్పశక్తివలన అందులోనుంచి ఒక కుమారుడు జన్మించాడు.

జనకపిత లేకుండా జన్మించినందున ఆ శిశువుకు జనకుడని వ్యవహారనామం ఏర్పడింది.

విదేహుని దేహాన్ని మథించినప్పుడు కలిగినందున వైదేహుడని, మథనం వలన పుట్టినందున మిథి అనీ జనకునికి పేర్లువచ్చాయి.

మిథి పరిపాలించిన దేశానికి మిథిలానగరం రాజధాని అయింది.

జనకునికి ఉదావసుడు జన్మించాడు. అతని కొడుకు నందివర్ధనుడు. అతనికి సుకేతుడు, సుకేతునికి దేవరాతుడు కలిగారు.

దేవరాతునికి బృహదుక్థుడు ఉదయించాడు. అతనికి మహావీర్యుడు పుట్టాడు.

మహావీర్యుని సుతుడు సత్యధృతి. అతని కుమారుడు ధృష్ట కేతుడు. అతని పుత్రుడు హర్యశ్వుడు.

హర్యశ్వునికి మరుడు ప్రభవించాడు. మరునికి ప్రతిబంధకుడు, ప్రతిబంధకునికి కృతరథుడు, అతనికి కృతుడు, కృతునికి విబుధుడు, విబుధునికి మహాధృతి, అతనికి కృతిరాతుడు, కృతిరాతునికి మహారోముడు, అతనికి సువర్ణరోముడు, అతనికి హ్రస్వరోముడు, హ్రస్వరోమునికి సీరధ్వజుడు జన్మించారు.

సీరధ్వజమహారాజుకు చాలాకాలంగా సంతానం కలుగలేదు. అతను పుత్రునికొరకై యజ్ఞంచేయాలని సంకల్పించి యాగవాటికను సిద్ధపరచేందుకు నేలను దున్నుతుండగా నాగేటిచాలునుంచి అయోనిజ సీత జన్మించింది. సీరధ్వజుడు ఆమెను దుహితగా స్వీకరించాడు.

సీరధ్వజుని సోదరుడు కుశధ్వజుడు కాశీదేశపు రాజు. అతనికి భానుమంతుడనే కొడుకు జన్మించాడు. కుశధ్వజుని వంశం అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

భానుమంతునికి శతద్యుమ్నుడు ఉదయించాడు. అతని కొడుకు శుచి. అతనికి ఊర్జవహుడనే కొడుకు జన్మించాడు.

ఊర్జవహునికి సత్యధ్వజుడు కలిగాడు. అతనికి కుని, కునికి అంజనుడు, అంజనునికి ఋతచిత్తుడు, అతనికి అరిష్టనేమి, అరిష్టనేమికి శ్రుతాయువు, అతనికి సుపార్శ్వుడు పుట్టారు.

సుపార్శ్వుని కొడుకు సంజయుడు. సంజయునికి క్షేమారి, అతనికి అనేనసుడు, అనేనసునికి మీనరథుడు జన్మించారు. మీనరథునికి సత్యరథుడు, సత్యరథునికి సాత్యరథి, అతనికి ఉపగుడు, ఉపగునికి శ్రుతుడు ప్రాదుర్భవించారు.

శ్రుతునికి శాశ్వతుడు జన్మించాడు. అతనికి సుధన్వుడు, సుధన్వునికి సుభాషుడు, సుభాషునికి సుశ్రుతుడు, అతనికి జయుడు, జయునికి విజయుడు కలిగారు.

విజయునికి ఋతుడు ఉదయించాడు. అతని కొడుకు సునయుడు. సునయునికి వీతహవ్యుడు, వీతహవ్యునికి సంజయుడు, అతనికి క్షేమాశ్వుడు, క్షేమాశ్వునికి ధృతి, ధృతికి బహులాశ్వుడు, బహులాశ్వునికి కృతి జన్మించారు.

ఈ విధంగా జనకవంశం కృతిమహారాజుతో పరిసమాప్తిని చెందింది.

జనకరాజన్యుల పాలనలో మిథిలానగరం ధర్మనిలయమని కీర్తికెక్కింది. వీరిలో పెక్కుమంది ఆత్మవిద్యానిరతులై మహాత్ములని పేరు గడించారు.

సూర్యాన్వయంలో అవతరించిన రాజన్యోత్తముల పుణ్యచరిత్రం పరమపవిత్రం, పాపలతాలవిత్రం''

అని పరాశర మహర్షి పలుకగానే మైత్రేయుడు—

''మహర్షిసత్తమా! సూర్యవంశోత్తంసుల పుణ్యకథలను విన్నాక నాకు చంద్రవంశరాజచంద్రులను గురించి తెలుసుకోవాలని ఉత్సాహం కలుగుతోంది. వెన్నెలరేని మొదలుకొని నేటిదాకా శుభపరంపరగా వెంపొందుతున్న ఆ వంశచరిత్రను సవిస్తరంగా తెలియజెప్పండి''

అని కోరాడు.

మైత్రేయుని శ్రవణానుయోగానికి సంతసించి పరాశర మహామునీంద్రుడు తన కథానకాన్ని కొనసాగించాడు.

చంద్రవంశం

''మైత్రేయా!

ప్రథిత తేజోనిలయుడైన జైవాతృకుని వంశంలో జన్మించిన భూమిపతుల పుణ్యచరిత్రలను విను.

చంద్రవంశం అనంతమహిమాన్వితం.

అమిత ద్యుతిమంతులూ మహాబలపరాక్రమోపేతులూ ఐన మహారాజులు చంద్రవంశంలో జన్మించి భూతధాత్రిని సురక్షితంగా పరిపాలించారు.

ధర్మశీలురూ సద్గుణవంతులూ అయిన నహుష యయాతి కార్తవీర్యార్జునాది ప్రసిద్ధ పురుషులకు ఆలవాలమైన అమృతాంశు వంశానుచరితాన్ని విను—

ప్రళయపయోధిజలాలలో యోగనిద్రాముద్రితుడైన శ్రీమన్నారాయణుడు ఆత్మతేజోనిరతి నుంచి మేల్కాంచినపుడు ఆయన నాభికమలోద్భవుడై సృష్టికర్త బ్రహ్మ ఉదయించాడు. ఆ సృష్టికర్తకు మానసపుత్రుడై అత్రిమహర్షి జన్మించాడు.

అత్రికి చంద్రుడు జన్మించాడు. బ్రహ్మ అతనిని ఓషధులకు, ద్విజగణాలకు, నక్షత్రాలకు అధిపతిగా నియమించి అతని కిరణాలకు అమృతమయతనూ శీతలత్వాన్నీ ప్రసాదించాడు.

చంద్రుడు మహావైభవోపేతమైన రాజసూయాన్ని చేశాడు. అతనికి అభిమత సుఖభోగాలన్నీ సమకూడాయి. గృహస్థాశ్రమాన్ని స్వీకరించి దక్షప్రజాపతి కుమార్తెలైన అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశీర్ష, ఆర్ద్ర, పునర్వసు, పుష్య, ఆశ్లేష, మఘ, పూర్వఫల్గుణి, ఉత్తరఫల్గుణి, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రావణ, శ్రవిష్ఠ, శతభిష, పూర్వప్రోష్ఠపద, ఉత్తరప్రోష్ఠపద, రేవతి అనే ఇరవైయేడు మందిని వివాహం చేసుకొన్నాడు.

తారాశశాంకుల కథ

ఎన్ని అభీప్సితాలు సిద్ధించినా చంద్రునికి తనివితీరలేదు. తన ప్రభావం దశదిశలకూ విస్తరిల్లినదన్న గర్వంతో మదించి విచ్చలవిడిగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు.

కొంతకాలానికి చంద్రునికి విద్యాభ్యాసం చేయాలని జిజ్ఞాస కలిగి దేవగురువైన బృహస్పతివద్దకు వెళ్లాడు. ఆయనకు శుశ్రూషలు చేస్తూ చదువు సాములను నేర్చుకొనసాగాడు.

ఒకప్పుడు సురాచార్యుడు ఇంద్రుని యజ్ఞానికి హోతగా వెళ్ల వలసి వచ్చింది. శక్రవాసాని కేగుతూ ఆయన వేశ్మరక్షణాన్ని శిష్యునికి అప్పజెప్పాడు.

సురాచార్యుడు ఇంటిలో లేని సమయంలో చంద్రునికి ఆయన భార్య తారతో సన్నిధానం కలిగింది. ఆ శృంగారవతి రూప రేఖావిలాసం అతనికి ఎన్నడూ లేని పారవశ్యాన్ని కలిగించింది. నిరంతరం ఆమెకు పరిచర్యలు చేస్తూ ఆమె కనుసన్నలలో సంచ రిస్తూ ఆమె సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదింపసాగాడు.

తారకూడా మన్మథోద్రేకం చెందినట్లే ప్రవర్తించింది. నాథుడు ఇంటలేని ఆ ఏకాంతసమయంలో ఆమె తన శరీరలావణ్యాం ఉట్టిపడే బంగారు మెరుగులు తేరిన సన్నచీర కట్టుకొని ఉజ్జ్వలమైన భూషణాలను అలంకరించుకొన్నది. మన్మథభావోదయం వల్ల నూత్నవికాసం చెందిన కన్నులకు కజ్జలరేఖలను సొగసుగా తీర్చి దిద్దింది. జారుముడి వేసి నిండైన కురులలో అందంగా పువ్వులను ముడిచింది. ఆ సుమగంధాలకన్నా అతిశయంగా పరిమళిస్తున్న కర్పూరతాంబూలాన్ని సేవించి ఎరుపెక్కిన పెదవులలో మందహాసం చిందిస్తూ ఆమె తరచుగా చంద్రుని తన అంతికానికి పిలిచేది.

యౌవనోద్రేకం పొంగులువారుతున్న ఆమె శరీరాన్ని చూసి నప్పుడల్లా అతని కన్నులలో కాంక్ష తొణికిసలాడేది. ఏదో ఒక నెపాన ఆమెను పలుకరించి, ఆమె తనకేసి చూసినపుడు ప్రేమ భావం వల్ల బిగువు సడలుతున్న గబ్బిగుబ్బలను గాఢంగా కౌగిలించు కోవాలని తహతహలాడేవాడు.

ఆమెకూడా అతనితో ఏకాంతాన్ని కల్పించుకొని నర్మగర్భితంగా సరసవాక్యాలు పలికేది. చెలికత్తెలను పిలిచి వారితో అన్యాపదేశంగా మాట్లాడుతుంటే అందులోని ధ్వనితార్థాలను గ్రహించి అతను ఎన్నడూ లేని ఒక వింత పారవశ్యాన్ని పొందేవాడు. ఆమె ఊయెలమంచంపై కూర్చొని నిన్నటిరాత్రి స్వప్నంలో కలిగిన మధురానుభవాలను అరమరిక లేకుండా విప్పిచెబుతున్నపుడు పూర్ణపయోధరాల నుండి జారిన పైటను సవరించుకొంటూ తీగెలు సాగేటట్లు నవ్వితే అతను తనువెల్లా పులకరింతలతో మళ్లీ ఆ క్షణాలకోసం ఎదురుచూసేవాడు.

ఈ విధంగా తారాశశాంకులు అన్యోన్యంగా మెలగుతూ ఒకరినొకరు విడిచి ఉండలేని స్థితికి వచ్చేశారు. అతను నెమ్మదిగా చొరవచేసి తన మనసువిప్పి మాటాడగానే ఆమె తన సుముఖీభావాన్ని తెలియజేసింది. పరకాంత, అందులోనూ గురుపత్ని అని కూడా సంకోచింపక చంద్రుడు తారతో యథేచ్ఛగా సుఖభోగాలను అనుభవించాడు.

చూస్తూ ఉండగానే సురాచార్యుడు యజ్ఞవాటిక నుంచి తిరిగి వచ్చే సమయం ఆసన్నమైంది. ఇంకా అక్కడ మసలితే తమ రహస్యం బహిర్గతం కాకమానదని గుర్తించి చంద్రుడు అక్కడి నుంచి తొలగిపోవాలని నిశ్చయించుకొన్నాడు. అతని తోడిదే లోకమైన తారకూడా అతనితో కలిసి చంద్రమండలానికి వెళ్లిపోయింది.

సురాచార్యుడు నిజావాసానికి తరలివచ్చి జరిగిన వృత్తాంతాన్ని గ్రహించాడు. తన భార్య, తన శిష్యుడు తనకు కావించిన ద్రోహానికి చింతించి అతను ఇంద్రుని వద్దకు వెళ్లాడు.

సురేశ్వరుడు చంద్రుని ధౌర్త్యానికి అమర్షాన్ని చెంది ,వర్షదేలను పిలిపించాడు. "పరభార్యాపహరణం పాపకృత్యమని మీ

రతనికి బుద్ధిచెప్పి, అతను చెరపట్టిన తారను విడిపించండి'' అని వారిని తారావిమోచనకు నియోగించాడు.

దేవర్షులు చంద్రుని వద్దకు వెళ్లారు. అతను వారి మాటలకు వెడనవ్వు నవ్వి, ''ఓహో! ఆనాడు సిగ్గులేకుండా అహల్యపై మరులు గొని, కొక్కొరోకొ్రని కోడికూతలు కూసి గౌతమమహర్షిని బయటికి పంపించి ఋషిపత్నితో కామం చల్లార్చుకున్న సహస్రాక్షుడా నాకు నీతులు చెప్పేది? లోకమంతా అతని పేరు వింటే ఛీ! అని అసహ్యించుకొంటున్నదని మీరతనికి జ్ఞాపకం చెయ్యండి'' అని వారిని ధిక్కరించాడు.

ఋషులు తెచ్చిన వార్తను విని దేవేంద్రుడు సిగ్గుతో తల వంచుకొని పితామహుని వద్దకు వెళ్లాడు. తన సృష్టిలో జరుగుతున్న ఈ అకార్యానికి పితామహుడు కలతచెంది సత్యలోకఋషులను పిలిచి, ''చంద్రునితో నా మాటగా చెప్పి దేవగురుపత్నిని మీతో తీసుకొనిరండి'' అని ఆదేశించాడు.

బ్రహ్మదేవుని పలుకులను చంద్రుడు అపహాస్యం చేశాడు. ''నన్ను పుట్టించిన దైవమే నాకు ఈ బుద్ధిని కూడా ప్రసాదించాడు. ఇది అధర్మమైతే నాచేత ఎందుకు చేయించాడో ఆయననే చెప్పమనండి. నేను మాత్రం తారను విడిచిపెట్టను'' అని తెగవేసి చెప్పాడు.

పద్మగర్భుడు దేవగణాలతో అంగిరసాది మునులను వెంటబెట్టుకొని రుద్రుని వద్దకు వెళ్లాడు. దైవతలోకంలో సంభవించిన ఉపద్రవానికి రుద్రుడు ప్రళయకాలరుద్రుడై ఉద్రేకించి చంద్రునిపై యుద్ధానికి బయలుదేరాడు.

దేవగురువైన బృహస్పతికి దైత్యగురువైన శుక్రునితో పూర్వవైరం ఉన్నది. ఆ కారణాన్ని పురస్కరించుకొని శుక్రా

చార్యుడు జంభుడు కుజంభుడు మొదలైన దైత్యులను సమీకరించు కొని అపారసేనావాహినులతో చంద్రునికి సహాయంగా తరలి వచ్చాడు. పూర్వం అంగిరసుని వద్ద విద్యాభ్యాసం చేసిన రుద్రుడు తన గురుపుత్రుడైన బృహస్పతికి ద్రోహం తలపెట్టిన చంద్రునితో పాటు దైత్యానీకాన్ని కూడా ఎదుర్కొనవలసివచ్చింది.

ఆనాడు దేవదానవులకు మహాసంగ్రామం జరిగింది. ఉభయ పక్షాలూ ఘోరంగా పోరాడాయి. జగత్తులకు ప్రళయం కలుగ నున్నదని భీతిల్లి జగజ్జనులు సృష్టికర్తను శరణువేడారు.

లోకరక్షార్థం సృష్టికర్త రణక్షేత్రంలో శత్రుపక్షాల నడుమ సాక్షాత్కరించి శుక్రాచార్యుని, రుద్రుని, సురాసురులను వినివారించి చంద్రునికి తానే నచ్చజెప్పి తారను బృహస్పతికి అప్పజెప్పాడు.

ఆ సమయంలో తార పూర్ణగర్భవతిగా ఉన్నది. తన భార్య కడుపున మరొకరివల్ల సంతానం కలుగుతుంటే చూస్తూ ఊరుకో లేక బృహస్పతి కుమారుని విసర్జించిన తర్వాతనే ఆమె తనయింటికి రావచ్చునని నిర్దేశించాడు.

పతివచనానికి ప్రతివచనం చెప్పకుండా ఆ పతివ్రత దూరాన ముంజగడ్డిమేటలనే పొత్తిళ్లుగా చేసుకొని మోహనాకారుడైన పుత్రుని ప్రసవించింది.

ఈ విధంగా తారాగర్భం నుండి వెలువడిన శిశువు లోకాశ్చర్యకరమైన తేజోవిలాసంతో ఉజ్జ్వలాకృతిని వెలుగొం దాడు. అతని రూపసౌందర్యం దేవతలకే అచ్చెరువు గొలిపేదిగా అలరారుతున్నది.

దర్శనీయమైన ఆ మనోహరాకృతిని చూడగానే బృహస్పతికి కూడా పుత్రప్రేమ అంకురించింది. ఓషధీపతి బృహస్పతులు కొడుకు కోసం కలహించుకొనసాగారు.

అప్పుడు దేవతలు తారాత్మజుని రూపధేయాన్ని సాభిప్రాయంగా పరికించి, సత్యాన్ని తెలియజెప్పమని తారనే అభ్యర్థించారు. అప్పటికే తన బ్రతుకు నవ్వులపాలయిందని తలవంచుకొని నిలబడ్డ తారకు సిగ్గుతో నోట మాటరాలేదు.

దేవతలు ప్రశ్నిస్తుంటే మౌనంగా నిలబడ్డ తల్లిని చూసి తారాసుతుడు కోపంతో, "సిగ్గులేని పని చేసినది చాలక అడిగితే సమాధానం చెప్పవేమిటి? నా తండ్రెవరో చెప్పకపోతే ఈ క్షణం లోనే నిన్ను శపించివేస్తాను. అసత్యవాదినులైన స్త్రీలందరూ నీలాగే సిగ్గుపడేటట్లు చేస్తాను" అని హుంకరించాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు తారాత్మజుని శాంతింపజేసి, "అమ్మా! సత్యం చెప్పడానికి భయం దేనికి? ఈ కుమారుడు సోమాత్మజుడో బృహస్పతినందనుడో లోకానికి తెలియాలి కదా! మాతృధర్మంగా నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు" అని సాంత్వన వాక్యాలు పలికాడు.

చతుర్ముఖుని పలుకులకు తార సుముఖురాలై వేపథుస్వరంతో "చంద్రుడే ఈ శిశువును కన్నతండ్రి" అని సత్యాన్ని చెప్పివేసింది.

ఆ మాట వినగానే చంద్రుడు పట్టరాని సంతోషంతో కొడుకును కౌగలించుకొని, "నీవు బుధుడివి నాయనా!" అంటూ ప్రేమతో ముద్దాడి అల్లారుముద్దుగా చూసుకొన్నాడు.

చంద్రుడు తన కొడుకును బుధుడని ప్రశంసించినందున అతనికి బుధుడని పేరువచ్చింది. అతను పెరిగి పెద్దవాడైనాక తపస్సుచేసి గ్రహపథాన్ని అధిరోహించాడు.

బుధునికి వైవస్వతమనువు కుమార్తె ఇళాదేవినిచ్చి వివాహం చేశారు. ఆ మిథునానికి పురూరవశ్చక్రవర్తి జన్మించాడు.

పురూరవుని వృత్తాంతం

పురూరవుడు ధర్మానుగుణంగా రాజ్యపాలన చేశాడు. అసహాయశూరుడై అతను భూభారాన్ని భుజాల కెత్తుకొంటే ఆదిశేషుడూ ఆదివరాహం అష్టదిగ్గజాలూ సిగ్గుపడవలసివచ్చింది. అతను నిరంతరదానశీలుడు. ఆ దానవైఖరి ముందు కల్పవృక్షం కామధేనువు చింతామణి కలికానికైనా కనిపించవు. అతను యజ్ఞయాగాలతో భూతతృప్తిని సంఘటించిన ధర్మతత్పరుడు. తండ్రితాతల సౌందర్యాన్ని పుణికిపుచ్చుకొన్న అతని దేదీప్యమాన రూపస్వానికి శీలపరిమళం తోడై పురూరవుడు పురుషోత్తముడై ప్రకాశించాడు.

పురూరవుడు భూమండలాన్ని పరిపాలిస్తున్న తరుణంలో ఊర్వశి మిత్రావరుణుల శాపంవల్ల భూమండలానికి వచ్చి అతని మంగళాకారరేఖావిలాసానికి చకితురాలై అతనికి అవ్యవహితంగా నిలిచిపోవాలని కోరుకొన్నది. భువనాతీతమైన ఆమె శోభనరూపానికి పురూరవుడు కూడా విముగ్ధుడై ఆ ప్రథమసందర్శనంలోనే ఆమెపై మరులుగొన్నాడు.

ఊర్వశీపురూరవులు సంలబ్ధకాములై అతను భావతరంగనిర్వేలాయితమైన ప్రేమార్ణవంలో ఓలలాడారు. బుధనందనుని ఆనందసాంద్రచిత్తవృత్తులన్నీ ఆమెకు స్వాయత్తమైనాయి. ఆమె సమస్తసురభోగాలనూ విస్మరించి అతనికి అంకితమైపోయింది.

ఈ విధంగా వారిద్దరూ పరస్పరానురక్తులై ఆభిముఖ్యాన్ని పొంది ఒకరినొకరు తనివితీరా చూసుకొంటూ ఉండగానే వారిలో విస్పష్టవాంఛాంకురం కలిగింది. పురూరవుడే శబలితమైన మనస్సును స్వాధీనపరచుకొని ఆమెపై తనకుగల అనురాగాన్ని వ్యక్తంచేశాడు.

ఊర్వశి పురూరవుని అభికామాన్ని ప్రసన్నభావంతో అంగీకరిస్తూ త్రపావనతయై ఇలా అన్నది:

"నా శయనసమీపంలో ఎల్లవేళలా రెండు ఉరణశాబకాలు వర్తిలుతుంటాయి. వాటిని నేను కన్నతల్లికన్నా ఎక్కువ ప్రేమతో లాలిస్తున్నాను. ఎట్టి పరిస్థితిలోనూ అవి చోరాపహృతం కావడానికి వీలులేదు.

ఎంత కేళీరతుడవైనా నీవు నాకు నగ్నదేహంతో కనబడకూడదు. అలా నగ్నంగా కనిపించిన ఉత్తరక్షణంలో నేను అదృశ్యమైపోతాను.

ఘృతం మాత్రమే నాకు ఆహారం. అన్యపదార్థాలను నేను భుజించను.

ఈ నియమాలు నీకు అంగీకారయోగ్యమైతేనే మనకు సావాసం వీలవుతుంది.

సమయభంగం జరగకుండా నీవు ఎల్లవేళలా జాగరూకుడవై ఉండాలి. ఏ ఒక్క నియమం తప్పినా పరిణామం వియోగమే."

పురూరవుడు ప్రతిజ్ఞాపాలనలో అప్రమత్తుడనై సంచరింపగలనని ఆమెకు మాటయిచ్చాడు. ఊర్వశీపురూరవులు అలకాపురిలోని చైత్రరథాది శృంగారవనాల లోని కేళీసరస్సులనూ, మానససరోవరానికి చేరువలో ఉన్న దివ్యనికుంజాలనూ ఆవాసంగా చేసుకొని అరవైఒక్క వేల సంవత్సరాలు పరమానందభరితంగా కాలం గడిపారు.

ఈ విధంగా పురూరవునితో నిత్యసురతోత్సవాలలో విస్మయాపరపర్యాయమైన చిత్తవిస్తారరూపాన్ని అనుభవిస్తూ దేవకాంత ఊర్వశి అమరలోకనివాసాన్ని పూర్తిగా మర్చిపోయింది.

ఊర్వశీప్రవాసం చిరకాలికమై దేవతలకు స్వర్గలోక నివాసం దుస్సహమైపోయింది. అప్సరసలు, సిద్ధగంధర్వగణాలవారు ఆమెను తిరిగి సురావాసానికి రప్పించాలని ఆలోచిస్తుండగా వారికి ఊర్వశీపురూరవుల ఒప్పందం జ్ఞాపకానికి వచ్చింది. సమయభంగం చేస్తే

కాని తమకు అభీష్టసిద్ధి కలుగబోదని గ్రహించి, వారందరూ అందుకు విశ్వావసువును నియోగించారు.

విశ్వావసువు భూతలానికి వచ్చేసరికి ఊర్వశీపురూరవులు నిద్రాగతులై ఉన్నారు. అతడు వారి సదేశానికి వెళ్లి ఉరణకాలలో ఒకదాన్ని తన మాయతో మటుమాయం చేశాడు. దాని రోదనధ్వని భూమికి దూరమవుతూ సన్నసన్నగా ఆకాశవీథుల నుంచి ప్రతిధ్వనింపసాగింది.

ఆ అలికిడి విని ఊర్వశికి మెలకువ వచ్చింది. భరింపరాని దుఃఖోద్వేజనాలతో ఆమె ఉచ్చైస్స్వనంతో—"కొడుకు కన్నా ఎక్కువ ప్రేమతో నేను పెంచుకొంటున్న ఈ నోరులేని జీవిని ఎవరో అపహరిస్తుంటే చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాను. నాకన్నా అనాథ ఎవరుంటారు?" అని విలపిస్తుంటే పురూరవుడు నిద్రలేచి కూడా నగ్నంగా ఉన్నందువల్ల మంచంమీాది నుంచి లేవడానికి సాహసించలేదు.

ఇంతలో విశ్వావసువు మళ్లీ వచ్చి రెండవదాన్ని కూడా మాయం చేశాడు. ఆకాశంలో అదృశ్యరూపాల చప్పుళ్లను విని ఊర్వశి మరింత ఆందోళన చెంది, "కాపురుషుణ్ణి ఆశ్రయించిన నేరానికి నాకీ కష్టాలన్నీ వచ్చాయి. నాథుడు బతికుండీ నేను అనాథను కావాల్సి వచ్చింది" అని ఆర్తనాదం చేసింది.

ఊర్వశి మాటలకు మర్మఘాతమై పౌరుషం వచ్చి పురూరవుడు ఆ చీకట్లో తన నగ్నదేహం ఆమెకు కనిపించదని నిశ్చయించుకొని, ఖడ్గాన్ని చేతబూని, "ఓరి దుష్టుడా! నీకీ నాటితో చావు మూడింది" అని కేకవేస్తూ అలికిడి వచ్చిన వైపుకు కత్తి ఝుళిపించాడు.

పురూరవుడు నగ్నదేహంతో నిలబడగానే విశ్వావసువు తన మాయాశక్తి వలన ఆ ప్రదేశంలో దేదీప్యమానమైన కాంతిని ప్రభవింపజేశాడు. ఆ మహోజ్జ్వలమైన విద్యుత్కాంతిలో ఊర్వశి కృపాణహస్తుడై తన కన్నుల యెదుట దిగంబరంగా నిలబడి ఉన్న పురూరవుని దర్శించింది.

సమయభంగం జరిగిన మరుక్షణమే ఊర్వశి తను అన్నమాట ప్రకారం అదృశ్యమైపోయింది. గంధర్వులు మేషశాబకాలను అక్కడే విడిచిపెట్టి విజయోత్సాహంతో తిరిగి వెళ్లిపోయారు.

పురూరవుడు అపగతపునర్లబ్ధరోమశాలను వెంటబెట్టుకొని మందిరంలో శూన్యపర్యంకాన్ని చూసి ఊర్వశి తనను విడిచి వెళ్లిపోయిందని గ్రహించాడు. అప్రతీక్షితమైన ఈ హఠాత్పరిణామం వలన అతనికి చిత్తవిభ్రాంతి కలిగింది. విరహోద్వేగంతో రాజ్యభోగాలను పరిత్యజించి, సర్వమూ కోల్పడినవాని వలె నగ్నంగా ఉన్మత్తరూపుడై సంచరించడం మొదలుపెట్టాడు. ఆ విధంగా కాందిశీకుడై దేశాలుపట్టి తిరుగుతూ అతను కొంతకాలానికి ఉత్తర దిగ్భాగంలోని కురుక్షేత్రానికి వచ్చాడు. అక్కడ అతనికి ఒక అంభోజ సరస్సులో నలుగురు అప్సరోవనితలతో కలిసి జలక్రీడలాడుతున్న తన హృదయేశ్వరి కనుపించింది.

ఊర్వశిని చూడగానే పురూరవునికి ప్రాణం లేచివచ్చింది. అతను ఉత్సాహంతో ఎగిరి గంతువేసి ఆమె పాదాల చెంత మోకరిల్లి "ఎన్నాళ్లకెన్నాళ్లకు మళ్లీ కనుపించావు! నీవు లేని లోకంలో నేను మాత్రం ఎలా ఉండగలను? రాజధానికి తిరిగి వచ్చి మళ్లీ నా జీవితంలో వెలుగును ప్రసాదించు" అని పరిపరి విధాల వేడుకొన్నాడు.

ఆకస్మికంగా తన కన్నుల యెదుటకు వచ్చిన పురూరవునిపై ఊర్వశికి జాలి కలిగింది. ఉన్మత్తాకారుడై అతిదీనంగా కనుపిస్తున్న అతని అవివేక చేష్టితాలను అపవారించి, ఆమె ఇలా అన్నది:

"మహారాజా! నేనిప్పుడు గర్భవతిని. ఈ సంవత్సరాంతానికి నీకు కొడుకు పుట్టబోతున్నాడు. అప్పుడు వస్తే—నేను నీతో ఒక రాత్రి గడుపుతాను"

ఆమె పలుకులకు పురూరవుడు ప్రహృష్టస్వాంతుడై తన రాజ్యానికి తిరిగి వెళ్లాడు. ఊర్వశి తన చెలికత్తెలతో మాట్లాడుతూ పదే పదే అతని గుణశీలాలను జ్ఞాపకం చేసుకొన్నది. "పురుషు లందరిలోకీ సర్వోత్తముడైన ఆ మహారాజుతో కలిసి గడిపిన కాలం ఎంత మధురమైనది! ఆ రోజులు మళ్లీ ఇక రావు" అని ఆమె అంటుంటే వారందరూ అంగీకరించి, "ఇంత అందమైనవాడిని మే మెక్కడా చూడలేదు. నువ్వతనితో మాట్లాడుతుంటే మాకూ అతనితోనే ఉండిపోవాలని అనిపించింది సుమా!" అంటూ ఆమె అదృష్టాన్ని ప్రశంసించారు.

శరత్సమాపనం కాగానే పురూరవుడు కురుక్షేత్రానికి వచ్చి ఊర్వశిని కలుసుకొన్నాడు. ఆమె అతని కొడుకును అతనికి అప్పగించింది. ఆ రాత్రి వాళ్లిద్దరూ మళ్లీ పూర్వం వలె అభీష్టసుఖభోగాలను అతీవంగా అనుభవించారు. ఆమె మళ్లీ గర్భవతి అయింది. ఈ విధంగా ఏకైకరాత్రి గర్భాధానాలతో వారికి ఐదుగురు కొడుకులు పుట్టారు.

అప్పుడు ఊర్వశి రాజుతో—"నీ తేజాన్ని సుస్థిరంగా నిలుపగల కుమారషట్కాన్ని కన్నాను. నీవు నాకోసం అనేక కష్టాలను అధిగమించావు. గంధర్వులు తమ కపటకృత్యాలతో మనను విడదీశారు. ఆనాటి ఆ దోషాపనోదానికై నాపైని అభిమానంతో

వారందరూ కలిసి నీకు వరదానం చేయాలని సంకల్పించారు. నీకు కావలసిన వరాన్ని కోరుకొనవచ్చు'' అని సాదరంగా పలికింది.

ఊర్వశీవాక్యానుసృతంగా సాక్షాత్కరించిన గంధర్వులతో పురూరవుడు — ''ఆర్యులారా! నా శత్రువులందరూ పరాజితులై రాజ్యం ప్రశాంతంగా ఉన్నది. ఆయురారోగ్య లక్ష్మీసంపదలతో సర్వేంద్రియాలూ ప్రసన్నంగా ఉన్నాయి. పుత్ర మిత్ర బంధువర్గాల వారందరూ అవ్యాహతంగా సుఖాలను పొందుతున్నారు. ఊర్వశీ సాలోక్యం తప్ప ఈ లోకంలో నాకు కోరదగినదేదీ లేదు. బతికినన్నాళ్లూ ఆమెతో కాలం గడపాలన్నదే నా కోరిక'' అని అన్నాడు.

గంధర్వులు పురూరవుని అభిలషితాన్ని మన్నించి అగ్నిస్థాలిని ప్రసాదించారు. ''ఈ అగ్నిని ఆగమానుసారంగా త్రిధాకరించి సంకల్పం చెప్పుకొని ఆహుతులను వేల్చు, నీ కోరిక నెరవేరుతుంది'' అని ఉపదేశించారు.

పురూరవుడు అగ్నిస్థాలిని చేతబూని అటవీమార్గాన తిరిగి వెళుతూ అతీత కథను నెమరువేసుకొన్నాడు. ''గంధర్వులు వరదానం చేయగానే ఊర్వశిని నాతో రమ్మని కోరకుండా ఈ నిప్పు కుండను తెచ్చుకొన్నాను. ఇంతకంటె అవివేకం వేరే ఏముంటుంది?'' అని చింతించి అతను అగ్నిస్థాలిని అక్కడే విడిచి స్వగృహానికి తిరిగి వెళ్లిపోయాడు.

నిరంతరాయితంగా ఊర్వశిని గురించిన ఆలోచనలతో రాజు ఆ రాత్రి పడుకొన్నాడన్న మాటేగాని అర్ధరాత్రి అతనికి మెలకువ వచ్చింది. ''ఎంత పని చేశాను? గంధర్వులు చెప్పినట్లు యాగం సక్రమంగా చేసినట్లయితే వరదానం ఫలించి ఊర్వశి నాకు శాశ్వతంగా దక్కి ఉండేది. చేతికి వచ్చినదాన్ని చేజేతులా జారవిడుచు

కొన్నాను'' అని దుఃఖించి అతను వెంటనే లేచి అటవీస్థలానికి వెళ్లాడు.

కాని అడవిలో అతను విడిచిపెట్టిన చోట అగ్నిస్థాలి లేదు. ఆ స్థలంలో ఇప్పుడు శమీగర్భం నుంచి ఒక అశ్వత్థవృక్షం మొలకెత్తింది. ఆ తరుగర్భితమైన దివ్యతేజానికి విముగ్ధుడై రాజు దానినే అగ్నిరూపంలో వేల్చాలని నిశ్చయించుకొన్నాడు.

రాజధానికి తిరిగిరాగానే పురూరవుడు వేదమాతృకాభూతమైన గాయత్రీ మహామంత్రాన్ని జపిస్తూ గాయత్రీ మంత్రాక్షరాల సంఖ్యగల అంగుళాల ప్రమాణంలో అశ్వత్థ మూలాన్ని అరణిగా రూపొందించి మంత్రపాఠం చేస్తూ ఆ మంత్రాక్షరాల సంఖ్యగల అంగుళాల ప్రమాణంలో దానిని మథించాడు. అగ్నిని ఆగమోక్త ప్రకారంగా త్రిధాకరించి ఊర్వశీ సాలోక్య ఫలాభిసంహితగా ఆహుతులను వేల్చాడు.

ఈ విధంగా వేదప్రోక్తమైన మహాయజ్ఞాన్ని సమ్యక్తరంగా నిర్వహించి పురూరవుడు సమున్నతమైన గంధర్వపదంలో ఊర్వశిని మళ్లీ కలుసుకొన్నాడు.

వైవస్వత మన్వంతరంలో ఇళాత్మజుని యజ్ఞకృత్యంవలన ఆదికాలంలో ఏకాకృతికమై వెలుగొందిన అగ్ని ఆనాటి నుంచి త్రేతాగ్నులుగా పరిఢవిల్లింది.

పురూరవుని వంశానుక్రమం

పురూరవునికి ఆరుగురు కొడుకులు — ఆయువు, ధీమంతుడు, అమావసుడు, విశ్వావసువు, శతాయువు, శ్రుతాయువు జన్మించారు.

అమావసుని కొడుకు భీముడు. అతనికి కాంచనుడు, కాంచనునికి సుహోత్రుడు ఉదయించారు.

సుహోత్రుని పుత్రుడు జహ్నువు రాజర్షియై గొప్ప యజ్ఞం చేశాడు. అతని యజ్ఞవాటికను ఒకప్పుడు ఆకాశపతిత గంగానదీ జలాలు ముంచెత్తివేశాయి. జహ్నువు ఆగ్రహోదగ్రుడై యోగ సమాధిలో యజ్ఞపురుషుని ఆత్మారోపణం చేసికొని ప్రవాహాంభస్సులను సంపూర్ణంగా త్రాగివేశాడు. ఆకాశం నుంచి భూతలాన్ని పవిత్రీకరించడానికి అవతరించిన మందాకినీజలాలు జహ్నూదర విన్యస్తాలయేసరికి లోకరక్షణార్థం దేవతలు అతనివద్దకు వెళ్లారు. కర్తవ్య ధర్మాన్ని ఉద్బోధించి సాంత్వన వాక్యాలతో అతని క్రోధాన్ని ఉపశమింపజేశారు. వారి పలుకులకు ప్రసన్నాస్యుడై జహ్నువు గంగాతరంగిణిని తన ఆత్మజాతగా అనుగ్రహించి, నీటిని వెలిగ్రక్కివేశాడు. జహ్నుముఖనిష్క్రాంత అయినందువల్ల చదలేటికి ఆనాటినుంచి జాహ్నవి అని పేరు వచ్చింది.

జహ్నువు కొడుకు పేరు సుమంతుడు. అతని కుమారుడు అజకుడు. అజకునికి బలాకాశ్వుడు, అతనికి కుశుడు, కుశునికి కుశాశ్వ - కుశనాభ - అమూర్తరయ - అమావసులని నలుగురు కొడుకులూ కలిగారు. కుశుని వంశీయులకు కౌశికులని అభిధానం కలిగింది.

కుశుని అగ్రసుతుడైన కుశాశ్వమహారాజు తనకు అమరేశ్వరుని వంటి కొడుకు పుట్టి అన్వయోత్తంసుడు కావాలని తపోదీక్షను వహించాడు. అతని కోరిక నెరవేరితే తన సుస్థితికి ముప్పు వాటిల్లగలదని దేవేంద్రుడు అతనికి ప్రత్యక్షమై, "నీకు నాతో సమానుడైన సత్సుతుడు జన్మింప నున్నాడు" అని మాట యిచ్చి, తానే గాధి నామంతో కౌశికుడై జన్మించాడు.

గాధి కుమార్తె సత్యవతి. భృగువంశంలో ఉదయించిన ఋచీకుడు గాధిరాజును దర్శించి, సత్యవతిని తనకిచ్చి పెండ్లి చేయమని

కోరాడు. అతిరోషణాకారుడైన ఆ పండుముసలికి చూస్తూ చూస్తూ తన కుమార్తెను కట్టబెట్టడం ఇష్టంలేక గాధి అతనితో—"ఓయీ! శ్యామకర్ణమూ, ఇందువర్ణమూ, వాయువేగమూ కలిగిన అశ్వ సహస్రం మాకు కన్యాశుల్కంగా కావాలి" అని బదులు చెప్పాడు.

ఋచీకుడు వరుణదేవుని కరుణవల్ల అశ్వతీర్థంలో జన్మించిన వేయి గుర్రాలను గాధికి సమర్పించి సత్యవతిని వివాహం చేసుకొన్నాడు. అపత్యార్థమై అతను యవలు, బియ్యం, పప్పుధాన్యాలు, పయోఘృతాలతో చరువును పాకంచేసి ఆమెకు భుజించమని ఇచ్చాడు. సత్యవతి అపుత్రకులైన తన తల్లిదండ్రులకు కూడా తగిన మార్గం చూపమని భర్తను ప్రార్థించింది. ఋచీకుడు ఆమె కోరికను మన్నించి, క్షత్రియ వంశానికి మకుటాయమానమైన సంతానం కలగడానికి మరొక పాత్రలో చరువును వండి, ఉభయపాకాలనూ సౌమ్య క్షాత్ర మంత్రాపస్సులతో సంప్రోక్షించి ఏ పాత్రను ఎలా వినియోగించాలో ఆమెకు ఉపదేశించాడు.

సత్యవతి తన భర్త నిదేశానుసారం తల్లి వద్దకు వెళ్లింది. గాధి రాజపత్ని ఆమె చెప్పిన వృత్తాంతాన్ని శ్రద్ధగా ఆకర్ణించింది. "అమ్మాయీ! లోకంలో ఏ తల్లిదండ్రులైనా తమ సంతానం తక్కినవారి సంతతి కంటె గొప్పవారు కావాలని కోరుకోవడం సహజం. అందువల్ల నీ భర్త నీ కోసం ఇచ్చిన ఆ పక్వాన్నం నా కొసగినదానికన్నా శ్రేష్ఠమని నా ఉద్దేశం. నీకు నేను తల్లి నన్న అభిమానం ఉంటే నీ పాత్రికను నా కివ్వు. నేను సకల భూమండల పరిపాలనదక్షుడైన మహారాజును కొడుకుగా కంటాను. నువ్వు మనసున్న ఆడదానివి. నీ తోబుట్టువు సుఖంకోసం ఆ మాత్రం చెయ్యలేవా?" అంటూ తన కుమార్తెను తేనెపలుకులతో అనునయించింది.

తల్లి మాటను కాదనలేక సత్యవతి తన పాత్రను ఆమెకిచ్చి శేషాన్ని తాను స్వీకరించింది.

సమిత్కుశాదుల కోసం అడవికి వెళ్లిన ఋచీకుడు ఇంటికి తిరిగివచ్చి చరువుల వినిమయోదంతాన్ని గ్రహించాడు. తన వచనానికి విరుద్ధంగా జరిగిన ఈ అకార్యానికి అతను క్రుద్ధుడై భార్యను చూసి, ''ఓసి పాపిష్ఠురాలా! చిరకాలంగా ఆర్జించిన తపశ్శక్తితో నేను సకల లోకాలలోని శౌర్యవీర్య బలసంపద్వైభవాలను ఆరోపించి నీ తల్లికోసం చేసిన చరువును నువ్వు తాగి, లోకోత్తరమైన శాంతిజ్ఞాన తితిక్షాది బ్రాహ్మణోచిత సద్గుణ సంపదలను పరిపూర్ణించిన చరుపాకాన్ని ఆమెకిచ్చావు. ఈ విపరీత చేష్టవల్ల నీ తల్లికి జగదారాధ్య తేజస్వంతుడైన బ్రహ్మవేత్త జన్మించి, నీ కడుపున బ్రాహ్మణవంశానికి తగని క్షత్రియాచారాలను కలిగి భీకర మహాస్త్రాలతో మారణకాండలకు పాల్పడనున్న కొడుకు పుట్టబోతున్నాడు. ఇదంతా నీ అవివేక కృత్యానికి విపరీత పరిణామం'' అని ఆమెపై మండిపడ్డాడు.

ఋచీకుని పలుకులను విని సత్యవతి భర్త పాదాలపై వ్రాలి కృపాభిక్షను వేడుకొన్నది. ''కరుణాసముద్రులైన భగవత్స్వరూపులు మీరే ఆగ్రహిస్తే నా కింక దిక్కెవరున్నారు? అజ్ఞానంతో నేను కావించిన తప్పువల్ల మీ దయాలబ్ధమైన సంతానం క్రూర కర్మపరాయణం కాకూడదు. అమోఘమైన మీ వాక్యాన్ని పుత్రునికి బదులు పౌత్రుని యందు ఆపాదించండి'' అని ప్రార్థించింది. ఋచీకుడు ఆమె మాటలకు శాంతించి చరుపాకఫలాన్ని మనుమనికి సంక్రమింపజేశాడు.

సత్యవతి గర్భాన్ని ధరించి సకాలంలో మానుషాకృతిని ధరించిన అగ్నితేజస్సువలె ఉద్దీపిస్తున్న జమదగ్నిని కన్నది. గాధి

రాజపత్నికి విశ్వామిత్రుడు జన్మించాడు. సత్యవతి కొంతకాలానికి కౌశికి అన్న పేరిట పుణ్యనదీస్వరూపాన్ని ధరించింది.

జమదగ్ని భార్య రేణుక. ఆమె ఇక్ష్వాకు వంశంలో పుట్టిన రేణుభూపాలకుని కుమార్తె. రేణుకా జమదగ్నులకు జగత్కల్యాణ కారకుడైన శ్రీమన్నారాయణుడు రామాభిధానంతో అంశావతారమై సముద్భవించాడు.

మహాభారతంలో పరశురాముని గాథ

శ్రీ మహాభారతంలోని వనపర్వ శాంతిపర్వాలలో పరశురాముని కథాకథనం పర్యాయోక్తంగా ఉన్నది. వక్తృభేదంచేత ఈ కథ బహురూపాలను పొంది ఉంటుందని, ఆ యా పాఠాలను కవి సందర్భోచితంగా గ్రంథస్థం చేశాడనీ మనం ఊహింపవచ్చు. భాగవతం నవమస్కంధం లోనూ, అగ్నిపురాణ పద్మపురాణాల లోనూ ఈషద్వైషమ్యంతో కనిపిస్తున్న ఈ సచ్చరిత్రం ఏ కారణంచేతనో విష్ణుపురాణంలో సంగ్రథితం కాలేదు.

వనపర్వంలో ధర్మరాజు మహేంద్రాద్రిపై విడిది చేసినప్పుడు అకృతవ్రణుడు చెప్పిన వృత్తాంతం—

పూర్వం కన్యాకుబ్జాన్ని పరిపాలిస్తున్న గాధిరాజు దగ్గరకు భృగునందనుడైన ఋచీకుడు వెళ్లి ఆయన కుమార్తె సత్యవతిని తన కిచ్చి వివాహం చేయమని కోరాడు. గాధిరాజు అతనిని— ఒక్క చెవి మాత్రం నలుపువన్నె తిరిగి దేహమంతా శుక్లవర్ణంలో విభాసిస్తున్న వేయి గుర్రాలను శుల్కంగా తెమ్మని కోరాడు. ఋచీకుడు వరుణదేవుని ఆరాధించి గంగాతీరంలో జన్మించిన అశ్వసహస్రాన్ని తీసుకొని వెళ్లి రాజుకు సమర్పించాడు. ఆ ప్రదేశానికి నాటి నుంచి అశ్వతీర్థమని ఖ్యాతి కలిగింది.

గాధి పుత్రికను పరిణయమాడి ఋచీకుడు కన్యాకుబ్జంలో ఉండగా ఒకనాడు భృగువు వచ్చి తన పుత్రుని యింట కొంతకాలం సుఖవాసం చేశాడు. కోడలి వినయవర్తనానికి ప్రసన్నుడై అతను ఆమెకు అభీష్టవరాన్ని ప్రసాదింపదలచాడు. సత్యవతి తనకు, తన జనకునికి పుత్రసంతానం కలగాలని కోరుకొన్నది. భృగుడు ఆమె వాంఛితాన్ని అనుగ్రహించి తల్లీ కూతుళ్లు శుచిస్నాతలై—సత్యవతి ఉదుంబర తరువును, తల్లి అశ్వత్థ వృక్షాన్ని కౌగిలించుకోవాలని నియమించాడు. ఆలింగనవిపర్యాసం వలన రాజపత్నికి బ్రహ్మభావన తత్పరుడు, ఋషిపత్నికి క్షత్రియ ధర్మశీలుడూ జన్మింపగలరని భృగువు పలుకగా సత్యవతి క్షత్త్రియ గర్భభారం తన పౌత్రునికి కలగాలని మామగారి నుంచి వరాన్ని పొందింది. ఆమెకు జమదగ్ని, గాధిపత్నికి విశ్వామిత్రుడు జన్మించారు.

జమదగ్ని వేదాధ్యయన తత్పరుడై బహుకాలం శ్రమించి సర్వ విద్యారహస్యాలనూ కరతలామలకం చేసికొన్నాడు. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత అతను ప్రసేనజిన్మహారాజు వద్దకు వెళ్లి ఆయన కుమార్తె రేణుకను తన కిచ్చి పెండ్లి చేయమని అర్థించాడు. అనూచానంగా సత్సంప్రదాయాలకు ఆలవాలమైన పవిత్ర బ్రాహ్మణ కుటుంబంలో ఉదయించి విద్యావివేకాలతో సంస్కృత హృదయుడైన జమదగ్నిని చూసి ముగ్ధుడై రాజు వెంటనే సుముహూర్తం చూసి తన కుమార్తెను అతనికిచ్చి వివాహం చేశాడు.

రేణుక భర్తృసేవాదీక్షితయై మునిధర్మానుగుణంగా సంచరిస్తూ సాధ్వీలలామ అని పేరెన్నిక గన్నది. ఆ దంపతులకు నలుగురు కొడుకుల తర్వాత జామదగ్న్యుడు జన్మించాడు.

ఒకప్పుడు రేణుక తన కొడుకులందరూ ఫలాహారణార్థం అడవికి వెళ్లాక, చేరువనే ఉన్న కొలనిలో స్నానానికి వెళ్లింది. ఆ సమ

యంలో అక్కడ మృత్తికావతీ యువరాజు చిత్రరథుడు మెడలో నీలోత్పలాల శృంగారమాలికలను అలంకరించుకొని భార్యతో జల క్రీడ లాడుతున్నాడు. ఆ దంపతుల పరస్పరానురక్తిని చూసి ఋషి పత్ని మనస్సులో మన్మథాగ్ని జ్వాలారూపమై రగుల్కొన్నది. అన్యమనస్కంగా స్నానం చేస్తూ దేహం తడిసిందన్న మాటే కాని పరపురుష వాంఛతో ఆమె మనస్సు మాత్రం కలుషితమై పోయింది.

ఇంటికి తిరిగివచ్చేసరికి ఆమె ముఖరేఖలలో ప్రస్ఫుటించిన కామమోహాన్ని జమదగ్ని తేలికగానే గుర్తించాడు. ధర్మవిరుద్ధమైన కోరికతో ఆమె చిత్తశాంతిని కోల్పోయిందని తెలియగానే ఆయనకు కోపం మిన్నుముట్టింది. తన పెద్దకొడుకు రుమణ్వంతుని, ఆ తర్వాత సుషేణ - వసు - విశ్వావసులనూ పిలిచి తల్లిని హత మార్చి తనకు సంతోషం కలిగించమని ఆదేశించాడు. చేజేతులా మాతృహత్యా పాతకానికి ఒడిగట్టడం ఇష్టంలేక వారందరూ తండ్రి ఆనతిని తిరస్కరించివేశారు. జమదగ్ని వారిపై ఆగ్రహించి వారిని బుద్ధిహీనులై జడవృత్తిని పూని అరణ్యంలో జంతువులూ పక్షులతో సమానంగా అజ్ఞానంతో అలమటించమని శపించాడు.

అనంతరం జమదగ్ని తన చిన్నకొడుకును పిలిచి, ''నాయనా! నీ తల్లి దోషవర్తనకు శిక్షగా ఆమెను వధించు'' అని ఆజ్ఞాపించాడు. రాముడు ఖండపరశువును తీసుకొని పితృవాక్యానుసారం తల్లి శిరస్సును ఖండించివేశాడు.

జమదగ్ని తన కుమారుని భక్తిభావానికి సంతోషించి, ''నాయనా! నా మాటకు కట్టుబడి అతి దుష్కరమైన కార్యాన్ని అవలీలగా చేశావు. నీ కిష్టమైన వరాలను అడుగు'' అని ప్రసన్న వదనంతో ప్రసంగించాడు. పరశురాముడు వినయపూర్వకంగా

నమస్కరించి, "తండ్రీ! నా తల్లి కావించిన అపచారాన్ని మన్నించి ఆమెకు మళ్లీ ప్రాణదానం చేయండి. పునర్జీవితురాలైనాక ఆమెకు సద్బుద్ధిని, దుర్వృత్తవిస్మృతినీ అనుగ్రహించండి. నా అన్నలందరికీ శాపవిముక్తి నొసగి, నాకు అజేయ పరాక్రమాన్ని, దీర్ఘాయువునూ ప్రసాదించండి" అని అభీష్టసిద్ధిని పొందాడు.

ఒకప్పుడు జమదగ్నిసుతుడు ఇంటలేని సమయంలో హైహాయ వంశీయుడైన కార్తవీర్యుడు దత్తాత్రేయుని మహిమవల్ల సహస్ర బాహువులనూ, కాంచనరథాన్నీ సంపాదించిన గర్వాతిశయంతో ఆశ్రమసీమలకు వచ్చాడు. రేణుక అతనిని స్వాగతించి అర్ఘ్యసత్కారాలు చేసింది. ఐశ్వర్యమదంతో కళ్లకు పొరలు గప్పిన రాజు ఆమె సత్స్వభావానికి కృతజ్ఞతను చూపకపోగా ఋషిగృహాన్ని చిందర వందర చేసి, ఫలవృక్షాలను కూల్చివేసి, హోమధేనువును హింసించి, ఆకలితో ఉన్న లేగదూడను తనతో బలాత్కారంగా తీసికొని వెళ్లిపోయాడు.

పరశురాముడు ఇంటికి తిరిగిరాగానే పరిదీనవదనంతో విలపిస్తున్న ఆశ్రమధేనువును చూసి, తల్లిద్వారా జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొన్నాడు. హైహాయకార్తవీర్యుని అపకృత్యాలను సహింపలేక తనను ఆశ్రయించిన దేవతలపై కరుణవహించి అభయదానం చేసిన శ్రీ మహావిష్ణువు అంశగా పుడమికి దిగివచ్చిన పరశురాముని హృదయం హైహాయవంశ నిర్మూలన ప్రతీకార దవకృశాను జ్వాలలతో ప్రక్షోభించింది. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ మహావిష్ణువు ప్రశస్తహస్త విన్యస్త మహామహిమాన్వితమైన సముద్దండ కోదండాన్ని చేతబూని కార్తవీర్యుని రాజధానికి వెళ్లి అతనిపై పరాక్రమించాడు. విష్ణు కార్ముకానికి సంధించి మృత్యుదూతల వంటి మార్గణాలను ధారాపూరాల వలె ప్రయోగిస్తూ అతని సహస్రబాహువులను తెగగోసి, కంఠాన్ని ఉత్తరించివేశాడు.

భీరువులై వీరధర్మాన్ని వెలివేసిన కార్తవీర్యుని కొడుకులు తండ్రి చావుకు పగ సాధించాలని జమదగ్ని ఆశ్రమానికి వెళ్లి నిరాయుధుడైన ఆ సంయమీంద్రుని ఆర్తరావాలను లెక్కచేయకుండా ఆయనను హతమార్చారు.

ఆశ్రమంలో నిత్యాగ్నిహోత్రానికి కావలసిన సమిధలను అరణ్యాన్నుంచి తీసుకొని ఇంటికి తిరిగి వచ్చిన పరశురాముడు కృతాంతగేహాని కరిగిన తండ్రి మృతశరీరం యెదుట శోకవిహ్వలయై హృదయవిదారకంగా విలపిస్తున్న తల్లిని చూడగానే జరిగిన వృత్తాంతాన్ని గ్రహించాడు. "తండ్రీ! ఘోరమైన అపకారం చేసిన దుష్టాత్ములకు కూడా కలలోనైనా ప్రతీకారం తలపెట్టి యెరుగని నీవంటి కరుణాసముద్రునిపై కత్తి యెత్తడానికి సాహసించిన ఆ హైహయుల పాపకృత్యానికి వైరశుద్ధిని నేను సాధిస్తాను. నాతో యుద్ధానికి రాలేక ఆశ్రమానికి వచ్చి ఏ పాపం యెరుగని నిన్ను వన్యమృగం వలె చుట్టుముట్టి హతమార్చిన ఆ హైహయులతోపాటు రాజధర్మాన్ని కోల్పోయిన నీచక్షత్రియులను ఊచకోత కోసి ధాత్రిని నిఃక్షత్రియం కావిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు. జీవత్పుత్రునిగా తండ్రికి నిర్వర్తింపవలసిన అంత్యవిధు లన్నిటినీ నెరవేర్చి, గార్హాస్థ్యాగ్ని హోత్రం నుంచి జ్వలత్కాష్ఠాన్ని తీసి చితికి నిప్పంటించాడు. పితృశ్రాద్ధం ముగిసిన తర్వాత మళ్లీ పరశువును చేతబూని విశ్వవిశ్వంభరామండలంలోనూ ఇరవైఒక్కపర్యాయాలు పర్యటించి కంటికి కానవచ్చిన క్షత్రియుడినల్లా కడతేర్చాడు. ఆజులలో రాజులందరూ నిహతతేజులై హతుల రక్తం వరదలై పారింది. ఆ రుధిరాన్ని అయిదు మడుగులుగా చేసి శమంతపంచకంలో భృగువంశానికి తర్పణ క్రియలను ఆచరించాడు. నిహతక్షత్రియమైన భూమిని కశ్యపునికి ఆర్త్విజ్య దక్షిణగా సమర్పించి నరోత్సేధ హిరణ్మయ

పీఠాన్ని బహూకరించాడు. కశ్యపుని అనుమతితో బ్రాహ్మణులు ఆ హిరణ్యాన్ని సమవిభక్తంగా పంచుకొన్నారు. వారందరికీ ఖండ వాయనులని పేరు వచ్చింది.

ఈ విధంగా కర్తవ్యకర్మను నెరవేర్చి పరశురాముడు నిస్సంగుడై మహేంద్రపర్వతానికి వెళ్లి తపోదీక్షను వహించాడు.

శాంతిపర్వ కథానకం

శ్రీమహాభారతం శాంతిపర్వంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు శమంతపంచకాన్ని చూపించి క్షత్రియవంశనాశనం కావించిన పరశురాముని పుణ్యచరిత్రను ఉపదేశించాడు.

జహ్నువుకు ఉజహ్నుడు, అతనికి వల్లభుడు, వల్లభునికి కుశికుడు జన్మించారు. కుశికుడు తపస్సుచేసి ఇంద్రుని కరుణవల్ల ఆతనినే తనయింట పుత్రునిగా అవతరింపజేశాడు. కౌశికునికి గాధి అని పేరు పెట్టారు. గాధిరాజు తన కుమార్తె సత్యవతిని ఋచీకమునికి ఇచ్చి వివాహం చేశాడు.

ఋచీకుడు సంతానవాంఛ కలిగి తనకు, మామగారి కొరకూ చరుద్వయాన్ని ఉపకల్పించాడు. భార్యను పిలిచి సుక్షత్రియ పుత్రుడు జన్మింపగల చరువును ఆమె తల్లికి, ఉత్తమబ్రాహ్మణ జన్మానికి కారకమైన చరుపాకాన్ని ఆమెకు ఏర్పరించి ఇచ్చాడు. ‘‘నీ తల్లిదండ్రులు కొంతసేపటిలో మన గృహానికి రానున్నారు. వారికి ఈ చరువినియోగాన్ని వివరించి, యథాయోగ్యంగా నీవు, నీ తల్లి భుజింపవలసినది’’ అని పలికి ఋచీకుడు నదీస్నానానికి వెళ్లాడు. సత్యవతి తీర్థయాత్రల కేగుతూ మార్గమధ్యంలో తన యింటికి వచ్చిన పితరులకు సేదదీర్చి, తల్లికి భర్తృనిదేశాన్ని ఎరుకపరిచింది. తల్లీ కూతుళ్లు పావనస్నానం ఆచరించి చరుపాత్రికలను గైకొన్నప్పుడు గాధిగృహిణి ప్రాలుమాలిక వల్ల తన చరువును కూతురికిచ్చి,

ఆమె చరువును తాను గ్రహించింది. ఋచీకుడు గృహాగతుడైనాక దివ్యదృష్టిచే జరిగిన విపర్యాసాన్ని గుర్తించి, భార్యతో భవిష్యమాణ వృత్తాంతాన్ని గురించి ప్రసంగించాడు. సత్యవతి ఆయన పాదాలపై వ్రాలి శరణువేడగా ఋచీకుడు, "ఇక నేను చేయగలిగిన దేమీ లేదు, చరువులో విశ్వబ్రహ్మాన్ని ఆవహించాను, నీ తల్లి బుద్ధిహీనత వల్ల వ్యత్యాసం జరిగింది. నీకు క్షత్రియ ధర్ముడు, నీ తల్లికి బ్రహ్మనిష్ఠుడూ ఉదయిస్తారు" అని పలికాడు. "ముల్లోకాలనూ మీ ఆజ్ఞకు లోబరుచుకున్న మహాత్ములు మీరు దయదలిస్తే మీ పుత్రుని ఉత్తమునిగా చేయగలరు" అని సత్యవతి ప్రార్థించింది. ఋచీకుడు దయగొన్నవాడై, "నీవు కోరినట్లే నీ సుతుడు సుధర్ముడై, నీ పౌత్రుడు రాజసగుణాన్ని పొందుతాడు" అని ఆమెను అనుగ్రహించాడు.

సత్యవతికి జమదగ్ని, గాధిగృహిణికి విశ్వామిత్రుడు జన్మించారు. జమదగ్నికి ధనుర్విద్యాపారంగతుడైన రాముడు ఉదయించాడు.

ఆ కాలంలో భూమండలాన్ని హైహయవంశానికి తిలకాయమానుడైన కార్తవీర్యార్జునుడు సహస్రబాహుసమన్వితుడై ధర్మనిర్మలమతితో పరిపాలిస్తున్నాడు. ఆశ్రితవత్సలుడైన ఆ మహారాజును అభ్యర్థించి అగ్నిదేవుడు ఆయన రాజ్యంలోని కొన్ని అరణ్యాలను ఆహారంగా భుజించడానికి అనుమతిని పొందాడు. ఆ విధంగా వనారణ్యాలను దహిస్తూ అగ్ని జమదగ్ని ఇంటలేని సమయంలో ఆయన ఆశ్రమాన్ని కూడా భస్మీపటలం కావించాడు.

సమిత్కుశాదుల కోసం ఆశ్రమబహిర్వనాలకు వెళ్లిన జమదగ్ని ఇంటికి తిరిగివచ్చి, సర్వభక్షకునికి రక్షణగా వెంటవచ్చిన కార్తవీర్యుని చూసి ఆగ్రహోదగ్రుడై, "ఋష్యాశ్రమాలను ధ్వంసం

చేయడం తగదని తెలిసికూడా విగుర్విం చావు. నీ గర్వానికి శిక్షగా అస్మత్సుతుడైన రాముడు నీ బాహువులను ఖండిస్తాడు గాక!'' అని శపించాడు.

ఎదురుచూడని ఈ శాపఘాతానికి విషాదం చెంది కార్తవీర్యార్జునుడు రాజధానికి తిరిగివచ్చి యథోచితంగా దినాలను గడప సాగాడు. శాపమహిమ వల్ల అతనికి అవినీతులైన కొడుకులు జన్మించి అధర్మవర్తను లయ్యారు. జమదగ్ని ఇంటలేని సమయాన ఒకప్పుడు వారు ఆశ్రమంపైకి దండెత్తి హోమధేనువును, లేగదూడను తమ మందిరానికి ఈడ్చుకొనిపోయారు. రాముడు గృహాగతుడైనాక రాజనందనులు కావించిన అకృత్యానికి కోపించి కార్తవీర్యుని వద్దకు వెళ్లాడు. అక్కడ వారిరువురికీ భీకరమైన యుద్ధం జరిగింది. పరశు రాముడు తన పరశువుతో కార్తవీర్యుని సహస్రబాహువులనూ ఛేదించి వేశాడు.

తండ్రికి సంభవించిన అవధీరణానికి హైహయ రాజపుత్రులు కుపితులై రాముడు ఇంట లేనప్పుడు ఆశ్రమానికి వెళ్లి జమదగ్నిని చుట్టుముట్టి ఆతని శిరస్సును ఖండించి పారిపోయారు.

పరశురాముడు తల్లిద్వారా జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొని క్షత్రియ జాతిపై పగబూనాడు. ఒక్కొక్క దేశానికి వెళ్లి రాచకులం పీచమడచి శత్రురుధిరధారలతో కుఠారధారను ప్రక్షాళించాడు. రిపువినాశానంతరం చిత్తశాంతిని పొంది తపోవనానికి వెళ్లాడు. ఆ విధంగా అనేక సంవత్సరాలు గతించాయి.

ఒకప్పుడు విశ్వామిత్రుని పౌత్రుడైన పరావసువు దుర్వినీతుడై పరశురాముని ఆశ్రమానికి వెళ్లి, కర్ణకఠోరమైన అధిక్షేప వాక్యాలతో అతనికి తపోభంగం కలిగించాడు. ''రాజులకు భయపడి తపస్సు పేరిట అరణ్యానికి పారిపోయావు. బాలుడనీ, వృద్ధుడనీ

ఉపేక్షించినట్లు నటిస్తూ ప్రతర్దనాదులను విడిచివచ్చిన నువ్వా ఒక వీరుడివేనా? మాట నిలుపుకోవడం చేతకాని అధీరుడికి ప్రజ్ఞాభిమానం ఎందుకో'' అని నలుగురియెదుట దుర్భాషలాడాడు.

పరావసువు మాటలకు అలిగి పరశురాముడు మళ్లీ బయలుదేరి కనిపించిన రాజునల్లా కడతేరుస్తూ ఈసారి బాలకులను, వృద్ధులనూ కూడా సంహరించాడు. జననీగర్భాలలో ఉన్న అర్భకులను నరికివేశాడు. తప్పించుకొని పారిపోయినవాళ్లను మృగాలవలె వెతికి వేటాడాడు. ఇరవై ఒక్క పర్యాయాలు సమస్తభూమండలమూ పర్యటించి భూమిని నిఃక్షత్రియం కావించి అశ్వమేధయాగం చేశాడు. యాగాంతంలో భూతలాన్ని కశ్యపునికి దక్షిణగా సమర్పించాడు.

అప్పుడు కశ్యపుడు పరశురాముని విలోకించి, ''దక్షిణగా ఇచ్చిన చోట తిరుగాడే అధికారం నీ కింక లేదు. దక్షిణసముద్ర తీరానికి వెళ్లి అక్కడ నివసించు. నీవు దానం చేసిన ఈ భూమిపై శేషించిన రాజులను ఇక నీవు చంపరాదు'' అని ఆదేశించాడు.

పరశురాముడు విరక్తుడై మళ్లీ తపోవనాలకు వెళ్లిపోయాడు. కశ్యపుని పేరిట భూమండలం కాశ్యపి అయింది.

భాగవత గాథ

శ్రీమహాభాగవతం నవమస్కంధంలో ఉన్న పరశురాముని జన్మప్రకారం భారతంలో శ్రీకృష్ణుడు ధర్మనందనునికి ఉపదేశించినట్లే చిత్రీకరింపబడింది.

హైహయవంశ రాజులలో ప్రాగ్రియుడైన అర్జునుడు దత్తాత్రేయుని ఆరాధించి అణిమాదిసిద్ధులను, సహస్రబాహువులను, అనంతైశ్వర్యసంపదలనూ పొంది తనవంటి మహావీరుడు ముల్లోకాలలోనూ లేడన్న కీర్తిని గడించాడు. రేవానదీజలాలలో సతీసమే

తంగా స్నానం చేస్తూ అతను తన సహస్రబాహువులనూ ప్రవాహానికి అడ్డునిలిపి జలాలను ఒక్కుమ్మడిగా వెనుకకు మళ్లించాడు. రేవా జలప్రవాహం వెనుకకు పొంగి విశ్వవిజిగీషతో ఆ ప్రదేశానికి వచ్చిన లంకేశ్వరునికి అడ్డునిలిచింది. రావణుడు ఆగ్రహించి అర్జునునితో ఆహవానికి వచ్చి పరాజితు డయ్యాడు. అతనిని మాహిష్మతీపురానికి తీసికొనివెళ్లి హైహయరాజు తగురీతిని బుద్ధిచెప్పి పంపించి వేశాడు.

ఒకనాడు అర్జునుడు సపరివారంగా వేటకు వెళ్లి మార్గ మధ్యంలో జమదగ్ని ఆశ్రమాన్ని సందర్శించాడు. ఆ మహర్షి కామధేనువు వంటి తన హోమధేనువును అర్థించి సర్వసంభారాలతో రాజుకు ఘనసత్కారం చేశాడు. అటువంటి దివ్యధేనువు మున్యాశ్రమంలో కంటె తనవద్ద ఉంటే మేలని భావించి రాజు దానిని బంధించి రాజధానికి కొనిపోయాడు.

ఈ వృత్తాంతం తెలిసి పరశురాముడు అర్జునుని కర్జానికి ప్రతీకారం చేయాలని మాహిష్మతికి వెళ్లాడు. రామార్జునులకు ఘోరయుద్ధం జరిగింది. పరశురాముడు తన కుఠారంతో రాజు సహస్ర బాహువులనూ నరికి పోగులుపెట్టాడు.

హోమధేనువును ఆశ్రమానికి తీసుకొని వెళ్లి పరశురాముడు తండ్రికి, తోబుట్టువులకు తన పరాక్రమాన్ని వర్ణించి చెప్పాడు. ప్రభు హత్యాపాతకానికి పరిహారంగా తీర్థసేవ చేయమని జమదగ్ని కుమారుని ఆదేశించాడు. పరశురాముడు తాలిమి వహించి ఒక సంవత్సరంపాటు పుణ్యక్షేత్రాలకు వెళ్లి తీర్థసేవనలతో పాపవిముక్తుడై నాడు.

ఒకప్పుడు రేణుక నదీస్నానానికి వెళ్లి అప్సరోవనితలతో జలక్రీడ లాడుతున్న చిత్రరథ గంధర్వుని చూచి కామమోహితు

రాలై కొంతసేపు వారిని కన్నార్పక తిలకించి పతి హోమార్చనకు తడవు చేసింది. జమదగ్ని ఆమెపై ఆగ్రహించి, తల్లిని నరికివేయమని కొడుకులను ఆజ్ఞాపించాడు. వారెవరూ మాతృహత్యకు ఉపక్రమింపక పోయేసరికి జమదగ్ని చిన్నకొడుకును పిలిచి, "నాయనా! నా మాట తప్పిన నీ అన్నలను కూడా నీ తల్లితోపాటు హతమార్చి నాకు సంతోషాన్ని కలిగించు" అని ఆదేశించాడు. తండ్రి ఆనతిని పాటింపకపోతే తనకూ ముప్పేనని, ఆయనకు సంతోషాన్ని కలిగిస్తే మృతులను సంజీవింప జేయగలడనీ ఆలోచించి రాముడు పితృవాక్యానుసారం వారిని వధించి, మళ్లీ ఆయన కరుణవల్ల తల్లీ తోబుట్టువులను బ్రతికించుకొన్నాడు.

పరశురాముని చేతిలో పరాజితులైన హైహయ రాజసుతులు జమదగ్ని ఇంటికి రహస్యంగా వెళ్లి రేణుకను అవమానించి ఆయనను నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. వారితో వైరం పూనిన జామదగ్న్యుడు రాజుల నీచవర్తనకు జుగుప్స కలిగి ఇరవై ఒక్కమార్లు భూమండలంలోని రాజులనందరినీ సంహరించి, భూతలాన్ని నిఃక్షత్రియం కావించాడు. శమంతపంచకానికి వెళ్లి యుద్ధంలో మరణించిన రాజుల రక్తాన్ని తొమ్మిది మడుగులు చేసి తండ్రి శిరస్సును శరీరానికి సంధించి పితృశ్రాద్ధాన్ని నిర్వర్తించాడు. సర్వ దేవాత్మకుడైన శ్రీమన్నారాయణుడు తానే కనుక, తననే యజ్ఞేశునిగా సంభావించి యాగం చేశాడు. హోమాంతంలో హోతకు తూర్పును, అధ్వర్యునికి పశ్చిమాశను, ఉద్గాత్రునికి ఉత్తరదిశను, ఆర్త్విజ్యానికి అవాంతరదిశలను, బ్రహ్మకు దక్షిణదిక్కును, కశ్యపునికి మధ్యదేశాన్ని, ఉపద్రష్టకు ఆర్యావర్తాన్ని, సదస్యులకు శేషభూమిని దక్షిణలుగా సమర్పించి, సరస్వతీనదిలో అవబృథస్నానం ఆచరించాడు.

ఈ విధంగా పరశురాముడు భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధంవలన పుణ్యభోగ శరీరాన్ని పొంది జమదగ్ని సప్తర్షి మండ

లంలో ఏడవవానిగా విరాజిల్లాడు. పితృభక్తిపరాయణుడైన భార్గవ రామునికి సావర్ణిమన్వంతరంలోని సప్తర్షి మండలంలో స్థానం లభించింది.]

సర్వాత్మకుడైన శ్రీమన్నారాయణుని తేజోంశవలన భూమికి దిగివచ్చిన పరశురాముని పుణ్యచరిత్రం ఇహపర శ్రేయోదాయకం, ముముక్షువులకు ఫలప్రాప్తి సోపానం.

విశ్వామిత్రుని సంతానం

విశ్వామిత్రునికి దేవతలందరూ కలిసి భార్గవ శునశ్శేఫుని పుత్రునిగా దత్తం చేశారు. దేవత లొసగిన సంతానం కనుక ఆ శిశువుకు దేవరాతుడని పేరు కలిగింది.

కాలక్రమేణ విశ్వామిత్రునికి మధుచ్ఛందుడు, జయుడు, కృతదేవుడు, దేవాష్టకుడు, కచ్ఛపుడు, హారీతుడు మొదలుగా గల సుతులు ఉదయించారు.

విశ్వామిత్రుని కొడుకులవలన కౌశిక గోత్రం ఏర్పడింది. అతని పుత్రులందరూ మహర్షితనయలను వివాహం చేసుకొని ధర్మ బద్ధంగా జీవితం గడిపారు. ఋష్యంతరాలవారితో వైవాహికాను బంధాల వల్ల ఈ గోత్రజుల కుటుంబాలు కమలషండాల వలె వర్ధిల్లాయి.

చాతుర్వర్ణ్యం

పురూరవుని జ్యేష్ఠపుత్రుడు ఆయువు రాహువు సుమార్తెను వివాహం చేసుకొన్నాడు. వారికి నహుషుడు, క్షత్రవృద్ధుడు, రంభుడు, రజి, అనేనసుడు జన్మించారు.

క్షత్రవృద్ధుని కొడుకు సుహోత్రుడు. అతనికి కాశుడు జన్మించాడు. కాశునికి లేశుడు, లేశునికి కృత్స్నమదుడు ఉదయించారు.

కృత్స్నమదుని సంతానం ముల్లోకాలలోనూ విశ్రుతుడైన శ్రీ శౌనకుడు. ఇతనివల్ల జంబూద్వీపంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులనే అభిధానాలతో చాతుర్వర్ణ్యం ఏర్పడింది.

ధన్వంతరి జననం

సుహోత్రుని అగ్రసుతుడు కాశునికి కాశీరాజు జన్మించాడు. అతని కొడుకు దీర్ఘతముడు.

దీర్ఘతమునికి శ్రీమహావిష్ణ్వంశ సంభూతుడైన ధన్వంతరి అన్వర్థ నామధేయంతో అవతరించాడు.

పూర్వం దేవదానవులు అమృత సంపాదన కోసం క్షీరసాగరాన్ని మథించినపుడు సర్వజనాశ్చర్యకరంగా వెలువడిన ధన్వంతరికి వాసుదేవుడు తన తేజోంశను అనుగ్రహించాడు. "కాశీరాజ వంశంలో అవతరించి నీవు మానవులకు ఆయుర్వేదోపదేష్టవై దేవతలతోపాటు యజ్ఞభాగాన్ని పొందుతావు" అని ఆశీర్వదించాడు.

శ్రీహరి వరప్రసాదం వలన ధన్వంతరి దీర్ఘతముని ఇంట ఉదయించాడు. వైద్యశాస్త్రంలో శల్య - శలాక - చికిత్స - భూతవిద్య - కుమారభృత్య - అగదతంత్ర - రసాయన - వాజీకరణాలతో కూడిన అష్టాంగయోగాన్ని రూపొందించి, మానవులకు రోగశాంతి సాధనోపాయంగా ఆయుర్వేదాన్ని ఉపదేశించాడు.

ధన్వంతరి కొడుకు కేతుమంతుడు. అతనికి భీమరథుడు, భీమరథునికి దివోదాసుడు, దివోదాసునికి ప్రతర్దనుడూ ఆవిర్భవించారు.

ప్రతర్దనుడు కాశీరాజవంశార్ణవానికి రాకాపూర్ణచంద్రుడై తన యశశ్చంద్రికలను దశదిశలకూ విస్తరింపజేశాడు. భద్రశ్రేణ్యకులాన్ని వినిర్మూలించి శాత్రవులను నిశ్శేషంగా సంహరించాక అతనికి శత్రుంజయుడని ప్రసిద్ధి కలిగింది. తండ్రి అతనిని చిన్నప్పటి

నుంచి ముద్దుగా వత్సా! వత్సా! అని సంబోధించినందున అతనికి వత్సుడని, అతని రాజ్యానికి వత్సదేశమనీ పేరు వచ్చింది.

ప్రతర్దనుడు వేదధర్మాన్ని అనుసరించి తన ప్రజలను కన్న తండ్రివలె ఆదరించాడు. నిత్యసత్యవ్రతుడైన ఆ రాజేంద్రునికి ఋతధ్వజుడని కూడా నామధేయం ఉన్నది.

ప్రతర్దనుని రథాశ్వం పేరు కువలయం. అతను ఆ గుర్రాన్ని అధిరోహించి కువలయ సంచారం చేశాడు. ఆ నాటి నుంచి అతనికి కువలయాశ్వుడని లోకవిఖ్యాతి ఏర్పడింది.

కువలయాశ్వుని సుతుడు అలర్కమహారాజు. జైవాతృకాన్వయంలో జనించిన గొప్ప రాజులలో అతను సుప్రసిద్ధుడు. ఆ మహారాజు యశోవైభవాన్ని వర్ణిస్తూ—

"అరవై వేల అరవై వందల సంవత్సరాల
సుదీర్ఘకాలం పాటు ఈ భూమండలాన్ని
తన భుజస్కంధాలపై భరించే సామర్థ్యం
కలవాడు అలర్కుడు కాక వేరెవ్వరున్నారు?"

అని రచితమైన శ్లోకం ఒకటి ఈనాటికీ ప్రచారంలో ఉన్నది.

అలర్కునికి సంతతి జన్మించాడు. అతని సుతుడు సునీతుడు. అతనికి సుకేతుడు, సుకేతునికి ధర్మకేతుడు, ధర్మకేతునికి సత్యకేతుడు ఉదయించారు.

సత్యకేతుని పుత్రుడు విభుడు. విభునికి సువిభుడు ప్రభవించాడు. అతని కుమారుడు సుకుమారుడు.

సుకుమారుని కొడుకు పేరు ధృష్టకేతుడు. అతని పుత్రుడు వైనహోత్రుడు. అతనికి భార్గుడు, భార్గునికి భార్గభూమి జన్మించారు. పూర్వం కృత్స్నమదుని కొడుకైన శౌనకుని వలె ఇతను కూడా చాతుర్వర్ణ్య సంప్రవర్తకుడై యశస్సు గడించాడు.

ఈ విధంగా కాశ్యరాజుల వంశం అనేక పురుషాంతరాలుగా ప్రవర్ధిల్లింది.

రజికి ఇంద్రపదప్రాప్తి

పురూరవుని కొడుకైన ఆయువుకు నహుష క్షత్రవృద్ధ రంభుల తర్వాత మహాబలోపేతుడైన రజి ఉదయించాడు. అతనికి ఐదు వందలమంది కొడుకులు జన్మించారు.

ఒకప్పుడు దేవదానవులకు మహాసంగ్రామం జరిగింది. పోరు ఘోరమైనాక ఉభయపక్షాలవారూ బ్రహ్మదేవుని సందర్శించి అంతిమవిజయం ఎవరికి కలుగుతుందో చెప్పమని అభ్యర్థించారు. చతుర్ముఖుడు వారితో, "నాయనలారా! రజిమహారాజు మీలో ఎవరిపక్షం వహిస్తే వారు శత్రుజయాన్ని సాధిస్తారు" అని సమాధానం చెప్పాడు.

దైత్యులు వెంటనే రజి వద్దకు వెళ్లారు. అతను వారిని సాదరంగా సన్మానించి, "మీకు తోడ్పడాలంటే యుద్ధానంతరం దేవలోకంలో ఇంద్రపదవి నాకు లభిస్తుందని మాట యివ్వండి" అని కోరాడు.

రజి వాంఛితానికి దైతేయులు ముఖాముఖాలను చూసుకొన్నారు. "అయ్యా! ఇప్పుడు మాటయిచ్చి రేపు అన్యథాకరించడం బాగుండదు. మా లోకానికి నాయకుడు ప్రహ్లాదుడు. విజయానంతరం ఇంద్రపదవి ఆయనకు దక్కాలనే మేము యుద్ధానికి సిద్ధపడ్డాము" అని వారందరూ గట్టిగా తెగవేసి చెప్పారు.

దైత్యులు వెళ్లిపోయిన తర్వాత దేవతలు రజిని సమీపించి, ఇంద్రపదవిని అతనికి ప్రదత్తం చేయడానికి అంగీకరించారు. పురూరవ పౌత్రుడు దేవసైన్యానికి సహాయంగా వెళ్లి శత్రువులు కనీవినీ యెరుగని మహాస్త్రాలను ప్రయోగిస్తూ అశేషదైత్యానీకాన్ని అవలీలగా సంహరించివేశాడు.

ఈ విధంగా అరాతిపక్షాలు పరాజితాలైనాక దేవేంద్రుడు రజిమహారాజు పాదాలకు మోకరిల్లి, "మహానుభావా! ఆర్తుడనై దీనావస్థలో ఉన్న నాకు అభయదానం చేసి నాకాన్ని కాపాడావు. భయత్రాతవు కనుక నీవు నిజంగా అస్మత్పితృమూర్తివి. ముల్లోకాలకూ ఆరాధ్యుడవైన పురుషోత్తముడవు నీవు. దేవలోకంలో ఇంద్ర పదవిని నిర్వహిస్తూ కాలం గడుపుతున్న నన్ను నీ పుత్రునిగా స్వీకరించు" అని ప్రార్థించాడు.

అమరేశ్వరుని ప్రణుతివాక్యాల లోని అంతరార్థానికి రజి మందహాసం చేసి, "ఓయీ! పగవాడైనా ఆశ్రయించి శరణు కోరినప్పుడు తిరస్కరించడం వీరధర్మం కాదు. పైగా రమణీయార్థగర్భితంగా ప్రసంగించి నా మనస్సును ఆకట్టుకొన్నావు. నీ కోరిక ప్రకారమే అమరావతిని నీకు పునర్దత్తం చేస్తున్నాను" అని పలికి నిజావాసానికి వెళ్ళిపోయాడు. ప్రహతశాత్రవమైన దేవపురం దేవేంద్రుని కైవసమయింది.

దివోదాససుతుడు స్వర్నివాసాన్ని విడిచి స్వనివాసాన్ని చేరుకొనేలోగా నారదుడు అతని కొడుకులను రెచ్చగొట్టి దేవలోకంపైకి పురికొలిపాడు. రాజసుతులు దేవేంద్రుని వద్దకు వెళ్ళి తమ తండ్రి సంపాదించిన రాజ్యం ఔరసత్వాచారం ప్రకారం తమకు సంక్రమించాలని వాదించారు. అతను వారి కోరికను కాదనగానే అమిత బలవంతులైన రజ్యాత్మజులు విజృంభించి దేవేంద్రుని బయటికి లాగి తామే ఇంద్రోపాధిని ఆక్రమించారు.

ఇలా కొంతకాలం గడిచాక రాజ్యాన్ని కోల్పోయిన దుఃఖంతో సునాసీరుడు మానావమానాలను దిగమ్రింగుకొని, బృహస్పతి ఏకాంతంగా ఉన్న సమయం చూసి ఆయనతో తన కష్టాలన్నీ చెప్పుకొన్నాడు. "త్రైలోక్య యజ్ఞభాగాన్ని అపహరించి శత్రువులు

నాకు ఆప్యాయనం లేకుండా చేశారు. నీ భాగంలో నుంచి బదరీఫల మాత్ర ప్రమాణంలో ఒక పురోడాశ ఖండాన్ని దానంచేసి నా ప్రాణాలను కాపాడు'' అని దయనీయంగా వేడుకొన్నాడు.

పదవీభ్రష్టుడైన లేఖర్షభుని దీనావస్థను చూసి దేవగురువు ఎంతో చింతించాడు. ''నా దగ్గర అడగటానికి కూడా ఇంత మొగమాటం దేనికి? నీ కోరిక ఎటువంటిదైనా నాకు సమ్మతమే. అయినా ఎన్నాళ్లిలా యాచనాదైన్యంతో కాలం గడుపుతావు? నేను నీ కోసం సర్వశుభంకరమైన యజ్ఞం చేస్తాను. అనతికాలంలోనే రిపు విజేతవై నీవు స్వర్గపదాన్ని చూరగొంటావు'' అని మాటయిచ్చాడు.

ఈ విధంగా దేవగణపతికి ధైర్యం చెప్పి బృహస్పతి రజి పుత్రులకు బుద్ధిమోహాన్ని, సంక్రందనునికి తేజోవృద్ధిని కలిగించే అభిచారహోమాన్ని ఆచరించాడు.

బృహస్పతి యాగం పరిసమాప్తి చెందేసరికి దివోదాస పౌత్రులు మోహావేశాన్ని పొంది పాపవర్తనులయ్యారు. అనూచానమైన స్వధర్మాన్ని పరిత్యజించి, వేదధర్మాన్ని వేద ప్రామాణ్యాన్ని తృణీకరించి లోకాలను పీడింపసాగారు. బ్రహ్మద్వేషులై యజ్ఞయాగాలకు విఘ్నాలను కల్పించారు. ధర్మోపహతులైన వారందరినీ సునాయాసంగా హతమార్చి మరుత్వంతుడు కులగురువు ప్రసాదించిన ఆప్యాయనాలతో పునర్లబ్ధతేజస్వంతుడై త్రిదివాన్ని ఆక్రమించాడు.

శతక్రతువులు చేసి యజ్ఞేశ్వరుడైన శ్రీమన్నారాయణుని కరుణవల్ల కల్పాంతపరిమితమైన పుణ్యపదాన్ని పొందిన దేవేంద్రుని చ్యవనారోహణాల ఉదంతాన్ని విన్నవారికి పదవీచ్యుతి, స్థానభ్రంశం కలుగవు. దురాత్మభావాలు తొలగి మనస్సు వినిర్మలమౌతుంది.

క్షత్రవృద్ధుని వంశం

ఆయువు మూడవ కొడుకు రంభునికి సంతానం కలుగలేదు. అతని సోదరుడు క్షత్రవృద్ధునికి ప్రతిక్షత్రుడనే పుత్రుడు ఉదయించాడు.

ప్రతిక్షత్రునికి సంజయుడు, సంజయునికి విజయుడు, విజయునికి యజ్ఞకృత్తు, అతనికి హర్షవర్ధనుడు జన్మించారు.

హర్షవర్ధనుని కొడుకు సహదేవుడు. అతనికి అదీనుడు, అదీనునికి జయసేనుడు, జయసేనునికి సంకృతి, సంకృతికి క్షత్రధర్ముడూ ప్రభవించారు.

క్షత్రవృద్ధుని వంశం ఈ విధంగా పరిఢవిల్లింది.

యయాతి చరిత్ర

ఆయుర్మహీపతి పెద్దకొడుకు నహుషునికి యతి - యయాతి - సంయాతి - ఆయాతి - వియతి - కృతి అని ఆరుగురు మహాబల పరాక్రములైన కుమారులు ఉద్భవించారు.

నహుషుని జ్యేష్ఠపుత్రుడు యతి. అతను రాగారాగవిదూరుడై రాజ్యసుఖాలను పరిత్యజించి యతీశ్వరుడై తన పేరును సార్థకం చేసికొన్నాడు.

అన్నగారు విడిచిపెట్టిన రాజ్యభారం యయాతికి సంక్రమించింది. అతను ఉశనసుని కుమార్తె దేవయానిని, వృషపర్వుని పుత్రిక శర్మిష్ఠనూ వివాహం చేసుకొని గృహికధర్మాన్ని స్వీకరించాడు. వీరి వృత్తాంతాన్ని గురించి అనేక గాథలు ఈ నాటికీ ప్రచారంలో ఉన్నాయి.

యయాతికి దేవయాని యందు యదువు, తుర్వసుడు ఉదయించారు. వార్షపర్వణి శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనువు, పూరుడు జన్మించారు.

ఒకప్పుడు శుక్రాచార్యుడు తన జామాత యయాతిపై కోపించి అతనికి అకాలవార్ధక్యం కలుగుతుందని శపించాడు. యయాతి మామగారిని ప్రసన్నం చేసికొని, ఎవరైనా తన ముసలితనాన్ని స్వీకరించడానికి అంగీకరిస్తే వారికి సంక్రమింపజేయడానికి అనుమతిని పొందాడు.

ఈ విధంగా శాపవిమోచనమార్గాన్ని తెలుసుకొని యయాతి యదువు దగ్గరకు వెళ్లాడు—

"నాయనా! నీ మాతామహుని ఆగ్రహంవలన నాకు ఈ జరాభారం ఉపస్థితమయింది. నాకింకా విషయవాంఛలపై ఆసక్తి ఉపశమించలేదు. వయోవస్థకు తగిన భోగాలను యథేచ్ఛగా అనుభవించి, మళ్లీ నా వార్ధక్యాన్ని నేను పరిగ్రహిస్తాను. ఒక వేయి సంవత్సరాల కాలంపాటు నీవు నా కోసం ఈ స్థావిరాన్ని భరించు. నా మాట కాదనకు" అభ్యర్థించాడు.

తండ్రి మాట విని సంప్రాప్తయౌవనానికి బదులు దుఃఖభాజనమైన వార్ధకాన్ని పొందడానికి యదువు ఇష్టపడలేదు. యయాతి అతనిపై ఆగ్రహించి, "పితృవచనాన్ని తిరస్కరించిన నేరానికి నీ సంతానం రాజ్యార్హత లేకుండా సామాన్యులవుతారు గాక!" అని అభిశంసించాడు.

అనంతరం యయాతి ద్రుహ్యుని, తుర్వసుని అడిగిచూశాడు. వారు కూడా పితృజరాపరిగ్రహణానికి అంగీకరించలేదు. రాజు వారిని సహితం యదువును వలె శపించివేశాడు.

ఆ తర్వాత యయాతి శర్మిష్ఠాతనయుడైన పూరువును సమీపించి తన వాంఛితాన్ని వెల్లడించాడు. పూరువు తండ్రికి సగౌరవంగా నమస్కరించి, ఆయన అభీష్టాన్ని ఆదేశవచనంగా ఔదలదాల్చాడు. తన యౌవనాన్ని తండ్రికి సమర్పించి ఆయన ముసలితనాన్ని తాను పరిగ్రహించాడు.

ఆ విధంగా సుతసంప్రాప్తయౌవనుడై యయాతి ధర్మానికి కట్టుపడిన అర్థకామాలను యథాకాలోపపన్నంగా యథోత్సాహంగా యథేచ్ఛగా అనుభవించాడు. అతని పాలనలో ప్రజలు సుఖశాంతులతో ప్రసన్నచిత్తులై సంతోషంగా జీవించారు. అతనికి దేవవేశ్య విశ్వాచితో పరిచయం కలిగింది. ఆమెతో కలిసి రమ్యాతి రమ్యమైన కామ్యసుఖాలను ఉపభోగిస్తూ చూస్తూ ఉండగానే సహస్రవత్సరాలు గడిచిపోయాయి.

ఒకనాడు యయాతి అతీతకాలాన్ని సంస్మరించి తన జీవితానుభవాలను సారవివేకంతో నెమరువేసుకొన్నాడు.

ఆశా స్వరూపం

మనస్సును వాంఛాలగ్నం కావించి కామోపభోగాల కోసం ప్రాకులాడేవారికి ఐహికవాంఛలు పెరుగుతాయే గాని తరగవు. హవిస్సులను అర్పించేకొద్దీ అగ్నిజ్వాలలు ప్రజ్వలించినట్లు కోరికలకు లొంగినవారి మనస్సులలో అప్రాప్తసుఖాల కోసం ఆందోళన మొదలవుతుంది. ఎంత సుఖాన్ని అనుభవించినా మనస్సు బంధమోక్షాలకు అతీతం కాకపోగా మళ్ళీ ఆ క్షణికానుభూతికే తహతహలాడుతుంది.

నిజానికి సుఖదుఃఖాలన్నవి సంకల్పవికల్పాల వల్ల ఉదయించే మనోభావనలే కాని వస్తుగత సత్యాలు కావు. సమస్త భూతజాతాన్ని సమభావనతో దర్శించి సర్వాంతరితమైన స్వాత్మతేజంలో అపర్యాప్తమైన మహానందాన్ని పొందగల ధన్యాత్ముల మనస్సులలో భౌతికమైన విషయవాంఛలు అంకురించవు.

ఎంత అనుభవించినా ఆశకు అంతులేదు. ఆశాసర్పదష్టులైన మానవులకు జీవితంలో శాంతి లేదు. నశ్వరమైన ఈ శరీరం లోని సర్వాంగాలూ నఖశిఖపర్యంతం ఏదో ఒకనాటికి వినాశాన్ని పొందేవే

అయినప్పటికీ ధనాశ, జీవితాశ మాత్రం మృత్యువు సమీపించినా మృత్యువును పొందవు.

వైరాగ్యపథం

ఈ విధంగా చింతించి యయాతి ఊహాలోకాలలో నుంచి వాస్తవానికి దిగివచ్చాడు. "హాయిగా సహస్రసహాయనాల కాలం గడిపినా నాలోని తృష్ణామోహం ఇంకా చల్లారలేదు. రోజు మొదలయ్యేసరికి మనస్సు మళ్లీ సరికొత్త అనుభవాల కోసం ఉవ్విళ్లూరుతున్నది. ఇంద్రియలాలసమైన మనస్సును క్షణికభోగాల నుంచి మళ్లించి అనశ్వరమైన బ్రహ్మానందానుభవంలో సంచరింపజేస్తాను" అని సంకల్పించి తన యౌవనాన్ని పూరునికి ఇచ్చివేశాడు. కొడుకులందరినీ చేరబిలిచి—తుర్వసునికి ఆగ్నేయదిగ్భాగాన్ని, ద్రుహ్యునికి ప్రతీచ్యాన్ని, యదువుకు దక్షిణదేశాలను, ఉత్తరాన్ని అనువుకూ అప్పజెప్పి పూరుని సర్వభూమండలానికి ఏకాధిపతిగా పట్టాభిషేకం చేశాడు. సర్వసంగపరిత్యాగం చేసిన తనకిక బంధాలతో ప్రమేయం లేదని గ్రహించి తపోదీక్షను గైకొని వనవాసానికి వెళ్లిపోయాడు"

అంటూ పరాశరమాని మైత్రేయునికి అనంతరకథాంశాన్ని విశదీకరించాడు.

యదువంశ చరిత్రం

యదువంశదివ్యచరిత్రం జగన్నుతపరమశుభకథాపవిత్రం,
అనేకానేకజన్మలుగా తీగెలు సాగి పెరుగుతున్న పాపలతలకు లవిత్రం.

యయాతి పెద్దకొడుకు యదుమహారాజు వంశంలో అశేష లోకాలోకాలలో నివసిస్తున్న దేవ దానవ మనుష్య సిద్ధ సాధ్య గంధర్వ యక్ష రాక్షస గుహ్యక కిన్నర కింపురుషాప్సరసలూ,

బ్రహ్మర్షి దేవర్షి మహర్షి ద్విజర్షి బృందాలూ, ధర్మార్థకామ మోక్షాలను ఆకాంక్షించిన సర్వజనులూ ఫలాభిసాధన కోసం ఏ మహాత్ముని భక్తిపూర్వకంగా నిరంతరమూ ఆరాధిస్తున్నారో ఆ సర్వేశ్వరేశ్వరుడు, విశ్వసృష్టిస్థితిలయాలకు మూలకారకుడు, అపరిచ్ఛేద్యమహామహిమాన్వితుడు, అనాదిమధ్యనిధనుడు, శ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణాభిధానంతో సంపూర్ణావతారమై వెలసి విలసిల్లాడు.

యదోర్వంశం నరః శ్రుత్వా
సర్వపాపైః ప్రముచ్యతే
యత్రావతీర్ణం విష్ణ్వాఖ్యం
పరం బ్రహ్మ నిరాకృతి

—అన్నట్లు నిరుపాధికమైన శ్రీమన్నారాయణపరబ్రహ్మం యదువంశంలో సాకారమై అవతరించిన పుణ్యకథను ఆకర్ణించిన మానవులకు పాపసంఘాతం నుంచి విమోచనం కలిగి నిరవధిక మహానందం ఘటిల్లుతుంది.

యదుమహారాజుకు నలుగురు కొడుకులు—సహస్రజిత్తుడు, క్రోష్టి, నలుడు, రఘువు ప్రభవించారు. వీరందరి మూలాన యదువంశం అనేక పురుషాంతరాలకు అభివ్యాపించి జగత్ప్రఖ్యాతిని ఉపార్జించుకొన్నది.

యదువు జ్యేష్ఠపుత్రుడు సహస్రజిత్తునికి శతజిత్తుడు ఉదయించాడు. అతనికి హైహయుడు, వేనుడు, హయుడు జన్మించారు. హైహయునికి ధర్మనేత్రుడు, అతనికి కుంతిరాజు, కుంతికి సాహంజి, సాహంజికి మహిష్మంతుడూ కలిగారు.

మహిష్మంతుని కొడుకు పేరు భద్రసేనుడు. అతనికి దుర్దముడు, దుర్దమునికి ధనకుడు జన్మించారు.

ధనకునికి నలుగురు కొడుకులు—కృతవీర్యుడు, కృతాగ్ని, కృతవర్మ, కృతౌజసుడు పుట్టారు. వీరిలో కృతవీర్యునికి సప్తద్వీప సమేతవసుంధరావలయాన్ని ఏకాతపత్రంగా పరిపాలించిన వీరాగ్రగణ్యుడు అర్జునుడు జన్మించాడు.

కార్తవీర్యుని కథ

కార్తవీర్యుడు భక్తిపరుడై శ్రీమన్నారాయణాంశ సంభూతుడైన అత్రిమహర్షి పుత్రుడు దత్తాత్రేయుని ఆరాధించాడు. ఆ మునీంద్రుడు కృతవీర్యాత్మజుని కరుణించి సహస్రబాహువులను, రిపుదుర్నిరీక్ష్య తేజాన్ని, ధర్మపాలనదీక్షను, ధర్మబద్ధమైన పృథ్వీ జయాన్ని; జగత్ప్రఖ్యాతమహాపురుషుని చేతిలో మృత్యువును వరాలుగా ప్రసాదించాడు.

అపూర్వమైన ఈ వరప్రభావం వలన మహాశక్తిమంతుడై కార్తవీర్యార్జునుడు రాజధానికి తిరిగివచ్చి స్మృతిశాస్త్రసమ్మతంగా ప్రజలను పరిపాలించాడు. వేదధర్మాన్ని పరిపాటించి పదివేలసార్లు మహాయజ్ఞాలను అనుష్ఠించి విశ్వవిఖ్యాతచరిత్రుడై తేజరిల్లాడు. 'బల పరాక్రమాలలోనూ తపోదానయజ్ఞకృత్యాల లోనూ కార్తవీర్యుని సరిపోలిన రాజులు అతీతవర్తమానాలలో లేరు; ఇకముందు పుట్ట బోరు'—అని ఆతనిని సుకవులు సుశ్లోకాలలో ఉపశ్లోకించారు.

ఈ విధంగా అవ్యాహతమైన ఆయురారోగ్యైశ్వర్యాలతో కార్తవీర్యార్జునుడు ఎనభైఅయిదు వేల సంవత్సరాలు రాజ్యం చేశాడు. ఒకప్పుడతను హాలాపానమదోన్మత్తుడై నర్మదానదీజలాలలో అవగాహన కేళి సలుపుతున్న ఏకాంతసమయంలో ఆ ప్రదేశానికి విశ్వవిజిగీషతో బయలుదేరిన రావణుడు వచ్చాడు. లోకంలో ఉన్న దైత్యదానవు లందరినీ తన భుజాపరాక్రమానికి శలభాయితంగా భస్మీపటలం చేశానని గర్వోక్తులను ప్రలాపిస్తుంటే విని

సహింపలేక కార్తవీర్యుడు లంకారాజును చెరపట్టి పశువులను బంధించినట్లు తాళ్లతో కట్టిపడవేసి, తగురీతిని బుద్ధిచెప్పి పంపించాడు.

పంచాశీతి సహస్రవర్షాలు గతించిన తర్వాత కార్తవీర్యార్జునునికి అవసానకాలం సమీపించింది. శ్రీమన్నారాయణాంశ సంభూతుడైన పరశురాముడు అతనిని సంహరించాడు.

అర్జునునికి నూరుమంది కొడుకులు పుట్టారు. వారిలో శూరుడు–శూరసేనుడు – వృషణుడు – మధుడు – జయధ్వజుడు మొదలైన వారు సుప్రసిద్ధులు.

జయధ్వజునికి తాళజంఘుడు ఉదయించాడు. అతనికి వందమంది కొడుకులు. వారందరికీ తాళజంఘులని పేరు.

తాళజంఘులలో పెద్దవాడు వీతిహోత్రుడు. ఇతని తమ్ములలో భరతుడు కూడా పేరుపొందినవాడే.

భరతునికి వృషుడు, సుజాతి జన్మించారు. వృషునికి మధుడు ఉదయించాడు.

మధువుకు నూరుమంది కొడుకులు పుట్టారు. వారందరికీ మాధవులని పేరు.

మధుపుత్రులలో వృష్ణి ప్రముఖుడు. అతని పేరిట వృష్ణికులం వెలిసింది.

యదుమహారాజు వంశంలో జన్మించినవా రందరికీ యాదవులని పేరు వచ్చింది.

జ్యామఘుని చరిత్ర

యదువు పుత్రులలో క్రోష్టునికి వృజినీవంతుడు జన్మించాడు. అతని కొడుకు స్వాహి.

స్వాహిరాజసుతుని పేరు రుషద్రుడు. అతనికి చైత్రరథుడు, చైత్రరథునికి శశబిందుడు ఉదయించారు. ఈ శశబిందుడు చతుర్దశ మహారత్నాలకు చక్రవర్తియై లోకవిఖ్యాతిని గడించాడు.

శశబిందునికి పదివేలమంది భార్యలున్నారు. అతనికి వారి యందు పదిలక్షలమంది కొడుకులు పుట్టారు. వారిలో పృథుయశుడు, పృథుకర్ముడు, పృథుజయుడు, పృథుకీర్తి, పృథుదానుడు, పృథు శ్రవుడూ ప్రధానులు.

పృథుశ్రవునికి తముడు ఉద్భవించాడు. అతనికి ఉశనుడు జన్మించి నూరు అశ్వమేధ మహాధ్వరాలను అనుష్ఠించాడు.

ఉశనుని కుమారుడు శితేషుడు. అతనికి రుక్మవచుడు, రుక్మ వచునికి పరావృతుడు జన్మించారు.

పరావృతునికి అయిదుగురు కొడుకులు—రుక్మేషుడు, పృథు రుక్ముడు, జ్యామఘుడు, పాలితుడు, హరితుడు ఉద్భవించారు.

జ్యామఘుడు శైబ్యను వివాహం చేసుకొని భార్యావశ వర్తియై నిత్యమూ ఆమె ప్రేమోపచారాలతో కాలం గడిపాడు. జనం అతనిని శైబ్యావల్లభుడని పిలవడం మొదలుపెట్టారు. భూత భవిష్యద్వర్తమానాలలో అతనివలె భార్యాదాసుడై పత్నీసేవ ఆచ రించినవాడు లేడని అతనిపై చాటువులు వెలిశాయి.

జ్యామఘునికి శైబ్యయందు సంతానం కలుగలేదు. అయినా అతనామెకు భయపడి అన్యకాంతను పెండ్లాడే తెగువ చాలక అపుత్రకుడుగానే ఉండిపోయాడు.

ఒకప్పుడు జ్యామఘునికి శత్రురాజులతో యుద్ధం సంభవిం చింది. అతను చావుకు తెగించి తన సైన్యానికి బహుగుణితమై ఉన్న మహానీకంతో తలపడి రథగజతురగపదాతులను చిందరవందర చేసి కంటికి కనిపించిన శత్రువునల్లా కడతేర్చాడు. రిపునాయకులు అతని ధాటికి ఆగలేక భార్యాబిడ్డలనూ, బంధుమిత్రులనూ విడిచిపెట్టి తల కొక దిక్కుగా పారిపోయారు.

ఈ విధంగా నేతృపరిత్యక్తమై నిరాశ్రయంగా మిగిలిపోయిన శాత్రవబృందంలో లోకోత్తర సౌందర్యరాశి అయిన ఒక రాజపుత్రిక కూడా ఉన్నది. ఆకస్మిక భయంవల్ల కలిగిన చిత్తక్షోభతో ఆమె బెదురు చూపులతో గడగడలాడుతూ 'నాన్నా! నన్ను రక్షించు, అన్నా! నన్ను రక్షించు' అని విలపిస్తుంటే జ్యామఘునికి ఆమెపట్ల అనురాగం మొలకెత్తింది. ''సకల శుభలక్షణాలూ ఉట్టిపడుతున్న ఈ రాజవధువు కేవలం భగవదనుగ్రహం వల్ల నాకు సాక్షాత్కరించింది. అపుత్రకుడనై సత్సంతానం కోసం ఎదురు చూస్తున్న నాకు ఇంతకన్నా మంచి అవకాశం దొరకదు. ఈమెను రాజధానికి తీసుకొని వెళ్లి, ఎలాగైనా శైబ్యను ఒప్పించి వివాహం చేసుకోవాలి...'' అని నిశ్చయించుకొని అతను రాజపుత్రిని రథంలో తన ప్రక్కనే కూర్చుండబెట్టుకొని ఇంటికి బయలుదేరాడు.

మహారాజు శత్రువిజయాన్ని సాధించి సైన్యసమేతంగా రాజధానికి తిరిగి వస్తున్నాడన్న వార్త తెలియగానే అమాత్యభృత్య పురోహిత బంధుమిత్రులూ, అశేషప్రజానీకం పురవీధులలో రాజుకు ఘనస్వాగతం పలికారు. విజయోత్సాహంతో ఉప్పొంగుతున్న ప్రజావాహిని రాజమందిర సింహద్వారానికి వచ్చేసరికి రథంలో తన భర్త ప్రక్కనే ఉపవిష్టురాలై ఉన్న సుందరాంగిని చూసి పట్టమహిషి రోషకషాయితనేత్రాలలో నిప్పులు కురిశాయి. అమర్షస్ఫురదధర పల్లవాలతో రాజును విలోకించి -''ఈ చపలచిత్తురాలికి రాజరథంలో కాలుపెట్టే అధికారం ఎవరిచ్చారు? దీన్ని నా ఇంటిచాయలకు ఎవరు రమ్మన్నారు?'' అని ఆమె కేకలు వేసింది.

ఆ విధంగా కులధర్మపత్ని నలుగురిలో నిలదీసి అడుగుతుంటే ఆమెతో మనసువిప్పి మాట్లాడే ధైర్యంలేక జ్యామఘుడు—

''ప్రియురాలా! కోపం తెచ్చుకోకు. ఈ వినయవతి మన కోడలు. నీకు సేవలు చేయడానికి వచ్చింది''

అని సాంత్వన వాక్యాలు పలుకగా శైబ్య చకితురాలై—

"మనకు కొడలేమిటి? నాకు కడుపు రాకుండా, మీకు మరో కళత్రమూ లేకుండా స్నుషాప్రసక్తి ఎవరి కోసం? ఈ మిథ్యాప్రలాపాలతో నన్ను నమ్మించలేరు"

అని ప్రశ్నించినపుడు ఆమె మాటలలో ప్రతిధ్వనించిన ఈర్ష్యాక్రోధాలను పసిగట్టి రాజు ప్రేమగా—

"ప్రేయసీ! ఇన్నాళ్లుగా పిల్లలు లేరన్నంతమాత్రాన నువ్వు జీవితాంతం గొడ్రాలుగానే ఉంటావా ఏమిటి? కోడలు వచ్చిన వేళా విశేషంవల్లయినా నీకు కొడుకు పుడతాడు. నా మాట నిజమౌతుందో లేదో నువ్వే చూస్తావు కదా!"

అని బుజ్జగిస్తూ ఆమెను ప్రసన్నం చేసుకొన్నాడు.

తాను భర్త్రనురాగాన్ని కోల్పోలేదని తెలియగానే శైబ్య సిగ్గుతో చిరునవ్వు నవ్వి, రథం దగ్గరకు వెళ్లి, ప్రేమగా రాజకుమార్తె బుగ్గలను పుణికి, "లోపలికి రామ్మా" అంటూ భవిష్యత్స్నుషను మనఃపూర్వకంగా చేరదీసి కౌగిట హత్తుకొన్నది.

ఏ ముహూర్తంలో జ్యామఘుడు తన భార్యతో పుత్రోదయాన్ని గురించి అన్నాడో కాని, అనతికాలంలోనే అతని మాట నిజమైంది. వయస్సుమీరి కాలాతీతమైనప్పటికీ శైబ్యకాంత గర్భాన్ని ధరించి, నెలలు నిండగానే పండంటి కొడుకును కన్నది. అతనికి విదర్భుడని నామకరణం చేశారు

యుక్తవయస్సు రాగానే విదర్భుడు తన తల్లిదండ్రుల సంకల్పానుసారం వారు నిర్ణయించిన వధువునే వివాహం చేసుకొన్నాడు. ఆ దంపతులకు ముగ్గురు కొడుకులు—క్రథుడు, కైశికుడు, ఆ తర్వాత కొన్నాళ్ళకు రోమపాదుడు జన్మించారు.

రోమపాదుని సుతుడు బభ్రువు. అతని కొడుకు ధృతి వీరాగ్రేసరుడై తండ్రితాతల యశోలతకు దిగంతాలలో చలువపందిళ్లు పరిచాడు.

కైశికుని కొడుకు పేరు చేదిరాజు. అతని వంశీయులకు చైద్యులని పేరు వచ్చింది.

క్రథుని సంతానం కుంతి. అతనికి వృష్ణి జన్మించాడు. వృష్ణికి నిర్వృతి, నిర్వృతికి దశార్హుడు, దశార్హునికి వ్యోముడు, వ్యోమునికి జీమూతుడు, జీమూతునికి వికృతి, వికృతికి భీమరథుడు, భీమరథునికి నవరథుడు, నవరథునికి దశరథుడు, దశరథునికి శకుని, శకునికి కరంభి, కరంభికి దేవరాతుడు, దేవరాతునికి దేవక్షత్రుడు, అతనికి మధుడు, మధునికి అనవరథుడు, అనవరథునికి కురువత్సుడు, కురువత్సునికి అనురథుడు, అతనికి పురుహోత్రుడు, పురుహోత్రునికి అంశువు, అంశువుకు సత్వతుడు జన్మించారు.

జ్యామఘుని సంతానం పుణ్యచరిత్రను ఆకర్ణించిన సద్వర్తనులకు సకల శుభాలూ కలుగుతాయి.

సత్వతుని వంశం

అంశుమహీపతి కొడుకైన సత్వతునికి భజినుడు, భజమానుడు, దివ్యుడు, అంధకుడు, దేవావృధుడు, మహాభోజుడు, వృష్ణి జన్మించారు. వీరందరికీ సాత్వతులని పేరు వచ్చింది.

భజమానుడికి నిమి కృకణ వృష్ణులు, మరొక భార్యయందు శతజిత్తుడు, సహస్రజిత్తుడు, అయుతజిత్తుడూ పుట్టారు.

దేవావృధునికి బభ్రువు ప్రభవించాడు. అతని సాధుగుణాలను శ్లాఘిస్తూ అనేక చాటువులు ప్రచారంలోకి వచ్చాయి.

''మహాపురుషులలో కెల్లా మహాపురుషులని మనం వింటుండే మహాత్ములలో మణిపూస మన బభ్రువు. ఇక దేవావృధుడంటే భూజనులకు ప్రత్యక్షదైవమే!''

''బభ్రువు పాదాంకనాలలో పయనించి అరవై ఆరుమంది, దేవావృధుని భక్తిశ్రద్ధలతో అనుసరించి ఆరువేల ఎనిమిది మంది

అమృతత్వాన్ని పొందారు. అటువంటి రాజులుంటే భూలోకం స్వర్గలోకమే అవుతుంది!''

దేవావృధ బభ్రువుల ధర్మశీలం వల్ల సాత్వతులకు శాశ్వత పుణ్యలోకాలు కలిగాయి.

మహాభోజుడు ధర్మాత్ముడై తన ప్రజలను కంటికి రెప్పలా చూసుకొన్నాడు. అతని సంతతివారికి భోజులని పేరు వచ్చింది.

భోజుల రాజధాని మృత్తికావతి. ఈ ప్రసిద్ధనగరం పేరు మీదుగా వారికి మార్తికావతులని కూడా వ్యవహారం ఏర్పడింది.

వృష్ణికి సుమిత్రుడు, యుధాజిత్తు పుట్టారు. వారిలో సుమిత్రునికి అనమిత్రుడు, శిని జన్మించారు. అనమిత్రునికి నిఘ్నుడు, నిఘ్నునికి ప్రసేన సత్రాజిత్తులూ ఉదయించారు. సత్రాజిత్తుకు శ్రీమన్నారాయణుని తేజోంశ సూర్యభగవానునితో మైత్రీభాగ్యం కలిగింది.

సత్రాజిత్తుకు సూర్యవరప్రసాదం

ఒకప్పుడు సత్రాజిత్తు సముద్రతీరాన నడుస్తూ మనస్సులో సూర్యభగవానుని సంకల్పించి భక్తిపూర్వకంగా ఆయనను ప్రస్తుతించాడు. కృపాపాత్రుడైన తన మిత్రుని పవిత్రశీలానికి సంతోషించి చిత్రభానుడు అతనికి సాక్షాత్కరించాడు.

అయితే ఆదిత్యతేజం దుర్నిరీక్ష్యంగా ఉన్నది. పద్మగర్భాండంలో సముద్భవించిన మహాంధకారాన్ని పటాపంచలు చేసి సర్వలోకాలకూ కాంతిని ప్రసాదించే సూర్యనారాయణుడు స్వయంగా తన కన్నుల యెదుటకు వచ్చేసరికి దృష్టి చెదిరి, ఆయన సమగ్రరూపాన్ని విలోకింపలేక సత్రాజిత్తు—''దేవా! ఆకాశమధ్యంలో ఉన్నప్పుడు అగ్నిగోళానివై ప్రకాశించే నీవు నిజంగా కన్నుల యెదుటకు వస్తే ఈ చర్మచక్షువులతో నిన్ను చూడలేక పోతున్నాను.

నన్ను అనుగ్రహించి నీ తేజోదర్శనభాగ్యాన్ని ప్రసాదించు'' అని వేడుకొన్నాడు. సూర్యభగవానుడు అతని మాటలకు ప్రసన్నుడై, తన కంఠదేశాన్ని అలంకరించిన స్యమంతకమనే పేరుగల మణిని తొలగించి నిజరూపాన్ని ప్రదర్శించాడు.

ఉజ్జ్వలమైన తామ్రవర్ణంలో ధగధగలాడుతున్న దేహచ్ఛాయ; మరుగుజ్జువంటి రూపం; పింగళాక్షులు—ఉపసంహృతతేజుడైన స్వర్భానుమూర్తిని వీక్షించిన ఆనందాతిరేకంలో సత్రాజిత్తు ఆయనకు ప్రణామం చేసి వివిధరీతుల స్తోత్రాలను పఠించాడు. ఆయన దయతో అభీష్టవరాన్ని కోరుకొమ్మనగానే చనువుతీసుకొని దివ్యతేజోన్వితమైన స్యమంతకాన్ని తన కిమ్మని అడిగాడు. నభోమణి ఆ మణిని సత్రాజిత్తుకు బహూకరించి వియన్మండలంలో నిజస్థానానికి వెళ్లిపోయాడు.

సత్రాజిత్తు స్యమంతకమణిని సూర్యుని వలెనే కంఠసీమలో అలంకరించుకొని మధ్యందినమార్తాండమండల మయూఖరేఖాశిఖలతో దిగంతాలను ఉద్భాసింపజేస్తూ ఇంటికి తిరిగివెళ్లాడు. కన్నులు మిరుమిట్లు గొలిపే మహాప్రకాశంతో నేలకు దిగివచ్చిన సూర్యుని వలె అస్పష్టమూర్తిధరుడై నడిచివస్తున్న అతనిని దూరం నుంచి పరికించి ద్వారకానగరవాసులు శ్రీకృష్ణుని వద్దకు వెళ్లారు. భూమిభారావతరణ కోసం మనుష్యరూపాన్ని ధరించిన పురుషోత్తమునికి నమస్కరించి, ''దేవా! నీ సందర్శనార్థం సూర్యభగవానుడు మన పట్టణానికి వచ్చాడు'' అని విన్నవించారు. శ్రీకృష్ణుడు వారి మాటలకు మందహాసం చేసి, ''ఆ వస్తున్నది సూర్యభగవానుడు కాదు, ఆయన ప్రసాదించిన మహామణిని ధరించిన మన సత్రాజిత్తు'' అని పలికేసరికి పురజనులు ఆశ్చర్యచకితులై సత్రాజిత్తును చూడడానికి వీథులలోకి పరుగులు తీశారు.

స్యమంతకమణి

సత్రాజిత్తు సూర్యుని నుంచి వరంగా పొందిన స్యమంతకం కాంతిమంతమే కాక మహాప్రభావమూ, అనేక దివ్యశక్తులూ ఉన్నటువంటిది. ప్రతిదినమూ దానినుండి ఎనిమిది బారువుల బంగారం ప్రవర్షిస్తుంటే ఇంటికి వచ్చిన అర్థార్థులకు దానంచేసి అతను మహాదాత అని పేరు పొందాడు. ఆ మణిప్రభావం వలన ద్వారకానగరవాసులకు ఈతిబాధలూ, ప్రకృతివైపరీత్యాలూ లేక పంటలు సుభిక్షంగా పండాయి. ప్రజలకు సర్పభయం, చోరభయం, దుర్భిక్షభయం తొలగిపోయి రాజ్యంలో సుఖశాంతులు నెలకొన్నాయి.

ఈ విధంగా అమూల్యమైన స్యమంతకమణి సత్రాజిత్తుకంటె ఉగ్రసేనమహారాజు వద్ద ఉంటే బాగుంటుందని శ్రీకృష్ణునికి అనిపించింది కాని బంధువుతో వాగ్వాదం పెట్టుకొని బలవంతం చేస్తే కుటుంబకలహాలు వస్తాయని మాట్లాడకుండా ఊరుకున్నాడు. అయినా సత్రాజిత్తు శ్రీకృష్ణుని మనోభావాన్ని చూచాయగా పసిగట్టి, ఎందుకైనా మంచిదని తన తమ్ముడు ప్రసేనుని పిలిపించి, స్యమంతకాన్ని అతని మెడలో వేసి గుండెలమీది బరువు దిగిపోయినట్లుగా శాంతిని పొందాడు.

దైవికంగా సూర్యుని నుంచి సత్రాజిత్తు చేతికి వచ్చిన స్యమంతకానికి మరొక విశేషగుణం కూడా ఉన్నది. ప్రతిదినమూ శుచిస్నాతులై పరిశుభ్రంగా ఉన్న సాధువర్తనులకు మాత్రమే అది సువర్ణాన్ని వర్షిస్తుంది. అశుచిదోషానికి పాల్పడ్డ దుర్మతులకు దాని వల్ల మేలుజరగకపోగా అకాలమృత్యువు వాటిల్లుతుంది.

అన్నగారిచ్చిన మణిని మెడలో వేసుకొని, స్నానశౌచాలు లేని ప్రసేనుడు వేటకోసం సమీపారణ్యానికి అశ్వారూఢుడై వెళ్లాడు.

అక్కడ ఒక సింహం అతనిపై కురికి నఖశిఖరాలతో ప్రాణస్థానాలను చీల్చి మృతకళేబరం మెడలో ఉన్న మణిని నోటకరుచుకొని పారిపోయింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన భల్లూకరాజు జాంబవంతుడు సింహాన్ని పడగొట్టి అపూర్వమణిని చేజిక్కించుకొని, తన గుహకు కొనిపోయి దానిని తన కొడుకు సుకుమారునికి ఆటబొమ్మగా బహూకరించాడు.

శ్రీకృష్ణునికి అపనిందాప్రాప్తి

మణిని తీసుకొని వెళ్లిన ప్రసేనుడు ఎన్నాళ్లకూ ఇంటికి తిరిగి రాకపోయేసరికి ద్వారకానగరవాసులు చెవులు కొరుక్కోవడం మొదలుపెట్టారు. ఇది నిజంగా శ్రీకృష్ణుడి పనే, అడిగి తీసుకోవడం చేతకాక సత్రాజిత్తు తమ్ముణ్ణి చాటుమాటుగా చంపించాడు, అతనికి తప్ప ఆ అమూల్యమణి ఎవరికి కావాలి? అని రకరకాల వదంతులు కార్చిచ్చులా నలుదిక్కులకూ వ్యాపింపసాగాయి.

తనపై చెలరేగిన లోకాపవాదవృత్తాంతం కర్ణాకర్ణిగా శ్రీకృష్ణునికి తెలియవచ్చింది. అతను యాదవులందరినీ వెంటబెట్టుకొని అశ్వశాలలో ప్రసేనుని గుర్రం కాలిగిట్టల గుర్తులను అనుసరిస్తూ అరణ్యానికి వెళ్లాడు. అక్కడ అశ్వసమేతంగా మృతుడై పడి ఉన్న ప్రసేనుని కళేబరం అగుపించింది. దాని ప్రక్కనే నేలమీద స్పష్టంగా ఆ ప్రదేశానికి సింహం నడిచివచ్చిన ఆనవాళ్లు కూడా కనబడ్డాయి. సింహపదాంకనాలను దర్శించి యాదవులు మృతికారణాన్ని సులభంగానే ఊహించారు. అకళంక చరిత్రుడైన అవతారపురుషునిపై నిందారోపణం చేసినందుకు వారందరికీ పశ్చాత్తాపం కలిగింది.

శ్రీకృష్ణుడు సింహపదాల చిన్నెల వెంబడి నడుస్తూ ముందుకు వెళ్లి అనతిదూరంలోనే చచ్చిపడి ఉన్న సింహదేహాన్ని చూశాడు.

అక్కడినుంచి సరిక్రొత్తగా కనుపించిన అడుగుజాడలను అనుసరించి అతను ఒక గిరితటానికి వచ్చాడు. యదుసైన్యాన్ని కొండచరియ దగ్గరే నిలిపి తానొక్కడే ఋక్షబిలం లోనికి ప్రవేశించాడు.

లోపలికి అడుగుపెట్టిన క్షణంలోనే శ్రీకృష్ణునికి తన గమ్య స్థానం అదేనని అవగతమైంది. అక్కడ ఒక యువతి దివ్యమణిని సుకుమారుని చేతికిచ్చి, "నాయనా! ఈ బొమ్మ నీదేనురా! ప్రసేనుణ్ణి సింహం చంపితే సింహాన్ని జాంబవంతుడు చంపి నీకోసం తెచ్చిన దాన్ని ఎవరూ తీసుకోరులేరా!" అంటూ ఆటలాడిస్తున్నది. ఆకస్మికంగా లోనికి వచ్చిన అపరిచిత పురుషుని చూసి భయ భ్రాంతయై ఆమె—సహాయం కోసం బిగ్గరగా ఏడ్వసాగింది. ఆమె ఆర్తనాదాన్ని విని జాంబవంతుడు గుహాంతర్భాగం నుంచి వెలికి వచ్చి శ్రీకృష్ణుని చూసి అమర్షపూర్ణ హృదయుడై అతనితో యుద్ధానికి తలకొన్నాడు. ఆ విధంగా ఇరవై ఒక్కరోజులు వారిద్దరికీ ఘోరయుద్ధం జరిగింది.

ఋక్షబిలానికి వెలుపలనే ఆగిపోయిన యదుసైనికులు శ్రీకృష్ణుని రాకకోసం పండెనిమిది రోజులు వేచిచూశారు. కాలం గడిచేకొద్దీ వారిలో ఆందోళన ఎక్కువైంది. తమ నాయకుడు ఎలుగుబంటి వాతబడి చనిపోయాడని నిశ్చయించుకొని వారందరూ ద్వారకకు తిరిగివెళ్లి ప్రజానీకానికి జరిగిన వృత్తాంతాన్ని తెలియ జేశారు.

శ్రీకృష్ణనిర్యాణవార్త అశనిపాతంలా సోకి యదుకులం దుఃఖార్ణవంలో మునిగిపోయింది. అతని బంధువులందరూ కలిసి పరోక్షంగా అంత్యక్రియలు చేసి మృతునికి నివాపాంజలిని సమ ర్పించారు.

దాయాదులు శ్రద్ధాసమన్వితులై తనకు అర్పించిన అన్న తోయాలవలన శ్రీకృష్ణుని బలప్రాణాలకు పుష్టి కలిగింది. ఆ

విధంగా అతని పరాక్రమం దినదినాభివృద్ధిని పొందగా నిరాహారుడైన శత్రువు దేహం నిష్ఠురప్రహారపీడితమై క్రమక్రమంగా క్షీణించి పోయింది. పోరాడే శక్తిలేక, నేలకు వ్రాలి శ్రీకృష్ణుని పాదపద్మాలను కన్నులకు అద్దుకొని, హీనస్వనంతో అతనీ విధంగా ప్రసంగించాడు.—

"దేవా! ఇన్నాళ్లకు నీ మహిమను కన్నులారా కనుగొన్నాను. లోకాలోకాలలోని సురాసుర యక్ష గంధర్వ రాక్షసాదు లందరూ కలిసి దండెత్తినా నిన్ను జయింపలేరు. మహాత్ముల సంగతే అలా ఉండగా భూమిపై జన్మించిన అల్పవీర్యులు, అందులోనూ తిర్యగ్యోని సంజాతులైన నా వంటి సామాన్యులు నీ కాలిగోటికి కూడా సరి పోలరు.

మహాత్మా! ఈ లోకంలో కేవల నరావయవభూతులకు నీ వంటి శక్తి విక్రమాలు ఉండటం సాధ్యం కాదు. నిస్సందేహంగా నీవు నన్ను కరుణించడానికి వచ్చిన నా స్వామి నారాయణుడవే!"

జాంబవతీ పరిణయం

శ్రీకృష్ణుడు జాంబవంతుని ప్రీతిపూర్వకంగా కౌగిలించుకొని, తన కరస్పర్శతో అతని శరీరాయాసాన్ని, యుద్ధఖేదాన్ని అపనయింపజేశాడు. జాంబవంతుడు సర్వాత్మకుడైన శ్రీకృష్ణపరమాత్మకు మళ్లీ నమస్కారం చేసి, గృహాగతునికి సంతోషపూర్వకంగా తన కుమార్తె జాంబవతినిచ్చి కాళ్లు కడిగాడు. అతను భక్తిప్రేమలతో సమర్పించిన స్యమంతకం ఎంత అపరిగ్రాహ్యమైనా, ప్రాప్తకళంకాన్ని పోగొట్టుకోవాలి కనుక దానిని స్వీకరించి శ్రీకృష్ణుడు జాంబవతీ సమేతుడై ద్వారకకు వెళ్ళాడు.

శ్రీకృష్ణాగమన వార్త తెలియగానే ద్వారకావాసులందరూ హర్షోత్కర్షంతో మహోత్సవాలు జరుపుకొన్నారు. భగవత్సందర్శ

నానికి వెళ్లి ఆయనకు నమస్కరించిన వయోవృద్ధులకు కూడా ఆ నాడు నవయౌవనోత్సాహం అతిశయించింది. ప్రజలందరూ అక్కడి నుంచి వసుదేవుని మందిరానికి వెళ్లి విజయజయధ్వానాలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. శరత్కాలరాకాపూర్ణశశాంకుని తిలకించి ఉప్పొంగిన జలనిధుల వలె జనహృదయాలు ఆనందతుందిల మైనాయి.

విజయోత్సవాలు సద్దుమణిగాక శ్రీకృష్ణుడు యాదవు లందరినీ కొలువుతీర్చి వాస్తవంగా జరిగిన విషయాన్ని వివరించి చెప్పాడు. స్యమంతకాన్ని సత్రాజిత్తుకు అప్పజెప్పి మిథ్యాభిశంసనలతో తనకు కలిగిన కళంకాన్నుంచి విముక్తుడై జాంబవతిని అంతఃపురానికి తీసుకొని వెళ్లాడు.

అక్రూరుని కథ

శ్రీకృష్ణుడు స్యమంతకమణిని సంపాదించి తనకు తెచ్చియిచ్చిన నాటినుంచి సత్రాజిత్తు ఆయనపై అభూత మలినారోపణలు చేసినందుకు సంతప్తచిత్తుడై కుమిలిపోయాడు. తన కుమార్తె సత్యభామకు ఆయనతో పాణిగ్రహణం చేయించి భగవత్పాదసరోజాలకు అర్ఘ్యప్రదానంతో పాపవిముక్తిని పొందాడు.

అయితే, సత్యాకృష్ణుల పరిణయం యాదవ ప్రముఖులకు సమ్మతం కాలేదు. అప్పటికే చాలారోజుల నుంచి సత్యభామను పెండ్లాడాలని కలలు కంటున్న అక్రూరుడు, కృతవర్మ, శతధన్వుడు మొదలైనవారందరూ సత్రాజిత్తు తమను తలెత్తుకోకుండా చేశాడని అతనిపై పగబూనారు. అక్రూరుడు, కృతవర్మ శతధన్వుని ఇంటికి వెళ్లి, "ఈ దురాత్ముడు మనం సత్యభామ విషయం ఎప్పుడు ప్రస్తావించినా మాట తప్పించి ఆ కృష్ణుడికిచ్చి పెళ్లి చేశాడు. మనమంటే లెక్కలేకుండా ప్రవర్తించినందుకు అతన్ని శిక్షించాల్సిందే. ఈ

లోగా నువ్వు వాణ్ణి చావదన్ని వాడిదగ్గర పని లేకుండా ఉన్న స్యమంతకాన్ని తెచ్చుకోకూడదూ? నీ మీాదికి అచ్యుతుడు పోరాటానికి వస్తే మే మిద్దరమూ తోడున్నాము కదా!'' అని అతన్ని రెచ్చగొట్టారు.

ఈ విధంగా ద్వారకలో కుట్ర జరుగుతున్న తరుణంలో దుర్యోధనాదులు పాండవులను జతుగృహంలో నిద్రింపజేసి ఇంటికి నిప్పంటించారని తెలిసి వారిని రక్షించటానికి శ్రీకృష్ణుడు వారణావతానికి వెళ్లాడు. తన ప్రతీకార సాధనకు అంతకన్నా మంచి అవకాశం మళ్లీ లభించదని గ్రహించి శతధన్వుడు రాత్రివేళ సత్రాజిత్తు మందిరానికి వెళ్లి శయ్యాగతుడై నిదురిస్తున్న అతనిని నరికి వేసి దివ్యమణిని అపహరించాడు.

పితృహత్యావార్త తెలియరాగానే సత్యభామ ఉగ్రురాలై రథాన్నెక్కి వారణావతానికి వెళ్లి భర్తకు ద్వారకలో జరిగిన ఘోరాన్ని పూసగ్రుచ్చినట్లు వివరించి చెప్పింది. నితాంత శాంత స్వభావుడూ, నిత్యపరితుష్టాత్ముడూ, సుఖదుఃఖ వికారవిధురుడూ ఐన శ్రీకృష్ణుడు కూడా ఆమె దుఃఖానికి చలించి, అమర్షతామ్రలోచనుడై—''నీ తండ్రికి జరిగిన అపకారానికి తగిన ప్రతీకారం చేయవలసినదే. జన్మించినవారు మరణించక తప్పదని శోకాన్ని దిగమ్రింగుకొని కర్తవ్యాన్ని ఆలోచించాలి కాని నీ వంటి మానధనురాలు కన్నీళ్లు పెట్టుకోకూడదు'' అని ఆమెను ప్రేమగా ఊరడించాడు.

ద్వారకకు తిరిగివెళ్లగానే వాసుదేవుడు బలభద్రుని ఏకాంతంగా కలుసుకొన్నాడు. ''ఆనాడు వేటకోసం అడవికి వెళ్లిన ప్రసేనుడిని సింహం వధించింది. ఇప్పుడు శతధన్వుని చేతిలో సత్రాజిత్తు కూడా మరణించాడు. అన్నదమ్ము లిద్దరూ లేరు కనుక మణి మనదే

అవుతుంది. వెంటనే ఆయుధధారివై శతధన్వుని సంహరించి మణిని సంపాదించు'' అని సోదరునితో ప్రసంగించాడు.

శ్రీకృష్ణ బలదేవుల సంకల్పాన్ని గ్రహించి శతధన్వుడు భయవిహ్వాలుడై పార్ష్ణిపూరణ కర్మనిమిత్తం కృతవర్మ దగ్గరకు వెళ్లాడు. కృతవర్మ తన అశక్తతను వెల్లడించి, ''అన్నదమ్ములిద్దరినీ ఎదుర్కొనాలంటే నాకు శక్యం కాదు'' అని మారుమాట లేకుండా నిరాకరించాడు.

ఆ తర్వాత అక్రూరుడు కూడా శతధన్వుని ప్రార్థనను తిరస్కరించాడు. ''సర్వశక్తిమంతుడైన భగవంతునితో వైరం మనకు శ్రేయస్కరం కాదు. తన పాదప్రహారంతో జగత్త్రయాన్ని ప్రకంపింపజేసిన మహాబలునితోనా మనకు విరోధం? ఆయన తన సుదర్శన చక్రంతో రిపుచక్రాన్ని పరిమార్చి దైత్యరాజవనితలకు వైధవ్యాన్ని కలుగజేసిన మహాపరాక్రమశాలి. దానికి తోడు పోరాటం ఇద్దరితో అంటున్నావు. శత్రువారణాల కుంభస్థలాలను నాగలికొనతో పగలగొట్టి ఆ బలభద్రుడు హాలామదోన్మత్తుడై ఎర్రబారిన కన్నులతో వైరివీరులను ఒక్కసారి తేరిపారజూస్తేనే గుండెలు గుబగుబమంటాయే—వారిద్దరినీ ఏ బలం చూసుకొని ఓడిద్దామనుకొంటున్నావు? నువ్వు సంకల్పించిన కార్యం దేవతలకే సాధ్యం కాదు. వేరే ఎవరినైనా శరణు కోరుకో'' అని స్పష్టంగా చెప్పివేశాడు. అప్పుడు శతధన్వుడు, ''మిత్రమా! నువ్వు సాయం చెయ్యలేకపోతే వేరే ఎక్కడికైనా వెళ్లి తలదాచుకొంటాను గాని, కొన్నాళ్లపాటు ఈ మణిని నీ దగ్గరే దాచి ఉంచు. బ్రతికుంటే ఎప్పుడయినా వచ్చి నీ దగ్గర నుంచి తీసుకొంటాను. నా కేదైనా అపకారం జరిగితే ఇది నీదే అవుతుంది'' అని స్యమంతకాన్ని అతనికి అప్పగించాడు. ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితిలోనూ మణిరహస్యం

వెల్లడి కాకూడదని ప్రమాణం చేయించుకొని అక్రూరుడు దాన్ని తన దగ్గర ఉంచుకోవడానికి అంగీకరించాడు. ఇక బ్రతుకుజీవుడా అనుకొని శతధన్వుడు మహావేగంతో పరుగిడే అశ్వాన్నెక్కి రోజుకు శతయోజనాలవంతున ప్రయాణిస్తూ ద్వారకకు దూరంగా పారిపోయాడు.

శతధన్వ సంహారం

శ్రీకృష్ణుడు శతధన్వుని వృత్తాంతాన్ని సాకల్యంగా తెలుసుకొని, దారుకుని పిలిచి శైబ్య - సుగ్రీవ - మేఘపుష్ప - బలాహకాలు పూన్చిన దివ్యరథాన్ని అధిరోహించి బలభద్రసమేతంగా అతనిని వెంబడించాడు. శతధన్వుని గుర్రం మిథిలానగర సమీపానికి వచ్చేసరికి ఆయాసభరంవల్ల అలవుతప్పి నడవలేక నడవలేక నురుగులు కక్కుతూ నేల కూలి ప్రాణాలు విడిచింది. శతధన్వుడు పాదచారియై అరణ్యంలోకి చొచ్చుకొనిపోయాడు.

శ్రీకృష్ణబలదేవులు వాయువేగంతో ప్రయాణించి, మృతాశ్వం పడివున్న ప్రదేశానికి వచ్చిచేరారు. శ్రీకృష్ణుడు అన్నతో—"ఇక్కడ నేల బాగా లేదు. రథాన్ని అరణ్యంలోకి నడిపించటం కష్టమౌతుంది. ఆ నీచుణ్ణి సంహరించి నేను తిరిగి వచ్చేదాకా నువ్విక్కడే స్యందనస్థితుడవై ఉండు" అని చెప్పి, అడవిలోకి వెళ్లి, రెండు కోసుల దూరాన పరుగిడుతున్న శతధన్వునిపై సుదర్శన మహాచక్రాన్ని ప్రయోగించి, అతని శిరస్సును ఖండించి వేశాడు.

శతధన్వుని సంహరించిన తర్వాత సూర్యదత్తమణి అతని వద్ద లేదని శ్రీకృష్ణుడు గ్రహించాడు. అతని శరీరాన్ని, వస్త్రాభరణాలనూ గాలించి, రిక్తహస్తాలతో వెనుదిరిగి వచ్చాడు. తన కోసం ఎదురు చూస్తున్న అన్నతో అఖిలజగత్సారభూతమైన మణి దొరక

లేదని, తమ ప్రయత్నమంతా నిష్ఫలం అయిందనీ వివరించి చెప్పాడు.

బలదేవుని ఆగ్రహం

శ్రీకృష్ణుని పలుకులకు బలభద్రుడు క్రుద్ధుడై, "నీ మాట ఒక్కటీ నమ్మడానికి వీలులేదు. క్షుద్రమైన సంపదలను ఆశించి నన్ను కూడా మోసం చెయ్యాలని ప్రయత్నిస్తున్నావు. నాకు నీ నిజ స్వరూపం తెలిసి వచ్చింది. ఈ ఆత్మీయతలూ, అతివినయాలూ అధికారం చేజిక్కినదాకా ఆడే కపటనాటకాలు. నాకు నీతో, నీ బంధుమిత్రులతో, నీ ద్వారకతో సంబంధం తెగిపోయింది. నేను తప్పుకొన్నాక నీవిక స్వేచ్ఛగా సుఖాలను అనుభవించు. నా దారికి మాత్రం అడ్డురాకు" అని పరుషంగా మాట్లాడి, తమ్ముని ప్రార్థనలను లెక్కచేయకుండా కాలి నడకన బయలుదేరి విదేహానగరంలో జనకమహారాజు కొలువుకు వెళ్ళిపోయాడు. వాసుదేవుడు సారథిని తోడుతీసుకొని చింతాక్రాంతుడై ఒక్కడూ ద్వారకానగరానికి తిరిగి వెళ్ళాడు.

జనకరాజగృహంలో బలభద్రుడు మూడు సంవత్సరాలు ఉన్నాడు. ఆ రాజయోగి వలన అధ్యాత్మవిద్యా రహస్యాలను తెలుసుకొంటూ పరతత్త్వాన్ని ఉపాసించాడు. అక్కడ ఉండగానే అతని వద్దకు ధృతరాష్ట్రుని కొడుకైన దుర్యోధనుడు వచ్చి గదా విద్యను నేర్చుకొన్నాడు.

శ్రీకృష్ణుడు ద్వారకానగరానికి తిరిగి వెళ్ళాక ఉగ్రసేనాది యాదవప్రముఖులు స్యమంతకమణి అతనివద్ద నిజంగానే లేదని గ్రహించారు. వారందరూ కలిసి బలభద్రునికి నచ్చజెప్పి, అతనిని సగౌరవంగా మళ్ళీ ద్వారకకు తీసుకొని వచ్చారు.

అక్రూరుడు సూర్యమణి నుంచి సముద్భవించిన సువర్ణాన్ని సద్వినియోగపరచి అనేక యజ్ఞాలు చేశాడు. యాగదీక్షలో ఉన్న క్షత్రియ వైశ్యాదులను చంపితే బ్రహ్మహత్యా పాతకం కలుగుతుందని పెద్దలు చెప్పిన మాటను జ్ఞాపకం చేసుకొని, శ్రీకృష్ణుడు తనపైకి రాకుండా సవనదీక్షాకవచాన్ని ధరించి సురక్షితంగా ఉన్నాడు. కుబేరునివలె మహా ధనవంతుడై ఇంటికి వచ్చిన అతిథ్యభ్యాగతులను ఆదరిస్తూ, వారికి యథోచితంగా దానధర్మాలు చేస్తూ నిశ్చింతగా అరవై రెండు సంవత్సరాలు గడిపాడు. అన్నాళ్లూ స్యమంతక ప్రభావం వలన ద్వారకానగరంలో ఈతిబాధలూ, దుర్భిక్షాలు, అకాల మరణాదులు తొలగి అవ్యాహత సుఖక్షేమాలు కలిగాయి.

ద్వారకలో ఈతిబాధలు

కొన్నాళ్లకు అక్రూరుని బంధువులైన భోజాత్మజులు సత్వతుని మనిమనుమడు శత్రుఘ్నుని అధర్మయుద్ధంలో సంహరించారు. అందువల్ల ద్వారకలో తనకు తప్పకుండా ముప్పు వాటిల్లుతుందని భయపడి అక్రూరుడు కాశీనగరానికి పారిపోయాడు.

అక్రూరుడు యాదవభూమిని విడిచిపెట్టిన నాటినుంచి ద్వారకానగరం అల్లకల్లోలమైపోయింది. వానలు లేక పంటలన్నీ వట్టిపోయాయి. బీడు నేలల్లో నుంచి విషసర్పాలు వచ్చి ప్రజలకు సుఖనిద్ర లేకుండా చేశాయి. అంటు రోగాలు చెలరేగి స్త్రీ బాల వృద్ధులు అసంఖ్యాకంగా చనిపోయారు. అగ్నిప్రమాదాలు, ఝంఝామారుతాల వల్ల దారుణమైన నష్టం సంభవించింది. గోరుచుట్టుపై రోకటిపోటులా అసలే కడగండ్లు పడుతున్న ప్రజానీకానికి చోర భయం, క్రూరమృగాల భయం ఎక్కువయింది.

యదువీరుల సమావేశం

అప్పుడు వంశీధరుడు ఉగ్రసేన బలదేవాది యాదవప్రముఖులను సమావేశపరచి, "ఇన్ని ఆకస్మిక భయోత్పాతాలు ఏక కాలంలో సంభవించటానికి కారణం ఏమిటి? మీరందరూ ఆలోచించి కర్తవ్య నిర్ణయం చేయాలి" అని ఉపన్యసించాడు.

శ్రీకృష్ణుని మాటలకు యదువృద్ధుడైన అంధకుడు సమాధానం చెప్పాడు:

శ్వఫల్గుని చరిత్ర

"ఈ ద్వారకానగరంలో పూర్వం మన అక్రూరుని తండ్రి శ్వఫల్గుడు ఉండేవాడు. ఆయన ఏ ప్రదేశంలో ఉంటే అక్కడ దుర్భిక్షాలు, అకాలమృత్యువులు, అతివృష్ట్యనావృష్టులూ ఉండేవి కావు. అచిరకాలంలోనే ఆయన సత్కీర్తి నలుదెసలకూ వ్యాపించి గచ్ఛత్కల్పవృక్షమని పేరువచ్చింది.

ఒకప్పుడు కాశీరాజ్యంలో ప్రబలమైన అనావృష్టి చెల రేగింది. కాశీరాజు ద్వారకనుంచి శ్వఫల్గుని పిలిపించుకొని తన దేశాన్ని సుభిక్షం కావించుకొన్నాడు. రాజకుటుంబానికి అతిథిగా అతను చాలాకాలం అక్కడే అధివసించాడు. రాజ్యంలో ఎక్కడ సంక్షోభం కలిగినా రాజు శ్వఫల్గుని అక్కడికి పంపించేవాడు. అతను ఆ ప్రాంతంలో క్షణమాత్రం నిలిచినంతనే దేవతలు అమృత వర్షాన్ని కురిపించేవారు. అతివృష్టి వల్ల జలపూర్ణమై ఉన్న ప్రదేశాలలో రెప్పపాటు కాలంలోగా ఆకాశం నిర్మేఘమై స్వర్భాను కిరణాలు ప్రజావళిని ఆప్యాయంగా వచ్చి తాకేవి.

ఆ సమయంలో కాశీరాజగృహిణి పూర్ణగర్భవతిగా ఉన్నది. ప్రసవసమయం ఆసన్నమైనా ఆమెకు శిశూదయం కలుగలేదు. ఆ

విధంగా చూస్తూ ఉండగానే పన్నెండు సంవత్సరాలు దొర్లి పోయాయి.

ఒకనాడు కాశీరాజు గర్భస్థశిశువును ఉద్దేశించి, "అమ్మా! నిన్ను చూడాలని మేమందరమూ ఎంతో ఉత్సాహంతో ఎదురు చూస్తున్నాము. ఇంకా బయటికి రావేమిటి? మీ అమ్మను ఇంకా ఎన్నాళ్లు కష్టపడమంటావు?" అని ప్రశ్నించాడు.

తండ్రి మాటలకు కాశీరాజపుత్రి గర్భంలోనుంచే సమాధానం చెప్పింది: "మీరు ప్రతిదినం బ్రాహ్మణులకు రోజు కొకటి చొప్పున గోదానం చెయ్యండి. వ్రతాచరణం సక్రమంగా జరిగితే నేను మూడు సంవత్సరాలలో వెలికి రాగలుగుతాను" అని కర్తవ్యాన్ని ప్రబోధించింది.

అజాతపుత్రిక కోరినట్లే కాశీరాజు నియమం తప్పకుండా ప్రతి దినం ఒక్కొక్క ఆవును విప్రులకు దానం చేశాడు. సరిగ్గా మూడేళ్లకు రాజదంపతులకు కూతురు పుట్టింది. ఆమెకు గాందిని అని పేరు పెట్టారు.

గాందినికి యుక్తవయస్సురాగానే ఆమెను కాశీరాజ్యానికి మహోపకారం చేసిన శ్వఫల్కునికి ఇచ్చి వివాహం చేశారు. జననాత్పూర్వమే ప్రారంభించిన వ్రతాన్ని ఆమె జీవితాంతం దాకా పరిపాటించి, సద్బ్రాహ్మణులకు అనునిత్యగోదానం ఆచరించింది.

గాందినీ శ్వఫల్కులకు అక్రూరుడు జన్మించాడు. తల్లిదండ్రులు చేసిన పుణ్యాఫలంవలన అతను నివసించిన దేశంలో సుఖశాంతులు నిండి ఉంటాయి. అతను విడిచిపెట్టిన రాజ్యంలో దుర్భిక్షాలు తాండవిస్తాయి.

మాధవా! అక్రూరుడు నిత్యాగ్నిహోత్రియై సవనదీక్షాపరతంత్రుడైన పుణ్యపురుషుడు. పరమభాగవతోత్తముడు. అతనిని

ద్వారకకు తిరిగి రప్పించాలి. లోకోపకారశీలురైన గుణవంతులు ఒకప్పుడు అపరాధం చేసినా చూసీ చూడనట్లు ఊరకుంటే మళ్లీ ధర్మమార్గానికి రాగలుగుతారు. దోషాచరణమతులకు క్షమాభిక్షను ప్రసాదించి సాధువర్తనకు అవకాశాలను కల్పించడం కూడా ధర్మ సమ్మతమే''

అని అంధకుడు సహేతుకంగా కర్తవ్యోపదేశం చేశాడు. యాదవులందరూ అతని ఉపదేశసారాన్ని గ్రహించి, శ్రీకృష్ణ ఉగ్రసేన బలభద్రాదులను కాశీనగరానికి పంపించారు. చక్రధరుడు అక్రూరునికి ధైర్యం చెప్పి, కృతాపరాధతితిక్షాభవ భయాన్ని వినివారించి, అతనిని సగౌరవంగా ద్వారకాపురంలో కాపురానికి తీసుకొనివచ్చాడు.

అక్రూర ప్రవేశం

అక్రూరుడు ద్వారవతిలో కాలుపెట్టగానే వానలు కురిసి పైరు పొలాలలో సస్యవృద్ధి కలిగింది. వర్తకులు తూకం కన్నా ఎక్కువ ధాన్యం కొలిచి అమ్మారు. దానం ఇచ్చేవారే కాని పుచ్చుకొనేవారు లేకపోయారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులై మళ్లీ పని పాటలకు ఉపక్రమించారు. ఉపద్రవాలన్నీ తొలగిపోయి దేశం మళ్లీ సుభిక్షంగా పెంపు గడిచింది.

పరిస్థితులన్నీ చక్కబడ్డాక ఒకనాడు శ్రీకృష్ణుడు తన మనస్సులో అక్రూరుని మహిమలను వితర్కించి చూశాడు. ''ఇతని తల్లిదండ్రులు చేసినవైనా ఏమంత చెప్పుకోదగిన మహాపుణ్య కార్యాలు కావు. ఇతకంటె గొప్ప దానాలు చేసినవారందరికీ ఇటువంటి మహామహిమలు కలగలేదు కదా! వారందరికీ దుర్భిక్షోపశమన లీలలు చేకూరలేదు కదా! అంతేకాక ఇతను ప్రతినిత్యం ఏదో ఒక యజ్ఞకృత్యాన్ని మొదలుపెట్టి పుష్కలంగా సంపద్వ్యయం

కావిస్తున్నాడు. బ్రాహ్మణులకు, అర్థార్థులకు అడిగినవారికి లేదనకుండా భూరిదక్షిణలు, భూరిదానాలు ఇవ్వగలుగుతున్నాడు. నాకు తెలియకుండా ఇతనికి ఇన్ని దివ్యశక్తులు ఆకస్మికంగా ఎలా చేకూరాయి? క్రతువు తర్వాత క్రతువు చేయటానికి ఇతని కింత సంపద ఎక్కడనుంచి వచ్చింది?'' అని పర్యాలోచింపగా వాసుదేవునికి యథార్థం తెలిసివచ్చింది. ఈ భోగభాగ్యాలు అక్రూరునికి స్యమంతకమణి వల్లనే సమకూడాయని నిశ్చయించుకొన్నాక అతను ఒక మంచిరోజు చూసి యాదవులందరినీ తన యింటికి విందుకు ఆహ్వానించాడు. అభ్యాగతు లందరూ ఉచితాసనాలలో కూర్చొని ఇష్టకేళీ వినోదాలతో ఉల్లాసంగా ఉన్న సమయం కనిపెట్టి, నెమ్మదిగా అక్రూరునితో మాటకలిపి, ఈ విధంగా ప్రసంగించాడు:

''మహాదాతా! నీ దగ్గర సూర్యవరప్రసాదం వలన మన సత్రాజిత్తుకు లభించిన స్యమంతకమణి సురక్షితంగా ఉన్నదని నాకు ఎప్పటినుంచో తెలుసు. శతధన్వుడు ఇక్కడినుంచి పారిపోయే ముందు దానిని నీ దగ్గర నిక్షేపించి ఉండాలి. నువ్వు సత్కార్మాచరణలతో దానధర్మాలు చేస్తూ, నిరంతరం యజ్ఞదీక్షలో ఉన్నందువలన నేనూ ఆ విషయాన్ని నీతో ప్రస్తావింపలేదు. అయినా దాని వల్ల కలుగవలసిన ఫలం రాజ్యానికి కలుగుతూనే ఉన్నది. దేశం సుభిక్షంగా ఉండాలే కాని మణి ఎవరిదగ్గరున్నా ఒకటే. ఐనా బలభద్రుడు ఈ నాటికీ అది నా వద్దనే ఉన్నదని నిష్కారణంగా నన్ను అనుమానిస్తున్నాడు. పెక్కుమంది యాదవప్రముఖులూ లోలోపల ఆ విధంగానే భావిస్తున్నారు. అందువల్ల దయచేసి ఒక్కసారి ఆ అనర్ఘమణిని వీరందరికీ చూపించి నా యందు గల అవిశ్వాసాన్ని తొలగించు'' అని సాదరోక్తులతో అడిగాడు.

శ్రీకృష్ణుని నర్మగర్భిత ప్రసంగానికి అక్రూరుడు ఉలికిపడ్డాడు. ''వ్యవహారం ఇంతదాకా వచ్చాక ఇప్పుడు మణి సంగతి

నాకు తెలియదంటే ఇంటికి వెళ్లి వెతుకుతారు. అంత్యనిష్ఠూరం కంటె ఆదినిష్ఠూరం మేలు. పైగా నిజాన్ని ఎంతకాలం నివురుగప్పి ఉంచగలము?'' అని నిశ్చయించుకొని, సత్యాన్ని చెప్పివేశాడు:

''దేవా! సర్వజ్ఞుడవైన నీకు తెలియని దేమున్నది? నీ వన్నట్లు శతధన్వు డిచ్చిన స్యమంతకమణి నా దగ్గరే ఉన్నది. ఈ వేళ కాకపోతే రేపయినా నిజం బయటపడక మానదని ప్రతిరోజూ ప్రాణ గొడ్డంగా కాలం గడుపుతున్నాను. ఇంటినిండా భగవద్దత్తమైన భోగభాగ్యాలు ఉన్నాయన్న మాటేగాని నాకు వాటిపైన వ్యామోహం ఎన్నడూ లేదు. మణిధారణక్లేశానికి తోడు నా నీడను చూసి నేనే భయపడుతూ ఎంతకాలం బ్రతుకుతాను? దీనిని నీకు అప్పగిస్తే దేశమంతటికీ మంచి జరుగుతుంది. నా విన్నపాన్ని మన్నించి దీన్ని నీవే పరిగ్రహించు'' అని మనసు విప్పి మాట్లాడాడు.

ఈ విధంగా నిజం చెప్పి అక్రూరుడు తన వస్త్రాలలో దాచి ఉంచిన కనకసముద్గకాన్ని బయటికి తీశాడు. అందులో అఖిల జగత్సారభూతమైన స్యమంతకమణి దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ''శ్రీకృష్ణా! నేను దీనిని మనఃపూర్వకంగా నీకు సమర్పిస్తున్నాను. ఇందులో కల్మషమేమీ లేదు. జగద్భర్తవైన నీ వద్ద దీనికి సార్థకత లభిస్తుంది'' అని పలికి స్వర్ణమంజూషికను వాసుదేవునికి ఇచ్చివేశాడు.

కోటి సూర్యబింబాలను కలిపి ముద్దచేసినట్లున్న ఆ ఘన తేజోమయ దివ్యమణిని చూసి యాదవులు తమ కళ్లను తామే నమ్మలేకపోయారు. ఆశ్చర్యంతో ఊపిరి బిగబట్టి దాని దగ్గరదాకా వెళ్లి, చేతులతో తాకిచూసి సాధువాదాలతో శ్రీకృష్ణుని అభినందించారు. వారి జయజయధ్వానాల సముద్ఘోషం సభామంటపాన్ని దాటి దిగంతాలలో ప్రతిధ్వనించింది.

పునర్లబ్ధమణిని చూడగానే బలభద్రునికి దానిపై కోరిక ఉదయించింది. పూర్వం శ్రీకృష్ణుడు తనతో చెప్పిన ప్రకారం సత్రాజిత్ప్రసేనుల మరణానంతరం అది తమ యిద్దరికీ చెందుతుంది కనుక తమ్ముడు దానిని తనకే ఇస్తాడని ఆశపడ్డాడు. సూర్యమణి తన తండ్రి సంపాదన కనుక పితృధనంగా తనకే సంక్రమిస్తుందని సత్యభామ ఎదురుచూసింది. సత్యాబలదేవుల ఆననాలను విలోకించగానే శ్రీకృష్ణుడు తాను అడకత్తెరలో చిక్కిన పోక చెక్కవలె ఇబ్బందిలో పడ్డానని గ్రహించాడు. సకల యాదవసమక్షంలో అక్రూరుని చూసి, "నా పైని వీరందరికీ కలిగిన అనుమానం తొలగించటానికే మణి విషయం నీతో ప్రస్తావింపవలసి వచ్చింది. శాస్త్రప్రకారం ఇది నాకూ, మా అన్నయ్యకూ చెందాలి. పితృధనంగా అయితే సత్యభామకు చెందాలి. ఈ దివ్యమణి నిత్యశుచిర్భూతులై బ్రహ్మచర్య వ్రతాన్ని అనుష్ఠింపగల వారివద్ద రాణించినట్లు సంసార చక్రంలో పడి కొట్టుమిట్టుకులాడుతున్న - మా వంటివారి దగ్గర ప్రకాశింపదు. అశుచిదోషం వలన అపకారం జరిగినా ఆశ్చర్యం లేదు. నాకు పదహారువేలమంది భార్యలున్నారు. నిత్యమూ నన్నే మనస్సులో నిలుపుకొని నన్నే ఆరాధిస్తున్న సత్యభామకు మాత్రం పతి విరహం ఎలా సాధ్యమౌతుంది? ఈ బలభద్రునికి మాత్రం నిత్యమదిరాపానాది అశేష సుఖభోగాల పరిత్యాగం ఎలా వీలవుతుంది? కనుక ఈ యదులోకమూ, ఈ బలభద్రుడూ, సత్యభామ, నేను—అందరమూ ఏకగ్రీవంగా నిన్ను సంప్రార్థిస్తున్నాము. మహాదాతా! దీనిని నీవు ఎప్పటివలెనే ధరించి రాష్ట్రోపకార చర్యలతో ప్రజానీకాన్ని నీ శక్తి కొద్దీ సంసేవించు. మా మాట కాదనకు" అని మృదూక్తులతో ప్రసంగించి, స్యమంతకమణిని ఆదరాతిశయంతో సమర్పించి, ప్రేమగా వీడ్కొలిపాడు.

అక్రూరుడు సూర్యమణిని శ్రీకృష్ణ వరప్రసాదంగా కన్నుల కద్దుకొని, కంఠసీమను ధరించి భూమిపై అవతరించిన అంశుమాలి వలె ధర్మవర్తనుడై కలకాలం జీవించాడు.

ఈ విధంగా భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మకు మిథ్యాప్రవాదం ప్రక్షాళితమైన ఈ పుణ్యకథను ఆకర్ణించిన సదాచారపరులకు జీవితంలో అపవాదభయాలు కలుగవు. ఇంద్రియ శాంతి లభించి పాపసంచయాల నుంచి శాశ్వత విముక్తిని పొందుతారు''

అని చెప్పి పరాశరమహర్షి మైత్రేయునికి చంద్రవంశ కథా పరిశిష్టాన్ని విశదీకరించాడు:

అనమిత్రాదుల వంశానుక్రమం

అనమిత్రుని తమ్ముడు శినికి సత్యకుడు జన్మించాడు. అతని కొడుకు యుయుధానునికి సాత్యకి అని పేరు వచ్చింది.

సాత్యకికి అసంగుడు, అతనికి తూణి, తూణికి యుగంధరుడు జనించారు. వీరందరినీ శైనేయులని అంటారు.

అనమిత్రుని వంశంలో ఉదయించిన పృష్ణికి శ్వఫల్కుడు, అతనికి అక్రూరుడూ పుట్టిన ఉదంతం సుప్రసిద్ధమే.

శ్వఫల్కుని భార్య గాందిని. ఆ దంపతులకు అక్రూరునితో పాటు ఉపమద్గువు, మృదురవి, శారిమేజయుడు, గిరిక్షత్రుడు, ఉపక్షత్రుడు, శత్రుఘ్నుడు, విమర్దనుడు, ధర్మదృశుడు, ధృష్టశర్ముడు, గంధమోజుడు, వాహకుడు, ప్రతివాహకుడు మొదలుగా గల పెక్కుమంది సుతులు, ఒక కుమార్తె—సుతార జన్మించారు.

అక్రూరునికి ఇద్దరు కొడుకులు—దేవవంతుడు, ఉపదేవుడు ప్రభవించారు.

శ్వఫల్కుని తమ్ముడు చిత్రకుడు. అతనికి పృథుడు, విపృథుడు—ఇంకా పెక్కుమంది కొడుకులు పుట్టారు.

అంధకునికి నలుగురు కుమారులు—కుకురుడు, భజమానుడు, శుచి, కంబళబర్హి ఉదయించారు.

కుకురునికి వృష్టుడు, అతనికి కపోతరోముడు, కపోతరోమునికి విలోముడు, విలోమునికి భవుడు జన్మించారు. వీరిలో భవునికి చందనోదకదుందుభి అని కూడా ప్రఖ్యాతి కలిగింది. ఇతను గానవిద్యా ప్రవీణుడైన తుంబురునితో స్నేహంచేసి గంధర్వ విద్యలను అభ్యసించాడు.

భవునికి అభిజిత్తుడు ప్రభవించాడు. అతనికి పునర్వసుడు, పునర్వసునికి ఆహుకుడు, ఆహుకి అనే కుమార్తె ఉదయించారు.

ఆహుకునికి దేవకుడు, ఉగ్రసేనుడు ఉదయించారు. దేవకునికి నలుగురు కొడుకులు—దేవవంతుడు, ఉపదేవుడు, సుదేవుడు, దేవరక్షితుడు, ఆ తర్వాత ఏడుమంది కుమార్తెలు—వృకదేవ, ఉపదేవ, దేవరక్షిత, శ్రీదేవ, శాంతిదేవ, సహదేవ, దేవకి జన్మించారు.

ఆహుకుని కుమార్తెలందరినీ వసుదేవుడు వివాహం చేసుకొన్నాడు.

ఉగ్రసేనునికి తొమ్మిదిమంది కొడుకులు—కంసుడు, న్యగ్రోధుడు, సునాముడు, కంకుడు, శంకుడు, సుభూమి, రాష్ట్రపాలుడు, యుద్ధముష్టి, తుష్టిమంతుడు, ఆ తర్వాత ఐదుగురు కుమార్తెలు—కంస, కంసవతి, సుతను, రాష్ట్రపాలి, కంకి జన్మించారు.

భజమానుని పుత్రుడు విదూరథుడు. అతని కొడుకు శూరుడు. శూరునికి శమి, శమికి ప్రతిక్షత్రుడు, ప్రతిక్షత్రునికి స్వయంభోజుడు, అతనికి హృదీకుడు, హృదీకునికి కృతవర్మ శతధన్వ దేవమీఢుషాదులూ ఉదయించారు.

వసుదేవాన్వయం

దేవమీఢుషుని కొడుకు శూరుడు. అతని భార్య మారిష. ఆ దంపతులకు పదిమంది కొడుకులు కలిగారు. వారిలో వసుదేవుడు పెద్దవాడు.

వసుదేవుడు మాతృగర్భం నుంచి వెలువడగానే స్వర్గంలో దేవదుందుభులు మ్రోగాయి. లోక రక్షణార్థం లీలామానుష విగ్రహుడై అవతరింపనున్న శ్రీమన్నారాయణునికి జనకస్థానీయుడైన మహాత్ముని కనుగొన్న ఆనందంతో దేవతలు పుష్పవృష్టి కురిపించారు. వసుదేవునికి ఆనకదుందుభి అని పేరు వచ్చింది.

వసుదేవుని సోదరులు—దేవభాగుడు, దేవశ్రవుడు, అనాధృష్టి, కరుంధకుడు, వత్సబాలకుడు, సృంజయుడు, శ్యాముడు, శమీకుడు, గండూషుడు.

శూరునికి మారిషయందు ఐదుగురు కుమార్తెలు కూడా జన్మించారు. వారు—పృథ, శ్రుతదేవ, శ్రుతకీర్తి, శ్రుతశ్రవ, రాజాధిదేవి.

శూరునికి ప్రియసఖుడైన కుంతిభోజునికి సంతానం కలుగలేదు. అతను శూరుని జ్యేష్ఠపుత్రిక పృథను శాస్త్రసమ్మతంగా దత్తస్వీకారం చేసుకొన్నాడు. ఆమెను చంద్రవంశరాజులలో సుప్రసిద్ధుడైన పాండురాజుకు ఇచ్చి వివాహం చేశారు. ఆ మిథునానికి యమధర్మరాజు తేజోంశ వలన యుధిష్ఠిరుడు, వాయువు వలన భీమసేనుడు, ఇంద్రుని వల్ల అర్జునుడు జన్మించారు.

వివాహానికి పూర్వం కుంతిభోజనందన సూర్యభగవానుని ఉపాసించింది. ఆయన ప్రభావం వలన పృథకు కానీనుడైన కర్ణుడు జన్మించాడు.

పృథాదేవికి సపత్ని మాద్రి. పాండురాజుకు ఆమెయందు ఆదిత్యనందనులైన నాసత్యదస్రుల వలన నకుల సహదేవులు జన్మించారు.

శిశుపాలుని పుట్టుక

శ్రుతదేవను కరూషదేశపు రాజు వృద్ధశర్ముడు వివాహం చేసుకొన్నాడు. వారికి దంతవక్త్రుడనే మహాసురుడు జన్మించాడు.

కైకేయదేశాన్ని పరిపాలిస్తున్న ధృష్టకేతుడు శ్రుతకీర్తిని పరిణయమాడి ఆమెయందు సంతర్దనాదులైన కైకేయపంచకాన్ని కన్నాడు.

రాజాధిదేవిని అవంతీనగరాధీశుడు జయసేనుడు చేపట్టాడు. వారికి విందుడు, అనువిందుడు ఉదయించారు.

శ్రుతశ్రవను చేదిదేశపు రాజు దమఘోషుడు పెండ్లాడాడు. ఆ దంపతులకు శిశుపాలుడు జన్మించాడు.

రాక్షసాంశసంభూతుడైన శిశుపాలుడు కూడా కారణజన్ముడే. పూర్వం శ్రీమన్నారాయణుడు నృసింహావతారంలో సంహరించిన దైత్యరాజు హిరణ్యకశిపుడూ, శ్రీరామావతారంలో లంకాపురికి వెళ్లి వధించిన పౌలస్త్య రావణాసురుడూ శిశుపాలుని పూర్వరూపాలే. సకలలోకాలకూ సర్గస్థితిలయంకరుడైన శ్రీ వాసుదేవుని చేతిలో ఘాతితుడయినా, ఆ మహానుభావుని అక్షతశౌర్య వీర్యసంపత్పరాక్రమగుణాలను చవిచూసినా, ఇంకా కర్మశేషం తీరక హిరణ్యకశిపు రావణ శరీరధారి దమఘోషాత్మజునిగా అవతరింప వలసివచ్చింది. భూభారాన్ని తొలగించడం కోసం భూమికి దిగివచ్చిన పుండరీకాక్షునితో వైరశుద్ధిని కోరి నిరంతర శ్రీవాసుదేవనామ జపధ్యానైకతత్పరుడై ఏతద్వైరభక్తి వలన అంతంలో భగవత్సాయుజ్యమహాభాగ్యాన్ని పొంది చరితార్థుడయ్యాడు.

మైత్రేయా! కరుణాసముద్రుడైన శ్రీమన్నారాయణుడు సదసత్సమభావనుడు. ఆయన దృష్టికి మంచిచెడ్డలన్న భేదభావనలు లేవు. సజ్జనులయందు ప్రసన్నుడై ఎంత దయతో వరాలను ప్రసాదిస్తాడో, తనను ద్వేషించినవారిని కూడా అంతే దయతో కడతేర్చి తన సమీపానికి చేర్చుకొంటాడు''

అని పరాశరుడు శ్రీ వాసుదేవుని అనంత మహిమాతిశయాన్ని అభివర్ణింపగా తన్మయుడై వింటున్న మైత్రేయుడు అమితాశ్చర్యాన్ని పొంది—

''మునీంద్రా! ఈ శిశుపాలుని వృత్తాంతం నాకు చిత్రతరమై భాసిస్తున్నది. హిరణ్యకశిపుడై ఒకసారి, రావణాసురుడై రెండవసారి సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు కరకమలాలలో తనువు చాలించి, దేవతలకు కూడా పొందరాని మహాదృష్టాన్ని పొందినవాడు మళ్లీ భూతలాన ఎందుకు జన్మించాడు? శ్రీకృష్ణావతారంలో పునర్హతుడైనప్పుడు సాయుజ్యం ఎలా కలిగింది?''

అని కుతూహలంతో అడిగాడు.

పురాణకథాప్రవీణుడైన పరాశరుడు తన కథానకాన్ని కొనసాగించాడు.

శిశుపాలునికి కైవల్యప్రాప్తి

''అఖిల చరాచరసృష్టిస్థితిలయాత్మకుడైన శ్రీహరి సభాస్తంభసంభూతుడై ఉగ్రనరసింహాకృతిని ధరించి హిరణ్యకశిపుని సంహరించినపుడు ప్రచ్ఛన్నవేషంలో ఉన్న శ్రీమహావిష్ణువును అతను గుర్తుపట్టలేకపోయాడు. వైరంకొద్దీ రాజసోద్రేకంతో ఎదిరించాడే కాని మరణసమయంలో జగన్మోహనమైన ఆ దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తూ కన్నుమూశాడు. శ్రీహరిదర్శన పుణ్యాతిశయం వల్ల సకల వైభవాలకూ ఆలవాలమైన పులస్త్యబ్రహ్మ వంశంలో

దశగ్రీవుడై జన్మించి త్రైలోక్య సామ్రాజ్యాధిపత్యాన్ని చూరగొన్నాడు.

ఉత్తరజన్మలో కూడా దశకంఠునికి అనాదినిధనుడూ ధర్మవిగ్రహుడూ సాక్షాత్పరబ్రహ్మస్వరూపుడూ అయిన శ్రీరామచంద్రుని స్థితిస్వరూపం అవగతం కాలేదు. మన్మథపరాధీనుడై శ్రీరామచంద్రుని ధర్మపత్నిని జగన్మాత సీతను అపహరించాడు. వానరసేనను సమీకరించుకొని తన రాజ్యంపైకి దండెత్తివచ్చిన పరమాత్మను ప్రాకృతపురుషునిగా సంభావించి ఆయనతో యుద్ధానికి సిద్ధపడ్డాడు.

ఆ విధంగా మోక్షదాయకుడైన పుండరీకాక్షుని యందు సామాన్య మనుష్యభావన చేసిన దోషం వలన దశకంఠునికి మోక్షం లభింపకపోయినా ఆయన చేతిలో వినిపాతాన్ని పొందిన భాగ్యానికి ఫలంగా సకలైశ్వర్యాలకూ తావలమై భూమండలశ్లాఘ్యమైన చేదిరాజవంశంలో ప్రాదుర్భావం కలిగింది.

చేదిభూపాలసుతునికి శిశుపాలుడని పేరుపెట్టారు. పూర్వపుణ్యఫలం వల్ల అతనికి ఏదో ఒక సన్నివేశంలో శ్రీకృష్ణుని నామస్మరణం కలుగుతూనే వచ్చింది. అయితే అనేకజన్మలుగా పెరుగుతూ వచ్చిన వైరానుబంధం వలన అతను హరిని ద్వేషించి, ఆయన ప్రతిచర్యలో దోషారోపణ చేస్తూ ఆయనను తప్పుపడుతూ వచ్చాడు.

చిన్నప్పటి నుంచీ శిశుపాలునికి శ్రీకృష్ణుని చంపివేయాలన్నంత తీవ్రవిద్వేషం, ఆ మాయావి తను పరధ్యానంగా ఉన్నప్పుడు రహస్యంగా ఏ చాటునుంచి వచ్చి తనను హతమారుస్తాడో నన్న భయమూ ఉండేవి. ఆ కారణం చేత అతను తదేకదీక్షగా శ్రీమన్నారాయణుని స్మరింపసాగాడు. ఎవరు కనిపించినా, ఎవరితో

మాట్లాడినా అతనికి మనసా వాచా కర్మణా శ్రీహరి చింతనమే సాగుతుండేది. ఉత్ఫుల్ల పద్మినీదళాల వలె ప్రకాశిస్తున్న విశాల నేత్రాలతో తనకేసి చూసి కొంటెగా నవ్వుతున్న ఆ నల్లనయ్య అందమైన ముఖం, ఎక్కుపెట్టిన విండ్లలా పొందికగా అమరి నయనాంతాల వరకు కొనలు తేరిన కనుబొమ్మల నడుమ కమ్మతావులు గుబాళిస్తున్న కస్తూరీ తిలకం, మేలిమి బంగారువన్నెలో కన్నులకు మిరుమిట్లు గొలుపుతున్న పీతాంబరం, లోకాతిశాయి మహాబల ప్రౌఢిమలు ఉట్టిపడుతున్న అతిపీవరచతుర్బాహువులలో పాంచజన్య సుదర్శన కౌమోదకీనందకాలను ధరించి కిరీటకటకకేయూరమణి కుండలాలతో శోభాయమానంగా వెలుగొందుతున్న వాసుదేవుని మోహనాకారం అతని మనోవీథిలో నిత్యప్రత్యక్షంగా నిలిచి ఉండేది. అతిసాంద్రమైన వైరానుభావం వల్ల అతను ఇంటిలో ఉన్నా, ఇల్లువిడిచి బైటికి వచ్చినా, భోజన స్నాన ఆసన శయనాది సర్వావస్థలలోనూ శ్రీహరి లగ్నచేతస్కుడై కాలం గడిపేవాడు.

నిరంతరనారాయణస్మరణం వలన శిశుపాలునికి ఎటుచూచినా వాసుదేవుని రూపమే కానవచ్చేది. ఉదయాద్రినుంచి పైకి లేచి కాంతులను విరజిమ్ముతున్న ఖద్యోతబింబాన్ని చూసి సుదర్శనచక్ర మనుకొని ఒక్కుమ్మడిని ఉలికిపడేవాడు. ఆకసంలో ఇంద్రచాపం విరిసి సజలజలధరాలు గర్జించినప్పుడు శార్ఙ్గకోదండపు జ్యాఘోష మని నందగోపసుతుని కోసం నలుదెసలా అన్వేషించేవాడు.

ఈ విధంగా అక్షయతేజుడైన పరమాత్మను హృదయ సద్మంలో పాదుకొల్పి ఆయనతో కయ్యానికి కాలుదువ్వుతున్న శిశుపాలునికి ఆ అవకాశం ధర్మజ రాజసూయంలో సమాలబ్ధమయింది. రాగద్వేషాలకు అతీతుడైన శ్రీకృష్ణుడు ధర్మరక్షానిమిత్తం అతనిపై చక్రాయుధాన్ని ప్రయోగించి, యావజ్జీవితమూ తననే ధ్యానించి

తన స్మరణానుభావంతో సకల పాపాలనూ దహింపజేసుకొన్న చేది భూపాల సుతునికి మోక్షాన్ని ప్రసాదించాడు.

బలభద్రోదయం

వసుదేవునికి రోహిణి, పౌరవి, భద్ర, మదిర, వైశాలి, దేవక్యాదులైన పెక్కుమంది భార్యలున్నారు. వీరిలో రోహిణికి బలభద్రుడు, సారణుడు, శఠుడు, దుర్మదుడూ ఉదయించారు.

బలభద్రుని భార్య రేవతి. వీరికి నిశఠుడు, ఉల్ముకుడు అని ఇద్దరు కొడుకులు పుట్టారు.

సారణునికి మార్ష్టి, మార్ష్టిమంతుడు, శిశుడు, సత్యధృతి ప్రభవించారు.

రౌహిణేయుల కుటుంబాలలో భద్రాశ్వుడు, భద్రబాహువు, దుర్గముడు, భూతుడు ఇత్యాదిగా ప్రసిద్ధపురుషులు జన్మించి అందరూ కులదీపకు లయ్యారు.

వసుదేవునికి మదిరాగర్భంలో నందుడు, ఉపనందుడు, కృతకుడు మొదలైనవారు, భద్రయందు ఉపనిధి, గదుడు మొదలైనవారు జన్మించారు. వైశాలికి కౌశికుడు ప్రభవించాడు. దేవకికి ఆరుమంది కొడుకులు—కీర్తిమంతుడు, సుషేణుడు, ఉదాయి, భద్రసేనుడు, ఋజుదాసుడు, భద్రదేహుడు జన్మించారు. వీరందరినీ దేవకి అన్న కంసుడు చంపివేశాడు.

కొన్నాళ్లకు దేవకి ఏడవమారు గర్భాన్ని ధరించగానే శ్రీమన్నారాయణుని అనుజ్ఞను గైకొని యోగనిద్ర దానిని వెలికితీసి రోహిణి ఉదరంలోనికి ప్రవేశపెట్టింది. రోహిణి ఆ గర్భాన్ని ధరించి నెలలు నిండగానే బలభద్రుని కన్నది. కర్షణ మూలాన జన్మించిన శిశువు కనుక అతనికి సంకర్షణుడని పేరు వచ్చింది.

శ్రీకృష్ణుని జననం

అప్పుడు సకల జగన్నిహోతరు మూలపురుషుడు, భూత భవిష్యద్వర్తమాన కాలస్వరూపుడు, నిఖిల సురాసుర ముని మనుజ మానసాగోచరుడు, అనాదిమధ్యనిధనుడు, ఆశ్రితజనావనుడు శ్రీమన్నారాయణుడు మహీభారాపసరణ కోసం దేవకీదేవి అష్టమగర్భం లోనికి అవతరించాడు.

సచ్చిదానందస్వరూపుడైన వాసుదేవుడు మనుష్యరూపాన్ని ధరించి భూతలానికి దిగివచ్చినపుడు భూమండలంలో ఎన్నడూ లేని వికాసం పొడచూపింది. ఆకాశం నిర్మేఘమై సూర్యచంద్రగ్రహ నక్షత్రతారకలు సుప్రసన్న తేజంతో ప్రకాశించాయి. ఆధివ్యాధులు, ప్రకృతివైపరీత్యాల భయం తొలగి జనహృదయాలు ఆనందమందిరాలై వెలుగొందాయి. మానవలోకంలో సన్మార్గవర్తనకు బీజావాపనం జరిగింది.

శ్రీకృష్ణపరమాత్మ మనుష్యకర్మ సమాచరణుడై షోడశ సహస్రాలపై ఏకోత్తర శతాధికంగా స్త్రీలను పెండ్లి చేసుకొన్నాడు. వారిలో రుక్మిణి, సత్యభామ, జాంబవతి, జలహాసిని మొదలుగా గల ఎనిమిది మంది ఆయనకు ప్రియ భార్యలు. అఖిలమూర్తిధరుడైన ఆ మహాత్ముడు తన భార్యలయందు లక్షా ఎనభై వేల మంది కొడుకులను కన్నాడు. వారిలో ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు, సాంబుడు మొదలైన పదముగ్గురు అతి సుప్రసిద్ధులు.

ప్రద్యుమ్నుడు తన మేనమామ రుక్మి కుమార్తె కకుద్మతిని వివాహం చేసుకొన్నాడు. వారికి అనిరుద్ధుడు ఉదయించాడు.

అనిరుద్ధునికి రుక్మి మనుమరాలు సుభద్రతో పరిణయమైంది. ఆ దంపతులకు వజ్రుడు జన్మించాడు. వజ్రుని కొడుకు సుచారుడు.

ఈ రీతిని యదుకులం అనేక శతసాహస్రికంగా ప్రవర్ధిల్లింది. వారందరి పేర్లనూ స్మరించడం మొదలు పెడితే వందలాది సంవత్స రాలు అవలీలగా గడిచిపోతాయి.

యదుబాలకులకు ధనుర్విద్య నేర్పించడానికి మూడుకోట్ల ఎనభై లక్షలమంది చాపాచార్యు లున్నారు. ఇక వారిదగ్గర చేరి చదువుకున్నవారి సంఖ్య కొన్ని వేల కోట్లకు పైగా ఉంటుంది.

పూర్వం దేవదానవులకు సంగ్రామాలు జరిగినప్పుడల్లా మర ణించిన దైత్యులందరూ మానవలోకంలో బలాధికులూ, జనోపద్రవ కారకులూ అయిన దుష్టాత్ములుగా జన్మించి భూలోకవాసులను హింసిస్తూ ఉండేవారు. వారి కుతంత్రాలను అరికట్టడానికి దేవతలు పుడమికి దిగివచ్చి ఏకోత్తర శతశాఖలుగా ప్రవర్తిల్లిన యదు కులంలో అవతరించారు. భూమిభారావతరణకోసం శ్రీమహావిష్ణువు యదుకులంలో శ్రీకృష్ణుడై జన్మించినపుడు యాదవ సమాజం ఆయ ననే ప్రమాణంగా స్వీకరించి, ఆయన అడుగు జాడలలో ధర్మకర్మ లను అనుష్ఠించింది.

ఈ వృష్ణివీరుల పుణ్యకథలను వింటూ శ్రీకృష్ణార్పితచేతస్కు లైన భక్తిపరులకు అఘవిచ్ఛేదం జరిగి సర్వోత్తమమైన వైకుంఠ పదవి సంప్రాప్తిస్తుంది.

తుర్వసు వంశం

తుర్వసునికి వహ్ని జన్మించాడు. అతని కొడుకు గోభానుడు. గోభానునికి త్రైశాంబుడు, అతనికి కరంధముడు, కరంధమునికి మరు త్తుడు జన్మించారు.

మరుత్తునికి సంతానం కలుగలేదు. అతను పూరువంశంలో ఉదయించిన దుష్యంతుని దత్తపుత్రునిగా స్వీకరించి వంశాన్ని నిల బెట్టుకొన్నాడు.

యయాతి శాపం వల్ల తుర్వసుని వంశం పూరువంశంలో కలిసిపోయింది.

ద్రుహ్యు వంశం

ద్రుహ్యునికి బభ్రువు జన్మించాడు. అతని కొడుకు సేతువు. సేతువుకు ఆరద్వంతుడు, అతనికి గాంధారుడు, గాంధారునికి ధర్ముడు ప్రభవించారు.

ధర్ముని కొడుకు పేరు ధృతుడు. అతనికి దుర్గముడు, దుర్గమునికి ప్రచేతసుడు జన్మించారు.

ప్రచేతసునికి నూరుమంది కొడుకులు పుట్టారు. వీరందరూ అధర్మవర్తనులై ఉదీచ్యానికి వెళ్లి మ్లేచ్ఛసంజ్ఞలను ధరించి రాజ్య పాలకులయ్యారు.

అనువు వంశం

యయాతి నాలుగవ కొడుకు అనువుకు ముగ్గురు సుతులు— సభానరుడు, చాక్షుషుడు, పరమేక్షుడు ఉదయించారు.

సభానరుని కొడుకు కాలానరుడు. అతనికి సృంజయుడు పుట్టాడు. సృంజయునికి పరంజయుడు, పరంజయునికి జనమేజయుడు, జనమేజయునికి మహాశాలుడు, మహాశాలునికి మహామనుడు జన్మించారు.

మహామనుని సుతులు ఉశీనరుడు, తితిక్షుడు—ఇద్దరూ అన్వయోత్తంసులై విలసిల్లారు. ఉశీనరునికి ఐదుగురు కొడుకులు—శిబి, నృగుడు, నరుడు, కృమి, దార్వుడు ప్రాదుర్భవించారు. వారిలో శిబికి వృషదర్భుడు, సువీరుడు, కైకేయుడు, మద్రుడు ప్రభవించారు.

తితిక్షువు కొడుకు పేరు ఉషద్రథుడు. అతనికి హేముడు, హేమునికి సుతపుడు, సుతపునికి బలి జన్మించారు. బలి భార్యకు దీర్ఘతముని వలన అంగ వంగ కళింగ సుహ్మ పుండ్రాఖ్యులైన

అయిదుగురు పుత్రు లుదయించి వేర్వేరుగా వంశకర్త లయ్యారు. ఈ వంశనామాలే వీరు పరిపాలించిన దేశాలకు కూడా సంజ్ఞలై ప్రచారంలోకి వచ్చాయి.

అంగరాజ వంశం

అంగరాజసుతుని పేరు పారుడు. అతని కొడుకు దివారథుడు. అతనికి ధర్మరథుడు, ధర్మరథునికి చిత్రరథుడు, చిత్రరథునికి రోమపాదుడు జన్మించారు.

రోమపాదునికి దశరథుడని కూడా పేరున్నది. అతనికి చాలాకాలం సంతానం కలుగలేదు. అజమహారాజు కొడుకైన దశరథుని కుమార్తె శాంతను దత్తస్వీకారం చేసుకొన్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు రోమపాదునికి ఒక కొడుకు పుట్టాడు. అతనికి చతురంగుడని నామకరణం చేశారు. చతురంగునికి పృథులాక్షుడు జన్మించాడు.

పృథులాక్షుని కొడుకు చంపభూపతి సుప్రసిద్ధుడై చంపానగరాన్ని నిర్మించాడు. అతనికి హర్యంగుడు, హర్యంగునికి భద్రరథుడు ఉదయించారు. భద్రరథునికి ఇద్దరు కొడుకులు—బృహద్రథుడు, బృహత్కర్ముడు పుట్టారు. వారిలో బృహత్కర్మునికి బృహద్భానుడు, అతనికి బృహన్మనుడు, బృహన్మనునికి జయద్రథుడు జన్మించారు. ఈ జయద్రథునికి కన్యనిచ్చిన అత్తమామలది బ్రాహ్మణ - క్షత్రియుల అనులోమ వివాహం; ఇతని కొడుకు విజయుడు.

విజయునికి ధృతి, ధృతికి ధృతవ్రతుడు, అతనికి సత్యకర్ముడు, సత్యకర్మునికి అధిరథుడు ఉదయించారు. పృథాకుమారి సూర్యవరప్రసాదంవలన జన్మించిన కర్ణుని పెట్టెలో పెట్టి నదిలో విడిచినప్పుడు గంగాజలాలలో దానిని కనుపట్టి ఇంటికి తీసుకొని వెళ్లిన అధిరథుడు ఇతనే.

అనంతరం కర్ణునికి వృషసేనుడు జన్మించాడు.

పురువంశం

పురుమహారాజుకు జనమేజయుడు జన్మించాడు. అతని కొడుకు ప్రాచిన్వంతుడు. ప్రాచిన్వంతునికి ప్రవీరుడు, అతనికి మనస్యుడు, మనస్యునికి భయదుడు, భయదునికి సుద్యుమ్నుడు, సుద్యుమ్యునికి బహుగవుడు, బహుగవునికి సంయాతి, సంయాతికి అహంయాతి, అహంయాతికి రుద్రాశ్వుడు ఉద్భవించారు.

రుద్రాశ్వునికి పదిమంది కొడుకులు — ఋతేయుడు, కృతేయుడు, కక్షేయుడు, స్థండిలేయుడు, ఘృతేయుడు, జలేయుడు, స్థలేయుడు, సంతతేయుడు, ధనేయుడు, వనేయుడు పుట్టారు. వీరందరికీ రౌద్రాశ్వులని పేరు వచ్చింది.

ఋతేయుని కొడుకు రంతినారుడు. అతనికి తంసుడు, అప్రతిరథుడు, ధ్రువుడు జన్మించారు.

అప్రతిరథుని కొడుకు కణ్వుడు. కణ్వసుతుని పేరు మేధాతిథి. ఇతని సంతతివారు కాణ్వాయన బ్రాహ్మణు లయ్యారు.

తంసువుకు అనిలుడు, అనిలునికి దుష్యంతాదులైన నలుగురు పుత్రులూ ప్రభవించారు. దుష్యంతుని భార్య శకుంతల. "ఓయి దుష్యంత మహారాజా! పుత్రులకు తల్లి చర్మయంత్రం వలె కేవలం జన్మాశ్రయస్థానం మాత్రమే. పితృవంశావాపనం వల్లనే వారికి సార్థకత చేకూరుతుంది. ఈ పుత్రుని కన్నతండ్రివి నీవే. శకుంతలను దురవస్థల పాలు చేయకు. రేతస్సంజాతులైన పుత్రులు తమ పితరులను అధోలోకాల నుంచి ఊర్ధ్వలోకాలకు ఉన్నయిస్తారు. తన్వీగర్భ విధాతవు నీవేనని శకుంతల సత్యమే చెప్పింది" అని ఒకప్పుడు దేవవాణి పలికిన వాక్యాలు వీరి గాథను ఆద్యంతమూ జ్ఞాపకం చేస్తాయి.

శకుంతలా దుష్యంతుల సంతానం భరతచక్రవర్తి. ఇతనికి పెక్కుమంది భార్యలున్నారు. కాలక్రమేణ వారికి తొమ్మిది మంది

కొడుకులు పుట్టినా పుత్రులకు తన పోలికలు రాలేదని భరతుడు వారందరినీ నిరాదరించాడు. అతను అనుమానపడుతున్నాడని తెలిసి రాజపత్నులు తమ తమ సంతానాన్ని చంపివేసి గర్భం ధరించాలంటేనే భయపడసాగారు.

కొంతకాలానికి భరతుడు పుత్రసంతానార్థియై మరుద్గణాలను ఉద్దేశించి యజ్ఞం చేశాడు. ఉతథ్యుని భార్య మమతకు బృహస్పతి రేతస్సు వలన జన్మించిన భరద్వాజమహర్షిని అతని సవతి అన్న దీర్ఘతముడు కోపంతో బహిష్కరించినపుడు మరుత్తులు ఆ శిశువును తెచ్చి భరతచక్రవర్తికి ఇచ్చారు. మమతా బృహస్పతులు శిశు పోషణ విషయమై కలహించుకొని నువ్వు భరించమంటే నువ్వు భరించమని ఇద్దరూ విడిచివేసినందున ఆ శిశువుకు భరద్వాజుడని పేరు వచ్చింది. భరతుని కొడుకులందరూ వితథులైనందున భరద్వాజునికి కూడా వితథుడని పేరు వచ్చింది.*

వితథునికి భవన్మన్యుడు, అతనికి బృహత్క్షత్ర మహావీర్య నర గర్గాదిసుతులూ ప్రభవించారు. నరునికి సంకృతి, సంకృతికి రుచిరథి రంతిదేవులూ పుట్టారు.

---

* చూ. "...తతోఽస్య పుత్రజన్మని వితథే పుత్రార్థినో మరుత్సోమయాజినో దీర్ఘతమసా పార్ష్ణ్యపాస్తబృహస్పతివీర్యాదుతథ్యపత్నీ—మమతాసముత్పన్నో భరద్వాజాఖ్యః పుత్రో మరుద్భిర్దత్తః తస్యాపి నామనిర్వచనశ్లోకః పఠ్యతే—

మూఢే! భర ద్వాజమిమం భర ద్వాజం బృహస్పతే!
యతౌ యదుక్త్వా పితరా భరద్వాజ స్తత స్త్వయమ్.

భరద్వాజశ్చ తస్య వితథే పుత్రజన్మని మరుద్భిర్దత్తః తతో వితథసంజ్ఞామవాప. —విష్ణు. 4-19-6, 7.

గర్గుని కొడుకు పేరు శిని. అతని సంతతివా రందరికీ శైనేయులు, శైన్యులు, గార్గ్యులు అని పేర్లు కలిగాయి. వీరందరూ క్షత్రియులైనా బ్రాహ్మణధర్మాన్ని అవలంబించి ద్విజాతీయులయ్యారు.

మహావీర్యుని పుత్రుడు ఉరుక్షయుడు. అతనికి ముగ్గురు కొడుకులు—త్రయ్యారుణి, పుష్కరిణుడు, కపి. వీరిలో కపి బ్రాహ్మణధర్మాన్ని చేపట్టి కపిలుడనే పేరిట ప్రఖ్యాతిని పొందాడు.

బృహత్క్షత్రుని పుత్రుడు సుహోత్రుడు. సుహోత్రుని కొడుకు హస్తి పెద్దవాడై హస్తినాపురాన్ని నిర్మించాడు.

హస్తికి అజామీఢుడు, ద్విమీఢుడు, పురుమీఢుడు జన్మించారు. అజామీఢునికి కణ్వుడు, బృహదిషుడు ఉదయించారు. కణ్వునికి మేధాతిథి, బృహదిషునికి బృహద్వసుడు పుట్టారు. బృహద్వసునికి బృహత్కర్ముడు, అతనికి జయద్రథుడు, జయద్రథునికి విశ్వజితుడు, అతని కొడుకు సేనజితునికి రుచిరాశ్వ కాశ్య దృఢధనుర్వత్సహానువులూ పుట్టారు.

రుచిరాశ్వుని కొడుకు పృథుసేనునికి పారుడు, పారునికి నీపుడు, అతనికి నూరుమంది కొడుకులూ కలిగారు. నీపసుతులలో జ్యేష్ఠుడైన సమరుడు కాంపిల్యదేశానికి రాజు. అతనికి పారుడు, సంపారుడు, సదాశ్వుడు ఉదయించారు. వీరిలో పారునికి పృథుడు, అతని కొడుకు సుకృతికి విభ్రాత్రుడు, విభ్రాత్రునికి అనుహుడూ ఉద్భవించారు.

అనుహుడు వ్యాసమహర్షి కొడుకు శ్రీశుకుని కుమార్తె కీర్తిని వివాహం చేసుకొన్నాడు. వారికి బ్రహ్మదత్తుడు పుట్టాడు. బ్రహ్మదత్తునికి విష్వక్సేనుడు, అతనికి ఉదక్సేనుడు, అతనికి భల్లాటుడు జన్మించారు.

ద్విమీఢుని కొడుకు యవీనరుడు. అతనికి ధృతిమంతుడు, ధృతిమంతునికి సత్యధృతి, సత్యధృతికి దృఢనేమి, దృఢనేమికి సుపా

ర్శ్వుడు, అతనికి సుమతి, సుమతికి సన్నతిమంతుడు, అతనికి కృతుడు జన్మించారు.

కృతుడు హిరణ్యనాభుని వద్ద యోగశాస్త్రాన్ని అధ్యయనం చేసి సామవేదపారంగతుడై ప్రాచ్యసామగుల కోసం ఇరవై నాలుగు సంహితలను వినిర్మించాడు. అతని కొడుకు ఉగ్రాయుధునికి దాయాదులతో కలహం సంభవించి యుద్ధంలో నీపక్షత్రియవంశాన్ని సంపూర్ణంగా నిర్మూలించి వేశాడు. ఆ ఉగ్రాయుధునికి క్షేమ్యుడు, క్షేమ్యునికి సువీరుడు, సువీరునికి నృపంజయుడు, అతనికి బహురథుడు జన్మించారు.

పురువంశంలో జన్మించిన వీరందరికీ పౌరవులని పేరు వచ్చింది.

మగధరాజ వంశం

అజామీఢుని భార్య నీలిని. వారికి నీలుడు జన్మించాడు. నీలునికి శాంతి, అతనికి సుశాంతి, సుశాంతికి పురుజానుడు, పురుజానునికి చక్షుడు, చక్షునికి హర్యశ్వుడు, హర్యశ్వునికి ముద్గల - సృంజయ - బృహదిషు - ప్రవీర - కాంపిల్యులు ఉద్భవించారు. హర్యశ్వుడు వారి తేజోబలాలను చూసి సంతృప్తుడై—"భూమిని సామర్థ్యవంతంగా పరిపాలించడానికి ఈ అయిదుగురూ (పఞ్చ) చాలు (అలమ్)" అని పలికినందున వారికి పాంచాలురని, వారు పరిపాలించిన దేశానికి పాంచాలదేశమనీ పేర్లు కలిగాయి. వీరిలో ముద్గలుని సంతతివారు ద్విజధర్మాన్ని అవలంబించి మౌద్గల్య బ్రాహ్మణు లయ్యారు.

ముద్గలునికి బహ్వాశ్వుడనే కొడుకు కూడా ఉన్నాడు. అతనికి కవలపిల్లలు—దివోదాసుడు, అహల్య పుట్టారు.

అహల్యను శరద్వంతుని కొడుకు గౌతమునికిచ్చి వివాహం చేశారు. వారికి శతానందుడు ఉదయించాడు. శతానందుని కొడుకు

సత్యధృతి ధనుర్వేదాన్ని ప్రయోగోపసంహారాలతో సంపూర్ణంగా అభ్యసించిన మహాబలుడు. అతను దేవవేశ్య ఊర్వశిని చూసి ఆమె సౌందర్యానికి సమ్మోహితుడైనప్పుడు రేతఃపతనమై శరస్తంబప్రదేశంలో ఒక కొడుకు, కూతురు పుట్టారు. మృగయావినోదార్థం అక్కడికి వచ్చిన శంతనుమహారాజు ఆ పిల్లలను చూసి జాలిపడి ఇంటికి తీసుకొని వెళ్లి పెంచి పెద్ద చేశాడు. రాజకృపాసంవర్ధితులైనందున వారికి కృపుడు, కృపి అని ప్రసిద్ధి కలిగింది. కృపి ద్రోణాచార్యుని ధర్మపత్నియై అశ్వత్థామను కన్నది.

దివోదాసుని కొడుకు మిత్రాయువు. అతనికి చ్యవనుడు, చ్యవనునికి సుదాసుడు, సుదాసునికి, సహదేవుడు, సహదేవునికి సోమకుడు, సోమకునికి నూరుగురు సుతులూ జన్మించారు. వారిలో జ్యేష్ఠుడు జన్తుమహారాజు. అందరిలోకీ చిన్నవాడు పృషతుడు. అతనికి ద్రుపదమహారాజు, ద్రుపదునికి ధృష్టద్యుమ్నుడు, అతనికి ధృష్టకేతుడు ఉద్భవించారు.

అజామీఢునికి ఋక్షుడనే పేరుగల కుమారుడు కూడా ఉన్నాడు. అతని కొడుకు సంవరణుడు. అతని కొడుకు కురుమహారాజు పేరిటనే ఉత్తర భారతదేశంలో సుప్రసిద్ధమైన ధర్మక్షేత్రం కురుక్షేత్రం వెలిసింది. అతనికి సుధన్వుడు, జహ్నుడు, పరీక్షిత్తు ఆదిగా పెక్కుమంది సుతులు జన్మించారు.

సుధన్వుని పుత్రుడు సుహోత్రుడు. అతనికి చ్యవనుడు, చ్యవనునికి కృతకుడు, కృతకునికి ఉపరిచరవసువు ఉదయించారు.

వసువుకు ఏడుమంది కొడుకులు—బృహద్రథుడు, ప్రత్యగ్రుడు, కుశాంబుడు, మావేల్లుడు, మత్స్యుడు మొదలైనవారు పుట్టారు. వీరిలో బృహద్రథునికి కుశాగ్రుడు, కుశాగ్రునికి ఋషభుడు, ఋషభునికి పుష్పవంతుడు, పుష్పవంతునికి సత్యధృతి, సత్యధృతికి సుధన్వుడు, సుధన్వునికి జంతుడు జన్మించారు.

కొన్నాళ్లకు బృహద్రథునికి మళ్లీ కొడుకు పుట్టాడు. అతను తల్లి గర్భం నుంచి వెలువడినప్పుడు శరీరం రెండు శకలాలుగా విడివడి ఉన్నది. బృహద్రథుని ఇంటనే ఉన్న జర వాటిని దగ్గరకు చేర్చి ఒకటిగా సంధించింది. అందువల్ల ఆ శిశువుకు జరాసంధుడని పేరు పెట్టారు.

జరాసంధునికి సహదేవుడు, సహదేవునికి సోమాపి, సోమాపికి శ్రుతశ్రవుడు ఉదయించారు. వీరందరూ మగధ దేశానికి రాజులై లోకవిఖ్యాతిని ఆర్జించారు.

కురువంశం

కురుమహారాజు కొడుకు పరీక్షిత్తుకు నలుగురు సుతులు— జనమేజయుడు, శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు ప్రభవించారు. జహ్నునికి సురథుడు, అతనికి విదూరథుడు, విదూరథునికి సార్వభౌముడు, సార్వభౌమునికి జయసేనుడు, జయసేనునికి ఆరావి, అతనికి అయుతాయువు, అయుతాయువుకు అక్రోధనుడు, అక్రోధనునికి దేవాతిథి, ఋక్షుడు మొదలైనవారు, ఋక్షునికి ప్రతీపుడు, ప్రతీపునికి ముగ్గురు కొడుకులు — దేవాపి, శంతనుడు, బాహ్లికుడు జన్మించారు.

ప్రతీపుని జ్యేష్ఠపుత్రుడు దేవాపి బాల్యవయోవస్థా కాలంలోనే వైరాగ్యాన్ని పొంది అరణ్యవాసానికి వెళ్లిపోయాడు. అన్నగారు ఇంట లేనప్పుడు రాజ్యం అరాజకం కాకుండా అతని తమ్ముడు శంతనుడు అధికారాన్ని స్వీకరించి పరిపాలించడం మొదలు పెట్టాడు.

శంతనుని మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ అనేక ప్రశస్తి గీతాలు వ్యాప్తిలో ఉన్నాయి. అతను ఎంత వృద్ధులనైనా, ఎంత శిథిల దేహులనయినా, చేతులతో ఒక్కసారి స్పృశిస్తేనే వ్యాధులు ఉపశమించి వారికి నవయౌవనం సంప్రాపించేది. తనువుకు శాంతిని

చేకూర్చే సత్ప్రభావం వలన అతనికి శంతనుడనే పేరు సార్థకంగా అన్వయించింది.

శంతనుమహారాజు భూమండలాన్ని పరిపాలిస్తున్న రోజులలో ఒకప్పుడు దేవతలు పన్నెండేళ్ల పాటు రాజ్యంలో వర్షాలు లేకుండా చేశారు. రాష్ట్రవినాశం జరిగి దేశం ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని గ్రహించి రాజు బ్రాహ్మణులందరినీ సమావేశపరచి, "దేశంలో వర్షాలు పడకపోవటానికి నేను కావించిన అపరాధ మేమిటో నిర్ణయించండి" అని కోరాడు. బ్రాహ్మణులు కార్యాకార్య విచారణం చేసి, కుటుంబంలో అన్నకన్నా ముందు తమ్ముడు పెండ్లి చేసికొన్నట్లు — అగ్రసోదరుడు జీవించి ఉండగా తమ్ముడు రాజ్య పాలనకు రావడం అనుచితమని నిర్ణయించారు. "నీ అగ్రజుడు అధర్మపరుడై దేవతల ఆగ్రహానికి గురికానంతవరకు ప్రభుత్వం అత నిదే. నీవు పదవినుంచి వైదొలగడం కంటె మార్గాంతరం లేదు" అని తీర్పు చెప్పారు.

బ్రాహ్మణపరిషత్తు నిర్ణయాన్ని శంతనుని మంత్రి అశ్మసారి విని, తన రాజ్యంలో ఉన్న వేదబాహ్యులలో మంచి వక్తలను చేర దీసి వారందరినీ అరణ్యంలో నివసిస్తున్న దేవాపి దగ్గరకు పంపిం చాడు. అతని ఆదేశానుసారం వారు దేవాపికి తమ పాండిత్యంపై నమ్మకం కలిగించి, వేదార్థానికి విరుద్ధమైన వక్రభాష్యాలు చెబుతూ, వేదాలను నిందస్తూ అతని బుద్ధిని కలుషితం చేశారు. ఋజుస్వభావుడైన దేవాపి వారి మాటలను నమ్మి, వేదవిరుద్ధ మార్గం లోనికి ప్రవేశించాడు.

ఈలోగా శంతనుడు బ్రాహ్మణుల ఉపదేశాన్ని ఆత్మవిమర్శా పూర్వకంగా అనుశీలించి, తన దోషానికి ప్రాయశ్చిత్తంగా అన్న గారికి ఎలాగైనా రాజ్యాన్ని అప్పజెప్పాలని నిశ్చయించుకొన్నాడు.

ముందుగా బ్రాహ్మణులను నియోగించి, తాను కూడా వారి వెనుకనే అరణ్యంలోకి వెళ్లాడు.

బ్రాహ్మణులు దేవాపిని కలుసుకొని రాజనిర్ణయాన్ని తెలియజేశారు. అతను వారి మాటలను పెడచెవిని బెట్టి వేదార్థాన్ని గురించి వారితో వృథావాదం పెట్టుకొన్నాడు. ధర్మానికి విరుద్ధమైన కుయుక్తులను ప్రమాణవాక్యాలుగా నిరూపించి వేదప్రామాణాన్ని అపహాస్యం చేశాడు. అతని వాదధోరణికి బ్రాహ్మణులు విస్తుపోయి, "ఈ దేవాపి వేదదూషకుడై పూర్వౌన్నత్యాన్ని కోల్పోయాడు. ఇతని విషయమై నీ విక నిశ్చింతగా ఉండవచ్చు. నీ యందు ఏ దోషమూ లేదు కనుక దేవతలు ప్రసన్నులై వరాన్ని ప్రసాదిస్తారు" అని రాజుతో అన్నారు.

బాహ్లీకునికి సోమదత్తుడు, సోమదత్తునికి భూరి భూరిశ్రవశ్శల్యులు జన్మించారు. శంతనునికి అమరనది గంగాగర్భంలో సర్వశాస్త్ర విశారదుడైన భీష్ముడు; దాశరాజపుత్రిక సత్యవతి యందు చిత్రాంగద విచిత్రవీర్యులు ప్రాదుర్భవించారు. చిత్రాంగదుడు బాలుడై ఉండగా గంధర్వరాజు చిత్రాంగదునితో వైరమేర్పడి యుద్ధంలో మరణించాడు. విచిత్రవీర్యుడు కాశీరాజ పుత్రికలైన అంబ, అంబాలికలను వివాహం చేసుకొని, మితిమీరిన సుఖభోగాలకు అలవాటుపడి, అచిరకాలంలోనే శక్తిహీనుడై రాజయక్ష్మవల్ల పంచత్వాన్ని పొందాడు. కురువంశం పరిసమాప్తిని చెందకుండా సత్యవతీ నియోగానుసారం—తల్లి మాటను జవదాటని నా కుమారుడు కృష్ణద్వైపాయనుడు విచిత్రవీర్యుని భార్యలయందు ధృతరాష్ట్ర పాండురాజులను, వారింటి దాసియందు విదురుని కన్నాడు. వీరిలో ధృతరాష్ట్రునికి గాంధారి యందు దుర్యోధన దుశ్శాసనాదులైన నూరుగురు కొడుకులు పుట్టారు. అరణ్యంలో వేటకు వెళ్లిన పాండురాజుకు మృగశాపం వలన ప్రజోత్పాదనశక్తి లేకపోయింది. అప్పుడు

అతని భార్యలలో కుంతీదేవికి యమధర్మరాజువలన యుధిష్ఠిరుడు, వాయువువలన భీమసేనుడు, ఇంద్రునివల్ల అర్జునుడు; మాద్రికి అశ్వినులవల్ల నకుల సహదేవులు సముద్భవించారు.

పాండవుల ధర్మపత్ని ద్రౌపది. ఆమెయందు యుధిష్ఠిరునికి ప్రతివింధ్యుడు, భీమునికి శ్రుతసోముడు, అర్జునునికి శ్రుతకీర్తి, నకులునికి శతానీకుడు, సహదేవునికి శ్రుతకర్ముడు జన్మించారు. వీరేకాక యుధిష్ఠిరునికి యౌధేయి యందు దేవకుడు, భీమసేనునికి హిడింబ యందు ఘటోత్కచుడు, కాశియందు సర్వత్రగుడు, సహదేవునికి విజయయందు సుహోత్రుడు, నకులునికి కరేణుమతి యందు నిరమిత్రుడు పుట్టారు. అర్జునునికి నాగకన్య ఉలూపి యందు ఇరావంతుడు, మణిపురాధీశుని పుత్రిక చిత్రాంగద యందు బభ్రువాహనుడు, సుభద్ర యందు వీరాగ్రేసరుడైన అభిమన్యుడు ఉదయించారు.

అభిమన్యుని భార్య ఉత్తర. కురుక్షేత్రయుద్ధంలో అభిమన్యుడు మరణించిన తర్వాత కౌరవులు పరాజయోన్ముఖులు కానున్న తరుణంలో ద్రోణసుతుడు అశ్వత్థామ పాండవసైన్యాలపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ మహాస్త్రసముద్గతకృశానుజ్వాలలకు ఉత్తరాగర్భం భస్మీకృతమైపోయింది. అప్పుడు సకలసురాసురవందితపాదారవిందుడు, ఆత్మేచ్ఛాకారణమానుషవిగ్రహుడు, పరమకారుణిక స్వభావుడు, భక్తాభీష్టఫలప్రదాత శ్రీకృష్ణపరమాత్మ కరుణించి అభిమన్యుని సంతానాన్ని పునర్జీవింపజేశాడు. ఉత్తరకు పరీక్షిత్తు జన్మించాడు. ఇప్పుడు భూమండలం అతని పరిపాలనలోనే పరిఢవిల్లుతున్నది.

వీరందరూ కాక రానున్న రోజులలో ధరణీపరిపాలకులై లోకవిఖ్యాతిని పొందనున్న మరికొంతమంది మహాపురుషుల చరిత్రలు కూడా అభివర్ణనీయాలే.

భవిష్యరాజవంశాలు

సాంప్రతమహీనాయకులలో పరీక్షిన్మహారాజుకు నలుగురు కొడుకులు—జనమేజయుడు, శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు జన్మిస్తారు. వీరిలో జనమేజయుని కొడుకు శతానీకుడు యాజ్ఞవల్క్యుని సన్నిధిలో వేదశాస్త్రాలను, కృపాచార్యుని వద్ద అస్త్రవిద్యలను అధ్యయనం చేసి ఇంద్రియవిషయాల పట్ల విరక్తుడై శౌనకుని ఉపదేశం వల్ల ఆత్మజ్ఞానాన్ని పొంది పరమోత్తమమైన నిర్వాణపదాన్ని అధిగమిస్తాడు.

శతానీకునికి అశ్వమేధదత్తుడు, అతనికి అధిసీమకృష్ణుడు ఉదయిస్తారు. అధిసీమకృష్ణుని సుతుడు నిచక్రుడు హస్తినాపురం గంగానదీ జలాలలో మునిగినప్పుడు రాజధానిని కౌశాంబికి మార్చి దేశాన్ని సర్వ సమృద్ధంగా పరిపాలిస్తాడు. నిచక్రునికి ఉష్ణుడు, ఉష్ణునికి చిత్రరథుడు, చిత్రరథునికి శుచిరథుడు, శుచిరథునికి వృష్ణిమంతుడు, వృష్ణిమంతునికి సుషేణుడు, సుషేణునికి సునీథుడు, సునీథునికి ఋచుడు, ఋచునికి నృచక్షుడు, నృచక్షునికి సుఖాబలుడు, సుఖాబలునికి పరిప్లవుడు, పరిప్లవునికి సునయుడు, సునయునికి మేధావి, మేధావికి నృపంజయుడు, నృపంజయునికి మృదుడు, మృదునికి తిగ్మ్నుడు, తిగ్మ్నునికి బృహద్రథుడు, బృహద్రథునికి మరొక శతానీకుడు ప్రభవించి పృథ్వీపతులై వెలుగొందుతారు.

శతానీకునికి ఉదయనుడు, ఉదయనునికి అహీనరుడు, అహీనరునికి ఖండపాణి, ఖండపాణికి నిరమిత్రుడు, అతనికి క్షేమకుడు ప్రభవిస్తారు.

ఈ విధంగా లోకంలో బ్రాహ్మణ - క్షత్రియ కులాలకు ఆలవాలమై రాజర్షి మండలం చేత పవిత్రీకరింపబడిన మహారాజవంశం కలియుగంలో క్షేమకునితో పరిసమాప్త మౌతుంది.

ఇక్ష్వాకు వంశం

ఇక్ష్వాకు వంశీయుడైన బృహద్బలునికి బృహత్క్షణుడు ప్రాదుర్భవిస్తాడు. అతనికి ఉరుక్షేపుడు, ఉరుక్షేపునికి వత్సుడు, వత్సునికి వత్సవ్యూహుడు, అతనికి ప్రతివ్యోముడు, ప్రతివ్యోమునికి దివాకరుడు, దివాకరునికి సహదేవుడు, సహదేవునికి బృహదశ్వుడు, బృహదశ్వునికి భానురథుడు, భానురథునికి సుప్రతీహుడు, సుప్రతీహునికి మరుదేవుడు, మరుదేవునికి సునక్షత్రుడు, అతనికి కిన్నరుడు, కిన్నరునికి అంతరిక్షుడు, అంతరిక్షునికి సువర్ణుడు, అతనికి అమిత్రజితుడు, అమిత్రజితునికి బృహద్రాజుడు, బృహద్రాజునికి ధర్ముడు, ధర్మునికి సుతుడై కృతంజయుడు, కృతంజయునికి రణంజయుడు, రణంజయునికి సంజయుడు, సంజయునికి శాక్యుడు, శాక్యునికి శుద్ధోదనుడు, శుద్ధోదనునికి రాహులుడు, అతనికి ప్రసేనజితుడు, అతనికి క్షుద్రకుడు, క్షుద్రకునికి కుండకుడు, కుండకునికి సురథుడు, సురథునికి పుత్రుడై సుమిత్రుడు ఉదయిస్తారు.

ఈ తీరున ఇక్ష్వాకు వంశంలో బృహద్బలునికి అనంతరీయులై జన్మించిన రాజన్యోత్తముల పరంపర సుమిత్రునితో ముగింపునకు వస్తుంది. అతనితోనే కలియుగం పరిసమాప్త మౌతుంది.

మాగధాన్వయం

బార్హద్రథ మగధరాజులలో చాలా మంది బలవిక్రమోపేతులైన మహాయోధు లున్నారు. వారందరిలో జరాసంధమహారాజు సుప్రసిద్ధుడు.

జరాసంధునికి సహదేవుడు, అతనికి సోమాపి జన్మించారు. ఈ సోమాపికి శ్రుతవంతుడు ఉదయిస్తాడు. అతనికి అయుతాయువు, అయుతాయువుకు నిరమిత్రుడు, నిరమిత్రునికి సుక్షత్రుడు, అతనికి బృహత్కర్ముడు, బృహత్కర్మునికి సేనజితుడు, సేనజితునికి శ్రుతం

జయుడు, శ్రుతంజయునికి విప్రుడు, విప్రునికి శుచి, శుచికి క్షేమ్యుడు, క్షేమ్యునికి సువ్రతుడు, సువ్రతునికి ధర్ముడు, ధర్మునికి సుశ్రముడు, సుశ్రమునికి దృఢసేనుడు, అతనికి సుమతి, సుమతికి సుబలుడు, సుబలునికి సునీతుడు, సునీతునికి సత్యజితుడు, సత్యజితునికి విశ్వ జితుడు, విశ్వజితునికి రిపుంజయుడు ఉద్భవిస్తారు.

ఈ విధంగా బృహద్బలుని సంతతివారు భూమండలాన్ని వేయి సంవత్సరాలు పరిపాలిస్తారు.

ప్రద్యోత రాజవంశం

బృహద్రథుని వంశంలో చిట్టచివరివాడైన రిపుంజయుని కొలువులో సునికుడనే పేరుగల విశ్వాసఘాతకుడు అమాత్యునిగా ఉంటూ రాజద్రోహానికి పాల్పడతాడు. రిపుంజయుని హతమార్చి తన కొడుకు ప్రద్యోతుని సింహాసనం ఎక్కిస్తాడు. ప్రద్యోతునికి విశాఖ యూపుడు, అతనికి జనకుడు, జనకునికి నందివర్ధనుడు జన్మించి రాజు లవుతారు. ఈ రీతిని ప్రద్యోతాన్వయం భూమండలాన్ని నూట ముప్పైఎనిమిది సంవత్సరాలు సంరక్షిస్తుంది.

శిశునాగ వంశం

అనంతరం శిశునాగుడు రాజై ధరణిని పరిపాలిస్తాడు. అతని కొడుకు కాకవర్ణుడు, పౌత్రుడు క్షేమధర్ముడు, ప్రపౌత్రుడు క్షత్రౌజసుడు.

క్షత్రౌజసునికి విధ్మసారుడు, అతనికి అజాతశత్రుడు, అజాత శత్రునికి దర్భకుడు, దర్భకునికి ఉదయాశ్వుడు, అతనికి నందివర్ధనుడు, నందివర్ధనునికి మహానంది పుత్రులై ప్రసిద్ధిని పొందుతారు.

శిశునాగుని సంతతివారికి శైశునాగులని పేరు. వీరు భూతలాన్ని మూడువందల అరవై రెండు సంవత్సరాలు పరిపాలిస్తారు.

నందరాజ వంశం

శైశునాగ మహానందికి శూద్రస్త్రీ గర్భంలో అతిలుబ్ధుడైన మహాపద్మనందుడు ప్రభవించి ద్వితీయ పరశురాముని వలె గోత్రారి త్రాణానికై ధరణిని నిఃక్షత్రియం కావించి, సమస్తరాజ్యాన్ని తానొక్కడూ ఏకచ్ఛత్రితంగా పరిపాలిస్తాడు. అతని అనంతరం క్రమక్రమంగా రాజ్యాధికారం శూద్రకరగతమై విరాజిల్లుతుంది.

మహాపద్మునికి శ్యామలుడు, ఆ తర్వాత ఏడుగురు కొడుకులూ ప్రభవించి భూమిని నూరు సంవత్సరాలు పరిపాలిస్తారు.

మౌర్యవంశం

నందరాజుల తర్వాత పృథ్వీపాలనం మౌర్యరాజుల వశమౌతుంది. కౌటిల్యుడు చంద్రగుప్తుని సింహాసనం ఎక్కించి ఆధిపత్యాన్ని కట్టబెడతాడు. చంద్రగుప్తునికి బిందుసారుడు, అతనికి అశోకవర్ధనుడు, అతనికి సుయశుడు, సుయశునికి దశరథుడు, దశరథునికి సంగతుడు, సంగతునికి శాలిశుకుడు, శాలిశుకునికి సోమశర్మడు, అతనికి శశధర్మడు, శశధర్మనికి బృహద్రథుడూ పుట్టి భూమండలాన్ని నూటముప్పైఏడు సంవత్సరాలు పరిపాలిస్తారు.

శుంగవంశం

మౌర్యరాజవంశంలో కడపటివాడైన బృహద్రథుని సైన్యాధిపతి పుష్పమిత్రుడు రాజును వధించి అధికారాన్ని హస్తగతం చేసుకొంటాడు. అతని కొడుకు అగ్నిమిత్రుడు అతని అనంతరం రాజ్యానికి వస్తాడు. అగ్నిమిత్రునికి సుజ్యేష్ఠుడు, సుజ్యేష్ఠునికి వసుమిత్రుడు, వసుమిత్రునికి ఆర్ద్రికుడు, ఆర్ద్రికునికి పుళిందకుడు, అతనికి ఘోషవసుడు, ఘోషవసునికి వజ్రమిత్రుడు, వజ్రమిత్రునికి భాగవతుడు, అతనికి దేవభూతి ప్రభవిస్తారు.

పుష్యమిత్రుని సంతతివారందరికీ శుంగులని వ్యవహారం. వీరు నూటపన్నెండు సంవత్సరాలు రాజ్యపాలనలో ఉంటారు.

కాణ్వ వంశం

శుంగరాజులలో తుదికాలానికి చెందిన దేవభూతి వ్యసనపరుడై పతనం చెందాక కాణ్వవంశీయుడైన అతని మంత్రి వసుదేవుడు రాజును సంహరించి అవనీరాజ్యాధిపత్యాన్ని ప్రకటించుకొంటాడు.

వసుదేవుని కొడుకు భూమిపుత్రుడు. అతనికి నారాయణుడు, నారాయణునికి సుశర్ముడు జన్మించి నలభై అయిదేండ్లు భూమిని పరిరక్షిస్తారు.

ఆంధ్ర వంశం

కాణ్వరాజులలో అంతిముడైన సుశర్ముడిని అతని భృత్యులలో ఆంధ్రజాతికి చెందిన శిప్రకుడు హతమార్చి రాజ్యాన్ని ఆక్రమిస్తాడు. అతని వంశానికి ఆంధ్రభృత్యవంశమని నామధేయం కలుగుతుంది.

శిప్రకుని అనంతరం అతని సోదరుడు కృష్ణుడు, ఆ తర్వాత కృష్ణుని కొడుకు శ్రీశాతకర్ణి భూమిని పరిపాలిస్తారు. శాతకర్ణికి, పూర్ణోత్సంగుడు, అతనికి ద్వితీయ శాతకర్ణి, అతనికి లంబోదరుడు, లంబోదరునికి వివిలకుడు, అతనికి మేఘస్వాతి, మేఘస్వాతికి పటుమంతుడు, పటుమంతునికి అరిష్టకర్ముడు, అతనికి హాలుడు, హాలునికి పుత్తలకుడు, అతనికి ప్రవిల్లసేనుడు, అతనికి సుందరుడనే పేరుగల స్వల్పాయుష్కుడైన శాతకర్ణి, అతనికి చకోర శాతకర్ణి సుతులై విఖ్యాతిని పొందుతారు.

చకోరశాతకర్ణి సుతుడు శివస్వాతి. అతనికి గోమతీపుత్రుడు, గోమతీపుత్రునికి పులిమానుడు, పులిమానునికి శివశ్రీ శాతకర్ణి,

అతనికి శివస్కంధుడు, శివస్కంధునికి యజ్ఞశ్రీ, అతనికి విజయుడు, విజయునికి చంద్రశ్రీ, చంద్రశ్రీకి పులోమార్చిషుడు ఉదయిస్తారు.

ఈ విధంగా ముప్పైమంది ఆంధ్రభృత్యులు నాలుగువందల యాభై సంవత్సరాల కాలంపాటు రాజ్యభోగాలను అనుభవించి చిరయశోభాజనులై తేజరిల్లుతారు.

అన్యరాజవంశాలు

ఆ తర్వాత భూమండలాన్ని అనేక రాజవంశాలు పరిపాలిస్తాయి. ఏడుగురు ఆభీరులు, పదిమంది గర్దభిలులు, పదహారుమంది శకరాజులు, ఎనిమిదిమంది యవనులు, పధ్నాలుగురు తుషారులు, పదముగ్గురు ముండులు, పదకొండుమంది మౌనులు — మొత్తం డెబ్బైతొమ్మిదిమంది రాజులు పదమూడు వందల తొంభై సంవత్సరాలు; ఆ తర్వాత మూడు శతాబ్దాల కాలం పదకొండుమంది పౌరరాజులు; వారందరూ నిహతులైనాక వింధ్యశక్తి నాయకత్వంలో కైలకిల యవనులూ భూపరిపాలకు లవుతారు.

వింధ్యశక్తి కుమారుడు పురంజయుడు. అతని కొడుకు రామచంద్రుడు. అతనికి అధర్ముడు, అధర్మునికి ఆరుగురు కొడుకులు — వరాంగుడు, కృతనందనుడు, సుధీనంది, నందియశుడు, శిశుకుడు, ప్రవీరుడు జన్మిస్తారు. వీరందరి పాలనకాలం మొత్తం నూట ఆరు సంవత్సరాలు.

కైలకిల యవనుల తర్వాత వారి సంతతివారు పదమూడు తరాలు, ఆ తర్వాత మూడు బాహ్లీక తరాలు, అనంతరం పుష్పమిత్రుడు, పద్మమిత్రుడు మొదలైనవారు త్రయోదశ తరాలు, మేకలదేశాధిపతులు పది తరాలు, సప్తకోసలదేశాలకు రాజులు తొమ్మిదిమంది, తొమ్మండుగురు నిషధదేశపు రాజులూ పరిఢవిల్లుతారు.

మగధదేశంలో విశ్వస్ఫటికుడనే పేరుగల పురుషుని వల్ల అనేక వర్ణాలు ఉత్పత్తిల్లి, అతని సాహాయ్యంతో కైవర్త - కటు - పుళిందజాతుల వారు, బ్రాహ్మణ్యం కలిసి క్షత్రియుల స్థానంలో రాజ్యాలను స్థాపిస్తారు.

పద్మావతి, కాంతిపురి, మథురలను నవనాగులు పరిపాలిస్తారు. మగధదేశపు గుప్తరాజులు గంగానదీతీరాన ప్రయాగవరకూ గల భూభాగానికి అధిపత్యాన్ని వహిస్తారు.

కోసల, ఓఢ్ర, పుండ్రక, తామ్రలిప్తల సముద్రతీరప్రాంతాన్ని దేవరక్షితుడనే రాజు సంరక్షిస్తాడు. కళింగ, మాహిషికాలు, మహేంద్ర పర్వతభూములు గుహుల పాలనలో ఉంటాయి. నిషధ - నైమిషిక - కాలతోయ దేశాల జనపదాలు మణిధారవంశీయుల ఏలుబడిలోనూ, మూషికజనపదాలలో స్త్రీల రాజ్యంలో ఉన్న ప్రాంతాలు కనకాహ్వాయుల రక్షణలోనూ ప్రవర్తిల్లుతాయి.

సౌరాష్ట్రం, అవంతి, శూరసేనం, అర్బుదం, మరుభూమి ప్రాంతాలను వ్రాత్యులు, ఆభీరులు, శూద్రులు ఆక్రమిస్తారు. సింధు నదీ తటాన ఉన్న దార్వీకం, చంద్రభాగ, కాశ్మీరాలను మ్లేచ్ఛాదులైన వ్రాత్యులు ఆవాసంగా చేసికొని పరిపాలిస్తారు.

ఈ విధంగా తుల్యకాలీనులైన సూర్య చంద్ర వంశాల రాజులు భూమండలాన్ని కొంత కొంత కాలం పరిపాలించి రాజ భోగాలను యథేచ్ఛారాజ్యంగా అనుభవించి కాలగర్భంలో కలిసి పోతారు.

రానున్న రోజులలో ప్రజాజీవితాన్ని ప్రభావితం చేయ బోతున్న ఈ రాజులందరూ సచ్ఛీలురూ, ఉదారస్వభావులూ కారు. స్వార్థగుణం మితిమీరి అధర్మవర్తనులూ, అసత్యాలాపాలతో ప్రజలను అణిచిపెట్టి నిరంకుశంగా పరిపాలించే వీరందరికీ ప్రసాదగుణం

తక్కువ; శక్తికి మించిన కోపావేశాలూ, అధికారదర్పమూ ఎక్కువ. బలహీనుల కష్టార్జితాన్ని కొల్లగొట్టి, తమ సుఖాలకోసం ప్రాకులాడే ఈ దురాత్ములు అవసరం వస్తే స్త్రీలను, వృద్ధులను, చివరికి నోరు లేని పసిపిల్లల నైనా చంపడానికి వెనుదీయరు. అనుభవించడానికి ఆయుర్దాయం లేకపోయినా వీరికి ఆశ మాత్రం ఆకాశమంత ఉంటుంది. దైవభీతి, పాపభీతి లేకుండా విచ్చలవిడిగా ప్రవర్తించి ఇట్టే పైకివచ్చి అంతలోనే కూలిపోయే జీవితాలు వీళ్లవి: అల్పసారాలు, ఉదితాస్తమితప్రాయాలు.

పాలకుల గతి ఇట్లా ఉండగా ఇక పాలితుల వర్తనం ఇంత కన్నా అధోగతికి దిగజారుతుంది. వీరితో విమిశ్రితులై జనపదాల లోని వారందరూ రాజాశ్రయం కోసం పడరాని పాట్లుపడి ప్రభుశీల వర్తులై, నెమ్మది నెమ్మదిగా రాజులను తొలగించి అధికారాన్ని చేజిక్కించుకొంటారు. వారి రాజ్యంలో ఆశ్రయసంపాదనం చేత కాక కిల్బిషాలకు దూరంగా వెళ్లిపోయిన విశుద్ధవర్తనులూ, విమల చరితులూ ఐన సజ్జనులకు నిలువ నీడ లేకుండా పోతుంది. సమాజంలో దైవభక్తి, ధర్మనిష్ఠ, పెద్దలపట్ల గౌరవాదరాలు విలోపించి ధర్మార్థాల సంఘర్షణలో అర్థానిది పైచేయి అవుతుంది.

ఈ విధంగా జగత్ప్రళయహేతువులైన దుష్కర్మలు వ్యాప్తి చెందాక ధనవంతులకు విశేషప్రాబల్యం కలుగుతుంది. అర్థమే అభిజనహేతువు, ధనమే అశేషధర్మహేతువు, కన్నుగానని కామమే దాంపత్యబంధహేతువు అని విశ్వసించి ప్రజలు ధనార్జనపరులై ధర్మాన్ని విసర్జిస్తారు. కాలపరిస్థితులుమారి రత్నతామ్రభాజనమైతేనే భూమి, బ్రహ్మసూత్రం తగిలించుకొంటే బ్రాహ్మణుడు, వేషంమార్చిన వాడల్లా వేదాంతి అనిపించుకొంటారు. అన్యాయం చెయ్యనిదే బ్రతకడం సాధ్యం కాదన్న అపవిశ్వాసం సర్వసాధారణ మౌతుంది. ఒక

రికి సహాయం చేయవలసివస్తే అది ఇతరుల చేతకానితనమని గర్వంతో వ్యవహరిస్తారు. అహంభావపు పెడమాటలూ, బూకరింతల భయగర్భోచ్చారణం పాండిత్యలక్షణమై అసంవిదులు విర్రవీగుతారు. దానం చెయ్యడమే ధర్మనిర్వహణమని, ఆఢ్యతే సాధుత్వమని ప్రచారంలోకి వస్తుంది. స్నానం చెయ్యడమే విశుద్ధిహేతువు, స్వీకరణమే వివాహహేతువు, వేషధారణమే పాత్రతకు నిదర్శనం, ఏదో ఒక దూరక్షేత్రంలో ఉన్న ఉదకమే తీర్థం—అని ఈ తీరున అనేక దోషాకులితమై పాపపంకిలమైన భూమండలంలో బలవంతుడిదే రాజ్యంగా పరిణమిస్తుంది. రాజులు తమ ఇష్టాపూర్తి కోసం ఇష్టం వచ్చినట్లు విధించిన పన్నులను చెల్లించలేక ప్రజలు జనావాసాలకు దూరంగా గిరికందరాలకు పారిపోయి అక్కడ తల దాచుకొంటారు. అక్కడ వారికి మధు శాకమూల ఫలపత్ర పుష్పాదులే పంచభక్ష్య పరమాన్నాలు, తరువల్కలాలే పట్టుపుట్టాలూ అవుతాయి. శీత వాతాతపాలూ అతివృష్ట్యనావృష్టులకు లోనయి అష్టకష్టాలు పడతారు. ఈ అల్పాయుష్కులకు అత్యధికాయుర్దాయం ఇరవైమూడు సంవత్సరా లుంటుంది. ఇలా సర్వేసర్వత్ర క్షీణతను చెందుతుండగా జగత్ప్రళయకారకమైన కలియుగాంతం సమాసన్నమౌతుంది.

కల్క్యవతారం

ఈ విధంగా లోకంలో శ్రౌతస్మార్త ధర్మాలకు విప్లవం సంభవించి క్షీణప్రాయ మవుతున్న ఆ చివరి రోజులలో సకల చరాచర జగత్ సృష్టి కేళీరతుడు, ఆదిమయుడు, అంతమయుడు, సర్వమయుడు, బ్రహ్మమయుడు, ఆత్మస్వరూపుడు, సర్వాంతరిత తేజోనిలయుడు అయిన శ్రీ వాసుదేవ పరబ్రహ్మ స్వరూపుని తేజోంశ కల్కిరూపాన్ని ధరించి సంభళగ్రామంలోని ప్రధాన బ్రాహ్మణుడైన శ్రీ విష్ణుయశుని గృహంలో సర్వాంగశోభితంగా అవతరించి మ్లేచ్ఛులు,

దస్యులు, దుష్టాచరణచిత్తులు, నీచాత్ము లందరినీ తన మాహాత్మ్య శక్తితో క్షయింపజేసి మళ్లీ ధర్మనిర్మాణాన్ని కావిస్తుంది. పూర్ణ కలియుగాంత కాలానికి ప్రజలందరూ ధర్మబద్ధమైన జీవితానికి అభిముఖులై, అమలస్ఫటిక విశుద్ధమతులైన సాధువర్తనులతో జనపదాలు కళ కళ లాడతాయి. ఆ పుణ్యాత్ములు, వారి సంతతి వారూ కృతయుగధర్మాన్ని అనుసరిస్తారు. విత్తులో నుంచి మహా వృక్షం మొలకెత్తినట్లు ఆ మహాపురుషులే బీజావాపనగా మానవ లోకం మంగళధామమై విభ్రాజిల్లుతుంది. ఆ తర్వాత చంద్రుడు, సూర్యుడు, తిష్యబృహస్పతులు ఏకరాశిలోనికి ప్రవేశించిన పుణ్య కాలంలో కృతయుగం అవతరిస్తుంది.

అతీతానాగత వర్తమానాలలోని రాజవంశాల సంక్షిప్త కథనం ఇది. ఒక్కొక్క చరితాన్ని సవిస్తరంగా చెప్పుకొందా మంటే శతాబ్దాలు కూడా చాలవు.

కలియుగం

పరీక్షిత్తు జన్మించిన కాలం మొదలుకొని నందుని పట్టాభిషేక పర్యంతం వేయిన్నీపదిహేను సంవత్సరాలు గతిస్తాయని తెలుసు కోవాలి. సప్తఋషి మండలంలో పులహ క్రతు నక్షత్రాలు ప్రోజ్జ్వ లితంగా ప్రకాశించినప్పుడు వాటికి దక్షిణ మధ్య నక్షత్రం ఏదైతే అందులో సప్తమహర్షులు మానవకాలమానం ప్రకారం నూరు సంవత్సరాలు ఉంటారు. పరీక్షిత్తు జననకాలం నాడు వారు మఖా నక్షత్రంలో ఉండగా పన్నెండువందల దివ్యాబ్దాల కలియుగం అవత రించింది. శ్రీమహావిష్ణువు మానుష విగ్రహాన్ని ధరించి భూమండ లాన్ని తన పాదకమలాలతో పవిత్రీకరించినన్నాళ్లూ ప్రవేశింప లేక పోయిన కలి ఆయన వైకుంఠానికి అభినిష్క్రమించిన నాడు అడుగు పెట్టింది. ఆ సనాతనుడు శరీరత్యాగం చేసిన వెంటనే లోకమంతటా

గోచరింపసాగిన దుర్నిమిత్తాలను చూసి ధర్మనందనుడు తానూ వెళ్లిపోవలసిన కాలం ఆసన్నమైనదని గ్రహించాడు. పదవీత్యాగం చేసి రాజ్యాన్ని పరీక్షిత్తుకు అప్పజెప్పాడు. అక్కడితో ద్వాపర యుగం ముగిసి కలియుగారంభం ప్రకటితమయింది.

సప్తఋషులు పూర్వాషాఢ లోనికి ప్రవేశించిననాడు నందునికి పట్టాభిషేకం జరుగుతుంది. నందుని కాలం నుంచి కలిపురుషునికి అమేయబలవృద్ధి చేకూరుతుంది.

శ్రీకృష్ణుడు భూమండలాన్ని విడిచిపెట్టిన నాటి నుంచి కలియుగం మానవప్రమాణంలో మూడు లక్షల అరవై వేల సంవత్సరాలు ఉంటుంది. పన్నెండువందల దివ్యాబ్దాలు గతించిన తర్వాత మళ్లీ కృతయుగధర్మం అవతరిస్తుంది.

ఈ విధంగా ఒక్కొక్క యుగంలోనూ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలవారు వేలకొలదిగా అవతరించి దివంగతులైనారు. వీరూ, వీరి సంతతివారినీ విడి విడిగా స్మరించాలంటే కొన్ని వందల సంవత్సరాలైనా సరిపోవు. ఈ అసంఖ్యాత ప్రజానీకంలో దీర్ఘాయుష్మంతులైన కొందరు సుకృతాత్ములు కూడా ఉన్నారు. పురువంశంలోని దేవాపి, ఇక్ష్వాకు వంశీయుడైన మరుడు యోగబలం వల్ల చిరంజీవులై కలాపగ్రామంలో చతుర్యుగాంతంవరకూ జీవిస్తారు. కలియుగాంతంలో కృతయుగారంభకాలంలో వీరు అనేక క్షత్రియ వంశాలకు మూలపురుషులై ధర్మపరివృద్ధికి తోడ్పడతారు. మరు దేవాపులవలెనే మరికొంతమంది మనుపుత్రులు కూడా దీర్ఘాయువును పొంది లోకంలో ధర్మరక్షణకు కృషి చేస్తారు.

ఈ విధంగా క్షితిమండలాధిపత్యాన్ని పొందిన రాజులందరూ కర్మవశాన అహంకార మమకారాల మోహాంధకారంలో పడి స్వార్థపూరితచేతస్కులవుతారు. అనిత్యమైన ఈ దేహంతో సాధింప

గల భోగానుభవం ఎన్నాళ్లుంటుంది? అని ఆలోచింపకపోగా, "ఈ భూమి నాది; నా పుత్రులది, నా వంశానిది" అన్న వృథా భ్రాంతికి లోనై అంతంలో కూడా చింతాక్రాంతి తోనే ప్రాణాలను కోల్పోతారు. తమకు పూర్వం ఎన్ని తరాలు పుట్టి గతించాయి; తమ తర్వాత ఎన్ని వందల తరాలు రానున్నాయి? అని చింతింపక, తమ తోనే సృష్టి సర్వస్వం అన్నట్లు ప్రవర్తించే ఈ మూఢాత్ములను చూసి వసుంధర పరిహాసం చేస్తున్నట్లుగా శరత్కాలం రాగానే వికసించిన పువ్వులతో నవ్వులను చిందిస్తుంది.

పృథ్వీగీతలు

క్షణికభోగలాలసులైన ఈ నరేంద్రులు ఎంత బుద్ధిమంతులయినా, ఎంత పరాక్రమవంతులయినా—బుద్బుదప్రాయమైన జీవితం అశాశ్వతమని తెలుసుకోలేక మోహాంధకారంలో కొట్టుమిట్టుకులాడుతారు. తమను తామే మోసం చేసుకొంటూ, తమ మంత్రులను, భృత్యులను, పరివారాన్ని, పౌరులను అణిచిపెట్టి ఆ బలగంతో శత్రువిజయాన్ని సాధించాలని కలలు కంటారు. పారావారపరీతధరాతలాన్ని జయించాలని బయలుదేరగలరే కాని మృత్యువు తమను వెన్నంటి వస్తున్నదని మాత్రం గ్రహింపలేరు. తమ తల్లిదండ్రులు, వారి పూర్వీకులూ తమదే అనుకొని ఆక్రమించిన భూమిని వారందరూ ఏదో ఒకనాడు విడిచివెళ్ళక తప్పలేదని, అశాశ్వతమైన వస్తువు శాశ్వతమైన వస్తువును సాధించడం సాధ్యం కాదని తెలియక ఇంకా ఇంకా ఏదో ఆర్జించి తమ తర్వాతి తరాల వారికి కట్టబెడదామని ప్రయత్నిస్తారు. దీనికోసం తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు కోరి విరోధాలు తెచ్చుకుంటారు. మమతాధృతచేతస్కులై ఈ భూమి నాది, ఈ సకలం నాది, ఇదంతా శాశ్వతంగా నా వంశీయులది అన్న మోహావేశంతో పరస్పరం కల

హించుకొని—"నీవు ఆక్రమించిన భూమి నాది; వెంటనే ఇక్కడి నుంచి తొలగిపో" అని ఒకరు మరొకరికి రాయబారాలు పంపించి నప్పుడు వారి అజ్ఞానాన్ని చూసి మొదట విరగబడి నవ్వాలనిపిస్తుంది కాని, నిజానికి వారి దుఃస్థితిని చూసి భూదేవికి జాలి కలుగుతుంది.

మైత్రేయా! పూర్వం ఒకప్పుడు ధర్మధ్వజుడైన జనకమహారాజు అసితునికి ఉపదేశించిన అతి పవిత్రమైన ఈ పృథ్వీగీతలను ఆలించిన పుణ్యాత్ములకు తాపన్యస్తతుషారాల వలె మమకార బంధాలన్నీ క్షణంలో కరిగిపోతాయి. ఇంతవరకూ నేను నీకు మనువులు, మనువంశీయులు, శ్రీమహావిష్ణ్వంశసంభూతులైన రాజన్యోత్తముల పుణ్యచరిత్రలను వినిపించాను. ఈ మనువంశాను క్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఆలకించిన విమలచిత్తులకు అతుల ధన ధాన్య సమృద్ధి, ఇంద్రియవిజయం, అశేషపాపక్షయం కలుగుతాయి.

సూర్య శశి వంశాలలో ఉదయించి మహాత్మ్యాన్ని గడించిన ధర్మప్రభువులు, ఇక్ష్వాకు జహ్ను మాంధాతృ సగర రఘ్వాదులందరూ అస్తమించారు. అశేషమహామహిమాన్వితులైన యయాతి నహుషాదులందరూ కాలగర్భంలో కలిసిపోయారు. తమ మహాబలంతో నిఖిల భూమండలాన్నీ జయించి అనంత మహాభోగాలను అనుభవించిన రాజుల జీవితాలన్నీ ఇప్పుడు కేవలకథావశేషాలుగా మిగిలిపోయాయి. ఊర్ధ్వబాహులై అనేక శత సహస్ర వర్షాలు తపోదీక్షాదక్షులై పుణ్యకర్మలను ఆచరించిన పురుషప్రవీరులు, ధర్మ పరిరక్షణ కోసం యజ్ఞకర్మలను అనుష్ఠించిన మహామహులూ అందరూ కాలధర్మాన్ని చెంది నామమాత్రావశిష్టులయ్యారు. అర్ణవపరీత భూమండలాన్ని ఆక్రమించి నిర్వక్రవిక్రమంతో రిపు చక్రాన్ని పరాభవించిన పృథుచక్రవర్తి వంటి మహాప్రభువు కూడా వాతాభిహతమైన శాల్మలీవృక్షంలా కాలఘాతానికి కూలిపోక

తప్పలేదు. సప్తద్వీపవసుంధరావలయాన్ని ఏకాతపత్రంగా పరిపాలించిన కార్తవీర్యుని వంటి సార్వభౌముడు సంకల్ప వికల్ప హేతువులైన కథాప్రసంగాలకు పరిమితమైపోయాడు. దశగ్రీవ సంహార కారకులై దిగంతవ్యాప్తయశోవిరాజితులైన రఘుకులేశ్వరుల వంటి మహాత్ములు కూడా ధర్మకర్త చూపుసారించినంతనే శరీరాలను త్యజించి కథాశరీరాల లోనికి పరివర్తనాన్ని పొందారు. మాంధాత వంటి ధాత్రీతలేశ్వరుడు ఒకానొకప్పుడు సమస్తక్షోణినీ పరిపాలించాడని చెప్పుకోవడమే తప్ప ఏమీ పరిశేషింపలేదని గుర్తించిన వివేకశాలికి తుచ్ఛమైన అహంకార మమకారాలు ఎలా అలవడుతాయి? నిజానికి ఆలోచిస్తే ఈ భగీరథాది యుగపురుషులు, సగర కకుత్స్థ దశానన రామ లక్ష్మణ యుధిష్ఠిరాదులు ఒకప్పుడు జన్మించారని వినడమే తప్ప వారి కథలు సత్యాలో, అసత్యాలో గ్రహింపగలవారెవరున్నారు?

మునిసత్తమా! నేనింతవరకూ ప్రస్తావించిన ఈ మహారాజులు, సాంప్రతవ్యక్తులు, భవిష్యత్ప్రభువులు, ఇంకా అనేకులు—అందరూ ఈ విధంగానే కొంత కొంత కాలం జీవించి, జీవించినంత కాలం ఇదే శాశ్వతం అని భ్రమించి, అచిరకాలంలోనే కాలగర్భంలో కలిసిపోతారు.

శాశ్వతమైన ఈ ధర్మరహస్యాన్ని తెలుసుకొన్నవారే పండితులు. వారిని నావారు, పెరవారు అన్న భేదభావాలు ఆవరించవు. జ్ఞానబలహీనులైన మూఢుల వలె దృష్టాదృష్ట విషయాలచే ఆకర్షితులై ఇంద్రియ దౌర్బల్యానికి పాల్పడక, అశేషవిషయ దృష్టిని తిరస్కరించి ఆత్మజ్ఞానంతో మోక్షపదాన్ని అలంకరిస్తారు''

అని పరాశరమహర్షి మైత్రేయునికి ఉపదేశించాడు.

విష్ణు పురాణము

పంచమ భాగం

"మహాత్మా! సూర్యాన్వయ చంద్రాన్వయాలలో సముద్భవించిన రాజన్యోత్తముల వంశవిస్తరాన్ని, వంశానుచరితాన్నీ సవిస్తరంగా తెలుసుకొన్నాను. ఇక యదుకులోద్భవుడైన శ్రీమహావిష్ణువు అంశావతారాన్ని గురించి శ్రవణకుతూహలంతో ఉన్నాను. సకలజగత్సృష్టినిర్మాణమర్మకర్మఠుడైన శ్రీమన్నారాయణుడు లీలామానుషవిగ్రహాన్ని ధరించి ఏయే కర్మలను ఆచరించి లోకాలను తరింపజేశాడో నాకు వివరించి చెప్పండి"

అని మైత్రేయుడు కోరగా పరాశరమహర్షి జగద్ధితకరమైన శ్రీవాసుదేవుని అంశాంశసంభూతి చరిత్రాదికాన్ని మొదలుపెట్టాడు.

వసుదేవుని ప్రార్థన

వసుదేవుడు దేవకుని కుమార్తె దేవకిని వివాహం చేసుకొన్నాడు. దైవతకాంతల దేదీప్యమాన తేజోలావణ్యాలు మూర్తీభవించిన ఆ సౌందర్యరాశితో ప్రథమసమాగమాదికం పూర్తయిన తర్వాత అతను వధూవరుల కోసం గంధపుష్పమాల్యాంకనాలతో అలంకరించిన దివ్యరథాన్ని అధిరోహించి కంసరాజసారథ్యంలో నిజగృహానికి బయలుదేరాడు. రథం ప్రయాణిస్తూ ఉండగా మార్గమధ్యంలో అకస్మాత్తుగా ఆకాశాంతరాళం నుంచి ఉచ్చైస్స్వరంతో ఒక జలదగంభీరనిస్వనం వినవచ్చింది. "ఓయి మూర్ఖుడా! భర్తృ

సహితంగా నీ రథంలో కూర్చొనబెట్టుకొని తీసుకొని వెళ్తున్నావు కాని ఆమె అష్టమ గర్భం నీ ప్రాణాలను ఆహరింపనున్నది'' అన్న ఆ కర్ణకఠోరమైన పలుకులను ఆకర్ణించి మహాబలుడైన కంసుడు రివ్వున కత్తిదూసి దేవకీదేవిని అక్కడి కక్కడే చంపివేయాలని ఉద్వేగంతో ముందుకు దూకాడు.

ఆ విధంగా తన భార్యను హతమార్చాలని ఉద్యుక్తుడైన కంసరాజును వినివారిస్తూ వసుదేవుడు దయాభిక్షను వేడుకొన్నాడు. ''దయచేసి ఈమెను చంపవద్దు. ఈమె కడుపున పుట్టిన పిల్లలందరినీ ఎప్పటి కప్పుడు నీకు సమర్పించుకొంటాను. ఇప్పటి కీమెను విడిచి పెట్టు'' అని దీనవదనుడై సంప్రార్థించాడు. అతని పైని గల గౌరవం తోనూ, అతను మాట తప్పడనే విశ్వాసం వల్లనూ కంసుడు దేవకిని చంపకుండా వదిలిపెట్టాడు.

భూదేవి వేదనానివేదనం

సరిగ్గా అదే సమయంలో భూదేవి మేరుపర్వతం పైని కొలువు తీరిన త్రిదివౌకసుల వద్దకు కార్యార్థినియై వెళ్లింది. బ్రహ్మాదులైన దేవత లందరికీ నమస్కరించి దుఃఖోద్వేగంతో ఈ విధంగా పలికింది:

''పూజ్యులారా! విశ్వ విశ్వంభరా శాశ్వతైశ్వర్య సారాన్ని తన జిహ్వాంచలాలతో క్షోదక్షమంగా భక్షింపగల సర్వభక్షకుడు ఈ అగ్నిభట్టారకుడు లోకంలో సువర్ణానికి అధిదైవతం. అఖిల జగత్సారభూత సమగ్రగోనికరానికి మహోదగ్ర తేజో విగ్రహుడైన సూర్యభగవానుడు ప్రాకరస్థానం. నాకు సకలలోకైక గురుస్థానీయుడైన శ్రీమన్నారాయణుడు ఆశ్రయం. శ్రీమన్నారాయణుడే నా సర్వస్వం. ప్రజాపతులకు కన్నతండ్రి ఈ పద్మగర్భుడు, పూర్వుల కంటె పూర్వతరుడు, అనాదిమధ్య నిధనుడు, కాలస్వరూపుడు, కళా కాష్ఠానిమేషాత్మకుడు, అనభివ్యక్తమూర్తిధరుడు, ఆత్మతేజోభి

రతుడు—అన్నీ ఆయనే. మీరందరూ ఆయన తేజోంశలై అవత రించి కల్పాంతపరిమిత పుణ్యభోగఫలాన్ని దైవతరూపంలో అనుభ విస్తున్నారు. ద్వాదశాదిత్యులు, సకల సిద్ధ సాధ్య మరుద్గణాలు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, అశ్వినీదేవతలు, త్రేతాగ్నులు, అత్రిమహర్షి మొదలుగా లోకసృష్టిని కావించిన పితృదేవతలు, అందరూ ప్రమాణవిమర్శలకు గోచరింపని అప్రమేయుడైన ఆ మహా త్ముని వ్యక్తరూపాలే. యక్ష రాక్షస దైతేయ దానవ నిశాచర పిశాచోరగాప్సరో గంధర్వగణ సర్వస్వమూ ఆ పరమాత్మ తేజో మూర్తివిలాసం. గ్రహతారకానక్షత్ర మండలాలతో చిత్రతరమై విభాసిల్లుతున్న ఆకాశమండలం, జలానలానిలాలు, నేను, పంచ భూతాత్మకమైన జగదంతరత సచరాచర భూతజాతం సర్వాంతరాత్ముడైన ఆ పరంధామునికి ప్రాకృత రూపాలము కాగా ఈ జగత్సర్వ స్వమూ విష్ణుమయం.

దేవతలారా! సర్వాత్మకుడైన శ్రీవాసుదేవుడు ఉపాధి గతుడై అనేకానేక రూపాలను పొందినప్పుడు ఆ రూపాలు కడలి కెరటాలవలె బాధ్యబాధకత్వాన్ని కూడా పొందుతున్నాయి. త్రైలోక్యభయంకరులైన దైత్యులు ఈనాడు మర్త్యలోకాన్ని ఆక్ర మించి ప్రజానీకాన్ని చిత్రహింసలు పెడుతున్నారు. పూర్వం శ్రీ మహావిష్ణువు చేతిలో సంహృతతేజుడైన కాలనేమి ఇప్పుడు భోజ రాజ వంశంలో ఉగ్రసేనాత్మజుడై కంసుని పేరిట మళ్లీ జన్మించాడు. అతి క్రూరులైన దైతేయాధములు శిశుపాల జరాసంధ అరిష్ట కేశి ధేనుక నరక ప్రలంబ సుయోధన సుందోపసుందులు, ఇంకా ఇతర రాక్షసులు రాజమందిరాలలో పాలకులై ప్రభవించారు. ఈ దురా త్ముల సంఖ్య నానాటికీ ప్రవర్ధిల్లుతున్నది. దేవతల కన్నా దివ్యమైన రూపాలను ధరించిన ఈ రాక్షసాధములు అక్షౌహిణుల సంఖ్యలో

అవతరించి నా మీద నడయాడుతున్నారు. ఆ మహాకాయుల మహాభరాన్ని భరింపగల శక్తి రోజు రోజుకూ సన్నగిల్లుతున్నది.

ఓ అమరేశ్వరులారా! భూరిభారావపీడితనై నేను రసాతలానికి క్రుంగిపోకముందే నన్ను రక్షింపగలరనే ఆశతో మీ వద్దకు వచ్చాను. నన్ను రక్షించండి.''

కరుణాజనకమైన ధరణీవిలాపాన్ని విన్న వేల్పుగముల కోరికపై బ్రహ్మదేవుడు భూమి భారావతరణాన్ని గూర్చి ప్రసంగించాడు:—

''ఓ దివౌకసులారా! ఈ మేదినీప్రోదితమైనదంతా యథార్థమే. నేనూ, మహాదేవుడూ, దేవతాసర్వస్వమూ శ్రీమన్నారాయణాత్మకులం. ఆయన విభూతులే తమలో తాము కలహించుకొని న్యూనతాధిక్యాల వల్ల బాధ్యబాధకత్వాన్ని పొంది పరస్పర వినాశహేతువులవుతున్నాయి. మనమందరమూ క్షీరార్ణవం ఉత్తరతీరానికి వెళ్లి ఆశ్రితజనమందారుడు శ్రీమన్నారాయణుని ఆశ్రయిద్దాము. జగతీ బాధాపనోదనార్థం జగన్మయుడైన ఆ కరుణామయుడు అంశావతారాన్ని ధరించి ధర్మానికి సుస్థితిని కల్పిస్తాడు.''

అని పలికి పద్మోద్భవుడు దైవతనికురుంబాలతో కలిసి వైకుంఠానికి వెళ్లి గరుడధ్వజుని సన్నుతించాడు.

బ్రహ్మకృత శ్రీ మహావిష్ణుస్తవం

''ప్రభూ! ఆమ్నాయాతీత రూపుడవై మూర్తామూర్తాత్మకుడవైన నీవు పరా అపరా విద్యల పరమార్థభూతుడవు. అణువు కన్నా అణుతరుడవు, మహత్తు కన్నా మహత్స్వరూపుడవూ ఐన నీవు శబ్దబ్రహ్మ పరబ్రహ్మాత్మకుడవైన మహాత్ముడవు. ఋగ్యజుస్సామాథర్వణాలు, శిక్షాకల్ప నిరుక్తచ్ఛందో జ్యోతిషవ్యాకరణాదులు, ఇతి

హాస పురాణాలు, మీమాంసా న్యాయ తత్త్వ ధర్మశాస్త్రాలూ అధోక్షజుడవైన నీ గుణగణాలకు అభివ్యంజకాలు.

దేవాదిదేవా! ఆత్మకూ ఆత్మదేహానికీ గుణవిచారం కావించిన జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ త్రయీమయాకృతివీ, అధ్యాత్మక తత్త్వానివీ నీవే. అవ్యక్తుడవు, అనిర్దేశ్యుడవు, అచింత్యుడవు, నామరూపాలకు అతీతుడవు, అపాణిపాద సంసిద్ధివి, శుద్ధబ్రహ్మాకృతివి అయిన నీవు పరాత్పరుడవు.

బ్రహ్మస్వరూపా! నీవు అకర్ణుడవైనా ఆకర్ణింపగలవు. అచక్షుడవైనా అన్వీక్షింపగలవు. నిరాకారుడవైనప్పటికీ బహురూపరూపుడవు. అపాదహస్తుడ వయినా అతివేగగమనుడవు, సర్వగ్రాహకుడవు. సర్వవేదివే కాని సర్వవేద్యుడవు కావు. అణువుకన్నా అణీయమూ, అసత్స్వరూపమూ ఐన నీ రూపాన్ని దర్శించి అజ్ఞాననివృత్తిని పొందిన మహాత్ములు పరమాత్మజ్ఞానంతో నిశ్రేయసాన్ని అధిగమింపగలుగుతున్నారు.

మహాత్మా! సమస్తవిశ్వానికీ నాభిస్థానీయుడవు, భువన రక్షాదక్షుడవు అయిన నీలోనే సర్వభూతాలూ అంతరితాలై విలసిల్లుతున్నాయి. భూత భవితవ్యాకృతివి, అణువులో అణీయాంశవు, అప్రాకృతుడవు, అప్రమేయుడవు అయిన పురుషోత్తముడవు నీ వొక్కడవే. నీవు హుతాశనుడవై నాలుగు రూపాలను పొంది జగత్తులకు అనంతమహావర్చస్సును ప్రసాదిస్తున్నావు. భూత భవిష్య ద్వర్తమానా లనే మూడు విధాల కదలికలతో కాలస్వరూపాన్ని ప్రదర్శిస్తూ దృశ్యదర్శనాలకు కారణ శరీరుడవై ముల్లోకాలలోనూ అనంతమహారూపంతో అభివ్యాపించి ఉన్నావు. అగ్ని ఏకాకృతికమైనప్పటికీ బహురూపాలలో వెలుగొందినట్లు నిర్వికారుడవైన నీవు వికృతి భేదాలను, సర్వగతైకరూపుడవైనా అశేషరూపభేదాలను

పొందుతున్నావు. పరమపావనపదాన్ని అలంకరించిన నీవు సర్వాంతరితుడవైనా కేవల జ్ఞానగోచరుడవై ఆత్మవిదులకు మాత్రమే నీ దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నావు. నీకన్నా అన్యతరం వేరొకటి లేదు. ఏది భూతభవితవ్యాలకు విషయభూతమో ఆ సమస్తం నీ యందే ఇమిడి ఉన్నది. వ్యక్తావ్యక్తస్వరూపుడవు, సమష్టి వ్యష్టి రూపధరుడవు, సర్వజ్ఞుడవు, సర్వదర్శనుడవు, సర్వ శక్తి జ్ఞాన బల తేజో వృద్ధి శీలుడవు, వృద్ధి న్యూనతలకు అతీతుడవు, నిత్య స్వాధీనుడవు, అనాదిపురుషుడవు, వశీకృతసర్వస్వుడవు అయిన పరబ్రహ్మనివి నీవే. వాచామగోచరుడవైన నీవు క్లమ తంద్రా భయ క్రోధ కామాది గుణాలచే అసంయుతుడవు.

మహానుభావా! నిరవద్యుడవు, సర్వజనప్రీతికరుడవు, పరమ కారుణిక స్వభావుడవు, అక్షరుడవు, సర్వేశ్వరుడవు, సర్వాధారుడవు, సర్వాన్తరితుడవు, సర్వాత్మకుడవు ఐన నీకు ప్రణామం.

సకలావరణాతీత పరమపురుషా! నిరాలంబభావనా! మహావిభూతిసంస్థానా! పురుషోత్తమా! నీకు నమస్కారం. కార్యకారణాలకు అతీతమై కేవలం ధర్మపరిత్రాణానికై లీలావిగ్రహధారివైన పరమాత్మా! మమ్మి రక్షించు!''

ఈ విధంగా విరించి కావించిన స్తుతివచనాలకు విశ్వరూపధరుడైన శ్రీహరి సంప్రీతిని చెంది సుప్రసన్నుడైనాడు. సాధ్వసావనతులైన దేవతలందరూ ఊర్ధ్వబాహువులై నూత్నవిస్రంభంతో జయ జయధ్వానాలు పలుకుతుండగా బ్రహ్మదేవుడు సాకారితమై లోకమంగళకరమైన విశ్వరూపాన్ని విస్ఫారిత నేత్రాలతో విలోకించి పునఃప్రణమిల్లాడు.

''సహస్రమూర్తీ! సహస్రబాహూ! బహువక్త్రపాదా! నమో నమః. జగత్తులకు ప్రవృత్తిసంస్థానవినాశకరుడవైన అప్రమేయా!

నీకు ప్రణామం. సూక్ష్మాతిసూక్ష్మాతిబృహత్ప్రమాణా! మహత్స్వరూపా! విశ్వానికి ప్రధానకారణభూతమైన ప్రకృతితత్త్వాన్ని నీలో విలీనం చేసికొన్న అవ్యక్తపురుషుడవు, ప్రధాన బుద్ధీంద్రియాత్మకుడవు, తదన్యతరుడవు ఐన పరమాత్మా! ప్రసన్నుడవై మమ్ము రక్షించు!

దేవా! ఈ మహీదేవి మహీమండలంలో సముద్భవించిన మహాసురుల భూరిభారాన్ని భరింపలేక అపార సారాన్వితుడవైన నీవు భారావతారాన్ని కావింపగలవనే ఆశతో నిన్ను ఆశ్రయిస్తున్నది.

వాసుదేవా! భూమిభారావతరణ కోసం నీ కరుణాప్రసాదాన్ని కోరి సమస్తసురలోకమూ నీ మందిరానికి తరలి వచ్చింది. ఇదిగో ఈ దేవేంద్రుడు, నాసత్యదస్రాద్యశ్వినులు, పాశధర దండధరులు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, సమీరణాగ్ని ప్రముఖ నిఖిలసురప్రకరమూ నీ దయాభిక్షను కోరి వచ్చాము.

నిరస్తసమస్తకిల్బిషా! సకల జగద్రక్షాదక్షా! సమస్త లోకాధ్యక్షా! శ్రీమత్పుండరీకాక్షా! మాకు కర్తవ్యాన్ని బోధించి విపన్నివారణోపాయాన్ని ఉపదేశించు.''

శ్రీమహావిష్ణువు అభయదానం

ఈ విధంగా శతానందునిచే సంస్తూయమానుడైన శ్రీమన్నారాయణుడు తన మేనినుండి సితాసితవర్ణాలలో విభ్రాజిల్లుతున్న రెండు కేశాలను తీసి, ''ఈ మత్కేశాలు వసుధాతలంలో అవతరించి భూమికి భారక్లేశాన్ని అపనయిస్తాయి. దేవతలందరూ తమ తమ అంశలతో క్షోణిపై జన్మించి పూర్వోత్పన్నదైత్యరాజులతో పోరాడి వారికి వినాశనాన్ని కలిగించాలి. కేవలం నా దృక్పాత విచూర్ణితులై దైతేయులు క్షయాన్ని పొందుతారు, వసుదేవుని

ధర్మపత్ని దేవకీదేవి అష్టమగర్భంలో ఈ కృష్ణకేశం అవతరించి కాలనేమి అంశతో జన్మించిన కంసరాజును వధింపగలదు. ధర్మ సంస్థాపనం జరిగి భూదేవికి తాపం ఉపశమిస్తుంది'' అని సురనేతలకు అభయప్రదానం కావించి అంతర్హితుడైనాడు. దృశ్యాదర్శనాలకు అగోచరుడైన ఆ పరంధామునికి భక్తిపూర్వకంగా ప్రణామవిధులను ఆచరించి దేవతలందరూ మేరుపృష్ఠానికి వెళ్లి అక్కడినుంచి మనుష్య రూపంలో భూమికి దిగివచ్చారు.

శ్రీమహావిష్ణువు దేవకీదేవి అష్టమగర్భంలో అవతరింప నున్నాడని నారదమహర్షి వలన కంసునికి తెలియవచ్చింది. అతను కుపితుడై దేవకీవసుదేవులను గృహనిర్బంధంలో ఉంచి శిశూదయ వార్తకై ఎదురుచూడసాగాడు.

యోగనిద్ర

అప్పుడు శ్రీమహావిష్ణువు జగత్తులకు అవిద్యామోహాన్ని కలుగ జేస్తున్న యోగనిద్రను పిలిచి కర్తవ్యోపదేశం చేశాడు. ''నీవు దైత్యేశ్వరుడు హిరణ్యకశిపుని కుమారషట్కాన్ని క్రమాను గతంగా దేవకీగర్భంలోనికి ప్రవేశపెట్టు. వారందరూ ఒక్కొ క్కరుగా కంసుని చేతిలో నిహతులైనాక నా తేజోంశ అయిన ఆది శేషుని అంశ సప్తమగర్భంలోనికి అవతరిస్తుంది. దేవకి ఆసన్నప్రసవ గర్భవతి కాగానే నీవు ఆ గర్భాన్ని గోకులంలో ఉన్న వసుదేవపత్ని రోహిణి ఉదరంలోనికి విన్యసింపజేయాలి. భోజరాజభయం వల్ల రోధోపరోధమై సప్తమగర్భం విచ్ఛిన్నమైనదని లోకం అను కొంటుంది. గర్భ సంకర్షణం వల్ల పుట్టిన శిశువుకు సంకర్షణుడని పేరు కలుగుతుంది. అతను మహావీరుడై శీతాద్రిశిఖరోపమంగా విరాజిల్లు తాడు. అతని తర్వాత నేను అంచిత శుభముహూర్తంలో దేవకీ

జఠరంలోనికి ప్రవేశిస్తాను. అదేసమయంలో నీవు ఆలస్యం చేయకుండా యశోదా గర్భంలో అవతరించాలి. వర్ష ఋతువులో నభోమాస కృష్ణాష్టమినాడు రాత్రివేళ నేను ప్రభవిస్తాను. నీవు నవమినాడు ఉదయించు. నా మాయాశక్తి ప్రభావంవలన ప్రేరితుడై వసుదేవుడు నన్ను యశోదాశయానికి, నిన్ను దేవకీపర్యంకానికీ మార్చివేస్తాడు. కంసరాజు నిన్ను చేతబూని శైలశిలాతలానికి కొట్టి చంపాలని ప్రయత్నించినప్పుడు తప్పించుకొని నీవు అంతరిక్షానికెగిరి స్వస్థానాన్ని చేరుకొంటావు. అప్పుడు నా యందలి భక్తి తాత్పర్యంతో శతక్రతువు నీకు వినమిత శిరస్కుడై నమస్కరించి అనుజన్మురాలిగా నిన్ను ఆదరిస్తాడు. శుంభ నిశుంభాది దైత్య సాహస్రికాన్ని సంహరించి నీవు జగద్ధాత్రిని పవిత్రీకరించి జగతీస్తోత్ర పాత్రురాలివై పరిఢవిల్ల గలవు. భూర్భువస్సువరాదులలో చరాచర భూతజాతానికి అనంత మహావిభూతిని, సన్నతిస్థితి ప్రతీతిని, కీర్తి క్షాంతి వివేక ధైర్య స్థైర్యాలను, హ్రీవినమ్రతలను, ఇష్టార్థ పరిపుష్టిని ప్రసాదించే సకల కాంతా సమాహారశక్తివైన నిన్ను ప్రాతరపరాహ్ణవేళలలో సద్భక్తిపూర్వకంగా స్మరించి, ఆర్యా! దుర్గా! వేదగర్భా! అంబికా! భద్రా! భద్రకాళీ! క్షేమ్యా! క్షేమంకరీ! మమ్ము కాపాడు తల్లీ! అని ప్రార్థించిన సదాచారపరులకు నా వరప్రభావం వలన అభీప్సితాలన్నీ ఈడేరుతాయి. సురామాంసోపహారాలను, భక్ష్యభోజ్యాలను తెచ్చి నీకు సమర్పించిన నరులు అశేషసుఖభోగాలను పొంది ఎల్లవేళలా నిన్ను ఆరాధిస్తారు. దేవీ! నేను చెప్పిన ప్రకారం సర్వమూ నిర్వహించు'' అని ప్రబోధించాడు.

శ్రీకృష్ణావతారం

శ్రీమన్నారాయణుని ఆజ్ఞానుసారం జగద్ధాత్రి యోగనిద్ర దేవకీ గర్భంలో ... నా ఆరుగురు కొడుకులను, సప్తమంలో

సంకర్షణుని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత క్షోణీభారావతరణ దీక్షా దక్షుడైన మహావిష్ణువు త్రైలోక్య రక్షానిమిత్తం దేవకీ గర్భంలోనికి దిగివచ్చాడు. అదే సమయంలో యోగనిద్ర యశోదాగర్భంలోనికి ప్రవేశించింది. శ్రీ మహావిష్ణ్వంశ భూమండలానికి దిగివచ్చినదని గ్రహగణాలు శుభస్థానాలలో సంచరించాయి. ప్రకృతి సవ్య శోభామయంగా పరిఢవిల్లింది.

శతకోటి మార్తాండమండల మహిత ప్రభావిభాసమానమైన ఆ మహా తేజస్సు గర్భవిన్యస్తమైనప్పుడు దేవకీదేవి దుర్నిరీక్ష్యమైన తేజోవికాసంతో ప్రకాశించింది. సకల చరాచర జగత్సృష్టికర్త శ్రీమహావిష్ణువుకు తల్లి కాబోతున్న ఆ ధన్యాత్మురాలిని దేవతలు భక్తిపూర్వకంగా ప్రస్తుతించారు.

దేవకీ స్తవం

"అమ్మా! ప్రకృతిస్వరూపిణివై నీవు పద్మగర్భాండాన్ని భరించిన జగన్మాతవు. బ్రహ్మాస్ఫోటవైఖరితో విలసిల్లుతున్న వేద వాఙ్మయానికి సవిత్రివై జగచ్ఛక్తివైన వాణీమతల్లివి. సృష్టికర్త్రివై సూర్యస్వరూపాన్ని గర్భీకరించుకొన్న సనాతనివి. సృష్టి క్రియా విషయభూతమైన సకలానికి నీవే ఆవిర్భవిత్రివి. త్రయీమూలకమైన యజ్ఞకర్మవు, యజింపబడుతున్న హవిష్యానివి, యజ్ఞఫలగర్భవూ నీవే. వహ్ని తేజాన్ని గర్భీకరించుకొన్న అరణివి, వహ్ని తేజస్వినివూ నీవే. దేవదానవులను కన్న అదితివి, దితివి కూడా నీవే. నీవు ఉషస్సును ప్రసవించిన రాత్రికాలపు వెన్నెలవు. జ్ఞానానికి మూలమైన సన్మతివి, నయానికి హేతువైన నీతివి, లజ్జకు స్థానమైన ప్రశ్రయానివి, కామానికి కారణమైన కోరికవు నీవే. సంతోషానికి మూలమైన సంతుష్టివి, బోధగర్భ వయిన మేధవు, ధైర్యాన్ని వహిస్తున్న ధృతివి, గ్రహనక్షత్రతారకా జన్మస్థానమైన ద్యుమండ

లానివి, ఇంకా అనేకానేక శత సహస్రరూపాలకు బీజస్వరూపిణివైన కారణశరీరురాలివి, కార్యవిభూతి ప్రాకారానివి అయిన నీ మహిమ వాచామగోచరం.

ఓ విశ్వధాత్రీ! సృష్టి సర్వస్వమూ నీ గర్భగోళంలో వినిక్షిప్తమై నిత్యప్రవర్ధమాన మవుతున్నది. సముద్రాలు, నదీనదాలు, ద్వీపాలు, మహారణ్యాలు, పర్వతాలు, వనోపవనాలు, పట్టణాలు, గ్రామాలు, సౌధగృహకుటీరఖేటాదులతో సమలంకృతమైన సమస్త భూమండలం పరమశుభదాయకమైన నీ పవిత్రగర్భాన్తరితమై ఉన్నది. సమస్త వహ్నులు, అంభస్సులు, సకలసమీరణాలు, గ్రహతారకానక్షత్రవిమానశతసంకులమైన ఆకాశావకాశానికి మూలమైన నభోమండలం నీయందు ఇమిడి ఉన్నది. భూలోక భువర్లోక సువర్లోక మహర్లోక జనలోక తపోలోక బ్రహ్మలోకాలతో కూడిన ఊర్ధ్వలోకసప్తకం, అతల వితల సుతల తలాతల రసాతల మహాతల పాతాళాలతో కూడిన అధోలోకసప్తకం, అఖిలబ్రహ్మాండమండలం, తదంతరస్థితమైన దైవత దైతేయ దైత్యదానవ యక్షరాక్షస ప్రేత పిశాచోరగ సిద్ధసాధ్య గంధర్వచారణగుహ్యక భూచర ఖేచర పక్షి మృగక్రిమికీటక సమస్త చరాచరజీవజాలం ఏ మహాత్ముని యందు విలీనమై ఉన్నదో, ఆ పరమపురుషుడు, పురుషోత్తముడు, అపరిచ్ఛేద్య మహత్స్వరూపుడు, నిగమాగమాల ప్రమాణవిమర్శలకు కూడా గోచరింపని స్వతఃప్రమాణ పరంజ్యోతిఃస్వరూపుడు శ్రీమహావిష్ణువు మానవాకృతిని ధరించి నీ గర్భంలో ఉదయింపనున్నాడు.

జగజ్జననీ! నీవు స్వాహావు. నీవే స్వధవు. నీవే సుధవు. అఖిల విద్యలూ, జ్యోతిస్సులూ, అవ్యయమైన స్వర్గధామమూ, సర్వమూ నీవే.

లోకరక్షణార్థమై మహీతలాన అవతరించిన జగన్మాతా! ప్రసన్నురాలివై జగత్తులకు సన్మంగళాన్ని ప్రసాదించు. అఖిల జగ

త్తులనూ తనలో సంధరించిన విశ్వేశ్వరుని ప్రసవించి జగత్సవిత్రివై వర్ధిల్లు!''

అని దైవతబృందాలు భక్త్యావేశంతో స్తోత్రగానాలు చేస్తుండగా భువనరక్షాదక్షుడైన శ్రీపుండరీకాక్షుని అనేకజన్మలలో తాను కావించిన పుణ్యఫలం వల్ల కడుపున తాల్చిన దేవకీదేవికి సుఖప్రసవమైంది.

ఈ విధంగా జగన్నీరేజపూర్ణవికసనార్థమై దేవకీదేవి ప్రాతస్సంధ్య కాగా ఉదయించిన శ్రీకృష్ణభానుతేజాన్ని నయనపర్వంగా తిలకించి మహర్షిమండలం వేదనాదాలతో సాధువాదాలు పలికింది. గగనతలాన సర్వగ్రహాలూ శుభస్థానాలలో సంచరించాయి. అతిసాంద్రశారదికచంద్ర చంద్రికలు నిండారినట్లు సర్వలోకాల లోనూ అపూర్వమైన ఒక ఆహ్లాదం పొడచూపింది. సజ్జనులకు ఆ శుభశకునాల వల్ల సంతోషం కలిగి ఏదో తెలియని ఒక అమందానందంతో మేను గగుర్పొడిచింది. చండమారుతాలు ప్రశమించి మనస్సుకు హాయిగొలిపే మందపవనవీచికలు వీచాయి. ప్రవాహజలాలు అణకువను పొంది మహానదులు కూడా ప్రశాంతగంభీరంగా గోచరించాయి. శ్రీకృష్ణపాదదర్శనస్పర్శనాభిలాషతో తీరానికి ఉద్గమిస్తున్న సముద్రతరంగాల ఉత్సాహపూరిత మధుర సంగీతానికి అనుగుణంగా గంధర్వాప్సరోబృందాలు నర్తింపగా దేవతలు పుష్పవృష్టిని కురిపించారు. అగ్నులు మందోష్ణాలై శాంతతేజంతో ప్రకాశించాయి. మేఘాలు శ్రుతిమనోహరంగా నిస్వనించాయి. ప్రకృతిని చల్లబరుస్తూ చల్లని జల్లు కురిసింది.

పుత్రదర్శనమహానందంతో వసుదేవుని హృదయం అమృతాంశూదయానికి ఉప్పొంగిన సముద్రపు కెరటంలా ఉద్వేలాయితమై విలసిల్లింది. విప్పారిన కలువరేకు వంటి కోమలమైన దేహంతో

జగత్సమ్మోహనకరంగా అలరారుతున్న కొడుకు వక్షఃస్థలంపై శ్రీవత్సచిహ్నాన్ని, అతని చతుర్బాహువులను, దివ్యమైన తేజో వికాసాన్నీ చూసి సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే తనయింట ఉద్భవించాడని తెలుసుకొని అపరిమితమైన ఆనందంతో పులకితగాత్రుడైనాడు. ఖేదమోదాలు అతని హృదయాన్ని ముప్పిరిగొన్నాయి.

''సకలలోక సృష్టిస్థితిసంహారకర్తవైన శ్రీమన్నారాయణ పరబ్రహ్మస్వరూపా! శార్ఙ్గ సుదర్శన కౌమోదకీ పాంచజన్య విభూషిత దివ్యరూపధరా! సకలదేవదేవేశా! శ్రీవైకుంఠనివేశా! ప్రసన్నుడవై ఈ లోకోత్తరతేజోమూర్తిని ఉపసంహరించు. రాక్షసలోక సంహారకారకుడైన శ్రీమత్పరాత్పరుడు నాయింట జన్మించాడని తెలిస్తే కంసరాజు నన్ను వధింపక మానడు''

అని భయాందోళనలతో జగద్వల్లభుని సంప్రార్థించాడు.

దేవకి కూడా భర్తృవచనానురూపంగా భగవంతుని వేడుకొన్నది:

''అనంత రూపుడవై తద్రూపాంతరితుడవై అఖిలాండకోటి బ్రహ్మాండభాండాన్ని కుక్షి నిక్షిప్తం కావించుకొన్న దేవదేవా! అనాదిమధ్యనిధనుడవై మాయావిష్కృత బాలరూపాన్ని ధరించిన లీలామానుషవిగ్రహా! ఈ విశ్వరూపాన్ని ఉపసంహరించి మమ్మల్ని కరుణించు. ఆ దితిజాధముడు కంసుని బారినుండి మమ్మల్ని రక్షించు.''

అని పరిపరివిధాల ప్రార్థించింది.

దేవకీవసుదేవుల పలుకులను ఆలించి ఇందీవరాక్షుడు, ''అమ్మా! పూర్వం నీవు పుత్రార్థినివై అనేక పర్యాయాలు నన్ను సంప్రార్థించావు. ఆనాటి నీ కోరిక ప్రకారం నేను నీ గర్భవాసాన జన్మించాను'' అని మాత్రం పలికి తూష్ణీంభావాన్ని వహించాడు.

విధ్యుక్తధర్మానుసారం వసుదేవుడు రాత్రి అయేదాకా వేచి ఉండి, శిశువును పొత్తిళ్లలో పొదివిపట్టుకొని బయలుదేరాడు. యోగనిద్రాప్రభావం వలన మధురలోని ద్వారపాలకు లందరూ సమ్మోహితులై ఆనకదుందుభి ప్రయాణానికి అడ్డురాలేదు. రాత్రి వేళ ఆకాశం మేఘావృతమై ముమ్మరంగా వర్షం కురుస్తుంటే ఆది శేషుడు అతనికి తన ఫణామండలాన్ని గొడుగుగా నిలిపి కాపాడాడు.

ఆ విధంగా శ్రీమహావిష్ణువుకు జనకస్థానీయుడైన మహాభాగ్యశాలి ఆనకదుందుభి యమునానదీతీరానికి వచ్చేసరికి నానావర్త సమాకులమైన ఆ గంభీరజలప్రవాహం నిర్మలమందాకిని వలె ప్రశమితమై మోకాలిలోతు ప్రమాణంలో ఆయనకు దారి కల్పించింది.

వసుదేవుడు యమునానదిని దాటుతున్న సమయంలోనే ఆవలివైపు తీరాన నందగోపుడు కంసరాజుకు పన్ను చెల్లించడానికి బయలుదేరి సపరివారంగా వచ్చి నిలిచి ఉన్నాడు. విష్ణుమాయాప్రభావం వలన వారు వసుదేవుని చూడలేకపోయారు.

మధురానగరిలో వలెనే నందగోపుని యింటకూడా అందరూ గాఢనిద్రలో ఉన్నారు. యోగనిద్రను ప్రసవించిన యశోదకు వసుదేవుడు వచ్చి పొత్తిళ్లలో మగశిశువును ఉంచి, తన కూతురును తీసుకొనివెళ్లిన వృత్తాంతం ఏ మాత్రమూ తెలియదు. ఆమె కన్నులు తెరిచి నీలోత్పలదళశ్యాముడై కేరింతలు కొడుతున్న నందనందనుని సందర్శించి అమందప్రేమానందాలతో కౌగిలించుకొని లాలించి ముద్దాడింది.

నందగోపమందిరం నుంచి యశోదాత్మజను తీసుకొని వసుదేవుడు ఎవరూ చూడకుండా మళ్లీ మధుర[illegible]తిరిగివచ్చి, ఆ పసిబిడ్డను దేవకీశయనంలో ఉంచి యథాపూర్వ[illegible]ని కోసం ఎదురు చూడసాగాడు.

పురిటింటిలో పసిపాప కంఠం వినిపించగానే ద్వారపాలకులు మేల్కాంచి, దేవకీప్రసవవార్తను కంసునికి తెలియజేశారు. అతను తోకత్రొక్కిన తాచుపాములా ఎగిరిపడి వసుదేవమందిరానికి వెళ్లాడు. అంతరిక్షవాణి పలుకులకు విరుద్ధంగా జన్మించినది ఆడపిల్ల కాబట్టి విడిచిపెట్టమని బ్రతిమాలుతున్న దేవకిని అవలికి నెట్టి అమిత క్రోధంతో పసిపాపను శిలాపృష్ఠానికి కొట్టి చంపాలని ఉద్యమించాడు.

కంసుడు యోగనిద్రామనుష్యాకృతిని రాతికేసి విసిరిన క్షణంలోనే ఆ శిశువు అంతరిక్షాని కెగిరి విశ్వరూపాన్ని ధరించింది. అష్టబాహువులలో అతిభయంకరులైన మృత్యుదూతలను ఆయుధాలుగా ధరించిన ఆమె రూక్షవీక్షణాలలో నిప్పులు కురిపిస్తూ కంసునికేసి చూసి వికటాట్టహాసం చేసింది. ''ఓరీ మూర్ఖుడా! నన్ను చంపి మాత్రం నువ్వు చేసేదేమిటి? పూర్వం కాలనేమివై జన్మించినప్పుడు నిన్ను సంహరించిన శ్రీహరి మళ్లీ నీ మృత్యువు కోసం భూతలాన పుట్టి పెరుగుతున్నాడు. చేతనయితే అతనిని వెతికి నీ చేతుల తీట తీర్చుకో'' అని గర్జానిర్ఘోషాల్తో హుంకరించి సిద్ధసాధ్యగణ ప్రస్తూయమానయై అంతర్ధానం చెందింది.

చేతికి చిక్కిన శత్రువు చేతిలో ఉండగానే చేజారిపోయేసరికి ఉద్విగ్నమనస్కుడై కంసుడు తన అనుచరులైన మహాసురులను పిలిపించాడు. ''మీలో ప్రలంబుడు, కేశి, ధేనుకుడు, పూతన, అరిష్టుడు మొదలైనవారందరూ కలిసి ఆ దురాత్మకుని కోసం దిక్కులను గాలించి ఎక్కడున్నా వెతికి పట్టుకోండి. నా ఎదటపడి నన్ను ఎదిరించటానికి ధైర్యంలేక [illegible] దేవతలు కుట్రపన్ని వీడిని నా మీదకు ఉసిగొలిపారు. యుద్ధ[illegible]పారిపోయే పిరికిపంద ఇంద్రుడు, బూదిపట్టి శ్మశానాల [illegible] పరమశివుడు, కపటకృత్యాలతో

తప్ప ధైర్యంగా పోరాడి చంపటం చేతకాని ఆ హరి, వాళ్లను వెంబడించి తిరిగే ఆదిత్యవరుణాగ్నియమసోమాది నిలింపుల గుంపులు—మద్బాహుబలనిర్జితులైన వీళ్లా నాకు సమస్కంధులు! ఆ వెయ్యికళ్లవాడు నాతో యుద్ధానికి వచ్చి బాణాలకు గుండెలొడ్డి నిలిచే ధైర్యం లేక వెన్ను చూపి పారిపోయిన సంగతి వాడికింకా జ్ఞాపకం లేదు కాబోలు. ఆనాడు నాపై పగబట్టి భోజరాజ్యంలో వానలు లేకుండా చేసినప్పుడు నేను విల్లెక్కుపెట్టి జలదగర్భాలను కొట్టేసరికి ఆకాశం దద్దరిల్లి వర్షాలు కురిసిన వృత్తాంతాన్ని వాడప్పుడే మర్చిపోయినట్లున్నాడు. మా శ్వశురుడైన ఒక్క జరాసంధమహారాజు తప్ప సకలక్షోణిపతులూ నాకు పాదాక్రాంతులేనని మీకు తెలుసుకదా!

ఓ దైత్యపుంగవులారా! ఇక మీరు విజృంభించి లోకాలను అల్లకల్లోలం చెయ్యండి. కంససార్వభౌముని పేరు వింటేనే దేవతల గుండెలు గుబగుబలాడాలి. లోకంలో ఎక్కడెక్కడ దానధర్మాలు జరుగుతున్నాయో, ఎక్కడెక్కడ యజ్ఞయాగాలు మొదలుపెట్టారో కనిపెట్టి వాళ్లందరినీ ఊచకోత కొయ్యండి. ఆహవనీయాలు లేక దేవతలు ఆకలితో మలమల మాడేట్లు చెయ్యండి. దేవకి కడుపున పుట్టిన ఆ మాయావిని మన శత్రువు జన్మ సంగతి చెప్పి వెళ్లింది. మీరు దిక్కులన్నీ గాలించి ఎక్కడ ఏ మూల ఏ బాలుడు కొంచెం తలపొగరు చూపించినా అక్కడికక్కడే నరికి పోగులు పెట్టండి'' అని ఆజ్ఞాపించాడు.

ఆ తర్వాత కంసుడు తన యింటికి వెళ్లి దేవకీవసుదేవులను చెరవిడిపించాడు. ''మీ పిల్లలందరినీ [illegible] నా పని మాత్రం పూర్తికాలేదు. జరిగినదానికి విచా[illegible]ంటే ప్రయోజనం లేదు. ప్రారబ్ధకర్మ వలన పొం[illegible]

పెళ్లయిన నాటినుంచి కారాగారంలో పడరానిపాట్లు పడ్డారు. ఇక నైనా మీరిద్దరూ కలిసిమెలిసి హాయిగా బ్రతకండి. మీకు స్వేచ్ఛను ప్రసాదిస్తున్నాను. మీకు పుట్టబోయే సంతానాన్ని ఎవరూ చంపరు. మీ కిక భయం లేదు'' అని చెప్పి వారిద్దరినీ పంపివేసి, రిపుశంకా వ్యాకులితుడై నిజాంతర్గేహానికి వెళ్లిపోయాడు.

విముక్తిని పొందాక వసుదేవుడు నందగోపుని శకటంలో అతని మందిరానికి వెళ్లి పుత్రోత్సాహంతో ప్రహృష్టస్వాంతుడై ఉన్న అతనిని ఆప్యాయంగా పలకరించి తన అభినందనలు తెలియ జేశాడు. ''ఇక్కడ మథురలో పరిస్థితులు సాధువర్తనులకు అను కూలంగా లేవు. ఎటునుంచి ఎప్పుడు ఏ చేటు మూడుతుందో తెలి యదు. పైగా పసిపిల్లలతో ఉన్నావు. రాజుకు ఏటేటా చెల్లించ వలసిన శుల్కాన్ని స్వయంగా వచ్చి మరీ అందజేశావు. వచ్చిన పని పూర్తయిన తర్వాత రాచనగరులో ఉండటం శ్రేయస్కరం కాదు. మీరిక్కడినుంచి వెంటనే గోకులానికి వెళ్లిపోవటం మంచిది. రోహిణి యందు నాకు జన్మించిన కొడుకును కూడా నీకు అప్పగిస్తున్నాను. ఈనాటినుంచి ఈ శిశువు నందగోపసుతుడై నీ వద్దనే పెరిగి పెద్దవాడు కావాలి. పిల్లలిద్దరూ జాగ్రత్త!'' అని అభ్యర్థించాడు.

పూతనా సంహారం

నందుని కుటుంబం గోకులానికి వెళ్లి స్థిరపడిన కొన్నాళ్లకు కంసుడు పంపించిన శిశుఘాతకి పూతన దేశదేశాలూ తిరుగుతూ వారుంటున్న ప్రదేశానికి వచ్చి, రాత్రివేళ అందరూ నిదురిస్తున్న అదను కనిపెట్టి నందుని ఇంటిలోనికి ప్రవేశించింది. నందనందనుని తన ఒడిలో పడుకోబెట్టుకొని మెల్లగా చేతులతో నిమిరి, విషపూరిత మైన స్తనాన్ని అ[illegible] ఉంచి చనుబాలు త్రాగించాలని

రాక్షసమాయ వల్ల పూతన పయోధరాలు రాత్రికాలంలో విషపూర్ణా లవుతాయి. ఆ విషదుగ్ధాలను చవిచూచినవారికి అక్కడి కక్కడే మరణం సంప్రాప్తిస్తుంది. అయినా యశోదా తనయుడు ఆమె కుచాన్ని చేతులతో గట్టిగా పట్టుకొని మర్దిస్తూ స్తనక్షీరాలతో పాటు ఆమె ప్రాణవాయువులను కూడా అమితబలంతో పీల్చి వేశాడు. దారుణమైన ఆ బాధను భరింపలేక పూతన పెద్దపెట్టున ఆర్తనాదం చేస్తూ స్నాయుబంధనాలు చీలిపోయేటట్లు నేల కొరి గింది. అతి భీషణమైన ఆమె కంఠరావానికి గోకులమంతా మేలు కొని పరుగుపరుగున వచ్చి చూసేసరికి అక్కడ వజ్రఘాతానికి రెక్కలు తెగిపడ్డ మహాపర్వతం వంటి పూతన మృతకళేబరం, ఆమె చేతులలో కేరింతలు కొడుతూ ఆటలాడుతున్న చిన్ని పాపడూ ఉన్నారు.

ముక్కుపచ్చలారని పసివాడు శిశుఘాతిని వాతపడకుండా గండం గడిచిందని తల్లి యశోద అందరికన్నా ఎక్కువగా సంతో షించింది. బాలారిష్టాలు తొలగిపోయేటట్లు గోపుచ్ఛాన్ని చేతు లతో పట్టుకొని తలచుట్టూ తిప్పి దిష్టితీసింది. నందగోపుడు ఎండు పిడకలను పొడిచేసి ఆ చూర్ణాన్ని శిరస్సుపై చల్లి, శిశువు నెన్నుదుట గోమయతిలకాన్ని దిద్ది రక్షాసూత్రం కట్టి శ్రీ నారాయణ కవచ స్తోత్రాన్ని పఠించాడు.

శ్రీ నారాయణ కవచస్తోత్రం

"తన నాభికమలం నుంచి ఆవిర్భవించిన జగత్తులలో పుట్టిన అశేషభూతజాతం పుట్టుకలకు కారణమైన 'శ్రీహరి నిన్ను రక్షిం చాలి గాక!

వరాహరూపాన్ని ధరించి త... ...ధరణిని సముద్రగర్భం నుంచి వెలికితీసిన ...దే రక్షిస్తాడు గాక!

నరసింహాకృతిని దాల్చి తన కొనగోళ్లతో వైరివక్షఃస్థలాన్ని చీలికలు చేసిన మహాత్ముడు శ్రీ కేశవస్వామి సర్వేసర్వత్ర నిన్ను కాపాడుతాడు గాక!

వామనరూపంలో అవతరించి క్షణమాత్రాన త్రివిక్రముడై మూడడుగులలో ముల్లోకాలనూ క్రమంగా ఆక్రమించిన స్వామి ఎల్లవేళలా నిన్ను సంరక్షిస్తాడు గాక!

గోవిందుడు నీ శిరస్సును కాపాడుతాడు గాక! కేశవుడు నీ కంఠాన్ని రక్షిస్తాడు గాక! గుహ్యాన్ని, జఠరాన్ని శ్రీమహావిష్ణువు; జంఘలను, పాదాలను జనార్దనుడు; ముఖాన్ని, బాహువులను ప్రబాహుడు; సర్వేంద్రియాలను, మనస్సును సంరక్షించి అవ్యయాత్ముడైన శ్రీమన్నారాయణుడు నీకు అవ్యాహతైశ్వర్యాలను ప్రసాదించాలి గాక!

శ్రీమన్నారాయణుని శార్ఙ్గ - చక్ర - గదా - ఖడ్గరాజ - శంఖనాదాలకు ప్రకంపించి నిన్ను ఆవహించిన భూతప్రేతపిశాచ రాక్షసశక్తులు క్షయాన్ని పొందాలి గాక!

దిగ్భాగాలలో వైకుంఠుడు, విదిగ్భాగాలలో మధుసూదనుడు, ఆకాశాన హృషీకేశుడు, మహీతలాన మహీధరుడు నిన్ను రక్షించాలి గాక!''

అని ఈ విధంగా శ్రీమన్నారాయణకవచపూర్వకంగా సుఖావిర్భావిమంత్రాలను పఠించి నందగోపుడు నందనునికి తన శకటానికి దిగువనే [illegible] పరిచి జాగ్రత్తగా పడుకోబెట్టాడు.

[illegible] చూడుతున్న నట్టింట్లో పూతన మృత [illegible] ఎన్నడూ లేని ఈ వైపరీత్యానికి [illegible] తల్లడిల్లింది.

శకటాసుర వధ

కొన్నాళ్లకు బాలగోపాలుడు శకటాధఃప్రదేశంలో పడుకొని నిద్రలో పాలకోసం ఏడుస్తూ అరికాళ్లతో బండిని గట్టిగా తన్నాడు. అతని పాదప్రహారానికి అంత బరువైన శకటమూ ఉన్నపెట్టున పరివర్తితమై దూరానికి పోర్లిపడింది. బండిలో ఉన్న కుండలూ, గిన్నెలూ అన్నీ విధ్వస్తమైపోయాయి.

శకటభంజన దృశ్యాన్ని చూసిన గోపగోపీజనం ఒక్కుమ్మడిగా హాహాకారాలు చేస్తూ పరుగెత్తుకొని వచ్చి చూసేసరికి గోపశిశువు ఉత్తానశయనుడై ప్రశాంత నిద్రాముద్రలో ఉన్నాడు. చూపరకు ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. ఎవరు? ఎవరిలా బండిని పడద్రోశారు? అని వారందరూ తమలోతాము వితర్కించుకొంటుంటే అక్కడే ఉన్న గోపబాలకులు—"ఇదిగో మేమందరమూ చూస్తుండగానే ఇందాక ఏడుపు లంకించుకొని బండిని ఒక్క తాపుతో దూరానికి తన్నాడు. ఇంకెవరూ అసలు ఈ చాయలకు కూడా రాలేదు" అంటూ నిద్రపోతున్న చిన్ని శిశువును చూపించారు.

నమ్మశక్యం కాని ఆ దృశ్యాన్ని చూసి ప్రజౌకసు లందరికీ అమితాశ్చర్యం కలిగింది. నందగోపునికి ఏం చెయ్యాలో పాలుపోక నోటమాట లేకుండా పసిపిల్లవాడిని భుజాల కెత్తుకొని అక్కడినుంచి మౌనంగా బయటికి వెళ్లిపోయాడు. యశోద బండిపైనుంచి నేలకు జారి పగిలిపోయిన కుండపెంకులను, సమస్త వస్తువులనూ పొందుపరిచి, శకటసమేతంగా వాటికి దధిపుష్పఫలాక్షతలతో పూజలు చేసింది.

ఆరోజు గోపికలందరూ యశోద వద్దకు వెళ్లి, "చూడవమ్మా తల్లీ! నిన్నటికి ఆ రక్కసి పూతన ప్రాణాలు తీశాడు. నేటికి నేడు అందరూ చూస్తూ ఉండగా కట్టుబండిని విరగగొట్టాడు. పెద్దవాడయినాక నీ కొడుకు ఆగడాలు మితిమీరుతాయి కాబోలు!" అని పరాచికాలతో పొద్దుగడిపారు.

నందశిశువులకు నామకరణాదికం

వసుదేవుడు తమ కులపురోహితుడైన గర్గమహర్షిని ప్రార్థించి, రోహిణీ దేవకీనందనులకు జాతకర్మాదిసంస్కారాలను కావించడానికి ప్రచ్ఛన్నంగా ఆయనను గోకులానికి పంపించాడు. వేదశాస్త్రపారంగతుడైన గర్గుడు వారిద్దరికీ శాస్త్రోక్తంగా జాతకర్మాది కృత్యాలను నిర్వర్తించి రోహిణీతనయునికి రాముడు, దేవకీసుతునికి కృష్ణుడు అని నామకరణం చేశాడు.

నందగోపకులంలో వ్రజౌకసుల మధ్య రామకృష్ణులు చాలా గారాబంగా పెరిగారు. అతిస్వల్పకాలం లోనే వారు ఊయెలలో పొర్లిపడటం నేర్చుకొని మోకాళ్లమీద ప్రాకులాడటం మొదలు పెట్టారు. మెత్తలు పరిచిన పర్యంకాలమీందినుంచి నేలకురికి ఎక్కడ పడితే అక్కడికి పారిపోతుంటే వాళ్లను పట్టుకోవడం అసాధ్యంగా ఉండేది. తరచూ బూడిదగుట్టల వద్దకో పేడముద్దలమీదికో వెళ్లి వాటిని ఒళ్లంతా పట్టించుకొని కేరింతలు కొడుతూ ఆటలాడేవారు. యశోదకు కాని, రోహిణికి కాని వాళ్లు గోవాటిక లోనికి పారిపోయి దూడలతో ఆడుతూ వాటి తోకలు పట్టిలాగుతూ అల్లరి చెయ్యకుండా అదుపులో పెట్టడం ఎంత ప్రయత్నించినా వీలయింది కాదు. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలిసి మరీ అల్లరి చేసేవారు.

రానురాను బలరామకృష్ణుల చిలిపితనం బాగా ఎక్కువ కాజొచ్చింది. ఇద్దరూ గోకరీషధూళిధూసరితశరీరాలతో వాడ వాడలా పరుగులు పెడుతూ అక్కడా ఇక్కడా ఆడుకొంటున్న బాలవత్సాలను అదలించి వాటిని బెదరగొట్టి అవి భయంతో చెంగు చెంగున గంతులు వేస్తుంటే వాటిని వెనక్కిలాగి ఆవుపాలన్నీ బంగారుగిన్నెల్లోకి పితికి ఆ పాలల్లోకి తొంగిచూసి, గుర్తుపట్టడానికి వీల్లేకుండా దుమ్ముకొట్టుకొని ఉన్న తమ ముఖప్రతిబింబాలు అందులో

భయానకంగా కనబడేసరికి బూచివాడని జడుసుకొని నానావిధాల గగ్గోలుపెట్టి నలుగురినీ విసిగించేవాళ్లు. ఇళ్లల్లో గోపికలు వెన్నచిలికి ఉంచుకొన్న కుండల్లో కాళ్లుపెట్టి వెన్నమీగడలను చుట్టూ వెదజల్లి పోయేవాళ్లు. మధ్యాహ్నంకాగానే మగవాళ్లకు భోజనాలను మూట గట్టుకొని గోపవనితలు బళ్లువిడిచి వెళ్లిన తర్వాత లోపలికి ప్రవేశించి సమస్తం విధ్వస్తం చేసి బళ్లల్లో ఎక్కడ పెరుగూ మీగడా కనిపించినా కడుపునిండా ఆరగించి ఆ చప్పుళ్లకు ఇరుగుపొరుగువాళ్లు పట్టుకోవాలని చుట్టుముట్టేసమయానికి ఇట్టే తప్పించుకొని పారిపోతుండేవాళ్లు. ఎవరన్నా మీగడతరకలు అందరాకుండా ఉట్టికి కట్టి ఉంచితే రోళ్లనూ బిందెలనూ పేర్చి వాటిమీదుగా పైకెక్కి గిన్నెలు దింపుకొని కడుపునిండా మెక్కి మిగిలిన కడవలను పగలగొట్టి ఈ విధంగా గోపకాంతలకు బ్రతుకు దుస్సహంగా అల్లరి చేసేవాళ్లు. వెన్నతింటుండగా చూసి ఇరుగుపొరుగులవాళ్లు వెన్నాడి వస్తే వేగంగా పారిపోయి వారు వచ్చే వేళకు శ్రీకృష్ణుడు యశోద ఒడిలో ఏమీ ఎరుగని పసిపాపలా నిద్ర నటిస్తుండేవాడు.

గోపికలు శ్రీకృష్ణుని కపటక్రీడలను భరించలేక యశోద దగ్గరకు వెళ్లారు.

"అమ్మా యశోదమ్మా! నీ కొడుకు చేస్తున్న దుండగాలకు అంతులేకుండా ఉన్నది. ఎక్కడా ఒక్క వస్తువు ఉన్నది ఉన్న చోటనే ఉంటుందని నమ్మకం లేదు. ఎప్పుడు ఏ మూలనుంచి వస్తాడో తెలియదు. వెన్నమీగడల కోసం మా పిల్లలు కటకట లాడుతున్నారు. నీ కొడుకు కదా అన్న మర్యాదకొద్దీ ఎన్నాళ్లని ఇలా ఊరుకోమంటావు? మా మాటలంటే నమ్మకం లేకపోతే ఇదిగో సాక్ష్యం!" అంటూ నిద్రనటిస్తున్న బాలకృష్ణుని కోమలమైన చేతివ్రేళ్లకు అంటుకొన్న నవనీతాన్ని చూపించారు.

యశోదకు శ్రీకృష్ణునిపై అమితాగ్రహం కలిగింది. మళ్లీ పారిపోవడానికి వీలులేకుండా దామపాశాన్ని అతని నడుముకు గట్టిగా కట్టి త్రాటి రెండవ కొసను రోటికి చుట్టి బిగించి ముడివేసింది.

"ఎంత చెప్పినా నీ అల్లరి మానవు కదా! ఇప్పుడు చేతనయితే దీన్ని విడిపించుకొని చూడు, నిన్నేం చేస్తానో!"

అని అమర్షావేశం వల్ల గట్టిగా కసురుకొన్నది.

యమళార్జున భంజనం

యశోదాదేవి కొంచెం అవతలికి వెళ్లగానే ఇందీవరాక్షుడు శ్రీకృష్ణుడు నడుముత్రాటితో ఉలూఖలాన్ని గట్టిగా లాగుతూ, అక్కడే ఉన్న యమళార్జునమధ్యం లోనికి ఈడ్చుకొని వెళ్లాడు. ఆ వేగానికి ఉలూఖలం బోర్లా తిరిగి అటూఇటూ ఉన్న రెండు మద్దిచెట్లనూ బలంగా తాకేసరికి అవి వ్రేళ్లతో సహా నేలను పెకలించుకొని బైటికి వచ్చి మొదళ్లు విరిగి పెద్ద చప్పుడుతో కూలిపోయాయి. ఆ మహాశబ్దాన్ని విని భయకంపితులైన గోపకులందరూ పరుగు పరుగున వచ్చి చూస్తే ఏముంది - ఎటుచూసినా భగ్నస్కంధ శకలాలు, భగ్నశాఖలతో అంతా బీభత్సంగా ఉన్నది.

ఆ నడుమ...తనచుట్టూ జరుగుతున్న గందరగోళం ఏమీ అర్థంకానట్లు—చిన్నికృష్ణయ్య—కేరింతలు కొడుతూ, బోసిచిగుళ్ల నుంచి నవోద్గతంగా మెరుస్తున్న దంతాంశుకాలతో నవ్వులను కురిపిస్తూ —

ముద్దుగా ఆటలాడుకొంటున్నాడు.

గోపికలు యశోదమ్మ వద్దకు వెళ్లి, "నీ కొడుకు అల్లరివాడంటే విన్నావు కాదు, నువ్వు నడుముకు కట్టిన దామెనతో రోటిని లాగి అంతంత లేసి మద్దిచెట్లను నిలువునా కూలద్రోశాడు, కావా

లంటే వచ్చి చూడు!'' అని వ్యాజగర్భితంగా జరిగిన వృత్తాంతాన్ని తెలియజేశారు.

అర్జునభంజనం మాటవినగానే యశోద ఆఘమేఘాల మీాద చిన్నికృష్ణుని వద్దకు వెళ్లి, కట్టుత్రాటిని విడిపించి, లాలనగా అక్కున చేర్చుకొని, భయాన్ని మరిపిస్తూ బుజ్జగించి, ముద్దులు కురిపించి, ఆనందాశ్రువులలో ముంచెత్తింది.

ఉదరాన్ని దామపాశంతో బంధించారు కనుక ఆనాటినుంచి గోపాలకృష్ణునికి దామోదరుడని పేరు వచ్చింది.

బృందావనం

యదుకులంలో ఎన్నడూ కనీవినీ యెరుగని సంఘటనలు జరుగుతుంటే గోపవృద్ధు లందరూ తల్లడిల్లి, నందుని వద్దకు వెళ్లారు.

వెళ్లి...నందునితో కూర్చొని సావధానంగా మంచీ చెడూ ఆలోచించారు.

''ఈ స్థలంలో ఏదో దోషం ఉన్నది. వంశనాశానికి దారితీయగల భయోత్పాతాలు సంభవిస్తున్నాయి. అర్ధరాత్రిపూట వేళ కాని వేళలో గోకులానికి వచ్చి ఆ రక్కసి పూతన ఇక్కడ గుటుక్కుమన్నది. బండి తిరగబడి వెంట్రుకవాసిలో మన పసివాడికి ప్రాణం దక్కింది. ఈ రోజు ఏ గాలీనాలీ లేకుండానే కొండంత మద్దిచెట్లు కూలి నేలకు పడ్డాయి. మనం ఇంకా ఇక్కడ ఉండటం మంచిది కాదు. ఏదో ఒక విధంగా బృందావనానికి వెళ్లి తలదాచుకొందాము. అక్కడైతే ఈ భౌమసంకటాల భయం ఉండదు'' అని అందరూ నిశ్చయించుకొని, ఇళ్లకు తిరిగివెళ్లి ప్రజౌకసులకు తమ నిర్ణయాన్ని వినిపించారు. ''తొలకరి వానలు పడేలోగా మనం ఇక్కడినుంచి వెళ్లిపోవాలి. వెంటనే ప్ర[illegible]స్నాహాలు మొదలు పెట్టండి'' అని తొందరపెట్టారు.

రాత్రి గడిచింది. తెల్లవారుజామున తొలి వెలుగురేకలు నులివెచ్చగా వచ్చిసోకేసరికి రతికేళిలో సొమ్మసిల్లి ఒకరినొకరు కౌగిలించుకొని ఒళ్లు తెలియకుండా నిదురిస్తున్న గోపదంపతులు ఉలికి పడి మేలుకొని, ప్రయాణం సంగతి గుర్తుకు వచ్చి, లేచి వడివడిగా కాలకృత్యాలను ముగించుకొన్నారు. చుట్టుపక్కల్లో ఉన్న చుట్ట పక్కాలను హెచ్చరించి, తాము బళ్లుకట్టడం మొదలుపెట్టారు. గోపికలు నెమ్మదిగా నిద్రలేచి. కనురెప్పలు నులుముకొంటూ, కృష్ణలీలలు పాడుకొంటూ, పెరుగుకుండలను సర్దిపెట్టి, మరొక చేత్తో వెన్నచిలుకుతున్నారు. పాలకుండల్లో కవ్వాన్ని అలవోకగా నిలిపి కుడికాలు ఊతగా ముందుకు జాపి కవ్వపుత్రాటిని రెండుచేతులతో మవ్వంగా పట్టుకొని భుజలతలను ఊగిసలాడిస్తూ ఒయ్యారంగా పాలు చిలుకుతున్నవాళ్లు, ఆ చిలుకుచూపుల గోపకాంతలను చిలిపిచూపులతో పరికిస్తూ దారికి అడ్డంగా నిలబడ్డ గోపయువకులను అదలిస్తూ ముందుకు నడుస్తున్నవాళ్లు, రాత్రి కట్టువిప్పుకొని పూరిమేస్తూ కదలిపోయిన మొదవులను వెతికితెచ్చి తమతమ బళ్లకు కడుతున్నవాళ్ల సంబరాలతో గోపకులం కళకళలాడుతున్నది. ఆ సందడికి కదుపుల్లో కలిసిన లేగదూడలకోసం అర్రులెత్తి అంబా! అంబా! అని గంతులేస్తున్న పాడియావులను కొమ్ములతో పట్టుకొని, ముకుత్రాడు తగిలించి బండిదగ్గరకు తీసుకొని వెళ్లి దూడలను విడిచి, ఆ వెనుకనే దుగ్ధదోహనానికి గిన్నెలను తెచ్చి గొంతుకు కూర్చొని కుండను మోకాళ్ల మధ్య పట్టి ఉంచి కుండోధ్నీమతల్లులను లాలిస్తున్నవాళ్లు, కదలీపత్రపుటికలకు నిండుగా నురుగులు తేరుతున్న పచ్చిపాలను తెచ్చి వెచ్చ వెచ్చటి పచ్చడిమెతుకులతోపాటు ఇచ్చకాలాడుతూ మెచ్చుగా వడ్డిస్తున్న , గంట్లను మెచ్చుకొంటూ రసస్వాదిమకు తన్మయులవుతున్న గ , పిల్లలకు చెప్పులు తొడిగించి

చిన్నిచిన్ని మాటలను నెత్తికెక్కించి బళ్లల్లో సర్దిస్తున్న వయో వృద్ధులు, వంటపనులు ముగిశాక రంగురంగుల కాసెకోక చెంగులు నడుముచుట్టూ బిగించి సింగారంగా నడిచివస్తున్న మదవతీకదంబాలు—కోలాహలంగా బయలుదేరి అంచెలంచెలుగా ప్రయాణించి యమునానదీతీరాన వెలసిన బృందావనాన్ని సమీపించారు.

ఈ విధంగా బృందావనాన్ని చేరుకోనగానే గోపకులందరూ తమ శకటాలను దగ్గరకు చేర్చి అర్ధచంద్రాకారంలో నిలిపి, సుఖ నివాసానికి తగిన ఏర్పాట్లను చక్కజూసుకొన్నారు.

బాల్యలీలలు

బృందావనానికి వచ్చినా రామకృష్ణులు అల్లరి మానలేదు. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ ఏకస్థానస్థితులై కలిసికట్టుగా ఉండేవాళ్లు. వత్సపాలురను చేర్చి గోష్ఠీవినోదాలలో తేలియాడుతూ బాల్యక్రీడలలో నిమగ్నులై నూత్నపరివేషాలను ధరించారు. మయూరపింఛాలను సిగలలో తురుముకొని అడవిపువ్వులు దండగ్రుచ్చి మెడలో అందంగా అలంకరించుకొన్నారు. ఆకుగొ౦సలను దగ్గరకు చేర్చి పెదవులతో గాలి ఊదుతూ పత్రవాద్యసంగీతానికి శ్రుతిగా వేణుగానం నేర్చుకొన్నారు. సిగముడిచి కాకపక్షాల వలె ఇరువైపులా శిరోజాలను ఉంగరాలు త్రిప్పి సోయగాలు పోసాగారు. ఎప్పుడు చూసినా ఇద్దరూ ఆడుతూ పాడుతూ అల్లరిచేస్తూ నిత్యకేళీవినోదులై ఉండేవారు. నేస్తానికి ఎవరూ లేకపోతే ఇద్దరూ కూర్చొని ఏవేవో కబుర్లు చెప్పుకొంటూ, కొత్తమాటలు నేర్చుకొంటూ కాలక్షేపం చేసేవారు. ఇలా కన్నుమూసి కన్ను తెరిచేలోగా బృందావనంలో ఏడు వసంతాలు గడిచిపోయాయి. స్వలీలావిలసనార్థం నేలకు దిగివచ్చిన బలరామకృష్ణులు, చరాచరసమస్త జగత్పాలకులు, వత్సపాలకులుగా బాల్యవయోవస్థను గడుపుతున్నారు.

వర్ష ఋతువు

ఇంతలో ఆకాశం మేఘావృతమై ప్రావృట్కాలం ప్రవేశించింది., సజల జలధరాలను పొదిగినట్లు గగనాంగణం వింత కాంతులను విరజిమ్మసాగింది. దిక్కులన్నీ ఏకమయేటట్లు కుండపోతగా వాన కురిసింది. ఇంకా పచ్చవన్నె మలగని లేతపచ్చికబయళ్ళ మీద పట్టుపురుగులు కేళీకలాపాలలో మునిగితేలుతుంటే నేల పద్మరాగ విభూషిత మరకతశ్యామాయమానంగా ఇంపు సొంపారి క్రొంజిలుగులను సంతరించుకొన్నది. క్రొత్తగా లక్ష్మీకటాక్షం ప్రాప్తించిన వారి మనస్సుల వలె ఉప్పొంగి నదీజలాలు కట్టలు తెంచుకొని ఊరిమీదికి వచ్చాయి. సత్యవాక్యసంపదకు మూర్ఖుల ప్రగల్భోక్తుల ముందు విలువ లేకుండా పోయినట్లు మలినమేఘాలు క్రమ్ముకొన్న ఆకాశంలో కారుచీకట్లు ముసిరి శీతాంశుకిరణావళి నిస్తేజమైపోయింది. అల్పుని రాజ్యంలో అవివేకులకు గౌరవం లభించినట్లు గుణవిహీనమైన ఇంద్రచాపం నవ్యదీధితులతో వెల్లివిరిసింది. దుర్వృత్తుల చెంత చేరిన కులీనుల వలె మేఘపృష్ఠాలపై రెక్కలు విప్పి క్రేళ్లురుకుతున్న విమలబలాకలు కనిపించాయి. ఏదో ప్రయోజనాన్ని పురస్కరించుకొని సత్పురుషునితో చెలిమి చేసిన దుర్జనులను పోలి సుస్థిరమైన గగనాంగణంలో అత్యంతచంచలాకృతులు విద్యుల్లతలు వెల్లివిరిశాయి. జడుని భాషణలో అర్థావభాస స్ఫుటగోచరం కానట్లు ఏపుగా పెరిగిన పైరుపొలాల మధ్య కాలిబాటలు స్పష్టాస్పష్టంగా గోచరించాయి.

వర్షఋతువు అడుగుపెట్టగానే బలరామకృష్ణులు గోపబాలకులతో కలిసి ఉన్మత్తశిఖిసారంగ సంగీతరవాలతో ప్రతిధ్వనిస్తున్న వనాంతరాలలో సంచరింపసాగారు. ఆ మనోహర ప్రదేశాలలో వారు గోపమిత్రులతో కలిసి బృందగీతాలు పాడుతూ మైమరచి

నృత్యం చేసేవారు; దట్టంగా వానకురిసి శీతలవాయువులు జివ్వుమని వీస్తుంటే, చెట్లవెనుక చేరి చలికాచుకొనేవారు. కదంబమాలికలను వేసుకొని, నెమిలిపింఛాలను చూడముచ్చటగా అలంకరించుకొనే వారు. గైరికధాతువులను సంపాదించి ఆ రంగులను ఒంటికి పులుము కొనేవారు. పగలంతా తిరిగి తిరిగి అలిసిపోయాక ఎక్కడో చోటు చూసుకొని పర్ణశయ్యలను పరుచుకొని ఆదమరిచి నిద్రపోయేవారు. ఒక్కొక్కప్పుడు తమతో ఉన్న గోపమిత్రులలో పాడగలవారిని ప్రోత్సహించి, వారి గానాలాపాలతో తామూ గొంతు కలిపేవారు. వేణుప్రవాదకులను చేరదీసి షడ్జస్వరంలో నెమిలిపాటను అనుక రించేవారు. ఈ విధంగా క్రీడాసక్తులైన నెచ్చెలులకు ప్రేమాద రాలతో చనువిచ్చి ప్రాణమిత్రులుగా ఉంటూ లీలామానుషవేష ధారులైన బలరామకృష్ణులు వారితో సమానంగా ఆటలాడుతూ వ్రజౌకసుల వలెనే వ్యవహరింపసాగారు.

కాళియసర్పమర్దనం

ఒకనాడు శ్రీకృష్ణుడు బలదేవుడు లేని సమయంలో గోపకు లతో కలిసి బృందావనానికి వెళ్లాడు. దారిలో యమునానది ప్రవ హిస్తున్నది. ఆ నదీతరంగాలు ఉభయతటాలను ఒరసినప్పుడు నురు గులు తేలి కళిందాత్మజామనోహరదరస్మేరాల వలె సితకాంతులను విరజిమ్ముతుంటే నయనపర్వంగా తిలకిస్తూ వ్రజబాలకులు ముందుకు సాగారు.

యమునాతీరానికి సమీపంలో విషాగ్నులను వెళ్ళగక్కు తున్న ఒక భయానకమైన మడుగున్నది. ఆ భీషణహ్రదంలో కాళియమహాసర్పం చిరకాలంగా నివసిస్తున్నది.

శ్రీకృష్ణుడు ఆ ప్రాంతంలో కనిపిస్తున్న విషాదవాతావర ణాన్ని చూడగానే అతీతకథానకాన్ని స్మరించాడు. విషాగ్నులు

పోకి తీరవృక్షాలన్నీ దహింపబడి దగ్ధతరుగంధం అక్కడ వర్తిల్లిన మృత్యుకేళిని వ్యంజింపజేస్తున్నది. నీటిచాళ్ల గాలికి పక్షులు నేల కూలిన ఆ దృశ్యం భయానకంగా ఉన్నది. పూర్వం రసాతల లోకం లోని రమణకద్వీపంలో పన్నగాశనుని చేతిలో పరాభవాన్ని పొందిన కాళియనాగం ఇప్పుడు యమునాజలాలను విషపూరితం కావించి గోగోపగణాలకు ప్రాణాపకారకంగా పరిణమించినదని శ్రీకృష్ణుడు గ్రహించాడు. దుష్టశిక్షణార్థం లీలామానుష వేషాన్ని ధరించిన తాను గోకులాభిరక్షణకు కాళియుని నిగ్రహింపక తీరదని నిశ్చయించుకొన్నాడు. తీరానికి చేరువనే ఉన్న కదంబతరువు కొమ్మలను పట్టుకొని పైకెక్కి నడుముకు కాసె బిగించి ఆ ఎత్తునుంచి మడుగులోకి దూకాడు. ఆ వేగానికి నీళ్లలోనుంచి విషజ్వాలల తప్తాంబుపవనాలు పైకెగసి ఒడ్డున ఉన్న చెట్టుచేమలను దహించి వేశాయి.

నాగహ్రదం లోనికి దూకగానే శ్రీకృష్ణుని భుజాస్ఫాలన మహాధ్వనికి ఉలికిపడి కాళియుడు విషజ్వాలలను వెలిగ్రక్కుతూ ఎర్రబారిన కన్నులతో శతానేకపత్నీపరివేష్టితుడై విషోరగాలను వెంటబెట్టుకొని శ్రీకృష్ణునితో పోరాటానికి వచ్చాడు. మహాసర్పాలన్నీ శ్రీకృష్ణుని చుట్టుముట్టి భోగబంధనాలలో బిగించి విషపు కోరలతో కాటువేశాయి. అసలే భయానకంగా ఉన్న మడుగులో పడగల నడుమ సతమతమవుతున్న తమ చెలికానిని చూసి గోప బాలకులు పల్లెలోనికి పరుగులు తీశారు. వారి ఆర్తనాదాలకు గోప గోపీజనం వచ్చి సర్పరాజవశంగతుడై ఫణాగణాల మధ్యనున్న శ్రీకృష్ణుని చూశారు. ఉద్వేజన వల్ల కళతప్పిన కొడుకు ముఖాన్ని చూసి నందగోపుడు నిశ్చేష్టుడయ్యాడు. యశోద మూర్ఛపోయింది. గోపకాంతలు దుఃఖభరాన్ని సైపలేక ''మనమందరమూ యశో

దమ్మతో కలిసి నాగరాజుకు ప్రాణాలను అర్పిద్దాము. నల్లనయ్య లేకుండా వ్రజానికి తిరిగివెళ్లడం మనవల్లకాదు. సూర్యుడు లేని పగలు, రజనీకరుడు లేని రాత్రి ఉంటాయా? కృష్ణుడులేని గోపగణం వృషవల్లభుడు లేని గోగణంతో సమానం. ఈ అరణ్యావాసం మన కింక సాధ్యంకాదు. వారిహీనసరస్సువంటి గోకులంలో మనకంటూ మిగిలి ఏమున్నది? ఉత్ఫుల్లపద్మినీపత్రనేత్రుడు నీలమేఘశ్యాముడు గోకులాభిరాముడు కానరాని గోపకులంలో మీరుమాత్రం ఎన్నాళ్లని ఉంటారు? త్రైలోక్యమనోహరమైన వంశీరవానికి, చిత్తసమ్మోహన మధురాలాపాలకు మనోధనాన్ని సమర్పించినవారందరికీ పుండరీకాక్షుని పాదాల చెంత మోక్షమే శరణ్యం. ఇంత దుర్వారమైన ఆపదలో ఉన్నా మన కళ్లలోకి దరస్మేరాలతో విలోకిస్తున్న పరమ పురుషుని ముఖశోభను చూడండి'' అని ప్రాణత్యాగం చేయ బోయారు.

మైత్రేయా! గోపికావచనాలను విని వారి శోకరవాలకు అక్కడికి వచ్చిన బలదేవుడు ఆకస్మికభయంతో ఆర్తిచెందిన గోప కులను, కొడుకు ముఖాన్ని కన్నార్పకుండా చూస్తూ నిలబడిన నంద గోపుని, మూర్ఛిల్లి ఉన్న యశోదను పరికించి జరిగిన సంగతిని గ్రహించాడు. అతనికి వెంటనే తాను శ్రీహరి తేజోంశగా భూత లానికి వచ్చిన అవతారస్మృతి కలిగింది. నిజమాహాత్మ్యసంజ్ఞతో శ్రీకృష్ణపరమాత్మను సంబోధించి కర్తవ్యకర్మను జ్ఞాపకం చేశాడు.

''దేవదేవా! పరమాత్మస్వరూపా! పరంధామా! వైకుంఠ నిలయా! పరాత్పరా! జగన్నాయకా! శ్రీకృష్ణా! ఏమిటిది? మానుషా కృతిని ధరించి నీవు ప్రదర్శించిన లీలానాటకం ఇంతటితో చాలించు. ఆత్మతేజాన్ని సముద్దీపించి నీ బలప్రౌఢిని ప్రకటించే తరుణం ఆసన్న మయింది. చక్రాకారపంక్తికి నాభివలె జగచ్చక్రానికి నీవు ఆధార

భూతుడవు. జగత్తులకు కర్తవు, భర్తవు, అపహర్తవు, త్రయీమయుడవు అయిన నీ పాదపద్మాలను ఆశ్రయించి నిత్యారాధన తత్పరులైన ఇంద్రాది దేవతలకు, పరమహంసలకే గోచరింపని నీవు భారావతరణేచ్ఛతో మానుష వేషాన్ని ధరించావు. భూలోకావతీర్ణ యుష్మద్రూప పరబ్రహ్మాకృతిని సేవించి తరించాలని దేవేశ్వర మహేశ్వర వసురుద్రాదిత్యమరుదగ్ని దేవతానికరం మానవధర్మాన్ని స్వీకరించి నేలకు తరలివచ్చారు. నీ అంశమూర్తినైన నేను నీకు అగ్రజుడనై అవతరించాను. లీలావిలసనార్థం నేలకు దిగివచ్చిన నీవు నీకోసమే అవతరించిన నీ బంధుమిత్రులకు, గోపీరూపాన్ని ధరించిన సురాంగనలకు భంగపాటు కలిగించడం న్యాయమేనా? నీ మానుష భావాన్ని, నీ బాల్యలీలలను చాలించు. దురాత్ముడైన ఈ దశ నాయుధుని సంహరించి నీ దివ్యశక్తిని ప్రకటించే తరుణం వచ్చింది''

అని ప్రసంగించిన బలదేవుని మాహాత్మ్యస్ఫోరక దివ్యవచనాలతో నిజతేజోభిజ్ఞానం కలిగి శ్రీకృష్ణుని పెదవులపై చిరునవ్వు వెల్లివిరిసింది. చేతులు చాచి ఒళ్లు విరుచుకొని శరీరాన్ని కదలనీయకుండా ఉంచిన భోగబంధనాల నుంచి విముక్తుడై, ముందుకు వంగి రెండుచేతులతో మధ్యమఫణాన్ని గట్టిగా పట్టుకొని బాహుబంధంలో మెడను బిగించి పడగమీదికెక్కి ఒకకాలు ఫణాగ్రదేశానికి మోపి, సాధనరహస్యోదంతాన్ని చూపి, వేరొకకాలు నింగికి చాపి, యోగవిజయోద్యుక్తిని ప్రదర్శించి నైష్ఠికచక్రభ్రమణ ప్రకార ఘటనాశిల్పంలో తుర్యభావుకతను కట్టనచేసి త్రైలోక్య మోహనమైన నాట్యలీలను వెల్లడించాడు. లోకాశ్చర్యకరంగా విభాసించిన శ్రీకృష్ణతాండవాన్ని విస్ఫారితనేత్రాలతో విలోకించి గోపరూప తాపస బృందారకబృందం ధన్యధన్యమయింది.

శ్రీకృష్ణుడు నాట్యలీలాపారవశ్యంలో పాదచాలనను ప్రదర్శించినప్పుడు ఆ మహాభారానికి కాళియుని శిరస్సు వంగింది. రేచకంలో వర్తులాకారంగా భ్రమించినప్పుడు ఊర్పుగాడ్పులు వెలువడి ప్రాణక్షీణత కలిగింది. దండపాదనిపాతాలకు గొంతుపగిలి నెత్తురులు గ్రక్కాడు. నిర్భిన్నశిరోగ్రీవుడైన నాథుని దురవస్థకు పరితపించి కాళియుని భార్యలందరూ మధుసూదనునికి మొరపెట్టుకున్నారు.

''సర్వేశ్వరా! దేవాదిదేవుడవైన నీవు లీలావిలసనార్థం నీ శక్తికార్యాన్ని అవధరించి మానుషవేషాన్ని ధరించావు. శబ్ద బ్రహ్మానికి అగోచరమైన పరబ్రహ్మాకృతికి సగుణరూపధరుడైన పరమేశ్వరుడవు నీవే. నిత్యం నీ సన్నిధానవర్తులై నిన్నే ఆశ్రయించుకొని ఉన్న దేవతలకే నీ స్వరూపవర్ణన సాధ్యం కాదనగా సామాన్యులము, నాథునికి వాటిల్లిన దీనావస్థను చూసి మనసు స్వాధీనం తప్పిన అబలలము మేము మహీవ్యోమ జలాగ్నిపవనాత్మకమైన బ్రహ్మాండకటాహాన్ని పర్యావర్తించి దృశ్యదర్శనాలకు అతీతంగా వెలసిన నీ తేజోమయతను ఏమని ప్రస్తుతింపగలము!

దేవా! యోగీశ్వరేశ్వరులు మహాత్ములు నీ స్వరూపావగాహనకు ప్రయత్నించి విఫలమనోరథు లయ్యారు. అణువుకంటె అణుతరం, మహత్తుకంటె మహత్స్వరూపం అయిన తేజాన్ని మనుష్యరూపంలో మాకోరకు ప్రకటించిన నీకిదే నమస్కరిస్తున్నాము.

దేవా! లోకంలో స్థితిని పొందిన వారందరికీ స్థితికారకులైన పూర్వతరు లుంటారు. సర్వపూర్వుడవైన నీవు లోకాలకే సృష్టికర్తవు. నీచే సృజింపబడిన లోకాలకు రక్షకుడవు, ఉపసంహారకుడవు నీవే. సర్వాత్మకుడవైన నీకంటె అన్యమైనది వేరొకటి లేదు. అట్టి నీకు సర్వవేళల ప్రణమిల్లుతాము.

దేవా! జీవులు కర్మబద్ధులు. ఆ కర్మబంధాల వలన జీవత్వాన్ని పొంది కర్మావధి తీరినదాకా జీవిస్తున్నారు. నీవు కర్మబంధాలకు అతీతుడవు. నీ శక్తికార్యం నీ విలాసార్థమే అయినా నీకుగల కర్తృత్వనిరపేక్ష వలన ఆ కర్మపాశానికి నీవు దూరవర్తిగా ఉన్నవాడవు. కర్మబద్ధులైన జీవులయెడ కరుణాసముద్రుడవైన నీకు లేశమాత్రమైనా ఆగ్రహం ఉండదు. క్షితిపాలనదీక్ష మాత్రమే కాళియదమనానికి కారణం. నీ క్రోధావేశం కాదు.

దేవా! స్త్రీలు దయనీయులు. సాధువర్తనులు స్త్రీలను, మూఢులను, దీనులను, జంతువులను ప్రేమభావంతో ఉపలాలిస్తారు. నీ పాదఘట్టనను సహింపలేక దైన్యాన్ని పొందిన మా నాథుని దయతో మన్నింపమని వేడుకొంటున్నాము. జగన్నాథుడవు, సమస్త జగదాధారుడవు అయిన నీ శక్తిముందు మా నాథుని బలం అల్పాల్పం. నీవింకా అతనిని శిక్షిస్తే ఇప్పుడో, ఇంకొక అర్ధముహూర్తానికో నీరసించి ప్రాణాలను కోల్పోనున్నవాడు. అల్పవీర్యమైన పన్నగాన్ని భువనాశ్రయుడవైన నీవు నిర్జించినా, అదొక మహాకార్యం కానేరదు. ప్రీతిద్వేషాలు సమానుల పట్ల రాణించినట్లు సామాన్యుల యెడ ప్రస్తుతియోగ్యాలు కావు. దేవా! ప్రపన్నులమైన మమ్మల్ని కాపాడు. భర్తృభిక్షను అర్థిస్తున్న మా విన్నపాన్ని మన్నించు''

అని నాగకాంతలు ప్రార్థింపగానే క్లాంతదేహుడై శుష్కించి ఉన్న కాళియ సర్పరాజు హీనస్వరంతో నెమ్మది నెమ్మదిగా శ్రీమహావిష్ణువును సన్నుతించాడు.

''దేవా! నన్ను క్షమించు. అణిమాద్యైశ్వర్యసిద్ధులతో స్వాభావికబలోపేతుడవైన నీ మహాశక్తిని సమగ్రంగా వర్ణింపగల శక్తి నాకు లేదు—

శ్రీహరిస్తోత్రం

తవాష్టగుణ మైశ్వర్యం నాథ! స్వాభావికం బలమ్
నిరస్తాతిశయం యస్య తస్య స్తోష్యామి కిన్న్వహమ్.

త్వం పర స్త్వం పరస్మాద్యః పరం త్వత్తః పరాత్మక!
పరస్మా త్పరమో యస్త్వం తతః స్తోష్యామి కిన్న్వహమ్.

యస్మా ద్బ్రహ్మా చ రుద్రశ్చ చన్ద్రేన్ద్రమరుతోఽశ్వినౌ
వసవశ్చ సహాదిత్యై స్తస్య స్తోష్యామి కిన్న్వహమ్.

విశావయవసూక్ష్మాంశో యస్యైత దఖిలం జగత్
కల్పనావయవ స్త్వేష తం స్తోష్యామి కథం న్వహమ్.

సదసద్రూపిణో యస్య బ్రహ్మాద్యా స్త్రిదశోత్తమాః
పరమార్థం న జానన్తి తస్య స్తోష్యామి కిన్న్వహమ్.

బ్రహ్మాద్యై రర్చ్యతే దివ్యై ర్యశ్చ పుష్పానులేపనైః
నన్దనాదిసముద్భూతైః సోఽర్చ్యతే వా కథం మయా.

యస్యావతారరూపాణి దేవరాజః సదార్చతి
న వేత్తి పరమం రూపం సోఽర్చ్యతే వా కథం మయా.

విషయేభ్యః సమాహృత్య సర్వాక్షాణి చ యోగినః
భావపుష్పాదినా నాథ! సోఽర్చ్యతే వా కథం మయా.

సోఽహం తే దేవదేవేశ! నార్చనాయాం స్తుతౌ న చ
సామర్థ్యవాన్ కృపామాత్రమనోవృత్తిః ప్రసీద మే.

సర్పజాతి రియం క్రూరా యస్యాం జాతోఽస్మి కేశవ!
తత్స్వభావోఽయ మత్రాస్తి నాపరాధో మమాచ్యుత.

సృజ్యతే భవతా సర్వం త[illegible] సంహ్రియతే జగత్
జాతిరూపస్వభావాశ్చ [illegible] త్వయా.

యథాహం భవ[illegible]
స్వభావేన చ [illegible]

యదన్యథా ప్రవర్తేయం దేవదేవ! తతో మయి
న్యాయ్యో దణ్డనిపాతో వై తవైవ వచనం యథా.

తథాపి యజ్జగత్స్వామీ దణ్డం పాతితవా న్మయి
స సోఢోఽయం వరం. దణ్డ స్తత్తో నాన్యత్ర మే వరః.

హతవీర్యో హతవిషో దమితోఽహం త్వయాచ్యుత
జీవితం దీయతామేక మాజ్ఞాపయ కరోమి కిమ్."

ఈ విధంగా గర్వభంగాన్ని పొంది శాంతగుణు డైన కాళియుని ప్రార్థనకు సంతుష్టుడై శ్రీకృష్ణుడు "ఈనాటినుంచి నీ విక్కడ యమునా జలాలలో నివసింపకూడదు. భృత్యపరివార సమేతంగా వెంటనే సముద్రానికి తరలివెళ్ళు. నీ పడగల పైని నా పాదముద్రలను చూసి గరుత్మంతుడు నీకు హాని చేయడు" అని వరమిచ్చి సర్పరాజును విడిచిపెట్టాడు.

కాళియుడు శ్రీకృష్ణునికి నమస్కరించి వ్రజౌకసులు సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగా భృత్యాపత్యకళత్రబంధుమిత్రసమేతంగా అక్కడినుంచి సముద్రానికి తరలివెళ్ళాడు. గోపగోపీజనం శ్రీకృష్ణుని చుట్టూ చేరి ఆనందబాష్పాలతో అతనిని మూర్ధాభిషిక్తుని కావించారు. నిత్యకల్లోలశాలిని అయిన సర్పహ్రదం వినిర్మలమై ప్రశాంత జలాలతో కానవస్తుంటే గోపకులందరూ విస్మయాన్ని పొంది శ్రీకృష్ణుని దివ్యప్రభావాన్ని సంకీర్తిస్తూ గోపికలతో కలిసి వ్రజవాసానికి సంతోషంగా తిరిగివెళ్ళారు.

ధేనుకాసుర సంహారం

మైత్రేయా! ఒకప్పుడు బలరామకృష్ణులు వనారణ్యాలలో సంచరిస్తూ ఒక తాళవనం [illegible] వచ్చారు. ఆ దివ్యవనంలో ధేనుకుడ [illegible] ంసభక్షణతో కాలం [illegible] పంటగా ఉన్న ఆ

వనాన్ని దూరంనుంచి చూస్తున్నప్పుడే గోపకులకు ప్రవేశాభిలాష ఉదయించింది. "చూడు బలరామా! చూడు శ్రీకృష్ణా! దిక్కులను పక్వఫలాల సుగంధాలతో పరిమళింపజేస్తున్న ధేనుకవనం ఇదే. దూరంనుంచి చూస్తుంటేనే నోరూరుతున్నది. కొన్ని కాయలన్నా అందితే బాగుండును" అంటూ బలరామకృష్ణులను ప్రేరేపించారు. అన్నదమ్ములిద్దరూ చెట్లమొదళ్లను ఊపుతూ మంచిపళ్లను కిందికి రాల్చారు. తాళఫలాలు నేలకు రాలుతున్న చప్పుడు వినిపించి ధేనుకుడు గార్దభరూపంలో వచ్చి వెనుకకాళ్లతో బలరాముని వక్షాన్ని తన్ని బాధింపసాగాడు. యుద్ధకళాకుశలుడైన బలరాముడు దాని గిట్టలను పట్టుకొని ప్రాణాలు విడిచిపెట్టినదాకా గిరగిర త్రిప్పి గడ్డిపోచను విసిరినట్లు తాళవృక్షం మీదికి విసిరి వేశాడు. ఆ పాటుకు తాళఫలాలతోపాటు ధేనుకుని మృతకళేబరం కూడా ఆకాశంనుంచి వర్షం కురిసినట్లు రక్తధారతో నేలకు రాలింది. జ్ఞాతిమరణానికి కోపించి దైత్యగార్దభాలు బలరామకృష్ణులపైకి దూసుకొని వచ్చాయి. అన్నదమ్ములిద్దరూ వాటిని నిర్భయంగా ఎదుర్కొని తాటిచెట్లపైన గార్దభదేహాలు, నేలంతా తాళఫలాలు నిండినదాకా చావగొట్టారు. రాక్షసభయం తొలగి ఆనాటినుంచి గోవులు అంతకుపూర్వం ఎన్నడూ రుచిచూచి మెరుగని నవసస్యాలను పూరిమేస్తూ హాయిగా తిరుగాడజొచ్చాయి.

ప్రలంబాసుర వధ

ధేనుకాసురుడు మృతిచెందిన తర్వాత గోగోపగోపీగణం తాళవనంలో స్వేచ్ఛావిహారాలకు అలవాటుపడ్డారు. సమస్తలోకాలకు శ్రీనిధానులైన బలరామకృష్ణులు మనుష్య ధర్మాన్ని స్వీకరించిన ఫలంగా క్రీడావినోదులై వనాంతరాలలో సంచరిస్తూ గోకులానికి సమీపంలో భాండీరవటవృక్షం చెంత ఆటలాడుకొనేవారు.

ఆ విధంగా కేళీకలాపాలలో నిమగ్నులై ఉన్న రామకృష్ణుల వద్దకు ప్రలంబాసురుడు గోపవేషాన్ని ధరించి వచ్చాడు. సమయం కనిపెట్టి ముందు శ్రీకృష్ణుని, ఆ తర్వాత రౌహిణేయుని హత మార్చాలని సంకల్పించి, వారికి అనుమానం కలగకుండా వ్రజబాల కులతో కలిసిమెలిసి వర్తింపసాగాడు.

ఒకనాడు గోపబాలకు లందరూ హరిణక్రీడకు ఉపక్రమించారు. ఇద్దరిద్దరుగా జతలుకట్టి ఆట మొదలయే చోటునుంచి గమ్యస్థానానికి హరిణాల వలె ఒకరిని మించి ఒకరుగా అంగలు వేస్తూ సకాలంలో ఆట ముగించాలి. గోవిందునికి శ్రీదాముని తోను, బలరామునికి ప్రలంబుని తోను జోడు కుదిరింది. ఆట మొదలుపెట్టి భాండీరవృక్షం దగ్గరకు వచ్చేసరికి బలరామకృష్ణులు, కృష్ణుని పక్షాన నిలిచి ఆడిన గోపబాలకులు ముందు వచ్చారు. క్రీడానియమాన్ని అనుసరించి ఓడిపోయినవారు గెలుపొందిన వారిని భుజాల మీద ఎక్కించుకొని వెనుదిరిగి రావాలి. బలరాముడు నీలజలధరాల పైని వెలుగొందు తున్న కలువరేని వలె ప్రలంబుని భుజస్కంధాల పైకెక్కి కూర్చొ న్నాడు. ప్రలంబుడు యానమార్గాన్ని విడిచి క్రీడాప్రదేశానికి దూరంగా పరిగెత్తాడు. అయితే మహాబలుడైన బలరాముని శరీర భారాన్ని మోయలేక అతను ప్రచ్ఛన్నవేషాన్ని వదిలి బండి చక్రాల వంటి కన్నులతో, దగ్ధశైలోపమమైన మహాకాయంతో రౌద్రాకృతిని ధరించాడు. బలరాముడు పర్వతశిఖరాన్ని పట్టు కొన్నట్లు అతని మెడను గట్టిగా కౌగిలించుకొని "కృష్ణా! కృష్ణా! వీడు గోపరూపాన్ని ధరించిన రాక్షసుడు. నాకు ఏమిచేయాలో పాలుపోవటం లేదు" అని కేకవేశాడు.

శ్రీకృష్ణుడు అతని పలుకులను విని సాదరంగా చిరునవ్వు నవ్వాడు. "అన్నా! నీవు అశేష జగద్బీజ కారణస్వరూపుడ వైన

పురుషోత్తముడవు. సర్వాత్మకుడవైన నీ అనంతశక్తిమాహాత్మ్యాన్ని స్మరించి చూడు. చరాచరసమస్తనిర్మితికి పూర్వం భూతధాత్రి ఏకార్ణవమై ఉన్నప్పుడు కేవల సత్త్వమూర్తివై జగత్సృష్టికి ఉపక్రమించిన ఆద్యపురుషుడవు. మనమిద్దరమూ భూమిభారావతరణ కోసం మర్త్యలోకంలో అవతరించాము. సర్వాన్తరితమైన నీ తేజోమయరూపానికి శిరస్సు వ్యోమాత్మకం; నీ మూర్తి జలమయం; పాదాలు భూమి; వక్త్రం అగ్ని; సోముడు మనస్సు; వాయువు శ్వాస; దిక్కులు నీ చతుర్బాహువులు. అట్టి విశ్వరూపధరునికి నీకు ప్రణామరూపమైన ఉపచారాన్ని ఘటిస్తున్నాను.

అన్నా! నీవు సహస్రశీర్షుడవు, సహస్రాక్షుడవు, సహస్రహస్తాంఘ్రిశరీరభేదశాలివి అయిన మహత్స్వరూపుడవు. అవతారభేదాలు, తేజోంశలు, చరాచరసర్వస్వం నీ పృథగ్వ్యక్తులు. జగద్విధాతలైన సహస్రపద్మోద్భవులకు ఆధారభూతుడవని మునీంద్రులు నిన్ను సహస్రవక్త్రాలతో సహస్రరీతుల సంకీర్తిస్తున్నారు. నీ దివ్యరూపం దేవతలకు కూడా అగోచరం. జగత్తులు నీనుంచి అవతరించి నీ సంకల్పానుసారం ప్రవర్తిల్లి అంతంలో నీ యందే లయాన్ని పొందుతున్నాయి. నీచే భరింపబడుతున్న భూమి పృథివ్యప్తేజోవాయ్వాకాశ భూతజాతాన్ని భరిస్తున్నది. సముద్రజలాలు జలధిగర్భోద్భూత బడబాగ్నుల చేత గ్రసింపబడి కస్తకము లనే పేరుగల వాయువుల ద్వారా హిమరూపాన్ని పొంది సూర్యకిరణ స్పర్శ వలన ఆకాశానికి ప్రయాణించి మళ్లీ జలరూపాన్ని ధరించినట్లు జగత్తులు నీచే సృజింపబడి కల్పాంతంలో నీ యందే లయిస్తున్నాయి. ఈ జగత్తులో అన్నదమ్ములని మన కేర్పడిన భేదం వ్యావహారికం; ఆభాసమాత్రమే. నీవు అనంతుడవు. అప్రమేయుడవు. సర్వసమర్థమైన నీ శక్తిని స్మరించి ఈ దానవుని సంహరించు. మనుష్యరూపాన్ని దాల్చి

నందుకు బంధుమిత్రులకు ఆనందాన్ని కలిగించు'' అని కర్తవ్యాన్ని బోధించాడు.

మైత్రేయా! ఆ విధంగా సర్వేశ్వరుడైన శ్రీకృష్ణునిచే ప్రబోధితుడై బలరాముడు మహాబలంతో విజృంభించి ప్రలంబుని దేహాన్ని మోకాళ్ల మధ్య అదిమిపట్టి శిరస్సును, ముఖాన్ని ముష్టి ఘాతాలతో నొప్పించాడు. ఆ నిష్ఠురప్రహారాలకు ప్రలంబుని కళ్లు రెండూ ఊడిపడ్డాయి. నోటివెంబడి రక్తధారలు స్రవించాయి. తల పగిలి మహార్తనాదాలతో నేలకొరిగాడు.

అన్నాళ్లుగా తమతో చెలిమి చేసి అంతమంది కళ్లుగప్పి బల రాముని చంపబోయిన ఆ ప్రచ్ఛన్నవేషధారి దుశ్చర్యకు, శ్రీకృష్ణుని ప్రబోధ వాక్యాలకు, బలభద్రుని లోకోత్తరబలప్రౌఢికి ఆశ్చర్య చకితులైన గోపకులందరూ జయజయధ్వానాలతో బలరామకృష్ణు లను అభినందించారు. ఆనాడు జరిగిన విశేషాలను నెమరువేసు కొంటూ అందరూ గోకులానికి తిరిగివెళ్లారు.

ఇంద్రోత్సవం

ప్రలంబాసురసంహారం జరిగిన కొన్నాళ్లదాకా గోకులం ఏ ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ఉన్నది. నందగోపసుతులు స్వేచ్ఛావిహారాలతో ఇష్టాగోష్ఠులతో ఆనందంగా కాలం గడుపు తున్నారు.

ఇంతలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. శరత్కాలం ప్రవే శించింది.

శరదాగమన మంగళవేళ శుభసూచకంగా ప్రకృతి నూత్న కాంతులను విరజిమ్మింది. బురద నిండిన వనరథ్యలన్నీ యానగమ్యా లుగా కుదురుపడ్డాయి. జలనిర్భర సరోవరాలలో పద్మషండాలు పూర్ణవికాసంతో ప్రకాశించాయి. పల్వలోదకాలలో పెరుగుతున్న

శఫరీగణాలు ఎండవేడిమికి తాళలేక సంసారకూపంలో చిక్కుకొని పుత్రకళత్రాసక్తి వల్ల స్వార్థపరులైన గృహస్థుల వలె పరితపింప సాగాయి. వర్షాగమవేళలలో హర్షోత్కర్షాలతో పురివిప్పి నయన తర్పణగా నాట్యం చేసిన వనమయూరాలు ప్రవత్తిమార్గం నిస్సార మని గ్రహించిన యోగుల వలె మౌనవ్రతాన్ని అవలంబించాయి. మేఘాలు జలసర్వస్వాన్ని విసర్జించి గేహాదులను పరిత్యజించిన విజ్ఞానుల వలె వినిర్మలంగా భాసించాయి. శరత్కాలపు సూర్యకిరణాల తాపానికి సరస్సుల లోని జలాలు మమత్వాభిమానం వలన స్వార్థపరత పైకొన్న కఠినాత్ముల హృదయాల వలె శోషిల్లసాగాయి. ఉత్తములను సేవించి ఆత్మబోధను పొందిన సత్పురుషుల మనస్సుల వలె తెల్లకలువలు పూర్ణవికసనతో అలరారాయి. తారకలు నిండిన నిర్మలాకాశంలో చంద్రమండలం సాధుసంసర్గం వలన పూర్ణసిద్ధిని పొందిన యోగితల్లజునికి చరమకాలంలో ఆత్మతేజం ఉద్దీపించి నట్లు మంగళాకృతికమై విరాజిల్లింది. జలాశయాలు నెమ్మది నెమ్మదిగా గృహారామకళత్రపుత్రాదుల యందు రూఢమైన మమకారం జ్ఞానబోధ వలన అంతరించినట్లు తీరంనుంచి దూరమై లోలోతులకు ఇంకిపోయాయి. అంతరాయహతులైన కుయోగులు ఏకాగ్రతను కోల్పోయిన మనస్సులో ప్రయత్నపూర్వకంగా మళ్లీ ధ్యేయమూర్తిని పాదుకొలిపినట్లు వర్ష ఋతువు తొలిరోజులలో విడిచిపెట్టిన సరస్సులకు హంసకారండవాదులు పునరావాసానికి వచ్చి చేరాయి. నిశ్చలాత్ములైన యతులు యోగపారమ్యాన్ని సాధించినట్లు సముద్రజలాలు ప్రావృట్కాలపు ఉద్వేజనాన్ని మాని స్తిమితములై నిభృతంగా ప్రవహించాయి. వివేకవంతుల మనస్సులలో సర్వగతుడైన శ్రీమన్నారాయణుని అభిజ్ఞానం కలిగినట్లు సలిలపూరాలు సరోవరాలలో ప్రశాంతమనోహరంగా కానవచ్చాయి. మబ్బులు చెదిరి

ఆకాశం భవక్లేశాపహమైన యోగాగ్నిలో సర్వపాపాలను భస్మసాత్కరించిన యోగీంద్రుని విశుద్ధమానసం వలె విమలీకృతంగా తేజరిల్లింది.

సాయంసంధ్య అతిక్రమించి చంద్రోదయమయింది. మధ్యాహ్నసూర్యుని తీవ్రతాపానికి శోషిల్లిన జీవజాలం శీతకిరణుని జ్యోత్స్నామృతరసస్వాదిమకు తేరుకొని సేదతీరింది. నభోమండలం నుంచి మేఘాలు, భూమండలం నుంచి కర్దమాలు, ఒండువిరిగిన జలాల నుంచి కల్మషాలు - ప్రత్యాహారం వలన ఇంద్రియాలు ఇంద్రియార్థాలనుంచి పరాఙ్ముఖమైనట్లు హరించుకొని పోయాయి. అంభస్సులు ప్రాణాయామాన్ని అభ్యసించి పూరక కుంభక రేచకాలను ప్రదర్శిస్తున్నట్లు కొంతకాలం నిండి కనుపించిన కొలకులలో నీళ్లు ఎండిపోయాయి.

చీకటిపడి చుక్కలు పొడిచే వేళకు అడవినుంచి బయలుదేరి శ్రీకృష్ణుడు గోకులాన్ని సమీపించేసరికి ఇంద్రోత్సవానికి సంభారాలను సిద్ధం చేయటంలో నిమగ్నులై ఉన్న వ్రజౌకసులు కనిపించారు. అతను గోపవృద్ధులను పలకరించి, "అయ్యలారా! ఇంద్రునికి ఈ ఉత్సవం ఎందుకు జరుగుతున్నది? దీనివల్ల ఫలం ఏమిటి?" అని కుతూహలంగా అడిగాడు.

నందగోపుడు ఆ మాటలను విని అతనికి సమాధానం చెప్పాడు. "శతక్రతువులు చేసి త్రిదివపదాన్ని అధిరోహించిన దేవేంద్రుడు మేఘాలకు, పయస్సులకు అధిదైవతం. ఆయన మనయందు ప్రసన్నుడై జలధరాలను పంపి వర్షింపజేసిన రసాలు భూమిపై సస్యవృద్ధిని కలిగిస్తున్నాయి. వృష్టిజనిత సస్యాల వలన జీవులు దేహధారణ కావిస్తున్నారు. మనము తింటున్న అన్నాలనే దేవతలకు యజ్ఞముఖంగా సమర్పిస్తున్నాము. దేవతలు ప్రసన్నులై

వత్సవతులైన ధేనువులకు క్షీరవృద్ధిని, మనకు పుష్టిని తుష్టిని కలిగిస్తున్నారు. మబ్బులలో నీళ్లు నిండితే మనకు కరువుకాటకాలు, ఆకలిదప్పుల బాధ లుండవు. దేవేశ్వరుడు తేజోరూపంలో సూర్యకిరణాల ద్వారా ఈ భౌమజలాలను పయస్సుల వలె గ్రోలి లోకకల్యాణార్థం మళ్లీ మనకు వర్షిస్తున్నాడు. ఆ మహానుభావునికి ప్రీతి కలిగింపగోరి రాజులందరూ యజ్ఞాలు చేస్తారు. మనం కూడా వర్షఋతువు ముగియగానే ఇంద్రోత్సవాన్ని నిర్వహించి ఆయనయెడ మనకు గల గౌరవాన్ని ఈ విధంగా ప్రకటిస్తున్నాము'' అని ఇంద్రపూజాపరమార్థాన్ని కరతలామలకంగా వివరించాడు.

ఇంద్రోత్సవ భంగం

నందగోపుని మాటలను విని శ్రీకృష్ణునికి పట్టరాని ఆగ్రహం కలిగింది. ''మనము కష్టపడి వ్యవసాయం చేసి పంటలను పండిస్తున్న కృషికర్తలము కాదు. ఆ సస్యధాన్యాలను అమ్ముకొని బ్రతుకవలసిన అగత్యమూ మనకు లేదు. అడవులలో ఎవరి సాయమూ లేకుండా యదృచ్ఛాలాభసంతుష్టితో స్వేచ్ఛగా జీవిస్తున్నాము. గోకులానికి గోవులే అధిదైవతాలు. ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి అని మానవులు నేర్వదగిన నాలుగు విద్యలలో ఆన్వీక్షికి విజ్ఞానబోధకు, సత్యదర్శనానికి ఉపకరించే తర్కశాస్త్రం. త్రయీవిద్య ఋగ్యజుస్సామాల మూలంగా ధర్మాధర్మాలను ప్రభుసమ్మితంగా ఉపదేశిస్తున్నది. దండనీతి రాజ్యపాలనకు ఆవశ్యకమైన నయానయాలను బోధించే ఉపాయాంతరం. ఇక వార్త అంటే అర్థానర్థాలకు మూలమైన వృత్తివిద్య వ్యవసాయం, వాణిజ్యం, పశుపాలన అని మూడు విధాలుగా ఉన్న వృత్తులను ఆశ్రయించుకొని వార్త ప్రవర్తిల్లుతున్నది. కర్షకులకు వ్యవసాయమే జీవనాధారం. విపణులలో క్రయవిక్రయాలతో జీవించేవారు వాణిజ్యపరులు. మనకు పశు

పాలనమే కర్తవ్యం. వార్తాత్రయంలో మనము దేనిని చేపట్టితే ఆ వృత్తికి అధిదేవతను ఉపాసించి ధర్మసమ్మతంగా అభీష్టాలనుపొందాలి. ఇతరుల ఉపాస్యదేవతను ఆరాధించి, వారికి చెందవలసిన ఫలాలను ఆశిస్తే మనకు లాభం కలగకపోగా చేటు మూడుతుంది. అటువంటి దురాశాపరులకు ఇహపరాలు రెండూ నిష్ఫలాలుగా పరిణమిస్తాయి. ఆ కనుచూపు మేరలో వ్యవసాయానికి ఉపకరించే క్షేత్రసీమలను దాటి అరణ్యం ఉన్నది. అరణ్యానికి అవతల గిరిప్రదేశా లున్నాయి. ఇంత విస్తారమైన భూభాగంలో మనకు చొరరాని ప్రదేశం లేదు. మనకు ద్వారబంధాలు, ఆవరణలతో కూడిన నిర్బంధ నివాసం లేదు. గృహక్షేత్రాదులు లేవు. బళ్లు కట్టుకొని చక్రచారులమై యథేచ్ఛగా లోక సంచారం చేస్తున్న సుఖజీవితం మనది. ఇక్కడున్న మహీధరాలు కామరూపాలను ధరించి వనప్రదేశాలలో పర్యటిస్తూ తమకు నచ్చిన వారిని చేరదీస్తాయని పెద్దలనేమాట మీకు తెలియనిది కాదు. ఈ వనౌకసులు అధర్మవర్తనులై వారియెడ అపరాధం కావిస్తే ఆగ్రహించి సింహాది రూపాలలో వచ్చి దోషులను హతమారుస్తాయి. అందువల్ల గిరియజ్ఞాలను, గోయజ్ఞాలను చేస్తామంటే మంచిదే. ఈ అన్నిటినీ కాదని దేవేంద్రునితో మనకు పోష్యపోషకభావం ఎక్కడి నుంచి వచ్చింది? విప్రులంటే మంత్రయజ్ఞపరాయణులు. కర్షకులు సీతాయజ్ఞపరులు. అద్రివనాలే మనకు మనికిపట్లు. గోగిరులే మనకు ఆరాధ్యదేవతలు. అందువల్ల గోవర్ధనగిరికి బలి సమర్పించి పూజా విధులను నిర్వర్తించుదాము. పల్లెలో ఉన్న ఆవులన్నింటినీ అలంకరించి, పాలుపితికి, నైవేద్యం పెట్టి బ్రాహ్మణులకు, అతిథులకు, అభివాంఛకులకు అన్నసమారాధన కావిద్దాము. నా మనసుకు తోచిన మాట చెప్పాను. మీకందరికీ నచ్చితే ఈనాడే గోవులకు, గోవర్ధనానికి పూజచేద్దాము'' అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలలో ఉన్న ఔచిత్యాన్ని గ్రహించి నందాదులు, వ్రజౌకసులు ప్రీత్యుత్ఫుల్లవదనాలతో తమ అంగీకారాన్ని తెలిపి సాధువాదాలు పలికారు. "నీ అభిమతం మాకెంతో నచ్చింది. ఈనాటినుంచి నీవన్నట్లు గిరియజ్ఞమే చేస్తాము" అని మాటయిచ్చారు. ఆ ప్రకారమే భక్తిశ్రద్ధలతో గోవర్ధన పర్వతాన్ని పూజించి దధి - పాయస - మాంసాదులతో శైలబలి అర్పించి వందలు వేలమంది బ్రాహ్మణులకు, అతిథులకు అన్నతృప్తి ఘటించారు. శ్రీకృష్ణుని ఉపదేశానుసారం గిరియజ్ఞాన్ని సాకల్యంగా నెరవేర్చి గోవృషభాలకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, అవి సంతోషంతో రంకెలు వేస్తుంటే చూసి ఆనందించారు. శ్రీకృష్ణుడు గోపికలతో క్రీడిస్తూ గోవర్ధనగిరిశిఖరాన్ని అధిరోహించి "నేనే గోవర్ధనాన్ని! నేనే గిరిశిఖరాన్ని" అని పలికి, వారందించిన ప్రసాదాలను కడుపునిండుగా ఆరగించాడు. ఆ తర్వాత క్రిందికి దిగివచ్చి తక్కినవారితో సమానంగా తానుకూడా తన ద్వితీయతనువుకు సభక్తికంగా నమస్కరించాడు. శ్రీకృష్ణుని తేజోరూపం యజ్ఞాహుతులను స్వీకరించి తిరోహిత మయింది. గోగోపగోపీజనాలు నిజావాసాలకు మరలివెళ్లారు.

ఇంద్రుని ఆగ్రహం

తనకోరకు నిర్వర్తనీయమైన మహోత్సవం అన్యోపాధులకు జరగేసరికి దేవేంద్రునికి ఆశాభంగం కలిగింది. అతను వెంటనే సంవర్తక మేఘాలను పిలిచి, "నేను చెప్పిన మాట జాగ్రత్తగా వినండి. నందగోపునికి బుద్ధిగోపం కలిగి ఆ కృష్ణుడు తననేదో ఉద్ధరిస్తాడని ఏటేటా జరుగుతున్న ఉత్సవాన్ని మానుకొని నాకు తీరని అపచారం చేశాడు. మీరు వెంటనే వెళ్లి కుంభవృష్టి కురిపించి గోవులను బాధించండి. నేను కూడా అద్రిశృంగోపమానమైన ఐరా

వతాన్ని అధిరోహించి మహామారుతాలను ప్రకల్పిస్తాను'' అని ఆదేశించాడు.

ఇంద్రుని ఆనతిని తలదాల్చి సంవర్తక మేఘాలు గోకులానికి వెళ్లి భయానకవాతవృష్టిని కురిపించాయి. ధారామహాసారపూరాలతో భూమ్యాకాశాలు ఏకమైనట్లు తోచి వ్రజౌకసులు భయపడ్డారు. విద్యుల్లతలు వారిధరాలను ఝళిపిస్తున్న కశాఘాతాలవలె విజృంభించాయి. అంతలోనే అశనిపాతాలతో దిగంతాలు ప్రతిఘోషించాయి. నిర్విరామంగా వర్షం కురిసి సర్వం అంధకారబంధుర మయింది. జలప్రళయం సంభవించినట్లు ఊరు పల్లెలన్నీ చెట్టుచేమలతో సహా కొట్టుకొనిపోయాయి. గోమతల్లికలు వర్షపాత వేగానికి తట్టుకొనలేక ముడుచుకొని తలదాచుకోవాలని ప్రయత్నించాయి. నీళ్లలో ఈదే సత్తువలేక కొన్ని గోవులు ప్రాణాలు విడిచిపెట్టాయి. లేగలను పొదుగుల చెంత పొదివికొని కొన్ని గోమాతలు వత్సాలనైనా రక్షిద్దామని తహతహ లాడాయి. గోవత్సాలు శీతవాతానికి వడవడ వణుకుతూ పవనచాలిత కంధరాలతో శ్రీకృష్ణుని కాపాడమని వేడుకొంటున్నట్లు దీనవదనాలతో హాహాకారాలు చేశాయి.

ఆ విధంగా సర్వసంకులమైన గోకులాన్ని చూసి శ్రీహరి ఉత్సవభంగానికి పగబట్టిన మహేంద్రుని ఆగ్రహచేష్టితమని గ్రహించాడు. గోవర్ధనాన్ని ఒక్కచేతితో పెకలించి మహాచ్ఛత్రం వలె పైకెత్తి ''ఈ కొండగొడుగు క్రిందికి గోగణాలతో వెంటనే తరలిరండి. ఇక్కడ గాలి వానల బెడద లేకుండా సుఖనివాసం చేయవచ్చు'' అని ఆదేశించాడు. గోపయాదవులు శకటాలను, వంటసామగ్రిని, స్త్రీ బాల వృద్ధులను, సంత్రస్తగోగణాన్ని త్వరత్వరగా విశాలమైన ఆ మహాద్రి క్రిందికి తరలించుకొని వచ్చారు. చుట్టూ

మహావర్షం పడుతుంటే చెక్కుచెదరకుండా ఉన్న శైలచ్ఛత్రాన్ని, ఆ మహాభారాన్ని అవలీలగా మోస్తూ చిరునవ్వు వెన్నెలలను కురిపిస్తున్న లీలాకృష్ణుని, విప్పారిన కళ్లతో ప్రీతిపూర్వకంగా విలోకిస్తూ గోపగోపీజనాలు సంస్తుతులను గానం చేశారు. ఆ తీరున ఇంద్రసంచోదిత మహామేఘాలు నందగోపకులాన్ని నాశనం చేయాలని ఏడురోజులపాటు ఎడతెరిపి లేకుండా గర్జారవాలతో మహావర్షాన్ని కురిపించాయి. శ్రీకృష్ణుడు నిరాయాసంగా శైలచ్ఛత్రాన్ని పట్టుకొని రెప్పపాటులేకుండా గోకులాన్ని పరిరక్షించాడు. వార్షుకాభ్రాలు వట్టిపోసాగాయి. ఇంద్రుడు తన శక్తిహీనతను గుర్తించి సంవర్తకాలను మరలి రమ్మని ఆజ్ఞాపించాడు. వ్రజౌకసులు ఆశ్చర్యచకితులై అభూతపూర్వమైన దృశ్యాన్ని విలోకిస్తుండగా శ్రీకృష్ణుడు కొండగొడుగును యథాస్థానానికి చేర్చి యశోదానందుల కౌగిలిలో కరిగిపోయాడు.

ఇంద్రాగమనం

గోవర్ధనశైలాన్ని ఛత్రాయితంగా నిలిపి గోకులాన్ని రక్షించిన శ్రీకృష్ణపరమాత్మను సందర్శించి తన మనోగతాన్ని వెల్లడించాలని పాకశాసనునికి తహతహపాటు కలిగింది. వెంటనే ఐరావత మహాగజాన్ని అధిరోహించి గోవర్ధనగిరికి సమీపంలో గోగోపకుల మధ్య ఆటలాడుకొంటున్న లీలామానుషవేషధారిని కన్నులపంటగా సందర్శించాడు. గోపరూపాన్ని ధరించిన జగద్గోపుని శిరస్సుపై చర్మచక్షువులకు గోచరింపని అదృశ్యరూపంలో విహగరాజు గరుత్మంతుడు రెక్కలు విప్పార్చి ఎండ తగలకుండా కాపాడుతున్నాడు. దేవేంద్రుడు ఏనుగు మీదినుంచి క్రిందికి దిగి శ్రీకృష్ణుని ఏకాంతంగా కలుసుకొన్నాడు. మహానందకందళిత నేత్రాలతో వైకుంఠనిలయుని మానుషాకృతిని తిలకించి భక్తిపూర్వకంగా నమస్క-

రించాడు. "శ్రీకృష్ణా! అనన్యవిదితమైన నా ఆగమనహేతువును చెబుతున్నాను. భూమిభారావతరణార్థం సకలాధారుడవైన పరమేశ్వరుడవు నీవు పృథ్వీతలానికి దిగివచ్చావు. ఉత్సవభంగం జరిగినదన్న కారణాన్ని పురస్కరించుకొని నేను మహామేఘాలను ప్రయోగించి నీతో కదనానికి దారితీశాను. నీవు మహాశైలాన్ని చేతబట్టి లోకాశ్చర్యకరంగా గోపకులాన్ని అభిరక్షించావు. నీ వీర కృత్యానికి సంతోషించిన గోవుల కృతజ్ఞతను వెల్లడించాలని నేను నీ సన్నిధికి వచ్చాను. నేటినుంచి నిన్ను ఉపేంద్రునిగా అభిషేకిస్తున్నాను. గోవులకు ఇంద్రుడవు కాబట్టి నీకు గోవిందుడని పేరు కలుగుతుంది" అని నయవినయాలతో ప్రసంగించి, కడాని పైడి చవుడోలు మీద ఉంచిన స్వర్ణఘటంతో చదలేటి నీటిని అభిషేకించాడు. తమ కులదేవతకు జరుగుతున్న సన్మానానికి గోవులన్నీ సంతోషించి దుగ్ధధారలతో వసుంధరను అభిషేకించాయి.

శ్రీకృష్ణుని ఉపేంద్ర పదవిలో అధిష్ఠింపజేసిన అనంతరం దేవేంద్రుడు ప్రీతిపూర్వకంగా ఇంకా ఇలా అన్నాడు:

"మహానుభావా! గోవుల సంకల్పానుసారం జగదీప్సితాన్ని నెరవేర్చాను. నీ అవతారకార్యానికి సహకారకంగా ఒక్కమాట చెప్పాలని ఉన్నది. నా తేజోంశ పృథాగర్భనివేశితమై అర్జునునిగా పుట్టి పురుగుతున్నది. నీ దయవల్ల అతను మహావీరుడై భూమిభారావతరణ కార్యంలో నీకు తోడ్పడగలడు. మీరిద్దరూ కలిసి మెలిసి ఉండాలని నా అభిమతం."

శ్రీకృష్ణుడు ఇంద్రోదితానికి అంగీకరించాడు. "నీ కుమారుడు భరతవంశంలో జన్మించిన సంగతి నాకు తెలుసు. నేను భూలోకంలో ఉన్నంతవరకు అర్జునునికి పరాజయమన్నది లేకుండా కంటికి రెప్పలా చూసుకొంటాను. కంసుడు, అరిష్టుడు, కేశి, కువలయా

పీడుడు, నరకుడు, రాక్షసు లందరూ నా చేతిలో చావనున్నారు. భూమిభారావతరణ నిమిత్తమై మహాసంగ్రామం జరుగుతుంది. నీ సుతుని క్షేమాన్ని గురించి కలత చెందకు; నేను జీవించినంత కాలం అతనికి ఏ భయమూ లేదు. అతనిమీది ప్రేమతోనే నేను పాండవ పక్షాన్ని వహించి కుంతీసుతులను యుద్ధంలో గెలిపించి యుధిష్ఠిరునికి రాజ్యాభిషేకం చేయిస్తాను'' అని వాగ్దానం చేశాడు.

ఆ తర్వాత దేవేంద్రుడు జనార్దనుని ప్రేమపూర్వకంగా కౌగిలించుకొని స్వర్గానికి తిరిగి వెళ్ళిపోయాడు. శ్రీకృష్ణుడు గోగోపకులతో గోపికల దృష్టిపథం వెంబడి నడుస్తూ వ్రజానికి తిరిగివచ్చాడు.

గోపకుల సందేహం

దేవేంద్రుడు శ్రీకృష్ణుని సత్కరించి వెళ్లిన తరువాత గోకుల వాసు లందరూ అతనిని కలుసుకొని ప్రీతిపూర్వకంగా మాట్లాడారు. ''ఆపత్సమయంలో గోవర్ధనాన్ని అవలీలగా పైకెత్తి మమ్మల్ని, గోగణాలను కాపాడావు. నీ లీలలను చూస్తుంటే బాల్యక్రీడలని నమ్మశక్యం కావటం లేదు. ఏదో ఒక దివ్యశక్తి మమ్మల్ని రక్షించడానికి మా మధ్యకు వచ్చినట్లున్నది. ఈ జరుగుతున్న ఘటనలను బట్టి నీవు భగవత్స్వరూపుడవని క్రమక్రమంగా తెలిసి వస్తున్నది. మడుగులోకి దూకి కాళియసర్పాన్ని మర్దించావు. బలదేవునిచే ప్రలంబాసురుని చంపించావు. లోకంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా గిరిధారణకర్మను ప్రదర్శించావు. నీ గురించి తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాము. నీవు నిజంగా భగవానుడైన శ్రీమన్నారాయణుడవని నీ పాదపద్మాలకు నమస్కరిస్తాము. గోకులమంటే నీకు ప్రాణం. ఆబాలగోపాలాన్ని మమ్మందరినీ కన్నాకుగా చూసుకొన్నావు. దేవతలకు కూడా సాధ్యంకాని మహిమలను మాకోసం ప్రదర్శించావు. ఇంతటి మహానుభావుడవు శోభావిహీన

మైన గోకులంలో సామాన్యులమైన మామధ్య ఎందుకు వచ్చి జన్మించావు? ఎంత ఆలోచించినా నువ్వు మావాడివేనని మనస్సులను సరిపెట్టుకోలేకపోతున్నాము. దేవుడవో దానవుడవో యక్షుడవో గంధర్వుడవో ఎవరివయితేనేమి? మా కులాన్ని కాపాడవచ్చిన నీ అమోఘశక్తిని కొనియాడుతూ నీకు భక్తిపూర్వకంగా నమస్కరిస్తున్నాము'' అన్నారు.

గోపమిత్రుల మాటలకు శ్రీకృష్ణుడు కొంత నొచ్చుకున్నట్లుగా కనిపించాడు. ముఖరేఖలలో ప్రణయపూర్వకమే అయినా కోపచ్ఛాయలు ప్రస్ఫుటించాయి. ''మీకు నావల్ల సిగ్గుపడవలసిన అవసరం లేనప్పుడు ఈ వ్యర్థ విచారాల వల్ల సిద్ధించే ప్రయోజనం ఏమిటి? నేను చేసినది మంచిపనే అంటున్నారు. నన్ను మీలో ఒకనిగా భావించండి. వేరుగా చూడకండి. నేను దేవుడినీ దయ్యాన్నీ గంధర్వ యక్షజాతులవాడినీ కాను. మీవాడిని. మీతోనే నా జీవితం పెనవేసుకొని ఉన్నది'' అని లఘువుగా సమాధానం చెప్పాడు. గోపకులు శంకానిరాసం వలన శాంతచిత్తులై సంతోషంగా తిరిగివెళ్లారు. శ్రీకృష్ణుడొక్కడే ఆలోచిస్తూ చాలాసేపు అక్కడే కూర్చున్నాడు.

రాసలీలలు

సాయంసంధ్య అతిక్రమించి రాత్రి కాజొచ్చింది. నిర్మలాకాశంలో శరచ్చంద్రచంద్రికలు విరిసి సరోవరాల నుంచి తెల్లకలువల సుగంధ బంధుర సమీరసౌరభాలు కోరికలను తట్టి లేపాయి. గండుతుమ్మెదలు పువ్వుతేనెలను గ్రోలి పారవశ్యంతో ఝుంకారరవాలను శ్రవణపర్వంగా వినిపిస్తుంటే శ్రీకృష్ణునికి గోపికలపై మనసు మళ్లింది. అన్నగారితో కలిసి గోపవనితామనోహరమైన మధురగీతాలను ఆలపింపసాగాడు. తంత్రీవాద్యాల కలమంగళ

శ్రుతులు తీర్చిన ఆ మోహనరవానికి పరవశించి గోపకాంతలు ఒక్కరొక్కరే వచ్చి బలరామకృష్ణుల ముందుకు నిలిచారు. ఒక కల కంఠి ముందుకు వచ్చి వారితో లయానుగుణంగా గొంతుకలిపి సన్న సన్నగా చరణాలను అందుకొన్నది. వేరొక వరవర్ణిని దత్తావ ధానమై చిత్తరువులా వింటూ నిలబడింది. మరొక వ్రజభామిని కృష్ణా! కృష్ణా! అంటూ కూజితస్వరంతో పిలిచి, అంతలో సిగ్గు ముంచుకొనివచ్చి తలవంచుకొన్నది. ఒక గోపనితంబిని శ్రీకృష్ణుని ప్రక్కకుచేరి మైమరచిపోయింది. ఒక తరుణీమణి శ్రీకృష్ణుని సన్నిధి కోసం మనసు రెపరెప లాడినా గురుజనసమక్షంలో బయటికి వచ్చే ధైర్యం చాలక దూరాననే నిలిచి కన్నులు మూసికొని ధ్యానమగ్నురాలై పరమాత్మ దివ్యతేజాన్ని సాక్షాత్కరింప జేసికొని మహా నందార్ణవంలో ఓలలాడింది. వేరొక గోపాంగన జగన్మయుడైన పర బ్రహ్మస్వరూపుని భావవీథిలో దర్శించి శ్రీకృష్ణభావనాఫలంగా గుణమయమైన దేహాన్ని త్యజించినట్లు ఊపిరి బిగబట్టి, మోక్షపదవి చేకూరినట్లు శ్రీకృష్ణతాదాత్మ్యాన్ని అనుభవించింది. లోకోత్తర సౌందర్యవతులైన గోపభామినుల నడుమ తారామధ్యగతుడైన చంద్రునివలె నిలిచిన శ్రీకృష్ణునికి ఆ శరన్మనోజ్ఞవేళ రాసక్రీడా రసోత్సాహం ఉదయించింది. అదే సమయంలో శ్రీకృష్ణార్పిత మానసలై శ్రీకృష్ణునికి దూరవర్తినులైనవారికి శ్రీకృష్ణచేష్టాను కరణభాగ్యం సంప్రాప్తించింది. బృందావనంలో ఉన్న గోపికలందరూ శ్రీకృష్ణుని వలెనే రాసలీలానర్తనకు పూనుకొన్నారు. "నేనే శ్రీకృష్ణుడిని! నా లలితపదచాలనను చూడు!" అంటూ ఒక గోప రమణి మనోహరంగా నాట్యం చేసింది. "నేనే శ్రీకృష్ణుడిని! ఈ పాట విను!" అంటూ ఒక గోపాంగన లోకసమ్మోహనకరమైన గానకళామధురిమను చవిచూపింది. "దుష్టకాళియా! నిలు నిలు! నేనే

శ్రీకృష్ణుడిని'' అంటూ ఒక వల్లవపల్లవాధర గొంతెత్తి పలికి, భుజాస్ఫాలన చేసి కాళియఫణిఫణామణిగణాల పైన లాస్యనర్తన చేసిన శ్రీకృష్ణతాండవాన్ని అనుకరిస్తూ లీలాసర్వస్వాన్ని ప్రదర్శించింది. వేరొక సుందరాంగి ''గోకులవాసులారా! భయపడకండి. ఇదిగో ఈ గోవర్ధనం క్రిందికి తరలిరండి. ఈ కొండగొడుగు క్రింద వర్ష వాతాల భయం ఉండదు'' అంటూ గోవర్ధనోద్ధరణలీలను నాట్యభంగిమలో కన్నులకు కట్టింది. ''ధేనుకుణ్ణి సంహరించాను. మీరందరూ నిర్భయంగా తాళవనానికి రండి'' అంటూ మరొక లలితాంగి కృష్ణలీలలను అభినయించింది.

ఈ విధంగా బృందావనంలో గోపసుందరీమణులు నందగోపసుతుని సుందరవదనారవిందాన్ని హృదయకాసారాలలో విరియింపజేసి విరహ దుఃఖోపశమనాన్ని పొందారు. ఒక గోపవరాంగన కనులు విప్పార్చి నిలువెల్లా గగుర్పాటుతో నేలమీద కనిపించిన కాలిజాడలను చూపి, ''ఇవిగో! హలకులిశపద్మరేఖలను చూడండి. ఇవి లీలాలంకృతగమనుడు మన శ్రీకృష్ణునివే. ఈ ప్రక్కనున్న సన్నని అడుగులు ఏ లలితాంగివో, మన్మథపరాధీనురాలై అతనితో కలిసి నడిచింది. ఇదిగో ఈ పొదరిల్లు దగ్గర కాలి మునివ్రేళ్ళ గుర్తులున్నాయి. కృష్ణుడిక్కడ నిలబడి ఆమె కోసం పువ్వులను కోసి సిగలో తురిమి ఉంటాడు. ఆ పుణ్యాత్మురాలు ఎన్ని జన్మలుగా వాసుదేవుని ఆరాధించి ఈ జన్మలో ఆయన సమాగమానికి నోచుకొన్నదో! ఆమెను పుష్పబంధనలీలతో సమ్మానించు నవనీతచోరుడు ఇక్కడి నుంచి వేగంగా ముందుకు నడిచి ఉండాలి. అతని అడుగులకు, ఆమె అడుగులకు నడుమ దూరాన్ని చూడండి. ఇదిగో ఇక్కడినుంచి ఆమె వేగంగా పరిగెత్తి శ్రీకృష్ణుని కలుసుకొన్నది. అతను ఆమె చేతిలో చేయివేసి ఇప్పుడే వస్తానని మాటయిచ్చి ఎక్కడికో వెళ్లి ఉంటాడు.

ఆమె ఇక్కడే నిలబడి అతనికోసం ఎదురు చూసింది. ఈవైపు కృష్ణుడు వెళ్లి మళ్లీ తిరిగివచ్చిన జాడలున్నాయి. ఇదిగో మళ్లీ ఇద్దరూ ఇక్కడినుంచి ప్రక్కకు తిరిగి పొదరింటి లోనికి నడిచారు. ఇక్కడినుంచి బాలతృణాలు కాలిజాడలు కనిపించకుండా అడ్డు వస్తున్నాయి. ఈ వెన్నెలవేళ పొదరింటి లోనికి వెళ్లిన తర్వాత ఆ భాగ్యవతి ఎక్కడికి వెళ్లిందో? శ్రీకృష్ణుడు ఎటువెళ్లాడో?'' అంటూ గోపకిశోరుని లీలావిలాసాలను చక్కగా కళ్లకు కట్టి చూపింది.

బృందావనంలో వెతికి వెతికి ఎక్కడా చూసినా శ్రీకృష్ణుడు కానరాకపోయేసరికి గోపకాంతలు నిరాశతో భారంగా అడుగులు వేస్తూ యమునాతీరానికి వెళ్లారు. కళిందతనయ ఫేనాయిత మంద హాసాలతో శారదికమధురచంద్రికలను విరజిమ్ముతున్నది. ఆ సుందరతటంలో నీలమేఘశ్యాముడు, మయూరపింఛాభిరాముడు, వేణుగానలోలుడు, గోపీహృదయచోరుడు, గోవర్ధనగిరిధారి - కరకమలాలలో స్వరబ్రహ్మభూషితమైన వేణుదండాన్ని ధరించి ఓష్ఠసంపుటితో యోగాభ్యాసనిర్నిబంధమైన వాయుప్రసరణాన్ని కావిస్తూ కుశలకరాంగుళులతో స్వరావళులకు ప్రాణం పోస్తున్నాడు. దీర్ఘకాలికాన్వేషణతో అలసి ఉన్న గోపవనితల ముఖపంకజాలలో నూత్నవికాసం పొడచూపింది. ప్రేమ తళుక్కొత్తే కన్నులలో ప్రాణకాంతి మేల్కొన్నది. త్రైలోక్యగోపకుడు నందనందనుని ముఖారవిందంలో నవమందహాసం విరాజిల్లింది. గోపికలు ''కృష్ణా! కృష్ణా!'' అని పలకరించి, అతిసాంద్రమైన రాగోదయం వలన ఆపైని మాటాడలేకపోయారు. శ్రీమన్నారాయణుని వదనసరోజాన్ని చూపుమొగరంబాలతో ఆస్వాదిస్తూ ఒక అందగత్తె నిర్నిమేషంగా నిలబడింది. యోగసమాధి లోనికి ప్రవేశించినట్లు ధ్యానవివశురాలై ఒక గోపతరుణి పరధ్యానంగా కనిపించింది. మాధవుడు వారందరినీ పేరు

పేరునా పలకరించి, ప్రియాలాపాలతో దగ్గరకు తీసికొని, అనురాగ పూర్ణ కరస్పర్శలతో కళాస్థానాలను పులకింపజేసి స్వాధీనపరచుకొని రాసగోష్ఠీవినోదానికి ఆహ్వానించి మండలబంధాన్ని సంకల్పించాడు. ఒక్కొక్క గోపికనూ చేతిలో చేయివేసి నడిపించుకొనివచ్చి వారందరినీ ఒకరి ప్రక్క ఒకరినిగా నిలిపి రాసమండలాన్ని ప్రకల్పించాలి. గోపికలందరూ ఆనాడు ముందుకు తోసుకొనిరావడం వల్ల మండలబంధం సాధ్యపడలేదు. శ్రీకృష్ణుడు ఒక్కొక్క గోపికనూ దగ్గరకు తీసికొని ఆప్యాయంగా చేతినందుకొని కరస్పర్శాపులకోద్గమాల వలన పారవశ్యంలో ఉన్నవారిని రాసమండలానికి చేర్చి శరత్సౌందర్యాన్ని గీతిరూపంలో అభివర్ణిస్తూ కుముదబాంధవుని ప్రశస్తిని గానం చేశాడు. గోపికలు శ్రీకృష్ణనామసంకీర్తనలను మొదలుపెట్టారు. శబ్దబ్రహ్మం పరబ్రహాన్ని వ్యంజింపజేసింది. శ్రీకృష్ణునికి మేను గగుర్పొడిచి స్వేదజలం ప్రవాహరూపమై ఉదయించింది. గోపికలందరూ అనులోమ విలోమ బంధాలలో చిత్రవిచిత్రంగా రసభావాలను అభినయించారు. తల్లిదండ్రులను, భర్తలను మరచి తనకోసం వచ్చిన గోపవరాంగనలకు సర్వభూతాంతరాత్ముడు, సర్వేశ్వరుడు, ఆత్మస్వరూపుడు, సమస్తభూత హితాచరణుడు, శ్రీమన్నారాయణుడు అలౌకిక మహానందాన్ని ప్రసాదించాడు.

అరిష్టాసురవధ

ఒకనాటి సాయంతనవేళ నందగోపసుతుడు రాసలీలాసక్తుడై గోపికలతో వినోదిస్తున్న సమయంలో అరిష్టాసురుడు వృషభరూపాన్ని ధరించి వచ్చి గోష్ఠీభంగం చేశాడు. శ్యామాంబుదచ్ఛాయను పోలిన నల్లని చర్మం, వాడి కొమ్ములు, సూర్యగోళాల వంటి ఎర్రని కన్నులు, నడుస్తున్నప్పుడు కాలిగిట్టలతో వసుధాతలాన్ని విదారిస్తూ నాలుక కొసతో మాటి మాటికి పెదిమలను నాకుతూ

అతి బలిష్ఠమైన లాంగూలం పైకి లేచి కోపవిస్రంభాన్ని ప్రకటి స్తుండగా కఠినస్కంధబంధనుడు, ఉదగ్రకకుదాభోగుడు అయిన వృషభరూప రాక్షసుడు వచ్చి గోపికలకు ఆకస్మికభయాన్ని, చిత్త క్షోభను కలుగజేశాడు. పృష్ఠభాగం విణ్మూత్రలిప్తమై, కంఠభాగం ప్రలంబమానమై, తరుస్కంధాలను ముఖాగ్రభాగంతో కవిసినందు వలన గాట్లుపడి నెత్తురు చారికలతో భయానకంగా ఉన్న ఆ వృషభ రూపధారిని చూసి గోపస్త్రీ లందరూ కృష్ణా! కృష్ణా! అని ఆర్త నాదాలు చేశారు. వనాటవులలో మునిజనులను అవలీలగా వధిం చిన అరిష్టుడు శ్రీకృష్ణపరమాత్మను బాలుడనుకొని తల వంచి కొమ్ములతో కుక్షిభాగాన్ని పొడిచి చంపాలని ప్రయత్నించాడు. శ్రీకృష్ణుడు ఉన్నచోటి నుంచి కదలక స్మితపూర్వకంగా నిలబడి మాయాదైత్యుడు తన చెంతకు రాగానే కుప్పించి గంతువేసి పిడి కిళ్లతో శృంగమూలాలను పట్టుకొని మోకాళ్ళ మధ్య వృష స్కంధాలను అదిమి తొడలతో కంఠాన్ని బిగించి శ్వాసప్రతిష్టంభన కావించి మహాబలంతో కొమ్ములను మెలిద్రిప్పి మెడవిరిచి నేల కూల్చాడు. అరిష్టుడు నురుగులు కక్కి నోటివెంబడి రక్తధారలు స్రవిస్తుండగా హాహాకారాలు చేసే శక్తిలేక మూపు నేలకు తగిలి సంధిబంధాలు సడలి గుండె పగిలి ప్రాణాలు విడిచాడు.

అరిష్టాసుర సంహారానికి వ్రజౌకసు లందరూ సంతోషించారు. జంభాసురుని వధించిన దేవేంద్రుని దేవగణాలవారు ప్రస్తుతించినట్లు శ్రీకృష్ణనామ సంకీర్తనలతో ఆ నాడు గోకులం వైకుంఠాన్ని మర పింపజేసింది.

కంసుని ఆగ్రహం

ఆ విధంగా బృందావనంలో జరుగుతున్న అలౌకికఘటన లను నారదుడు మధురానగరానికి వెళ్ళి కంసునికి సాకల్యంగా విని

పించాడు. అరిష్టాసుర సంహారం, ధేనుకవధ, ప్రలంబవినిపాతం, గోవర్ధనోద్ధరణం, కాళీయగర్వభంగం, పూతనాప్రాణాపహరణం, శకటాసురమారణం, యమళార్జునభంజనం, కారాగారంనుంచి వసుదేవుడు దేవకీతనయుని వ్రజవాసానికి చేర్చడం, కంసుని ప్రతిజ్ఞాభంగం మొదలైన విశేషాలను ఏదీ విడిచిపెట్టకుండా వివరించాడు.

నారదుని మాటలను విని కంసునికి క్రోధాసూయలు ముప్పిరిగొన్నాయి. అతను యాదవు లందరినీ సమక్షానికి రప్పించి నానా దుర్భాషలాడి శ్రీకృష్ణుని చేరదీసినందుకు నిందించాడు. తన పరివారంలో సమర్థులైనవారిని హతమార్చిన బలరామకృష్ణులను గురించి ఆలోచించిన కొద్దీ ఆగ్రహం అధికాధిక మయింది. ఏదో ఒక విధంగా వారిని మట్టుపెట్టాలనే కోరిక బలపడింది. బాల్యవయోవస్థ గతింపక ముందే వారి అంతు చూడకపోతే మొదటికే మోసం వస్తుందని గ్రహించాడు. ధనుర్యాగానికి పిలిచి ఆ ఉత్సవాలలో సమయం చూసి బలరామకృష్ణులను చాణూరముష్టికులతో మల్లయుద్ధం చేయించి సర్వజనసమక్షంలో చంపించాలని నిశ్చయించుకొన్నాడు. "యదుకులంలో పేరెన్నికగన్న శ్వఫల్కతనయుని గోకులానికి పంపి మథురానగరికి ఆహ్వానిస్తాను. దారిలో కేశి వారిని ఎదుర్కొంటాడు. ఒకవేళ బ్రతికి బట్టకట్టి మథురకు రాగలిగితే కువలయాపీడ మహాగజం చేతిలో వారికి మృత్యువు తథ్యం. అదీ కాదంటే మల్లవీరు లున్నారు" అని పన్నాగం పన్నాడు. అక్రూరుని పిలిపించి "మహాదాతా! కార్యార్థినై నిన్నిక్కడికి పిలిపించాను. ఇదిగో రథం సిద్ధంగా ఉన్నది. ఎక్కి నందగోకులానికి వెళ్ళు. అక్కడ శ్రీమహావిష్ణువు అంశావతారాలు బలరామకృష్ణులు పుట్టి పెరుగుతున్నారు. వారిద్దరినీ మల్లయుద్ధానికి రమ్మన్నానని నామాటగా వారికి చెప్పు. మన చాణూర ముష్టికులతో ఎలా యుద్ధం చేస్తారో చూడాలని సర్వ

లోకాలూ ఉవ్విళ్లూరుతున్నాయి. మహామాత్రుడు కువలయా పీడాన్ని ఎలా నడిపిస్తాడో కళ్లారా వచ్చి చూడమను. ఆ వసుదేవుణ్ణి, నందగోపుని, దురాత్ముడు మా తండ్రిని, వధించి గోకులాన్ని సర్వ నాశనం చేసి గోధనాలను వశపరచుకొని శత్రుశేషం లేకుండా వైరశుద్ధిని ఆచరిస్తాను. యాదవులను అడ్డు తొలగించి రాజ్యాన్ని చేజిక్కించుకొంటాను. నీ సాయంవల్ల చేజిక్కిన రాజ్యాన్ని నిష్కంటకంగా పరిపాలిస్తాను. గోకులవాసులను పాలుపెరుగుల కోసం అదలించినట్లు వెళ్లి వెంటనే రమ్మని నా మాటగా చెప్పు'' అని ఆజ్ఞాపించాడు.

అక్రూరుడు రాజరథాన్ని అధిరోహించి కంసుడు చెప్పినట్లు బృందావనానికి బయలుదేరాడు.

కేశి నిషూదనం

శ్రీకృష్ణనిధనానికి కంసుడు ఆజ్ఞాపించినట్లుగానే కేశిరాక్షసుడు అశ్వాకృతిని ధరించి బృందావనానికి వెళ్లాడు. ఖురక్షతాలతో భూపృష్ఠాన్ని దద్దరిలజేస్తూ సటాక్షేపాలతో ఆకాశమార్గాన్ని విదారిస్తూ ప్లుతగతులతో సూర్యచంద్రగమనాలను నిరోధిస్తూ గోకులానికి ఉపద్రవాన్ని కలుగజేశాడు. ఆ హయహేషలకు గోపకు లందరూ ప్రాణభీతి చెంది శ్రీకృష్ణుని వద్దకు పరిగెత్తారు. ''కృష్ణా! కృష్ణా! మమ్ము రక్షించు!'' అని కేకలు వేశారు. శ్రీకృష్ణుడు వారిని చూస్తూనే విషయం గ్రహించి భయపడవద్దని ధైర్యం చెప్పాడు. ''ఆ వస్తున్నవాడు కేశి. మనం ఇంతకన్నా ఎన్నో కష్టాలను చూశాము. శత్రువులకు వెన్ను చూపేందుకు గోపకులంలో ధైర్యశౌర్యాలు ఇంకా వట్టిపోలేదు. ఈ అల్పసారుడు మనను ఏమీ చేయలేడు. ఓరీ దురాత్ముడా! వచ్చి నాతో పోరాడు. నేనే కృష్ణుణ్ణి. దక్షయజ్ఞంలో వీరభద్రుడు పూషుని పడగొట్టినట్లు ఇప్పుడే నిన్ను

భగ్నరదనుని కావించి మృత్యుదూతలకు అప్పగిస్తాను" అంటూ మేఘగంభీరస్వనంతో కేశిని యుద్ధానికి పిలిచాడు. ఎగిరి ముందుకు దూకి వదనభాగం లోనికి చేయిజొనిపి వ్రేళ్లతో దంతమూలాలను పెకలించి ఒక్కపెట్టున బయటికి ఊడలాగాడు. రోగిశరీరం లోనికి వ్యాధిలక్షణాలు ప్రవేశించి మరణానికి దారితీసినట్లు కేశి వదనం లోనికి ప్రవేశించిన శ్రీకృష్ణుని హస్తం ఇంకా లోపలికి వెళ్లింది. అప్పటికే కడుపు చీలి పెదవులు విచ్చుకొని నురుగులు కారుతున్న వాడు రక్తధారలను కక్కాడు. కళ్లు తిరిగి, కీళ్లు విరిగి, పేగులు తెగి విణ్మూత్రాలు స్రవించాయి. ఒళ్లంతా ముచ్చెమటలు పోశాయి. శరీరం పట్టుతప్పింది. అంతకన్నా పోరాడే శక్తిలేక విద్యుద్ఘాతానికి రెండుగా చీలిన భూరితరువును పోలి నేల కొరిగాడు. దేహం నిలువునా చీలి రెండు భాగాలుగా విడిపోయి చెరొక వైపు పడిపోయింది. గోపదంపతు లందరూ విస్మితచిత్తులై విస్ఫారితనేత్రాలతో వల్లవీ మానసచోరుని, లీలామర్త్యరూపుని, దివ్యమంగళ విగ్రహుని, పుండరీకదళ విశాలనేత్రుని, మందస్మితవదనారవిందుని శ్రీకృష్ణపరమాత్ముని పరివేష్టించి మధురాలాపాలతో తనియజేశారు.

అప్పుడు నారదుడు నీలమేఘాన్ని అధిరోహించి వచ్చి అదృశ్యరూపంలో వాసుదేవునికి ప్రణమిల్లాడు. "నమస్తేఽస్తు జగన్నాథా! లోకమంగళదాయకా! పుండరీకాక్షా! ఈ రాక్షసుడు త్రిదివౌకసులకు నిలువనీడ లేకుండా చేశాడు. నరునికి, అశ్వానికి మహారణం సంభవించటం ఇదే మొదలు. అభూతపూర్వమైన ఈ విశేషాన్ని దర్శింపగోరి నేను స్వర్గంనుంచి ఇక్కడికి వచ్చాను. మానుషవిగ్రహుడవై నీవు ప్రదర్శించిన దైత్యసంహారలీలలను తిలకించి మేరలేని ఆశ్చర్యాన్ని పొందాను. ఈ నాటి నీ రణకళాకౌశలానికి విగళితవేద్యాంతరమైన ఆనందానుభవం కలిగింది. కృష్ణా!

కేశినిషూదన లీలావినోదునికి నీకు ఈ నాటినుంచి కేశవుడని పేరు కలుగుతుంది గాక! నీకు మేలు జరుగుతుంది గాక! ఇప్పటికి సెలవు తీసికొంటాను. మళ్ళీ ఉగ్రసేనాత్మజుడు కంసుని నీవు సపరివారంగా సంహరించి భారావతరణాన్ని కావించే మహారణాన్ని చూడటానికి వస్తాను. ఇంకా పృథివీపతులతో జరుగనున్న అనేక సంగ్రామాలలో నీ విజయపరంపరను కన్నులపంటగా చూడాలి. వెళ్ళివస్తాను ప్రభూ! దేవతలు నీవు కావించిన సాహాయ్యానికి కృతజ్ఞులై ఉంటారు. నేను కూడా ఎంతో సంతోషించాను. త్రైలోక్యమంగళవిధాతా! మమ్మల్ని చల్లగా చూడు'' అని పలికి వీడ్కోలిపి వెళ్ళిపోయాడు.

నారదుని పలుకులను విని ముఖంలో ఎట్టి భావమూ కాన రాకుండా సర్వసమభావనుడు, గోపీనేత్రపానైకభాజనుడు, వంశీగాన వినోదుడు శ్రీకృష్ణుడు గోకులానికి నడిచాడు.

అక్రూరాగమనం

కంసుని ఆనతిని గైకొని మహావేగంతో ప్రయాణించే రథాన్ని అధిరోహించి మధురనుంచి బృందావనానికి బయలు దేరిన అక్రూరుని మనస్సు శ్రీకృష్ణదర్శనాభిలాషతో ఉరకలు వేస్తున్నది. ''ఇన్నాళ్ళకు నా జన్మ ధన్యమయింది. నా కంటె భాగ్యశాలి వేరొకడుండడు. భూలోకావతీర్ణ వైష్ణవతేజాన్ని కన్నులారా కను గొంటాను. నవవికసిత పద్మినీదళాల వంటి విశాలనేత్రాలతో వెలు గొందే శ్రీమహావిష్ణువు ముఖసౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తాను. సంకల్పమాత్రాన జన్మజన్మల పాపసంచయాన్ని పటాపంచలు చేసే పుండరీకదళాయతాక్షుని ముఖదీప్తుల తేనెసోనలలో నా బ్రతుకు పండించుకొంటాను. వేద వేదాంగాలకు ప్రభవస్థానమైన భగవన్ముఖ సరోజ పరమపదాన్ని దర్శించి కర్మబంధాలను శిథిలీకరిస్తాను. యజ్ఞా లలో ఏ పరమపురుషుని పురుషులు పురుషోత్తమునిగా సంభావించి

యజ్ఞపురుషునిగా ఆరాధిస్తారో ఆ లీలాపురుషవిగ్రహుని సందర్శన భాగ్యంతో భవిష్యత్పురుషాంతరాలను పవిత్రీకరిస్తాను. అనాది మధ్యలయు డైన ఏ మహాత్ముని శతక్రతువులతో ఆరాధించి దేవేంద్రుడు స్వర్గాధిపత్యాన్ని చూరగొన్నాడో, ఆ కరుణాసముద్రునికి ప్రణతు లర్పించి సురాసురులకు సాధ్యం కాని మహానందాన్ని అనుభవిస్తాను. బ్రహ్మేంద్ర వసు రుద్ర మరుదగ్నిగణాలకు గోచరీభూతుడు కానేరని పరంధాముడు నన్ను పలుకరించి గాఢపరిష్వంగాన్ని ప్రసాదించి పరవశింపజేస్తాడు. సర్వాత్ముడు,సర్వవిదుడు, సర్వభూతాంతరాత్ముడు, సర్వవ్యాపకుడు, సర్వేశ్వరుడు శ్రీహరితో నాకు సల్లాపభాగ్యం కలుగుతుంది. శిష్టరక్షణార్థం మత్స్య కూర్మ వరాహ నరసింహ హయగ్రీవాది రూపాలలో అవతరించిన భగవానుడు, జగద్విధాత ఈ రోజు నన్ను ఆప్యాయంగా పలకరిస్తాడు. ఆత్మేచ్ఛాకృతపృథగ్రూపధారికి భారావతరణ కార్యాన్ని స్మరణకు తెచ్చి మధురకు ఆహ్వానింప నున్న నాతో స్మితపూర్వకంగా సంభాషిస్తాడు. సహస్రశీర్షాల పైని ధారుణీవలయాన్ని ధరించిన అనంతుడు ఈనాడు నన్ను 'అక్రూరా!' అని సంబోధిస్తాడు. పితృపుత్రకళత్ర సంసారరూపమైన మాయావరణను కల్పించి జీవులకు జగద్బంధనాలను విధించిన పరమపురుషునికి నమస్కరిస్తాను. యోగి మానస సరోవరాలలో నిత్యవిహరమాణ హంసస్వరూపుడై అవిద్యా నిర్మూలన పరాయణు డైన విద్యాత్మకునికి ప్రణమిల్లుతాను. యాజ్ఞికులు యజ్ఞపురుషుడని, సాత్వతులు వాసుదేవుడని, వేదాంతవిదులు శ్రీమహావిష్ణువని ఆరాధించే శ్రద్ధానిత్యానువర్తనులకు అభీష్టాలను ప్రసాదించే మహాత్మభావునికి చేతులు జోడిస్తాను. భూతసృష్టిస్థిత్యంతకారకు డైన ఏ సర్వశక్తిమంతుని స్మరించినంత మాత్రాన సకల కళ్యాణపరంపరలు చేకూరుతాయో, ఆ ఆదిపూరుషుని, అజుని, అవ్యయుని శరణు వేడుకొంటాను.''

అని ఆ విధంగా చిత్తాన్ని శ్రీమన్నారాయణుని యందు పాదుకొల్పి భక్తినమ్రాత్మమానసుడైన అక్రూరుడు గోకులాన్ని చేరుకొనేసరికి సూర్యాస్తమయం కాబోతున్నది. గోపకు లందరూ పాలు పితుకుతున్నారు. గోవత్సాలను మధ్య మధ్య లాలిస్తూ గోప కులదీపనుడు బాలగోపాలుడు దుగ్ధదోహనకర్మలో నిమగ్నుడై ఉన్నాడు. అతని దేహకాంతి ఉత్ఫుల్లనీలోత్పల దళచ్ఛాయను పోలి ఉజ్జ్వలంగా ఉన్నది. నల్లని కన్నులు కొనలుదేరి వికచపద్మదళాల వలె తేజరిల్లుతున్నాయి. వక్షఃస్థలాన శ్రీవత్సచిహ్నం వెలుగొందు తున్నది. ఆజానులంబి దీర్ఘబాహుడు, సమున్నత నాసావంశ శోభితుడు, చిరునవ్వు రాజిల్లే నెమ్మోము వాడు, నేలపై సుప్రతిష్ఠి తంగా నిలిచినవాడు, నునుపెక్కిన ఎర్రని గోళ్లు కలవాడు, వన పుష్పాలను అలంకరించుకొన్నవాడు, పచ్చని వస్త్రాలను ధరించిన వాడు, సిగలో తెల్లతామర పువ్వులను తురుముకొన్నవాడు, చేతిలో ఇంకా తడి ఆరని నీలలతను పట్టుకొని సర్వాకర్షణీయంగా ఉన్న వాడు అక్రూరునికి దర్శన భాగ్యాన్ని ప్రసాదించాడు. అతని ప్రక్కనే హంస వలె, చంద్రుని వలె, కుందసూనం వలె ధవళ కాంతులను విరజిమ్ముతున్నవాడు, మహాబాహుడు, మహాబలుడు, ఒక సుందరవిగ్రహుడు మబ్బుల నడుమనున్న కైలాసాద్రి వలె సుప్రతిష్ఠితంగా నిలబడి ఉన్నాడు.

అక్రూరునికి బలరామకృష్ణులను సందర్శించిన మహానందంతో తనువు పులకించింది. సాఫల్యమోక్షణాలు రెండూ ఏకకాలంలో సంభవించిన దివ్యానుభవం కలిగింది. తను కావించిన భక్తిఫలం రెట్టింపయినట్లు ద్విధాభూతంగా తనకు సాక్షాత్కరించిన భగవ ద్వాసుదేవాంశను కళ్లు పెద్దవిచేసి ఆరాధనతో ప్రీతిపూర్వకంగా తిలకించాడు. ప్రారబ్ధకర్మఫలంగా కలిగిన తనువు భగవదంగ

సంగంతో పరమపావన మవుతుందని, శ్రీమదనంతమూర్తి ప్రేమాద్ర రాలతో తన వీపుపై చేయివేసి చిరకాలభవబంధాలను విచ్ఛేదింప నున్నాడన్న అభిజ్ఞానంతో మనస్సులో ఆనందతరంగాలు క్రేళ్లురి కాయి. సూర్యాగ్నివిద్యుద్రశ్మిమాలలతో అతికరాళమైన సుదర్శనాన్ని ధరించి దైత్యపతుల ప్రాణానిలాలను, దైత్యాంగనల కంటి కాటుకలను ఏకకాలంలో అపాకరించిన పరమపావన కరతలం; దానధారలను విన్యసించిన బలిచక్రవర్తికి మన్వంతరపర్యాప్తమైన మహేంద్రపదవిని ప్రసాదించిన పవిత్ర కరతలం—భవక్లేశాలను అపనయించి బ్రతుకు పండింపనున్నదన్న ఆనందవిభూతి వల్ల నారు పోసినట్లు రోమాంచం కలిగింది. "జ్ఞానాత్మకుడు, విశుద్ధసత్త్వుడు, అపేతసమస్తదోషుడు అయిన ఆ పరమపురుషునికి తన శక్తికార్యమైన జగత్తులో రూపుతాల్చినవారి హృదయాలలో ఏమున్నదో ఎందుకు తెలియదు? భక్తివినమ్రచిత్తుడనై అనాదిమధ్యాంతమయుడైన సర్వేశ్వరుడు శ్రీమహావిష్ణువు యొక్క అంశావతారునికి పురుషోత్తమునికి ప్రణమిల్లుతాను" అని తలపోసి శ్రీకృష్ణ పరమాత్మను సమీపించి, "ప్రభూ! నేను అక్రూరుడిని" అని వినివేదించి, శ్రీమన్నారాయణ చరణసరోజాలను కన్నుల కద్దుకొని శిరసా నమస్కరించాడు. శ్రీకృష్ణుడు ధ్వజ వజ్ర పద్మరేఖాంకితమైన పవిత్ర పాణితో అక్రూరుని మెల్లగా లేవనెత్తి, ప్రీతిపూర్వకంగా దగ్గరకు తీసుకొన్నాడు.

బలరామకృష్ణులు అక్రూరునితో ప్రేమపూర్వకంగా సంభాషించి, అతను చెప్పినదంతా విని మహానందభరితులై అతనిని తమ నివాసానికి తీసికొనివెళ్లి సుఖాసీనుని కావించి ఇష్టాగోష్ఠి నెరపుతూ భోజనాదికం ముగించి మళ్లీ మాటలలో పడ్డారు. అక్రూరుడు వారికి మథురలో కంసుడు ఆనకదుందుభిని, దేవకిని, చివరికి ఉగ్రసేన

మహారాజును కూడా ఏ విధంగా అవమానాలకు గురిచేసినదీ తన వక్తవ్యానికి భూమికగా వివరించి చెప్పాడు. అంతంలో తన రాకకు కారణాన్ని ప్రస్తావించి, కంసుడు చెప్పమన్న సందేశాన్ని వినిపించాడు. శ్రీకృష్ణుడు అతని మాటలకు తల పంకించి, "మహాదాతా! నీవు చెప్పిన సంగతి నాకు ఇంతకుమునుపే తెలుసు. రేపే బయలుదేరి బలదేవుడు, నేను మథురకు నీ వెంటే వస్తాము. గోపవృద్ధు లందరూ కానుకలను తీసికొని రాజదర్శనానికి వస్తారు. ఈ రాత్రికి చింతమాని నీ విక్కడే హాయిగా విశ్రమించు. నేటికి మూడు రాత్రులలోగా నేను కంసుని, అతని పరివారాన్ని వధిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు.

తను వచ్చిన కార్యం నెరవేరి శిష్టరక్షణార్థం భగవానుడు మథురకు రాబోతున్నాడని తెలిసి అక్రూరుడు గుండెమీద చేయి వేసుకొని ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు. బలరామకృష్ణులు తెల్లవారుజామున నే లేచి పెద్దలందరినీ వీడ్కొలిపి అక్రూరునితో కలిసి కంసరాజనగరానికి బయలుదేరారు.

ఆనాడు గోపికల దుఃఖానికి అంతులేదు. "గోవిందుడు మథురానగరికి వెళ్లిన తర్వాత మళ్లీ గోకులానికి రావడం కల్ల. పట్నవాసంలో నెరజాణల విలాసచేష్టితాలను చూసినప్పుడు ఈ పల్లెటూరి గొబ్బెమ్మలు జ్ఞాపకానికి వస్తారా? పాలలోని సారం మీగడగా తేరినట్లు గోకులానికి వెలుగు గోపాలకృష్ణునిగా మన మధ్య అవతరించింది. దైవదుర్విపాకం వలన ఇప్పుడు మనకు శ్రీహరితో వియోగం వ్రాసిపెట్టి ఉన్నది. భావగర్భితమైన ఆ మందహాసాలు, ఆ మధురాలాపాలు, ఆ లలితవిలాసగతులు నాగరిక భోగవతులకు అలవడినట్లు మనకు ఎంత ప్రయత్నించినా చేతనవుతాయా? ఈ పల్లెటూరిలో పుట్టి పెరిగిన మనవాడికి ఆ పట్నవాసపు వింతలు విడ్డూరాలను చూశాక తన పూర్వజీవితం మరపుకు రావడం

సహజమే. ఆ క్రూరుడు అక్రూరుడు మన కేశవుడిని మాటలలో పెట్టి మథురకు తీసికొనివెళ్లాలని ఇదిగో ఈ రథాన్ని వెంట తెచ్చాడు. ఇంతకీ ఎవరినో అని ఏమి ప్రయోజనం! బయటినుంచి వచ్చిన మోసగాడికి మన కలుపుగోరుతనం, మన ఆప్యాయతలు, మన ప్రేమానురాగాలు ఎలా తెలుస్తాయి? బలదేవుని వెంట బెట్టుకొని నిర్దయగా వెళ్లిపోతున్న ఆ మాయదారి కృష్ణుణ్ణి అనాలి. పెద్దలతో చెప్పుకుందామంటే పాపం వారు మాత్రం ఏమి చేయగలరు? విరహాగ్ని జ్వాలలలో కుమిలిపోతున్న మన తాపాన్ని ఎలా చల్లార్చగలరు? మనమే వెళ్లి రథానికి అడ్డుపడదాము. గోపకులు, నందగోపుడు, అందరూ వెళ్లాలని త్వరపడే వాళ్లేకాని వెళ్లవద్దని చెప్పేవాళ్లు లేకపోయారు. శ్రీకృష్ణముఖసరోజ మధువులను తమ విలోకన మదద్విరేఫాలతో తనివితీరా గ్రోలనున్న మథురానగర సుందరీమణుల భాగ్యమే భాగ్యం. గోపసుందరునితో కలిసి ప్రయాణించే మన గోపకుల భాగ్యమే భాగ్యం. ఈనాడు మథురానగరంలో పౌరులకు మహోత్సవం! అధోక్షజుని దర్శనభాగ్యానికి నోచుకొని, అతని దృష్టిపథంలో విహరింపనున్న సౌభాగ్యవతులు నిజంగా అసూయపడదగినవాళ్లు. వ్రేపల్లెకు మన గోపాలకృష్ణుని ప్రసాదించిన ఆ బ్రహ్మదేవుడు, గోపికాసౌఖ్యవిధాత, ఎందుకో ఈనాడు చూపు మరల్చి మథురానగరికి సర్వసౌభాగ్యాలను కటాక్షింపబోతున్నాడు. ఇంత దుఃఖిస్తున్నా మనపైని ఏమాత్రం జాలిలేని క్రూరుడు అక్రూరుడు హయాలను అదలిస్తున్నాడు. రథం బయలుదేరుతున్నది. క్రమక్రమంగా రథం దూరమై నేలనుంచి నింగికి లేచిన ధూళి మాత్రమే కనిపిస్తున్నది. ఇంకా దూరానికి వెళ్లినందున కాబోలు, ఇప్పుడు దుమ్ము కూడా కనిపించటంలేదు'' అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆ విధంగా రామాక్రూరజనార్దనులు జవనాశ్వాలు పూన్చిన రథాన్ని అధిరోహించి గోపకాంతల హార్దనిరీక్షణాలకు దూరమవుతూ వ్రజ భూభాగాన్ని విడిచిపెట్టి మహావేగంతో ప్రయాణిస్తూ మధ్యాహ్నం కావచ్చేసరికి యమునాతటాన్ని చేరుకొన్నారు. అక్రూరుడు శ్రీకృష్ణుని అనుమతి గైకొని బండి దిగి కాళిందీ జలాలలో మాధ్యాహ్నికకార్యాచరణాలను నెరవేర్చాడు. తీర్థస్నాతుడై ముఖ ప్రక్షాళనాదికం ముగించుకొని ప్రవాహజలాలలో నిలిచి పరబ్రహ్మన్ని ధ్యేయమూర్తిగా నిలుపుకొని కనులు మోడ్చి ఇంద్రియాలు ప్రసన్నంగా శాంతమనస్సుతో ధ్యానధారణ చేశాడు. అప్పుడతనికి ఫణాసహస్రసమూలాఢ్యమైన బలభద్ర తేజోదర్శనం కలిగింది. ఉన్నిద్ర పద్మపత్రాల వంటి విశాలనేత్రాలు కలిగిన ఆ సహస్రశీర్షుని కంఠదేశంలో సుగంధాలను విరజిమ్ముతున్న కుందమాల విరాజిల్లుతున్నది. వాసుకి, రంభుడు మొదలైన మహాసర్పాలు ఆయనను పరివేష్టించి ఉన్నాయి. వనమాలావిభూషితులైన గంధర్వులు స్తోత్రగానాలు చేస్తున్నారు. శ్రీమదనంతమూర్తి కృష్ణవస్త్రాన్ని, పద్మావతంసకాన్ని, దివ్యకుండలాలను ధరించి అంతర్జలాలలో ప్రస్థితుడై ఉన్నాడు.

ఆదిశేషుని ఉత్సంగాన్ని తల్పంగా చేసికొని నీలమేఘశ్యాముడు, తామ్రవర్ణంలో మిరుమిట్లు గొలుపుతున్న విశాల నేత్రాలతో, సుదర్శన కౌమోదకీ నందక పాంచజన్యాలను ధరించిన అతిపీవర చతుర్బాహువులు, పీతాంబరం, కంఠసీమలో నానా చిత్ర మాల్య విభూషణాలు, వక్షఃస్థలాన శ్రీవత్స చిహ్నం, కేయూరాంగద ముకుటాలతో శక్రచాప తటిన్మాలా విచిత్రమైన వారివాహం వలె ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్న పురుషోత్తముడు శ్రీకృష్ణుడు పుండరీకావతంసాన్ని ధరించి నాసాగ్ర న్యస్తలోచనులై సనందనాది

మునీంద్రులు, సిద్ధయోగీంద్రుల ధ్యానధారణలో సుప్రతిష్ఠితుడై ఉన్న వాడు, శ్రీ వాసుదేవుడు, పరమపురుషుడు, భక్తపరాధీనుడు సాక్షాత్కరించాడు.

ధ్యానవివశుడై ఉన్న అక్రూరునికి బలరామకృష్ణులు రథం దిగి అంతర్జలాలలోనికి ఎప్పుడు ప్రవేశించారని చిత్రమైన ఒక సందేహం కలిగింది. అయితే జనార్దనుడు అతనికి వాక్స్తంభన కావించినందువల్ల గొంతు పెగిలి మాట బైటికి రాలేదు. అతను మళ్లీ ఇంద్రియానుగతుడై దేహస్మృతిని పొంది సాంధ్య విధులను ముగించుకొని ఒడ్డుకు చేరి రథం ఆగిన చోటికి త్వర త్వరగా వచ్చాడు. అక్కడ బలరామకృష్ణులు ఎప్పటివలెనే మనుష్య శరీరాన్వితులై అతనికోసం ఎదురుచూస్తున్నారు. అతను వెంటనే వెనుదిరిగి కాళిందీ తోయాలలోనికి ప్రవేశించి ధ్యానవిరాణ్మూర్తిని సంకల్పించాడు. అప్పుడు మళ్లీ సిద్ధ గంధర్వ మునిమహోరగ ప్రస్తూయమానులైన దివ్యపురుషులు ప్రత్యక్షమయ్యారు. భక్తావతంసుడు అక్రూరునికి విజ్ఞానసద్భావం ఉదయించింది. ఆ విజ్ఞాన ప్రభావంవలన అపూర్వమైన వైఖరీశక్తి అలవడింది. అతను శ్రీ మహావిష్ణుస్తోత్రరాజాన్ని ఆశుధోరణిని గానం చేశాడు.

శ్రీ వాసుదేవ పరబ్రహ్మ స్తోత్రం

సన్మాత్రరూపిణేఽ చిన్త్యమహిమ్నే పరమాత్మనే
వ్యాపినే నైకరూపైకస్వరూపాయ నమో నమః.

సత్త్వరూపాయ తేఽచిన్త్య! హవిర్భూతాయ తే నమః
నమోఽవిజ్ఞాతపారాయ పరాయ ప్రకృతేః ప్రభో.

భూతాత్మా చేన్ద్రియాత్మా చ ప్రధానాత్మా తథా భవాన్
ఆత్మా చ పరమాత్మా చ త్వమేకః పఞ్చధా స్థితః.

ప్రసీద సర్వసర్వాత్మన్ క్షరాక్షరమయేశ్వర
బ్రహ్మ-విష్ణు-శివాద్యాభిః కల్పనాభి రుదీరితః.

అనాఖ్యేయ స్వరూపాత్మన్! అనాఖ్యేయ ప్రయోజన!
అనాఖ్యేయాభిధానం త్వాం నతోఽస్మి పరమేశ్వర.

న యత్ర నాథ! విద్యన్తే నామజాత్యాదికల్పనాః
తద్బ్రహ్మ పరమం నిత్య మవికారి భవా నజః.

న కల్పనామృతేఽర్థస్య సర్వస్యాధిగమో యతః
తతః కృష్ణాచ్యుతానన్త విష్ణుసంజ్ఞాభి రీడ్యసే.

సర్వార్థ స్త్వ మజ! వికల్పనాభి రేతద్
దేవాద్యం జగదఖిలం త్వమేవ విశ్వమ్
విశ్వాత్మం స్త్వమితి వికారభావహీనః
సర్వస్మిన్ నహి భవతోఽస్తి కిఞ్చిదన్యత్.

త్వం బ్రహ్మ పశుపతి రర్యమా విధాతా
ధాతా త్వం త్రిదశపతిః సమీరణోఽగ్నిః
తోయేశో ధనపతి రన్తక స్త్వమేకో
భిన్నార్థై ర్జగదపి పాసి శక్తిభేదైః.

విశ్వం భవాన్ సృజతి సూర్య గభస్తి రూపో
విశ్వఞ్చ తే గుణమయోఽయ మజ! ప్రపఞ్చః
రూపం పరం సదితివాచక మక్షరం యద్
జ్ఞానాత్మనే సదసతే ప్రణతోఽస్మి తస్మై.

ఓం నమో వాసుదేవాయ
నమః సఙ్కర్షణాయ తే
ప్రద్యుమ్నాయ నమ స్తుభ్య
మనిరుద్ధాయ తే నమః.

ఆ విధంగా అంతర్జలాలలో నిలిచి శ్రీ వాసుదేవ పరబ్రహ్మన్ని ప్రస్తుతించిన అక్రూరుడు మనస్సులోనే షోడశోపచారాలను

ధ్యానించి శ్రీకృష్ణార్పితచేతస్కుడై సమాధిస్థితిని పొందాడు. కొంత సేపటికి సర్వాతీతుని ధ్యానధారణ విరమించి చిత్తాన్ని పంచ భూతాలలోనికి నివేశించి, పాంచభౌతికమైన దేహస్ఫురణ కలిగి తన కోసం బలరామకృష్ణులు ఎదురుచూస్తుంటారని జ్ఞాపకం వచ్చి వెంటనే యమునాజలాల నుంచి వెలువడి రథం ఉన్నచోటికి వచ్చాడు. అతని కన్నులలో వెలుగొందుతున్న ఆశ్చర్యానందాలను విలోకించి శ్రీకృష్ణుడు "అక్రూరా! యమునా జలాలలో ఏదో అపూర్వమైన దృశ్యాన్ని చూశావు కాబోలు! నీ కళ్లల్లో ఆ విస్మయం తొణికిసలాడుతున్నది సుమా!" అని దరస్మేరపూర్వకంగా అన్నాడు. అక్రూరుడు ప్రశ్రయావనతుడై "ప్రభూ! అంతర్జలాలలో నేను చూసిన ఆశ్చర్యం నా కన్నులయెదుటనే మూర్తీభవించి ఉన్నది. విశుద్ధసత్త్వాకృతివైన నీవు యోగనిద్ర నుంచి మేల్కాంచి నపుడు నీ రజోగుణంవలన జగత్సృష్టి జరుగుతున్నది. అదిసరే; ఆలస్యం కాకుండా మనమిక వెంటనే మథురకు చేరుకోవాలి. ఇతరులపై ఆధారపడి ఉపజీవించేవారికి ఈ పాట్లు తప్పవు కదా!" అంటూ గుర్రాలను కదను తొక్కించి వాయువేగంతో ముందుకు దూకించాడు.

అక్రూరాదులు మథురను చేరుకొనేసరికి పొద్దు గ్రుంకి చీకటి పడుతున్నది. ఊరి పొలిమేర దాటి ఇళ్లూ వాకిళ్లూ కనబడే చోటికి వచ్చాక అక్రూరుడు బలరామకృష్ణులతో "మీ రిద్దరూ బండి దిగి పాదచారులై రండి. నే నొక్కడినీ వెళ్లి కంసునికి మీ ఆగమనవార్తను తెలియజెయ్యాలి. వసుదేవుని ఇంటికి వెళ్లకండి. మీ మీది ఆగ్రహంవల్ల కంసుడు ఆ వృద్ధదంపతులకు అపకారం తలపెట్టవచ్చు" అని పలికి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

రజకుని వధ

రామకృష్ణు లిద్దరూ రాజమార్గంలో ఇరువైపులా వింతలను చూసుకొంటూ ముందుకు నడవసాగారు. స్త్రీపురుషు లందరూ తమ కేసి చోద్యంగా చూస్తుంటే వారి అభివీక్షణాలను స్మితపూర్వకంగా అందుకొంటూ ఇద్దరూ బాలగజాల వలె ధీరగమనంతో ముందుకు సాగారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఒకచోట చాకలివా డొకడు దుస్తులకు రంగువేస్తూ కనిపించాడు. అన్నదమ్ములిద్దరూ అతనిని ఆట పట్టించి తమకోసం ఒకటి రెండు మంచి జతలను ఇమ్మంటూ అల్లరి చేశారు.

బలరామకృష్ణులు పలకరించిన చాకలివాడు కంసుని పరివారంలో ఒకడు. అతను నగరపరివేషానికి భిన్నంగా కనిపించిన ప్రజౌకసులను ఆక్షేపించడమే కాక అసహ్యంగా తూలనాడాడు. అతని ప్రవర్తన శ్రుతిమించి మితిమీరాక శ్రీకృష్ణుడు అతనిని తల నేలకు తగిలేట్లు మెలితిప్పి ఒక్క దెబ్బతో అతనిని నేల కూల్చాడు. అన్నదమ్ము లిద్దరూ తమకు నచ్చిన మంచి దుస్తులను ఎంచి సరిచూసుకొన్నారు. కృష్ణుడు పీతాంబరాన్ని, బలరాముడు నీలాంబరాన్ని ధరించి అక్కడి నుంచి ఒక పువ్వు లమ్మే చోటికి వచ్చారు.

మాలకరికి వరదానం

మైత్రేయా! బలరామకృష్ణుల సందడికి మాలకరి ఇంటిలో నుంచి బయటికి వచ్చి తన గృహప్రాంగణంలో నిలబడిన సుందరాకారులను చూసి ఎవరో దివ్యపురుషు లనుకొని సాదరంగా లోనికి ఆహ్వానించాడు. శ్రీకృష్ణు డతనిని అలంకరణార్థం పుష్పమాలికలను ఇమ్మని అడిగాడు. మాలాకారుడు బలరామకృష్ణుల పాదాలకు మోకరిల్లి మహాత్ములారా! నా యందలి దయతో ఈనాడు మీరు

నా గృహాన్ని పావనం చేశారు. నన్ను ధన్యుణ్ణి చేశారు. నేను మాల్యజీవకుడిని. మీకు పుష్పోపచయాలతో సేవావిధి నిర్వర్తించు కొంటాను'' అంటూ వారి మనస్సులకు నచ్చిన పువ్వులను దోయిలితో అందించాడు. శ్రీకృష్ణుడు ఆ సుగంధకుసుమాలను అందుకొని, అతని శ్రద్ధావినయాలకు సంతుష్టుడై, ''నన్ను ఆశ్రయించుకొని వర్ధిల్లుతున్న లక్ష్మీకటాక్షం నీయెడ అవ్యాహతంగా ప్రసరిస్తుంది గాక. నీకు బలహాని, ధనహాని ఏనాటికీ కలుగనేరవు. నీ వంశం అక్షీణమై ఆచంద్రతారార్కం ప్రవర్ధిల్లుతుంది. జీవులకు ప్రారబ్ధకర్మఫలంగా శరీరధారణ కలుగుతున్నది. కర్మావధి ముగిసిన తర్వాత భోగనిమిత్తమై ఏర్పడిన శరీరం తనంత తానుగా పతనమై పోతుంది. నీకు ప్రారబ్ధకర్మ భుక్తమైనాక నా స్మరణానుభావంవలన దివ్యలోకాలు సంప్రాపిస్తాయి. నీ మనసు ఎల్లవేళల ధర్మనిష్ఠితమై వెలుగొందగలదు. నీ సంతతివారికి చిరాయుర్వృద్ధి కలుగుతుంది'' అని వరాన్ని ప్రసాదించాడు. మాలాకారుని పూజ లందుకొని బలరామకృష్ణులు అక్కడి నుంచి ముందుకు సాగారు.

కుబ్జకు సౌందర్యదానం

ఆ విధంగా రాజమార్గంలో నడుస్తూ ఉండగా ఒకచోట బలరామకృష్ణులకు సుగంధద్రవ్యాలను అమ్ముతున్న ఒక నవయౌవనవతి కుబ్జ ఎదురువచ్చింది. శ్రీకృష్ణుడు ఆమె చెంత కేగి ''ఇందీవరాక్షీ! ఈ సుగంధ ద్రవ్యాలను ఎవరికోసం తీసుకొని వెళ్తున్నావు? నాతో నిజం చెప్పు'' అంటూ ఆమెను పలకరించాడు. కుబ్జ అతనిని అనురాగవీక్షణాలతో పరికించి చూసి అతని దివ్య సౌందర్యానికి ముగ్ధురాలై, ''అయ్యా! నేను కంసుని సేవికను. ఈ అనులేపనాలు నేను తప్ప ఎవరు సిద్ధం చేసినా ఆయనకు నచ్చవు. అందువల్ల ఆయన ప్రీతిపూర్వకంగా ఇచ్చే ధనాది బహుమానాలను

అందుకొంటూ ఆయన సేవలో కాలం గడుపుతున్నాను'' అని సమాధానం చెప్పింది. శ్రీకృష్ణుడు ఆమె పలుకులకు తల పంకించి, ''రాజులకు మాత్రమే ఉపభోగ్యమైన ఈ చందనచర్చలు ఎటువంటివో చూసితీరాలి. మా ఇద్దరికీ కొంచెం ఇవ్వగలవా?'' అని అడిగాడు.

శ్రీకృష్ణుని అభీప్సితానికి ముచ్చటపడి కుబ్జ వెంటనే అందుకు అంగీకరించింది. సుగంధపాత్రికను తలమీది నుంచి దించి వారి ముందుంచి ''మీకు కావలసినంత సంతోషంగా తీసుకోండి'' అంటూ సుగంధానులేపనాలను ఒకటొకటిగా వారికి అందించింది. బలరామకృష్ణులు ఆ పరిమళాలను ఒంటికి పట్టించుకొని ఆ సుగంధానులేపనాలతో భక్తిచ్ఛేదాలను అలంకరించుకొని ఇంద్రచాపం విరిసిన నాటి సితకృష్ణమేఘాలవలె చిత్రవర్ణాలలో విభాసించారు.

శ్రీకృష్ణుడు కుబ్జావనిత ముగ్ధభక్తికి ఎంతో సంతోషించాడు. ఆమె చిబుకాన్ని చేతివ్రేళ్ళ కొసలతో పుణికిపుచ్చుకొని, తలను పైకెత్తి, తన పాదాగ్రాలతో ఆమె కుబ్జాత్వాన్ని పోగొట్టి మరుగుజ్జు దేహాన్ని ఋజుతరం కావించి సుప్రతిష్ఠితంగా రూపొందించాడు. తనకు పుట్టుకతో వచ్చిన కురచశరీరాన్ని పూర్ణసౌందర్యమయంగా విభాసింపజేసినందుకు ఆమె కృతజ్ఞురాలై బలరామకృష్ణులను తన ఇంటికి వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరించమని వేడుకొన్నది. శ్రీకృష్ణుడు ఆమె మనోభావాన్ని గ్రహించి, మందస్మితవదనారవిందుడై, వీలు చూసుకొని తప్పక రాగలనని మాటయిచ్చాడు. ఆమె వారిద్దరినీ వీడ్కొలిపి వెళ్లిన తర్వాత సాభిప్రాయంగా తననే పరికిస్తున్న బలరాముని కళ్లల్లోకి చూశాడు. ఇద్దరూ సంతోషంగా నవ్వుకొన్నారు.

ధనుర్యాగభంగం

అంతట భక్తిచ్ఛేదానులిప్తాంగులు, నీలపీతాంబరధారులు, దివ్యమంగళవిగ్రహులు బలరామకృష్ణులు అక్కడి నుంచి ముందుకు

సాగి ధనుశ్శాలను చేరుకొన్నారు. ఆనాడు ధనుర్యాగం జరుగనున్నందువల్ల ఆ ప్రదేశమంతా ఉత్సవశోభతో కళకళ లాడుతున్నది. ఎక్కడ చూసినా చిత్రమాలికలను అందంగా అలంకరించారు. శ్రీకృష్ణుడు కార్ముకాలయంలో ఉన్న రక్షకులను పలకరించి, తాను ఏ ధనుస్సును ఎక్కుపెట్టవలసినదీ అడిగి తెలుసుకొని, ఆ మహాధనుస్సును అవలీలగా చేతిలోనికి తీసుకొని నారి బిగించి ఆ అల్లెత్రాటిని చెవిదాకా లాగి వింటిని ఎక్కుపెట్టేలోగానే అతని బలప్రౌఢికి ఆ శరాసనం నడిమికి విరిగిపోయింది. ఆ ధనుర్భంగ మహాధ్వని మథురానగరంలోని సర్వప్రదేశాలలో భయానకంగా ప్రతిధ్వనించింది.

ధనూరక్షకులు ఉత్సవసమయంలో తారసిల్లిన అపశకునానికి కోపించి బలరామకృష్ణులను పరుషవాక్యాలతో నిందించారు. రామకృష్ణులు ఆగ్రహించి క్షణంలో వారందరినీ నేలకూల్చారు.

అక్రూరుడు తిరిగివచ్చిన సంగతి, ధనుర్భంగ వృత్తాంతమూ తెలిసి కంసుడు చాణూర ముష్టికులను పిలిపించాడు. "ఇద్దరు గోపాలకులు మథురానగరానికి వచ్చారు. మీరిద్దరూ పౌరసమక్షంలో వారితో మల్లయుద్ధం చేయాలి. శత్రుసంహారానికి పూనుకొన్న కార్యవాదికి ధర్మాధర్మాలతో పనిలేదు. ఏదో ఒక విధంగా పట్టు తెలిసి వారిద్దరినీ మట్టుపెట్టాలి. యుద్ధంలో వారికి చావు మూడితే మహాయోధులన్న కీర్తి మీకు శాశ్వతంగా దక్కుతుంది. నేను కూడా మీ అభిమతాలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాను. శత్రువును ఎలా చంపారన్నది ప్రధానం కాదు; చంపడమే ప్రధానం. వారి చావుతో నిర్వంశమైన యాదవరాజ్యం నాకు దక్కుతుంది" అని ఆజ్ఞాపించాడు. మావటివాడిని పిలిచి కువలయాపీడ మనే మహాగజాన్ని మందిర ద్వారంలో సిద్ధంగా ఉంచమని ఆదేశించాడు.

రామకృష్ణులు సమీపానికి రాగానే ఏనుగుతో తొక్కించి చంప మని ఆజ్ఞాపించాడు. ఆ తర్వాత పరిచారకులకు వారి వారి నియత విధులను ఉపదేశించి, శయ్యాగారానికి వెళ్ళి మంచంమీద పడుకొని, మృత్యువు తనకోసం పొంచి ఉన్నదని తెలియక, సూర్యోదయం ఎప్పుడవుతుందా? అని ఎదురుచూస్తూ ఎప్పుడో తనకే తెలియ కుండా నిద్రపోయాడు.

తెల్లవారింది. ధనుర్యాగానికి వచ్చిన పౌరులందరూ తమ తమ నియమితస్థానాలలో బారులు తీరి కూర్చొన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన మహీపతు లందరూ అమాత్యభృత్య సమేతంగా ఉచితాసనాలను అలంకరించారు. రంగమధ్యానికి దగ్గరగా న్యాయ నిర్ణేతలకు మంచిచోటు ఏర్పాటు చేయబడింది. వారికి ప్రక్కనే కంసుడు సుఖాసనాసీనుడై మల్లుర కోసం ఎదురుచూస్తున్నాడు. అంతఃపురస్త్రీలకు, వారాంగనలకు, పౌరకాంతలకు వేర్వేరుగా స్థానాలను ప్రకల్పించారు. నందగోపుడు, ఇతర వ్రజౌకసులు ప్రేక్షా గారంలో తమకు నిర్దేశించిన చోట్లలో వచ్చి కూర్చున్నారు. వారికి వెనుక భాగంలో అక్రూరుడు, వసుదేవుడు వ్యవస్థితులై ఉన్నారు. పౌరకాంతలకు ఏర్పరించిన చోట దేవకీదేవి ఉపవిష్టురాలై పుత్రునికి మరణం తథ్యమని ఒకవైపు దుఃఖిస్తూనే, అంత్యకాలంలో నైనా పుత్రదర్శనం కలుగుతుందని అతనికోసం తహతహలాడుతున్నది.

ఉత్సవారంభ సూచనగా తూర్యఘోషలు వినిపించాయి. చాణూరుడు కుప్పించి గంతువేసి రంగమధ్యంలోనికి ...ాడు. జనుల హాహాకారాలు మిన్నుముట్టాయి. అతని వెను
వేదిక మీదికెక్కి భుజాస్ఫాలన చేశాడు.
గుమ్మంలో తమను ఆటంకపరచిన కువలయ
దాని దంతాలను పెకలించి ఆయుధాలు

పూర్ణ దేహాలతో మృగాల నడుమ గర్వలీలావిలోకనాలను వెల యిస్తున్న మృగరాజయుగళాన్ని పోలి రంగమధ్యం లోనికి ప్రవేశించారు. ప్రజల హాహాకారాలతో దిక్కులు పిక్కటిల్లాయి. "ఇతనే శ్రీకృష్ణుడు! ఇతనే మనం వింటున్న బలరాముడు! రక్కసి పూతన ఈ చిన్నవాడినే చంపబోయిందట; శకటాన్ని కాలితాపుతో విరగగొట్టి యమళార్జునాలను భగ్నం చేసినవాడు ముక్కుపచ్చలారని ఈ పసివాడేనట. కాళియఫణి పడగలపై కెక్కి నాట్యలీలను ప్రదర్శించాడట; గోవర్ధనాన్ని ఏడు రాత్రులపాటు కొనగోట దాల్చినవాడు, అరిష్ట ధేనుక కేశినిషూదనుడు, అచ్యుతుడు, మన కళ్లముందు ఉన్నవాడు ఇతడేనట! అతని ప్రక్కనే ఉన్న ఆ మహాబలుడు బలరాముడై ఉండాలి. పురాణార్థాల తాత్పర్యాన్ని నిర్ధారించిన ప్రాజ్ఞులు గోకులోద్ధారకుడని కొనియాడుతున్న పుణ్యపురుషుడు ఈ మహాత్ముడేనట. భారావతరణ కోసం భూమికి దిగి వచ్చిన సర్వభూతాత్మకుడైన శ్రీ మహావిష్ణువు యొక్క తేజోంశలు వీరేనట!" అంటూ ఎటుచూసినా శ్రీకృష్ణస్తోత్రాలు మార్మోగసాగాయి. పుత్రవాత్సల్యంతో దేవకీదేవి స్తనాలు ఉప్పొంగి పయోధారలు స్రవించాయి. వసుదేవుడు కొడుకు ముఖాన్ని చూసి ఆకస్మికంగా జరాభారం తొలగి యౌవనవిలాసం ప్రాప్తించినట్లు మహోత్సాహంగా కనిపించాడు. అంతఃపురస్త్రీలు, పౌరకాంతలు కనులు విప్పార్చి, శ్రీకృష్ణుని ముఖారవిందాన్ని రెప్పపాటు లేకుండా చూస్తూ ఉండిపోయారు. "చూడండమ్మా! చూడండి.
...ాన్ని ఎదుర్కొన్నందువలన కనులు ఎఱ్ఱబారి శరీరం
...లతో వింతగా మెరుస్తున్నది. శరత్కాలంలో పూర్ణ
...పై తెల్లవారుజామున మంచుబిందువులు ప్రకా
...లోత్తముని కనుబొమ్మల నుంచి జారిన

చెమట బిందువులు కపోలతటిపై వింతకాంతులను విరజిమ్ము తున్నాయి. కన్నులున్నందుకు ఫలం ఈ కమనీయ విగ్రహుని కనులారా తిలకించి జన్మ చరితార్థం చేసుకోవటమేనమ్మా! విశాలమైన వక్షఃస్థలాన ఆ శ్రీవత్సచిహ్నాన్ని చూడండి! వైరివిదారణపటువులైన భూరిభుజాలను తిలకించండి! నీలాంబరాన్ని ధరించి అతని ప్రక్కనే నిలబడ్డ బలభద్రుని చూడండి! చాణూరముష్టికుల యెదుట నిర్భయంగా నిలబడి చిరునవ్వు నవ్వుతున్న అతని ధీరత్వాన్ని చూడండి! అదిగో! చాణూరుని ఎదుర్కొంటున్న శ్రీకృష్ణుని ముఖశోభను చూడండి! ఇదేమిటి? మల్లయుద్ధాన్ని పరీక్షించడానికి వచ్చిన న్యాయనిర్ణేతలంతా ఏమయ్యారు? ఇంకా పసితనం వీడని బాలయోధులు వజ్రకాయులైన మహాసురులతో పోరాడాలని ఎవరు నిర్ణయించారు? ఇది న్యాయసమ్మతం కాదు. దైతేయ మల్లులను గోపశిశువుల మీదికి ఉసిగొలిపితే చూస్తూ ఊరుకొన్న పెద్దమనుషులను అనాలి. ధర్మవ్యతిక్రమాన్ని ఆపలేని అసమర్థులు పరీక్షకులుగా తగరు'' అంటూ చర్చించుకోవడం మొదలుపెట్టారు.

చాణూర ముష్టిక సంహారం

ఆ విధంగా వనితాజనం అనుకొంటూ ఉండగానే శ్రీకృష్ణుడు కాసె బిగించి ఒక్క ప్రాటిమీదుగా యుద్ధక్షేత్రంలోనికి దూకి ఇసుక చేతిలోకి తీసుకొని కాళ్లతో నేలను పరీక్షిస్తూ ఎక్కడెక్కడ ఇసుక నేల వదులుగా ఉన్నదో చూసుకొంటూ అవిశీర్ణమైన మంచి చోటును కనిపెట్టి అక్కడ సిద్ధంగా నిలబడ్డాడు. [illegible]డా నేలంతా కలయదిరిగి ముష్టికుని యెదుట [illegible] టించాడు. చాణూరుడు శ్రీకృష్ణునికి ప్ర[illegible] యుద్ధం ప్రారంభమయింది.

ఆనాడు బలరామకృష్ణులు లోకాశ్చర్యకరమైన యుద్ధకళా కౌశలాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడు మల్లయుద్ధంలో 1. సన్నిపాతం (మల్లవీరులు ప్రతిపక్షి భుజాలపై చేతులువేసి పరస్పర బల ప్రావీణ్యాలను గ్రహిస్తూ ఎలా ఎదురుదెబ్బ తీయాలో గ్రహించటం) 2. అవదూతం (ఇద్దరూ దూరానికి జరిగి పరస్పర శరీర పాటవాన్ని, నేలపై నిలిచిన తీరును గమనిస్తూ స్వీయబలప్రౌఢిని ప్రదర్శించటం) 3. క్షేపణం (పరస్పర భుజాస్ఫోటాలతో శత్రువును వెనుకకు త్రోసివేయటం, తద్వారా అతని పాదచాలనను గ్రహించటం) 4. ముష్టినిపాతం (పిడికిళ్లతో శరీరావయవాలను నొప్పిస్తూ ఆయువుపట్లను గుర్తించటం) 5. కీలనిపాతం (కాలిమడమలతో పడగొట్టి ప్రతియోద్ధకు శరీర స్తంభన కావించటం) 6. వజ్రనిపాతం (మోచేతితో బాధించటం) 7. జానునిర్ఘాతం (మోకాళ్లతో కొట్టటం) 8. బాహువిఘట్టనం (పరస్పరం బాహువులను సందంశకాల వలె పట్టుకొని ప్రతివైరి బలాన్ని క్షీణింపజేయటం) 9. పాదోద్ధూతం (కాళ్లతో తన్నడం) 10. ప్రసృష్టం (ప్రతివీరుని శరీరాన్ని మెలిత్రిప్పటం) 11. అశ్మనిర్ఘాతం (శిలాఘాతాల వంటి పిడిగుద్దులతో శత్రువును బాధించటం) మొదలైన విద్యలను సర్వకుశలంగా ప్రయోగించాడు. శస్త్రరహితమే అయినా పోరు ఘోరంగా సాగింది. మల్లవీరులు ప్రాణరక్షణ కావించుకొంటూ వైరి ప్రాణాలను ఆహరింపజూస్తూ సామాజికులకు మహోత్సవకరంగా రణకళాకౌశలాన్ని ప్రదర్శించారు. ఆ విధంగా ధర్మాధర్మపక్షాలకు పోరాటం కొనసాగినకొద్దీ శ్రీ... అతిశయించి చాణూరుని శక్తి క్షీణింపసాగింది. ... పోశాయి. సిగలో ఉన్న పుష్పమాలిక ఊడి ... ఏ ఆయాసమూ లేనందున అతనిని మల్ల... ...లో ఇక చాణూరునికి అంతిమఘడియలు

సమీపించాయని గ్రహించి కంసుడు ప్రక్కనున్న తూర్యవాదకులను, మార్దంగికులను నిశ్శబ్దంగా ఉండమని ప్రతిషేధించాడు. అంతలో దేవదుందుభులు మ్రోగాయి. గంధర్వాదులు మహోత్సాహంతో శ్రుతిపక్వమైన తూర్యనాదాలను మ్రోయించారు. దేవలోకం నుంచి "శ్రీకృష్ణా! చాణూరుని సంహరించు!" అంటూ జయజయధ్వానాలు వినిపించాయి. శ్రీకృష్ణుడు క్రీడావినోదాన్ని కట్టిపెట్టి చాణూరుని పైకెత్తి గిరగిర నూరు పర్యాయాలు త్రిప్పి, అప్పటికే అసువులు బాసిన అతని మృతకళేబరాన్ని నేలకు విసిరికొట్టాడు. ఆ వేగానికి చాణూరుని దేహం శతఖండాలుగా తెగిపడి ఒక్కొక్క ఖండం నేలమీద పడినచోట రక్తస్రావ మహాపంకాలుగా కనిపించింది. బలరాముడు ముష్టికుని మూర్ధభాగాన్ని పిడికిళ్లతో నొప్పించి రొమ్మును కాళ్లతో తన్ని ధరాపృష్ఠం మీద పడవేసి ప్రాణాలు పోయినదాకా ముష్టిఘాతాలను ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు రంగమధ్యం నుంచి వెలికి దూకి మల్లరాజు తోసలకుని వామముష్టి ప్రహారంతో నేలకూల్చాడు. చాణూర ముష్టికులకు పట్టిన గతిచూసి తక్కిన యోధులందరూ చెల్లాచెదరై పారిపోయారు. బలరామ కృష్ణులు గోపమిత్రులతో కలిసి కోలాహలంగా నృత్యవినోదాలు మొదలుపెట్టారు.

కంసవధ

మైత్రేయా! తన కళ్లముందే జరుగుతున్న ఈ ధిక్కారాన్ని సహింపలేక కంసుడు క్రోధోదగ్రుడయ్యాడు. రూక్షవీక్షణాలతో తన చుట్టూ ఉన్న పరిచారకులను పిలిచి "వీళ్లిద్దరినీ సభనుంచి వెళ్ల గొట్టండి! నందగోపుణ్ణి బంధించండి! వసుదేవుణ్ణి వృద్ధుడన్న కనికరం లేకుండా చిత్రహింసలు పెట్టి వాడి అంతుచూడండి! గోగణాలను బంధించి గోపకులను తరిమికొట్టండి" అంటూ కే[illegible]ాడు.

కంసుని భయాలాపాలను చూసి శ్రీకృష్ణుడు నవ్వు ఆపుకోలేక పోయాడు. తానున్న చోటునుంచి ముందుకు దూకి కంసుని ఉన్నతాసనం పైకెగిరి అతని జుట్టుపట్టుకొని నేలకీడ్చాడు. కిరీటాన్ని నేలకు విసిరికొట్టాడు. అతని మీదికి లంఘించి కరతలాలతో అతని బాహుస్తంభన కావించి రొమ్ముమీద కూర్చున్నాడు. నిశ్శేష జగదాధారుడైన శ్రీమన్నారాయణుని మహాభారాన్ని సహింపలేక ఉగ్రసేనసుతుడు ఆర్తనాదాలు చేస్తూ ప్రాణాలు విడిచిపెట్టాడు.

కంస వధతో శ్రీకృష్ణుని క్రోధానలం ఉపశమింపలేదు. మృతకాయాన్ని జుట్టుపట్టుకొని రంగమధ్యానికి ఈడ్చుకొనివచ్చాడు. ఆ మహాభారానికి ఇసుకనేల విడిపోయి జలధార పొంగివచ్చింది. ఆ ప్రదేశం మథురానగర మధ్యంలో అగడ్తవలె కనిపించింది. కంసునికి జరిగిన పరాభవాన్ని చూసి అతని తమ్ముడు సుమాలి కృష్ణుని మీదికి దూసుకొని వచ్చాడు. బలభద్రుడు అతనిని దారిలోనే ఒడిసి పట్టుకొని అవలీలగా పడగొట్టాడు. సభామంటపంలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

బలరామకృష్ణులు దేవకీ వసుదేవుల చెంత కేగి వారి పాదాలకు మోకరిల్లారు. వసుదేవుడు వారిద్దరినీ లేవనెత్తి, శ్రీకృష్ణావతార సమయంలో దేవతల వాక్యాలు స్మృతికి వచ్చి, తానే ధర్మపత్నీ సమేతంగా వారి పాదాలను ఆశ్రయించాడు. "జగత్ప్రభూ! మాపైని కరుణతో మర్త్యలోకానికి దిగివచ్చి మమ్ము ధన్యులను కావించావు. దుర్వృత్తనిధనార్థం మానుషలీలను ప్రదర్శించిన సర్వేశ్వరుని నిన్ను నేనుగాని దేవకిగాని పుత్రభావంతో ఎలా వ్యవహరింపగలము? జగదుత్పత్తిస్థితిలయాలకు మూలకర్తవైన నీవు మనుష్యగర[illegible]ో, అదీ మా యింట జన్మించటం బహుజన్మలలో మేము [illegible] మహా పుణ్యఫలం. పరమపురుషా! అజ్ఞానవశాన

నిన్ను నా పుత్రమాత్రునిగా భావించి కంసుని బారినుంచి తప్పించాలని ప్రయత్నించాను. యదువంశ శిరోమణిని నిన్ను గోకులానికి అప్పగించాను. నీ దర్శనభాగ్యం వలన అహంకార మమకారాలు నశించిన నాకు నీయెడ మమకారం కూడా ఉపసంహృత మయింది. జగదుపకృతిని కోరి జగదంతరితుడవై జన్మించిన జగత్పతిని నిన్ను కన్నుల పంటగా చూసుకొన్నాను. నాకు మోహబంధాలు నశించాయి. ఇక నీ కరుణాప్రసాదం ఒక్కటే నాకు అభివాంఛనీయం'' అని చేతులు జోడించాడు.

మైత్రేయా! దేవకీ వసుదేవులకు భగవదభిజ్ఞానాన్ని ప్రసాదించిన వాసుదేవుడు వెంటనే వారిని మళ్లీ మోహచక్రంలో నివేశించాడు. తల్లిదండ్రులను ప్రేమపూర్వకంగా కౌగిలించుకొన్నాడు. ''అమ్మా! నాన్నా! మీ రిద్దరూ కంసుని చేతిలో పడిన అగచాట్లను నేను, సంకర్షణుడు చిరకాలంగా చూస్తూనే ఉన్నాము. తల్లిదండ్రులను శ్రద్ధాభక్తులతో పూజింపగలిగే సదవకాశం లభింపనినాడు ఆ సుతుల జన్మ వ్యర్థం. గురువు — దేవతలు — తల్లిదండ్రులను సేవించుకొనే మహాపుణ్యానికి నోచుకొన్నవారి జన్మమే జన్మం. కంసుడు ఎంత దురాత్ముడయినా మీ ఆజ్ఞ లేకుండా అతనిని చంపినందుకు దయతో మమ్మల్ని క్షమించండి'' అని అన్నతో కలిసి యదువృద్ధులకు, తల్లిదండ్రులకు సగౌరవంగా నమస్కరించాడు. పురజను లందరూ ప్రహృష్టస్వాంతులై రామకృష్ణులను ఆదరించి, వారి యశోగీతికలను మధురకంఠాలతో గానం చేశారు.

కంసుని భార్యలు, అంతఃపురస్త్రీలు అతని భౌతికకాయాన్ని పరివేష్టించి హృదయవిదారకంగా శోకిం[illegible] శ్రీ[illegible]ుడు వారికి తన పశ్చాత్తాపాన్ని తెలియజేసి [illegible] వారి దుఃఖాన్ని చూడలేక తానూ కన్నీ[illegible]

మహారాజును చెరవిడిపించి మళ్లీ సింహాసనం అధిష్ఠింపజేశాడు. ఉగ్రసేనుడు పుత్రులకు, అతని పరివారానికి శ్రాద్ధవిధులను నెరవేర్చి, రాజ్యపాలనకు ఉపక్రమించాడు. శ్రీకృష్ణుడు అతనిని సందర్శించి, "మహారాజా! నా వలన ఇంకా ఏమి జరుగవలసి ఉన్నదో నిస్సందేహంగా నాకు చెప్పండి. యయాతి శాపం వలన మన వంశానికి రాజ్యార్హత లేకుండా పోయింది. మీకు భృత్యుడనై నేనున్నంతకాలం, ఒక్క రాజులనే ఏమిటి? దేవతలను కూడా మీరు ఆజ్ఞాపించవచ్చు" అని పలికి వాయుదేవుని స్మరించి, "ఇంద్రునితో నా మాటగా చెప్పి దేవసభ సుధర్మను ఉగ్రసేన మహారాజుకు సమర్పించాలని చెప్పు" అని ఆజ్ఞాపించాడు. వాయువు తెచ్చిన సందేశాన్ని వినగానే దేవేశ్వరుడు అతి శోభాయమానమైన సుధర్మను యాదవులకు సమర్పించాడు.

విద్యాభ్యాసం

ఆ విధంగా శైశవం గతించి యౌవనోచిత బలపరాక్రమాలతో కాలం గడుపుతున్న బలరామకృష్ణులకు గురుముఖంగా విద్యాభ్యాసం చేయాలని కోరిక ఉదయించింది. వెంటనే సాందీపని మహర్షి ఆశ్రమానికి వెళ్లారు. ఆయన కాశీనగరంలో జన్మించి చిరకాలం అక్కడే విద్యలను అభ్యసించి జీవనోపాధి నిమిత్తం అవంతీనగరానికి వచ్చి స్థిరపడ్డాడు. బలరామకృష్ణులు గురువృత్తిపరాయణులై లోకంలో ఛాత్రధర్మానికి ఆదర్శం ఇదేనన్నంత వినయవివేకాలతో ఆయనకు సేవావిధులను నిర్వర్తించారు. అరవై నాలుగు రోజులలో అపారమైన ధనుర్వేదాన్ని సరహస్యంగా సమంత్రకంగా
సాంగోపాంగం అగ ... చేశారు. సాందీపని వారి అతిమానుష
ప్రతి ... ఆగ్రహణధారణ పాటవం మానవ
... గ్రహించి బహుశః సూర్యచంద్రులు

ప్రచ్ఛన్నవేషాలలో తన వద్దకు వచ్చి శిష్యత్వం నెరపుతున్నారని భావించాడు. బలరామకృష్ణులు శేషించిన అస్త్రగ్రామాన్ని కూడా పూర్ణంగా స్వాధీనపరచుకొని విద్యానిష్క్రియంగా గురుదక్షిణను సమర్పింపదలచారు. సాందీపని వారి శక్తిసామర్థ్యాలను గుర్తించిన మహాజ్ఞాని కాబట్టి పూర్వం ప్రభాసతీర్థంలో స్నానానికి వెళ్లి నీటిలో మునిగి చనిపోయిన తన కొడుకును బ్రతికించి యిమ్మని వారిని కోరాడు. శిష్యులిద్దరూ శస్త్రాస్త్రాలను ధరించి లవణార్ణవానికి వెళ్లారు. అక్కడ సముద్రుడు వారికి ప్రత్యక్షమై, "అయ్యా! మీరనుకొన్నట్లు మీ గురుపుత్రుని నేను చంపలేదు. పంచజనుడనే దైత్యుడు శంఖ రూపాన్ని ధరించి ఆ బాలుని అపహరించి అంతర్జలాలలో దాగి ఉన్నాడు" అని ఎరుకపరచాడు. ఆ మాటలు విని శ్రీకృష్ణుడు జలధిగర్భం లోనికి ప్రవేశించి పంచజనుని హతమార్చి అతని శరీరాస్థిసారమైన శంఖాన్ని పూరించాడు. సంగీత కళానిష్ణాతుడైన శ్రీకృష్ణుని పవిత్రస్పర్శ చేత పాంచజన్యం స్వరబ్రహ్మభూషితమై, ఆ దివ్యనాదం దిగంతాలలో మార్మ్రోగి దేవతలకు తేజోవృద్ధి, దైత్యులకు బలహాని, లోకాలలో అధర్మానికి సంక్షయం ఏక కాలంలో సంఘటించాయి. బలరామకృష్ణులు అక్కడినుంచి యమ పురికి వెళ్లారు. బలదేవుడు యాతనాశరీరంలో బాధలు పడుతున్న గురుపుత్రుని వైవస్వతుని బారినుంచి తప్పించి యథాపూర్వంగా శరీరసంస్థితుని కావించాక అవంతీనగరానికి వెళ్లి విద్యానిష్క్రియంగా ఆయన అభివాంఛితాన్ని సమర్పించారు. ఆచార్యుని అనుమతి గైకొని కొన్నాళ్లు ప్రయాణించి మథురానగరాన్ని చేరుకొన్నారు.

జరాసంధుని పరాజయం

మైత్రేయా! కంసుడు జరాసంధుని కుమార్తెలను వివాహం చేసుకొన్నాడని చెప్పాను. వారి పేర్లు అస్తి; ప్రాప్తి. తన జామాత

మరణవార్త తెలియగానే జరాసంధుడు ఇరవైమూడు అక్షౌహిణుల మహాసైన్యాన్ని సమకూర్చుకొని యాదవవంశాన్ని నిర్మూలించాలని మథురానగరిపై దాడిచేశాడు. బలరామకృష్ణులు స్వల్పసంఖ్యలో యదువీరులను కూడగట్టి మగధసైన్యాలను ఎదుర్కొన్నారు. అంత కాలం వాడిన ఆయుధాలకు స్వస్తిచెప్పి శ్రీహరి శార్ఙ్గకోదండాన్ని, అక్షయతూణీరాన్ని చేపట్టాడు. ఆకసాన్నుంచి కౌమోదకీ గద, బలభద్రునికి నాగలి, సౌనందమనే పేరుగల ముసలం వచ్చాయి. మహాబలపరాక్రమోపేతులైన బలరామకృష్ణులు క్షణకాలంలో మగధ సైన్యాలను తరిమికొట్టి విజయోత్సాహంతో మళ్లీ పురప్రవేశం చేశారు.

పరాభవాన్ని పొంది పారిపోయినా జరాసంధునికి మనసు మారలేదు. అంతకంత సైన్యాన్ని కూర్చుకొని మళ్లీ యుద్ధానికి వచ్చి ఓడిపోయాడు. ఆ విధంగా పద్దెనిమిదిసార్లు శ్రీకృష్ణుడు కొద్దిపాటి బలగంతోనే అతనిని అవలీలగా ఓడించి దూరానికి తరిమికొట్టాడు.

యాదవులు శ్రీకృష్ణుని అండగొని కలకాలం చల్లగా ఉన్నారు. వారిమధ్య బలరామకృష్ణులు — స్వలీలా విలసనార్థం మనుష్యధర్మాన్ని స్వీకరించిన అవతారపురుషులు—సామాన్యుల వలెనే ప్రవర్తించారు. సామాన్యుల వలెనే ధర్మాధర్మాలను అనుశీలించి రిపునిబర్హణార్థం సామదానభేదదండోపాయాలను ప్రయోగించారు. తామకూడా సామాన్యుల వలెనే సుఖదుఃఖాలకు లోనయ్యారు. యుద్ధాలు చేశారు. శత్రువులను మట్టుపెట్టారు. ఒక్కొక్కప్పుడు కాలోచితంగా శత్రువుకు వెన్నుచూపి పారిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తమ శక్తికార్యాన్ని వినోదక్రీడగా పరిగణించిన మహాత్ములు ఏ విధంగా కర్మబంధాలకు అతీతంగా

ప్రవర్తింపగలరో లోకానికి వెల్లడించారు. అలా కొన్నాళ్లు గడిచాయి.

కాలయవన సంహారం

ఒకప్పుడు యాదవసమాజం గోష్ఠీ వినోదాలలో తేలియాడు తున్న సమయంలో శ్యాలుడనే పేరుగల యాదవుడు గార్గ్యుని పరిహ సించి, నపుంసకుడని వేళాకోళం చేశాడు. గార్గ్యుడు బహుజన సమ క్షంలో తనకు జరిగిన పరాభవాన్ని సహింపలేక, దక్షిణసముద్రానికి వెళ్లి యదుచక్రాన్ని భయాకులితం చేయగల సుతుని కోసం తీవ్ర తపస్సు చేశాడు. ఇనుపపొడిని మాత్రం తింటూ సర్వపరిత్యాగం చేసి పన్నెండేళ్లు శ్రీమహాదేవుని ఆరాధించాడు. ఈశ్వరుడు అతని భక్తికి ప్రసన్నుడై అతని అభీప్సితాన్ని వరంగా ప్రసాదించాడు.

గార్గ్యునికి యవనభూపాలునితో మైత్రి ఘటిల్లింది. ఆ రాజుకు కూడా చిరకాలంగా పుత్రసంతానం కలగలేదు. గార్గ్యునికి రాజ పత్నీసమాగమం వలన కాలయవనుడనే పేరుగల మహాబలుడు జన్మించాడు. వజ్రకఠోరవక్షుడు, అళిసన్నిభనీలదేహుడు అయిన కొడుకుకు రాజ్యాన్ని అప్పగించి యవనభూపతి వానప్రస్థాన్ని స్వీక రించాడు.

రాజ్యపాలన మొదలుపెట్టగానే కాలయవనుడు మదో న్మత్తుడై నారదమహర్షిని పిలిచి లోకంలో తనను ఎదిరింపగల మహావీరులు ఎవరున్నారో చెప్పమని అడిగాడు. ఆ మహర్షి యాద వుల పేరు చెప్పాడు. కాలయవనుడు మ్లేచ్ఛసైన్యాలను సమకూర్చు కొని మథురానగరం మీదికి దండెత్తాడు.

శ్రీకృష్ణుడు చతురంగబలాలతో తమను సమీపిస్తున్న శత్రుసైన్యాల ఉనికి తెలియగానే కర్తవ్యాన్ని ఆలోచించాడు.

ఇప్పుడు యుద్ధానికి దిగితే రానున్న కాలంలో మగధసైన్యాల దాడిని తట్టుకొనడం కష్టమవుతుంది. జరాసంధుని దురాక్రమణల వల్ల బాగా సైన్యనష్టం జరిగి ఉగ్రసేనుని బలాలు ఇంకా కోలుకొనలేదు. కాలయవనుని సైన్యాలు యుద్ధోత్సాహంతో ఉరకలు వేస్తుంటాయి. అదే సమయంలో మగధసైన్యాలు వెనుకదాడి చేసే ప్రమాదమూ లేకపోలేదు. వృష్ణివీరులు స్వస్థులై నిలిచి శత్రువులను ఎదుర్కొనడానికి బలమైన కోట ఒకటి అవసరం. ఆ దుర్గరక్షణకు స్త్రీలు పూనుకొన్నా చెక్కుచెదరనంత పటిష్ఠంగా ఉండాలి. తానూ బలరాముడూ హాలామదవశులై ఉన్న వేళలలో శత్రువులు మెరుపు దాడి చేసినా దుర్గప్రవేశం సాధ్యపడకూడదు. ఈ విధంగా ఆలోచించి శ్రీకృష్ణుడు సముద్రానికి పన్నెండు యోజనాల దూరంలో ద్వారకాపురాన్ని నిర్మించాడు. రమ్యోపవనాలతో, నిర్మలకాసారాలతో, ఎత్తైన ప్రాకారాలతో, మహావప్రంతో, అమరావతిని సరిపోలిన ఆ పట్టణంలో సుఖనివాసానికి మథురానగరవాసులను తరలించి తానుమాత్రం కాలయవనుని కోసం ఎదురుచూడసాగాడు.

యాదవుల కుశలక్షేమాలు తెలియని కాలయవనుడు మహాసైన్యంతో మథురానగరం మీదికి వచ్చాడు. వస్తూనే మహాయోగులకు చేతోవీథులలోనైనా దర్శనభాగ్యాన్ని ప్రసాదింపని శ్రీకృష్ణ పరమాత్మతో బాహుప్రహరణాలకు ఉపక్రమించాడు. శ్రీకృష్ణుడు అతనిని తప్పించుకొంటూ ముచుకుందుడనే రాజు నిద్రిస్తున్న గుహాంతర్భాగానికి దారితీశాడు. కాలయవనుడు ఆ నిద్రిస్తున్నది శ్రీకృష్ణుడనుకొని శయ్యాగతుడైన రాజును పాదహతులతో నొప్పించాడు. నిద్రాభంగం కలిగి రాజు కన్నులు తెరిచి చూచేలోగానే తత్క్రోధజనితమహాగ్నిజ్వాలలు కాలయవనుని భస్మీపటలం చేశాయి.

ముచుకుందునికి మోక్షప్రాప్తి

మైత్రేయా! ముచుకుందుడు పూర్వం దేవదానవుల సంగ్రామంలో దేవతలపక్షం వహించి రాక్షసులను పరాభవించాడు. దేవతలు సంతుష్టులై అతనికి వరాన్ని ప్రసాదింపదలిచారు. ముచుకుందుడు చిరకాలశ్రమ వల్ల ఆయాసాన్ని పొంది, తనకు గాఢనిద్ర కావాలని అడిగాడు. దేవతలు సమ్మతించి "నీకు నిద్రాభంగం చేసిన వారు నీ శరీర సముత్థిత మహాగ్నులలో వెంటనే భస్మమైపోతారు" అని మాట యిచ్చారు.

ముచుకుందుడు నిద్రాభంగం కలిగిన తర్వాత కనులు విప్పార్చి శ్రీకృష్ణపరమాత్మను సందర్శించాడు. "అయ్యా! నీ వెవరవు?" అని ప్రశ్నించాడు. మధుసూదనుడు "నేను చంద్రవంశంలో యాదవకులంలో వసుదేవతనయుడనై జన్మించాను" అని తన గురించి వివరించాడు. ముచుకుందుడు తనతో వృద్ధగార్గ్యుడు అన్న మాటలను స్మరించి తన చెంతకు వచ్చినది సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే నని గ్రహించాడు. అతనికి మేను గగుర్పొడిచింది. కన్నుల వెంబడి అశ్రుధారలు ప్రవహించాయి. "ప్రభూ! నీవు మహావిష్ణ్వంశ సంభూతుడవైన పరమేశ్వరుడవు. ఇరవై ఎనిమిదవ ద్వాపరంలో శ్రీమన్నారాయణుడు యదువంశంలో అవతరింప నున్నాడని గార్గ్యుడు చెప్పిన మాట నిజమయింది. మహానుభావా! మర్త్యలోకానికి మేలుకూర్పగోరి నీవు భూమికి దిగివచ్చావు. మానుషవేషధారివే అయినా ఈ చర్మచక్షువులతో నీ మహాతేజస్సును చూడలేకపోతున్నాను. సజల జలధరధ్వాన గంభీరమైన నీ కంఠరవాన్ని బట్టి నీవని గుర్తుపట్టాను. పూర్వం దేవాసుర మహాయుద్ధంలో దైత్యసేనలు నా తేజోదీప్తిని చూడలేకపోయినట్లు ఈనాడు నాకు నీ దివ్యతేజం

నాన్యతోదర్శనీయమై విభాసిల్లుతున్నది'' అంటూ సర్వభూతాత్మ
కుని తేజోమహిమను స్తుతించాడు.

శ్రీ మహావిష్ణు పాంచభౌతిక స్తోత్రం

సంసారపతిత స్యైకో జన్తో స్త్వం శరణం పరమ్
స ప్రసీద ప్రపన్నార్తిహర్తా హర మమాశుభమ్.

త్వం పయోనిధయః శైలాః సరిత స్త్వం వనాని చ
మేదినీ గగనం వాయు రాపోఽగ్ని స్త్వం తథా మనః.

బుద్ధి రవ్యాకృతం ప్రాణాః ప్రాణేశ స్త్వం తథా పుమాన్
పుంసః పరతరం యచ్చ వ్యాప్య జన్మావికారి యత్.

శబ్దాదిహీన మజర మమేయం క్షయవర్జితమ్
అవృద్ధినాశం తద్బ్రహ్మ త్వ మాద్యన్త వివర్జితమ్.

త్త్తోఽమరాః సపితరో యక్ష - గన్ధర్వ - కిన్నరాః
సిద్ధా శ్చాప్సరస స్త్వత్తో మనుష్యాః పశవః ఖగాః.

సరిసృపా మృగాః సర్వే త్వత్తః సర్వే మహీరుహాః
యచ్చ భూతం భవిష్యఞ్చ కిఞ్చిదత్ర చరాచరమ్.

అమూర్తం మూర్తమథవా స్థూలం సూక్ష్మతరం స్థితమ్
తత్సర్వం త్వం జగత్కర్తా నాస్తి కిఞ్చిత్ త్వయా వినా.

మయా సంసార చక్రేఽస్మిన్ భ్రమతా భగవన్ సదా
తాపత్రయాభిభూతేన న ప్రాప్తా నిర్వృతిః క్వచిత్.

దుఃఖాన్యేవ సుఖానీతి మృగతృష్ణా జలాశయా
తథా నాథ! గృహీతాని తాని తాపాయ చాభవన్.

రాష్ట్ర ముర్వీబలం కోశో మిత్రపక్ష స్తథాత్మజాః
భార్యా భృత్యజనా యే చ శబ్దాద్యా విషయాః ప్రభో

సుఖబుద్ధ్యా మయా సర్వం గృహీత మిద మవ్యయ!
పరిణామే తదేవేశ! తాపాత్మక మభూన్మమ.

దేవలోక మిమం ప్రాప్తో నాథ! దేవగణోఽప్యయమ్
మత్తః సాహాయ్యకామోఽభూ చ్ఛాశ్వతీ కుత్ర నిర్వృతిః.

త్వ మనారాధ్య జగతాం సర్వేషాం ప్రభవాస్పదమ్
శాశ్వతీ ప్రాప్యతే కేన పరమేశ్వర! నిర్వృతిః.

త్వన్మాయామూఢమనసో జన్మమృత్యుజరాదికాన్
అవాప్య తాపాన్ పశ్యన్తి ప్రేతరాజాననం నరాః.

తతో నిజక్రియాసూతి రనేకే ష్వతిదారుణమ్
ప్రాప్నువన్తి నరా దుఃఖ మస్వరూపవిద స్తవ.

అహ మత్యన్తవిషయీ మోహిత స్తవ మాయయా
మమత్వ గర్వగర్తాన్తర్భ్రమామి పరమేశ్వర!

సోఽహం త్వాం శరణ మపార మీశ మీడ్యం
సమ్ప్రాప్తః పరమపదం యతో న కిఞ్చిత్
సంసారశ్రమ పరితాప తప్తచేతా
నిర్వాణే పరిణతధామ్ని సాభిలాషః.

ఆ విధంగా స్తుతించిన ముచుకుందుని జ్ఞానసద్భావానికి శ్రీకృష్ణపరమాత్మ సంతుష్టుడై "నీ భక్తికి మెచ్చాను. నీ ఇచ్చవచ్చిన లోకాలకు వెళ్లి 'అవ్యాహత పరమైశ్వర్యాలను అనుభవించు! భోగాంతంలో నీవు సదాచారపరుల ఇంట జన్మించి జాతిస్మరణ కలిగి నా కరుణవల్ల మోక్షాన్ని చూరగొంటావు" అని వరాన్ని ప్రసాదించాడు. ముచుకుందుడు జగన్నాథునికి ప్రణామం చేసి గుహాముఖం నుంచి వెలువడి వచ్చి కలియుగం ప్రవేశిస్తున్నదని గ్రహించాడు. గంధమాదన పర్వతానికి వెళ్లి నరనారాయణస్థానంలో తపస్సు చేసి నిర్వికల్ప సమాధిస్థితిని పొందాడు.

ద్వారకలో శాంతిస్థాపన

శత్రునిబర్హణ జరిగిన వెంటనే శ్రీకృష్ణుడు మథురా నగరంలో ఉన్న యవనసైన్యాలను ద్వారకకు నడిపించి ఉగ్రసేనుని వశం చేశాడు. సైన్యవిస్తారంవలన ఒకవేళ వైరిమూకలు దండెత్తి వచ్చినా యదుకులానికి భయంలేదని ద్వారకానగరవాసులు నిశ్చింతగా ఉన్నారు. కాలం ప్రశాంతంగా గడిచిపోతున్నది.

గోకులం

కొన్నాళ్లకు బలదేవునికి నందగోపకులానికి వెళ్లి జ్ఞాతులందరినీ సందర్శించి గోగోప గోపీజనాలను పలకరించి రావాలని సంకల్పం కలిగింది. వెంటనే బయలుదేరి వెళ్ళాడు. గోకులవాసు లందరూ అతనికి ఎదురువచ్చి ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకొన్నారు. గోపమిత్రులను అతను కౌగిలించుకొని కుశలప్రశ్న లడిగాడు. గోపికలు అతనిచుట్టూ చేరి పరాచికాలాడారు. ఎన్నోరోజుల తర్వాత కలిసిన ఆనందంతో అందరూ దగ్గరచేరి బహుమాన పురస్సరంగా సంభాషించారు. చిన్ననాటి స్నేహితులందరూ అతనిని విశేషాలడిగి, తమ గురించి విశదీకరించి, అప్పటి కొంటెచేష్టలను గుర్తుకు తెచ్చుకొని అందరూ హాయిగా నవ్వుకొన్నారు. గోపికలకు మాత్రం శ్రీకృష్ణుడు రాలేదని కోపం వచ్చింది. "ఆ చంచలాత్ముడు, నాగరీజనవల్లభుడు మీ తమ్ముడు మా బ్రతుకు అల్లరిపాలు చేసి అక్కడి మెరమెచ్చులతో హాయిగా కులుకుతున్నాడు కాబోలు! ఎప్పుడయినా జ్ఞాపకం వస్తామా మేమతనికి? ఎప్పుడయినా ఇక్కడికి వస్తే బాగుండునని అనుకొంటాడా అసలు? తల్లి, తండ్రి, అన్న, తమ్ముడు, భర్త, సంసారం—అన్నీ విడిచిపెట్టి అతనికి మా సర్వస్వాన్ని అర్పించామే, ఒక్కనాడైనా మా పే[illegible] తలచుకొంటున్నాడా? ఎన్నడూ ఇక్కడుండగా అబద్ధం [illegible]గనివాడు నగరస్త్రీల మోజులోపడి మా

మాటే మరచిపోయాడు'' అంటూ బలరాముణ్ణి దెప్పిపొడిచారు. బలరాముడు ఒక్కొక్కరినీ పేరు పేరునా పలకరించి, శ్రీకృష్ణుడు వారందరికీ తెలియజేయమని తన కందించిన సందేశాలను సామ మధురంగా, ప్రేమపూర్ణంగా, శ్రవణపర్వంగా వినిపించి గోపికల కోపాన్ని ఉపశమింపజేశాడు. అందరూ మళ్లీ కబుర్లలో పడి పరిహాస మనోహరంగా ప్రసంగించారు.

యమునాకర్షణం

ఆ విధంగా ఛద్మరూపంలో సంచరిస్తున్న ఆదిశేషుడు వ్రేపల్లెలో కాలం గడుపుతుంటే వరుణదేవుడు చూసి అతనికి తృప్తి భోగార్థం వారుణీరసాన్ని బహూకరించాలని సంకల్పించాడు. వెంటనే తన భార్యను పిలిచి ''మదిరా! అనంతునికి సేవంటే ఎంతో ఇష్టం. భారావతరణకార్యంలో శ్రమాపనోదంగా అతనికి నీవు తోడ్పడాలి'' అని ఆదేశించాడు.

వారుణి వెంటనే బృందావనానికి వెళ్లి కదంబతరుకోటరంలోనికి ప్రవేశించింది. బలదేవుడు ఆ ప్రాంతంలో సంచరిస్తూ మనసును పరవశింపజేసే మదిరాగంధాన్ని ఆఘ్రాణించి, తన కెంతో ప్రీతిపాత్రమైన హాలాపాన సుఖాన్ని సంస్మరించాడు. కదంబతరుపుష్పాలను సేకరించి మధుధారలకన్నా మనోహరమైన మద్యధారలను రూపొందించాడు. గోపగోపీజనాలతో గోష్ఠితీరి లలితగీత వాద్యగానాలలో తేలియాడుతూ మత్తెక్కినంత దాకా మద్యపానం చేశాడు. పారవశ్యాతిరేకం వలన అతనికి స్వేదోద్గమం కలిగి స్నానేచ్ఛ జనించింది. ఆ మత్తులో నాగలిని పైకెత్తి పట్టుకొని ''యమునానదీ! ఇక్కడకు రా!'' అని కేకవేశాడు. ఆ మాటవిని కళిందతనయ ఎంతకూ తన చెంతకు రాకపోయేసరికి బలరాముడు ఆగ్రహించి నాగలిని నేలకు

మోపి యమునా ప్రవాహాన్ని తన కాలివద్దకు లాగి ఆ అటవీ ప్రాంతంలో ఇచ్ఛకు వచ్చినట్లు సంచరింపసాగాడు. అప్పుడు యమునా నది పరిదీనవదనంతో అతనికి సాక్షాత్కరించి క్షమించమని వేడు కొన్నది. మదవిహ్వాలుడైన బలరాముడు ఆ మాటలకు శాంతింపక పోగా "నిన్ను సహస్ర మార్గాలకు లాగి పాయలు తీస్తాను! నా హల పాతబలం ఏపాటిదో రుచి చూపిస్తాను!" అని మండిపడ్డాడు. యమునా నది అతనిని మరీ మరీ ప్రార్థించింది. చివరికతను ప్రసన్నుడై ఆమె సమస్త భూతధాత్రిని ఒకసారి తడిపిన తర్వాత యథేచ్ఛగా ప్రవ హింపవచ్చునని అనుమతినిచ్చాడు. ఆ పుణ్యనదీస్నాతుడై సుఖస్థితిని పొందిన వెంటనే భగవతి శ్రీదేవి అతనికి ప్రత్యక్షమై కర్ణావతంసంగా ఒక దివ్యోత్పలాన్ని, కర్ణకుండలాన్ని, వరుణదేవుడిచ్చిన అమ్లాన మైన పంకజమాలికను, సముద్రజలవర్ణాభమైన నీలాంబరాన్ని ప్రసా దించింది. ఆ అలంకారాలను ధరించి అతను దివ్యమంగళ విగ్రహుడై ప్రకాశించాడు. వ్రేపల్లెలో రెండునెలల కాలం గడిపి, ద్వారకకు తిరిగివచ్చాక రైవతుని కుమార్తె రేవతిని వివాహం చేసుకొన్నాడు. ఆ దంపతులకు నిశఠుడు, ఉల్ముకుడు జనించారు.

రుక్మిణీ కల్యాణం

మైత్రేయా! విదర్భదేశపు రాజు భీష్మకుడు కుండిన నగరాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలిస్తున్నాడు. అతనికి రుక్మి, రుక్మిణి అని ఒక కొడుకు, కూతురు ఉన్నారు. శ్రీకృష్ణుడు రుక్మిణిని ప్రేమించి ఆమెను పెండ్లాడాలనుకొన్నాడు కాని; రుక్మి అతనిపైగల ద్వేషం వలన తండ్రితో పర్యాలోచించి ఆమెను చేదిదేశపు రాజు శిశు పాలునికి ఇవ్వాలని నిశ్చయించాడు. పెండ్లికి జరాసంధుడు, ఇతర రాజులందరూ బయలుదేరి విదర్భరాజధానికి వచ్చి విడిది తీరారు. శ్రీకృష్ణుడు కూడా బలభద్రాది యాదవప్రముఖులతో కలిసి కుండిన

నగరాన్ని, సకలదేశాల భూమిపతులను, రుక్మిణీకల్యాణాన్ని చూడ వచ్చునని ప్రయాణమై వచ్చాడు. పెండ్లినాటికి శ్రీకృష్ణుడు రుక్మిణిని అపహరించి రాజలోకంతో పోరాడే బాధ్యతను బలభద్రాదులకు విడిచిపెట్టాడు. పౌండ్రకుడు, దంతవక్త్రుడు, విదూరథుడు, శిశుపాలుడు, జరాసంధుడు, సాళ్వుడు మొదలైన రాజులందరూ కుపితులై శ్రీకృష్ణునిమీ[illegible]దికి దండెత్తారు. రుక్మి శ్రీకృష్ణుని చంపిగాని [illegible] పోరాటానికి వచ్చాడు. శ్రీకృష్ణుడు కుండినకు తిరిగిరానని ప్రతిజ్ఞ చేసి [illegible] సాతులతో శత్రుసేన సుదర్శనాయుధాన్ని చేపట్టి రథగజతురగప[illegible]ణి అతనికి లను అవలీలగా నిర్జించి రుక్మిని జయించాడు కాని రుక్మి[illegible] ప్రాణభిక్షను అర్థించింది. కర్మబంధాలకు, రాగద్వేషాది ద్వంద్వాలకు అతీతుడైన శ్రీకృష్ణుడు ఆమె ప్రార్థనను మన్నించి రుక్మిని విడిచిపెట్టాడు. రుక్మి తన ప్రతిజ్ఞానుసారం కుండినను విడిచి భోజకటకాన్ని నిర్మించి అక్కడినుంచి రాజ్యపాలన మొదలుపెట్టాడు. రాక్షసవివాహం ద్వారా సంప్రాప్తించిన రుక్మిణిని ద్వారకకు తీసుకొనివెళ్లి శ్రీకృష్ణుడు జనసమక్షంలో శాస్త్రోక్తంగా పెండ్లిచేసుకొన్నాడు. ఆ దంపతులకు మన్మథాంశతో మహాబలుడైన ప్రద్యుమ్నుడు జన్మించాడు. శంబరుడు అతనిని అపహరించినప్పుడు ప్రద్యుమ్నుడు అవలీలగా శంబరాసురుని వధించాడు''

అని అంటున్న పరాశరుని మాటలకు అడ్డువస్తూ మైత్రేయుడు—

''మహాత్మా! ప్రద్యుమ్నుడు శంబరాసురుని సంహరించిన వృత్తాంతాన్ని సవిస్తరంగా చెప్పండి'' అని అడిగాడు. పరాశరుడు చెప్పాడు.

శంబరాసుర వధ

ప్రద్యుమ్నుడు జన్మించిననాటి ఆరవ రోజున శంబరాసురుడు అతను పెరిగి పెద్దవాడయితే తన ప్రాణాలకు ముప్పువాటిల్లగలదని

గ్రహించి, సూతికాగృహం నుంచి అతనిని అపహరించాడు. లవణార్ణవానికి తీసుకొనివెళ్లి మొసళ్లు నిండిన ఒక మహావర్తంలో విసిరివేశాడు. ఆ సుడిగుండంలో ఒక చేపపిల్ల అతనిని మ్రింగివేసింది. చేపలవాళ్లు వలవేసి తక్కిన చేపలతోపాటు దానిని కూడా పచనార్థం శంబరాసురునికి నివేదించారు. శంబరుని భార్య మాయాదేవి పాకశాలలో వంటకు ఏర్పాట్లు చేస్తూ చేపపిల్లను కో[illegible]యించినప్పుడు దాని కడుపులోని జఠరానల ప్రభావం [illegible] వలన చెక్కుచెదరకుండా జీవించి ఉన్న ప్రద్యుమ్నుడు [illegible] బయటపడ్డాడు. మన్మథవృక్షానికి ప్రథమాంకురం వలె [illegible] భువనమనోహరంగా ఉన్న ఆ శిశువు సౌందర్యాన్ని చూ[illegible] ఆమె ముచ్చటపడింది. మత్స్యజఠరం నుంచి వెలువడినవాడు ఎవరై ఉంటాడా అని యోచిస్తూ ఉండగా నారదమహర్షి అక్కడికి వచ్చి "ఈ పసివాడు సమస్తజగదుత్పత్తి విలయకారకుడైన శ్రీమన్నారాయణుని తనయుడు. సూతికాగృహం నుంచి శంబరుడు అపహరించి సముద్రంలో పడవేయగా చేపపిల్ల మ్రింగింది. ఈ పురుషశిరోరత్నాన్ని కాపాడి లోకానికి సమర్పించు" అని ఆదేశించాడు.

మాయాదేవి ఆ కుమారుని సౌందర్యదీప్తికి ముగ్ధురాలై అతనిని ప్రేమగా చూసుకొన్నది. ఆమె లాలనలో శ్రీకృష్ణతనయుడు పెరిగి పెద్దవాడయ్యాడు. మాయాదేవి శంబరాసురుని వీడి, అతనియందే ప్రాణాలు నిలిపి, అతనికి యుక్తవయస్సు రాగానే తనకు తెలిసిన మాయావిద్యలన్నింటినీ అతనికి ప్రయోగోపసంహారాలతో బోధించి సకలవిద్యాపారంగతుని చేసింది.

ప్రద్యుమ్నుడు మాయాదేవి తనయెడ ప్రవర్తిస్తున్న తీరుకు ఆశ్చర్యపోయేవాడు. యౌవనాభోగ భూషితుడైన తనను రెప్పలల్లార్పక ఆరాధనభావంతో అనుక్షణం పరికిస్తుంటే అతను సందే

హించి, "నీ చూపులో మాతృభావన గోచరింపదు. ఎందుకలా ప్రవర్తిస్తావు?" అని అడిగిచూశాడు. ఆమె అతనికి జరిగిన సంగతిని వివరించి, "నీ తండ్రి జగద్వల్లభుడైన శ్రీమహావిష్ణువు. కాలశంబరుడు నిన్ను అపహరించిన మాయావి. నీ తల్లి నీకోసం ఇంకా శోకిస్తూనే ఉన్నది" అని తెలియజెప్పింది. ప్రద్యుమ్నుడు ఆ మాటలకు క్రోధోద్దీపితుడయి కాలశంబరునితో యుద్ధానికి వెళ్లి అతని సైన్యాలను మట్టుపెట్టాడు. శంబరుడు కల్పించిన ఏడు మాయలను అతిక్రమించి అష్టమ మాయను అతనిపై త్రిప్పికొట్టి రాక్షసుని వధించాడు. మాయావతిని తీసికొని ఆకాశమార్గంలో ప్రయాణించి ద్వారకానగరాన్ని చేరుకొన్నాడు. అంతఃపురస్త్రీలు అతనిని చూసి అతనే శ్రీకృష్ణుడనుకొని అభివాదం చేశారు. రుక్మిణి బాష్పాకులితలోచనాలతో అతనిని చూసి "నీ వంటి కొడుకును కన్న తల్లి నిజంగా ధన్యురాలు. బ్రతికి ఉంటే నా కుమారుడు నీ వయస్సులోనే ఉండేవాడు. నాయనా! నీ తల్లి ఎవరు? ఎందుకో నిన్ను చూసినప్పటినుంచి నీవు శ్రీకృష్ణతనయుడవే అనిపిస్తున్నది!" అంటూ పుత్రశోకా[illegible]త్త వల్ల విలపించింది.

అప్పుడు శ్రీకృష్ణుడు నారదమహర్షితో కలిసి రుక్మిణీమందిరానికి వచ్చాడు. నారదుడు ఆమెకు జరిగిన కథనంతా వివరించి మాయావతిని కూడా పరిచయం చేశాడు. శివక్రోధానలానికి మన్మథుడు దహింపబడగానే అతని భార్య రతీదేవి శంబరాసురుని ఇంట నివసిస్తూ అతనిని విషయవాంఛలలో ముంచెత్తి ప్ర[illegible] రక్షించుకొంటూ వచ్చింది. ఆమె మనస్సు ఏనాడో [illegible] అంకితమైపోయింది. వీరిద్దరూ రతీమన్మథులు. ఈ[illegible] అని పలికాడు. ఇంటినుంచి వెళ్లిపోయినవ[illegible] క్షేమంగా తిరిగివస్తే ఇంటిల్లిపాదీ సంతోషించి[illegible]

రంలో ప్రద్యుమ్నాగమన వార్త వ్యాపింపగానే ఆనందోత్సవాలు మిన్నుముట్టాయి.

శ్రీకృష్ణుని భార్యలు

ఆ తర్వాత శ్రీకృష్ణునికి రుక్మిణియందు చారుదేష్ణుడు, సుదేష్ణుడు, చారుదేవుడు, సుషేణుడు, చారుగుప్తుడు, భద్రచారుడు, చారువిందుడు, సుచారుడు, మహాబలవంతుడైన చారుడు మొదలైన కొడుకులు, ఒక కుమార్తె చారుమతి, జన్మించారు.

భీష్మపుత్రిక రుక్మిణి కాక శ్రీకృష్ణునికి కళిందతనయ కాళింది, సౌశీల్యవతి మిత్రవింద, సత్స్వభావ నాగ్నజితి, సౌందర్యశాలిని జాంబవతి, కామరూపిణి రోహిణి, మద్రరాజసుత మాద్రి, సత్రాజితుని కుమార్తె సత్యభామ, చారుహాసిని లక్ష్మణ అని ఏడుగురు భార్యలున్నారు. ఇంకా పదహారువేలనూరుమంది స్త్రీలను కూడా శ్రీకృష్ణుడు కాలాంతరంలో వివాహం చేసుకొన్నాడు.

అనిరుద్ధుని వివాహం

ప్రద్యుమ్నుడు తన మేనమామ కుమార్తెను ఆమె స్వయంవరానికి వెళ్ళి వివాహం చేసుకొన్నాడు. వారికి లోకోత్తరబలపరాక్రమశాలి అనిరుద్ధుడు జన్మించాడు. రుక్మిణీపరిణయ కాలంనుంచి రుక్మికి శ్రీకృష్ణునితో వైరానుబంధం ఏర్పడినా అరిందముడని పేరు
...రోద్యదధి అనిరుద్ధునికి తన కొడుకు కూతురునిచ్చి పెండ్లి
...వాహం సలక్షణంగా మహావైభవోపేతంగా జరిగింది.
...లదలైన యాదవప్రముఖులందరూ శ్రీకృష్ణుని ఆహ్వా
...లుకొని బంధుమిత్రపరివారసమేతంగా రుక్మి పరి
...ానికి వచ్చి విడిది చేశారు.

ద్యూతకలహాలు

వివాహకార్యక్రమాలు పూర్తయాక కళింగరాజప్రముఖులందరూ రుక్మి వద్దకేగి 'బలరామునికి అక్షవిద్యలో ప్రావీణ్యం లేక పోయినా వ్యసనం మాత్రం ఉన్నది. అతనిని ఓడించాలని మా అందరి ఆకాంక్ష' అని తమ కోరికను వెల్లడించారు. రుక్మి అందుకు అంగీకరించి రాజసభలో ద్యూతక్రీడకు వలసిన ఏర్పాట్లను చేసి తానుకూడా ఆటకు కూర్చున్నాడు. ప్రారంభంలోనే బలరాముడు పందెంగా ఒడ్డిన వేయినిష్కాలను రుక్మికి ఇచ్చుకోవలసి వచ్చింది. రెండవసారి మళ్లీ వేయి నిష్కాలను ఓడిపోయాడు, చివరిగా, ద్యూతక్రీడ చేతకాని బలరాముడు ద్యూతనిపుణుడైన రుక్మికి పదివేల నిష్కాలను చెల్లింపవలసి వచ్చింది. అభిమానధనుడైన బలభద్రుడు ఆ విధంగా వరుసగా ఓడిపోతుంటే కళింగరాజు బిగ్గరగా నవ్వసాగాడు. భోజకటకరాజు విజయగర్వంతో అట్టహాసంచేసి 'ఈ బలదేవుడికి పాచికలాడటం బొత్తిగా చేతకాదు. అక్షవిద్య మీది మమకారం కొద్దీ ఆటలోకి దిగి తనకేదో వచ్చునని అనుకొంటున్నాడు' అంటూ అవహేళన చేశాడు. ఆ మాటకు కళింగరాజు విరగబడి నవ్వాడు. అసలే పరాజయావమానంతో క్రుంగిపోతున్న హలాయుధుడు రుక్మి ఎత్తిపొడుపులను, కళింగరాజు వెకిలినవ్వులను సహింపలేక ద్యూతపణాన్ని పదివేల నిష్కాలకు పెంచి పాచికలను కలిపి బల్లమీదవేశాడు. పందెం అతను చెప్పినట్లుగానే పడింది. దానితో అంతవరకూ కోపపరీతుడై బిగుసుకొని ఉన్నవాడు ఒక్కమ్మడిని తేరుకొని 'ఆట నాదే; గెలుపు నాదే' అని సోత్సాహంగా అరిచాడు.

రుక్మిసంహారం

అయితే కపటభాషణుడైన రుక్మి అందుకు బలదేవునికన్నా గొంతు పెద్దచేసి అతను

చెప్పకు! నువ్వు పందెం చెప్పి నేను ఒప్పుకోనక ముందే పాచికలు విసిరావు. నువ్వు గెలిచినా నేను ఓడినట్లు కాలేదు. ఆట నాదే' అని అడ్డుపడ్డాడు. బలదేవుడు ఆశ్చర్యచకితుడై అంతలోనే క్రుద్ధుడయ్యాడు.

అప్పుడు ఆకాశం నుంచి మేఘగంభీరస్వనం ఒకటి 'బలరాముడే ద్యూతవిజేత. రుక్మి మాటలు అసత్యాలు' అని వినవచ్చింది. ఆకాశవాణి పలుకులతో కోపం రెట్టించి బలరాముడు అష్టాపదాన్ని (ద్యూతక్రీడకు ఉపయోగించే పలక) తీసుకొని మహాబలుడైన రుక్మి శిరస్సును పగలగొట్టి చంపాడు. ఆ దృశ్యానికి భీతుడై గజగజ వణుకుతున్న కళింగరాజును పట్టుకొని అపహాస్యం చేసినందుకు ప్రతీకారంగా దంతాలను ఊడగొట్టాడు. ఆ ప్రక్కనే ఉన్న సువర్ణ స్తంభాన్ని చేతపట్టి తనను పరిహసించిన రాజు లందరినీ కనురెప్పపాటు కాలంలో సంహరించివేశాడు. సభాభవనంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. దూరంగా కూర్చున్న రాజులందరూ మందిర ద్వారాల నుంచి తప్పించుకొని బయటికి పారిపోయారు.

వివాహశిబిరంలో ఉన్న శ్రీకృష్ణునికి ఈ ఉదంతం తెలిసింది. జరిగిన ఘటనను గురించి ఏమని వ్యాఖ్యానించినా ఇటు రుక్మిణి, అటు బలరాముడు ఎవరో ఒకరు బాధపడక తప్పదు. మధుసూదనుడు మారుమాటాడక అన్నగారి వద్దకు వధూవరులను తీసికొనివచ్చి సరసోక్తులతో చల్లబరిచి అందరితో కలిసి ద్వారకకు బయలుదేరాడు.

దేవేంద్రుని ప్రార్థన

పిమ్మట కొంతకాలానికి త్రిభువనేశ్వరుడు దేవేంద్రుడు
ధిరోహించి ద్వారకకు వచ్చాడు. శ్రీకృష్ణుడు అత
త సత్కారాలతో అతిథిమర్యాదలు చేశాడు.
శౌరితో నరకుని దురాగతాల విషయం ప్రస్తా

వించి, "దేవదేవా! మధుసూదనా! లీలామానుష వేషంలో నేలకు దిగివచ్చి త్రైలోక్యవాసుల సర్వదుఃఖాలను ప్రశమింపజేశావు. తపస్వులను, నిస్సహాయులైన ప్రజలను హింసించిన అరిష్ట, ధేనుక, చాణూర, ముష్టిక, కేశి రాక్షసులను తుదముట్టించావు. కంసుడు, కువలయాపీడుడు, బాలఘాతిని పూతన నీ చేతిలో మరణించారు. జగత్తులకు ఉపద్రవాలను కల్పించినవారందరినీ నిశ్శేషంగా సంహారించావు. నీ దుష్టశిక్షణ శిష్టపాలన కళాకౌశలంవల్ల ముల్లోకాలలో శాంతి నెలకొన్నది. లోకంలో మళ్లీ యజ్ఞయాగాలు ప్రారంభమై దివౌకసులకు హావిర్భాగాలు అవ్యాహతంగా లభిస్తున్నాయి. దేవతలు ప్రసన్నులై లోకాలకు జీవనోపాయాలను సమృద్ధంగా కల్పిస్తున్నారు. ఇంతలో మళ్లీ ఈ అవాంతరం దాపురించి కార్యార్థినై నీ వద్దకు శరణుకోరి వచ్చాను. భూదేవి సుతుడు నరకుడని పేరుగల ప్రాగ్జ్యోతిషపతి సర్వభూతాలను హింసించటం మొదలుపెట్టాడు. దేవతలు, దానవులు, మానవులు, సిద్ధులు, సాధ్యులు ఒకరని లేకుండా సుందరాంగనలు ఎవరు కనిపిస్తే వారిని చెరపట్టాడు. వరుణుని సలిలస్రావి ఛత్రాన్ని, మందరాద్రి శృంగాలపై ఉన్న మణిపర్వతాన్ని, మా అమ్మ అదితివద్ద నుంచి అమృతాన్ని స్రవించే కుండలాలను అపహరించాడు. ఇప్పుడు నా ఐరావతాన్ని ఇమ్మని అడుగుతున్నాడు. ఈ అసురదుర్నీతికి అంతులేకుండా ఉన్నది. దీనిని ఏ విధంగా నివారించాలో నీవే ఆలోచించి, తగిన మార్గాన్ని ఉపదేశించు" అని వేడుకొన్నాడు.

దేవేశ్వరుని పలుకులను విని అతని మనోభావాన్ని గ్రహించి దేవకీసుతుడు అంగీకారసూచనగా చిరునవ్వు నవ్వి, సుఖాసనం నుంచి లేచి ఇంద్రుని చేతిని అధైర్యం వలదన్నట్లు మృదువుగా స్పృశించాడు. వెంటనే గరుత్మంతుని స్మరించి సత్యభామాసమేతుడై

ప్రాగ్జ్యోతిషపురానికి బయలుదేరాడు. ఇంద్రుడు కూడా ఐరావతాన్ని అధిరోహించి ద్వారకానగరవాసులను విలోకిస్తూ నిశ్చింతగా త్రిదివాలయానికి వెళ్లాడు.

నరకాసుర సంహారం

ప్రాగ్జ్యోతిషపురం దూరప్రాచ్యంలో శతయోజనాల విశాలమైన మహాపట్టణం. మురురాక్షసుడు ఆ నగరాన్ని క్షురధారల వంటి నిశితకంటకాలను పొదిగి నిర్మించిన పాశాలతో పరిరక్షిస్తున్నాడు. శ్రీహరి ఆ మౌరవపాశాలను సుదర్శనప్రయోగంతో ఛిన్నాభిన్నం చేసి ఎదురువచ్చిన మురురాక్షసుని సంహరించి అతని కొడుకులు ఏడువేలమందిని చక్రజ్వాలలలో శలభాలవలె మాడ్చివేశాడు. మురుని తోడ్తో వచ్చిన హయగ్రీవుని, పంచజనుని అంతమొందించి ప్రాగ్జ్యోతిషాన్ని చేరుకొన్నాడు. అక్కడ పురద్వారంలో నరకుని సేనలతో పోరు ఘోరంగా జరిగింది. వేలమంది దైత్యదానవులు మరణించారు. తన సైన్యాలు క్రమ క్రమంగా అంతరిస్తుంటే చూసి క్రోధవశుడై నరకుడు రణరంగానికి వచ్చి శ్రీహరిపై శస్త్రాస్త్ర వర్షాన్ని కురిపించాడు. చక్రాయుధుడు వైనతేయచక్రంపైని క్రీడా వినోదంగా నిర్వక్రవిక్రమంతో పరాక్రమించి శ్రీచక్రరాజాన్ని ప్రయోగించి నరకుని లోకాశ్చర్యకరంగా సంహరించాడు.

అప్పుడు భూదేవి అదితి కుండలాలను గైకొని జగన్నాథుని ముందు వచ్చి నిలిచింది. "ప్రభూ! వరాహావతారంలో మీరు నన్ను ఉద్ధరించిన తరుణంలో మీ శరీరసంయోగం వలన నాకు ఈ కుమారుడు జన్మించాడు. మీరు ప్రసాదించిన వరాన్ని మీరే ఉపసంహరించారు. ఈ కుండలాలను స్వీకరించి ఇతని సంతానాన్ని కాపాడండి. భూమిభారావతరణ కోసం మీరు భూతలాన అవతరించిన మహాత్ములు. జగద్రూపులు, మీ అధీనంలో ప్రవర్తిల్లుతున్న జగత్సృష్టి

స్థితిలయస్వరూపులు, అయిన మిమ్ము ప్రస్తుతింపగల ప్రశంస లేముంటాయి! వ్యాప్యవ్యాపకత్వాలు, క్రియాకర్తృత్వాలు కార్య రూపంలో పరిణమించిన భగవానుని ప్రకటీకరింపగల వాఙ్నికరం ఏమున్నది? పరమాత్మ భూతాత్మ మహాత్మతేజులు, అవ్యయులు అయిన మిమ్ము నోరారా వర్ణింపలేని నన్ను మన్నించి, నరకుని దోషాలను క్షమించండి. మీ చేతులలో మరణించిన సుతునికి మోక్షాన్ని ప్రసాదించండి'' అని వేడుకొన్నది.

భగవానుడు పృథ్వీసూక్తానికి ప్రసన్నుడై అభయదానం చేసి, నరకుని అంతఃపురంలో ఉన్న పదహారువేలనూరుమంది సౌందర్య వతులను, అతని సౌధాంతరంలో లభించిన పదహారువేల ఉత్తమ దంతావళాల చతుర్దంతాలను, ఇరవై ఒక్కలక్షల ఉత్తమకాంభోజ హయాలను నరకుని కింకరుల సంరక్షణలో ద్వారకకు పంపించాడు. వరుణచ్ఛత్రాన్ని, మణిపర్వతాన్ని గరుత్మంతునిపై ఉంచి దేవ మాతకుండలాలను అప్పజెప్పడానికి సత్యభామాసమేతుడై త్రివిష్ట పానికి వెళ్లాడు.

అదితి దర్శనం

వరుణదేవుని ఛత్రాన్ని, మణిపర్వతాన్ని, సత్యాకృష్ణులను అవలీలగా మోస్తూ గరుత్మంతుడు మహావేగంతో ప్రయాణించి త్రిదశా[illegible]యాన్ని సమీపింపగానే హృషీకేశుడు లోకమంగళకరమైన శంఖాన్ని పూరించా[illegible]. దేవతలు స్వర్గద్వారం చెంత ఆయనకు ఎదు రేగి సార్ఘ్యహస్త[illegible] శ్రీకృష్ణుడు శ్వేతజీమూత శిఖ రాకారంలో ఉ[illegible]మైన కుండలాలను

అదితి సూక్తం

నమస్తే పుణ్డరీకాక్ష! భక్తానా మభయఙ్కర!
సనాతనాత్మ౯ సర్వాత్మ౯ భూతాత్మ౯ భూతభావన.

ప్రణేతా మనసో బుద్ధే రిన్ద్రియాణాం గుణాత్మక
త్రిగుణాతీత నిర్ద్వన్ద్వ శుద్ధసత్త్వ హృది స్థిత.

సిత దీర్ఘాది నిఃశేష కల్పనా పరివర్జిత
జన్మాదిభి రసంస్పృష్ట స్వప్నాది పరివర్జిత.

సన్ధ్యా రాత్రి రహో భూమి ర్గగనం వాయు రమ్బు చ
హుతాశనో మనో బుద్ధి ర్భూతాది స్త్వం తథాచ్యుత.

సృష్టి స్థితి వినాశానాం కర్తా కర్తృపతి ర్భవాన్
బ్రహ్మ విష్ణు శివాఖ్యాభి రాత్మమూర్తిభి రీశ్వర.

దేవా యక్షా స్తథా దైత్యా రాక్షసాః సిద్ధ పన్నగాః
కూష్మాణ్డాశ్చ పిశాచాశ్చ గన్ధర్వా మనుజా స్తథా.

పశవో మృగ మాతఙ్గ స్తథైవ చ సరీసృపాః
వృక్ష గుల్మ లతా బహ్వ్యః సమస్తా స్తృణజాతయః.

స్థూలా మధ్యా స్తథా సూక్ష్మాః స్థూల సూక్ష్మతరాశ్చ యే
దేహభేదా భవా౯ సర్వే యే కేచిత్ పుద్గలాశ్రయాః.

మయా తవేయ మజ్ఞాత పరమార్థాతి మోహినీ
అనాత్మ న్యాత్మవిజ్ఞానం యథా మా... నిరుధ్యతే.

అన్యే స్వమితి ... ఖుపజాయతే
(అ... ...జాయతే)

బ్రహ్మాద్యాః సకలా దేవా మనుష్యాః పశవస్తథా
విష్ణుమాయా మహావర్త మోహాన్ధ తమసావృతాః.

ఆరాధ్య త్వా మభీప్సన్తే కామా నాత్మ మవక్షయమ్
మదేతే పురుషా మాయా సైవేయం భగవం స్తవ.

మయా త్వం పుత్త్రకామిన్యా వైరిపక్షక్షయాయ చ
ఆరాధితో న మోక్షాయ మాయావిలసితం హి తత్.

కౌపీనాచ్ఛాదనప్రాయా వాఞ్ఛా కల్పద్రుమాదపి
జాయతే య దపుణ్యానాం సోఽపరాధః స్వదోషజః.

తత్ ప్రసీదాఖిల జగన్మాయామోహకరావ్యయ!
అజ్ఞానం జ్ఞానసద్భావభూతం భూతేశ! నాశయ.

నమస్తే చక్రహస్తాయ శార్ఙ్గహస్తాయ తే నమః
గదాహస్తాయ తే విష్ణో! శఙ్ఖహస్తాయ తే నమః.

ఏతత్ పశ్యామి తే రూపం స్థూలచిహ్నోపలక్షితమ్
న జానామి పరం యత్తే ప్రసీద పరమేశ్వర!

దేవమాత స్తోత్రగీతి విని శ్రీ మహావిష్ణువు ప్రహృష్ట స్వాంతుడై దరస్మేరవదనంతో "అమ్మా! ప్రసన్నురాలివై నన్ను కరుణించు" అని ఆమె వరాన్ని కోరాడు. దేవమాత తథాస్తు పలికి "పురుషవ్యాఘ్రం! మర్త్యలోకంలో ఉన్నంతకాలం సురాసురులకు అజేయుడవై అశేషకీర్తిమంతుడవు కాగలవు" అని ఆశీర్వదించింది.

అనంతరం సత్యభామ శచీదేవితోపాటు అదితికి నమస్కరించింది. దేవమాత ఆమెకు జరావైరూప్యాలులేని సుస్థిర నవయౌవనాన్ని వరంగా ప్రసాదించింది. దేవేంద్రుడు అదితి అనుజ్ఞ గైకొని జనార్దనుని బహుమానపురస్సరంగా పూజించి వారిని దేవలోక విహారానికి తీసుకొని వెళ్లాడు. శచీదేవి పారిజాత కుసుమాలను తన కబరీ

భరంలో అలంకరించుకొని, సత్యభామ మానవమాత్రురాలని భావించి ఆమెకు ఆ పువ్వులను ఇవ్వకుండా ఊరుకొన్నది.

పారిజాతాపహరణం

సత్యాకృష్ణులు నందనాది దైవతోద్యానాలను చూసుకొంటూ క్షీరసాగర మథనవేళలో అవతరించిన పారిజాత కల్పతరుసమీపానికి వచ్చారు. మనోహర సుగంధాఢ్యమైన ఆ దివ్యతరువు ఎర్రని చిగుళ్లతో మంజరీపుంజాలతో స్వర్ణవర్ణంలో నిత్యాహ్లాదకరంగా విభాసిల్లుతున్నది.

దేవపాదప సౌందర్యాన్ని చూడగానే మనసుగొన్న సత్యభామ శ్రీకృష్ణుని చూసి "నాథా! ఈ పారిజాతం ద్వారకలో మన వద్ద ఉండతగినది. నేనంటేనే మీకిష్టమని రోజూ మీరనే మాట నిజమైతే ఇప్పుడే దీనిని తీసుకొని మన ఇంటికి వెళ్లిపోదాము. ఎన్నో సార్లు మీరు నాతో 'జాంబవతికన్నా రుక్మిణికన్నా నాకు నువ్వంటేనే అభిమానం'. అని ఏకాంతంలో పలికిన మాటలు ఉపచార వాక్యాలు కాక సత్యమైతే, ఈ పారిజాతం నా గృహాంగణాన్ని అలంకరిస్తుంది! పారిజాత పుష్పాలంకరణంతో సపత్నుల మధ్య నేను ద్విగుణీకృత శోభావిలసితంగా ప్రకాశిస్తాను!" అని ఎంతో ఆశతో అడిగింది.

శ్రీహరి ఆమె కోరికను చిరునవ్వుతో మన్నించి పారిజాతాన్ని సమూలంగా లేవనెత్తి గరుత్మంతుని రెక్కలపై ఉంచాడు. వనరక్షకులు అడ్డుపడి "ఇది దేవరాజ్ఞి శచీదేవికి అభిమానపాత్రమైన పాదపం. గోవిందా! దీనిని నీవు అపహరించటం ఉచితం కాదు. సముద్రమథనం జరిగినప్పుడు శచీదేవికి విభూషణార్థమై ఈ దివ్యతరువు ఆవిర్భవించింది. దేవేశ్వరుని అభీష్టానికి భంగపాటు కలిగిస్తే మీకు దేవతలతో వైరమూ, వజ్రాయుధుని చేతిలో పరాభవమూ తప్పవు. అజ్ఞానకృతానికి అవమానం తోడయి బంధుత్వాలు దూర

మయ్యే ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దు'' అని తీవ్రంగా హెచ్చరించారు. సత్యభామ వారి మాటలకు మండిపడి, "శచీదేవికి పారిజాతాన్ని ఉంచుకొనే అధికారాన్ని ఎవరిచ్చారు? సముద్రమథనం జరిగినప్పుడు అవతరించినవన్నీ లోకోపకారానికే కాని ఎవరో ఒకరి కోసం పుట్టలేదు. ఇంతమంది దేవతలుండగా దీనిని ఇంద్రుడికే ఎందుకు కట్టబెట్టాలి? ఓ వనపాలకులారా! అమృతం, చంద్రుడు, లక్ష్మి అందరికీ చెందినట్లే పారిజాతం కూడా మీ యజమాని సొమ్ము కాదు. శచీదేవి తన భర్త శక్తియుక్తులను నమ్ముకొని దీనిని తన యింట నిలుపుకొన్నట్లే ఇప్పుడు నేను సొంతం చేసుకొన్నాను. వెళ్లి పౌలోమితో నా మాటగా చెప్పండి: 'నీవు నీ భర్తకు ప్రియపత్నివైతే, నీ నాథుడు నీకు వశవర్తి అయితే, వెంటనే వచ్చి పారిజాతాపహరణం జరగకుండా రక్షించుకోమను. నువ్వెంతో, నీ భర్తయెంతో, ఈ దేవతల ప్రభావమేమిటో నాకు బాగా తెలుసు. మానవమాత్రురాలినైన నేను ఇప్పుడే దీనిని తీసుకొని వెళుతున్నాను' అని సత్యభామ అన్నదని చెప్పండి'' అని తిరస్కారపూర్వకంగా ప్రసంగించింది.

వనరక్షకులు వెంటనే శచీదేవి వద్దకు వెళ్లి సత్యభామ అన్న మాటలను యథాతథంగా విన్నవించారు. ఆమె తనకు జరిగిన అవమానాన్ని భర్తకు వివరించి యుద్ధానికి ప్రోత్సహించింది. త్రిదశాధిపతి దేవసైన్యాన్ని సమీకరించుకొని పారిజాతార్థం శ్రీహరితో పోరాటానికి బయలుదేరాడు. దేవతలు పరిఘా నిస్త్రింశ గదా శూలాది వరాయుధాలను, దేవేశ్వరుడు వజ్రాయుధాన్ని చేతబూనారు.

శ్రీకృష్ణుడు తన మీదికి దూసుకొని వస్తున్న నాగరాజో పరిస్థితుడైన దేవేంద్రుని, దేవపరివారాన్ని చూసి పాంచజన్యాన్ని పూరించాడు. ఆ మహాశంఖ నిర్ఘోషం దిగంతాలకు ప్రాకి అమరావతి

నిర్వీణమైపోయింది. శార్ఙ్గకోదండానికి దివ్యశరాలను సంధించి శ్రీకృష్ణుడు సహస్రాయుతంగా అమరవాహినులపై కురిపించాడు. దేవతలు అనేక శస్త్రాస్త్రాలను ప్రయోగించారు. మధుసూదనుడు ఆ శస్త్రాస్త్రాలను మార్గమధ్యంలోనే సహస్రశకలాలుగా ఛేదించాడు. గరుడుడు వరుణపాశాన్ని ముక్కున దాల్చి బాలపన్నగదేహాన్ని కబళించినట్లు ముక్కలు ముక్కలు చేశాడు. దేవకీనందనుడు యముడు విసిరిన దండాన్ని గదావిక్షేపంతో ఖండించి, కుబేరుని శివికను చక్రప్రయోగంతో నాశనం చేశాడు. సూర్యుని తేరిపార జూచి అతని ఓజస్సును తనలో విలీనం చేసుకొన్నాడు. బాణ వర్షాన్ని కురిపించి అగ్నిని నిరస్తతేజుని కావించాడు. వసువులను దెసలకొసలకు పారద్రోలాడు. రుద్రుని శూలాన్ని చక్రంతో ఛేదించి, విశ్వసాధ్యమరుద్గంధర్వ గణాలపై గాలిలో ఎటునుంచి వస్తున్నదీ తెలియరాకుండా అమోఘశరాలను ప్రయోగించాడు. గరుడుడు కూడా పక్షాలతో, నఖశిఖరాలతో దేవతలను గాయపరిచి భయభ్రాంతులను చేశాడు.

అప్పుడు ఉపేంద్ర దేవేంద్రులకు మహాయుద్ధం జరిగింది. జలధరాల నుంచి వర్షాబిందువులు స్రవించినట్లు శరవర్షం కురిసింది. జనార్దనుడు సర్వదేవతలనూ ఎదిరింపగా గరుడి ఐరావతాన్ని మార్కొన్నాడు. శస్త్రాస్త్రాలన్నీ నిరుపయోగాలు కాగా ఇంద్రుడు వజ్రాయుధాన్ని, జనార్దనుడు సుదర్శనాన్ని చేతపట్టారు. ముల్లోకాలు హాహాకారాలు చేశాయి.

దేవేశ్వరుడు శ్రీహరిపై విసిరిన వజ్రాయుధం నిర్వీర్యమైనాక శ్రీహరి సుదర్శనాన్ని అతని మీదికి ప్రయోగించబోయాడు. అప్పుడు సత్యభామ నిరాయుధుడైన వృషాకపిని చూసి "త్రిభువనేశ్వరా! అంతటి శచీదేవి భర్తవు నీకు పారిపోవడం తగదు. చక్రాన్ని

ఎదిరింపగల శక్తి నీకు లేదు. దేవేంద్రుడు పలాయనపరాయణుడన్న అపకీర్తిని నీ భార్య భరింపగలదా? వెన్నుచూపి ఇంటికి వెళ్లాక ఆమె పారిజాతపుష్పమాలికలతో నీకు స్వాగతం పలుకుతుంది కాబోలు. ఈ పారిజాతవృక్షం లేకపోయాక నాకలోకం నిస్తేజమవుతుంది. వద్దు శక్రా! నీవు పారిపోవద్దు. దేవతల ఆగ్రహానికి గురి కావద్దు. శచీదేవి నన్ను చూసినప్పుడు మానవమాత్రురాలినని భావించి సముచితంగా గౌరవింపలేదు. నేను స్త్రీనే అయినా, అగౌరవీయనే అయినా నా భర్త సన్నిధిలో ఉన్నప్పుడు నాకు జరిగిన అవమానం ఆయనకు జరిగినట్లు కాదా? అందుచేతనే నేను నా నాథుని రెచ్చగొట్టి శచీదేవికి నా నాథుని గొప్పతనం ఎటువంటిదో చక్కగా తెలిసేటట్లు చేశాను. అంతేకాని నాకు మరొకరి సిరిసంపదలతో పనిలేదు. ఈ పారిజాతమూ అక్కరలేదు. శచీదేవి సౌందర్యానికి తగిన బుద్ధి చెప్పాను. నలుగురిలో తన భర్త గొప్పదనాన్ని ప్రదర్శించాలని ఎవరికి మాత్రం ఉండదు?'' అని శాంత గంభీరంగా పలికింది.

దేవేంద్రుడు సత్యభామ మాటలకు తలవంచి, ''అమ్మా! నీ నాథుడు విశ్వరూపధరుడు. జగత్తులన్నీ ఆయన సంకల్పమాత్రాన ఆవిర్భవించి ఆయనయందే విలీనమవుతున్నాయి. మా వలె ఆయన కర్మబద్ధుడు కాడు. గుణాతీతుడైనందున రాగద్వేషాది భావాలకు ఆయన దూరవర్తి. జగత్ప్రభవ పాలన ప్రళయవిధాతచేతిలో ఓడిపోయానన్న అవమానం నాకు లేదు. అజుడు, ఈశ్వరుడు, శాశ్వతుడు అయిన జగన్నియంతను జయించటం సాధ్యం కాదని తెలిసినా ఔపచారికంగా ఆయనతో కలహానికి సాహసించాను. లోకరక్షణార్థం లీలామానుషవిగ్రహాన్ని ధరించిన పరమాత్మను జయింపగల సమర్థుడు ఎవ్వడూ లేడు'' అని అంజలించాడు.

శ్రీకృష్ణుడు దేవేంద్రుని పలుకులకు చిరునవ్వు నవ్వి ఈ విధంగా అన్నాడు —

"దేవరాజా! నీవు ఇంద్రుడవు. మేము మర్త్యులము. జగత్పతీ! నేను కావించిన ఈ అపరాధానికి నన్ను మన్నించు. ఈ పారిజాత వృక్షాన్ని ఉచితస్థానంలో నివేశించు. సత్యకు ఇచ్చిన మాటకోసం నేను దీనిని పరిగ్రహించాను. నీవు నాపై ప్రయోగించిన వజ్రాయుధం ఇదిగో. వైరివిదారణ కర్తవ్యానికి ఇది నీ వద్ద ఉంటేనే రాణిస్తుంది"

శ్రీవల్లభుని నర్మగర్భోక్తులకు దేవేంద్రుడు సిగ్గుపడి, "ప్రభూ! కేవల మర్త్యుడనని నీవన్న మాట నాకే మోహాస్పదంగా ఉన్నది. నీ తత్త్వదర్శులము కాకపోయినా నీవే భగవానుడవని మాకు తెలుసు. ఏది ఉనికి గలిగి ఉన్నదో, అది నీవే. జగదుత్పత్తి సుస్థితులకు మూలకందానివీ నీవే. జగత్తులకు కంటకప్రాయంగా తలయెత్తిన రాక్షసులను సంహరించి దేవకులాన్ని రక్షించే భారం నీదే. కృష్ణా! పారిజాతాన్ని సంతోషంగా నీ చేతులలో ఉంచుతున్నాను. మర్త్యలోకంలో నీవు ఉన్నంతకాలం నీ సేవాభాగ్యం దీనికి కలుగుతుంది" అని సవినయంగా అన్నాడు.

మహేంద్రుని పలుకులను మన్నించి శ్రీకృష్ణుడు పారిజాతాన్ని అందుకొని సత్యాసమేతంగా సిద్ధ గంధర్వ మహర్షి సన్నుతులను అందుకొంటూ భూలోకానికి తిరిగి వచ్చాడు.

ద్వారకను సమీపింపగానే శ్రీకృష్ణుడు పాంచజన్యశంఖాన్ని పూరించాడు. పురజనుల హృదయాలలో మహానందం వెల్లివిరిసింది. గరుత్మద్రథాన్ని దిగి సత్యభామతో కలిసి క్రీడావనానికి వెళ్లి అక్కడ పారిజాత మహాతరువును ప్రతిష్ఠించారు. ఆ దివ్య తరు పరిమళం మూడు యోజనాల దూరానికి వ్యాపించి, దాని ప్రభావం వల్ల అక్కడ చరించిన వారందరికీ పూర్వజన్మస్మరణ కలిగింది.

ఆ తర్వాత శ్రీహరి నరకుని కింకరులు శ్రద్ధాభక్తులతో కొనివచ్చిన హయగజవాహనాదులను, మహైశ్వర్యాలను, స్త్రీ ధనాన్ని పరిగ్రహించాడు. శుభముహూర్తంలో పదహారువేలనూరు మంది కన్యకామణులను ఏకకాలంలో వేర్వేరు ఇండ్లలో పాణి గ్రహణం చేసి, అంతమందికీ పృథగ్రూపంలో సాక్షాత్కరించి, జగత్సృష్ట విశ్వరూపధరుడు శ్రీమహావిష్ణువుకు భార్యల మైనామన్న ఆనందాన్ని వారికి ప్రసాదించాడు.

శ్రీకృష్ణుని సంతానం

మైత్రేయా! శ్రీహరికి రుక్మిణియందు ప్రద్యుమ్నాదులైన సుతులు జన్మించిన సంగతి చెప్పాను. ఇక తక్కినవారిని గురించి విను. సత్యభామకు భానుడు, భైమరికుడు ఉదయించారు. రోహిణికి దీప్తి మంతుడు, తామ్రపక్షుడు మొదలుగా పెక్కుమంది సుతులు కలి గారు. భద్రవిందాదులైన మహాయోధులు నాగ్నజితి కుమారులు. శైబ్య (మిత్రవింద)కు ప్రభవించిన సుతులలో సంగ్రామజిత్తు ప్రధా నుడు. మాద్రియందు శ్రీహరికి నృకాదులు జన్మించారు. లక్ష్మణకు గాత్రవంతుడు మొదలైనవారు, కాళిందికి శ్రుతాదులు ఉదయించారు. కృష్ణునికి ఇతర భార్యలందు కూడా పెక్కుమంది సుతులు— మొత్తం లక్షఎనభై వేలమంది ఉదయించారు.

ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుని జ్యేష్ఠసుతుడు. అతనికి అనిరుద్ధుడు, అనిరుద్ధునికి ఉషాదేవి యందు వజ్రుడు జన్మించారు. ఈ ఉష బలి చక్రవర్తి కుమారుడైన బాణుని కుమార్తె. బాణుడు ప్రద్యుమ్న సుతులతో యుద్ధానికి వచ్చాడు. ఆ సమయంలో హరిహరులకు పోరు ఘోరంగా జరిగింది. శ్రీహరి చక్రాయుధంతో బాణుని సహస్ర బాహువులను ఖండించాడు''

అని పరాశరుడు సంక్షిప్తంగా ముగించేసరికి మైత్రేయుడు కుతూహలం ఉండబట్టలేక "మహాత్మా! ఉషానిరుద్ధుల వివాహ సమయంలో హరిహరులకు పోరాటం ఎలా సంభవించింది? శ్రీహరి బాణుని సహస్రబాహువులను ఎందుకు ఖండింపవలసివచ్చింది?" అని ప్రశ్నించాడు. అతని సంశయాన్ని వక్తవ్యాంశానికి భూమికగా స్వీకరించి పరాశరుడు కథానుగత శ్రీమహావిష్ణు మహిమానువర్ణనకు ఉపక్రమించాడు.

ఉషా పరిణయం

బాణుని కుమార్తె ఉష ఒకానొకప్పుడు పార్వతీపరమేశ్వరుల కేళీవినోదాలను విలోకించి, తనకు కూడా అటువంటి మధురానుభవం కలగాలని కోరుకొన్నది. సర్వహృదయభావకోవిదురాలైన పార్వతి ఆమె మనోభీష్టాన్ని గ్రహించి "అచిరకాలంలోనే నీకు భర్త లభిస్తాడు" అని మాట యిచ్చింది. ఆమె పలుకులకు బాణాత్మజ 'నాకు వివాహం ఎప్పుడు జరుగుతుందో? నా భర్త ఎవరో!' అని మనస్సులోనే అనుకొన్నది. సర్వమంగళ "వైశాఖ శుక్ల ద్వాదశి నాడు నీకు స్వప్నంలో గోచరింపనున్న రాజకుమారుడే నీ భర్త" అని చెప్పింది.

శివుని అర్ధాంగి చెప్పినట్లుగానే ఉషకు కలవచ్చి ఒక దివ్య సుందర విగ్రహుని సాక్షాత్కారం కలిగింది. ఆ ప్రథమదర్శనంలోనే ఆమె మనస్సు అతనికి అంకితమైపోయింది.

మేల్కాంచిన తర్వాత బాణాత్మజకు మనసు మనసులో లేదు. ఆ అపరిచితపురుషునితో సమాగమాన్ని కోరి ఆమె సిగ్గువిడిచి ప్రాణసఖి చిత్రలేఖకు తన స్వప్నవృత్తాంతాన్ని విశదీకరించింది.

చిత్రలేఖ బాణుని మంత్రి కుంభకుని కుమార్తె. ఆమె రాజనందన మాటలనుబట్టి ఆ అపురూప వ్యక్తి ఎవరో ఊహింపలేక

"సఖీ! నీవు ఎవరిని గురించి మాట్లాడుతున్నావు?" అని వివరాలను అడిగింది. తనను గుచ్చిగుచ్చి అడిగేసరికి రాజకుమార్తె లజ్జావనతయై ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఆలోచనలో మునిగి పోయింది. ఎట్టకేలకు ఆమెకు విశ్వాసం కలిగిన తర్వాత చిత్రలేఖ ఆమెనుంచి పార్వతి చెప్పిన భవిష్యవాణిని, స్వప్నోదంతాన్ని తెలుసు కొన్నది. తన మనోహరునితో ఎలాగయినా చేరికను కూర్చమని రాజనందన మిత్రురాలిని అర్థించింది.

చిత్రలేఖ లోకంలో ఉన్న సురాసుర సిద్ధ గంధర్వ మను ష్యాదులలో సుందరాకారులని పేరెన్నికగన్న అందరి చిత్తరువు లను సంపాదించి ఉషకు చూపించింది. అంధక వృష్ణికులాల వారందరి చిత్రాలను తెచ్చి చూపింది. అందులో బలరామకృష్ణుల రూపరేఖ లను చూడగానే ఉష హృదయం రెపరెపలాడింది. ప్రద్యుమ్నుని ఆలేఖ్యం వచ్చేసరికి ఆమె కన్నులు నవతేజోభరంతో వికసించాయి. అనిరుద్ధుని వర్ణచిత్రం తన చేతులలోకి రాగానే ఆమె మహానందంతో 'ఇతనే! ఇతనే!' అని చెలికత్తెముందు సిగ్గు విడిచి నిస్సంకోచంగా చెప్పివేసింది. మాయావిదురాలైన చిత్రలేఖ రాజకుమార్తెకు ధైర్యం చెప్పి యోగమార్గంలో ద్వారకకు బయలుదేరింది.

బాణునికి యుద్ధకాంక్ష

ఈ ఉదంతం జరగటానికి కొన్నాళ్ళ ముందు బాణుడు ఈశ్వరుని దర్శించి ఆయనకు ప్రణిపాతం చేసి, "దేవా! బాహు సహస్రం కలిగినా యుద్ధాలు లేక నిర్విణ్ణుడనై ఉన్నాను. ఎన్న డయినా యుద్ధమంటూ జరిగితేనే చేతులున్నందుకు సాఫల్యం. లేక పోతే వట్టి బరువు మాత్రమే మిగులుతుంది" అని విన్నవించాడు. ఈశ్వరుడు అతని మనోభావాన్ని గ్రహించి "నీ మయూరధ్వజం భగ్న మైననాడు పిశితాశనులకు ఆనందకరమైన యుద్ధం సంభవిస్తుంది. నీ

కోరిక తీరుతుంది'' అని చెప్పాడు. బాణుడు పునఃప్రణామం చేసి సంతోషంగా ఇంటికి తిరిగివచ్చాడు. గృహాంగణంలో అప్పటికే అతని ధ్వజం భగ్నమై ఉన్నది. అతని సంతోషం మిన్నుముట్టింది.

సరిగ్గా అదే సమయంలో చిత్రలేఖ తన యోగవిద్యాబలంతో అనిరుద్ధుని తీసికొని ద్వారకనుంచి తిరిగివచ్చింది. కన్యాకాంతఃపురంలో పరపురుషప్రవేశాన్ని గుర్తించి ద్వారపాలకులు ఆ విషయాన్ని దైత్య భూపతికి తెలియజేశారు. అతను వెంటనే కింకరులను సైన్యసమేతంగా అంతిపురానికి పంపాడు. అనిరుద్ధుడు పరిఘను చేపట్టి మహాబలంతో వారిని తుదముట్టించాడు. అతనిని బలప్రయోగంతో జయించటం సాధ్యంకాదని మంత్రులతో ఆలోచించి బాణుడు తన మాయాజాలాన్ని ప్రయోగించి నాగాస్త్రంతో ప్రద్యుమ్నసుతుని బంధించాడు.

ద్వారకలో అనిరుద్ధుడు మాయమైన నాటినుంచి యాదవులు అతనికోసం గాలిస్తున్నారు. నారదుడు వారి చెంతకేగి శోణిత పురంలో* విద్యావిదగ్ధురాలైన మాయావిని అతనిని తీసికొనివెళ్లిన సంగతి వివరించాడు.

---

* పురుషోత్తమదేవుని త్రికాండశేషాన్ని బట్టి శోణితపురానికి దేవికోట, బాణపురం, కోటివర్షం, ఉషావనం మొదలైన పేర్లున్న విషయాన్ని విల్సన్ పండితుడు ఈ సందర్భంలో ప్రస్తావించాడు. ఈ దేవికోట కర్ణాటకలో అదే పేరుతో ఉన్న ప్రాంతమని విమర్శకులు భావిస్తున్నారు. బాణుడు ఆ ప్రదేశంలో ఓడిపోయినట్లు చెప్పుకొంటుండటం ఈ వాదానికి మూలం. ఏషియాటిక్ రీసెర్చ్ సంచికలలో (IX. 99) విల్ఫోర్డ్ పండితుడు దక్కమండలంలో గోదావరీతీరాన ఉన్న ముంజాని రాజధాని కాని, అస్సాం రాష్ట్రంలో గోల్పారా సమీపంలో ఉన్న ప్రదేశం కాని బాణుని రాజధాని కావచ్చునని అనుమానించాడు. దీనికి ఉపబలకంగా కాళికాపురాణంలో బాణుడు తన పొరుగున ఉన్న నరకునికి ప్రియమిత్రుడని వర్ణింపబడి ఉన్నది. అందులోనే ప్రాగ్జ్యోతిషపురం కామరూపదేశానికి మధ్యభాగంలో ఉన్నట్లు నిరూపింపబడింది. దీనిని బట్టి శోణితపురం దూరప్రాచ్యంలో అస్సాం ప్రాంతానికి చెందినదై ఉండవచ్చు.

శ్రీకృష్ణుడు వెంటనే గరుడారూఢుడై బలరామ ప్రద్యుమ్నులతో బాణుని నగరానికి వెళ్లాడు. ప్రవేశమార్గానికి చేరువలో ప్రమథగణాలు వారిని మార్కొన్నాయి. శ్రీహరి వారందరినీ జయించి ప్రవేశద్వారాన్ని చేరుకొన్నాడు. అక్కడ మూడు తలలు, మూడు పాదాలు కలిగిన జ్వరనామక మహేశ్వర శక్తితో వారికి పోరాటం జరిగింది. బలదేవునికి ఆ శరీర స్పర్శవల్ల శరీరంలో భరింపరాని తాపం ఉదయించి కనురెప్పలు శ్రమావహం కావడం వల్ల అదిరాయి. ఆ ఉద్వేగంలో అతను శ్రీకృష్ణుని దేహాన్ని స్పృశించి వైష్ణవశక్తి విలసన వల్ల శైత్యాన్ని పొంది కోలుకొన్నాడు. శైవజ్వరం వైష్ణవశక్తి ముందు బలవిహీనమై నారాయణ భుజాఘాత పరిపీడనవల్ల విహ్వాల మయేసరికి పితామహుడు దానిని క్షమించమని శ్రీహరిని అర్థించాడు. శ్రీహరి వైష్ణవజ్వరాన్ని ఉపసంహరించి తనలో విలీనం చేసికొన్నాడు. పరాజితమైన శైవజ్వరం కృతజ్ఞతాపూర్వకంగా శ్రీహరికి అంజలించి 'మనకు ఘటిల్లిన ఈ వైరాన్ని స్మరించిన మానవులకు ఎటువంటి జ్వరబాధలూ కలుగవు' అని పలికి తిరోగమించింది.

ఆ తర్వాత శ్రీకృష్ణుడు ఆహవనీయ గార్హపత్య దక్షిణ సభ్య ఆవసథ్యాగ్నులు అయిదింటినీ శమింపజేసి, దానవబలాన్ని ఎదుర్కొన్నాడు. బాణుడు దైతేయవాహినులతో శంకర కార్తికేయులను ముందుంచుకొని శ్రీహరి పైకి విక్రమించాడు. హరిహరులకు దారుణమైన యుద్ధం జరిగింది. ఆనాడు వారిరువురూ ప్రయోగించిన శస్త్రాస్త్రజ్వాలలు దిగంతాలను అలముకొని
సృష్టిప్రళయం సంభవింపనున్నదని ఆందోళన చె
జృంభణాస్త్రాన్ని ప్రయోగించి శంకరునికి ఆవ
యుద్ధపరాఙ్ముఖుని కావించి ప్రమథగణాలను

విద్యాధిదేవత కార్తికేయుడు గరుత్మంతుని వలన గాయపడి, ప్రద్యుమ్నుని అస్త్రజాలాన్ని మరల్పలేక, శ్రీకృష్ణుని యుద్ధఘోషణలకు భయగ్రస్తుడై రణరంగం నుంచి తొలగిపోయాడు. బాణుడు గుండె దిటవు చేసికొని నందీశగృహీతజవనాశ్వాలు పూన్చిన మహారథాన్ని అధిరోహించి శ్రీకృష్ణ బలరామ ప్రద్యుమ్నులను ఎదుర్కొన్నాడు. బలభద్రుడు కుపితుడై చావగా మిగిలిన దైత్యానీకాన్ని సంహరించాడు. బాణుడు ప్రయోగించిన బాణాలను శ్రీహరి మార్గమధ్యంలోనే ముక్కలు చేశాడు. బాణుడు లోకభీకరంగా పరాక్రమించి శ్రీకృష్ణుని గాయపరిచాడు. చక్రహస్తుడు బాణుని గాయపరిచాడు. పరస్పరక్షతిపరులై ఇరువురూ ఘోరంగా పోరాడారు. ఇక శస్త్రాస్త్రాలు నిరుపయోగాలని గ్రహించి శ్రీహరి శతసూర్యతేజోమహితమైన చక్రాయుధాన్ని చేపట్టాడు.

శ్రీకృష్ణుడు బాణసంహారానికి చక్రప్రయోగం చేయనున్న తరుణంలో రుద్రుని తేజోంశ అయిన కోటవి అనే మంత్రాత్మక దైతేయవిద్య రణరంగంలో నగ్నంగా సాక్షాత్కరించింది. శ్రీకృష్ణుడు ఆమెను చూసి మీలితాక్షుడై సుదర్శనాన్ని బాణుని బాహువుల మీదికి ప్రయోగించాడు. ఆ చక్రం అసురుల శస్త్రౌఘాన్ని విచ్ఛేదించి బాణుని బాహువనాన్ని నిర్మూలించింది. చేతులు తెగి సిగ్గుతో తల వంచుకొన్న అతనిపైకి శ్రీకృష్ణుడు మళ్ళీ చక్రప్రయోగం చేయబోయాడు. అప్పుడు త్రిపురారి ప్రత్యక్షమై బాణుని చం[illegible] అర్థించాడు. "కృష్ణా! జగన్నాథా! నీ పురుషోత్తమ
[illegible]ంచాను. నీవు పరుడవు, పరేశుడవు, పరాత్పరుడవు,
[illegible]పుడవు, అనాదిమధ్య నిధనాకృతివి. నీవు లీల
[illegible] ధరించినప్పుడు దేవతిర్యఙ్మనుష్య శరీరాలు,
[illegible] శక్తివిలసన చేష్టోపలక్షణాలుగా ఏర్పడు

తున్నాయి. ప్రభూ! ఈ బాణునికి నేను వరదానం చేశాను. ఇతనిని నీ విప్పుడు సంహరిస్తే నే నిచ్చిన వ్యాహృతికి భంగపాటు కలుగుతుంది. చిన్ననాటి నుంచి నన్నే నమ్ముకొని నా సంశ్రయంలో పెరిగినవాడు. దయతో ఇతనిని మన్నించి విడిచిపెట్టు'' అని అడిగాడు.

ఈశ్వరుని వినివేదనకు శ్రీహరి ప్రసన్నుడై బాణుని కరుణావలోకనాలతో విలోకించి, ఈశ్వరుని వైపు మరలి, "శంకరా! నీ మాటమీది గౌరవం వలన చక్రాన్ని ఉపసంహరిస్తున్నాను. నీ విచ్చిన అభయానుసారం ఇతనిని విడిచిపెడుతున్నాను. హరిహరులకు మనకు స్థూలదృష్టికి గోచరించే మూర్తిభేదమే తప్ప ఆత్మభేదం లేదు. నీ మాట ఒకటీ, నా మాట ఒకటీ వేరుకావు. అవిద్యామోహం వలన పురుషులు శరీరాన్ని ఆత్మగా భ్రమించి భిన్నదర్శను లవుతున్నారు. దేవాసుర మనుష్యపూర్ణమైన ఈ జగత్తు, ఈ జగదంతరితులమై జగద్రూపాన్ని ధరించిన నేను, నీవు అందరమూ ఒక్కటే!'' అని ఆత్మీయత నెరపి ప్రద్యుమ్నుని బంధించి ఉంచిన చోటికి వెళ్లాడు. గరుత్మంతుని ఊర్పుగాడ్పులకు భీతిల్లి అతనిని బంధించిన నాగపాశాలు తమంత తామే విడిపోయాయి. ఉషానిరుద్ధులను ప్రద్యుమ్న బలదేవ సహితంగా వినతాసుతునిపై కూర్చుండబెట్టుకొని శ్రీకృష్ణుడు ద్వారకకు తిరిగివెళ్లాడు'' అన్నాడు.

ఆ మాట విని మైత్రేయుడు "మహాత్మా! లీలామానుమవేషాన్ని ధరించిన శౌరి చరిత్రలను ఎంత విన్నా తనివితీరదు. ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పండి'' అని కుతూహలం ఉండబట్టలేక అడిగాడు. పరాశరుడు తన కథానకాన్ని కొనసాగించాడు.

వారాణసీదహనం

"విప్రవరేణ్యా! మైత్రేయా! నరావతారంలో శ్రీకృష్ణుడు కావించిన కాశీదహన వృత్తాంతాన్ని స్పష్టంగా విను.

ఆ కాలంలో అజ్ఞానమోహితులైన జనులను తానే వాసుదేవుడనని భ్రమింపజేసి పూజ లందుకొనగోరిన పౌండ్రకుడనే వాసుదేవు డొకడు ఉండేవాడు. అతడు పదవీవ్యామోహం వల్ల యుక్తాయుక్తవివేకాన్ని కోల్పోయి, తాను చేస్తున్నది భగవదపచారమని గుర్తింపకపోగా శ్రీమహావిష్ణులాంఛనాలైన శంఖ చక్రగదాఖడ్గాలను అలంకరించుకొని శ్రీకృష్ణుని వద్దకు తన దూతను పంపించాడు. ''నీవు మూర్ఖత్వం పైకొన్నందువల్ల వాసుదేవ నామంతోపాటు నా చిహ్నాలను కూడా అనుకరిస్తున్నావు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని నా శరణువేడితే నిన్ను ప్రాణాలతో విడిచి పెడతాను'' అని బెదిరించాడు. శ్రీకృష్ణుడు ఆ మాటలకు మనసారా నవ్వుకొని దూతతో—''వెళ్ళి మీ రాజు పౌండ్రకునితో చెప్పు. చక్రం నాకు చెందాలని ఎప్పుడన్నాడో అప్పుడే అతని వాక్యసద్భావం అర్థమై నాకు కర్తవ్యకర్మ జ్ఞాపకానికి వచ్చింది. వెంటనే బయలుదేరి అతను కోరినట్లుగానే చక్రాన్ని విడిచి, నేనంటే భయం లేకుండా చేస్తాను. అతని మాట ప్రకారమే అంతా జరుగుతుందని నా అభయవాక్యాన్ని తెలియజెప్పు'' అని సమాధానం చెప్పి, గరుత్మంతుని స్మరించి, గరుడారూఢుడై పౌండ్రకనగరానికి వెళ్ళాడు.

పౌండ్రకునిపై శ్రీకృష్ణుడు దండెత్తిన విషయం తెలియగానే కాశీరాజు తన సైన్యాన్ని వెంటగొని కృష్ణుని వెనుకనించి దాడి చేయాలని వ్యూహం పన్నాడు. తన బలానికి పొరుగుబలం తోడయిందన్న ధైర్యంతో పౌండ్రకుడు కేశవాభిముఖంగా వచ్చి నిలిచాడు. పురప్రాంగణంలో చక్రహస్తుడు, గదాఖడ్గధరుడు, పద్మపాణి, వైజయంతీస్రగ్ధరుడు, శార్ఙ్గధనుర్ధరుడు, సుపర్ణరచితకేతనుడు, శ్రీవత్సలాంఛనుడు, కిరీ[illegible]కుండల తేజోవిరాజమానుడు, పీతాంబర సమన్వితుడు, గంభీరహ్రా[illegible]సుడు అయిన ఆ యదువంశశిరోమణిని

చూసి పౌండ్రకుడు వెడనవ్వు నవ్వి నిస్త్రింశ తోమర గదాఖడ్గముద్గర శూలశక్తికార్ముకధరులతో రథగజతురగ సేనలతో అతని మీదికి లంఘించాడు.

వాసుదేవుడు శార్ఙ్గకోదండానికి నిశితబాణాలను సంధించి పౌండ్రకుని గదాచక్రాదులను ఛిన్నాభిన్నం చేసి శత్రుసైన్యాలను నుగ్గునూచం చేశాడు. తనకు ఆజానజంగా వచ్చిన చిహ్నాలను చూసి కృతకలాంఛనాలను ధరించిన మూర్ఖరాజును పరిహసించి "పౌండ్రకా! నన్ను చక్రాన్ని విడిచిపెట్టమన్నావు. ఇదిగో కాచుకో!" అంటూ సుదర్శనాన్ని ప్రయోగించి, కౌమోదకిని విసిరాడు. ఆ సుదర్శనచక్రరాజం పౌండ్రకుని శరీరావయవాలను ముక్కలు ముక్కలు చేసింది. గరుత్మంతుడు పౌండ్రకుని గరుడ ధ్వజాన్ని కాలదన్నాడు. లోకాలన్నీ హాహాకారం చేశాయి.

పౌండ్రకుడు మరణించినా అతని సఖుడు కాశీరాజు యుద్ధాన్ని మానలేదు. శ్రీహరి అతని ధనుర్బాణాలను ఖండించి, ఒక బాణంతో అతని శిరస్సు కాశీనగరంలో పడేటట్లు చేశాడు. ప్రేక్షకులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. శత్రువులను నిశ్శేషంగా సంహరించి శ్రీహరి ద్వారవతికి వెళ్లి సౌరభోగాలతో సుఖంగా ఉన్నాడు.

కాశీరాజు శిరస్సు ఆకసాన్నుంచి ఆకస్మికంగా నగరమధ్యంలోనికి వచ్చి పడేసరికి పురజనులందరూ ఆశ్చర్యపడ్డారు. శ్రీకృష్ణుడు తన తండ్రిని హతమార్చాడని తెలిసి కాశీరాజు కొడుకు కులపురోహితునితో కలిసి పరమేశ్వరుని ఆరాధించాడు. అవిముక్తేశ్వరుడు ప్రసన్నుడై అతనిని అభీష్టవరం కోరుకొమ్మన్నాడు. కాశీరాజపుత్రుడు ఈశ్వరునికి నమస్కరించి "ప్రభూ! నీ ప్రభావంతో

శ్రీకృష్ణుని శక్తిని మోహరించు. నా తండ్రి మరణానికి ప్రతీకారం జరిగితీరాలి'' అని ప్రార్థించాడు. శంకరుడు అతనికి వరాన్ని ప్రసాదించి, దక్షిణాగ్ని నుంచి జ్వాలాకరాళరూపంతో జ్వాలతేఃశకలాపంతో భయంకరాకార అయిన ఒక మహాకృత్యను ఆవిర్భవింపజేశాడు. ఆ మాయావిని వికృతరూపాన్ని చూసి భయభ్రాంతులై ద్వారకానగరవాసులు మధుసూదనుని చెంతకేగి శరణువేడారు. చక్రధరుడు ఆ వస్తున్నది కాశీరాజసుతుడు వృషభధ్వజుని ఉపాసించి ప్రయోగించిన మాహేశ్వరి అని గ్రహించి సుదర్శనాన్ని దాని మీదికి ప్రయోగించాడు. శ్రీచక్రరాజాన్ని దూరంనుంచి చూస్తూనే మహాకృత్య కాలికిబుద్ధి చెప్పింది. అప్రతిహతమైన విష్ణుచక్రం వారణాసి దాకా ఆమెను వెన్నంటి ఆమె ప్రభావాన్ని నిరస్తం చేసింది.

అప్పుడు కాశీనగరసైన్యాలు ప్రమథగణాలతో బయలుదేరి సుదర్శనచక్రాన్ని ఎదుర్కొన్నాయి. అయితే శస్త్రాస్త్రమోక్షచతురమైన దాని తేజోబలాలను నిలువరించే శక్తి వారికి లేకపోయింది. కృత్యాగర్భాన్ని చీల్చి శ్రీచక్రరాజం వారాణసిని భస్మీపటలం చేసింది. గృహప్రాకారచత్వరాలు, ప్రాణిజాలం, కాశీనగరం లోని చరాచరసమస్త భూతజాతం జ్వాలాపరిప్లుతమైపోయింది. ఆ విధంగా సేనాచక్రాన్ని దహించి సుదర్శనచక్రం శ్రీకృష్ణస్వహస్తాన్ని చేరుకొన్నది''

అని పరాశరుడు పలికిన వెంటనే మైత్రేయుడు ''మహాత్మా! యమునాకర్షణాది కథలను విన్న తర్వాత ధీమంతుడైన బలభద్రుని పరాక్రమోదంతాలను ఇంకా వినాలని కుతూహలంగా ఉన్నది. ఆ విశేషాలను చెప్పగలవారు మీరుకాక వేరెవరున్నారు!'' అని ప్రార్థించాడు. పరాశరుడు వివరించాడు.

కౌరవ గర్వభంగం

"మైత్రేయా! అనంతుడు, అప్రమేయుడు, ధరణీభరణదక్షుడు అయిన ఆదిశేషుడు రామావతారంలో ప్రదర్శించిన దివ్యలీలలను నీవు కోరిన ప్రకారం చెబుతాను విను.

దుర్యోధనుని కుమార్తెకు స్వయంవరాన్ని ప్రకటించిన తరుణంలో జాంబవతీసుతుడు సాంబుడు ఆమెను అంతఃపురం నుంచి అపహరించి బలవంతంగా పట్టి తెచ్చాడు. ఆ అవమానాన్ని సహింపలేక కౌరవయోధులైన దుర్యోధన కర్ణ భీష్మ ద్రోణాదులు ఒక్కుమ్మడిని ముట్టడించి సాంబుని బంధితుని కావించి హస్తినలో చెరపట్టారు. యాదవులకు ఆ సంగతి తెలిసి క్రోధవశులై వారిని సంహరించాలని యుద్ధానికి సిద్ధపడ్డారు. అప్పుడు బలదేవుడు హాలామదోన్మత్తత వలన ఊగిసలాడుతూ వారిని వారించి, "నేనొక్కడినే కౌరవుల వద్దకు వెళ్లి నయరీతిని బోధిస్తాను. నా మాటవిని వారు సాంబుడిని వెంటనే విడిచిపెడతారు" అని అభయదానం చేశాడు.

హస్తినకు ప్రయాణం

తన ప్రతిజ్ఞానుసారం బలదేవుడు వెంటనే బయలుదేరి అనతికాలంలోనే హస్తినాపురాన్ని చేరుకొన్నాడు. కార్యార్థియై వచ్చినవాడు కాబట్టి నగరం లోనికేగక బాహ్యోపవనంలో ఒకచోట విడిదితీరాడు.

దుర్యోధనాదులు బలరామాగమనవార్త వినగానే సగౌరవంగా ఒక గోవును, ఫలపుష్పాదులను, అర్ఘ్యపాద్యాలను ఆయన వద్దకు పంపించారు. బలభద్రుడు వాటిని యథావిధిగా స్వీకరించి ఆ వచ్చినవారితో "సాంబుని విడిచిపెట్టమని ఉగ్రసేనమహారాజు ఆజ్ఞ" అని తెలియజేశాడు. దుర్యోధనుడు, కర్ణుడు, భీష్ముడు,

ద్రోణుడు, కురువీరులు ఆ సంగతి తెలిసి మండిపడ్డారు. యాదవులంటే రాజ్యార్హులు కారని మొదటినుంచి చులకనభావం కలిగిన బాహ్లికాదులు ముసలాయుధుని సమీపించి, "ఏమిటిది బలభద్రా, కురువంశోద్భవరాజులతో యాదవులు మాట్లాడవలసిన పద్ధతేనా ఇది? ఉగ్రసేనుడు కౌరవులకు ఆజ్ఞలిచ్చే స్థాయికి ఎదిగాడంటే, ఇక శ్వేతచ్ఛత్రాన్ని, రాజచిహ్నాలను కోల్పోయేరోజులు దగ్గరపడ్డాయన్నమాట. వెళ్లవయ్యా, వెళ్లు. నీవంటే మాకందరికీ గౌరవమే. అయితే సాంబుడు చేసినది అన్యాయచేష్టితం. అందుకు ఉగ్రసేనుడు చెప్పినా, నీవే వచ్చి అడిగినా విడిచిపెట్టేది లేదు. కుకురాంధకుల నుంచి మాకు చెందవలసిన మర్యాదలు అందకపోయినా అంగీకరిస్తాము గాని, స్వామిని ఆజ్ఞాపించే భృత్యులున్నారంటే ఊరుకోంటామా? దూరపు చుట్టాలను దూరంగా ఉంచక సమానాసన భోజనాలను చూపినందుకు గర్వం తలకెక్కినట్లున్నది. రాజనీతిని విస్మరించి మిమ్మల్ని చేరదీయటం అసలు మాదే తప్పు. ఈరోజు నీకు గౌరవమర్యాదలతో కానుకలను పంపించామే, అది మా వంశోన్నతికి; తగుదునమ్మా అని అంగీకరించావే, అది మీ కులస్థితికి తగవు సుమా!"

అని తిరస్కారవచనాలు పలికి హరిసూనుని విముక్తి సాధ్యం కాదని చెప్పి హస్తినకు తిరిగివెళ్లారు.

కర్ణకఠోరమైన ఆ పలుకులకు బలభద్రుడు చలించిపోయాడు. క్రోధఘూర్ణిత నేత్రుడై హలాయుధాన్ని పైకెత్తి మహాబలంతో నేలను తాటించాడు. ఆ పార్ష్ణిఘాతానికి దిగంతాలను శకలీకరించే ఘోరనిర్హ్రాదం ప్రతిధ్వనించి ముల్లోకాలు భయవిహ్వలత చెందాయి. బలభద్రుడు ప్రళయరుద్రుడై కనుబొమ్మలు విరిచి, దిక్కులను ఎరుపెక్కించే రూక్షవీక్షణాలలో జ్వలనజ్వాలలను వెలిగ్రక్కాడు.

"ఓహో! దురాత్ములు, సత్త్వవిహీనులు అయిన కౌరవులకు ఇంత అహంకారమా? అల్పకాల ప్రాప్తమైన రాజ్యపాలన మదావలేపంతో ఉగ్రసేనమహారాజు ఆజ్ఞను ధిక్కరించే స్థాయికి చేరుకొన్నారన్నమాట. హవిర్భోక్తలైన దేవతలకు ఆధిపత్యాన్ని వహిస్తున్న శతక్రతువుకు కనుసన్నతో కార్యాదేశం చేయగలిగిన రాజన్య దేవేంద్రునితో కలహానికి కాలుదువ్వుతున్నారు. తండ్రి ఆస్తిలో భాగానికి అన్నదమ్ములతో కీచులాడే అల్పులకు కల్పకతరు ప్రసూత పుష్పమంజరులను దాసదాసీ జనాలకు దానంచేసే రాజరాజుతో సాటిరాగల వైభవం స్వప్నతుల్యం. కర్ణ దుర్యోధన దుశ్శాసన భీష్మద్రోణ బాహ్లిక భూరిశ్రవ సోమదత్త శల్య ధర్మజ భీమార్జున నకులసహదేవులతో కురువంశాన్ని బంధుమిత్ర పరివార సమేతంగా నాశనం చేసి యాదవకీర్తిలతలను హస్తినలో నాటిగాని నేనిక్కడినుంచి తిరిగివెళ్లను. రథాశ్వగజపదాతులతో కౌరవసేనా వాహినులను మట్టుపెట్టి సాంబుడిని సపత్నీకంగా విడిపించితే గాని ద్వారకలో బంధుమిత్రులను మళ్లీ చూడను. లేదా, దేవేశ్వరుని ఆనతిగొని భూమి భారావతరణార్థం కురువంశసమేతంగా నాగపురిని భాగీరథిలో కలుపుతాను" అంటూ నాగలిని నేలకు విసిరి హస్తినాపురం నుంచి తనదాకా దానితో చాలు గీశాడు. హలఘాతానికి భూమి కంపించి హస్తినాపురవాసులు భయభ్రాంతులయ్యారు. "రామా! రామా! మహాబాహూ! క్షమించు క్షమించు! కోపాన్ని ఉపసంహరించు! మమ్మల్ని కరుణించు!" అని కౌరవులందరూ ఆక్రోశించి సాంబుని పత్నీసమన్వితంగా తీసుకొనివచ్చి నగరం వెలుపడి బలరామునికి అప్పజెప్పారు. తనతో శాంతివచనాలు పలుకుతున్న భీష్మద్రోణ కృపాచార్యులకు ప్రత్యుత్థానం చేసి, బలభద్రుడు తన సంతృప్తిని ప్రకటించి అక్కడి నుంచి ద్వారకకు బయలుదేరాడు.

క్రోధావేశంలో శ్రీ బలరాముడు బలశౌర్యోప లక్షణంగా గీసిన నాగటి చాలు జలధారగా మారి హస్తినోపకంఠంలో ప్రవహిస్తూ ఈ నాటికీ ఆ వీరగాథను జ్ఞాపకం చేస్తూనే ఉన్నది.

కౌరవులు సగౌరవంగా సాంబుని, అతని భార్యను ఊరేగింపు తెచ్చి, ధనకనక వస్తువాహనాలతో కట్నాలను సమర్పించి సెలవు తీసుకొని వెళ్లారు.

ద్వివిద సంహారం

మైత్రేయా! మహా బలశాలి బలభద్రుని కథ ఇంకొకటి విను.

దేవపక్ష విరోధి నరకునికి ద్వివిదుడనే పేరుగల ప్రియసఖుడొకడు ఉండేవాడు. మహావీరుడైన ఆ వానరునికి కూడా దేవతలతో వైరం సంఘటిల్లింది. దానికి తోడు శ్రీకృష్ణుడు ప్రాగ్జ్యోతిషపతిని ఘోరాహవంలో సంహరించిన నాటినుంచి అతను పగబూని ప్రతీకారవాంఛతో మర్త్యలోకనిర్మూలనానికి పూనుకొన్నాడు. బలరామకృష్ణులతో అతనికి వైరానుబంధం ఏర్పడింది. అజ్ఞాన మోహితుడై యజ్ఞాలను ధ్వంసంచేసి సాధుమర్యాదను అతిక్రమించి అమాయకులను ఊచకోత కోయసాగాడు. వనోద్దేశాలను, పురగ్రామాంతరాలను తగలబెట్టి, జనావాసాలపై శిలావర్షాన్ని కురిపించి, కొండలను పైకెత్తి సముద్రాలలోనికి విసిరి, సముద్రజలాలను మహాబాహువులతో సంక్షోభింపజేస్తూ లోకాలను అల్లకల్లోలం చేశాడు. కామరూపుడు కనుక మాయాపరివేషాన్ని ధరించి మహాకాయుడై పైరుపొలాలను నాశనం చేశాడు. అతని దురాగతాల వల్ల స్వాధ్యాయవషట్కారాలు లోపించి త్రైలోక్యం తల్లడిల్లింది.

ఒకప్పుడు యదువరశ్రేష్ఠుడైన బలదేవుడు రైవతోద్యానంలో హాలాపానం చేసి రేవత్యాది వరస్త్రీలతో నృత్యగీత కేళీ

వినోదాలతో కుబేరునివలె ఆనందిస్తున్న సమయంలో ద్వివిదుడు ప్రచ్ఛన్నంగా అక్కడికి వచ్చి హల ముసలాలను అపహరించి, బల దేవుని ఎదుట నిలిచి స్త్రీలను అవమానకరంగా వేళాకోళం చేసి, హాలాపూర్ణ పానపాత్రలను పగలగొట్టి, తనను వారిస్తున్న బల దేవుని మాటలను లెక్కచేయక అతనిని సమరానికి ఆహ్వానిస్తూ ప్రళయకాల పర్జన్యగర్జన చేశాడు. బలభద్రుడు లేచి మహాబలంతో అతని పై కురికి తన ముసలాన్ని లాగికొని అతనితో యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డాడు. ద్వివిదుడు ప్రక్కనే ఉన్న శైలశిలను పెరికి అతనిపై విసరగా బలభద్రుడు ముసలాఘాతంతో దానిని వేయి ముక్కలు చేశాడు. ఆ శిలాశకలాలతో పాటు ముసలం కూడా నేలకు జారింది. ద్వివిదుడు దానిమీదుగా బలభద్రునిపై కురికి వాడి గోళ్లతో అతని వక్షోభాగాన్ని నొప్పించాడు. బలభద్రుడు కుపితుడై ముష్టిఘాతంతో అతని తల పగలగొట్టాడు. దానితో ద్వివిద వాన రుడు నెత్తురు కక్కి క్షీణజీవితుడై నేలకూలాడు. అతని శరీరభారా నికి గిరిశృంగం వజ్రాయుధం మీదవచ్చిపడినట్లు ముక్కలు ముక్క లయింది. దేవతలు సంతోషంతో పుష్పవృష్టి కురిపించారు. 'దైత్య పక్షోపకారిని సంహరించి లోకాలకు విముక్తిని ప్రసాదించావు. నీ చరిత్ర లోకాభినందనీయ మహిమోపేతం' అని ప్రశంసించి అతని పాదాలకు మోకరిల్లారు.

ఈ విధంగా శేషావతారుని అశేషలీలలు అపరిమేయంగా జగత్తులలో నెలవుకొన్నాయి'' అంటూ పరాశరుడు ఇంకా ఇలా అన్నాడు.

''బలదేవుని సహాయాన్ని పొంది శ్రీకృష్ణుడు దైత్యులను, భూమండలంలోని దుష్టక్షితీశులను సంహరించి, సురనేతలకు ప్రదానం చేసిన వచనానుసారంగా భూమిభారాన్ని తొలగించి, భూదేవికి

శాంతిని ప్రసాదించాడు. అర్జునునికి సారథ్యం వహించి కురుక్షేత్రంలో అనేక అక్షౌహిణుల సైన్యాన్ని హతమార్చాడు. భక్తజనపరితాప కారకులైన పాపవర్తనులకు నిలువనీడ లేకుండాచేసి లోకంలో మళ్లీ ధర్మాన్ని ప్రతిష్ఠాపించి శాంతిభద్రతలను నెలకొల్పాడు.

భూమిభారావతరణతో శ్రీమహావిష్ణువు భూతలానికి దిగి వచ్చిన మహాకార్యం నెరవేరింది. శాపవ్యాజాన్ని పురస్కరించుకొని తన అవతారానికి ప్రాకారమైన యదుకులాన్ని కూడా ఉపసంహరించాడు. ద్వారకను విడిచిపెట్టి స్వీయసంకల్పవికల్పహేతువైన పాంచభౌతిక తనువు నుంచి విముక్తుడై పరమపదాన్ని చేరుకొన్నాడు''

అని పరాశరుడు ముక్తాముక్తంగా ప్రవచించిన ఇతివృత్తాన్ని సాకల్యంగా ఆకర్ణింపగోరి మైత్రేయుడు—

''మహాత్మా! శాపవ్యాజంతో స్వకులాన్ని ఉపసంహరించి జనార్దనుడు మానుషదేహాన్ని పరిత్యజించిన కథావిశేషాలను నాకు సవిస్తరంగా ఉపదేశించండి'' అని ప్రార్థించాడు.

పరాశరమహర్షి మళ్లీ తన కథనాన్ని కొనసాగించాడు.

ద్వాపరయుగాంతం

ద్వాపరయుగాంతం సమాసన్నమైన తరుణంలో ఒకప్పుడు విశ్వామిత్రుడు, కణ్వమహర్షి, నారదమునీంద్రుడు పిండారకక్షేత్రానికి వెళ్లి అక్కడ ఇష్టకేళీ వినోదాలలో నిమగ్నులై ఉన్న యదుకుమారకులను చూశారు. యౌవనోన్మత్తులైన ఆ అల్లరిపిల్లలు భావికార్యప్రచోదితులై కావించిన విపరీతచేష్ట యదువంశ నాశనానికి ఉత్ప్రేరకమైంది.

యదుబాలకులు జాంబవతీసుతుడైన సాంబునికి అందంగా స్త్రీవేషాన్ని ధరింపజేసి, ఉజ్జ్వలమైన భూషణజాలంతో అలంకరించి

మహర్షుల వద్దకు నడిపించుకొని వెళ్లారు. అభివాదాశీర్వాదాలు పూర్తయాక వారందరూ మహర్షులను ఉద్దేశించి, "పూజ్యులారా! ఈమె బభ్రువు ధర్మపత్ని. ఆసన్న ప్రసవగర్భవతిగా ఉన్నది. త్రికాల వేదులైన మీరు ఈమెకు పుత్రసంతానం కలుగుతుందో లేదో సరిగ్గా చూసి చెప్పండి" అని సవినయంగా ప్రశ్నించారు.

యాదవుల వేళాకోళానికి మునులు ఆగ్రహోదగ్రులైనారు. "ఈమె కడుపున ముసలం పుట్టి అఖిల యాదవకులాన్ని నిర్మూలి స్తుంది" అని పరుషవచనాలతో శపించివేశారు.

ఋషివాక్యాలను ఆలించిన యాదవులు కీడు శంకించి పరుగు పరుగున వెళ్లి ఉగ్రసేనమహారాజుకు జరిగిన వృత్తాంతాన్ని పూస గ్రుచ్చినట్లు వివరించి చెప్పారు.

ఋషులు అన్నట్లుగానే సాంబుని ఉదరకోశం నుంచి ఇనుప ముసలం ఉదయించింది. ఉగ్రసేనుడు దానిని మెత్తగా పొడి చేయించి సముద్రంలోకి పారవేయించాడు.

జలగర్భ నిక్షిప్తమైన అయశ్చూర్ణం సముద్రతరంగాల మూలాన తీరానికి కొట్టుకొనివచ్చి ఆ ప్రదేశంలో మూడంచుల తుంగగడ్డి మొలకెత్తింది.

యాదవులు ముసలాన్ని చూర్ణీభవించినప్పుడు అందులో తోమరాకృతిలో ఉన్న ఒక చిన్నిముక్క మాత్రం పొడి కాకుండా అలాగే ఉండిపోయింది. సముద్రంలో పారవైచినప్పుడు ఒక చేప దానిని మ్రింగివేసింది. చేపలవాళ్లు దాన్ని పట్టుకొని పొట్ట చీల్చి నపుడు దొరికిన అయఃశకలాన్ని జరుడనే పేరుగల బోయవాడు తీసు కొని వెళ్లాడు.

సర్వజ్ఞుడైన మధుసూదనునికి జరగబోతున్న విపరీత పరి ణామాలన్నీ ముందుగానే తెలిసినా ఆయన లలాటలిఖితాన్ని అన్యథాకరించాలని ప్రయత్నింపలేదు.

దేవతల వేడికోలు

అప్పుడు దైవతబృందాలు పంపించిన దూత ఒకడు శ్రీ కృష్ణుడు ఏకాంతంగా ఉన్న సమయంలో రహస్యంగా వచ్చి కలుసుకొని వినువేల్పుల విన్నపాన్ని విన్నవించుకొన్నాడు.

"దేవా! దైవతలోకాధిపతి మహేంద్రుడు, విశ్వేదేవతలు, అశ్వినులు, మరుత్తులు, ఆదిత్యులు, రుద్రులు, సాధ్యులు మొదలుగా గల సమస్తసుపర్వాణులూ నన్ను నీ వద్దకు దూతగా పంపారు. భూమిభారావతరణ కోసం నీవు భూతలాన అవతరించి నూరు సంవత్సరాలకు పైగా కాలం గడిచిపోయింది. నీవు వచ్చిన కార్యమూ నిర్విఘ్నంగా నెరవేరింది. దానవలోకాన్ని సంహరించి ధర్మరక్షణం కావించావు. దేవతలకు మళ్లీ నీ దర్శనభాగ్యాన్ని ప్రసాదించు. నీవు లేక స్వర్నివాసం కళ తప్పినట్లు నిస్తేజంగా ఉన్నది. ఈ విధంగా ఇంకా ఎంతకాలం గడపాలో తెలుసుకొని రమ్మని విరహార్తులైన సురలు నన్ను నీ వద్దకు పంపించారు"

శ్రీకృష్ణుడు దేవదూత పలుకులను శ్రద్ధగా ఆకర్ణించాడు. "నీవు చెప్పిన విషయాలన్నీ నాకు విదితచరాలే. భూమిపై యాదవలోకక్షయంతో కాని భారావతరణం పరిసమాప్తం కాదు. ఇంకా ఏడు రాత్రులలోగా ప్రారబ్ధయదువంశనాశనం పరిపూర్ణం కానున్నది. ద్వారకను సముద్రజలాలు ముంచెత్తాక యదుకులాన్ని ఉపసంహరించి నేను త్రిదివాలయానికి తిరిగివస్తాను. మనుష్యదేహాన్ని పరిత్యజించి బలభద్రసమేతంగా నేను వచ్చినట్లుగానే భావింపమని దేవతలకు నా మాటగా వివరించి చెప్పు. అధర్మవర్తనులై పాపకర్మ పరాయణులైన జరాసంధ శిశుపాలాదులు మరణించిన తర్వాత యావనమదోన్మత్తులూ కులక్షయకారకులైన మలినాత్ములతో కలుషితమైన యదువంశంకూడా అస్తమించాలి. క్షితిభారావతారా

నికి అనంతరం అమరలోకపాలనకు పూనుకొంటానని సురలకు తెలియజెయ్యి'' అని ప్రత్యాగమన వాగ్దానం చేశాడు.

యదువంశవినాశం

దేవదూత వాసుదేవునికి ప్రణమిల్లి దేవరాజాంతికానికి తిరిగి వెళ్లాక, ద్వారకాపురంలో అనేక దుర్నిమిత్తాలు గోచరించాయి. ద్వారకా వినాశానికి అంకురార్పణ జరిగిందని శ్రీకృష్ణుడు గ్రహించాడు. యాదవులను పిలిచి, ''అతి దారుణమైన మహోత్పాతాలు సంభవింపనున్న సూచనలన్నీ కనుపిస్తున్నాయి. యదుకులం ఇక్కడి నుంచి ప్రభాసతీర్థానికి వెళ్లిపోతే మంచిదని నా అభిప్రాయం'' అని వివరించాడు.

అప్పుడు భాగవతాగ్రేసరుడైన ఉద్ధవుడు శ్రీకృష్ణపరమాత్మను నమస్కరించి, ''భగవత్స్వరూపా! యాదవసమాజాన్ని నశింపజేయాలని నీవు నిర్ణయించాక దుర్నిమిత్తాలు కలుగకుండా ఆపడం ఎవరివల్లనౌతుంది? సృష్టిస్థితిలయాలకు మూలకర్తవైన నీవే నాకు కర్తవ్యాన్ని ఆజ్ఞాపించాలి'' అని సంప్రార్థించాడు.

ఉద్ధవుని వచనాలకు ప్రసన్నుడై శ్రీకృష్ణుడు అతనికి అభయాన్ని ప్రసాదించాడు. ''నీవు మత్ప్రసాదసముత్థితమైన దివ్యగతిని అనుసరించి గంధమాదనపర్వతానికి సమీపంలో వెలసిన బదరికాశ్రమానికి వెళ్లు. ఆ పుణ్యాశ్రమదేశంలో పవిత్రమైన నరనారాయణస్థానంలో తపస్సు చేసి సంసిద్ధిని పొందుతావు. యదువంశాన్ని ఉపసంహరించి నేను స్వర్గానికి నిర్గమించాక ద్వారకలో జలప్రళయం సంభవిస్తుంది'' అని కర్తవ్యోపదేశం చేశాడు.

శ్రీకృష్ణ వచనానుసారం ఉద్ధవుడు నరనారాయణ క్షేత్రానికి వెళ్లి తపోనిమగ్నుడైనాడు.

ఆ తర్వాత యాదవులు శీఘ్రగతికి అనువైన రథాలను అధిరోహించి శ్రీకృష్ణబలభద్రాదులతో కలిసి ప్రభాసతీర్థానికి తరలి వెళ్లారు. ఆ పుణ్యజలాలలో స్నానం చేసి, వాసుదేవుని అనుమతిని పొంది కుకురాంధకాది యదుకులాల వారు సురాపానం మొదలు పెట్టారు. ఆ మత్తు తలకెక్కిన తర్వాత వారిలో వారికి కలహం బయలుదేరింది. ఒకరితో ఒకరు వాదించుకోవడం మొదలుపెట్టారు. అతివాదేంధనం రగులుకొని వంశక్షయావహమైన కలహాగ్ని కార్చిచ్చులా నలుదెసలకూ వ్యాపింపసాగింది. దైవప్రాతికూల్యం వలన ఆ సమయంలో వారు పరస్పరం ప్రయోగించుకొన్న సామాన్య శస్త్రాలు మహామారణాయుధాలుగా పరిణమించాయి. ఆయుధాలు అయిపోయాక వారు అయశ్శకలరజం నుంచి మొలకెత్తిన తృణాగ్రాలను వజ్రాయుధోపమంగా ప్రయోగించుకొన్నారు. దారుణమైన ఆనాటి సంప్రహారహోమంలో మహాయోధులైన ప్రద్యుమ్నుడు, సాంబుడు, కృతవర్మ, సాత్యకి, అనిరుద్ధుడు, పృథుడు, విపృథుడు, చారువర్ముడు, చారుకుడు, అక్రూరుడు మొదలైనవారందరూ మరణించారు. శ్రీకృష్ణుడు వారి కలహాన్ని విని వారింపబోయే సరికి వారందరూ అతను కూడా తమలో కలిశాడనుకొని మరింతగా రెచ్చిపోయారు.

యాదవుల అజ్ఞానకృతానికి శ్రీకృష్ణుడు కుపితుడై వారిని తానే సంహరింపబూని ఏరకాలను చేతిలోనికి తీసికొన్నాడు. ఆ దివ్యతృణాల స్థానంలో ఒక లోహనిర్మితమైన ముసలం సాక్షాత్కరించింది. దానితో శ్రీకృష్ణుడు యాదవప్రవరులందరినీ సంహరించాడు. చావగా మిగిలినవాళ్లు పోరాటాన్ని కొనసాగించి ఒకరినొకరు చంపుకొన్నారు.

ఆ తర్వాత సారథి దారుకుడు చూస్తూ ఉండగానే జైత్రమనే పేరుగల శ్రీకృష్ణుని దివ్యరథం శైబ్య సుగ్రీవ బలాహక మేఘ

పుష్పాలతో సహితంగా సముద్రతరంగాకృష్టమై జలగర్భం లోనికి ప్రవేశించి అదృశ్యమైపోయింది. శ్రీహరి కరాలంకృతమై తత్తత్సమయాలలో రిపుమస్తకాలను పరిచ్ఛేదించిన సుదర్శనచక్రం, పాంచజన్యశంఖం, కౌమోదకీ గదాయుధం, శార్ఙ్గకోదండం, నందకమహాఖడ్గం ఆయనకు ప్రదక్షిణనమస్కారాలను అర్పించి ఆదిత్యపథానుసారం వైకుంఠనిలయానికి నిష్క్రమించాయి.

శ్రీకృష్ణుడు, దారుకుడు తప్ప యాదవులలో ఒక్కరుకూడా మిగలలేదు.

బలదేవ నిర్యాణం

యాదవవినాశం జరిగిన తర్వాత శ్రీకృష్ణదారుకులు ప్రభాసతీర్థంలో పర్యటిస్తూ ఒక వృక్షమూలం చెంత యోగాసనాసీనుడై కూర్చొని ఉన్న బలదేవుని ముఖమండలం నుంచి సహస్రఫణాగణాలతో వెలికివస్తున్న శేషసర్పాన్ని విలోకించారు. ఆయన వదనగహ్వరం నుంచి వెలువడిన తర్వాత ఆ సర్పరాజం సమస్తసిద్ధసాధ్యగంధర్వగణాలు ఉచ్చైరవంతో ప్రస్తుతిస్తుండగా సముద్రాభిముఖంగా ముందుకు నడిచింది. సముద్రుడు ఆ మహాఫణికి సగౌరవంగా ఎదురేగి, అర్ఘ్యాదులను సమర్పించి, వినయంగా లోనికి ఆహ్వానించాడు. పాతాళలోకం నుంచి మహాసర్పాలు ఉపసర్పించి పూజాసత్కారపూర్వకంగా శ్రీమహావిష్ణువు తేజోంశను స్వస్థానానికి తీసికొనివెళ్లాయి.

ద్వారకకు సందేశం

బలరామ నిర్యాణానంతరం శ్రీకృష్ణుడు దారుకుని ఉద్దేశించి, అతని కర్తవ్యాన్ని ఉపదేశించాడు—

"ఈనాడు నీవు చూచిన సంఘటనలను ఇంటికి తిరిగివెళ్లాక ఉగ్రసేన వసుదేవాదులకు సంపూర్ణంగా వర్ణించి చెప్పాలి. నీ

కళ్లెదుటనే కనురెప్పపాటు కాలంలో జరిగిపోయిన యాదవవినాశాన్నీ, బలదేవనిర్యాణాన్నీ విశదీకరించి, నేను కూడా యోగస్థితుడనై దేహపరిత్యాగం చేయబోతున్నానని చెప్పు. ఆహుకునితో పాటుగా ద్వారకానగరవాసులందరినీ పిలిచి, సముద్రం ఉప్పొంగి జలప్రళయం సంభవింపనున్నందున ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకొని అర్జునుని కోసం ప్రతీక్షించమని చెప్పు. అర్జునుడు ద్వారకానగరం నుంచి నిష్క్రమించినపుడు అందరూ అతనిని అనుసరించి క్షేమంగా సుఖప్రదమైన ఆవాసానికి వెళ్లిపోవాలి. యదుకులమంతా నా కుటుంబమే కనుక నేను రక్షింపమన్నానని అర్జునునికి నా మాటగా నివేదించు. మీరందరూ ద్వారవతిని విడిచిపెట్టి, పరిస్థితులు కుదుట పడ్డాక వజ్రునికి యదురాజ్యాధిపతిగా పట్టాభిషేకం చెయ్యండి.''

దారుకుడు శ్రీకృష్ణుని మాటలకు కళ్లనీళ్లు పెట్టుకొని, ఆయన పాదపద్మాలకు పునఃపునః ప్రణామాంజలి సమర్పించి, అనేకపర్యాయాలు ప్రదక్షిణనమస్కారాలు చేసి విరహవేదనతో పరితపిస్తూ ద్వారకకు వెళ్లిపోయాడు. భగవదుదితాన్ని సకలజనులకూ వినిపించి, ఆయన వచనానుసారం అర్జునుని స్వాగతించి, వజ్రునికి పట్టాభిషేకకృత్యాన్ని నిర్వర్తించాడు.

శ్రీకృష్ణనిర్యాణం

అప్పుడు భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ వాసుదేవాత్మకమైన పరబ్రహ్మాన్ని ఆత్మారోపితం కావించుకొని, 'ఆ బ్రహ్మాన్ని నేను, సర్వభూతాంతరాత్మను నేనే' అని సంకల్పించి ధ్యానసమాధిలో విలీనమయ్యాడు. పూర్వం ఒకప్పటి దుర్వాసో మహర్షి శాపవచనాన్ని గౌరవించి, యోగారూఢుడై తన వామ పాదాన్ని దక్షిణ జానువుపై నిలిపి ఆత్మనిరతిని పొందాడు.

ఆ సమయంలో మత్స్యరాజకుక్షినిక్షిప్తమైన ముసలావశేష లోహశకలాన్ని తన బాణానికి అమర్చుకొన్న జరావ్యాధుడు వేట కోసం ప్రభాసతీర్థానికి వచ్చాడు. దూరాన్నుంచి అతనికి శ్రీకృష్ణ పాదపద్మం మృగాకారితమై గోచరించింది. వింటిబద్దను దృఢంగా పట్టుకొని బాణం సంధించి సాయకన్యస్తతోమరాన్ని పాదమధ్యానికి గురిపెట్టి అల్లెత్రాటిని చెవిదాకా లాగి మహావేగంతో విడిచి పెట్టాడు.

ప్రారబ్ధకర్మశేషం పరిభుక్తమైనాక శ్రీకృష్ణావతార పరిసమాప్తికాలం సమాసన్నమైంది. తన లక్ష్యశుద్ధికి సంతోషిస్తూ పాతితమృగాన్ని పట్టుకోవాలని వచ్చిన జరాలుబ్ధకునికి చతుర్బాహుధరుడైన శ్రీ పుండరీకాక్షుని జ్యోతిర్మయతనువు సాక్షాత్కరించింది. అతను భగవంతునికి ప్రణామం చేసి, "తెలియక చేసిన అపరాధానికి నన్ను మన్నించు తండ్రీ!" అని నితాంతదుఃఖంతో విలవిలలాడాడు. "హరిణశంకతో బాణప్రయోగం చేసి నీకు మహాపరాధం కావించాను. ఆత్మకృతాఘమహావహ్ని నన్ను దహించి వేస్తున్నది. ప్రభూ! నన్ను సంహరించి నాకు పాపవిమోచనాన్ని ప్రసాదించు" అని సంప్రార్థించాడు.

ఆశ్రితావనపావనుడైన శ్రీకృష్ణపరమాత్మ జరావ్యాధుని వచనాలకు ప్రసన్నుడై కన్నులు తెరిచి, "ఇందులో నీకు భయ కారణం అణుమాత్రమూ లేదు. నీకు మత్ప్రసాదం వలన స్వర్గలోక పదవి సంప్రాపిస్తుంది" అని అభయదానం చేయగానే వ్యోమాధ్వనీనమైన దివ్యవిమానం భూమికి అవతరించింది. భగవత్ప్రసాదలబ్ధపుణ్యాతిశయం వలన లుబ్ధకుడు స్వర్నివాసానికి వెళ్లిపోయాడు.

అనంతరం శ్రీకృష్ణుడు ఆత్మయోగనిరతుడై, మానుష దేహాన్ని పరిత్యజించాడు. జననమరణాలకు అతీతమై, అప్రమేయమై, అఖిలాంతర్భూతమైన నిర్గుణపరబ్రహ్మాన్ని అధిగమించాడు.

కలిప్రవేశం

అర్జునుడు ప్రభాసతీర్థానికి వచ్చి పరలోకగతులైన బలరామ కృష్ణుల మృతశరీరాలను, అశేష యాదవకళేబరాలను వీక్షించి, తత్తదుచితానురూపంగా అంత్యసంస్కారవిధులను భక్తిశ్రద్ధలతో నిర్వర్తించాడు.

రుక్మిణీప్రముఖులైన అష్టమహిషులు శ్రీహరి దేహాన్ని కౌగిలించుకొని అగ్నిప్రవేశం చేశారు. రేవతి కూడా భర్తృదేహాన్ని ఆశ్లేషించి, వహ్నిజ్వాలలలో ప్రాణపరిత్యాగం చేసింది.

దారుకుని ద్వారా జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొని ఉగ్రసేనుడు, దేవకీవసుదేవులు, రోహిణి అగ్నిప్రవేశం చేశారు.

అర్జునుడు ప్రేతకార్యాలను యథావిధిని నెరవేర్చి అనేక సహస్రాల శ్రీకృష్ణపత్నులు, వజ్రమహారాజు, సమస్త ప్రజానీకమూ వెంటరాగా ద్వారవతిని విడిచిపెట్టి క్షేమకరమైన చోట్లలో మజిలీలు చేస్తూ నెమ్మది నెమ్మదిగా ప్రయాణిస్తూ ముందుకు నడిచాడు.

శ్రీకృష్ణునితో పాటు మర్త్యలోకానికి దిగివచ్చిన సుధర్మసభ, సత్యాప్రీణనం కొరకు దేవలోకాన్నుంచి కొనితెచ్చిన పారిజాత వృక్షం స్వస్థానాలకు చేరుకొన్నాయి.

శ్రీకృష్ణపరమాత్మ భూతలాన్ని విడిచి శరీరపరిత్యాగం చేసిన దుర్దినాననే భయంకర కాలకాయాన్ని ధరించి మహాబలుడైన కలిపురుషుడు నేలకు దిగివచ్చాడు.

నిర్జనమైన ద్వారకలో సముద్రజలాలు ఉప్పొంగి ఒక్క శ్రీహరి గృహాన్ని తప్ప తక్కిన భూమిభాగాన్ని పూర్తిగా ముంచివేశాయి.

శ్రీమన్నారాయణుడు కొలువున్న ఆ దివ్యమందిరం ఇప్పటికీ చెక్కుచెదరకుండా సముద్రమధ్యం లోనే నిలిచి ఉన్నది. విష్ణుక్రీడా

న్విత స్థానమైన ఆ పుణ్యమందిరాన్ని దర్శించిన భక్తకోటికి సర్వ పాతకాలూ నశించి అక్షయపుణ్యసంపదలు కలుగుతాయి.*

---

* శ్రీకృష్ణనిర్యాణం తర్వాత ద్వారవతి సముద్రాంతరితమై శ్రీ మహావిష్ణ్వాలయం మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచే ఉన్నదన్న వర్ణనం శ్రీ మహాభాగవతంలో కూడా ఉన్నది. ఆంధ్ర భాగవతం ఏకాదశ స్కంధాంతంలో పోతన—

"ద్వారకానగరంబు పరిపూర్ణజలంబై మునింగె. అంత, నెవ్వరికి జనరాకయుండె, అప్పరమేశ్వరుండును శతకోటి సూర్య దివ్య తేజోవిభాసితుండై వెడలి, నారదాది మునిగణంబులను, బ్రహ్మరుద్రాది దేవతలును, జయ జయ శబ్దంబులతోడం గదలి రా విజపదంబున కరిగె. నారాయణ విగ్రహంబు జలధి ప్రాంతంబున జగన్నాథ స్వరూపంబై యుండె." [భాగ. 11-122]

అని తెలుగుచేశాడు. ఈ కథాకథనం విష్ణుపురాణోక్తితో సంవదిస్తున్న విషయం సుస్పష్టమే.

భాగవత విష్ణుపురాణాల ప్రస్తావం ఇలా ఉండగా శ్రీ మహాభారతం ద్వారక సముద్రంలో పూర్తిగా మునిగిపోయినట్లు అభివర్ణించింది. ఈ భాగాన్ని తిక్కన—

1. భానూదయంబున వనధి పురము ముంచికొనిన...."

[భార. 16-1-170]

2. ఇమ్మెయి నరుండు సకల జ
నమ్ముఁ వెడల నిమ్ముఁడు పూర్వనగ మెక్కెను వే
గమ్మున ముంచికొనియె నగ
రమ్ము పయోరాశి భరతరాజవరేణ్యా.

[భార. 16-1-177]

అని పోతన వలెనే యథామూలంగా అనువదించాడు.

దీనిని బట్టి మహాభారతరచనాకాలానికి ఆలయ నిర్మాణం జరగలేదని, ఆ తర్వాత జరిగిన వృత్తాంతాన్ని పురాణాలు గ్రంథస్థం చేసి ఉండవచ్చునని విల్సన్ పండితుని అభిప్రాయం.

విష్ణుపురాణం V-35-11 లో

నిత్యం సన్నిహిత స్తత్ర
భగవాన్ కేశవో యతః

అర్జున పరాజయం

శ్రీకృష్ణుని ఆజ్ఞను శిరసావహించి పార్థుడు తనతో వచ్చిన ప్రజలకు మార్గాన్ని చూపిస్తూ కొంతకాలం ప్రయాణించి, ధన ధాన్యాలు పుష్కలంగా అలరారుతున్న పంచనదదేశంలో విడిది చేయించాడు.

ఆకస్మికంగా ఎక్కడినుంచో కాందిశీకులై వచ్చిన అంత మంది విగతభర్తృకలను, వారితోపాటు వచ్చిన అమూల్య సంపద లను చూసి పంచనద ప్రాంతీయులైన పాపకర్ములు కొందరు లోభోప హతచేతస్కులయ్యారు. ఏకాకిగా ఉన్న అర్జునుడు ఒక్కడూ తమను ఓడింపలేడని నిశ్చయించుకొన్నాక వారు తమకంటె దుర్మదు లైన ఆభీరులను కలుసుకొని, "ఈ అర్జునుడు అంతులేని ధనసంపద లను, అమిత సౌందర్యవతులైన విధవరాండ్రను తీసికొని ఇంతమంది మహావీరులం మనమందరమూ చూస్తుండగా ఒక్కడూ ప్రయాణిస్తు న్నాడు. భీష్మద్రోణ జయద్రథ రాధేయాదులను పరాభవించిన అత

→ తదతీవ మహత్పుణ్యం
సర్వపాతక నాశనమ్.

అని పేర్కొన్న ఈ మందిరం బహు ప్రాచీనమైనదని అక్బర్ కాలం నాటి అయిన్ అక్బర్ గ్రంథంలో ప్రస్తావింపబడింది అప్పటికి ఆరువందల సంవత్సరాలకు పూర్వమే అక్కడ విగ్రహ ప్రతిష్ఠాపనాదులు జరిగాయట. తర్వాత గర్భగుడిలో వేరొక విగ్రహాన్ని తెచ్చి నిలిపారు. ప్రస్తుతం ఈ దైవతాన్ని రణచోర్ అన్నపేరిట శ్రీకృష్ణుని రూపంగా ఆరాధిస్తున్నారు. ఈ రణచోర్ వృత్తాంతం పురాణాలలో లేదు.

మన పురాణాలలోని అన్ని విషయాల వలెనే ఈ మందిరప్రదేశాన్ని గురించి కూడా అనేక వాదాలు ఉన్నాయి. హేమిల్టన్ పండితుడు ద్వారకానగరం సముద్ర గర్భంలో మునిగిపోయిన ప్రదేశం గుజరాత్ రాష్ట్రంలోని పోర్‌బందర్‌కు దక్షిణాన ముప్పైమైళ్ళ దూరంలో ఉన్నదని వెలిబుచ్చిన అభిప్రాయాన్ని విల్సన్ శ్రీ విష్ణు పురాణ ఆంగ్లానువాదం పాదదీపికలో ఉదాహరించాడు. □

నికి మన గ్రామవాసుల బలం ఏమిటో తెలియజెప్పి తగుకీతిని పగ తీర్చుకోవాలి. ఆ దురాత్ముడు ఇక్కడినుంచి దూరానికి వెళ్లిపోయే లోగా మనం అతనిని హతమార్చాలి'' అని వారిని కూడా రెచ్చ గొట్టారు. ఆభీరులు, చోరులు మొదలైన దస్యులందరూ ఆయు ధాలను ధరించి ఒక్కుమ్మడిగా నిరాశ్రయుడైన అర్జునుని చుట్టు ముట్టారు.

ఆ విధంగా తమను చంపవచ్చిన శత్రువులను చూసి అర్జునుడు కోపోద్రిక్తుడైనాడు. ''ఓరి దురాత్ములారా! ధర్మాధర్మ వివేకం లేకుండా పాతకానికి ఒడిగట్టుతున్నారు. మీకు ఈ నాటితో చావు మూడింది'' అని మేఘనిర్ఘోషంతో గర్జించి వారిని అపవారిం చాడు. కాని వారు పార్థుని పలుకులను తృణీకరించి స్త్రీలను, శ్రీకృష్ణ పత్నులను చెరపట్టి చేతికి చిక్కినట్లుగా యాదవధనాన్ని కొల్ల గొట్టారు. వారిని వారింపగల శక్తి అర్జునునికి లేకపోయింది. అతను గాండీవాన్ని సంధింపబోయేసరికి ఆ దివ్యధనువుకు జ్యావల్లిని బిగిం చడం సాధ్యంకాలేదు. ఒకప్పుడు శత్రుసంహార కారణాలై రిపు దుర్నిరీక్ష్యంగా తేజరిల్లిన మహాస్త్రాలు ఎంత ప్రయత్నించినా స్ఫుర ణకు రాలేదు. ఎలాగో నారి బిగించి అమ్ములు తొడిగినా, ఆ బాణాలు శత్రువుల చర్మభేదనకు కూడా పనికిరాలేదు. ఆనాడు అగ్ని భట్టారకుడు కరుణించి ఇచ్చిన దివ్యబాణాలన్నీ అతనికే ప్రాణాంత కంగా కనుపట్టాయి. శ్రీకృష్ణపరమాత్మ శక్తిమహిమను సంస్మరించి శరప్రయోగం చేయాలని ప్రయత్నిస్తే దస్యులు ఆ బాణాలను అవ లీలగా విరిచిపారేశారు. కొన్ని గురితప్పి స్వజనాలపైకి కూడా దూసు కొని వెళ్లాయి. అతని అక్షయతూణీరం అదృశ్యమైపోయింది.అయినా అర్జునుడు ధైర్యాన్ని కోలుపోక రథం నుంచి క్రిందికి దిగి ధను ష్కోటితో రిపువ్రాతాన్ని కొట్టి చంపాలని ఉద్యమించేసరికి వారం

దరూ అపహాస్యం చేసి, అతనిని ప్రక్కకు నెట్టి, అతని కళ్లెదుటనే వృష్ణ్యంధక వరస్త్రీలను అపహరించారు.

ఈ విధంగా దారుణమైన పరాభవానికి గంభీరస్వాంతుడైన అర్జునుడు దుఃఖాన్ని పొంది, సామాన్య మానవునివలె విలపించాడు. "అయ్యో! నా ప్రభువు నన్ను విడిచివెళ్లగానే ఎన్ని కష్టాలు దాపురించాయి" అని పెద్దగా ఏడ్చాడు. అంతలోనే అతని చేతిలోని గాండీవం, శస్త్రాస్త్రాలు, రథం, రథాశ్వాలు అన్నీ అశ్రోత్రియునికి కావించిన దానంవలె నిష్ఫలంగా పరిణమించి వినష్టమైపోయాయి.

"మహాత్ముడైన నా స్వామి చెంత లేకపోయేసరికి అసమర్థులైన నీచులకు అవలీలగా జయం కలిగింది. ఈ బాహువులు, ఈ మొండిచేయి, ఈ అర్జునుడు—అచ్యుతుడు లేనప్పుడు సారవిహీనం. ఈ అర్జునుడనే నాకు అర్జునత్వాన్ని కలిగించిన ధర్మస్వరూపుని సాహాయ్యం లేకపోబట్టి కాని, ఈ ఆభీరులతో ఓటమి నాకు ఎలా సంభవం!" అని దుఃఖించిన అర్జునుడు మధురానగరానికి వెళ్లి వజ్రునికి పట్టాభిషేకం చేశాడు. అక్కడి నుంచి అర్జునుడు అరణ్యానికి వెళ్లి తపోదీక్షితుడైన వ్యాసునికి సగౌరవంగా అభివాదం చేసి దీనవదనుడై నిలిచాడు.

ఆ విధంగా తన పాదాలను ఆశ్రయించి శరణిల్లిన పాండవ మధ్యముని విలోకించి వేదవ్యాసుడు విస్మితుడైనాడు.

"నాయనా! నీ శరీరం ఏమిటిలా భ్రష్టచ్ఛాయమై నిస్తేజంగా ఉన్నది? అపరిగ్రాహ్య వనితలను అనుగమించి పాపానికి పాల్పడ్డావా? లేక బ్రహ్మహత్యాపాతకానికి ఒడిగట్టావా? అనుకోని ఆశాభంగం వలన దుఃఖాలు కలిగాయా? నీ సంతానాభ్యుదయాన్ని కోరి కావించిన వ్రతాలు నిష్ఫలమై నిరాశను చెందావా? నీ కోరికలు నెరవేరడం లేదా? అతికాముకుడవై బలవీర్యపరాక్రమాలను కోలు

పోయావా? విప్రులకు అన్నదానం చేయకుండా ఒక్కడవూ భుజించడం నేర్చుకొన్నావా? ఎప్పుడైనా పేదవారి నుంచి ఆ అమాయకుల విత్తాన్ని అన్యాయంగా అపహరించావా? దుష్టుల దృష్టి తగిలి నిఃశ్రీకుడవైనావా? చేట విసిరిన గాలికి ఎదురుగా నిలుచొన్నావా? తడిగోళ్లతో ఎవరైనా నిన్ను స్పృశించారా? ఘటాంభస్సులను ప్రోక్షించారా? ఇంతకన్నా ఘోరం ఏమైనా జరిగిందా? నీ కన్నా అల్ప వీర్యులైన దుష్టుల చేతిలో ఓడిపోయావా?

వేదవ్యాసుని పలుకులకు అర్జునుడు గాఢంగా నిట్టూర్చి, విధివశాన ద్వారకలో జరిగిన విపరీత పరిణామాలను, తనకు కలిగిన పరాభవోదంతాన్నీ మనసువిప్పి చెప్పుకొన్నాడు.

''మాధవుడు మనందరినీ విడిచిపెట్టి మరోలోకానికి వెళ్లిపోయాడు. మన శక్తి, మన తేజస్సు, మన బలపరాక్రమాలు, మన సంపదలు, మన సర్వస్వం అయిన మహనీయుడు వెళ్లిపోయాడు. తన చిరునవ్వుతో మన మనస్సుల లోని చీకటిపొరలను మటుమాయం చేసే మహాత్ముని సుందరవదనారవింద సందర్శన మహాభాగ్యం లేక నేను గడ్డిపోచకన్నా హీనంగా కాలం గడుపుతున్నాను. నా శస్త్రాస్త్రాలకు, గాండీవ కోదండానికి సారమై నిలిచిన పురుషోత్తముడు నన్ను విడిచి వెళ్లిపోయాడు. ఏ భగవత్స్వరూపుని జీవితంలో ఒక్కసారి అవలోకించినంత మాత్రాన అనంతవిభవైశ్వర్యాలు, సంపదున్నతులూ అవతరిస్తాయో, ఆ మహనీయుడు అవతారాన్ని చాలించి నన్ను ఏకాకిని చేశాడు. తన మహాప్రభావం వలన భీష్మ ద్రోణ కర్ణదుర్యోధనాదులను నిర్దగ్ధులను చేసిన శ్రీకృష్ణపరమాత్మ వెళ్లిపోయాక నేనే కాదు, సమస్త భూమండలమూ అకాలవార్ధక్యానికి గురైనట్లు కళ తప్పి తేజోవిహీనమై ఉన్నది. ఏ మహానుభావుని యందలి అచంచల భక్తివిశ్వాసంవల్ల ఒకప్పుడు నేను నా పరాక్ర

మాగ్నిలో శత్రువీరులను శలభాల వలె మాడ్చివేశానో, లోకోత్తర గాండీవధనుర్ధారినై ముల్లోకాలలోనూ నా వంటివాడు లేడన్న మహాఖ్యాతిని ఉపార్జించానో, అట్టి నేను ఈనాడు ఆభీరచోరుల ముష్టి ఘాతానికి లొంగిపోయి, నా కృష్ణుని భార్యలందరూ అపహరింపబడు తుంటే ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తూ నిలబడవలసి వచ్చింది. యష్టిప్రహరణాలతో నా ప్రభువుభార్యలను దొంగలు అపహరిస్తుంటే నేను రక్షింపలేకపోయానని మాత్రమే కాదు ముని సత్తమా! ఇంత అవమాన కళంకాన్ని ధరిస్తూ నేనింకా సిగ్గు లేకుండా బ్రతికే ఉన్నానని ఆశ్చర్యంగా ఉన్నది!''

అర్జునుని హృదయభారాన్ని తెలుసుకొని వేదవ్యాసమహర్షి అతనిని ప్రేమతో అక్కున జేర్చుకొని ఊరడించాడు.

''నాయనా! ధీరోదాత్తుడవైన నీవు శోకాన్ని దిగమ్రింగు కొని కర్తవ్యకర్మకు ఉపక్రమించాలి. ఎంతటివారికైనా కాల ప్రభా వాన్ని తప్పించుకోవటం సాధ్యం కాదుకదా!

లోకంలో భూతజాతం సృష్టి స్థితిలయాలకు కాలమే కారణం. సృష్టిసర్వస్వమూ కాలమూలమని గ్రహించి నీవు స్థైర్యాన్ని వహించి ధైర్యాన్ని చిక్కబట్టుకోవాలి. నదులు, సముద్రాలు, తరులు, గిరులు, సకల భూమండలం, దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, సరీసృపాలు—అన్నీ కాలంచేత సృజింపబడి కాలధర్మాన్ని చెందు తున్నాయి. అందుచేత నీకు కనుపిస్తున్న విపరిణామా లన్నీ కాలాత్మకములేనని గుర్తించి శాంతచిత్తుడవు కావాలి.

కాలస్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ భూమి భారావతరణ కోసం భూమికి దిగివచ్చాడు. భూదేవి దైవతసమాజాన్ని సందర్శించి మొరపెట్టుకొన్నప్పుడు అభయప్రదానం చేసిన నారాయణుడు నరుడై అవతరించి తన మాట నిలబెట్టుకొన్నాడు.

ఫల్గునా! ఇప్పుడు ద్వాపరయుగాంతం సమీపిస్తున్నది. భూమండలం పైని గల రాజులందరూ అంతరించారు. వృష్ణ్యంధకుల కులం సంపూర్ణంగా నశించింది. ఇక భూతలాన చేయదగిన కార్యభారమేదీ లేకపోయాక కృతకృత్యుడైన ఆ మహాత్ముడు తన సంకల్పానుసారం భూమిని విడిచిపెట్టాడు. సృష్టికర్మకు ఉపక్రమించినపుడు సృష్టిని, స్థితికర్మకు దైనప్పుడు సుస్థితిని, అంతాన్ని తలపోసినప్పుడు అంతాన్ని, పొందింపజేయగల పురుషోత్తముడు తన ఇచ్ఛానుసారం అవతరించి, తన ఇచ్ఛానుసారం నిష్క్రమించాడు.

అర్జునా! కార్యాకార్యజ్ఞుడవైన నీవు సంతాపాన్ని చెందకూడదు. భవకాలంలో పురుషులకు పరాక్రమ క్రమం కాలమహిమవల్ల కలుగుతున్నది. నీవు ఒకప్పుడు మహాయోధులైన పితామహ—రాధేయాదులను అవలీలగా ఓడించి ఈనాడు నీకన్నా అల్పవీర్యులైన నీచుల చేతిలో పరాభవాన్ని పొందావు. శ్రీమహావిష్ణువును ఆరాధించినపుడు మహాజయాన్ని ప్రసాదించిన అతనే ఈనాడు నీకు అవమానభరాన్ని కలుగజేశాడు.

సర్వభూతాత్మకుడైన ఆ మహాత్ముడు శరీరాన్తరితుడై జగత్స్థితిని కలిగించినట్లే జగద్వినాశాన్ని కూడా సంకల్పించాడు. కాలం కలిసి వచ్చినపుడు నీకు సహాయభూతుడై నిలిచిన జనార్దనుడు ఈనాడు నీ విపక్షులను కరుణించాడు. గాంగేయాదులైన కౌరవాగ్రేసరులను సంహరింపగల మహాశక్తి నీకు లభిస్తుందని ఎవరుమాత్రం భావించారు? నిర్వీర్యులైన ఆభీరుల చేతిలో ఓడిపోతావని ఎవరనుకొన్నారు?

నాయనా! ఈ సకలమూ సర్వాత్మకుడైన శ్రీమన్నారాయణుని లీలావిలాసం. శ్రీహరి భార్యలను దస్యులు అపహరించారని దుఃఖితుడవైన నీవు ఈ విపరీత ఘటనలకు కారణం ఏమిటో తెలుసుకోవాలి.

అష్టావక్ర చరిత్రం

పూర్వం ఒకప్పుడు అష్టావక్రుడనే పేరుగల బ్రాహ్మణుడు జలమధ్యంలో నిలిచి అనేక సంవత్సరాలు సనాతన పరబ్రహ్మ తత్త్వాన్ని ఉపాసించాడు.

ఆ సమయంలో దేవదానవులకు ఘోరసంగ్రామం జరిగింది. దేవతలు శత్రుజయాన్ని సాధించి మేరుపర్వతశిఖరాలపై విజయోత్స వాలను జరుపుకొన్నారు. ఆ వేడుకలలో పాల్గొనడానికి వందలు, వేల సంఖ్యలో వచ్చిన రంభాతిలోత్తమాద్యప్సరస లందరూ అక్క డికి సమీపంలోనే తపస్సు చేసుకొంటున్న మునీంద్రుని చూసి ఆశ్చర్యపడ్డారు. కంఠపర్యంతజలాలలో నిలిచి తదేకధ్యానమగ్నుడై ఉన్న ఆ జటాధారి సమీపానికి వెళ్లి, సవినయంగా నమస్కరించి, శ్రుతిపక్వమైన మధురస్వరంతో ఆయనను బహురీతుల ప్రస్తుతిం చారు.

అప్సరోంగనల వినయశీలానికి అష్టావక్రుడు పరితుష్టుడై, వారి అభివాంఛితం ఎంత దుర్లభమైనా సరే, తప్పక తీరుస్తానని మాట యిచ్చాడు. రంభా తిలోత్తమలు ఆయన వాగ్ధోరణికి సంతోషించి, "విప్రోత్తమా! మీరు మా యెడ ప్రసన్నులైతే అదే మాకు పది వేలు. మాకు ఇక ఏ కోరికలూ లేవు" అని సంతృప్తచిత్తంతో మృదువుగా ప్రసంగించారు.

రంభాతిలోత్తమల సమాధానం వినయమధురంగా ప్రతి భాసించినా తక్కిన అప్సరసలు .వారి మాటలతో ఏకీభవించ లేదు. వారిలో కొందరు ఆయనకు ప్రణమిల్లి, "మహాత్మా! మాకు జగదేక వల్లభుడైన పురుషోత్తముని భర్తగా ప్రసాదించండి" అని తమ అభి మతాన్ని వ్యక్తం చేశారు.

అష్టావక్రుడు అప్సరసల ప్రార్థనను మన్నించి, అలాగే జరగగలదని ఆశీర్వదించి, జలమధ్యం నుంచి బయటికి వచ్చి నిలిచాడు.

అష్టావక్రుడు నీటినుంచి వెలువడినప్పుడు ఎనిమిది వంకరలతో వికృతంగా ఉన్న ఆయన దేహాన్ని చూసి అప్సరసలు నవ్వు ఆపుకోలేక పకపకా నవ్వసాగారు. ఆ పరిస్ఫుటహాసానికి కోపగించిన మునీంద్రుడు, "నన్ను అవమానించి నవ్విన పాపానికి ప్రతిఫలాన్ని అనుభవిస్తారు. మీరందరూ అమోఘమైన నా వచనానుసారం పురుషోత్తముని పతిగా పొందినట్లే నా శాపఫలితంగా భర్తను కోల్పోయి దస్యులవాత బడతారు గాక!" అని శపించివేశాడు.

మునీంద్రుని ఆగ్రహవచనాలకు తెల్లబోయి అప్సరసలందరూ ఆయన పాదాలపై బడి శరణు వేడుకొన్నారు. వారి దీనవదనాలను చూసి మనస్సు కరిగి అష్టావక్రుడు, "ఎన్ని కష్టాలు పడినా, అంతంలో మీకు మళ్లీ స్వర్గనివాసం కలుగుతుంది" అని శాపనివృత్తిని ఉపదేశించాడు.

అర్జునా! ఆ నాటి మునివచనాన్ని అనుసరించి అప్సరసలు శ్రీకృష్ణుని భర్తగా పొందారు. ఆయన అన్నట్లే వారందరూ దస్యులచేత అపహరింపబడ్డారు.

ఇందులో నీ లోపమేమీ లేదు. అఖిల జగన్నాథుడైన జనార్దనుడు తానే సృజించి, తానే ఉపసంహరిస్తున్న జగన్నాటకంలో నీవూ ఒక పాత్రవు మాత్రమే కనుక శోకింపకూడదు.

అఖిల సృష్టి స్థితి సంహారకుడైన వాసుదేవుడు భూమిభారావతరణ కోసం భూతజాతాన్ని ఉపసంహరిస్తున్నాడు. నీకు కూడా అవసాన కాలం సమీపిస్తున్న సూచనగా అతను నీ తేజోబల మాహాత్మ్యాన్ని విలోపింపజేశాడు.

జన్మించినవారికి మృత్యువు కూడా నియతం. ఉన్నతిని వెంబడించి పతనమూ ఏర్పడుతుంది. సంయోగానికి ఫలితం విప్రలంభమే. వృద్ధిక్షయాల ఉత్తరోత్తరానుభవం తప్పదు.

ఈ పరమార్థజ్ఞానం కలిగిన బుధులు సుఖదుఃఖాలు రెండింటికీ అతీతులు. అక్షయజ్ఞానవహ్నిలో పాపక్షయం కావించుకొని మోక్ష సామ్రాజ్యాన్ని అధిగమిస్తారు.

నరోత్తమా! ఈ పరమార్థతత్త్వాన్ని గ్రహించి నీవు సోదరులతో కలిసి రాజ్యపరిత్యాగం చేయాలి. వానప్రస్థాన్ని స్వీకరించి తపోదీక్షితుడవు కావాలి.

నీవు వెంటనే హస్తినకు వెళ్లు. ధర్మరాజుకు నా మాటగా చెప్పి రేపే మీరందరూ మహాప్రస్థానానికి సిద్ధం కావాలి''

వేదవ్యాసుని ఆదేశానుసారం అర్జునుడు హస్తినాపురానికి వెళ్లి అన్నదమ్ములకు అతీతానాగత విషయాలను సవిశేషంగా విశదీకరించాడు. ధర్మరాజు వెంటనే పరీక్షిత్తుకు రాజ్యాన్ని అప్పజెప్పి వానప్రస్థాన్ని స్వీకరించాడు. పాండవులు వనవాసానికి వెళ్లిపోయారు.

నీవు కోరిన మేరకు యదువంశంలో జన్మించి, భూమండలాన్ని తరింపజేసిన వాసుదేవుని లీలావిలాసాలను సవిస్తరంగా ప్రస్తావించాను''

అని పరాశరమహర్షి మైత్రేయునితో అన్నాడు.

విష్ణుపురాణము

షష్ఠభాగం

శ్రీవిష్ణుపురాణ కథాశ్రవణ సంఫుల్లస్వాంతరాజీవుడైన మైత్రేయుడు పరాశరమహాసీంద్రుని ఈ విధంగా ప్రశ్నించాడు:

"మహాత్మా! సర్గ - వంశ - మన్వంతర స్థితులను, వంశాను చరితాన్ని నాకు సవిస్తరంగా తెలియజెప్పారు.

ఇక ఉపసంహృతి కాలంలో సంభవింపనున్న సృష్టిప్రళయాన్ని గురించి విశదీకరించండి"

మైత్రేయుని పరిప్రశ్నకు సమాధానంగా పరాశరుడు కాల స్వరూపాన్ని వివరించి చెప్పాడు.

కాలస్వరూపం

మైత్రేయా!

బ్రహ్మదివసానికి అవసానంలో సంభవించే ప్రళయానికి కల్పాంతప్రళయం అని పేరు. దీనికే ఉపసంహృతి ప్రళయం, ఆత్యం తిక ప్రళయం అని కూడా నామాంతరాలు ఉన్నాయి.

బ్రహ్మదేవుని జీవితావధి ముగిసిన తర్వాత సంభవించే ప్రళయాన్ని మహాప్రళయం లేదా ప్రాకృతికప్రళయం అని వ్యవహరిస్తారు.

మన మనుష్యకాలమానంలో ఒక మాసం పితృదేవతలకు ఒక అహోరాత్రం. మానవకాలమానంలో ఒక సంవత్సరం దేవతలకు ఒక అహోరాత్రం.

కృత త్రేతా ద్వాపర కలియుగాలు నాలుగూ కలిసి ఒక చతుర్యుగం. దేవతల కాలమానంలో ఇది పన్నెండు వేల సంవత్సరాలన్నమాట.

ఇటువంటి రెండువేల చతుర్యుగాలు కలిసి పద్మగర్భునికి ఒక అహోరాత్రం.

అనాదిగా సాగుతూ వస్తున్న ఈ సృష్టిలో లెక్కలేనన్ని చతుర్యుగాలు గతించిపోయాయి.

ఇంకా అనేకం గతింపనున్నాయి.

కృతయుగంలో ప్రారంభించిన భూతసృష్టిని పితామహుడు కలియుగాంతంలో ఉపసంహరిస్తాడు. మళ్లీ కృతయుగాదిని సృష్టిక్రమానికి ఉపక్రమిస్తాడు.

ఈ సృష్టి ప్రళయాలకు నడుమ కాలమే ప్రపంచ పరిణామం!''

అని అంటున్న పరాశరమహాని మాటలకు అడ్డువస్తూ మైత్రేయుడు—

''మునీంద్రా! ఈ కలి స్వరూపాన్ని తెలియజెప్పండి'' అని కోరాడు.

కలిస్వరూపం

''కలియుగం అధర్మానికి నిలయం. కృతయుగంలో స్వచ్ఛందంగా విలసిల్లిన వేదధర్మం కలికాలంలో కలికానికైనా లేకుండా అదృశ్యమైపోతుంది.

కలియుగంలో వర్ణాశ్రమధర్మాలంటే ప్రజలకు ఆదరణ నశిస్తుంది. వేదధర్మం పట్ల భక్తిశ్రద్ధలు క్షీణించి, వివాహాలు వైదికాచార విరహితంగా జరుగుతాయి.

గురుశిష్యుల అనుబంధంలో మార్పు వస్తుంది. పరస్పర విద్వేషాలు ప్రజ్వరిల్లుతాయి.

భార్యాభర్తలను దాంపత్య ధర్మసూత్రం బంధించలేక పోతుంది. ప్రజలు అగ్నికార్యవిధులను నిర్లక్ష్యం చేస్తారు.

ప్రపంచంలో ధనవంతులకు విశేషప్రాబల్యం లభిస్తుంది. ధనవంతుడు ఏ కులంలో పుట్టినా కన్యలు అతన్ని వివాహం చేసుకోవాలని కలలు కంటారు.

బ్రాహ్మణులు తమ చిత్తానికి తోచినట్లుగా బ్రహ్మతత్త్వాన్ని అన్వయించుకొని అనర్థదాయక కర్మకలాపాన్ని ఆచరిస్తారు. ఎవరి బుద్ధికి ఏది తోస్తే అదే శాస్త్రం, ఎవరు ఏ మాట అంటే అదే వేదం, నలుగురూ ఎవర్ని దేవుడంటే వాడే దేవుడై దైవత్వానికి అర్థం లేకుండా పోతుంది.

ఆశ్రమధర్మాలు కలగలుపవుతాయి. ఎవరి అభిరుచిని బట్టి వారు ధర్మానికి అర్థనిర్ణయం చేస్తారు.

ఉపవాసం ఉంటే పుణ్యం, దానం చేస్తే ధర్మం, ఎవరు ఏది ఆచరిస్తే అదే అనుష్ఠానం అవుతాయి.

కొద్దిపాటి ధనం చేకూరేసరికి ప్రజలు మదోన్మత్తులై లోకంలో నా అంతవాడు లేడని విర్రవీగుతారు.

స్త్రీలు కేశాలంకరణకు ప్రాధాన్యాన్నిచ్చి శీలసౌందర్యాన్ని మరచిపోతారు. సువర్ణం, మణిరత్నాలు, అమూల్యవస్త్రాభరణాలు లేకపోతే కేశాలంకరణ అయినా చేసుకొని రూపమదాన్ని పొందుతారు.

భూమి క్రయవిక్రయాల వ్యాపారసాధనం ఔతుంది. మనస్సు సర్వకాల సర్వావస్థలలోనూ ధనసంపాదన కోరికలతో సతమతమౌతుంది. ఆర్జించిన ధనాన్ని ఆత్మోపభోగానికి వ్యయంచేసి, తనూ తన కుటుంబం బాగుపడితే చాలనుకొంటారు.

స్త్రీలు స్వైరిణులై భోగలాలసలవుతారు. పురుషులు అన్యాయంగానైనా డబ్బు సంపాదిస్తే చాలనుకొంటారు.

అర్థకాంక్ష బలపడ్డాక ప్రజలు నీతిధర్మాలను విస్మరిస్తారు. ప్రాణస్నేహాన్ని కాలదన్ని పోగలరు కాని కాసులో వీసమైనా విడిచిపోలేరు. అవసరానికి అడిగితే అప్పు ఇవ్వడానికి కూడా సంకోచిస్తారు. స్వార్థహాని కలుగుతుంటే తప్ప చిల్లిగవ్వలో సగంలో సగంలో సగం కూడా పొరుగువాడి కోసం ఖర్చుచెయ్యరు.

ప్రజలు వర్ణధర్మాలను అలక్ష్యం చేస్తారు. ఆవులు పాలిచ్చినన్నాళ్లూ ప్రేమగా చూసి, వట్టిపోగానే గ్రాసవాసాలకు కూడా వెనుకాడుతారు. ఈ వస్తువు మనకు ఏరీతిగా ఉపయోగపడుతుంది? అనే ఆలోచనతో ప్రజాహృదయాలలో స్వార్థం కరుడుగట్టి స్వచ్ఛందప్రేమభావాలు అంతరిస్తాయి.

ప్రజాజీవితాలు కరువుకాటకాలతో సంక్షోభిస్తాయి. అనావృష్టి కలిగి అన్నంకోసం కటకటలాడుతుంటారు. తమ కష్టాలు గట్టెక్కి మంచిరోజులు వస్తాయన్న నమ్మకం పోయి ఏదో ఆకాశం నుంచి ఊడిపడుతుందని ఎదురుచూస్తారు.

అన్నోదకాలు లభించక ప్రజలు కూడా మునుల వలె కందమూలాలు తిని కాలం గడపవలసి వస్తుంది. ఎప్పుడూ దుర్భిక్షం, ఏదో ఒక క్లేశం, ఏదో ఒక అసంతృప్తి. కలియుగంలో మానవులకు సుఖమన్నది లేకుండా పోతుంది.

ఎక్కడ చూసినా అనాచారం తాండవిస్తుంది. స్నానం చేయకుండా భోజనాలు చేస్తారు. అగ్నికి, దేవతలకు, అతిథులకు పూజావిధులను నిర్వర్తించడం వృథావ్యయమని ప్రచారంలోకి వస్తుంది. పితృశ్రాద్ధాలు మానివేస్తారు.

స్త్రీలకు సుఖదృష్టి ఎక్కువై బాధ్యతలను తప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. రకరకాల రుచుల కోసం అర్రులు చాస్తారు. సంతానం ఎక్కువై సంపాదన లేకుండా పోతుంది. దేహసంస్కా-

రాలను వర్జించి స్వపోషణపరాయణులై భర్తను, కుటుంబసభ్యులను నిరాదరిస్తారు. అడిగితే అబద్ధం చెప్పడానికి వెనుకాడరు. చెడునడతలకు అలవాటు పడి కులాంగనలు పురుషులకు ద్రోహం చేస్తారు.

విద్యార్థులు విధినియమాలను త్రోసిరాజని ఇష్టారాజ్యంగా వేదాధ్యయన మొదలుపెడతారు. గృహస్థులు స్వార్థానికి అలవాటు పడి గుండె రాయి చేసుకొంటారు. వానప్రస్థులు గ్రామ్యాహారాలను పరిగ్రహిస్తారు. భిక్షువులు మిత్రాదిస్నేహసంబంధయంత్రితులై ధనార్జనవ్యాపృతు లవుతారు.

పాలకులు ప్రజలను కాపాడవలసినది పోయి కంచే చేనుమేసినట్లు జనవిత్తాన్ని అపహరిస్తారు. పరిపాలించడం చేతకాక పన్నులు పెంచుతారు.

కులాచారాలను బట్టి రాజులు పుట్టే రోజులు పోయి ధనధాన్యాలు, గజాశ్వరథాలు, వాహనాలూ ఉన్నవాడే రాజవుతాడు. బలహీనులు అతని బానిస లవుతారు.

వైశ్యులు కృషివాణిజ్యాలను కట్టిపెట్టి ద్యూతకర్మోపజీవులై అధర్మానికి అలవాటు పడతారు. శూద్రులు తమ వృత్తిగౌరవాన్ని మరచి భిక్షుకులై పాషండులను ఆశ్రయించి అధమవర్తను లనిపించుకొంటారు.

దుర్భిక్షాలు ఎక్కువై ఆకలిబాధకు తట్టుకోలేక ప్రజలు పొట్ట చేతిలో పెట్టుకొని దేశాలు పట్టిపోతారు. గవేధుకాలను, కదన్నాలనైనా సంకోచం లేకుండా భుజిస్తారు.

వేదమార్గం అంతరించి పాషండధర్మాల వల్ల అధర్మం తాండవిస్తుంది. ప్రజలు అల్పాయుష్కు లవుతారు. శాస్త్రవిహితకర్మలు లేక ఘోరాలు పెరుగుతాయి. అసమర్థులు రాజులై నృపదోషఫలితంగా బాలారిష్టాలు సంభవిస్తాయి. బాలమృత్యువులు అధికమై తల్లిదండ్రులకు తీరని క్షోభ కలుగుతుంది.

ధర్మభీతి లేక అక్రమసంభోగాలు పెరిగి ఆడపిల్లలు ఐదు, ఆరు, ఏడేండ్లకే గర్భవతులౌతారు. ఎనిమిది, తొమ్మిదేండ్ల పిల్లలకు కూడా పెళ్లిళ్లు జరుగుతాయి. పన్నెండేళ్లకే జుట్టు నెరిసి అకాల వార్ధక్యం దాపరిస్తుంది. బలారోగ్యాలు క్షీణించి మానవాయుర్దాయం వింశతివర్షపర్యాప్తమౌతుంది.

కలియుగంలో పురుషులందరూ అల్పప్రజ్ఞులు, నీచవర్తనులు, దుష్టబుద్ధులు కావడం వల్ల ధర్మానికి తావు లేకుండా పోతుంది.

ఈ విధమైన లక్షణాలు ప్రస్ఫుటమై పాషండ ధర్మాలు వ్యాప్తిచెందిన కొద్దీ కలి బలపడుతున్నదని అభిజ్ఞులు సులభంగానే తెలుసుకొంటారు.

కలి ముదిరి వేదమార్గాన్ని అనుసరించిన ధర్మవర్తనులకు నిలువనీడ లేని పరిస్థితి ఏర్పడుతుంది. యజ్ఞాలకు అధిదైవతంగా పురుషోత్తముని ప్రాధాన్యం సంకుచితమై పాషండధర్మాల ప్రభావం వలన వేదదూషకులకు ప్రాబల్యం కలుగుతుంది.

కలియుగంలో సర్వజగత్స్రష్ట అయిన శ్రీమన్నారాయణునికి అర్చాకర్మలు అంతరించి నరులందరూ వైదికాచార విరుద్ధవర్తనలకు అలవాటు పడతారు. "ఈ వేదాల వల్ల ప్రయోజనం ఏమిటి? ఈ దేవతలు ఉన్నారని నమ్మకం ఏమిటి? నీళ్లతో సంధ్యావందనాలూ, క్రియాకలాపాలూ ఆచరించి అదేదో శౌచం అన్న భ్రమ దేనికి?" అని పాషండోపహతులైన పండితులు కూడా వేదదూషణకు పాల్పడతారు.

ఈ దుష్కర్మల ప్రభావం వలన దేశంలో వానలు లేక నీళ్ల కోసం కటకటలాడుతారు. పంటలు వట్టిపోయి ఆహారధాన్యాల కరువు ఏర్పడుతుంది. శాణీప్రాయవస్త్రాలు, శమీప్రాయవృక్షాలు, శూద్రప్రాయవర్ణాలతో క్షామం తాండవిస్తుంది.

ప్రజలు అన్నం లేక జొన్నలు తినడం మొదలుపెడతారు. పాలు కరువై మేకపాలు త్రాగవలసి వస్తుంది.

వివాహితులు తల్లిదండ్రుల కన్నా అత్తమామలను నెత్తి కెక్కించుకొంటారు. భార్యమీది ప్రేమతో బావమరదులను చేర దీసి వాళ్లతోనే స్నేహం చేస్తారు.

వివాహబంధం దాంపత్యధర్మసూత్రాన్ని అనుసరించి ఏర్పడినది కాకపోవటం వలన ఇచ్చిపుచ్చుకోవడాలకు ప్రాధాన్యం కలుగుతుంది. అశ్రమంగా లభించే ఆస్తిపాస్తుల కోసం ఆశపడి ప్రజలు అత్తమామల వెంటపడతారు.

"ఏదో కర్మం కొద్దీ ఈ పాట్లన్నీ పడుతున్నాము కానీ లేకపోతే తల్లేమిటి? తండ్రేమిటి?"

అని మాతాపితరులను గడ్డిపోచకన్నా అల్పంగా పరిగణిస్తారు.

ఈ విధంగా వాక్కు, మనస్సు, శరీరం—మూడూ దోష దూషితాలై అల్పమేధులైన మానవులు అనుదినమూ పాపకర్మలను ఆచరిస్తారు.

సత్త్వహీనులు, అశౌచపరులు, నిత్యదరిద్రులు అయిన ఈ దుశ్శీలురకు ప్రపంచంలో ఏయే దుఃఖాలు ఉన్నాయో అన్నీ అనుభవ్యమానమై జీవితం నిరాశానిస్పృహాలకు లోనవుతుంది.

స్వాధ్యాయాన్నీ, స్వాహాస్వధావషట్కారాలనూ విడిచిపెట్టిన ధర్మాలను కొన్ని దేశాలు అనుసరిస్తాయి.

అయితే, కలియుగాన్ని ఒక్కందుకు మనం సర్వశ్రేష్ఠమని అంగీకరించవచ్చు.

ఈ యుగంలో అశ్రమంగా, నిరాయాసంగా అందరికీ ముక్తి లభిస్తుంది. కృతయుగంలో మహాతపస్సులు చేసి సాధింపతగిన మోక్షపదాన్ని కలియుగంలో అల్పప్రయత్నం చేత చూరగొనవచ్చు. అనుత్తములను పుణ్యసంధులనుగా తరింపజేయవచ్చు.

మైత్రేయా!

పూర్వం ఒకప్పుడు నా కుమారుడైన వ్యాసమహర్షి మునీంద్రులకు విశదీకరించిన కలిమాహాత్మ్యాన్ని నువ్వు వినితీరాలి!''

అంటూ పరాశరమహర్షి కలియుగంలో మోక్షసాధనకు అనువైన మార్గాన్ని ప్రాక్కథాముఖంగా ఉపదేశించాడు.

కలియుగ మాహాత్మ్యం

పూర్వం ఒకప్పుడు మునిలోకంలో అన్నింటికన్నా అల్ప ధర్మాచరణతో అధిక ఫలావాప్తి ఎలా కలుగుతుందని ఒక సందేహం ఉదయించింది. అందరూ తలా ఒక ధర్మాన్ని, దానివల్ల పొందదగిన మహాఫలాన్ని ప్రతిపాదించారు. ఎంత వాదించినా పరిష్కారం కుదరకపోయేసరికి మునులందరూ కలిసి వేదవ్యాసుని ఆశ్రమానికి వెళ్లారు.

ఆ సమయంలో వ్యాసమహర్షి జాహ్నవీసలిలాలలో అర్ధస్నాతుడై నిలిచి ఉన్నాడు. మునులందరూ ఆయన కోసం ప్రతీక్షిస్తూ గంగానదీతీరాన తరుచ్ఛాయలలో నిలబడ్డారు.

అప్పుడు నా కుమారుడు జాహ్నవీతోయాల లోనికి మునిగి, పైకి లేవగానే ఉచ్చైస్స్వరంతో ''సాధు సాధు! కలీ! సాధు'' అని గంభీరంగా ఉచ్చరించాడు.

మునులందరూ వ్యాసమహర్షి స్నానావసానంలో తీరానికి తిరిగి రాగలడని ఎదురుచూస్తుండగా ఆయన మళ్లీ నీళ్లల్లోకి మునిగి, పైకి లేవగానే ''సాధు సాధు! శూద్రా! ధన్యుడవైనావు!'' అని సంభ్రమోద్విగ్నుడై పలికాడు. ఇంతలోనే ఆయన జలమగ్నుడై, మళ్లీ పైకి లేచి, ''సాధు సాధు! మహిళలారా! మీరందరూ నిజంగా ధన్యజీవితలు. ఇంతకన్నా ధన్యతమం వేరే ఏముంటుంది?'' అని పునః ప్రవచించాడు.

ఆ తర్వాత నా తనూజుడు స్నానం ముగించుకొని వెలికి రాగానే మునులందరూ అతనికి వినయపూర్వకంగా నమస్కరించి, తమ ఆదరాన్ని వ్యక్తంచేశారు. వ్యాసుడు కూడా వారికి ప్రత్యుత్థానం చేసి, ఉచితాసనాలపై కూర్చొనబెట్టి, ''మహాత్ములారా! మీ రాకకు కారణం ఏమిటి?'' అని సగౌరవంగా ప్రశ్నించాడు.

మునులు సాత్యవతేయునితో ఈ విధంగా అన్నారు:

''మే మందరమూ ఒకానొక వాదసమయంలో సంశయ గ్రస్తులమై అర్థనిర్ణయం కోసం మీ వద్దకు వచ్చాము. అయితే మీ రిప్పుడు కలియుగాన్ని, శూద్రులను, స్త్రీలను ఉద్దేశించి కావించిన సాధువాదం మాకెంతో ఆశ్చర్యాన్ని కలుగజేసింది. మీరేమీ అనుకోకపోతే మాకు ముందుగా ఆ విశేషాన్ని తెలియజెప్పండి. ఆ తర్వాత మా సందేహాన్ని గురించి మాట్లాడుకొందాము.''

మునివచనాలను ఆకర్ణించి వేదవ్యాసుడు మందహాసం చేశాడు:

''ఓ మునిశ్రేష్ఠులారా! ఈ లోకంలో మానవులు కఠోర బ్రహ్మచర్యదీక్షను వహించి, నిరంతర జపతపోనుష్ఠానాలతో కృత యుగంలో పదిసంవత్సరాలు, త్రేతాయుగంలో ఒక్క సంవత్సరం, ద్వాపరంలో నెల రోజులలోనూ సాధింపదగిన మహాఫలాన్ని కలి యుగంలో కేవలం ఒక్క రోజులో సాధింపవచ్చునన్న సంతోషం పట్టలేక నేను ఇందాక సాధువాదం చేశాను.

కృతయుగంలో మానవులు ఏకాగ్రచిత్తులై శ్రీమన్నారా యణుని హృదయపీఠిపై పాదుకొల్పి పదిసంవత్సరాలు తదేకధార ణతో కావించిన ధ్యానం ఉత్తమఫలాన్ని ప్రసాదిస్తుంది.

త్రేతాయుగం రాగానే మానవులు యజ్ఞపురుషుడైన పురు షోత్తముని యజ్ఞేశునిగా సంభావించి నిర్వహించిన యజ్ఞానుష్ఠానం ఫలాభిసంహితకు సాధక మాతుంది.

ద్వాపరయుగంలో అంతమాత్రం శ్రమకూడా అవసరం లేదు. ఒక్క నెలరోజులు భక్తిపూర్వకంగా శ్రీమహావిష్ణువును అర్చించి పుణ్యఫలాన్ని పొందవచ్చు.

కలియుగంలో సర్వోన్నతమైన విష్ణుపదం అన్నింటికన్నా సులభగమ్యం.

కృతయుగంలో ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞం, ద్వాపరంలో అర్చన మోక్షసాధనమార్గాలు కాగా కలియుగంలో ఆ ప్రాధాన్యం నామసంకీర్తనకు లభించింది.

శ్రీమన్నారాయణ దివ్యనామసంకీర్తన కంటె కలియుగీనులకు కామ్యఫలదాయకం వేరొకటి లేదు.

ఓ ధర్మజ్ఞులారా! కలియుగంలో మానవులు అల్పాయాసంతో అతీవమైన ధర్మోత్కర్షను అతిసులభంగా సంపాదింపగలరన్న మహానందంతో నేను కలియుగానికి సాధువాదం పలికాను.

పూర్వం బ్రాహ్మణులు స్వధర్మాన్ని అనుసరించి వ్రతచర్యానిష్ఠులై అనేక సంవత్సరాలు కష్టపడి వేదాలను అధ్యయన చేసేవారు. కాలం గడిచేకొద్దీ వారిలో శ్రద్ధాభక్తులు సన్నగిల్లి వేదాధ్యయనల స్థానంలో వేషాడంబరానికి ప్రాధాన్యం వచ్చింది. సంయమాన్ని కోల్పోయి భ్రష్టధర్ములైన ద్విజులు మిథ్యాజపాలకు, అర్థం తెలియని యజ్ఞయాగాలకు అలవాటుపడ్డారు. ఐహిక సుఖాలకు ఎగబ్రాకి భోజ్యపేయాలు మొదలుకొని ఆహారవిహారాదు లన్నింటిలోనూ దోషాచరణకు పాల్పడినందున వారికి వాక్శుద్ధి, సంకల్పసిద్ధి లేకపోయాయి.

అందువల్ల కలియుగంలో బ్రాహ్మణులు ఏదైనా సాధించాలంటే మహాప్రయత్నం చేయవలసి వస్తుంది. అల్పకార్యానికి కూడా అమితక్లేశం కలుగుతుంది. మరచిపోయిన ధర్మాలను మళ్లీ జ్ఞాపకం చేసుకోవడం సులభమేమీ కాదు.

శూద్రులకు వర్ణాశ్రమధర్మాలలో అధికనియమాలు లేవు. అన్నపానాదుల లోనూ వారికి నియతవిధులు తక్కువ. ధర్మాచరణ మతులై సత్పురుషులకు, బ్రహ్మభావనులకు శుశ్రూషలు చేసి పాక యజ్ఞాలను నిర్వర్తించినంత మాత్రాన వారికి సత్ఫలం కలుగుతుంది.

అందుకే నేనిందాక కలియుగంలో శూద్రులు ధన్యాత్ములని అన్నాను.

మానవులు స్వధర్మనిరతులై ధర్మవిరోధం లేకుండా ధనార్జన చేయాలి. ఆర్జించిన ధనాన్ని తమ తమ శక్త్యనుసారం పాత్రోచితంగా దానం చేయాలి.

ఆఢ్యులైనవారికి ధనార్జన కంటె ధర్మపరిపాలనమే అతి సంక్లిష్టం. ఎటువంటివారికైనా సంపాదించడంలో ఉన్న ఆనందం సద్వినియోగపరచడంలో లేదనిపిస్తుంది.

కలియుగంలో పురుషులకు విత్తసంపాదనతోనే కాలమంతా వ్యర్థమైపోతుంది. ఎంతో శ్రమకోర్చి, త్యాగాలు చేసి, కష్టాలు పడ్డ తర్వాత కాని ఆశించిన ఫలం వారికి ఉపలభ్యం కాదు.

ఈ విధంగా పురుషులకు అతి క్లేశదాయకమైన ఫలావాప్తి స్త్రీలకు అతి సులభంగా చేకూరుతుంది.

స్త్రీలకు భర్తశుశ్రూషానిరతి మాత్రమే నియత కర్తవ్యం. మనోవాక్కాయకర్మలలో భర్తృసహధర్మచారిణియై ధర్మపాలనం చేసిన ధన్యాత్మురాలికి సర్వమూ సాధ్యమేనని నేను మహిళలను సాధువ్యాహృతులతో అభినందించాను.

పూజ్యులారా! నా మాటలతో కాలాతీతం కాకుండా మీకు కలిగిన సంశయోదంతాన్ని వివరించండి. సర్వమూ స్ఫుటగోచరంగా మీకు సమాధానం చెబుతాను'' అన్నాడు.

మునులు పరమానందభరితులై వ్యాసమహర్షికి అభివాదం చేసి, ''మహాత్మా! ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు మా సందేహా

నిరాసకంగా ప్రసంగించి మమ్మల్ని కృతార్థులను చేశారు. ఇక మాకు వేరే ప్రష్టవ్యం లేదు'' అని తమ కృతజ్ఞతను తెలుపుకొన్నారు.

మునీంద్రుల మాటలకు సాత్యవతేయుడు విస్మయోత్ఫుల్ల నయనాలతో కల కల నవ్వి, ''దివ్యదృష్టితో మీ సందేహాన్ని నేను ముందుగానే తెలుసుకొన్నాను. అందుకే మీతో సాధుభాషణం చేశాను. కలియుగంలో స్వల్పప్రయత్నం చేతనే ధర్మసిద్ధి కలుగుతుంది. నరులు ఆత్మగుణాంభస్సులతో అఘపంకాన్ని ప్రక్షాళించి ధన్యాత్ములు కాగలరు. శూద్రులు సజ్జనశుశ్రూష వలన, స్త్రీలు పతిశుశ్రూష వలన అనాయాసంగా సత్ఫలాన్ని పొందగలరు. యుగాలన్నింటిలోనూ కలియుగమే ఉత్తమం'' అని ఉపదేశించాడు.

ఋషులు వ్యాసమహర్షిని కృతజ్ఞతాపూర్వకంగా సత్కరించి, ఆయనకు వీడ్కోలు పలికి నిజవాసానికి వెళ్ళిపోయారు.

మైత్రేయా! అత్యంత దుష్టమైన కలియుగంలో ఇదొక్కటే ఉత్తమ గుణం.

ఈ యుగంలో ప్రజలు కేవలం శ్రీమన్నారాయణ నామ సంకీర్తనం వలన భక్తజనులు దుర్లభమైన పరమపదాన్ని అతి సులభంగా సాధింపగలరు.

అతి రహస్యమైన ఈ వృత్తాంతాన్ని నేను నీ కోసం వెల్లడి చేశాను.

ఇక నీవు కోరిన సృష్టిప్రళయాన్ని గురించి చెప్పబోతున్నాను.

జగత్సృష్టి ప్రళయం

ప్రళయమంటే పరిపూర్ణమైన లయం.

పద్మగర్భాండంలో ఆవిర్భవించిన చరాచర భూతజాతం మూడు విధాలుగా ప్రతిసంచరాన్ని పొందుతున్నది.

వీటిలో మొదటిది నైమిత్తిక ప్రళయం. దీనికే బ్రహ్మ ప్రళయం అని కూడా పేరున్నది.

బ్రహ్మప్రళయం ప్రతి కల్పాంతంలోనూ సంభవిస్తుంది.

రెండవది ప్రాకృతిక ప్రళయం. ఇది ద్విపరార్ధికం. అంటే రెండు పరార్ధాలకు తర్వాత బ్రహ్మ జీవితానికి అంతంలో సంభవించే ప్రాకృతిక లయం.

మూడవది ఆత్యంతిక ప్రళయం. బ్రహ్మవిదులు దీనినే మోక్షమని అంటారు''

అని పరాశరుడు ప్రవచింపగా, మైత్రేయుడు—

''మహాత్మా! ప్రాకృతప్రతిసంచరానికి మూలమైన పరార్ధ స్వరూపాన్ని* నాకు వివరించి చెప్పండి''

అంటూ ప్రార్థించాడు.

---

* భారతీయ సంఖ్యా శాస్త్ర పరిగణనను అనుసరించి పరార్ధం అంటే 100,000,000,000.000,000 సంవత్సరా లన్నమాట. బ్రహ్మ జీవితం ద్విపరార్ధికం కనుక మొత్తం 200,000,000,000,000,000 సంవత్సరాల తర్వాత ప్రాకృతిక ప్రళయం సంభవించాలి.

విష్ణుపురాణం ముక్తాముక్తంగా పేర్కొన్న ఈ సంఖ్యాన క్రమం వాయు పురాణంలో చక్కగా దశాంశస్థానాలతో వివరింపబడింది:

ఏకం	- 1
దశకం	- 10
శతకం	- 100
సహస్రం	- 1,000
అయుతం	- 10,000
వియుతం	- 100,000
ప్రయుతం	- 1,000,000
అర్బుదం	- 10,000,000
న్యర్బుదం	- 100,000.000

వృందం	- 1,000,000,000
పరం	- 10.000.000,000
ఖర్వం	- 100 000,000.000
విఖర్వం	- 1,000.000.000,000
శంఖం	- 10,000,000,000,000
పద్మం	- 100,000.000.000,000
సముద్రం	- 1,000,000.000.000,000
మధ్యమం	- 10,000,000,000 000.000
పరార్థం	- 100,000,000,000.000,000

ఇక బ్రహ్మకల్ప కాలనిర్ణయానికి పురాణాలలో వేర్వేరు రీతుల నిర్వచనాలు కనిపిస్తున్నాయి. పురాణ వ్యాఖ్యాతలు వీటికి తమ సమకాలంలో జరిగిన గణిత పరిశోధనల సారాంశాన్ని జోడించడం వలన ఆనాటి శాస్త్రాధ్యయనల స్వరూప విశ్లేషణకు అవకాశం లభిస్తున్నది.

భారతీయకాలమానంలో అత్యల్పకాలప్రమాణం మాత్ర. దీనికే నిమేషం అని కూడా పేరున్నది. ఇది కనురెప్పపాటు కాలం.

15 నిమేషాలు	- 1 కాష్ఠ
30 కాష్ఠలు	- 1 కళ
30 కళలు	- 1 క్షణం
12 క్షణాలు	- 1 ముహూర్తం
30 ముహూర్తాలు	- 1 అహోరాత్రం.

ఈ విభాగంతో కూర్మ, మార్కండేయ, మత్స్య, వాయు, విష్ణు, లింగ పురాణాలు సంవదిస్తున్నప్పటికీ మనుస్మృతి 18 నిమేషాలు ఒక కళ అని నిరూపించింది. భవిష్యపురాణం కాష్ఠానిర్ణయంలో మనుస్మృతిని అనుసరించి, తక్కిన వాటిని యథాతథంగా స్వీకరించింది.

మహాభారతంలో ముప్పై కళలు, మూడు కాష్ఠలు కలిసి ఒక ముహూర్తం అవుతుందని వేరొక నిర్ణయం కనిపిస్తుంది.

భాగవత, బ్రహ్మవైవర్త పురాణాల లోని కాలవిభాగనిరూపణం మరొక విధంగా ఉన్నది :

2 పరమాణువులు	- 1 అణువు
3 అణువులు	- 1 త్రసరేణువు

3	త్రసరేణువులు	- 1 త్రుటి
100	త్రుటులు	- 1 వేధ
3	వేధలు	- 1 లవం
3	లవలు	- 1 నిమేషం
3	నిమేషాలు	- 1 క్షణం
5	క్షణాలు	- 1 కాష్ఠ
15	కాష్ఠలు	- 1 లఘువు
15	లఘువులు	- 1 నాడిక
2	నాడికలు	- 1 ముహూర్తం
6	లేదా 7 నాడికలు	- 1 యామం.

కోల్‌బ్రూక్ మహాశయుడు భారతీయ సంఖ్యాపరిమాణాన్ని గూర్చిన ప్రస్తావంలో వరాహపురాణ. భవిష్యపురాణాల నుంచి వేరొక రీతి గణన విధానాన్ని పేర్కొన్నాడు. దానిని బట్టి —

6	ప్రాణలు	- 1 వికళ
60	వికళలు	- 1 దండ
60	దండలు	- 1 తిల

అన్న విభాగం ఏర్పడుతున్నది. ఇవికాక

60	తిలలు	- 1 విపల
60	విపలలు	- 1 పల
60	పలలు	- 1 ఘడియ

మొదలైన విభాగాలు కూడా కనుపిస్తున్నాయి.

భారతీయ కాలమానంలో గోచరిస్తున్న చతుర్యుగ వత్సరాంకనిరూపణ ఈ క్రింది విధంగా పరిశీలింపదగి ఉన్నది. దేవమానం నుంచి ఈ వివరాలను మనుష్య మానం లోనికి మార్చుకోవాలి.

కృతయుగం	4000	
సంధ్య	400	
సంధ్యాంశ	400	4800

త్రేతాయుగం	3000	
సంధ్య	300	
సంధ్యాంశ	300	
		3600
ద్వాపరయుగం	2000	
సంధ్య	200	
సంధ్యాంశ	200	
		2400
కలియుగం	1000	
సంధ్య	100	
సంధ్యాంశ	100	
		1200

దేవమాన మనుష్యమానాలను పరిశీలింపదలచిన జిజ్ఞాసువులు ఇతర దేవమానాలతో వాటి తులనాత్మక పరిశీలన కూడా చేయవచ్చు.

మనుష్యకాలమానంలో —

30	సంవత్సరాలు -	పితృదేవతలకు	1	సంవత్సరం
360	సంవత్సరాలు -	దేవతలకు	1	సంవత్సరం
3030	సంవత్సరాలు -	సప్తర్షులకు	1	సంవత్సరం
9090	సంవత్సరాలు -	ధ్రువునికి	1	సంవత్సరం
25920000	సంవత్సరాలు -	మనువుకు	1	సంవత్సరం

వీటిలో చివరిది హరివంశ కథనాన్ని బట్టి ఉదాహరింపబడింది. విష్ణుపురాణం మన్వంతర కాలప్రమాణం దేవమానంలో 852 000 సంవత్సరాలు, మనుష్యమానంలో 852,000 × 360 = 306,720,000 సంవత్సరాలని పేర్కొన్నది.

దేవమానంలో యుగనిరూపణను మనుష్య కాలమానం లోనికి పరివర్తిస్తే చతుర్యుగ ప్రమాణం తెలుస్తుంది.

కృతయుగం	4800 × 360 = 1,728,000
త్రేతాయుగం	3000 × 360 = 1,296.000
ద్వాపరయుగం	2400 × 360 = 864,000
కలియుగం	1200 × 360 = 432.000
మహాయుగ	4,320,000

కల్పపరిమాణాన్ని నిర్ణయిస్తూ భవిష్యపురాణం సహస్రమహాయుగాలని పేర్కొన్నది. అంటే 4,320,000 $\times$ 1000 = 4,320,000,000 సంవత్సరా లన్న మాట. దీనిని బట్టి బ్రహ్మదివసం 8,640,000,000 సంవత్సరాలు కావాలి. విష్ణు పురాణం బ్రహ్మదివసం డెబ్బైఒక్క మహాయుగాలకు చతుర్దశ గుణితంగా అభివర్ణించింది. అంటే మొత్తం 4,320,000 $\times$ 71 $\times$ 14 $\times$ 2 = 8,588,160,000 సంవత్సరా లన్నమాట. మన్వంతరాల మధ్యకాలంలో సంభవించే ప్రళయవేళావత్సరాల పరిగణన వివాదగ్రస్తమై ఉన్నది.

పరాశరుడు మైత్రేయునికి చెప్పినదానినిబట్టి ద్విపరార్థికం బ్రహ్మమానంలో నూరు సంవత్సరాలు. ఇది మనుష్య కాలమానంలో 311,040,000,000,000 సంవత్సరా లవుతుంది.

బ్రహ్మవైవర్తం బ్రహ్మ జీవితకాలం అష్టోత్తర శతవార్షికమని పేర్కొన్నది. బ్రహ్మ జీవితం శ్రీమహావిష్ణువుకు నిమేషకాలమవి కూడా ఇందులో వర్ణింపబడింది. ఇదే విషయాన్ని లింగపురాణం శైవ నిమేషకాలంగా అభివర్ణించింది. భాగవత తృతీయస్కంధం బ్రహ్మ జీవితకాలం నూటఇరవై సంవత్సరాలని నిర్ణయించింది.

అంత మాత్రంచేత పురాణాలన్నీ పుక్కిటి పురాణాలని అపార్థం చేసుకోకూడదు. ఈ విషయంలో భారతీయ విద్వాంసులకంటె పాశ్చాత్య పండితులే ఎక్కువ సానుభూతితో కృషిచేసి కళా కాష్ఠా ప్రమాణనిర్ణయంలో ఉన్న విభేదాలను గుర్తించారు. వీరిలో ఏషియాటిక్ రీసెర్చి పరిశోధన పత్రికలలో భారతీయ ఖగోళ శాస్త్రాధ్యయన ఫలితాలను ప్రకటించిన డేవిస్ మహాశయుడు అగ్రగణ్యుడు.

చతుర్యుగ సహస్రం బ్రహ్మవైవర్త కథనానుసారం 4,320,000 $\times$ 1000 = 4,320,000,000 సంవత్సరాలు. బ్రహ్మదివసం ఒక్కొక్క మన్వంతరానికి డెబ్బైఒక్క మహాయుగాల చొప్పున మొత్తం 4,320,000 $\times$ 71 $\times$ 14 = 4,294,080,000 సంవత్సరాలు. ఈ రెండు లెక్కలలో 25,920,000 ఏళ్ల అంతరం ఉన్నది. డేవిస్ ఈ సమస్యా పరిష్కరణకు సూర్య సిద్ధాంతం ఆధారంగా ప్రతిపాదించిన సంఖ్యాపరిమాణాన్ని బట్టి—మన్వంతరాల సంధికాలం మొత్తం ఆదియుగ ప్రమాణం — అంటే 4800 $\times$ 360 = 1,728,000 సంవత్సరాలు, కల్పసంధి మరొక 1,728,000 సంవత్సరాలు. దీన్నిబట్టి—చతుర్యుగం = 4,320,000 $\times$ 71 = 306,720,000 + 1,728,000 = 308,448,000 అన్నది మన్వంతర కాలం. దీనికి

నైమిత్తిక ప్రళయం

"మైత్రేయా! సంఖ్యాశాస్త్రంలో పద్దెనిమిది స్థానాలు కలిగిన మహాసంఖ్యకు పరార్థం అని పేరు.

పరార్థానికి రెట్టింపు సంఖ్య ద్విపరార్థికం. ఇది ప్రాకృత ప్రళయానికి అవధికాలం.

యోగనిద్రాముద్రితు డైన శ్రీమన్నారాయణుని సంకల్ప శక్తివలన అవ్యక్తంలో నుంచి వ్యక్తరూపాన్ని పొందిన భూతసృష్టి ప్రళయవేళలో మళ్లీ అవ్యక్తం లోనికి లీనమైపోతుంది.

చతుర్దశ గుణితం 308.408.000 × 14 = 4,318,272,000 + కల్పసంధి = 1,728,000 = మొత్తం 4,320,000,000 సంవత్సరాలు.

ఇంకొక విధానం ప్రకారం కల్పసంధిని తొలగించి ప్రతి మన్వంతరానికి 1,851,428 సంవత్సరాలను చేర్చడం ఉన్నది. ఇది పౌరాణికుల పరిగణనం. దీనిని బట్టి 4.320,000 × 71 = 306,720,000 + 1,851,428 = 308,571,428 సంవత్సరాలు మన్వంతర ప్రమాణం. దీన్ని చతుర్దశ గుణితం చేయగా వచ్చిన మొత్తం 4,319,999,992. పూర్వోక్తకాలానికి ఇది ఎనిమిది సంవత్సరాలు తక్కువౌతున్నది. ఈ విభేదాన్ని సరిచేయడానికి విష్ణుపురాణ వ్యాఖ్యాతలు అధిక మాసాలను గణించి 1,851,428 సంఖ్యకు మారుగా దేవమానంలో 5142 సంవత్సరాల 10 నెలల 8 రోజుల 4 ఘడియల 2 ముహూర్తాల 8 కళల 17 కాష్ఠలను చేర్చాలని నిర్ణయించారు. మనుష్య కాలమానంలో ఇది 1,851,428 సంవత్సరాల 6 నెలల 24 రోజుల 12 నాడుల 12 కళల 25 కాష్ఠల 10 నిమేషాలు. ఈ మొత్తాన్నిబట్టి బ్రహ్మదివసం సరిగ్గా 4.320,000,000 సంవత్సరా లవుతుంది. దీనికి రెట్టింపు అంటే 8,640.000,000 బ్రహ్మకు ఒక అహోరాత్రం. దీన్ని బట్టి బ్రహ్మ జీవితం 8,640,000,000 × 360 × 100 = 311,040,000,000,000 సంవత్సరాలు. దీన్నే ద్విపరార్థికం అంటారు. విష్ణుపురాణ కథనాన్ని బట్టి పరార్థ ప్రమాణం 155.520.000.000.000 సంవత్సరాలు. అయితే ఇది పంచదశ స్థానీయం. ఈ అధ్యాయంలో పరాశరుడు పేర్కొన్న దానిని బట్టి ఇది అష్టాదశస్థానికం. వాయుపురాణం కూడా పరార్థాన్ని పద్దెనిమిది స్థానాలతో పేర్కొన్న విషయం ముందే ఉదాహృతం. ఈ వ్యత్యాసాన్ని ఇంకా సమన్వయింపవలసి ఉన్నది. □

మనుష్యకాలమానంలో అన్నింటిలోకీ లఘుప్రమాణానికి మాత్ర అని పేరు. ఇది మానవులకు నిమేషం - అంటే - కనురెప్ప పాటు కాలం.

పదిహేను మాత్రలు ఒక కాష్ఠ. ముప్పై కాష్ఠలు ఒక కళ. పదిహేను కళల ప్రమాణం నాడిక.

నాడికా నిర్ణయానికి పన్నెండున్నర పలాల ఎత్తుగల రాగిగిన్నె అడుగున రంధ్రం చేసి నాలుగు మాషల బరువు, నాలుగు అంగుళల పొడవు కలిగిన బంగారు గొట్టాన్ని అతికి ఉంచాలి. ప్రస్థంలో గిన్నె నిండుగా మాగధమానంలో పదహారు పలాల నీటిని పోసి అది అడుగును చేరే సమయాన్ని లెక్కిస్తే ఒక నాడి అవుతుంది.*

రెండు నాడికలు ఒక ముహూర్తం. ముప్పై ముహూర్తాలు ఒక అహోరాత్రం.

ముప్పై అహోరాత్రాలు ఒక మాసం. పన్నెండు మాసాలు ఒక సంవత్సరం.

ఇది దేవతల కాలమానంలో ఒక అహోరాత్రం. ఇటువంటి మూడు వందల అరవై రెండు రోజులు ఒక దేవహాయనం.

పన్నెండువేల దేవహాయనాలు మనుష్య కాలమానంలో ఒక చతుర్యుగం. ఇటువంటి వేయి చతుర్యుగాలు బ్రహ్మకు ఒక దివస కాలం.

---

* నాడికాస్వరూపం భాగవతంలో ఇంతకంటె స్పష్టంగా వివరింపబడింది. పోతన అనువాదంలో—

"....దివసపరిమాణ విజ్ఞేయం బగు నాడికోన్మాన (ఉన్మానము = కొలపాత్ర) లక్షణం బెఱింగింతు. షట్పల తామ్రంబునం బాత్రంబు రచియించి, చతుర్మాష సువర్ణంబునం జతురంగుళాయామ శలాకంబుఁ గల్పించి, దానం దత్పాత్రమూలంబున ఛిద్రంబు గల్పించి, తచ్ఛిద్రంబునం బ్రస్థమాత్ర తోయంబు పరిపూర్ణం బొందునంత కాలం బొక్కనాడిక యగు ..." భాగ. (3-346)

బ్రహ్మ దివసకాలానికి కల్పం అని పేరు. ఒక్కొక్క కల్ప సమయంలో పధ్నాలుగుమంది మనువులు ప్రవర్తిల్లుతారు.

కల్పాంతంలో అతి భయానకమైన నైమిత్తికప్రళయం సంభవిస్తుంది.

చతుర్యుగసహస్రాంతంలో మహీతలం క్షీణప్రాయమవుతుంది. అప్పుడు అనావృష్టి ప్రబలి నూరు సంవత్సరా లుంటుంది. ఆ సమయంలో అసలే నిద్రాహారాలు లేక నీరసించి ఉన్న ప్రజలు క్షుత్పిపాసాపీడితులై అసంఖ్యాకంగా మరణిస్తారు.

అప్పుడు అవ్యయాత్ముడైన శ్రీమహావిష్ణువు రుద్రరూపధరుడై తన గర్భగోళంలో ప్రాదుర్భవించిన భూతజాతాన్ని తానే క్షయింపజేయాలని ఉద్యమించి, స్వార్భానుకిరణసప్తకాన్ని ఉగ్రతరంగా జ్వలింపజేసి బ్రహ్మాండకటాహంలో ప్రవహిస్తున్న జలాలను గ్రోలి పృథివీతలాన్ని శోషింపజేస్తాడు. ప్రాణిగత జలకణాలను, భూమిగతజలాలను సంపూర్ణంగా జ్వలనతాపానికి గురిచేసి నదులు, సముద్రాలు, శైలాలు, శైలప్రస్రవణాలలో ఉన్న జలాలను, పాతాళాంతర్గతజలాలను ద్యుమణికిరణాలు పీల్చివేస్తాయి.

ఈ విధంగా విశ్వాంతరాళం లోని సర్వతోయాలను ఆహారంగా స్వీకరించి సముపబృంహితమైన రశ్మిసప్తకం—ఆరాగం, భ్రాజం, పటలం, పతంగం, స్వమాభాక్కు, జ్యోతిష్మంతం, సవిభాసం—అనే ఏడు సూర్యగోళాలుగా విడిపోతుంది.

విశ్వాంతరాళం జలశూన్యమైనప్పుడు ప్రజ్వలించిన ప్రభాకరసప్తకం వలన ఉష్ణోగ్రత అధికమై పాతాళసహితంగా ముల్లోకాలూ దగ్ధమైపోతాయి.

అద్రులు, నదులు, అర్ణవాలు, అఖిలమూ దహింపబడి, నిర్దగ్ధవృక్షాంబువైన వసుంధరాగోళం కూర్మపృష్ఠాకారితమై పరిశేషిస్తుంది.

ఆ తర్వాత సర్వహరుడైన శ్రీహరి కాలాగ్నిరుద్రుడై ఆది శేషుని నిఃశ్వాసపవనాలలోనికి ప్రవేశించి, ఆ నిట్టూర్పుల వెంబడిని పాతాళలోకాన్ని భస్మీపటలం కావిస్తాడు.

పాతాళంలో రగుల్కొన్న ప్రళయానలం ఊర్ధ్వాభిముఖంగా అభివ్యాపించి భూమండలాన్ని స్పృశించి, సమస్త భూతలాన్ని భస్మావశేషంగా దహించివేస్తుంది.

విశ్వవిశ్వంభరాగోళంలో ప్రవర్తిల్లిన జ్వాలామాలా మహావర్తాలు వాతావరణం లోనికి అలముకొని స్వర్లోకం సమస్తమూ భస్మీభూతమౌతుంది.

ఆ విధంగా సర్వాన్తరితమై రగుల్కొన్న జ్వాలావర్త పరీవారంలో చరాచర భూతజాతం ఉపక్షీణించి త్రైలోక్యమండలం జ్వలన్మహాంబరీషం వలె ఏకాకృతికమై గోచరిస్తుంది.

భువర్లోక సువర్లోకాలు జ్వాలాపరీతాలైనాక, మహామహిమాన్వితులైన ఆ యా లోకవాసులు తమ తమ కర్తవ్య విధులను ముగించుకొని కృతాధికారులై మహర్లోకానికి నిర్గమిస్తారు.

స్వర్లోకం నుంచి పైకి లేచిన ప్రళయానలాభీల జ్వాలామాలికలు మహర్లోకాన్ని మహోగ్రతాపంలో తపింపజేస్తాయి.

మహర్లోకం కూడా తాపతప్తమైనాక దశవిధ భక్తి మార్గాలలో పరతత్త్వాన్ని ఉపాసించిన భక్తాగ్రేసరులు అక్కడి నుంచి జనలోకానికి ఊర్ధ్వాభిముఖంగా నిష్క్రమిస్తారు.

ఈ విధంగా జగత్సర్వస్వాన్ని భస్మీపటలం కావించి రుద్రరూపధరుడైన జనార్దనుడు తన నిఃశ్వాసపవనాల నుంచి మహాగజాకృతిలో ప్రళయమేఘాలను ఉపకల్పించి గగనమండలంలో ప్రవేశపెడతాడు.

నీలోత్పల శ్యామజీమూతాలు, సితపుండరీక నవాంబుదాలు, ధూమధూసరిత ధారాధరాలు, పీతవలాహకాలు, రాసభవర్ణాభ జలగర్భాలు, లాక్షారుణ భాస్వన్మేఘమాలికలు, వైడూర్యసంకాశ వారివాహాలు, ఇంద్రనీలోపమ కాలకాదంబినులు, శంఖకుందసుందర జలముజ్నికురంబకాలు, అంజనాసిత స్తనయిత్నువులు, ఇంద్రగోప రూపాంబుదాలు అయిన ఘన ఘనాఘనాలతో నభోమండలం చిత్ర విచిత్ర వర్ణాలంకృతమై నూత్న తేజోభిరామంగా విరాజిల్లుతుంది.

ఈ ప్రళయాంభోధరాలు వివిధ రమణీయ వర్ణ్యవర్ణాలలో వివిధ మనోహరాకృతులలో వ్యోమతలాన్ని వర్ణనీయంగా పరిపూర్ణించి అతిభైరవంగా అలముకొని ఉన్న అగ్నిజ్వాలలపై మహావర్షాన్ని కురిపించి తాపాన్ని ఉపశమింపజేస్తాయి.

త్రైలోక్యాంత విస్తృతమైన మహావైశ్వానర జ్వాలలు జలధారలతో చల్లారినదాకా ఈ వర్షధారలు నూరు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా కురుస్తూనే ఉంటాయి.

అక్షపరిమాణంలో కురిసిన ఈ వర్షాంబువులు చతుర్దశ భువన భాండాలను శీతలీకరించిన తర్వాత ప్రవాహరూపంలో ఉప్పొంగి ప్రపంచాన్ని ఆవర్తిస్తాయి.

విశ్వాంతరాళంలో రగుల్కొన్న అగ్నిజ్వాలలు ఉపశమించిన తర్వాత కాంతివిహీనమైన లోకాలు అంధకారబంధురాలై స్థావర జంగమాలు లేని నిస్సీమ శూన్యప్రదేశంలో శతవర్షాల మహావర్షం కురుస్తుంది.

ఈ విధంగా ప్రళయమేఘాలు వర్షించిన మహాజలాలు లోకత్రయాన్ని ముంచెత్తి భూతధాత్రి ఏకార్ణవమైనప్పుడు శ్రీమహావిష్ణువు ముఖనిఃశ్వాసాల నుంచి విద్యుద్వేగంతో వినిర్గమించిన మహాప్రభంజనాలు శత సంవత్సరాలు గగనాంతరాళంలో నిరంతరాయంగా ప్రళయమేఘాలను చెల్లాచెదరు చేస్తాయి.

అప్పుడు సర్వభూతమయుడు, సర్వభూతాత్మకుడు, సమస్త భూతభావనుడు, ఆదిపురుషుడు, అనాద్యంతస్వరూపుడు అయిన శ్రీమన్నారాయణుడు తన నిఃశ్వాస పవనోద్గత మహావాయువీచికలను ఉపసంహరించి, జనలోకాంతర్గతులైన సనక సనందన సనత్కుమార సనత్సుజాతాదులచే అభిష్టుతుడై ఏకార్ణవంలో శేషపర్యంకంపైన పవ్వళించి, బ్రహ్మలోకనివాసులైన ముముక్షువులు తనను గూర్చి ధ్యానిస్తూ ఉండగా, తాను స్వాత్మతేజోనిరతుడై, ఆత్మమాయామోహకల్పితమైన యోగనిద్రలో సమాస్థితుడౌతాడు.

బ్రహ్మరూపధరుడైన శ్రీమన్నారాయణుని యోగనిద్రకు నిమిత్త కారణంగా సంభవించిన ప్రతిసంచరానికి నైమిత్తిక ప్రళయం అని పేరు వచ్చింది.

ఈ విధంగా విశ్వాత్మకుడైన శ్రీ పుండరీకాక్షుడు రెప్ప విప్పార్చినప్పుడు జగజ్జాలం జాగరితమౌతుంది. ఆయన యోగనిద్రాముద్రితుడై నిమీలితనేత్రుడైనప్పుడు జగజ్జాలమూ నిమీలితమౌతుంది.

చతుర్యుగ సహస్రం బ్రహ్మదివసంగా ఉన్నప్పుడు భూతసృష్టి జరిగినట్లే, బ్రహ్మదేవుని రాత్రికాలంలో లోకాలన్నీ ప్రళయపయోధి జలాలలో మునిగిపోతాయి. రాత్ర్యంతంలో బ్రహ్మరూపధరుడైన శ్రీమహావిష్ణువు మేల్కాంచి బ్రహ్మదేవుని ద్వారా పునఃసృష్టికి ఉపక్రమిస్తాడు.

ప్రాకృతిక ప్రళయం

సృష్ట్యంతవేళలో శ్రీమహావిష్ణువు త్రైలోక్య భయాస్పదమైన అనావృష్టిని కల్పించి, ప్రళయాగ్ని శిఖలతో భువనత్రయం లోని మహదాది వికృతులను నిశ్శేషంగా శోషింపజేస్తాడు.

అప్పుడు సృష్ట్యుపసంహారం మొదలవుతుంది. భూమికి ప్రధాన గుణకమైన గంధతన్మాత్రను జలాలు పరిగ్రహిస్తాయి.

భూమండలం గంధవిలుప్తమైనాక సర్వమూ జలాత్మకంగా పరిణమిస్తుంది. ప్రళయకాల గర్జానిర్ఘోషాలతో మహాజలప్రళయం సంభవిస్తుంది.

అనంతరం ప్రళయాగ్నులు రగుల్కొని జలాలలోని రస తన్మాత్ర గుణాన్ని పరిగ్రహిస్తాయి. నెమ్మది నెమ్మదిగా విశ్వాంత రాళం అగ్ని తేజోనిబిడమై సమస్తలోకాలూ నిర్దగ్ధమైపోతాయి.

అప్పుడు వాయువులు అగ్నిలోని రూప తన్మాత్రగుణాన్ని పరిగ్రహించి మహాప్రభంజనాలు అగ్నిని ఆర్పివేస్తాయి. రూపతన్మాత్ర నశించి విశ్వాంతరాళం వాయుపూరితమై మహాంధకార బంధుర మౌతుంది. ఊర్ధ్వాధస్తిర్యగ్దిశలకు వ్యాపించి భీకరధ్వానాలతో వాయువు రోదసీకుహరాన్ని ఆక్రమిస్తుంది.

ఆ తర్వాత వాయువుకు తన్మాత్రగుణమైన స్పర్శాన్ని ఆకాశం పరిగ్రహిస్తుంది. స్పర్శ రూప రస గంధాలు లేని ఆకాశం కేవలం శబ్దగుణకమై ప్రతిభాసిస్తుంది.

ఆకాశానికి తన్మాత్రగుణమైన శబ్దాన్ని భూతేంద్రియాభి మానాత్మకమైన తామసస్థితి గ్రసిస్తుంది. ఆ భూతాదిని బుద్ధిలక్షణ లక్షితమైన మహద్వస్తువు పరిగ్రహిస్తుంది.

అప్పుడు బ్రహ్మాండకటాహాన్ని ఆవర్తించి ఉన్న సప్త ద్వీపాలు, సప్తలోకాలు, సప్తపర్వతాలలోని జలాలను అగ్ని, అగ్నిని వాయువు, వాయువును ఆకాశం, ఆకాశాన్ని భూతాది, భూతాదిని మహద్వస్తువు, మహద్వస్తువును ప్రకృతి గ్రహిస్తాయి.

ఆ విధంగా విశ్వానికి ప్రధాన పురుషుడైన శ్రీ వాసుదేవుని నుంచి ఉదయించిన సృష్టిక్రమం అవ్యక్తపురుషునిలో అంతర్భ

విస్తుంది. విశ్వానికి ప్రధాన కారణభూతమైన ప్రకృతితత్త్వం ఆయనలో విలీన మౌతుంది.

వ్యక్తావ్యక్తాలను తనలో విలీనం చేసికొన్న ఆ అవ్యక్త పురుషునికి నామజాత్యాది కల్పనలు అనువర్తించవు. ఏకస్వరూపుడు, విశుద్ధుడు, అక్షరుడు, నిత్యుడు, సర్వవ్యాపకుడు, సర్వభూతాత్మకుడు అయిన పరమాత్మకు అంశసంభవుడై ఆయన శుద్ధజ్ఞానమయునిగా, కేవల సత్తామాత్రునిగా గోచరీభూతు డవుతున్నాడు.

ఆ పరమాత్ముడే పరబ్రహ్మాత్మకుడు. బ్రహ్మ, ఈశ్వరుడు, పరాత్పరుడు, శబ్దబ్రహ్మవాచ్యుడు, శబ్దబ్రహ్మస్వరూపుడు—అన్నీ ఆయనే.

వ్యక్తావ్యక్తాత్మకమైన ప్రకృతి, పురుషుడు, ఉభయులూ ఆ పరమాత్మునిలో విలీన మౌతున్నారు.

ఆయనే పరతత్త్వం. ఆ మహాత్ముడే పరమేశ్వరుడు. సర్వానికి ఆధారం ఆయనే. ఆయననే వేదవేదాంతాలు విష్ణునామంతో సంకీర్తిస్తున్నాయి.

ఆ పరంధాముడు ప్రవృత్తి — నివృత్తులనే భేదాలతో ద్వివిధమై అలరారుతున్న వైదిక కర్మలచే యజ్ఞాధారితంగా ఆరాధింప బడుతున్నాడు.

ఋగ్యజుస్సామవేదాలు ప్రవృత్తిమార్గంలో ఆ పురుషోత్తముని, యజ్ఞపురుషుని, యజ్ఞేశ్వరునిగా సంభావిస్తున్నాయి.

జ్ఞానాత్మకుడు, జ్ఞానఫలదాత [illegible] జ్ఞానమూర్తిని జ్ఞానయోగజ్ఞులైన జ్ఞానులు నివృత్తి [illegible] ాధించి జ్ఞాన పరమార్థాన్ని పొందుతున్నారు.

ఆ మహాత్ముడు ప్ర [illegible] వాగ్విషయజాతానికి అతీతుడైన [illegible]

వ్యక్తుడు, అవ్యక్తుడు, పురుషుడు, పురుషోత్తముడు, పరాత్ముడు, పరమాత్ముడు, విశ్వాత్ముడు, విశ్వరూపధరుడు—అన్నీ ఆ మహానుభావుడే.

వ్యక్తావ్యక్తాత్మిక అయిన ప్రకృతి ఆయనలో విలీనమై, మళ్లీ ఆయనలో అభివ్యాప్త మౌతున్నది.

ఆయన కేశవుడు, మాధవుడు, ముకుందుడు, జనార్దనుడు, గోవిందుడు, వాసుదేవుడు, శ్రీహరి, శ్రీమన్నారాయణుడు, శ్రీమహావిష్ణువు.

ద్విపరార్ధికమైన కాలం శ్రీ వాసుదేవునికి ఒక అహస్సు. ప్రకృతి అవ్యక్తపురుషునిలో లీనమైనప్పుడు మళ్లీ ద్విపరార్ధిక పర్యంతమైన రాత్రి గతిస్తుంది.

కాని వాస్తవానికి ఈ అహోరాత్రివిభేదా లన్నీ నామరూపాత్మకమైన జగద్వ్యవహారాన్ని అనుసరించి ఏర్పడిన ఔపచారిక పరిగణనలే తప్ప సర్వాతీతుడైన ఆ పరాత్పరునికి అనువర్తించేవి కావు. ఆ పరమపురుషునికి ఆద్యంతాలను ఉపకల్పింపగలవీ కావు.

ఆత్యంతిక ప్రళయం

మైత్రేయా! నైమిత్తిక ప్రాకృతిక ప్రళయాల తర్వాత ఆత్యంతికప్రళయాన్ని నీకు వివరిస్తున్నాను.

లోకంలో మానవులకు ఆధ్యాత్మికం - ఆధిభౌతికం - ఆధిదైవికం అని త్రివిధ[illegible]కలుగుతున్నాయి. ఈ తాపత్రయ స్వరూపాన్ని గ్రహి[illegible]దయం కలిగిన జ్ఞానులకు మాత్రమే ఆత్యంతికలయం[illegible]

ఆధ్యా[illegible]రీరకం - మానసికం అని రెండు విధాలు.

శారీరకతాపాలు మానవులకు బహురూపాలలో కలుగుతున్నాయి.

శిరోరోగం, పీనసరోగం, శూలవ్యాధి, భగంధరం, రకరకాల జ్వరాలు, మూలవ్యాధి, గుల్మం, శ్వాసకాస, అక్షిరోగాలు, అతిసారం, కుష్ఠు, చర్మవ్యాధులు, అంటువ్యాధులు, ఇంకా అనేక రోగాలూ—ఇవన్నీ దేహజతాపాలు.

ఇక మానసికతాపాలు కూడా అనేకం. ఇవి శరీరవ్యాధులకన్నా దుర్భరమై శరీరాన్ని పీల్చి పిప్పిచేస్తాయి.

కామం - క్రోధం - భయం - ద్వేషం - మోహం - లోభం శోకం - విషాదం - అవమానం - అసూయ - ఈర్ష్య - మాత్సర్యం - శంక - చపలత్వం మొదలైనవి మానసికతాపాలు.

ఆధిభౌతికతాపాలంటే మానవులకు పరుల వల్ల కలిగే బాధలు.

మానవులకు మృగ పక్ష్యాదుల వల్ల, మనుష్య పిశాచ ఉరగ రాక్షస క్రిమికీటకాల వల్ల, ఇంకా శీతోష్ణాలు, ఎండవానలు, అతివృష్ట్యనావృష్టులు, ఉరుములు, మెరుపులు, మొదలైనవాని వల్ల కలిగే అన్ని బాధలూ ఆధిభౌతికతాపా లనబడుతున్నాయి.

దేహధారికి కలిగే కష్టాలు

మానవులకు జీవితకాలంలో ఈ తాపాలవల్ల కలిగే దుఃఖాలు అనంతం. స్త్రీపురుషుల సంయోగం మూలాన గర్భంలోనికి ప్రవేశించి జన్మధారణచేసి, జరావ్యాధులకు గురై, మృత్యువు పైబడినదాకా సంప్రాప్తించే దుఃఖాలు అసంఖ్యాకం.

పువ్వు రేకుల కన్నా అతి సుకుమారమైన శరీరంతో జీవి మాతృగర్భాన్ని ప్రవేశించాలి. మలమధ్యాన ఆ గర్భోదరాలలో ఇంకా కుదుటపడని పృష్ఠగ్రీవాస్థికలతో చాపచుట్టుకొని నివాసం చేయాలి. ఆ సమయంలో తల్లి భుజించిన క్షారలవణాలు, శీతోష్ణ

పదార్థాలు, చేదు వగరుల మధ్య పెరుగుతూ, నానారీతుల దుఃఖాలను ఓర్చుకొంటూ మృతప్రాయుని వలె బ్రతకాలి. కాళ్లు ముడుచుకోవాలన్నా, చాచుకోవాలన్నా వీలులేని ఇరుకుచోట మలమూత్రాలలో కొట్టుమిట్టుకులాడుతూ, చైతన్యం ఉన్నా ఊపిరాడక, తన జన్మధారణకు కారణమైన పూర్వ జన్మలను జ్ఞాపకం చేసుకొంటూ హీనాతిహీనంగా కాలం గడపాలి.

జన్మించే సమయంలో జీవి దేహాన్ని మూత్రపురీషాలు ఆవరించి ఉంటాయి. దుర్గంధపూరితమైన వీర్యబిందువులతో నిండిన యోనిద్వారం నుంచి ప్రాజాపత్య వాయువులు గర్భాశయాన్ని వెలికి త్రోసినపుడు అతిక్లేశంతో తల్లి కడుపునుంచి బయటపడి, బాహ్యవాయువులు సోకగానే మూర్ఛిల్లినపుడు విజ్ఞానభ్రంశం కలుగుతుంది. ముళ్లతో గుచ్చినట్లు, రంపాలతో కోసినట్లు, ఒళ్లంతా పచ్చిపుండై పేడపురుగులా నేలబడతాడు. ఒళ్లు గోక్కోవాలన్నా, ప్రక్కకు ఒత్తిగిలాలన్నా ఏమాత్రం వీలులేని దుర్దశ. ఎవరో వచ్చి అందిస్తేనే తప్ప స్తన్యపానానికి, ఆహారసంపాదనకు చేతకాని పరాధీన జీవితం. మలమూత్రాలతో నిండిన పడకలో పడుకొని, దోమలు కాటువేసినా, పురుగులు కుట్టినా నివారింపలేని నిస్సహాయస్థితి.

ఈ విధంగా జీవులకు కలిగే దుర్భరమైన జన్మదుఃఖాలు అనేకం ఉన్నాయి.

జన్మధారణకు పూర్వం జీవికి మాతృగర్భంలో ఎన్ని కష్టాలు ఉన్నాయో, జన్మించిన తర్వాత కలిగే కష్టాలు అంతకన్నా అధికం. పుట్టి పెరుగుతాడన్న మాటే కాని బాలుడై ఉన్నన్నాళ్లూ అజ్ఞానాంధకారంలో అలమటిస్తూ, మూఢుడై, నేనెవరిని? ఎక్కడినుంచి ఎందుకు ఈ లోకానికి వచ్చాను? ఏ బంధం నన్ను ఈ విధంగా బంధిస్తున్నది? దీనికి కారణం ఏమిటి? ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? నేను

ఏమి మాట్లాడాలి? ఏది మాట్లాడకూడదు? ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది గుణం? ఏది దోషం? అన్న స్వరూపజ్ఞానం లేక పశువు కన్నా హీనంగా జీవించాలి.

శిశ్నోదరపరాయణులైన మానవులకు అజ్ఞానప్రభవమైన దుఃఖం కంటె దుఃఖతరం వేరొకటి లేదు.

అజ్ఞానం, తామసం, అభావం అజ్ఞానులను కార్యారంభానికి ప్రోత్సహించి కర్మలోపానికి కారణా లవుతాయి.

కర్మలోపానికి ఫలితమే నరకం. అజ్ఞానులకు ఇహపరాలు రెండిటా నరకం తప్పదు.

యౌవనంలో తామసానికి లోనై నానావిధ దుష్కర్మల నాచరించి చిత్తశాంతి లేకుండా కాలం గడిపినప్పుడు రానున్న దుర్దినాల చిన్నెలు కానవచ్చినా, యుక్తాయుక్తవివేకంతో కర్తవ్యాకర్తవ్యాలను అనుశీలింపగల ఓరిమి ఉండదు.

ముసలితనం వచ్చేకొద్దీ జీవులకు దేహం జరాజర్జరితమై అవయవాలు పట్టుతప్పతాయి. పలితకేశాలు రాలిపోయి, పళ్లూడి, సత్తువలేక నేలకు జీరాడవలసి వస్తుంది. చర్మం వదులై ముడతలు పడి ఒళ్లంతా వ్రేలాడుతుండగా కలిగే ఆ బాధ భరించేవారికి మాత్రమే తెలుస్తుంది.

క్రమ క్రమంగా చూపు మందగించడం మొదలవుతుంది. దూరపు వస్తువులు కనిపించక అన్నింటికీ తడుముకోవలసి ఉంటుంది. ఆకాశంలోని తారకలన్నీ కనుపాపల్లో కనిపిస్తుంటాయి. నాసికా రంధ్రాల నుంచి రోమాలు పెరిగి వికృతరూపం చూడడానికి అసహ్యంగా కానుపిస్తుంది. శరీరం వణుకుతుంటుంది. కండలు కరిగి ఎముకలు బయటికి వచ్చినట్లు దేహం శిథిలప్రాయమౌతుంది. వీపు వంగి నడకకు ఆధారం అవసరమవుతుంది. ఆకలి మందగించి అన్నం

తినలేక, తిన్నది ఒంటబట్టించుకోలేక, నీరసం పెరుగుతుంది. నీరసం వల్ల నైరాశ్యం పెరిగి జీవితాశ నశిస్తుంది. కూర్చోలేక, నిల్చోలేక, కదలలేక, పరిగెత్తలేక పర్యంకస్థితుడై బహిఃప్రపంచానికి దూరం కావలసివస్తుంది.

ఆరోగ్యం క్షీణించే కొద్దీ మందదృష్టికి తోడై బాధిర్యం కూడా బాధిస్తుంది. నోటినుంచి లాలాజలం ఊరి ముప్పొద్దులా చొంగ కారుతుంటుంది. మాటలు, చేష్టలు అందరికీ జుగుప్సాకరంగా ఉంటాయి.

అన్నింటినీ మించినది ముసలితనంలో వచ్చే మతిమరుపు. జీవులు మరణోన్ముఖులైన వేళలో ఏదీ జ్ఞాపకానికి రాదు. ఆ క్షణాన జరిగినది మరుక్షణంలో మర్చిపోతారు. అనారోగ్యంవల్ల ఆయాసం పెరిగి నాలుగు మాటలు మాట్లాడడానికి, లేని సత్తువను కూడదీసుకోవలసి వస్తుంది. శ్వాసకాస చేరి ఊపిరిపీల్చడం భారంగా అనిపిస్తుంది. ఎప్పుడు చూసినా రొప్పుతూ, దగ్గరికి వెళ్ళడానికి వీలులేకుండా దగ్గుతూ, నలుగురూ చీదరించుతుంటే ఈ ముసలితనం పగవారికైనా రాకూడదు సుమా! అనిపిస్తుంది.

ఇంట్లో మూలన చేరి మూల్గుతూ మూలుగుతుంటే పిన్నలు, పెద్దలు, తరతమ భేదాలు లేకుండా అందరూ అనుక్షణం దెప్పి పొడుపు మాటలతో అవమానిస్తుంటారు.

దేహశౌచం మాటే జ్ఞాపకానికి రాదు. ఆహార విహారాల స్పృహ ఉండదు. బ్రతుకంతా పరిహాసాస్పదంగా పరిణమిస్తుంది. బంధువులు గడ్డిపోచకన్నా హీనంగా చులకన చేస్తారు.

అప్పుడు జీవికి తన యౌవనపు రోజులు జ్ఞాపకానికి వస్తాయి. స్వప్నావశేషాలుగా మిగిలిపోయిన ఆ మధురస్మృతులను నెమరువేసుకొని నిరాశగా నిట్టూరుస్తాడు. భరింపరాని విషాదంతో కన్నీరు మున్నీరవుతుంది.

ఆ తర్వాత మరణభయం మొదలవుతుంది. మృత్యువు ఉపసర్పిస్తున్న వేళలో దేహం శిథిలమై శ్లథగ్రీవం ముందుకు వాలిపోతుంది. కాళ్లూ చేతులూ వ్రేలాడుతున్నట్లు ఉంటాయి. శరీరం అలవుతప్పి కంపమాన మౌతుంటుంది. ఒక క్షణం గ్లానికి లోనైనట్లు, మరుక్షణం జ్ఞానోదయం కలుగుతున్నట్లు చిత్తవిభ్రాంతి ఏర్పడుతుంది. నేను సంపాదించిన హిరణ్యధాన్యాలు, ఐశ్వర్య భోగభాగ్యాలు, నా తనయులు—నా ఇల్లు—నా భార్య—నా వాళ్లు, వీళ్లంతా నేను వెళ్లిపోయాక ఎలా బ్రతుకుతారు? అని మమతాకులిత చేతస్కుడై నిరంతర దుఃఖంతో కాలం వెళ్లమారుస్తాడు.

కీళ్లనొప్పులు పట్టి పీడిస్తాయి. యమదూతల వంటి రోగాలు వచ్చి తగులుకొంటాయి. మర్మచ్ఛేదకాలైన వ్యాధులతో శరీరం క్రకచవిదారితమైనట్లు బాధాస్పదంగా విభాసిస్తుంది. గుడ్లు మిటకరించి, ఏదో కోల్పోయినవాడిలా నిర్జీవంగా శూన్యంలోకి చూస్తూ కరచరణాలు కదులుతున్నంత మేరకు మాత్రమే జీవించి ఉన్నట్లు కనుపిస్తాడు. పెదవులు ఎండిపోయి, గొంతు కీచుపడి నవ్వినా ఏడ్చినట్లు ఘుర్ఘురారవం వినవస్తుంది.

శూలాలతో గుచ్చి పెద్దపులి నోట్లోకి తోసినట్లు రోగబాధ తర్వాత అంతకన్నా దారుణమైన యమకింకరుల బాధ దాపురిస్తుంది.

మృతజీవికి నరకయాతనలు

మరణించిన తర్వాత జీవి స్థూలశరీరం నుంచి విముక్తిని పొందగానే దండధరదూతలు ప్రత్యక్షమౌతారు. జీవి యాతనా శరీరాన్ని భయంకరమైన కాలపాశాలతో బంధించి, దండతాడనలతో బాధిస్తున్నప్పుడు అతిమహోగ్రమైన మృత్యుకర్తృదర్శనం కలుగుతుంది. మృత్యుదూతలు అతనిని దక్షిణాభిముఖంగా మందుతున్న

ఇసుకలో నడిపిస్తూ వాలుకాయంత్ర—వహ్నియంత్ర—శస్త్రాదిభీషణ మైన దారులలో నరకానికి తీసుకొనివెళ్లి నరకకూపాల లోనికి పడ ద్రోస్తారు.

యాతనాదేహధారికి నరకంలో కలిగే యాతనలన్నీ అతి భయంకరమైనవి.

భూలోకంలో నరులు కావించిన పాపకర్మలకు ప్రతిఫలంగా నరకంలో ఘోరశిక్షలు విధింపబడతాయి. క్రకచధారలతో శరీరాన్ని త్రెవ్వగోసేవాళ్లు, చవిటినేలపై దొర్లించి నానావిధాల బాధించేవాళ్లు, ఒకచోట గొడ్డలితో తెగనరికేవాళ్లు, మరొకచోట నేలలో పాతిపెట్టేవాళ్లు, వీరందరూ యాతనాదేహధారులకు కల్పించే క్రూరహింసలు వర్ణనాతీతం.

ఒకచోట గృధ్రచుంచువులచే సంభక్ష్యమాణులు, వేరొకచోట పులినోట చిక్కి ఖండ ఖండాలుగా నమలబడుతున్నవాళ్లు, మరొకతావున తప్తతైలంలో కమిలిపోయినవాళ్లు, ఇంకొకచోట క్షారపంకంలో పడి బాధ భరించలేక హృదయవిదారకంగా రోదిస్తున్నవాళ్లు, ఎత్తుమీదినుంచి క్రిందికి విసరివేయబడినవాళ్లు, క్షేపయంత్రాల్లో పడి నలుగుతున్నవాళ్లు—ఎక్కడ చూసినా వేదనాదోధూయమానులే కనిపిస్తారు.

ఒక్కొక్క పాపానికి ఒక్కొక్క నరకం విధింపబడుతుంది. పరేతరాణ్ణిలయంలో పాపహేతూద్భవాలైన ఎన్ని నరకాలు ఉన్నవో లెక్కించటం అసాధ్యం.

ఈ దుఃఖాలన్నీ ఒక్క నరకంలో మాత్రమే ఉంటాయని అనుకోకూడదు. యాతనా దేహాన్ని విడిచి భోగశరీరంతో నాకలోకానికి వెళ్లినా, ఈ సుఖం ఎప్పుడు చేజారిపోతుందో నన్న భయంలో క్షణ క్షణమూ నరకప్రాయంగానే గతిస్తుంది.

భోగావధి పూర్తయినాక జీవులు మళ్లీ గర్భనివేశక్లేశాలను అనుభవిస్తారు. మళ్లీ జన్మధారణ చేసి, బాలభావం, యౌవనాధ్యాయం ముగిసిన తర్వాత వార్ధక్యం, మళ్లీ మరణం.

జీవించినంతకాలం జీవులకు నానావిధ దుఃఖాలతో ప్రత్తిగింజ నుంచి దారం వచ్చినట్లు ఒకదాని నుంచి ఒకటిగా కష్టాలు కలుగుతూనే ఉంటాయి. ద్రవ్యోత్పాదనం, ద్రవ్య నాశనం, ద్రవ్య పాలనం—వీటిలో సుఖం ఉన్నట్లు కనిపిస్తూనే దుఃఖాలు మిగిలిపోతాయి.

మానవుల దృగ్దర్శనాలకు ఏయే వస్తువులు ప్రీతికరంగా విభాసిస్తాయో అవే దుఃఖవృక్షానికి బీజాలని తెలుసుకోవాలి.

భార్య, పిల్లలు, బంధుమిత్ర పరివారం, ఇళ్లూ వాకిళ్లు, ధనధాన్యాలు సుఖదాయకాలుగా కనిపిస్తూనే దుఃఖగర్భితంగా పరిణమిస్తాయి.

సంసారదుఃఖమనే సూర్యాతపంలో సంతప్తచిత్తులైన మానవులకు విముక్తి పాదపచ్ఛాయ ఒక్కటే అమృతం. గర్భావాస జన్మజరాది క్లేశాలతో పరితపించిన పావనజీవనులకు త్రివిధ తాపవిమోచనమే ఆకాంక్షితవ్యం.

అందువల్ల ఉత్తములైనవారు జన్మమరణ చక్రభ్రమణాల నుంచి ఆత్యంతికలయాన్ని పొందడానికి ప్రయత్నించాలి. తత్ప్రాప్తి హేతువులైన కర్మలను ఆచరించాలి.

ఆగమోత్థం, వివేకోత్థం అని జ్ఞానం రెండు విధాలు. ఆగమోత్థితజ్ఞానమే శబ్దబ్రహ్మం. వివేకజనితమైనదానికి పరబ్రహ్మమని పేరు.

శ్రవణ మనన నిదిధ్యాసలతో కూడిన శబ్దబ్రహ్మవేత్తృత్వం అజ్ఞానమనే అంధకారంలో దీపం వంటిది. వివేకరూపమైన పరబ్రహ్మానుసంధానం సూర్యతేజం వలె స్వయంప్రకాశమానం.

ఈ సందర్భంలో వేదార్థనిర్ణయానికి మనువు చెప్పిన మాట లను మనం జ్ఞాపకం చేసుకోవాలి.

శబ్దబ్రహ్మం—పరబ్రహ్మం అని వేదితవ్యమైన వస్తువులలో శబ్దబ్రహ్మ నిష్ణాతుడు కానివాడు పరబ్రహ్మైక్య సంధానానికి అర్హుడు కాలేడు.

విద్యలు కూడా రెండు విధాలు. వీటిలో పరావిద్యచే అక్షర ప్రాప్తి కలుగుతున్నది. ఋగ్వేదాదులన్నీ అపరావిద్యలు.

పరబ్రహ్మమంటే — అవ్యక్తం, అజరామరం, అచింత్యం, అవ్యయం, అనాద్యంతం, అనిర్దేశ్యం, నామరూపోపాధి విరహితం, సర్వానుగతం, నిత్యం, అకారణం, సర్వవ్యాపకం, అవ్యాప్తం, సర్వ సర్వాత్మకం—అని బ్రహ్మవిదుల సిద్ధాంతం.

మోక్షాన్ని పొందగోరినవారు ఆ పరబ్రహ్మపదాన్ని ధ్యానం చేయాలి. శ్రుతివాక్యోదితమైన శ్రీమహావిష్ణు పరమపదాన్ని నిత్యమూ స్మరించాలి.

శ్రీ విష్ణుపదమే భగవద్వాచ్యమైన పరమాత్మస్వరూపం. భగవంతు డనేది ఆ అవ్యయాత్మునికి వాచకశబ్దం.

నిగమాగమాలకు గోచరింపని ఆ త్రయీమయాత్మకుని గోచ రింపజేసే తత్త్వజ్ఞానాన్ని సాధకులు సంపాదించాలి.

భగవంతుడు సగుణరూపంలో ప్రతిభాసించినా సహజనిర్గుణ స్వభావుడు. వాచామగోచరు డైన ఆ పరబ్రహ్మన్ని- భగవత్స్వ రూపునిగా ప్రతిష్ఠించి చేసే ఆరాధనలన్నీ ఔపచారికక్రియలే కాని నిర్గుణుడైన ఆయనకు ఉపపాదితవ్యాలు కావు.

సర్వకారణాలకూ కారణమైన భగవచ్ఛబ్దం నిత్యవిశుద్ధము, మహావిభూతిమంతమూ అయిన పరబ్రహ్మనికి వాచకశబ్దం. ఆ శబ్దం లోని ఆదిమవర్ణానికి భర్త, సంభర్త అని రెండు అర్థాలు.

గకారానికి నేత, నడిపించేవాడు, సృష్టికర్త అని అర్థాలున్నాయి.

సమగ్రమైన ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం—ఈ ఆరింటికీ భగ అని సమాహారవ్యవహారం.

వకారానికి సర్వభూతాల లోనూ పరిణిష్ఠితు డైన అవ్యయాత్ముడని అర్థం.

ఇన్ని భావనలకూ భవ్యభావను డైన భగవానుడని భావం. ఇది శ్రీ వాసుదేవ పరబ్రహ్మానికి తప్ప అన్యవస్తువులకు వర్తించదు.

భగవత్ శబ్దాన్ని పూజ్యపాదుడు అనే అర్థంలో ప్రయోగించడం కూడా ఉన్నది. అయితే పరిభాషాకృతమైన పరబ్రహ్మత్మ భావనం లౌకికవ్యక్తుల పట్ల గౌరవార్థంలో ఔపచారికంగా వినియుక్త మౌతుందే తప్ప యౌగికార్థంలో మనం వాడము.

జగత్సృష్టిస్థితిలయాలకు మూలకారణుడు, కారణకారణాత్మకుడు, అగతికులకు సుగతి, విద్యావిద్యావేది అయిన మహాత్మునికి భగవానుడని సంజ్ఞాకరణం.

ఏ ఒక్క దోషగుణమూ లేని అనంత జ్ఞాన - శక్తి - బల— ఐశ్వర్య - వీర్య - తేజోమయుడే భగవత్ శబ్దవాచ్యుడైన శ్రీ వాసుదేవుడు.

వాసుదేవ శబ్దార్థం

విశ్వాన్తరిత సచరాచరభూతజాతం ఏ సర్వాత్మకునియందు వసిస్తున్నదో ఆ పరంధాముడు శ్రీ వాసుదేవుడు.

పూర్వం కేశిధ్వజుడు ఖాండిక్యజనకునితో అన్నట్లు—''భూతజాతం ఆయనయందు వసింపగా ఆయన భూతాంతరాత్ముడై వారియందు వసిస్తున్న దైవతం.

జగత్తులకు ధాత, విధాత, సృష్టికర్త, సృష్టిసంరక్షకుడు, జగత్ప్రభువు వాసుదేవుడే.

ప్రకృతిని తనయందు విలీనం చేసికొని, తాను ప్రకృతి నివేశితుడై ప్రకృతి వికృతుల గుణదోషాలు రెండింటికీ ఆయన వ్యతీతుడు.

ఆవరణవిచ్ఛేదాలు లేకపోయినా ఆవరణగతుడై భువనాంతరాళంలో వసిస్తున్న వాసుదేవుడు సమస్తకళ్యాణగుణాత్మకుడు.

భూతవర్గాన్ని ఆవర్తించి ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండభాండం శ్రీవాసుదేవుని అనంత శక్త్యావరణలో లవలేశం కూడా కాజాలదు.

వాసుదేవుడు తన ఇచ్ఛామాత్రం చేత ఈ జగద్విగ్రహాన్ని పరికల్పిస్తాడు. తన కృపావీక్ష చేత జగత్తులను పరిపోషిస్తాడు.

అపురూపమైన మహాతేజోబలైశ్వర్యాలు, జ్ఞానవైరాగ్యశ్రీ విలాసాలు మూర్తీభవించిన ఆ పరాత్పరుడు సర్వలోకేశ్వరుడు, సర్వత్రానుగామి, భూతభవిష్యద్వర్తమానసాకల్యవేది, పరమేశ్వరుడు, పరాపరాత్మకుడు మొదలైన సంజ్ఞలచే సంజ్ఞితుడై, ఆ సంజ్ఞాకరణలకు అతీతుడై వెలుగొందుతున్న పరబ్రహ్మస్వరూపుడు.

ఆ వాసుదేవపరబ్రహ్మన్ని దర్శింప జేయగల జ్ఞానమే జ్ఞానం. దానికి దృగ్విషయం కాని విషయమే అజ్ఞానం.

శ్రీ పురుషోత్తముని సందర్శించే మార్గాలు రెండు : స్వాధ్యాయం — సంయమం.

స్వాధ్యాయం నుంచి మానవులు యోగాభ్యాసానికి, యోగాభ్యాసం నుంచి స్వాధ్యాయానికి ఉపచరించాలి. జపశ్రాంతిని పొందినవారు ధ్యానమగ్నులై, ధ్యానశ్రాంతిని పొందినప్పుడు జపనిమగ్నులై — ఈ జపధ్యానాభియోగంతో ఆత్మసాక్షాత్కారం పొందాలి. స్వాధ్యాయయోగసంపన్నులకు పరమాత్మతేజోదర్శనం సంప్రాప్తిస్తుంది.

బ్రహ్మతత్త్వానుసంధానానికి స్వాధ్యాయసంయమాలు రెండూ రెండు నేత్రాలు''

అంటున్న పరాశరమహర్షి వాక్ప్రవాహానికి అడ్డువస్తూ,

మైత్రేయుడు:—''మహాత్మా! శ్రీ పరమేశ్వర సాక్షాత్కారణ సాధనమైన యోగస్వరూపాన్ని నాకు విశదీకరించండి.'' అని అభ్యర్థించాడు.

పరాశరుడు:— మైత్రేయా! నీ ప్రశ్నకు సమాధానంగా కేశిధ్వజుడు ఖాండిక్యునికి బోధించిన యోగశాస్త్రాన్ని నీకు సంక్షిప్తంగా వివరిస్తాను.

మైత్రేయుడు:—బ్రహ్మస్వరూపా! మీరంటున్న ఆ కేశిధ్వజుడూ, ఖాండిక్యజనకుడూ ఎవరు? యోగశాస్త్రసంబంధమైన సంవాదం వారిరువురికీ ఎందుకు కలిగింది?

అని కోరగా పరాశరుడు ఈ విధంగా ప్రసంగించాడు.

కేశిధ్వజ ఖాండిక్యజనక సంవాదం

జనకవంశపు రాజులలో సుప్రసిద్ధుడైన ధర్మధ్వజునికి ఇద్దరు కొడుకులు—అమితధ్వజుడు, కృతధ్వజుడు జన్మించారు.

కృతధ్వజుడు తనకు వంశానుగతంగా సంక్రమించిన అధ్యాత్మ విద్యను అభ్యసించి సర్వకాల సర్వావస్థల లోనూ పరతత్త్వాన్ని ఉపాసించాడు.

కృతధ్వజుని కొడుకు జగద్విఖ్యాతుడైన కేశిధ్వజమహారాజు.

ధర్మధ్వజుని పెద్ద కొడుకుకు కూడా పుత్రుడు ఉదయించాడు. అతనికి ఖాండిక్యజనకుడని పేరు పెట్టారు.

ఖాండిక్యుడు కర్మమార్గాన్ని అవలంబించి అనేక యజ్ఞకర్మలను అనుష్ఠించాడు. అతని యశోదీధితులు దిగంతాలకు వ్యాపించి అమృతాంశుకిరణాలకు మెరుగులు దిద్దాయి.

కేశిధ్వజుడు తండ్రివలెనే అధ్యాత్మతత్త్వాన్ని ఉపాసించాడు. ఆత్మవిద్యావిశారదుడై జీవన్ముక్తిని పొందాడు.

జ్ఞాతివైరం వల్ల ఖాండిక్యకేశిధ్వజులకు పరస్పర సంఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఒకప్పుడు కేశిధ్వజుడు విక్రమించి ఖాండిక్య జనకుని పరాభవించి రాష్ట్రం నుంచి తరిమివేశాడు.

రాజ్యభ్రష్టుడైన ఖాండిక్యుడు మంత్రిపురోహిత పరివారం వెంటరాగా కొద్దిమంది ఆప్తులతో కలిసి అడవులకు పారిపోయాడు. కొన్నాళ్లకు అక్కడ కుదుటపడి, యథాప్రకారం యజ్ఞయాగాలను మొదలుపెట్టాడు.

బ్రహ్మజ్ఞానం కలిగిన మహాత్ములకు కర్మారంభంతో నిమిత్తం లేదు. ఆత్మజ్ఞానులకు కర్మాచరణలు విహితకర్తవ్యాలు కావు.

ఆత్మస్వరూపాన్ని విశదీకరించిన ఆచార్యులందరూ ఆత్మ కర్మ ఫలసాధనాలకు విదూరమని స్పష్టంగా నిరూపించారు. ఉత్పాద్యం, ఆప్యం, వికార్యం, సంస్కార్యం అని చెప్పబడిన కర్మవిభాగం ఆత్మోపలబ్ధికి సాధనం కాదు. అందుచేత జ్ఞానులు కర్మాచరణకు ఉపక్రమింపరు. పూర్వవాసనలు ఉత్తరోత్తర జన్మధారణకు కారణమౌతాయని గ్రహించిన ఆత్మవిదులు పాపపుణ్యాలు రెండింటికీ దూరవర్తులై జ్ఞానవహ్నిలో సంచితకర్మలను క్షయింపజేసికొంటారు. ప్రారబ్ధకర్మ తీరినంతదాకా దేహధారణం తప్పదని గుర్తించి జీవన్ముక్తులై బ్రహ్మభూయాన్ని పొందుతారు.

బ్రహ్మజ్ఞానానికి కర్మాచరణలు ఆవశ్యకం కాదని తెలియని ఖాండిక్యజనకుడు అనేక యజ్ఞకర్మలను అనుష్ఠించాడు. అగాధమైన బ్రహ్మవిద్యామహార్ణవాన్ని తరించడానికి అవిద్యానౌకను అధిరోహించాడు. అవిద్యాప్రయుక్త నిష్ఫలసాధనాలతో మృత్యువును జయించగలనని ఆకాంక్షించాడు

ఇలా కొన్నాళ్లు గడిచిన తర్వాత యోగనిష్ఠాగరిష్ఠు డైన కేశిధ్వజమహారాజు ఒక యాగాన్ని సంకల్పించి సవనదీక్షలో ఉండగా ఒక పెద్దపులి ఆయన వనంలోని ధర్మధేనువు పైకురికి అక్కడి కక్కడే దానిని కబళించివేసింది.

హతధేనువృత్తాంతం తెలిసి కేశిధ్వజుడు హతాశుడై ఋత్విజులను రావించి, "నా రక్షణలో ఉన్న హోమధేనువును విజనోద్యాన వనంలో ఒక శార్దూలం వచ్చి పొట్టన బెట్టుకొన్నది. ఇందుకు ప్రాయశ్చిత్తం ఏమిటో ఉపదేశించండి" అని వారిని కర్తవ్యోపబోధకై సంప్రార్థించాడు.

ఋత్విజులు, "రాజా! అభూతపూర్వమైన ఈ ఘటనకు ప్రాయశ్చిత్తవిధానం మాకు తెలియదు. ఈ విషయమై కశేరుడు మీకు సహాయపడవచ్చు" అని విన్నవించుకొన్నారు.

కశేరునికి కూడా సమాధానం తెలియలేదు. అతను తన నిస్సహాయతను వెల్లడించి, రాజును శునకుని వద్దకు పంపించాడు.

శునకుడు సైతం కశేరుని వలెనే సమాధానం తనకు తెలియదని చెప్పి, "ఓ రాజా! లోకంలో ఈ సందేహాన్ని నివారింపగల వారు నీచే పరాజితు డైన నీ శత్రువు ఖాండిక్యుడు తప్ప వేరెవరూ లేరు" అని ఉపదేశించాడు.

ఆ మాటవిని కేశిధ్వజుడు అరణ్యానికి బయలుదేరాడు. శునకమహర్షికి నమస్కరించి, "ధర్మసంశయ నివృత్తికై నేను నా శత్రువు దగ్గరకు వెళ్తాను. అతను వైరశుద్ధిని కోరి నన్ను చంపినట్లయితే, యాగదీక్షలో ఉన్న నాకు సద్యఃఫలనిర్వృతి కలుగుతుంది. అలా కాక అతను నా ప్రశ్నకు సమాధానం చెప్పినట్లయితే యాగం నిర్విఘ్నంగా నెరవేరుతుంది. ఈ రెండింటిలో ఏది జరిగినా నాకు సమ్మతమే!" అని పలికి, యాగదీక్షితుని వలెనే కృష్ణాజినాన్ని ధరించి శాత్రవనిలయానికి వెళ్లాడు.

దూరాన్నుంచి వచ్చి తనను సమీపిస్తున్న ఆగర్భశత్రువు రూపురేకలను గుర్తుపట్టగానే ఖాండిక్యుడు క్రోధతామ్రాక్షుడై ధనుర్బాణాలను గైకొని యుద్ధానికి సిద్ధంగా సమారోపిత కార్ముకుడై నిలబడ్డాడు.

"ఓరీ గోముఖవ్యాఘ్రమా! నువ్వు జింకచర్మం ధరించినంత మాత్రాన నన్ను చంపడానికి వచ్చావని తెలియనంత మూర్ఖుడిని కాను. నువ్వు కట్టుకొన్న ఆ చర్మాన్ని సంపాదించడానికి నోరులేని కృష్ణమృగాన్ని ఏవిధంగా శితసాయకాలతో హతమార్చావో, ఆ విధంగానే నిన్ను చంపి నా పగ చల్లార్చుకొంటాను. నా రాజ్యాన్ని కొల్లగొట్టిన నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టను. చేతనైతే కాచుకో" అని గర్జానిర్ఘోషాలతో హుంకరించాడు.

ప్రతీకారవాంఛారుణితనేత్రాలలో నిప్పులు కురిపిస్తున్న ఖాండిక్యుని చూసి కేశిధ్వజుడు శాంతస్వాంతుడై ప్రసంగించాడు—

"ఖాండిక్యా! నేను నిన్ను సంహరించడానికి రాలేదు. యాగమధ్యంలో కలిగిన సందేహనివారణకై నిన్ను అన్వేషిస్తూ ఇంత దూరం వచ్చాను. ముందు నీ కోపాన్ని, ఆ ధనుర్బాణాలను ఉపసంహరించు!" అని నచ్చజెప్పాడు.

కేశిధ్వజుని మాటలను విని ఖాండిక్యుడు మంత్రి పురోహితులతో సమావేశమై, ఇటువంటి పరిస్థితులలో ఏమి చేయాలో వితర్కించాడు. వారందరూ చక్కగా యోచించి, నిరాయుధుడై చేతికి చిక్కిన శత్రువును సంహరించి, రాజ్యాన్ని మళ్లీ వశపరచుకోవడం శ్రేయస్కరమని రాజుకు ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని నొక్కి చెప్పారు.

అయితే ఖాండిక్యుడు వారి మాటలతో ఏకీభవించలేదు.

"మీరన్నట్లు ఇతనిని వధిస్తే నాకు సర్వసర్వంసహామండలమూ నిరాయాసంగా లభించే మాట నిజమే. అంతేకాదు. ఇది నిమిత్తంగా ఇహం నాకూ, పరం అతనికీ దక్కుతాయి. నవనదీక్షా దక్షుడై అతను పరలోక జయాన్ని సాధిస్తాడు. అల్పకాలభోగ్యమైన ఈ వసుంధరను అతనికి విడిచిపెట్టి, శాశ్వతమైన పరలోక విజయాన్ని నేను చూరగొంటాను. అతని ప్రశ్నకు సమాధానం చెప్పి పంపించడమే ఉత్తమకర్తవ్యం" అన్నాడు.

ఈ విధంగా నిర్ణయించిన తర్వాత ఖాండిక్యుడు కేశిధ్వజుని వద్దకు వెళ్లి, అతని సందేహాన్ని తెలిసికొనగోరాడు. రాజు అతనికి హోమధేను వృత్తాంతాన్ని వివరించి, తద్గతప్రాయశ్చిత్తాన్ని గురించి ప్రశ్నించాడు. ఖాండిక్యుడు అతని సంశయనిరాసకంగా తగిన సమాధానాన్ని ప్రమాణవిమర్శలతో వివరించి చెప్పాడు.

సందేహనివృత్త్యనంతరం కేశిధ్వజుడు జ్ఞాతిచే అనుజ్ఞాతుడై యాగభూమికి తిరిగి వెళ్లాడు. శేషకృత్యాన్ని యథాక్రమంగా నిర్వర్తించి, యాగం పరిసమాప్తమైనాక అవభృథస్నానం చేశాడు. ఋత్విజులకు, అర్థార్థులకు, అందరికీ భూరిదక్షిణల నిచ్చి భూతతృప్తిని ఘటింపజేశాడు.

యాగం నిర్విఘ్నంగా ముగిసినప్పటికీ కేశిధ్వజుని మనస్సులో ఏదో తీరని వెలితి మాత్రం అలాగే మిగిలిపోయింది. ఆ విషయమై అతను బాగా సూక్ష్మంగా ఆలోచించిన తర్వాత అతనికి తన తప్పిదం తెలిసివచ్చింది. ప్రాయశ్చిత్తవిధిని ఉపదేశించిన ఖాండిక్యునికి గురుదక్షిణను సమర్పింపలేదని జ్ఞప్తికి రాగానే అతను వెంటనే రథాన్ని అధిరోహించి మళ్లీ అరణ్యానికి వెళ్లాడు.

రెండవసారి తన అంతికానికి వచ్చిన శత్రువును చూసి ఖాండిక్యుడు ధృతాయుధుడై కృతోత్సాహంతో అతనికి ఎదురు

నిలిచాడు. కేశిధ్వజుడు అతనిని వినయపూర్వకంగా అపవారించి, "నాయందు ఆగ్రహింపవద్దు. భవత్సాహాయ్యం వలన యాగం నిర్విఘ్నంగా ముగిసింది. ఉపదేశాంతంలో గురువుకు విద్యానిష్క్రియాన్ని సమర్పించటానికి కృతజ్ఞతతో ఇక్కడికి వచ్చాను" అని వినివేదించాడు.

ఖాండిక్యుడు మళ్లీ తన మంత్రిపురోహితులతో సమావేశమై గురుదక్షిణగా ఏమి కోరితే బాగుంటుందో ఆలోచించాడు. వారందరూ కర్తవ్యాలోచన చేసి, రక్తపాతం లేకుండా రాజ్యాన్ని కోరినట్లయితే సముచితంగా ఉంటుందని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. అతను వారి మాటలకు నవ్వి, "స్వల్పకాలికమైన మహీరాజ్యానికి ఆశపడి నన్ను అధోగతికి దిగజారమంటున్నారు. మీరందరూ అర్థసాధన మంత్రాంగంలో సమర్థులే కాని, పరమార్థ వివేకంలో విచక్షణులు కారు" అని ప్రవచించి, అక్కడి నుంచి కేశిధ్వజుని వద్దకు వెళ్లాడు.

ఖాండిక్యుడు:—అయ్యా! నేను కోరిన గురుదక్షిణను ఇవ్వడం నీకు సమ్మతమేనా?

కేశిధ్వజుడు:—ముమ్మాటికీ సమ్మతమే. నీవు కావించిన ఉపకారానికి కృతజ్ఞుడనై నేను నీ వద్దకు ఎంతో సంతోషంతో వచ్చి నిలిచాను. నీవు ఏమి కోరినా నాకు అంగీకారమే.

ఖాండిక్యుడు:—అయ్యా! నీవు అధ్యాత్మవిద్యా విశారదుడవు. నీ వెరుగని పరతత్త్వరహస్యాలు లేవు. గురు నిష్క్రియాన్ని సమర్పించడమే నిజంగా నీ అభిమతం అయితే నాకు మోక్షనిరూఢమైన యోగమార్గాన్ని ఉపదేశించు.

ఖాండిక్యుని అభ్యర్థనకు రాజు తెల్లపోయి, నిరుత్తరుడైనాడు. "ఆర్యా! క్షత్రియులకు అత్యంత ప్రీతికరమైన రాజ్యాన్ని కోరుకొనక ఈవిధంగా యోగవిద్యను ఎందుకు అడిగావు?" అని ప్రశ్నించాడు.

రాజు మాటలకు సమాధానంగా ఖాండిక్యుడు తన మనోగతాన్ని వెల్లడించాడు.

"కేశిధ్వజా! లోకంలో క్షత్రియులైనవారికి ప్రజాపరిపాలనం, ధర్మయుద్ధంలో శత్రుసంహారం అన్నవి విహితకర్తవ్యాలు. నేను కాపాడలేకపోయిన రాజ్యం నా నుంచి అపహృతమైనందుకు నాకు చింతలేదు. పైగా బంధహేతువైన వస్తువును కోల్పోవడంతో నాకు అవిద్యానాశనానికి అవకాశం లభించింది. నేను జన్మించినపుడు పైతృకంగా సంక్రమించిన ఈ రాజ్యం నాది కనుక జన్మోపభోగలిప్సార్థం నాకు రాజ్యకాంక్ష ఉండేది. అయితే ఉత్తములైన క్షత్రియులు యాచనకు దిగజారటాన్ని అభియుక్తులు అంగీకరింపరు. అందుచేతనే నేను నిన్ను రాజ్యదానం చేయమని కోరలేదు. మమత్వాహతచిత్తులై అహంమాన మహాపాన మదమత్తులైనవారికి కావలసిన రాజ్యభోగం నాకు అక్కరలేదు."

ఖాండిక్యజనకుని పలుకులకు కేశిధ్వజుడు ప్రహృష్టస్వాంతుడై అతనితో ప్రీతిపూర్వకంగా సంభాషించాడు.

యోగవిద్యోపదేశం

"క్షత్రియకులనందనా! నీవు కోరిన యోగవిద్యా స్వరూపావగాహనకు భూమికగా అవిద్యాస్వరూపాన్ని గురించి తెలుసుకోవాలి.

క్లేశ - కర్మ - విపాక - ఆశయాలచేత అపరామృష్ట పురుషుడే పురుషోత్తముడైన శ్రీ పుండరీకాక్షుడు.

సాధారణంగా మానవు లందరూ క్లేశాదియుక్తులు. అవిద్య - అస్మిత - రాగ - ద్వేష - అభినివేశాలనే భేదాలతో ఈ క్లేశం అయిదు విధాలు.

అవిద్య అంటే మిథ్యాజ్ఞానమని అర్థం. అనాత్మ వస్తువు లైన శరీరాదులలో ఆత్మారోపణం, అస్వభావాలలో స్వభావ కల్పనం అవిద్యాలక్షణాలు. లోకంలో సర్వానర్థాలకు బీజభూతమైన ఈ అవిద్య జీవులను వర్ణాశ్రమవిహిత కర్మానుష్ఠానాలకు ప్రేరేపించి మోహకూపం లోనికి ప్రవేశపెడుతున్నది. వాసనారూప పునర్జన్మలకు హేతుభూతమైన ప్రారబ్ధకర్మాన్ని తప్పించుకోవాలని అవిద్యామోహితులు పుణ్యకర్మాచరణకు ఎగబ్రాకుతారు. యజ్ఞ కర్మలను ఆచరిస్తే వచ్చే పుణ్యం ఆత్యంతికమైన మోక్షఫలాన్ని సాధింపలేదని తెలియక ప్రత్యక్షఫలానుభవాన్ని ఆశిస్తారు.

పంచభూతాత్మకమైన దేహాన్ని ఆత్మగా భ్రమించి, మోహాంధకారంలో చిక్కుకొన్న అవివేకులు—"ఈ దేహమే నేను" అని అవిద్యామోహితు లవుతారు. పృథక్కరణలచే వేర్వేరుగా కానవస్తున్న పృథివ్యాకాశవాయ్వగ్నిజలాలలో అపృథగ్రూపమైన ఆత్మస్వరూపాన్ని అధ్యారోపించి, అనాత్మ వస్తువులలో ఆత్మభావన కావిస్తారు.

లోకంలో అనుభవ్యమానహేతుకాలైన గృహక్షేత్రాది రూపభోగాలన్నీ దేహధారులకు కేవలం శరీరోపభోగ్యవిషయాలే తప్ప శాశ్వతభోగాలు కావు. అయినా, "ఇది శాశ్వతంగా నాది" అని చిత్తవిభ్రాంతిని పొందుతున్నట్లే మిథ్యాజ్ఞానలక్షణం వలన జీవులు ఉపాధిభూతమైనదే ఆత్మ అని పొరబడతారు. ఆ దేహ సంయోగం వలన ఉదయించిన పుత్రపౌత్రాదులందు అనాత్మ విషయమైన స్వామ్యభావాన్ని పెంపొందించుకొంటారు.

మానవులు ఆచరించే కర్మలన్నీ దేహోపభోగ్యమైన సుఖాలకు ప్రేరేపకాలు. వీటివల్ల బంధం పెరుగుతుందే కాని తరగదు.

మృణ్మయమైన గేహాన్ని మృత్తికాంభస్సులతో చేర్చి నిలబెట్టినట్లు పార్థివమైన దేహాన్ని మృదన్నాలేపనలతో పరిపోషిస్తున్నాము. పంచభూతాత్మక దేహాన్ని పాంచభౌతికభోగాలతో సుఖపెట్టాలనుకోవడం ఉన్నదే.

అనేకసహస్రజన్మలుగా మానవులు సంసారచక్రంలో పరిభ్రమించి, వాసనారేణుకుంఠితులై మోహాశ్రమాన్ని పొందుతున్నారు. కంటిలో పడిన ధూళికణాలను నీటితో కడిగివేసినట్లు వాసనారేణువులను జ్ఞానమనే ఉష్ణజలాలతో ప్రక్షాళింపగలవారు మోహాశ్రమం ఉపశమించి, స్వస్థులై, నిర్వాణపదాన్ని అధిగమిస్తారు.

దుఃఖం, అజ్ఞానం మొదలైన మలినధర్మాలు ప్రకృతికి సంబంధించినవి. నిర్ధర్మకమైన ఆత్మకు ఈ లక్షణాలు అనువర్తించవు.

జ్ఞానోత్పత్తికారణం మనస్సు. మనస్సుయొక్క స్థితికి కారణం పురుషార్థం. శరీరస్థితికికారణం ఆహారం. జ్ఞానమూలకం కాని విషయాంతరం మనస్సుకు వికారకారణం. పరస్పర విరుద్ధధర్మాలు కలిగిన జలాగ్నులకు సంసర్గం సాధ్యం కాకపోయినా నడుమ గిన్నె ఉన్నప్పుడు స్థాలీగత జలాలు ఉష్ణప్రభావానికి లోనైనట్లు ప్రకృతి సంసర్గం వలన ఆత్మయందు ప్రకృతిధర్మాలు అధ్యారోపింపబడుతున్నాయి.

అవిద్యాకల్పితమైన పరిచ్ఛిన్నాత్మభావాన్ని క్షయింపజేయగల సాధనాలలో యోగజ్ఞానం సర్వోత్తమమైనది'' అని పలికిన కేశిధ్వజమహారాజును ఖాండిక్యుడు—

''మహాత్మా! నిమివంశీయులలో యోగవిదగ్రేసరుడవైన నీకంటె యోగస్వరూపాన్ని బోధింపగల సమర్థులు ఈ లోకంలో

వేరే ఎవరున్నారు? దయతో నాకు యోగశాస్త్రాన్ని ఉపదేశించి నన్ను కృతార్థుని కావించు'' అని ప్రార్థించాడు. ఆతని పరిప్రశ్నకు సమాధానంగా కేశిధ్వజుడు బ్రహ్మలయాపాదకమైన యోగ స్వరూపాన్ని ప్రబోధించాడు:

యోగశబ్దార్థ నిరూపణం

''బంధమోక్షాలు రెండింటికీ మనస్సే కారణం. విషయాసక్తులైనవారికి బంధం, నిర్విషయులకు మోక్షం మనోమూలకంగా సంప్రాప్తిస్తాయి.

బ్రహ్మతత్పరులు మనస్సును విషయాసక్తుల నుంచి మరల్చి, మోక్షోపలబ్ధికై బ్రహ్మభావనను కావించాలి. ఇనుము సూదంటు రాతికి వశమైనట్లు ఆత్మభావనులకు బ్రహ్మభావనం సహజంగానే అలవడుతుంది.

ఆత్మప్రయత్నసాపేక్షమై, అత్యంతవిశిష్టమైన మనోగతికి బ్రహ్మంతో కలిగే సంయోగానికే యోగమని యోగవిదుల నిర్వచనం.

అత్యంతవిశిష్టమైన ఈ కర్మోపలక్షణయందు నిరతులైనవారే యోగులు. వీరినే ముముక్షువులని అంటారు.

బ్రహ్మైక్యసాధనకోసం యోగవిద్యాధ్యయనం మొదలు పెట్టిన అభ్యాసకులకు యుంజానులని పేరు. ఇందులో సమాధిస్థితిని సాధించి బ్రహ్మోపలబ్ధిని పొందినవారే బ్రహ్మజ్ఞానులు.

యోగనిరతులకు ఈ జన్మలో అంతరాయం కలిగి ముక్తి పదం చేకూరకపోతే వాసనాఫలభుక్తి వల్ల ఉత్తర జన్మలలో తప్పక సంప్రాప్తిస్తుంది.

కర్మచయాన్ని యోగాగ్నిలో దహింపజేసి యోగవిద్యను సాధింపదలచినవారు నిష్కాములై యమనియమాలను అభ్యసించాలి.

అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం— ఇవి అయిదూ యమసంజ్ఞితాలు.

బాహ్యాభ్యంతర శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం—ఇవి అయిదూ నియమసంజ్ఞితాలు.

ఈ యమనియమాలు కామ్యకాములకు విశిష్ట ఫలాలను, నిష్కాములకు ఆత్యంతిక ఫలాన్ని ప్రసాదిస్తాయి.

యోగవిదులు భద్రాసనాసీనులై యమనియమోపేతంగా యోగధ్యానం చేయాలి. ఇతర ఆసనాలను అభ్యసించాలి. మనస్సును బంధవిషయాల నుంచి మరల్చి పరబ్రహ్మతత్త్వాన్ని అనుసంధించాలి. పూరక కుంభక రేచకాలతో ప్రాణాయామాన్ని అభ్యసించి ప్రాణవాయువును స్వాధీనపరచుకోవాలి. యోగాభ్యాసవశాన పరతత్త్వ యోగసిద్ధిని సాధించాలి.

ప్రాణాయామం బ్రహ్మతత్త్వసిద్ధికి బీజావాపనం. అందుచేతనే యోగశాస్త్రపరిభాషలో దీనికి బీజమని సంకేతం ఏర్పడింది.

ఊర్ధ్వముఖమైన ప్రాణవాయువు, అధోముఖంగా సంచరించే అపానవాయువు పరస్పరాభిభవం కాకుండా అనిలసంచారాన్ని స్వేచ్ఛాగతిని నియమింపగలగాలి. ఈ విధానాన్ని ఆలంబనయోగం అని వ్యవహరిస్తారు. అభ్యాసవశాన ఇంద్రియానురక్తమైన హృదయాన్ని పరమపురుషాలంబనతో బ్రహ్మభావనామయం చేసుకోవాలి.

యోగసాధకులకు చిత్తచాంచల్యం సర్వానురోధకం. అందుచేత ప్రాణాయామంతో ప్రాణవాయువులను, ప్రత్యాహారంతో ఇంద్రియాలను వశపరచుకొని స్థిరచిత్తంతో శుభాశ్రయాన్ని సంపాదించాలి.

ఈ యోగాలన్నీ పరమపావనుడైన శ్రీ వాసుదేవుని స్థూలరూపాలు. వీటి స్వరూపగ్రహణం కలుగనివారికి శ్రీహరి సూక్ష్మరూపం అవగాహన కాదు''

అని కేశిధ్వజుడు పలుకగా, ఖాండిక్యుడు—"దోషసముద్భవమైన మనస్సుకు శుభాశ్రయం ఏవిధంగా చేకూరుతుంది?" అని ప్రశ్నించాడు.

భావనాత్రయ వివరణం

"మనస్సుకు ఆశ్రయభూతమైన పరబ్రహ్మం మూర్తామూర్త భేదాలతో రెండు విధాలుగా ఉన్నది. వాసుదేవుని స్థూలసూక్ష్మ రూపాలను తెలుసుకొనగోరిన సాధకులు త్రివిధభావనలతో అపరాపరాఖ్యతత్త్వాన్ని అవగతం చేసుకోవాలి.

భావనలు మూడు విధాలు: బ్రహ్మభావన, కర్మభావన, బ్రహ్మకర్మభావన.

సనందనాది బ్రహ్మణ్యు లందరూ నిరంతర బ్రహ్మభావనాతత్పరులు. దేవతలు, స్థావర జంగమాత్మక భూతజాతం కర్మభావనాతత్పరులు. బ్రహ్మనిత్యత్వభావనతో బోధాధికారయుక్తులై కర్తృత్వనియూఢి కలిగిన హిరణ్యగర్భాదులు బ్రహ్మకర్మభావనులు.

ప్రత్యస్తమిత భేదస్వరూపమూ, సత్తామాత్రగోచరమూ, ఆత్మసంవేద్యమూ అయిన జ్ఞానమే బ్రహ్మసంజ్ఞితం. అభవుడు, అక్షరుడు, అరూపుడు, విశ్వరూపుడు అయిన శ్రీమహావిష్ణువుతో ఐక్యానుసంధానమే బ్రహ్మభావనాఫలం.

యోగసాధకులకు ప్రారంభదశలో శ్రీహరి సూక్ష్మరూపం ధ్యానగోచరం కాదు. అందువలన వారు విశ్వగోచరమైన స్థూలరూపాన్ని వాసుదేవాత్మకంగా ధ్యానించాలి. హిరణ్యగర్భుడు, దేవేంద్రుడు, ప్రజాపతులు, మరుత్తులు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు, తారకా గ్రహనక్షత్రాలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, దైత్యులు, దానవులు, సకలదేవతలు, మనుష్యులు, పశువులు, పక్షులు, వృక్షాలు, సముద్రాలు, పర్వతాలు, నదీనదాలు, చేతనా చేత

నాత్మకమైన భూతజాతం, ఏకపాదులు, ద్విపాదులు, బహుపాదులు, అపాదులు, అన్నీ భావనాత్రయాత్మకుడైన శ్రీహరి మూర్తిభేదాలే నని గుర్తించి, అన్నింటిలోనూ హరి తాదాత్మ్యభావన చేయాలి.

ఈ సమస్తవిశ్వమూ, చరాచర జగజ్జాతమూ పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీమహావిష్ణు శక్తిసమన్వితం.

ఆయన శక్తి పరాసంజ్ఞితం. అపరాసంజ్ఞ క్షేత్రజ్ఞాఖ్యం. అవిద్య కర్మసంజ్ఞితం.

ఈ చరాచర వితతిలో శ్రీమహావిష్ణువు శక్తినివేశం తారతమ్య ప్రవృత్తులతో బహురీతుల నియతమై ఉన్నది.

అప్రాణివస్తువులలో విష్ణుశక్తి ప్రభావం అతి స్వల్పతరం. స్థావరాలలో అంతకన్నా కొంచెం అధికం. సరీసృపాలలో మరికొంత ఎక్కువ. పక్షులు, మృగాలు, పశువులు—వీటన్నిటికంటె మనుష్యులలో ఉత్తరోత్తరాధిక్యం కనిపిస్తుంది. అంతకంటె అధికంగా నాగులు—గంధర్వులు—యక్షులు—దేవతలు—దేవేంద్రుడు—దేవతలకంటె ప్రజాపతి, ప్రజాపతికంటె హిరణ్యగర్భుడు శక్త్యుపలక్షణం కలవారు.

ఈ విధంగా శ్రీమహావిష్ణువు మూర్తివిశేషా లన్నింటిలోనూ ఒక్కొక్క శక్తి సాంద్రతరమై గోచరిస్తుంది. అంతమాత్రాన వారిలో ఇతర శక్తులు లేవని భావింపకూడదు. సమస్త వస్తువుల లోనూ సమస్తశక్తి ఉన్నది. సమస్త వస్తువులూ సమస్తాత్మికాలు.

శ్రీ వాసుదేవ పరబ్రహ్మ స్వరూపుని అమూర్తాకృతిని బుధులు సత్ సంజ్ఞతో ఉపలక్షిస్తారు. శక్తి సామస్త్యమూ ఈ నిర్గుణుని యందు ప్రతిష్ఠితం.

విశ్వమంతా ఆ మహద్రూపుని రూపధేయమే. ఆయన తన లీలామాత్రంచేత దేవ—తిర్య—జ్మనుష్యాది భేదాలను ఉపకల్పించి,

జగదుపకరణార్థం ఆ జగత్తులో తానే వివిధ రూపాలతో అవత రిస్తాడు. అప్రమేయుడు, సర్వవ్యాపకుడు, అనాహత ప్రభావుడు అయిన ఆయన అవతారాలు సకల భువనరత్నాలీలలు. ఆయన కర్మ నిమిత్తజుడు కాడు.

యోగులు ఆ విశ్వరూపధరుని దివ్యరూపాన్ని ఆత్మవిశుద్ధి కొరకై ధ్యానించాలి. అగ్నిశిఖలు గంధవహుని సాయంతో కక్షులను దహించినట్లు చిత్తసంస్థితుడైన శ్రీమహావిష్ణువు సర్వకిల్బిషాలను నశింపజేస్తాడు.

అందువల్ల సమస్తశక్తులకు ఆధారమైన భావనాత్రయాత్మకుని హృదయంలో పాదుకొల్పి, ధ్యానధారణ చేయాలి. త్రిభావభావనా తీతమైన ముక్తిపదం చేకూరడమే యోగులకు శుభాశ్రయం. తది తరమైన కర్మయోనిత్వాన్ని పొందిన దేవతలు కూడా చేతో వ్యాపాశ్రయం వలన అశుద్ధాత్ములుగానే పరిగణింపబడుతున్నారు.

అనాత్మ వస్తువుల నుంచి దృష్టి మరల్చి అపాశ్రయ నిఃస్పృహులై భగవంతుని మూర్తరూపాన్ని ధారణలో పాదు కొల్పడమే ధారణా శబ్దార్థం.

శ్రీ వాసుదేవుడు ప్రసన్నచారువదనుడు. పద్మపత్రోపమాన నేత్రుడు.

అందమైన చిబుకం, విశాలమైన నెన్నుదురు, సమకర్ణాంతా లను విభూషించిన మకరకుండలాలు, సువిస్తీర్ణ శ్రీవత్సాంక వక్షం, ఆజానులంబి దీర్ఘబాహువులు, సమస్థితములైన ఊరువులు, జంఘలు, నేలపై సుస్థిరంగా మోపిన మనోహర పాదపద్మాలు, నిర్మలమైన పచ్చని పట్టువస్త్రం, హార కిరీట కేయూర కటకాది శృంగార భూషా విభూషితమైన దివ్యరూపం, శార్ఙ్గ—శంఖ—గదా—ఖడ్గ—చక్ర హస్తాలతో విరాజిల్లుతున్న దేదీప్యమాన వర్చస్సు కలిగిన శ్రీ

వాసుదేవుని రూపాన్ని మనస్సులో పాదుకొల్పి, ఏకాగ్రచిత్తంతో ధారణను అభ్యసించాలి. కూర్చున్నా, నిలుచున్నా చెదరని తదేక ధ్యానంతో ధారణయోగాన్ని అభ్యసించి; యోగసిద్ధిని పొందాలి.

అనంతరం శంఖ—చక్ర—గదా—శార్ఙ్గాది విరహితమై, కేవలం అక్షసూత్రాన్ని మాత్రమే చేత ధరించిన భగవత్స్వరూపుని ప్రశాంతమూర్తి యందు చిత్తాన్ని బంధించాలి. ఆ తర్వాత కిరీట కేయూరాదులు, బాహ్యావరణలు లేని ఏకావయవమూర్తిపై స్థిరంగా దృష్టి నిలపాలి. సర్వవేళలా చిత్తం తదాకారాకారితమై, స్వప్రత్యయరహితమైన సమాధిస్థితిని పొందాలి.

యోగశాస్త్రంలో యమనియమాదికం ప్రథమదశ. ఆసనాలను వేయడం రెండవ దశ. మూడవ దశ ప్రాణాయామసాధనం. చతుర్థదశ ప్రత్యాహారం. భావనాత్రితయకల్పనం పంచమదశ. ధ్యేయవస్తువుపై మనస్సును బంధించి ఉంచగల ధారణాశక్తి చిట్ట చివరి దశ.

ఆ తర్వాత నిర్గుణమై, కల్పనాహీనమై, ధ్యానవిష్పాద్యమైన సమాధ్యవస్థ చేకూరుతుంది.

యోగసాధ్యమైన సమాధిస్థితికే స్వరూపగ్రహణం అని పేరు.

క్షేత్రజ్ఞుడు కారణం. ఆత్మానాత్మ వివేకవంతమైన జ్ఞానం కరణం. ముక్తికార్యమే నిష్పాద్యం.

యోగసాధకుడు ప్రాపకుడు. ఆత్మజ్ఞానం ప్రాపణీయం. మోక్షమే ప్రాప్తి.

ఈ భావభావన కావించి పరమాత్మరతులైనవారికి అజ్ఞానకృత భేదభావాలు తొలగి అభేదభావన చేకూరుతుంది. విభేదజనకమైన జ్ఞానం ఆత్యంతికలయాన్ని పొంది బ్రహ్మాత్మైకభావనం కలుగుతుంది''

అని ఈ విధంగా కేశిధ్వజుడు యోగశాస్త్రాన్ని సంక్షేప— విస్తారపూర్వకంగా విశదీకరించి,

"ఖాండిక్యా! ఇంకా ఏమి వినదలచావు?" అని ప్రశ్నించాడు.

కేశిధ్వజుని గంభీరప్రసంగానికి అమందానంద భరితుడై ఖాండిక్యుడు తన కృతజ్ఞతను వెల్లడించాడు.

"మహాత్మా! యోగసద్భావాన్ని ఆలించి నా మనస్సులోని మాలిన్యమంతా ప్రక్షాళితమైంది. ఎన్నాళ్లుగానో నాకు అలవాటైన మమత్వాలోచనం దోషదూషితమని ఇప్పటికైనా తెలుసుకొన్నాను.

జీవులకు "నేను", "నాది" అన్న భావనలు అవిద్యా కల్పితాలైన అధ్యారోపణలు. శబ్దప్రామాణ్యాం చేత తెలుసుకొన దగిన బ్రహ్మస్వరూపం శబ్దగోచరం కాదు.

నీవు నాకు మోక్షప్రదమైన యోగశాస్త్రాన్ని కరతలామల కంగా ఉపదేశించావు. మన వైరభావం నేటితో సమసిపోయింది. నీవిక నిర్భయంగా వెళ్లవచ్చు"

అని విద్యానిష్క్రయాన్ని అంగీకరించాడు.

కేశిధ్వజుడు ఖాండిక్యుని వద్ద అర్ఘ్యసత్కారాలను అందుకొని రాజ్యానికి వెళ్లిపోయాడు. ఖాండిక్యుడు తన కుమారునికి వంశాను గత రాజయోగాన్ని పరిపూర్ణంగా నేర్పి, అతను యోగసిద్ధుడై నాక గోవిందనివేశితమానసుడై తపోదీక్షను వహించి ఆత్యంతిక లయాన్ని పొందాడు. కేశిధ్వజుడు కూడా ప్రారబ్ధకర్మశేషం తీరిన తర్వాత తాపక్షయఫలంగా కైవల్యపదాన్ని అధిరోహించాడు.

మైత్రేయా! నీవు కోరిన ప్రకారం ఆత్యంతికమైన మోక్షోప లబ్ధికి నిరూపణగా తృతీయప్రళయస్వరూపాన్ని సవిస్తరంగా తెలియ జెప్పాను.

నీకింతవరకూ సర్గ - ప్రతిసర్గ - వంశ - మన్వంతర - వంశానుచరితాలతో కూడిన శ్రీ విష్ణుపురాణాన్ని సమగ్రంగా అభివర్ణించాను.

ఇంకా నీవు తెలిసికొనగోరిన విశేషాలు ఏవైనా మిగిలి ఉంటే చెప్పు, తప్పక వివరిస్తాను!"

అన్నాడు పురాణకథాప్రవీణుడైన పరాశరమహర్షి.

అప్పుడు మైత్రేయుడు వినమితోత్తమాంగుడై పరాశర మౌనీంద్రునికి ప్రణమిల్లి, ఈ విధంగా ప్రసంగించాడు.—

"భగవత్స్వరూపా! నేను తెలుసుకొనగోరిన సర్వవిషయాలనూ మీరు కోరిన వెంటనే కరతలామలకంగా విశదీకరించారు. మీ కృపాపాత్రుడనై నేను పరమపవిత్రమైన శ్రీ విష్ణుపురాణాన్ని సాకల్యంగా ఆకర్ణించి కామ్యకామితాలను సంసాధించాను.

సర్వాత్మకుడైన శ్రీవాసుదేవుని అనంతమహిమాతిశయాన్ని ఉపదేశించి మీరు నన్ను కృతార్థుని గావించారు. జగదుత్పత్తి - స్థితి - సంయమాల స్వరూపం నాకిప్పుడు అవగతమయింది. నా హృదయంలోని సందేహాలన్నీ విచ్ఛిన్నమై మనస్సు ఎన్నడూ లేని నైర్మల్యంతో ప్రశాంతంగా ఉన్నది.

ప్రవృత్తి నివృత్తుల కర్మస్వరూపం నాకు సంపూర్ణంగా అవగతమైంది. లోకంలో శ్రీమన్నారాయణునికి వ్యతిరిక్తమైనది వేరొకటి లేదని గ్రహించి, సర్వాత్మభావనను నేర్చుకొన్నాను.

నాకింక కోరదగిన కోరికలేమీ లేకపోయినా ఒక్క కోరిక మాత్రం మిగిలి ఉన్నది.

మహాత్మా! ఇంతకాలమూ నా అజ్ఞానం వలన ప్రశ్నలపై ప్రశ్నలు కురిపించి నేను మీకు ఎంతో కథనాయాసం కల్పించాను. కథాక్రమానికి అడ్డు వచ్చి మీకు మానసిక శ్రమను కలిగించాను.

సత్పురుషులకు ఆత్మతనూజులూ, అంతేవాసులూ ఒకటే నంటారు.

మీకు శ్రమను కలిగించినందుకు నన్ను దయతో క్షమింప గలరని ప్రార్థిస్తున్నాను.''

మైత్రేయుని అభ్యర్థనను ప్రేమపూర్వకంగా అంగీకరిస్తూ, పరాశరమహర్షి ఈ విధంగా ఆశీర్వదించాడు—

స్వస్తివాచనం

''నాయనా! శబ్దబ్రహ్మాత్మకు డైన శ్రీమన్నారాయణుడు ప్రవచించిన ఈ ఆర్ష గాథను పూర్వం బ్రహ్మదేవుడు ఋభుమహర్షికి ఉపదేశించాడు. ఆయన ప్రియవ్రతునికి, ప్రియవ్రతుడు భాగురికి బోధించారు.

భాగురి నుంచి తమసిత్రుడు, ఆయన ద్వారా దధీచి, దధీచి ముఖతః సారస్వతుడు నేర్చుకొన్నారు.

సారస్వతుని నుంచి భృగుడు, భృగుని నుంచి పురుకుత్సుడు, పురుకుత్సుని వద్ద నర్మద, నర్మదా ప్రత్యుపస్థానంలో నాగరాజు ధృతరాష్ట్రుడు, ధృతరాష్ట్రుని సన్నిధిలో పూరణుడు ఈ పుణ్యకథను అధ్యయన చేశారు.

పూరణుడు దీనిని సర్పరాజు వాసుకికి ప్రసాదించాడు. వాసుకి నుండి వత్సుడు, వత్సుని వద్ద అశ్వతరుడు, ఆయన చెంత కంబళుడు, కంబళుని ద్వారా ఏలాపుత్రుడు దీనిని గ్రహించారు.

వేదశిరుడు పాతాళానికి వెళ్లినప్పుడు నాగరాజుల వద్ద ఈ కథానకాన్ని తెలుసుకొని, ప్రమతికి సంపూర్ణంగా బోధించాడు. ప్రమతి నుంచి ధీమంతు డైన జాతుకర్ణుడు నేర్చుకొని ఈ పవిత్ర గాథను లోకంలో పెక్కుమంది పుణ్యశీలురకు ఉపదేశించాడు.

ఈ విధంగా లోకవ్యాప్తమైన శ్రీ విష్ణుపురాణం నాకు వశిష్ఠ మహర్షి వరప్రదానం వలన సర్వదా స్మృతమై ఉన్నది.

మైత్రేయా! నేను నీ కింతవరకూ విశదీకరించిన ఈ సచ్చరిత్రను నీవు శమీకునికి బోధించాలి. సకల కలికల్మషవినాశకమైన ఈ శ్రేష్ఠకథను ఆకర్ణించి మానవులు పాపవిమోచనాన్ని పొందాలి గాక!

యజ్ఞాలలో యజ్ఞపురుషుడైన యజ్ఞేశునికి, శ్రీ యజ్ఞనారాయణునికి యజ్ఞహోమాలను సమర్పించిన యజ్ఞవిదులు, బ్రహ్మవిదుడూ పరాపరాత్మకుడూ అయిన పరమపురుషుని ధ్యానించిన మహాజ్ఞానులూ, ఏ మహానుభావుని ఆరాధించి జననమరణాతీతమైన ఆత్యంతిక మోక్షాన్ని పొందుతున్నారో, ఆ పరంధాముడు శ్రీ వాసుదేవుని కృప జగజ్జనులందరికీ లభిస్తుంది గాక!

పుణ్యఫలశ్రుతి

శ్రీ మహావిష్ణు పురాణంలో నారాయణుని సర్వాంత ర్యామిత్వం కథానకముఖంగా అనేక ప్రమాణవిమర్శలతో నిరతి శయంగా వర్ణింపబడింది.

అష్టాదశ పురాణాలలో శ్రీ విష్ణుపురాణం పరమసాత్త్విక మైనది. ఇందులో శ్రీమహావిష్ణువు స్వరూపనిరూపణమే ఉన్నది కాని అన్యదేవతానిర్వాదం లేదు. వికారవిధురమైన ఆత్మ బాహ్యా భ్యంతర భేదశూన్యమై అనంత ప్రజ్ఞాననిలయమైనప్పుడు అధిగమ్య మైన బ్రహ్మానందానుభవాని కిది అప్రతిహతసాధనం.

పరాశరమహర్షి ముఖారవింద నిష్యందమైన శ్రీ విష్ణుపురా ణాన్ని చేతోవీథిలో అనుసంధించుకొని ముముక్షువులు ఆత్మతేజాన్ని దర్శించి కైవల్యపదాన్ని అధిరోహింపగలరు.

వాసుదేవుడు సర్వాంతర్యామి. పృథివ్యప్తేజోవాయ్వాకాశా లనే పంచభూతాలలోనూ, దిక్కులు, ఆదిత్యుడు, చంద్రతారకలు, గ్రహనక్షత్రాలు, లోకాలోకాలు అన్నింటిలోనూ భూతశరీరుడై నిండి వెలుగొందే నారాయణుడే జీవజాతానికి మోక్షదాత.

ఈ గ్రంథంలో సృష్టిస్వరూప కథనం ఉన్నది. సమష్టి వ్యష్టు లతో సమ్మిళితమైన ఈ ప్రపంచాని కంతటికీ ఏది సారభూతమో, ఏది సర్వాంతరాత్మగా పరిఢవిల్లుతున్నదో, సమస్త భూతకర్మలూ దేనిని ఉపాశ్రయించుకొని ఉన్నవో, సమస్త కర్మలకూ కర్మసంబద్ధ మైన విజ్ఞానాలకూ ఏది మహాఫలమో—ఆ పరాత్పరుని లీలావిలా

సానికి వ్యాకృతమయిన బ్రహ్మాండ స్వరూపాన్ని చదివి పాఠకులు బంధగోచరమైన సంసారతత్త్వాన్ని మూలమట్టంగా తెలుసుకోగలరు.

నారాయణుడే భూతజాతానికి నియామకుడు. వేదశాస్త్ర పురాణ ఇతిహాస కావ్య సారస్వత సర్వస్వం ఆయనకు అభివ్యంజకంగా వెలసి విలసిల్లింది. సర్వాత్మభావమే ఆ విద్యామహాఫలం.

రూపధేయ సర్వస్వమూ నారాయణుని అవస్థానానికి నిదర్శనమే. దేవతలు, యక్ష రాక్షస గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ సాధ్య విద్యాధర మహర్షి మనుష్యగణాలు, సకల జలచర, భూచర, ఖేచర, సరీసృప జంతుసంతతి, నదీనదాలు, పర్వతాలు, సముద్రాలు, అరణ్యాలు, వనాలు, జనావాసాలు, లోకాలు, గ్రహ తారకా నక్షత్ర నక్షత్రావస్థాన మండలాలు, త్రికాలాలు, మన్వంతరాలు, రాజవంశాలు, వర్ణాశ్రమ ధర్మాలు, చరాచర సృష్టి స్థితి విలయాలు సర్వమూ శ్రీమన్నారాయణుని కారణశరీరాలే కనుక వీటి స్వరూపాభిజ్ఞానం కలిగిన పుణ్యచరిత్రులకు శుభవిభవాలు సంప్రాప్తిస్తాయి.

సర్వాత్మకుడైన జనార్దనుని స్వరూపజ్ఞానం కోరి విష్ణుపురాణాన్ని భక్తిశ్రద్ధలతో వ్రాసినవారు, చదివినవారు, శ్రవణం చేసినవారు నారాయణ మహామంత్రోపాసన ఫలాన్ని పొందుతారు.

పురుషార్థసాధకులు శ్రీ విష్ణుపురాణాన్ని భక్తితో అధ్యయన చేసినా, శ్రవణపర్వంగా ఆకర్ణించినా అశ్వమేధ యాగాంతంలో అవబృథస్నానం చేసిన మహాపుణ్యఫలం సిద్ధిస్తుంది.

ప్రయాగలో, కురుక్షేత్రంలో పుష్కర సమయాన స్నాతులై కేశవార్చన చేసిన [illegible] కలిగే పుణ్యఫలం విష్ణుపురాణ శ్రోతలకు అనుస

కార్యాంతర వ్యగ్రులై విష్ణుపురాణాన్ని ఆసాంతం అధ్యయన చేయలేని జిజ్ఞాసువులు ఇందులో ఏక దేశంగా ఏ పుణ్యకథను విన్నా నిత్యాగ్నిహోత్రఫలాన్ని పొందుతారు.

ఈ పురాణకథలను విన్నవారికి జ్యేష్ఠమాసంలో శుక్లపక్ష ద్వాదశినాడు యమునలో తీర్థస్నానం చేసి, మథురకు వెళ్లి విష్ణుపూజ చేసిన గొప్ప ఫలం సిద్ధిస్తుంది.

జ్ఞానదాయకమైన ఈ సత్కథలో ఏ కొద్ది భాగాన్నయినా శ్రద్ధతో విన్న సజ్జనులకు శ్రీహరి అశ్వమేధఫలాన్ని ప్రసాదిస్తాడు.

శ్రావణమాసంలో విష్ణుపురాణంలోని ఏ అధ్యాయమైనా తెరిచి అందులో ఏదో ఒక భాగాన్ని చదివినవారికి దుస్స్వప్న దోషాలు తొలగిపోతాయి.

ఆషాఢమాస శుక్లపక్షపౌర్ణమినాడు నదీజలస్నానం చేసి ఆత్మీయులకు విష్ణుపురాణ ప్రతిని బహూకరించిన పుణ్యాత్ములకు విష్ణుపదానుభవం చేకూరుతుంది.

ఈ కథాశ్రవణం వలన నరులకు పాపకర్మలు నశిస్తాయి. చిరపుణ్యరూపమైన సత్కీర్తి లభిస్తుంది. నితాంతమైన హరిభక్తి వలన ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధులు సిద్ధించి సద్యః పరనిర్వృతి కలుగుతుంది.

పవిత్రమైన శ్రీవిష్ణుపురాణం భక్తకోటికి ముక్తిదాయకం.

తద్విష్ణోః పరమం పదమ్.

మా తెలుగు ప్రచురణలు

BC

KABB102B170

శ్రీమద్భగవద్గీత
(టీకా తాత్పర్యము)

శ్రీమద్భగవద్గీత
(పారాయణం)

ఈశావాస్యోపనిషత్తు

కేనోపనిషత్తు

కఠోపనిషత్తు

ప్రశ్నోపనిషత్తు

ముండకోపనిషత్తు

మాండూక్యోపనిషత్తు

తైత్తిరీయోపనిషత్తు

శ్వేతాశ్వతరోపనిషత్తు

తైత్తిరీయ మంత్రకోశం
(రెండు భాగములు)

వివేక చూడామణి

నారద భక్తి సూత్రములు

VISHNU PURANAM (Telugu) Rs. 60-00

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KAEB102B270
పుస్తకం పేరు	విష్ణుపురాణము
తారీఖు	03 June 2024
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	641
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	[illegible]
లేని పేజీలు	no
తయారు చేసినది	salomi
పేజీలు విడదీసినది	lavanya
స్కాన్ చేసినది	Anusha
పరీక్ష చేసినది	NANDINI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good